HTA-1020

Telugu Classics Popular Edition Series

ఆంధ్రమహాభారతము

[ఆరణ్యపర్వము]

సంపాదకులు

డాక్టర్ పాతూరి నాగభూషణశర్మ

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి

1965

సైపాదాదు • హైదరాబాదు-4.

HTAOLD262

శ్రీ

ఆంధ్రమహాభారతము

[ఆరణ్యపర్వము]

సంపాదకులు

డాక్టర్ పాటిబండ మాధవశర్మ

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి

కళాభవన్

సైఫాబాదు - హైదరాబాదు-4.

స్వామ్య సంకలితము
ప్రతులు 5000
సం 1971

మూల్యము
రూ. 4-00

ముద్రణ :
శివాజీ ప్రెస్,
1732 గంజి బజార్, నిజాంపాట్.

తొలిపలుకు

ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రివర్యులు శ్రీ యం. ఆర్. అప్పారావుగారు చేసిన సూచన ననుసరించి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి తెలుగుభాషలోని ప్రాచీన సాహిత్యము అందరికి అందుబాటులో నుండునట్లుగా ముద్రించి ప్రకటింప వలెనని నిశ్చయించినది. తెలుగుభాషలోని పూర్వ గ్రంథ సముదాయము యీనాడు పాఠకునకు సక్రమముగా సరసమైన ధరకు లభ్యమగుటలేదు. ఈ లోటును తీర్చి ప్రాచీన గ్రంథ సంచయమును విడివిడిగా ప్రకటించుటకు సాహిత్య అకాడమి ఒక ప్రణాళికను సిద్ధము చేసినది. ఈ ప్రణాళిక ప్రకారము ఈ కార్యక్రమము మూడు తరగతులుగా విభజించనైనది. మొదటిది ప్రాచీన ప్రబంధాల ప్రకటన; రెండవది మహా భారతము ప్రచురణ; మూడవది హరివంశము, భాస్కర రామాయణము, బసవపురాణము, భోజరాజీయములను సంగ్రహించి ప్రకటించుట. పై ప్రణాళిక ప్రకారము ప్రచురింపబడు ప్రతి గ్రంథములో గ్రంథకర్తనుగూర్చి, గ్రంథప్రాశస్త్యమును గూర్చి వివరించు సుమారు 40 పేజీల పీఠికను చేర్చవలెనని నిశ్చయించనైనది.

ఈ కార్యక్రమములో ప్రాచీన ప్రబంధాల ప్రకటనము పూర్తియైనది. సంక్షిప్త గ్రంథప్రచురణ కార్యక్రమములో బసవపురాణ, భాస్కరరామాయణ, హరివంశ, భోజరాజీయ ములు ప్రచురింపబడినవి. ప్రస్తుతము ఆంధ్రమహాభారత ప్రకటనము చేపట్టనైనది. ప్రసిద్ధులైన విద్వాంసులచే మహా భారత సంపుటముల పరిష్కారము నిర్వహింపబడుచున్నది.

ఆంధ్రమహాభారత సంపుటములలో మూడవదైన ఆరణ్యపర్వమును పరిష్కరించి, పీఠిక వెలయించి మా కందజేసిన డా. పాటిబండ మాధవశర్మగారికి అకాడమి పక్షాన కృతజ్ఞతలు.

పైన పేర్కొనబడిన గ్రంథసంపుటాల ప్రాతప్రతులను సిద్ధముచేసి ముద్రించుటకు అవసరమైన డబ్బును పూర్తిగా అకాడమికి యిచ్చుటకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వాగ్దానము గావించి అందులో చాలమట్టుకు డబ్బును విడుదలకూడ చేసినవి. అందుకు అకాడమి పక్షాన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వా లకు ధన్యవాదాలు. సాధ్యమైనంత త్వరలో మహాభారత సంపుటముల నన్నింటిని సిద్ధముచేసి, ఆంధ్ర పాఠకలోకానికి అందజేయుట జరుగగలదని విశ్వసించుచున్నాను.

హైదరాబాదు,
24-12-1970

దేవులపల్లి రామానుజరావు
కార్యదర్శి

పీఠిక

"శారదరాత్రు లుజ్వల ల
సత్తర తారక హారపంక్తు లం
జారుతరంబు లయ్యె, వికసన్నవ కైరవ గంధబంధురో
దార సమీర సౌరభము
దాల్చి, సుధాంశు వికీర్యమాణ క
ర్పూర పరాగ పాండురుచి
పూరములం బరిపూరితంబులై"

ఇంతవఱకే నన్నయ్యగారి కవిత్వమట. ఇది ఆరణ్యపర్వము – చతుర్థాశ్వాసమున 142వ పద్యము. ఈ పద్యముత్రాసి నన్నయగారి గంటము ఆగిపోయినది. గంటమేకాదు ఆయనగుండెయే ఆగిపోయినది, కానిచో ఆయన గంటము ఆగదు. శరన్నదీ ప్రవాహమువలె ప్రసన్నమధురమై ధీరసుందరగమనమున సాగిపోవుచున్న ఆయన కవితాధారయు హఠాత్తుగా ఆగిపోదు.

ఆయన మరణించుటకు కారణములుగా చెప్పబడు భీమకవి శాపము, అధర్వణుని ఉసురు కట్టుకథలని చరిత్ర తేల్చివైచినది. భారతరచన ఆగిపోవుటకు రాజకీయకల్లోలములు, రాజరాజుమరణము కారణములుగా కొందఱు సూచింతురు. ఆగిన భారతరచన తిరిగి కొనసాగకుండుటకు అవి కారణములు కావచ్చును. కాని నన్నయగారి రచన ఆగిపోవుటకు ఆయన యాకస్మిక మరణము తప్ప వేఱు కారణము కనపడదు.

రాజరాజు రాజ్యమేలిన నలువది యేండ్లలో రాజకీయ కల్లోలము లేనికాలము చాలతక్కువ. పట్టుమని పదియేండ్లపాటు ప్రశాంతముగా జీవించు అదృష్టము ఆ ప్రభువునకు పట్టలేదు. తండ్రి మరణించిన మూడేండ్లకు 1022 లో గాని ఆయన గద్దెపై గూర్చుండ జాలడయ్యెను. పదియేండ్లయినను దానిపై కుదురుకొన జాలడయ్యెను. 1030 లో సవతి తమ్ముడైన విజయాదిత్యునిచే గద్దె దింపబడి

యేడేండ్లు చోళరాజ్యమున ప్రవాసము చేసెను. మరల గద్దె సంపాదించి 1046 వరకు దినదినగండముగా గడపెను. 1046-53 నడుమ కొంతయూపిరి తీసి కొనెను. అప్పుడే ఆయనకు భారతమును దెనుగున వెలయించు సంకల్పము కలిగి యుండును. ఆయన ప్రియమిత్రుడైన నన్నయగారికి తన యభిలాషను ఎఱుక పఱిచి భారతాంధ్రీకరణమునకు ఆయనను పురికొల్పియుండును. నన్నయ బ్రహ్మాండాది నానాపురాణ విజ్ఞాన నిరతుడు. ఆయనకు వ్యాసభారతము సుపరిచితమేయ్యె యుండవలయును. ఐనను భారతాంధ్రీకరణమునకు పూనుకొని యుండడు. మూల భారతమును మరల మరల పఠించి మననము చేసి దాని పరమార్థము తెల్లమగునట్లు తెనుగున వెలయించుటకు పథకమును నిర్మించుకొని రచన మారంభించుటకు కొంతకాలము వినియోగించి యుండును. రాజరాజు రాజ్యారంభకాలమున వేంగీ రాజ్యమునకు బెజవాడ రాజధానిగా నుండెను. కొప్పము యుద్ధమున తనకు పరాజయము శంకించి కర్ణాట చాళుక్యులతో సంధిచేసికొన్న యనంతరమే రాజరాజు రాజధానిని రాజమహేంద్రవరమునకు మార్చినట్లు కనబడుచున్నది. భారతరచనము రాజమహేంద్రవరమునందే ఆరంభమైనది.

రాజమహేంద్రపురమున నిండుసభలో అపార శబ్దశాస్త్రపారగులైన వైయాకరణులును, భారతరామాయణాద్యనేక పురాణ ప్రవీణులైన పౌరాణికులును, మృదుమధురరసభావభాసురసవార్థవచనరచనావిశారదులైన మహాకవులును ఆదిగా గల విద్వజ్జనములు పరివేష్టించి కొలువ విద్యావిలాసగోష్ఠి సుఖోపవిష్టుండయి యిష్టకథావినోదంబులనుండి నన్నపార్యుని జూచి "నాహృదయంబున ననవరతంబును శ్రీమహాభారతంబునందలి యభిలాషంబు వినభిలాష పెద్దయై యుండు" కావున కృష్ణద్వైపాయనమునివృషభాభిహిత మహాభారతబద్ధ నిరూపితార్థమేర్పడ తెనుగున రచియింపు మధిక ధీయుక్తి మెయిన్' అని రాజరాజు ననతిచ్చెను.

సభలో వైయాకరణులు, పౌరాణికులు, మహాకవులునుండినను ఈలక్షణము లన్నియు పుంజీభవించి యున్న నన్నయ భట్టునే రాజరాజు భారతాంధ్రీకరణమునకు ఎన్నిక చేసెను. ఆయనయు "దేవా! నీ యనుమతంబున విద్వజ్జనంబుల యనుగ్రహంబునంజేసి నానేర్పువిధంబున నిక్కావ్యంబు రచియించెద'నని దుస్సాహ్యమని యెఱింగియు ప్రభువు పట్లగల యనురక్తిచే ఉదాత్తమయిన ఆయన యభిలాషమును నెరవేర్పదలంచి మహత్తరమైన ఆ కార్యభారము నంగీకరించెను.

"పాయక పాకశాసనికి భారత మోరరణంబునందు నా
రాయణునట్లు వాసిగ ధరామర వంశవిభూషణుండు నా
రాయణభట్టు వాఙ్మయ ధురంధరుఁడుం దన కిష్టుడున్ సహా
ధ్యాయుఁడు నైన వాఁడభిమతస్థితిఁ దోడయి నిర్వహింపగాన్"

తాను భారతసంహితారచన బంధురుడు అయినట్లు నన్నయభట్టు చెప్పికొనెను. ఆయనకు నారాయణభట్టు తోడ్పాటు లభించుటకు 1053 అనంతరమే అవకాశము గలదు. నన్నయభట్టు, నారాయణభట్టు ఏగురుకులముననో కలిసి చదువుకొని యుండిరి. నన్నయభట్టు తూర్పుచాళుక్యుడైన రాజరాజు నాసానమున ప్రవేశించెను. నారాయణభట్టు పశ్చిమచాళుక్యుడైన త్రైలోక్యమల్లుని యాస్థానమున ప్రధానిగా ప్రవేశించెను. 1050 ప్రాంతమున పశ్చిమచాళుక్యులు వేంగిపై దండెత్తిరి... రాజరాజు చోళుల తోడ్పాటున వారి నెదిర్చెను. ఈ యుద్ధము రెండుమూడేళ్ళు జరిగెను. 1053 లో కొప్పము యుద్ధమున చోళచక్రవర్తి రాజాధిరాజు నిహతుఁడయ్యెను, ఆయన తమ్ముడు రాజేంద్రుడు పారిపోయెను. ఒంటరిగా పోరుసాగింపలేని రాజరాజు పశ్చిమ చాళుక్యులతో సంధిచేసికొనక తప్పలేదు. ఈ సంధిని కుదుర్చటలో సహాధ్యాయులైన నన్నయభట్టు, నారాయణభట్టుకలసి తీవ్రమైన కృషిచేసియుండిరని విజ్ఞుల యభిప్రాయము సంధిఫలితముగా రాజరాజు వేంగీరాజ్యమందలి దక్షిణభాగమును త్రైలోక్యమల్లున కర్పించి ఆయన ప్రధానియైన నారాయణభట్టును తన ఆస్థానమున స్థానాపతిగా అంగీకరింపవలసి వచ్చెను.

భారతాంధ్రీకరణమున నన్నయభట్టునకు తోడ్పడుటకే కాబోలు రాజరాజు నారాయణభట్టునకు నందంపూడి అగ్రహారమును ధారవోసెను. ఆ దానశాసనమును నన్నయభట్టే వ్రాసెను. నారాయణభట్టు అనుష్ఠిత జగదుపకరణుడని, సంస్కృత కర్ణాట ప్రాకృత పైశాచికాంధ్రభాషలందు సుకవిత్వ విభవముచేత కవిరాజశేఖరుడని ప్రసిద్ధికెక్కిన వాడని, మనీషాలవదుర్విదగ్ధులైన కవులను మనోహరములైన తన సూక్తులచే ఆగర్వులనుచేసి కవీభవజ్రాంకుశుఁడను సార్థకనామము వహించెనని యు జగదభిగుణశాలి యనియు సరస్వతీ కర్ణావతంసుడనియు అష్టాదశావధారణ చక్రవర్తియనియు ఆ శాసనమున కొనియాడబడియున్నాడు. ఆ శాసనమునందలి—

"విచిత్రవీర్యాత్ పాండురాజః పుత్రా స్తస్య చ పంచ ధర్మజ భీమార్జున
నకుల సహదేవాః పంచేంద్రియవత్ పంచస్యు ర్విషయగ్రాహిణ స్తత్ర"

అను వాక్యము ఆరణ్యపర్వమందలి "మోముహ్యమానాం తాం తత్ర జగృహుః పంచపాండవాః ఇంద్రియాణి ప్రసక్తాని విషయేషు యథా రతిం" అనువాక్యమునకు ప్రతిబింబమువలె నుండి నన్నయ అప్పటికి భారతమును మననము చేయుచున్నట్లు వ్యక్తము చేయుచున్నది.

నారాయణభట్టు తోడ్పాటున నన్నయభట్టు 1053 తరువాతనే భారతాంధ్రీకరణము ప్రారంభించెను. భారతయుద్ధమున శ్రీకృష్ణుడు అర్జునునకు తోడ్పడినట్లు భారతరచనమున నారాయణభట్టు నన్నయభట్టునకు తోడ్పడె ననుటవలన రాజరాజు అభిలషించినట్లు వ్యాసునిచే నిరూపితమైన పరమార్థము తేటతెల్లమగు తీరున భారతము నాంధ్రీకరించుటలో నన్నయభట్టు ఎదుర్కొనిన సంకట పరిస్థితులను తనబుద్ధి కుశలతచే తొలగించుచు నారాయణభట్టు ఆయనకు వాఙ్మాత్రమైన సహాయముచేసె నని భావింపవలెను, పండితపరిషత్తులలో నన్నయ అనువాదసరణిపై ఆక్షేపములు కలిగినప్పుడు వాని నధిగమించుటలో కూడ బహుభాషాకోవిదుఁడు, కవీభవజ్రాంకుశుఁడయిన నారాయణభట్టు నన్నయకు అండదండగా నిలిచియుండును.

ధర్మరాజువంటి రాజరాజు సంకల్పము, నరునివంటి నన్నయభట్టు కృషి, నారాయణునివంటి నారాయణభట్టు సహకారము– ఇట్టి మహత్తర సాధనసంపత్తి సమకూడి ఆంధ్రజాతి పుణ్యోదయమున ఆంధ్రభాషలో పంచమవేదమునకు శీర్షోదయమైనది.

ఈ విధముగ ఆరంభమైన భారతాంధ్రీకరణము ఆరణ్యపర్వము చతుర్థాశ్వాసమున 142 వ పద్యమువద్ద ఆగిపోయెను. దీనికి నన్నయగారి ఆకస్మిక మరణమే తప్ప వేరుకారణము కనబడదు. 1053 ప్రాంతమున ఆరంభించి ఏకదీక్షతో రచన సాగించి 1057 ప్రాంతమున నన్నయ మరణించి యుండును. సభాధ్యాయుని మరణమువలన నారాయణ భట్టునకు రాజరాజు విషయమున, భారత రచన విషయమున ఆసక్తి నశించియుండును. 1058 లో త్రైలోక్యమల్లుడు దిగ్విజయయాత్రకు పూని వేంగిపై నెత్తివచ్చినపుడు నారాయణభట్టు వెనుకటివలె ఉభయరాజ్యములకు సంధిగావింప యత్నింపక తటస్థముగా నూరకుండెనుగాబోలు! రాజరాజునకు యుద్ధములోనికి దిగక తప్పలేదు. చోళులసాయము కూడ ఆయనకు తగినంత లభించినట్లు లేదు. శక్తికొలది పోరి రాజరాజు 1061 లో రణరంగమునే వీరమరణము పొందెను. భారతము వ్రాయువాడులేడు వ్రాయించువాడునులేడు. ఆగిన భారతరచన రెండు శతాబ్దులకు పైగా అట్లే ఆగియుండెను.

ఆంధ్రమహాభారతము నన్నయ చేతిమీఁదుగనే పూర్తియై యుండినచో దాని స్వరూపమెట్లుండెడిదో. కాని ఆంధ్రులయదృష్టము వేరువిధముగా నున్నది. మూడువందలయేండ్లలో ముప్పురు మహాకవుల కృషిఫలముగా ఆంధ్రమున మహాభారతము పూర్తియగునని విధినిర్ణయము. ఋషియైన నన్నయ మంగళాచరణ శ్లోకమందలి "వేదత్రయమూర్తయః" అను మాటయందే ఈ యంశము సూచింప బడినదని కొందఱందరు. కాని రాజరాజు సంకల్పమునకు, తనకృషికి విఘ్నము సంభవించునన్న అమంగళకరమైన యర్థము వ్యక్తమగునట్లు మంగళశ్లోకము చెప్పెననుట నన్నయ ఋషిత్వమునకు గౌరవము నాపాదింపదు.

ఆరణ్యపర్వమున కాలము పండ్రెండేండ్లు జరిగినది. కథమాత్రము పండ్రెండు అంగుళములు కూడ జరుగలేదు. మఱి జడిగినదేమిటి? ధర్మజుని ధర్మబలము పెరిగినది. భీముని భుజబలము పెరిగినది. అర్జునుని అస్త్రబలము పెరిగినది. అజ్ఞాతవాస సమ్యగనుష్ఠానమునకు, రాజ్యపునఃప్రాప్తికి, ప్రతిజ్ఞా పరిపూర్తికి సదుపాయములు అమరినవి. సౌకర్యములు పెరిగినవి. ఆరణ్యపర్వము ఏడాశ్వాసములు సాగినవి. అందులో నన్నయ రచించినది మూడశ్వాసముల మీద 142 పద్యములు. పాండవులజీవితము ఈ పర్వమున చక్కని పరిపాకమును పొందినది. నన్నయ రచనయు మంచిపాకమున బడినది.

భారతపరమార్థము

రాజరాజు విమలమతితో ననేక పురాణములు వినెను. అర్థశాస్త్రముల తెఱగెఱింగెను ఉదాత్తరసాన్విత కావ్యనాటక క్రమములు పెక్కు చూచెను. జగత్పరి పూజ్యములైన ఈశ్వరాగమములయందు భక్తితో హృదయము నిల్పెను. అయినను ఆయనహృదయమున అనవరతమును శ్రీమహాభారతము నందలి యభిప్రాయమును వినవలెనన్న యభిలాష పెద్దయై యుండెను. మహాభారతము ఆయన వంశమున ప్రసిద్ధులై విమల సద్గుణశోభితులైన పాండవోత్తముల చరిత్ర. కనుక కృష్ణద్వైపాయన ముని వృషభాభిహిత మహాభారతబద్ధ నిరూపితార్థమేర్పడ అధిక ధీయుక్తిమెయిన్ తెనుగున రచియింపుమని ఆయన నన్నయనుకోరెను.

నన్నయ 'నానేర్చువిధంబున నిక్కావ్యంబు రచించెద' నని తొడంగెను. సారమతిం గవీంద్రులు ప్రసన్నకథా కవితార్థయుక్తి లో నారసిమేలునా నితరుల ఋరరమ్యత నాదరింప నానారుచి రార్థసూక్తినిధియైన నన్నయ తెనుంగునన్. మహా

భారత సహితారచన బంధురుడయ్యెను. భారతము సంహిత-ఇతిహాస సముదాయము. కర్మఫల సంబంధ రూపములగు ఆగమికార్థములు దేనియందు ప్రత్యక్షపరి దృశ్య మానము లగునో ఆ చరిత్ర ఇతిహాసమగునని అభినవగుప్తపాదులు వివరించిరి. పాండవోత్తముల చరిత్ర అట్టిది. ఆగమోక్తములయిన ధర్మకర్మల యనుష్ఠానము వలన, అననుష్ఠానము వలన గలుగు ఫలములను ప్రత్యక్షముగా నిరూపించుటకే వ్యాసుడు పాండవోత్తముల చరిత్రను ఇతిహాసముగా నిర్మించెను. కృష్ణద్వైపాయన. మునివృషభాభి హితమైన మహాభారతమున బద్ధమై నిరూపితమైన యర్థము ఆగ్ మోక్త కర్మఫలసంబంధమే. కర్మానుష్ఠానము మానవాధీనము. ఫలప్రదానము దైవాధీనము. భారతమున కర్మానుష్ఠాతలు పాండవులు. దైవము శ్రీకృష్ణుడు.

"శ్రీకృష్ణుని మాహాత్మ్యంబును, పాండవాది భారతవీరుల మహాగుణంబు లును దన విమల విజ్ఞానమయంబైన వాగ్దర్పణంబునం దేర్పడ వెలుంగుచుండ" వేదవ్యాసుడు భారతమును నిర్మించెను అని చెప్పిన నన్నయ భారత పరమార్థమును గుర్తించినవాడు. తమిళమున పెరిందేవనార్ రచించిన భారతమున ఈ పరమార్థము సువ్యక్తము కాలేదు కాబోలు. జైనుడైన పంపన్న కన్నడమున విక్రమార్జున విజయమను పేర వ్రాసిన భారతకథ యందీపరమార్థమునకు స్థానమేలేదు. రన్నడు సాహసభీమవిజయము అనుపేర కన్నడమున రచించిన భారతము కూడ మూల భారత కథను వికృతము కావించినదగుట వ్యాసుని హృదయము నది యావిష్కరింప జాలదు. మూల భారత రహస్యమెఱిగిన రాజరాజునకు తమిళకన్నడ భారతములు వ్యాసహృదయమును ప్రకటించుటలేదని గుర్తించెను. అది యేర్పడునట్లు తెనుగున రచింపుమని నన్నయను కోరెను. అవిరళజపహోమ తత్పరుడు, సంహితాభ్యాసుడు, నానా పురాణ విజ్ఞాన నిరతుడు, విపుల శబ్దశాసనుడు, ఉభయభాషా కావ్యరచనాభిశోభితుడు నైన నన్నయ అందుకు సమర్థుడని ఆయన గ్రహించెను.

నన్నయ నేర్చిన విధము

మహాభారత బద్ధనిరూపితార్థ మేర్పడునట్లు రచించుట యనగా ప్రసన్న కథా కవితార్థయుక్తితో రచించుట. కథను తత్పరమార్థము ప్రసన్నమగు తీరున వర్ణించుటలో నన్నయ నిపుణుడు. భారతము ఇతిహాస వస్తుసముదాయము. దానిని కావ్యముగా తీర్చినపుడు ఇతిహాసకావ్యమగును. అనగా కర్మఫల సంబంధ నిరూపకమగు కథాకావ్యమగును. నన్నయ అట్టి కథాకావ్య నిర్మాణమున దక్షుడు. అందువల్లనే

కాబోలు ఆయన పుణ్యకథా కథన దక్షుడైన సూతుడు శౌనకాది మహర్షులకు చెప్పిన తెలుగున భారతకథను రాజరాజునకు చెప్పదొరకొనెను.

భారతము 'లోకాగమన్యాయైకాంత గృహంబు'. అనగా లోకన్యాయములకు, ఆగమన్యాయములకు భాండారము. లోకన్యాయము లనగా నీతులు. ఆగమన్యాయ ములనగా ధర్మములు. ఇవి ఇతిహాస వస్తు గుణములను దీపింపజేయును. వీనిని శ్రోతృహృదయరంజకముగా ప్రతిపాదించు నైపుణి నన్నయకు గలదు. ఆయన నానా రుచిరార్థ సూక్తినిధి.

భారతము శ్రవ్యకావ్యము. శ్రోతల శ్రవణేంద్రియములను రంజిల్లజేయు శబ్ద మాధుర్యము దానియం దవశ్యముగా నుండవలయును. ఆవిరళజపహోమతత్ప రుడు, సంహితాభ్యాసుడు అయిన నన్నయ నాదబ్రహ్మవేత్త. తెలుగుజాతి మధుర నాదప్రణవము. తెలుగుభాషయందలి గసడదవాదేశ సరళాదేశములు ఈజాతినాద ప్రవణతకు నిదర్శనములు. నన్నయ్య ఇది గుర్తించెను. తనరచనలో సూటింట డెబ్బదియైదు తత్సమపదములనే వాడినను మృదువైన తెలుగుపదములలో మెత్తగా ఒదిగిపోవు తత్సమపదములనే యెన్నికచేసెను. తెలుగు జాతి శ్రుతికి ఇంపుగొల్పు అక్షరరమ్యతను నిండుగా సాధించెను.

ఈ విధముగా ఆయన అక్షరరమ్యతచే, నానారుచిరార్థ సూక్తులచే, ప్రసన్న కథాకవితార్థయుక్తిచే భారతేతిహాసమును తెలుగుజాతి చెవులకు మనస్సునకు హృద యమునకు ఎక్కునట్లు ఆంధ్రమున వెలయించి ఆదికావ్య నిర్మాతయై సర్వాంధ్రకవి సార్థమునకు ఆచార్యత్వము వహించెను.

ప్రసన్న కథా కవిత

భారతాంధ్రీకరణమున నన్నయ దాని ఇతిహాసత్వమునకు, రాజరాజు అభి లాషకు, తన ప్రతిభకు అనుగుణమైన విధానమునే అవలంబించెను. నాటకాను వాదమునకు అవసరమైన యథాపదానువాదముగాని, కావ్యానువాదమునకు దగిన యథా శ్లోకానువాదమును గాని, అవలంబింపక ఇతిహాసోచితమైన యథా కథానువాద మును అయన అవలంబించెను. ఇతిహాస వస్తుసముదాయమును పుణ్యకథాకావ్య సముదాయముగా రూపొందించెను.

కథా కవిత అన్న పదబంధము సంస్కృతాలంకార గ్రంధములందు కన బడదు. ఎన్నియోవిధముల కావ్యభేదములను, కవిభేదములను పేర్కొన్న ఆలం కారికులు కథా కావ్యము, కథాకవి అను భేదములను పేర్కొన లైరి. అలంకార శాస్త్రములు పుట్టు నాటికే సంస్కృతమున విస్తారమైన వాఙ్మయము యేర్పడి యుండెను. ఆలంకారికులు దానిని స్థూలముగ వేదశాస్త్రములు, పురాణేతిహాసములు, కావ్యనాటకములు అను తీరున విభజించి కావ్యనాటకముల స్వరూపమును, వాని యందలి అవాంతర భేదములను చర్చించిరి. పురాణేతిహాస ప్రసిద్ధములైన వృత్తాంతములే సర్వకావ్య నాటక భేదములకు మూలద్రవ్యములగుటచే ద్రవ్యా పేక్షతో వారు కావ్యభేద నిరూపణము చేయవలసిన అవసరము కలుగలేదు.

దేశభాషలలో వాఙ్మయసృష్టి ఆరంభమగు నాటికే సంస్కృతమున నాటకాంత మైన సాహిత్యము పరిపక్వదశ నందియుండెను. ఆ సాహిత్యమును చక్కగా జీర్ణించుకొన్న విద్వత్కవీశ్వరులే దేశభాషలలో ఆది వాఙ్మయస్రష్టలైరి. వారిచే దేశభాషలం దవతరింపజేయబడిన పురాణేతిహాసములు భాషాంతరీ కరణములే కాక రూపాంతరీ కరణములు అయినవి. ఇతిహాసత్వ, కావ్యత్వముల అనురూప సమ్మే శనమున రూపొందిన దేశభాషా కావ్యములు ఆ తొలినాళ్ళలో వస్తుకావ్యములన్న వ్యపదేశమును పొందినట్లు కనబడుచున్నది. పంపకవి తన ఆదిపురాణమును 'ఆది పురాణ వస్తుకృతి' అనెను. నాగవర్మ 'ఛందోంబుధి' లో తన్ను గూర్చి 'వస్తుకవి ప్రవరస్తుత' అని చెప్పుకొనినాడు, నన్నయకు సమకాలికుడని భావింపబడుచున్న రేచన 'కవిజనాశ్రయము' న తన్నుగూర్చి 'వస్తుకవి జనాశ్రయా' అని చెప్పికొని నాడు. పండ్రెండవ శతాబ్దియందుండిన నన్నెచోడమహాకవి 'వస్తుకవి' 'వస్తు కావ్యము' 'వస్తుకవిత' అను పదములను కుమారసంభవ పీఠికలో ఉపయోగించి యున్నాడు. పదునాల్గవ శతాబ్ది యందుండిన విన్నకోట పెద్దన వస్తుకావ్యము ఒక కావ్యభేదముగా పేర్కొనినాడు. ఇట్లు క్రమముగా వస్తు ప్రధానమైన కావ్యము లాక్షణికమైన ఒక కావ్యభేదముగ ఆంధ్రమున గుర్తింపబడినది.

క. "ఆరయ వస్తురసాలం
కార ప్రాధాన్యవృత్తిఁ గబ్బంబులు పెం
పారుఁ ద్రివిధార్థఘటనల
ధీరులు పరికించి వానిఁ దెలియఁగ వల్లయున్"

(కావ్యాలంకార చూడామణి)

మూడువిధములైన యర్థములను కావ్యములందు ఘటింప వచ్చును. అవి వస్తువు, అలంకారము, రసము. వీనిలో అన్యతమప్రాధాన్యవ్యక్తినిబట్టి కావ్యములు (కబ్బంబులు) వస్తు, అలంకార, రస ప్రధానకావ్యములగును. పెద్దన వస్తుకావ్యము అను పదబంధమును ఉపయోగింపకున్నను, వస్తు ప్రధానమైన కావ్యము వస్తు కావ్యము అని ఆతని అభిప్రాయమనుట స్పష్టము.

ఇతివృత్తము, వస్తువు, కథ అన్న మాటలు సమానార్థకములుగా సంస్కృతాలంకార శాస్త్రములందు ఉపయోగింపబడి యుండుట ఎల్లరు నెరింగినదే. ఇతరులు వస్తుకవిత అన్నదానినే నన్నయ కథాకవిత అనెనని ఊహించుట సులభము. కథా కవిత అన్న మాటకంటె వస్తుకవిత అన్నమాటయే ప్రచురముగ నుండుటచే పెద్దన వస్తుశబ్దమునే గ్రహించి యుండును. నన్నయ భారతము వస్తుకావ్యము లేక కథా కావ్యము అనుటకు తగియున్నది. ఇతిహాస వస్తు సముదాయమైన భారతమును వస్తుప్రధానముగా తప్ప అన్యధా నన్నయ ఎట్లు తెలుగున రచింపగలడు? పాండవోత్తముల చరిత్ర వినుట తన యభీష్ట మగుటచే రాజరాజు నన్నయను భారత రచనకు ప్రేరేచెను. పాండవోత్తముల చరిత్రకు ప్రాధాన్యములేనిచో అది భారతమే కాదుగదా !

ఇతిహాసము పుణ్యకథ. దానిని రమ్యముగా చెప్పుట నన్నయ ఆశయము. పర్వక్రమమున తన రచన పక్వమై ఆరణ్యపర్వమున తన కథనము రమణీయ మగుట ఆయన గుర్తించెను. ఆరణ్యపర్వమున ప్రథమాశ్వాసాంతమున "పుణ్యకథ యతి రమణీయంబుగాను" అనియు, ద్వితీయాశ్వాసాంతమున "కథాక్రమంబతి రమ్యంబుగాను" అనియు, తృతీయాశ్వాసాంతమున "కథ రమ్యంబుగ" అనియు రమణీయ రమ్య శబ్దములు ప్రయోగించి నన్నయ తన కథా కథన సౌందర్యము పట్ల సంతృప్తిని వెల్లడించెను. నన్నయ భారతము నాంధ్రీకరింప మొదలిడిన తరువాత పౌరాణికులు సంస్కృత భారతము బదులు నన్న భారతమునే సభలలో పఠింప దొడగిరి కాబోలు. శ్రోతలు ఆయన ప్రసన్న కథాకలితార్థ యుక్తిని ఆరసి దాని రమ్యతను 'మేల'ని యభినందించిరి కాబోలు.

విశ్వనాథ సత్యనారాయణగారు 'నన్నయ ప్రసన్న కథా కలితార్థయుక్తి' అను గ్రంథమున పరిశీలనకు స్వీకరించిన నలోపాఖ్యానము, సౌకన్యోపాఖ్యానము, ఋష్యశృంగుని చరిత్ర ఆరణ్యపర్వము నందలివే. ఆరణ్యపర్వమున నన్నయ కథాకవిత పరిపక్వదశ నందియుండుటయే దీనికి కారణమని భావింప వచ్చును.

ఆరణ్య పర్వము

ఆదిపర్వమందలి కథలో ఎక్కువ భాగము పాండవులకు సాక్షాత్తుగనో పరంపరగనో సంబంధించినది. సభాపర్వమున కథయంతయు వారిదే. ఆరణ్య పర్వమున వారికి సంబంధించిన కథ చాల తక్కువ. నానావిధములైన ఉపాఖ్యానములు పర్వమంతయును ఆక్రమించినవి. వీనికి ధర్మరాజు శ్రోత. నన్నయ రచించిన భాగమున కిమ్మీరవధ, జటాసురవధ, కాలకేయవధ, సౌగంధికాహరణము, కిరాతార్జునీయము పాండవులకు సంబంధించిన వృత్తాంతములు. సౌంభకాఖ్యానము శ్రీకృష్ణునకు సంబంధించినది. నలోపాఖ్యానము, అగస్త్యచరిత్ర, ఋష్యశృంగుని కథ, సౌకన్యాఖ్యానము, మాంధాత, సోమకుడు, శిబి, అష్టావక్రుడు, యవక్రీతుడు, అర్ధావసువు, సగరుడు పరశురాముడు మున్నగువారి కథలు ప్రాసంగికముగా చెప్పబడినవి. ఈ కథ లన్నింటిలో నలోపాఖ్యానము తలమానికము వంటిది. ధర్మజుని చరిత్రమునకు ప్రతిబింబ ప్రాయముగా నున్న ఈ కథను నన్నయ ప్రత్యేకమైన అభినివేశముతో 226 గద్య పద్యములలో ఒక చిన్న రసవత్ప్రబంధముగా రూపొందించెను.

నలోపాఖ్యానము చెప్పినది బృహదశ్వుడను మహాముని. ఆయన ధర్మరాజునకు ఈ కథ చెప్పుటకే వచ్చినట్లున్నది. కథ చెప్పి ఆయన వెడలి పోయెను. ఈ సందర్భమున తక్క భారతమున బృహదశ్వుని ప్రసంగము ఎచ్చటను ఉన్న జాడ కనబడదు.

ఆరణ్యపర్వమున నన్నయ వ్రాసిన భాగము మూలమున 6981 శ్లోకముల పరిమితి గలది. దానిని నన్నయ 1299 గద్య పద్యములలో వ్రాసెను. అనగా మూలమును ఇంచుమించు అయిదవ వంతునకు సంక్షేపించెను. మూలమున నలచరిత్రము 976 శ్లోకము లున్నవి. దానిని నన్నయ 226 గద్య పద్యము లలో వ్రాసెను. అనగా నాలవ వంతునకు మాత్రమే సంక్షేపించెను. దీనిని బట్టి నలోపాఖ్యానమును నన్నయ కొంత విస్తరించి వ్రాసెనని స్పష్టమగు చున్నది. పాండవుల కథకు నలదమయంతుల కథకు గల అసాధారణ సాదృశ్యమే దీనికి కారణమని ఊహింప వచ్చును. ధర్మజాదుల కష్టములకు ఉపమానముగా ఈ కథ చెప్పబడినది. 'ద్వాపరంబుతో వచ్చు కలింగని" అనుటచే నలుని చరిత్ర పాండవుల చరిత్ర జరుగు చుండిన కాలమునకు మిక్కిలి సన్నిహితపూర్వ కాలమునందే జరిగి

యుండవలెను. బృహదశ్వుడు ఆ కథవిని వచ్చి పాండవులకు చెప్పెను. ఎవ్వఁడో పురాణ పురుషుని కథకంటె అవ్యవహితపూర్వుడైన రాజన్యుని వృత్తాంతము పాండవులకు చిత్తశాంతిని ధైర్యమును కలిగింపగలదు. ఆరణ్య పర్వ మందలి కథలలో పాండవుల జీవితముతో ఇంతగా సంవదించు కథ వేఱొకటిలేదు.

నలుడు, ధర్మజుడు సత్యవ్రతులు ధర్మనిత్యుడు అక్షప్రియులే కాని అక్ష హృదయజ్ఞులు కారు. ఇరువురు ద్యూతవ్యసనాభిభూతులు, నిర్వాసితులు.

"ద్యూతార్థము తత్కృత వాహూతుడనై జూదమాడకుండుట ధర్మాపేతం బని" ధర్మజుడు జూదమాడెను. "బలవద్ద్యూతార్థముగా బిలువంబడి" నలుడు జూదమాడెను. రెండింటను ద్యూతము దాయాదులకే జరిగెను. బ్రాహ్మణ వేషమున కలి పుష్కరునకు తోడ్పడెను. ద్వాపరాంశమున బుట్టిన శకుని కల్యంశ మున పుట్టిన దుర్యోధనునకు తోడ్పడెను. కలిద్వేషమే ఉభయత్ర కారణము. ఉభయత్ర స్త్రీయే కారణము. దమయంతి తన్ను వరించలేదని కలికి ద్వేషము. ద్రౌపది తన్నుజూచి నవ్వెనని దుర్యోధనునకు కోపము. రెండును కపట ద్యూత ములే. రెండింటను పునర్ద్యూతము కలదు.

రెండింటను స్వయంవరము కలదు. అర్జునుని ఉద్దేశించి ద్రుపదుడు, నలుని ఉద్దేశించి భీముడు స్వయంవరమును చాటించిరి. రెండును వ్యాజస్వయంవరములే. దాంపత్యములు పూర్వజన్మ నియతములే.

రెండింటను అరణ్యవాసము, అజ్ఞాతవాసము కలవు. అజ్ఞాతవాసమున ధర్మజునివలె నలుడును ఉక్తిచమత్కారముచే సత్యవ్రతమును ఎట్లో నిలుపు కొనును. నలునివలె అర్జునుడు వికృతరూపము పొందెను. నలుడు ఋతుపర్ణునకు చేసినట్లు అర్జునుడు ఉత్తరునకు సారథ్యముచేయును. నలుడు ఋతుపర్ణునియొద్ద అజ్ఞాతవాసము చేసినట్లు పాండవులు విరాటునియొద్ద చేయుదురు. నలుడు వంటలి వాడు. భీముడును వంటలవాడు. నలునివలె నకులుడు అశ్వశిక్షకుడు.

దమయంతి కిరాతపీడితయైనట్లు ద్రౌపది కీచకపీడిత యగును. ఇంద్రసేనా దులు విదర్భకు పంపబడినట్లు ప్రతివింధ్యాదులు పాంచాలమునకు పంపబడుదురు. దమయంతి నలుడు చింపుకొనిపోగా మిగిలిన మలినార్ధ వస్త్రము ధరించి సునందా దేవికడ సైరంధ్రీవృత్తము నడపును. ద్రౌపది దుశ్శాసనుడు ఆకర్షించి త్రెంపగా మిగిలిన కురులను ముడువక సుధేష్ణకడ సైరంధ్రిగా నుండును.

రెండింటను వస్త్రాపహరణము కలదు. అక్షములు పక్షుల రూపమున వచ్చి నలునివస్త్ర మపహరించెను. దుశ్శాసనుడు సభలో ద్రౌపదివస్త్ర మపహరించెను. రెండింటను ఏకవస్త్రధారణము కలదు.

జ్ఞాతిప్రీతిచే నలుడు పుష్కరుని క్షమించును. ధర్మజుడు ధుర్యోధనుని క్షమించును, విజయసాధనముగా నలుడు అక్షహృదయము సంపాదించును. అర్జునుడు పాశుపతము సంపాదించును.

ఇన్ని సామ్యములతోపాటు ఉపమానమైన నలచరిత్రయందు ఉపమేయమైన పాండవ చరిత్రకంటె కొన్ని విశేషములును గలవు. పాండవుల వనవాసము అజ్ఞాతవాసము సమయబద్ధములు. నలునివి ఐచ్ఛికములు. అభిమానవశమున ఆయన కొనితెచ్చుకొన్నవి. పాండవులు అరణ్యాజ్ఞాతవాసములు ద్రౌపదీసహితులై గడపిరి. నలదమయంతులు వియుక్తులైరి. ద్రౌపదికి పతుల రక్షకలదు. దమయంతి నిరాశ్రయ. పాండవుల అజ్ఞాతవాస మొక్కయేడే. నలునిది మూడేండ్లు. పాండవుల కష్టమునకు పదుమూడేండ్లని అవధి కలదు. నలదమయంతుల కష్టమునకు అట్టి యవధిలేదు. పాండవులకు, ద్రౌపదికి లేని శాపానుగ్రహశక్తులు నలదమయంతులకు కలవు.

తమకంటె మహిమాన్వితులైన వ్యక్తులే తమకంటె కఠోరములైన కష్టముల ననుభవించిరి అని యుపదేశించి తన్మూలమున పాండవులకు ద్రౌపదికి చిత్తోపశాంతిని కలిగించుటయే కాక ఈ నలోపాఖ్యానము పాండవులకు అజ్ఞాతవాస నిర్వహణమునకు చక్కని ఉపాయములనుగూడ సూచించుచున్నది. వ్యాసమహర్షి ఈ కథను విస్తరించి వ్రాయుటలోని తాత్పర్యమును గ్రహించియే నన్నయ దీనిని హితోపదేశజనకమైన రస్యవత్కావ్యముగా రూపొందించెనని భావింపవచ్చును.

నన్నయగారి రచన రత్నగర్భమైనదని చెప్పి విశ్వనాథ సత్యనారాయణ గారు అనర్ఘములైన మహారత్నములను పైకితీసి ప్రదర్శించి యుండిరి. కాని ఉపరితలమున తెట్టలుగట్టియున్న ముత్యములనీ పగడములను పట్టిచూపుపని వారు పెట్టుకొనలేదు. పెట్టుకొన్నచో నదియొక గ్రంథము పట్టును.

అనువాద విధానము

సంక్షేపించుట, విస్తరించుట. అన్యథాకరించుట, పరిహరించుట. నూత్న ముగా కల్పించుట నన్నయ ఆంధ్రీకరణలక్షణములు. సంక్షేపించుట. పరిహరిం

చుట కథకు నిబిడత్వము కథనమునకు ప్రౌఢత్వము సంపాదించుటకు విస్తరించుట, కల్పించుట రసభావముల పోషణకు, అన్యథాకరించుట ఔచిత్యమునకు. ఇతిహాసమును కావ్యముగా రూపొందించుటకు ఈ విధానము సర్వథా యోగ్యమైయున్నది. నన్నయ అనువాద పద్ధతిని ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారు సోదాహరణముగా విస్తరించి నిరూపించి యున్నారు. ఇచ్చట దిఙ్మాత్ర ముదాహరణము..

నలోపాఖ్యానమునకు అవతారిక మూలమున నిట్లున్నది.

ఆశ్వస్తం చైన మాసీన ముపాసీనో యుధిష్ఠిరః
అభిప్రేక్ష్య మహాబాహుః కృపణం బహ్వ్యాభాషత.
అక్ష్య ద్యూతేచ భగవన్ ధనం రాజ్యంచ మే హృతమ్.
ఆహూయ నికృతిప్రజ్ఞైః కితవైరక్షకోవిదైః.
అనక్షజ్ఞస్య హి సతో నికృత్యా పాపనిశ్చయైః,
భార్యాచ మే సభాం నీతా ప్రాణేభ్యోఽపి గరీయసీ.
పునర్ద్యూతేన మాం జిత్వా వనవాసం సుదారుణం.
ప్రావ్రాజయన్ మహారణ్య మజినైః పరివారితం.
అహం వనే దుర్వసతీర్వసన్ పరమదుఃఖితః,
అక్షద్యూతాధికారేచ గిరః శృణ్వన్ సుదారుణాః,
ఆర్తానాం సుహృదాం వాచో ద్యూతప్రభృతి శంసతామ్,
అహం హృది శ్రితాః స్మృత్వా సర్వరాత్రీర్విచింతయన్.
యస్మింశ్చైవ సమస్తానాం ప్రాణా గాండీవధన్వని,
వినా మహాత్మనా తేన గతసత్త్వ ఇవాభవం.
కదా ద్రక్ష్యామి బీభత్సుం కృతాస్త్రం పునరాగతం,
ప్రియవాదిన మక్షుద్రం దయాయుక్తమ తంద్రితః.
ఆస్తిరాజా మయా కశ్చిదల్ప భాగ్యతరో భువి,
భవతా దృష్టపూర్వో వా శ్రుతపూర్వోఽసి వా క్వచిత్
న మత్తో దుఃఖితతరః పుమానస్తీతి మే మతిః,

దీనికి నన్నయ అనువాదము.

"విశ్రమించియున్న యమ్ముని వరునకు ధర్మతనయుం డధర్మపరులైన పరుల చేతం దమపడిన నికార ప్రకారంబంతయు నెఱింగించి యిట్లనియె

క. పుడమియు రాజ్యము బంధుల
విడిచి మృగావలుల గలసి, విపినంబులలో
గడుకొని మాయట్లిడు మల
బడిన నృపులు గలరె యొరులు ? పరమ మునీంద్రా !'

ధర్మరాజు మితభాషి. ఆయన తన కష్టములనుగూర్చి దీర్ఘోపన్యాసము చేయుట పునరుక్తి యగుటయే కాక ఆయన యుదాత్తతకు భంజకము కూడ అగుచున్నది. అనువాదమున సంక్షేపణ విధానము నవలంబించి నన్నయ పునరుక్తి పరిహరణ ముతో పాటు పాత్రపోషణమును కూడ సాధించెను. మూలమున కృపణుడు బహుభాషి, స్వదుఃఖదుఃఖితుడు అయిన ధర్మరాజు అనువాదమున ధీరోదాత్తుడు. గంభీరుడు, పరదుఃఖదుఃఖితుడు అయినాడు. మూలమందలి "మత్తః" అనుమాటను మాయట్లు అనియు 'న అస్తి ఇతిమేమతిః' అను వ్యతిరేక నిశ్చయార్థకవాక్యమును "నృపులు కలరె యొరులు" అను ప్రశ్నార్థక వాక్యముగను మార్చి నన్నయ ధర్మజుని శీలమునకు మెఱుగుపెట్టెను. ఈ ప్రశ్నను ధర్మజుడు స్వీయదుఃఖోప శాంతికై కాక ద్రౌపదీ భీమసేనాదుల క్రోధోపశాంతికై అడిగినచో ఆయన గడుసు దనము వ్యక్తమైనది.

తన అంతఃపురమున ప్రవేశించిన నలుని జూచి దమయంతి ఇట్లన్నదని మూలము—

'క స్త్వం సర్వానవద్యాంగ ! మమ హృచ్ఛయ వర్ధన !'

దమయంతి నలునిపై మనస్సు నిలిపియున్నది. ఆతనికొఱకే స్వయంవరము ఏర్పాటై యున్నది. ఇప్పుడు తన యంతఃపురమున ప్రవేశించిన వాడెవ్వడో ఆమె యెఱుగదు. ఆతనిని 'మమహృచ్ఛయవర్ధన' అని సంబోధించుచున్నది. ఇది యనుచితము. ఇది యొక గ్రంధి. నన్నయ్య ఈ గ్రంధిని విప్పికొనెను. నలదమ యంతులు పూర్వజన్మమున ఆహుకులు అను భిల్లదంపతులు. శివుడు వారి తపస్సు నకు మెచ్చి ఉత్తరజన్మమున వారు నలదమయంతులై జన్మింతు రనియు, తాను పార్వతి సంయోగము ఘటింతుననియు వరమిచ్చెను. నానాపురాణ విజ్ఞాన నిరతుడైన నన్నయ శివపురాణాంతర్గతమయిన ఈ గాథను స్మరించి నలోపాఖ్యానమును తదనుగుణముగా పరిష్కరించెను. మొదటి నుండియు కథను అట్లే నడిపెను.

'స దదర్శ తతో హంసాన్ జాతరూప పరిష్కృతాన్
వనే విచరతాం తేషా మేకం జగ్రాహ పక్షిణామ్'

అన్న మూలమును—

'అంతరిక్షకాంతాహారావలియుంబోలె హంసావళి యవనీతలంబున కవత
రించిన'

'వీరసేనసుతుడు వీరుండు హంసల
నడబెడంగుజూచి నగుచు వాని
నెగచి యెగచి యందు నెగయకుండగ నొక్క
హంసబట్టుకొనియె నతిరయమున'.

అని నన్నయ యనువదించెను. "అవతరించిన" అను శబ్దముచే ఆ హంస సామాన్య హంస కాదనియు, హంస రూపము ధరించి వచ్చిన ఈశ్వరు డనియు నన్నయ సూచించెను.

"దమయంతికి నలునకు సంగమ కారణదూతయైన కల హంస"

అని తరువాత ఈ యంశమును తేట పఱిచెను. మూలమందలి హంస జాతరూప పరిష్కృతము. రూపవై చిత్రిచే అది నలుని దృష్టినాకర్షించెను. నన్నయ హంసలు శారదాభ్రశకలములవంటివి. దమయంతీ గతచిత్తుడైన నలునకు ఆ హంసలబారు అంతరిక్ష కాంతాహారావళి వలె కనపడినది. వాని నడబెడంగులందు దమయంతి నడబెడంగులు కనబడినవి. అతడు నవ్వుకొనుచు వానిని బెదరగొట్టెను. అన్నియు ఎగిరిపోయినవి కాని ఒక్క హంసమాత్రము ఎంత ఎగచినను ఎగయలేదు. నలుడు దానిని పట్టుకొనెను. అదియేల ఎగురలేదు? సంగమకారణ దూతయై హంసరూప మునవచ్చిన పరమేశ్వరుడు గనుక. ఆ హంస నలునితో—

"దమయంతీ సకాశే త్వాం కథయిష్యామి నైషధ!"

అని పలికినట్లు మూలము. నన్నయ "నీ హృదయేశ్వరియైన దమయంతి పాలి కింబోయి" అని వ్రాసెను. దమయంతి నలుని హృదయేశ్వరి అని హంసకెట్లు తెలిసెను. అది కారణజన్మమైన హంసము గనుక. మూలమున—

"సా తా నద్భుత రూపాన్వై దృష్ట్వా సఖిగణావృతా,
హృష్టా గ్రహీతుం ఖగమాం స్త్వరమాణోపచక్రమే.
అథ హంసా విసస్మృపుః సర్వతః ప్రమదావనే,
ఏకైక శస్తదా కన్యాస్తాన్ హంసాన్ సముపాద్రవన్.
దమయంతీతు యం హంసం సముపాధావ దంతికే,
స మానుషీం గిరం కృత్వా దమయంతీ మథా బ్రవీత్"

అని హంసల యద్భుతరూపమును జూచి హర్షించి దమయంతి తానే త్వరపడి యొకదానిని పట్టుకొనుటకు పరువిడినట్లున్నది. నన్నయ ఆ హంసలు ఉపవనమున సఖీపరివృతమై యున్న దమయంతి యంతికమున విహరించుచుండగా వానింజూచి పరమకౌతుకమున

"ఒండొరుల గడవంగ నయ్యువిదలెల్ల
బఱచి యొక్కొక్క కలహంస బట్టికొనగ
జెలువముగ నందు దమయంతిచేత బట్టు
వడియె నలుచేత విడువంగబడిన హంస."

అని ఆ హంస తానై బుద్ధిపూర్వకముగా బట్టువడెనని వ్రాసెను. ఇదియు ఆ హంస కారణజన్మమని సూచించుటకు చేసిన మార్పే. దమయంతి పట్టుకొనబోయిన హంస నలుడు విడిచిపెట్టినదే యనుట కంటె నలునిచే విడువబడిన హంసయే దమయంతిచేత పట్టుబడెననుట వల్ల ఆ హంస నలదమయంతులకు సంగమ కారణ దూతయై వచ్చెనని సువ్యక్తమగును. ఇచ్చట కూడ మూలమున—

"దమయంతి నలోనామ నిషధేషు మహీపతిః,"

అని హంస ఆరంభించును. నన్నయ హంస నలునియొద్దవలెనె దమయంతి యొద్ద కూడ తన కారణజన్మకు తగినట్లు "నీ హృదయేశ్వరుండైన నలుని యొద్దనుండి వచ్చితి" నని చెప్పును. హంస దౌత్యమున ఈ యంశము గమనింపబడినచో మూలమందలి " మమహృచ్ఛయ వర్ధన!" అన్న సంబోధనయు, నన్నయవ్రాసిన

"నాకు మనోజ వేదనా వివర్ధనుండవైన"

అన్న వాక్యమును అనౌచిత్య దూరములగును. నలదమయంతులు జన్మాంతర దాంపత్య సంస్కారముతో జన్మించిరను రహస్యమును నిరూపింపదలచియే నన్నయ ఇట్లు రచించెను "పతివాయనో పడాలలన నుదీర్ణ సౌహృదబలంబున" అని నన్నయ

నలుడు దమయంతిని వనమున వీడిపోజాలని స్థితిని వర్ణించెను. నన్నయ చెప్పిన ఉదీర్ణసౌహృదబలము కాళిదాసు చెప్పిన 'జనన్తర సౌహృదాని' వంటిది.

అగస్త్యుడు లోపాముద్రను పెండ్లాడి ఆమెను తీసికొనిపోయి గంగాద్వార మున తపస్సు చేయుచుండెను.

"తతో బహుతిథేకాలే లోపాముద్రాం విశాంపతే
తపసా ద్యోతితాం స్నాతాం దదర్శభగవాన్ఋషిః.
స తస్యాః పరిచారేణ శౌచేన చ దమేనచ,
శ్రియా రూపేణ చ ప్రీతో మైథునా యాజుహాన తాం."

అని మూలమునందున్న దానిని నన్నయ—

"నీచ తరనాభిఁ జపలవి
లోచనఁ బృథుజఘన చక్రలోపాముద్రం
జూచి ముసీంద్రుఁడు మన్మథ
గోచరుఁడై దానిఁ బ్రీతిఁగూడఁగఁ దివిరెన్.

అని లోపాముద్రాచిత్రమును దిరుగవ్రాసి అగస్తునివంటి మహర్షిని మన్మథగోచరుని కావించుటకు సర్వథా సమర్థమైన విభావమును రూపొందించెను. "మైథునా యాజు హావతాం" అన్న గ్రామ్యార్థమును "కూడఁగఁదివిరెన్" అని సుకుమారము గావించెను.

అప్పుడు లోపాముద్ర—

"ఇచ్ఛామి త్వాం స్రగ్విణం చ భూషణైశ్చ విభూషితం
ఉపసర్తుంయథా కామం దివ్యాభరణభూషితా.
అన్యథా నోపతిష్ఠేయం చీరకాషాయవాసినీ"

అనిపలికినట్లు మూలము. ఇట్లనుట లోపాముద్ర పాతివ్రత్యమునకు మచ్చయగునని నన్నయ "అన్యథా నోపతిష్ఠేయం" అనుమాటను తొలగించెను.

అర్జును డమరావతికేగినప్పుడు దేవేంద్రుని పనుపును అచ్చరలు నాట్యగాన ములు ప్రదర్శింతురు. అర్జునుడు ఊర్వశియందు చూపునిలుపుట గుర్తిం యింద్రుడు చిత్రసేనునితో రహస్యముగా అర్జునుని సంతోషపెట్టుటకై ఊర్వశిని

పంపుమని చెప్పును. ఇంద్రుడీపనిచేయుట అనుచితముగా నుండునని ఈ సన్నివేశ మును వర్ణించు పదునారు శ్లోకముల అధ్యాయమును నన్నయ విడచివై చెను. "నిలింపపతిపంపున సొంపార నూర్వకి యర్జునసమాగను కాంక్షంజేసి" యని యింద్రుని పంపుననే ఊర్వశి వెళ్ళినట్లు నన్నయ సూచనచేసెను కాని అర్జునుని నిగ్రహమును పరీక్షించుటకై యింద్రుడు ఊర్వశిని పంపియుండు నన్నభావము సహృదయులకు తోచునట్లు సన్నివేశమును నిర్వహించెను. ఈ సందర్భమున ఊర్వశి జ్యోత్స్నాభిసరణమును నన్నయ మృదుమధురమైన శైలిలో రమణీయ ముగా చిత్రించెను. ఈ ఘట్టమునందలి రెండువచనములు ఆయన యక్షరరమ్యతకు లక్ష్యప్రాయములు. ఊర్వశి యభిసారికా మూర్తి అర్జునుని ఇంద్రియ నిగ్రహము నకు గీటురాయిగా నుండునట్లు నన్నయ చిత్రించెను. అట్టి రత్యుద్దీపక సామాగ్రికి చలింపని అర్జునుని—

"నీ యింద్రియజయము కీర్తనీయము తండ్రీ"

అని యింద్రునితో పాటు సహృదయుడును కీర్తించును.

అగస్త్యుడు వాతాపిని ప్రిమింగినంతనే ఇల్వలుడు యథాప్రకారము తమ్ముని పిలుచును. అప్పుడు—

"తతో వాయుః ప్రాదురభూదధస్య మహాత్మనః
శబ్దేన మహతా తాత! గర్జన్నివ యథాఘనః"

అని యగస్త్యుడు అపానవాయువు విడిచినట్లు మూలమున చెప్పబడినది.ఇది జుగుప్సా కరముగా నుండునని నన్నయ—

"కడుపు దడవికొనుచు గట్టున(ద్రేచిన
నసుర జీర్ణమయ్యెనాక్షణంబు"

అని అన్యథాకరించెను.

నన్నయ యనువాదవిధానమంతయు శిల్పి ప్రాచీనమైన ఇతిహాస వస్తువును సుందరమైన కావ్యవస్తువుగా పరిష్కరించుట ఉచితమైన మార్గమున నేదచినది.

వర్ణనలు

నన్నయవర్ణనలు పరిమితములయ్యు పటుత్వముగలవై యుండును. నన్నయ దృష్టి ప్రధానముగా కథనప్రౌఢిమీదనే యున్నను ఆకథను రసవంతము చేయుట

యందును ఆయనకు తాత్పర్యము గలదు. తానుజగద్ధితంబుగా భారతసంహితారచన బంధురుఁడనైతినని ఆయనయే చెప్పుటవల్ల భారతరచనచే లోకమునకు ఆయన ప్రధానముగా కలిగింపదలచినది వ్యుత్పత్తియే యనిభావింపవచ్చును. అనుషంగిక ఫలముగా రసానందమును కూడ ఉద్దేశించుటవల్లనే ఆయన ఆలంబనోద్దీపన తటస్థ విభావములను జడసాత్త్వికాను భావములను నన్నయ పెక్కుపట్ల ఎంతోనిపుణముగా వర్ణించెను. కిరాతార్జునీయ ఘట్టమున అర్జునునకు ప్రత్యక్షమైన పరమేశ్వరుని రూపము.

వరదుడు పార్థశౌర్య విభవంబున కాతని ధైర్యవృత్తిక
ప్పరుదుగ మెచ్చి సన్నిహితుఁడయ్యె జటామకుటేందురేఖయుం
గరమున శూలమున్ గరళకాలగళంబు బృహద్భుజాజినాం
బరముఁ దృతీయలోచనముఁ బగ్నగహారము నొప్పుచుండఁగన్.

ఇది నేత్రప్రత్యక్ష విషయమైన పరమేశ్వరుని మూర్తి. ఈ మూర్తి నిర్మాణ మందలి సర్వాంశములు నేత్రగ్రాహ్యములే యగుట నన్నయ ఆలంబన విభావవర్ణనా నైపుణి.

దమయంతి అంతఃపురము ప్రవేశించి ఆమెకు మనోజవేదనా వివర్ధనుండైన నలునిమూర్తి—

దమయంతి మనోభవ నిభు
న మచేంద్రప్రతిము దినకరాభు సుధారు
క్సము వరుణసదృశు ధనదో
పము నశ్వినమాను నిషధపతిఁజూచి నలున్

ఇంద్రాదుల దూతయై వచ్చిన నలునియందు లోకపాలాదుల అనుభావ సర్వస్వము రూపుకట్టించి నన్నయ దమయంతి లోకపాలురను తిరస్కరించి నలునే వరించుచున్న భావివృత్తాంతము విభావవర్ణనముచేతనే చక్కగా సూచించెను. సౌగంధికాహరణార్థ మరుగుచుండిన భీమని వర్ణన—

గమనవేగంబున ద్రుమలతాజాల సంచాలనసేయుచు శైలగుహల
నడఁగి యదృశ్యలై కడువేడ్కతోఁదన్నుఁజూచు ఖేచరసిద్ధసురభూరిగ
గరుడగంధర్వ కిన్నర కామినులచేత మానుగా నభివీక్ష్యమాణుఁడగుచు

క్రూరకులు విఱుచుచు వీరకతో దీవల(బెఱుకుచు(బదహతి(బృథునగేంద్ర
మద్రువ నున్నతంబులయి నెడలెక్కుచు
మదగజంబువోలె మధ్యముండు
పవన వైనతేయ పటుజవయుక్తు(డై
యరిగె గంధమాద నాంతరమున.

"మదగజంబువోలె మధ్యముండు' అను ఉపమానమునకు కావలసిన సామగ్రి యంతయు పద్యమున నిపుణముగా సమకూర్పబడినది. ఈ పద్యము తరువాతి వచనమున 'ఒక్కసరోవరంబు గని యందు(గృతావగాహుండై నవనలినదళ మృణాళవలయాలంకృతు(డగుచు దాని వెలువడి యనేక యోజన విస్తారాయామ రమణీయంబైన కదళీషండంబు(జొచ్చి యందు శంఖధ్వానంబు(జేసిన' అని పద్యమున వాచ్యము చేయబడిన వనగజసామ్యము రమణీయముగా వ్యంగ్యము చేయబడినది. ఈ విధముగా పాంచాలీప్రియకరంబయిన పరాక్రమ మాచరింపబోవు ప్రియసాహసుడైన భీముని చేష్టలయందు అంతర్వాహినిగ వన్యమదగజచేష్టా విశేషములను భాసింపజేయుచు మదగజసామ్యమునుకొనలు సాగించుట మహాకవియైన నన్నయ దర్శనైక్యమును ప్రదర్శించును.

కదళీషండ మధ్యమున నొక్క శిలాతంబున శయనించియున్న హనుమంతుని మూర్తి—

హ్రస్వపీనగ్రీవు, నచలితాయత హను
నతి చపల స్వభావాభిరాము(
దను మధ్యకటిచక్రు, దహన కణాకార
తామ్రోష్ఠు, నతికృశదశన కరజు(
బృథుల విద్యుత్పుంజ పింగాక్షు, నుత్తుంగ
దృఢవక్షు, నాజానుదీర్ఘ బాహు
నూర్ధ్వలాంగూల మత్యున్నత ధ్వజలీల(
గ్రాలుచునుండ నేకాంతయోగ
నిద్రనున్న ధర్మనిర్మలు, హనుమంతు(
జూచి పాండురాజ సుతు(డు వాని
నిద్ర(జెఱుప(గడ(గి నిజసత్వ మేర్పడ
సింహనాద మొప్ప(జేసె డాసి

విశాల శిలాతలమున శయనించిన ఈ మూర్తి సామాన్య కపిమూర్తి కాదు. 'విశాల శిలాతల' శబ్దముచే ఆ కపి అసాధారణమూర్తి గౌరవము కలది యని సూచింప బడినది. మదగజమువలె విజృంభించుచున్న భీమునిదృష్టి నాకర్షించి నిద్రాభంగము చేయవలెనన్న చిలిపియూహ ఆతనికి కలిగించుటకు సమర్థమైన అసాధారణమూర్తి.

పాండవులతో నొడంబడి యుండుమని హితవు చెప్పిన మైత్రేయుని పలుకు లాదరింపక దుర్యోధనుడు 'పాదాంగుష్ఠంబున నేల వ్రాయుచు బాహువెత్తి తొడలు సటచి నగు' చుండుట—

కేశిని దమయంతి విరహార్తస్థితిని వర్ణింపగా విని బాహుక రూపమునన్నున్న నలుడు 'అవిరళోద్గత బాష్పపూర్ణంబులైన లోచనంబు లెఱుకవడకయుండ వదన పద్మంబు వాంచి తానొండువలను చూచుచుండుట—

భీముడు నిద్రాభంగము చేయగా హనుమంతుడు 'మెల్లమెల్లన మేల్కాని జృంభసంభృత జలార్ద్రసంచల విలోచనుండగుచు ననాదరంబున' భీముని జూచుట- ఇత్యాదులు చక్కని గాత్రారంభానుభావాభినయ వర్ణనలు.

అమరావతికి వచ్చి తనకు మ్రొక్కిన అర్జునుని అర్ధాసనమున గూర్చుండ బెట్టుకొని దేవేంద్రుడు ఉపలాలించునప్పటి వాత్సల్యవ్యంజక చేష్టావిశేషమును నన్నయ సహజముగా చిత్రించెను.

లీలైరావతకుంభా
స్ఫాలన కర్కశకరములఁ బలుమరును మరు
త్బాలకుఁ దంటుచునుండె గు
ణాలంకృతుఁడైన పార్థనంగముఁ బ్రీతిన్.

ఈ వర్ణనమున కాళిదాసు కుమారసంభవమున చేసిన—

"ఐరావతాస్ఫాలన కర్కశేన హస్తేన పస్పర్శ తదంగమింద్రః"

అన్న వర్ణనమును జీర్ణము చేసికొన్న సంస్కారము గోచరించుచున్నది.

తననివాసమైన యరణ్యమునకు వచ్చిన వారు ధర్మజభీమాదులని తెలిసిన కిమ్మీరుడు 'ఎట్టెట్టు! భీముండె యీత?ఁడేమి పుణ్యమొ! వీని నెప్పుడు సకపఁ గాంతునో యని యున్నచోఁ దాన యరుగుదెంచె' ననుట—

సౌంభకముతో ద్వారవతిపై నెత్తివచ్చి సాళ్వుడు 'ప్రతినరపాలకాలు శిశుపాలు బలాధికుఁ జంపి దర్పసంహితుఁడగుచున్న వృష్ణిఖలుఁ డెక్కడనెక్కడ'ననుట—

తాను ధిక్కరించి యెదిరించినది పరమేశ్వరునని గుర్తించి పశ్చాత్తప్తుడై అర్జునుడు 'నన్నున్ గటకంతాక్షమింపుము' అని వేడుటయు—

హనుమంతుని పూర్వరూపమును దిలకించి అతివిస్మితుడై భయముతో భీముడు 'అతిభీషణ మిది యత్యద్భుతమోహో ! చాలు భూనభోమధ్యవ్యాపితమయ్యె భవద్దేహాయత త్వముపసంహరింపు' మనుట —

ఇత్యాదులు రసవ్యంజ్యకములైన వాగారంభానుభావ వర్ణనములు.

నలదమయంతుల విరహావస్థావర్ణనమున నన్నయ రమ్యమైన శిల్పమును ప్రదర్శించెను. జనులు ఒకరి గుణముల నింకొకరి యొద్ద వర్ణింపగా వారియెదలలో మనోభవవికార విభ్రమము వెలసెను. హంస ఒకరి రూపము నింకొకరి యొద్ద వర్ణింపగా వారు అనోన్యరూప గుణశ్రవణ సంజాతప్రీతులై విరహసంతప్తులగుచుండిరి. పారస్పరికమై ఉభయనిష్ఠమైన ఆ మదనతాపమును నన్నయ యొక చంపకమాలయందు వరించెను.

నలదమయంతు లిద్దఱు మనఃప్రభవానల బాధ్యమానులై
సలిపిరి దీర్ఘవాసరనిశల్ విలసన్నవ నందనంబులన్,
నలినదళంబులన్, మృదుమృణాళములన్ ఘనసారపాంసులన్
దలిరుల శయ్యలన్, సలిలధారలఁ జందన చారు చర్చలన్.

ఈ పద్యమునందలి 28 గురువులలో 11 మాత్రమే దీర్ఘములు. తక్కినవి వ్యంజనాంత హ్రస్వములు. కాఁగా పద్యగతి మిక్కిలి ద్రుతమైనది. క్షణవిలంబనమును సహింపని రతిత్వర యక్షరవృత్తియందు చక్కగా నిర్వహింపబడినది. నలదమయంతుల మదనానల తాపమును ఏకవృత్తమున వర్ణించి నన్నయ వారి పరస్పరానురాగ సాదృశ్యమును విరహతాప సాదృశ్యమును జక్కగా వ్యంజించెను. "మనఃప్రభవానల" మన్న యక్షరసంపుటి యందలి విసర్గ పరక గురుత్వమున జగణము అత్యంతము ఉచ్చము, దీప్తమునై విరహానలోద్రేకమును రూపు కట్టించుచున్నది. అయినను ఈ సంతాపము మధురమైనది. కనుక పద్యమంతటను సరళానునాసికాక్షరములు నళినదళములవలె కప్రపుఁబలుకులవలె, చివురు గుత్తులవలె. శీతల జలకణములవలె వెదజల్లబడి సౌకుమార్య మాధుర్యములు వెలార్చుచున్నవి

ప్రకృతి వర్ణనములందును నన్నయ నైపుణి కొని యాడదగినది. పాండవులు గంధమాదన పర్వతము చూచుట—

నానావర్ణ శిలావిహ
గానేక మృగాభిరామమై భూనారీ
నానా భరణ విభూషిత
పీనోన్నతకుచముపోలె వెలిగెడు దానిన్.

ఈ వర్ణనమున కాళిదాసుని ఆమ్రకూట పర్వత వర్ణన అనుకరణము కనబడుచున్నది. అనుకరణముతోపాటు నవీకరణమును కనబడుచున్నది

ఛన్నో పాన్తఃపరిణత ఫలద్యోతిభిః కాననా మ్రైః
త్వయ్యారూఢే శిఖరమచలః స్నిగ్ధవేణీసవర్ణే
నూనం యాస్యత్యమరమిథున ప్రేక్షణీయా మవస్థాం
మధ్యే శ్యామ స్తన ఇవ భువః శేషవిస్తార పాణ్డుః.

ఆకాశమందున్న అమరమిథునములకు ఆమ్రకూటము భూదేవి స్తనము వలె నగపడినది. అంత యెత్తున నున్నవారికి ఆ విధముగా నగపడుట అతి సహజము. పాండవులకు గంధమాదనము భూనారీ స్తనమువలె నగపడిన దనగా వారును ఆకాశము నుండియే ఆపర్వతమును చూచుచుండవలెను. అట్లే చూచుచుండిరని నన్నయ సూచనచేసెను. భూమార్గమున గంధమాదనమునకు పోవుట శక్యము కాదని తెలిపి రోమశుడు 'అతుల తపోవీర్యబలోన్నతిఁ బోదము గంధమాదనంబునకు' అనెను. కనుక పాండవులు రోమశుని తపోబలముచే గగనమార్గముననే వచ్చి గరిధ మాదనంబును గాంచిరి. నన్నయ వర్ణనము సుసంగతము సుందరము నైనది. పాండవులు గగనమార్గమునుండి దిగుచు కొంతచేరువకు రాగా గంధమాదనము ఎట్లగపడినదో నన్నయ మరల వర్ణించెను.

లలితాచ్ఛ స్ఫటికశిలా
తలములపైఁబాఱు విమలతర నిర్ఝరిణీ
జలపూరములను తారో
ల్లల దురుహారాళి నుజ్జ్వలంబగు దానిన్.

దూరము నుండి నానా భరణ విభూషిత మైన స్తనముగా కనబడిన పర్వతము చేరువకు రాగా స్ఫటికశిలలపైఁ బ్రవహించు విమల నిర్ఝరములనెడు తారహార

ములచే నలంకృతమైన స్తనముగా కనబడినది. ఇచ్చట నన్నయ ప్రదర్శించిన సుకుమార పరిశీలనము, దర్శనైక్యము కాళిదాసుని తలపించుచున్నది.

పాండవులు గంధమాదనము నందుండగా వర్షర్తువు ప్రారంభమయ్యెను. ప్రథమవర్ష ప్రచండతను నన్నయ 'కురిసెఁ బ్రచండవృష్టి' అను పద్యమున చక్కగా వర్ణించెను. సౌగంధికాపహారకార్థ మరుగుచు భీముడు జలధర ద్విరద తతులచే ఆవరింపబడియున్న గంధమాదన శృంగములను దిలకించి ఆశ్చర్యపడుట నన్నయ సాలంకారముగా వర్ణించెను.

'ఆషాఢస్య ప్రథమదివసే మేఘుమాశ్లిష్టసానుం
వప్రక్రీడా పరిణత గజప్రేక్షణీయం దదర్శ'

అన్న కాళిదాసుని వాక్యము చిత్తమున మెఱసెను గాబోలు. నన్నయ ఆదృశ్యము నిట్లు వర్ణించెను—

వారిధారల, ననివారిత నిర్గళ
దానధారలఁ దటిదామములను
దశనధామంబుల, నశని మోషంబుల
మోర బృంహిత బృహద్ఘోషణముల
నివి ఘన బృందంబు లివి గజయూథంబు
లని విచారింపంగ నక్కజంబు
లై లలిలోత్తుంగ శైల శృంగంబులఁ
ద్రిమ్మరు జలధర ద్విరదతతుల

విస్మయంబుత్తోడ వీక్షించుచుం జని
రజతగిరి సమీప రమ్యభూమి
నక్కబేరు వనమునందు సౌగంధిక
కమలవనముఁ గనియె ఘన భుజుండు

కవిలోక ప్రసిద్ధమైన జలధరద్విరద సాదృశ్యమునకు నన్నయ చక్కని రూపకల్పనము చేసెను. కాళిదాసుని శ్లోకమున మేఘము ప్రకృతము, గజము అప్రకృతము. ఇచ్చట రెండును ప్రకృతములే, రెండును ప్రత్యక్షములే. భిన్నము లయ్యు అభిన్నములుగా నగబడి విస్మయజనకము లగుచున్నవి. విస్మయజనకమైన

సాదృశ్యము సాధించుటకు నన్నయ జలధర, ద్విరద శబ్దములను గ్రహించి సమాన ధర్మములను సమగ్రముగా రూపించెను ఈ వర్ణనమున నన్నయ అతికాళిదాసమైన చాతుర్యమును ప్రదర్శించెనా యనిపించుచున్నది.

రుచిరార్థ సూక్తులు

వేదశాస్త్రార్థముల ఉపబృంహణము వలననే పాండవుల ఇతిహాసమునకు పంచమవేదత్వమహత్త్వము సిద్ధించినది. వేదార్థములు శాస్త్రార్థములు పాండవుల ఇతిహాసమున యథావకాశము సూత్రప్రాయములైన వాక్యములలో పొదుగబడియున్నవి. భారతము 'లోకాగమన్యాయైకాంతగృహము' అని చెప్పిన నన్నయ ఆ న్యాయములను ప్రతిపాదించు వాక్యములను సూక్తులు అని వ్యవహరించినట్లు తోచును. వేదశాస్త్రములందు వాచ్యార్థ ప్రధానమై శుష్కములుగా నుండు సూక్తులు పురాణేతిహాసములందు లక్ష్యార్థ ప్రధానములై కొంత చమత్కారము సంతరించుకొన్నవి. కాంతా సమ్మితములైన కావ్యములందవియే రుచిరార్థములై హృదయంగమములగును. భారతము శాస్త్రము, ఇతిహాసము, కావ్యమునని చెప్పబడినది. కనుక అందలి సూక్తులు ఈ త్రివిధలక్షణములుగలవై యుండును. ఈ సూక్తులకు అలంకరించియు, అలంకారములుగా రూపొందించియు వానిని నన్నయ రుచిరార్థవంతములుగా తీర్చుటకు యత్నించెను.

"క్రోధంబు పాపంబు" అనుట శాస్త్రోక్తికి. 'క్రోధంబుననచేసి యుగుఁజువ్వె ధర్మకామార్థహాని' అనుట ఇతిహాసోక్తి. "క్రుద్ధుండు గురునైన నిందించు" అనుట కావ్యభంగి.

'క్రోధంబు పాపంబు' అనుట ప్రభుసమ్మితమైన శాసనము. 'క్రోధంబునన చేసియగుఁజువ్వె ధర్మకామార్థహావి' యనుట మిత్రసమ్మితమైన హితబోధ. భీముని క్రోధము పాండవులకు సర్వవిధముల హానికరమని బోధించుట. క్రుద్ధుండు గురువైన నిందించు ననుట కాంతాసమ్మితమైన ఉపదేశము. కౌరవులపట్ల క్రోధావేశము పూని భీముడు గురువైన ధర్మజుని క్షమాగుణమును అధిక్షేపించుచున్నాడని వ్యంగ్యముగా మందలించుట.

'ఎఱుకగలమహాత్ముఁ డెఱుక యన్నలముల
నార్పుక్రోధమను మహాసులంబు'

అనుట పరమార్థమును అలంకరించి రమణీయము చేయుట.

'ధర్మదూరులై న ధార్తరాష్ట్రులయందు
ధర్మవేమి సేయు ధరణినాథ
నికృతి పరులయందు నికృతి సేయనివారు
వారి నికృతిఁజేసి వధ్యులంద్రు,'

అనుట ఇతిహాసార్థమును సమర్థించుటకై ఒక పరమార్థమును అర్థాంతరన్యాసముగా రూపించి హృద్యము చేయుట.

బలముగలవానిఁ బలువురు బలవిహీను
లొక్కరాపై కూడి నిర్జింతు రుత్సహించి
మథువుఁ గొన నుత్సహించిన మనుజుఁ బట్టి
కుట్టి నిర్జించు మధుకర కులమునట్లు.

అనుట నగ్నమైన లోకన్యాయమును ప్రకృతిసిద్ధమైన ఉపమానముచే నలంకరించి రుచిరము చేయుట.

'విలాసినుల సహాలాపసహాసన సహాయానములు బంధసమములుగావే'

అనుట కథాపరమార్థమును పిండి సారవంతమైన అర్థాంతరన్యాసముగా రూపొందించి రుచిరము గావించుట.

'పురుషులందు దోషపుంజంబు గలిగిన
నెటిఁగి యెద సహించునేని భార్య
పురుషునం దభిష్టభోగంబు దేహాంత
రంబునందు ధర్మరతియుఁ బడయు'

అన్నీ ఆగమన్యాయము ప్రకరణబలమున నలుడు ధ్వనిసుందరముగా దమయంతికి బంపిన సందేశమగుచున్నది.

'అఖిల దుఃఖరోగార్తు న కౌషధంబు సురుచిరంబుగ భార్యయ చూవె'

అన్న లోకన్యాయము రూపకాలంకృతమై రుచిరమగుటయేకాక నల కథా పర్యవసాన వ్యంజకమై ఆస్వాద్యమైన కావ్యమగుచున్నది.

నన్నయ రచనయందుగల పెక్కుసూక్తులు ప్రకరణ వశమున ఎట్లు రుచిరార్థములై హృదయంగమము లగుచున్నవో అనుశీలించి గుర్తింపవచ్చును.

అక్షర రమ్యత

పదసంఘటనారూపమైనరీతి, వర్ణసంఘటనారూపమైన వృత్తి, పదముల అన్యోన్యమైత్రీరూపమైనశయ్య, పదపరివృత్త్య సహిష్ణుతారూపమైన పాకము— ఈ సర్వమును నన్నయ అక్షరరమ్యత అనెను. నన్నయభారతమున సర్వశ్రోత్ర జన భోగ్యమైన లక్షణమిది. శబ్దార్థములు కావ్యశరీర మన్నప్పుడు శబ్దము ఇంద్రియ గ్రాహ్యమైన స్థూలశరీరమనియు, అర్థము బుద్ధిగ్రాహ్యమైన సూక్ష్మశరీర మనియు గ్రహింపవలెను. ఇంద్రియ గ్రాహ్యమైన శబ్దశరీరము సర్వజన సంవేద్యము. అర్థము బుద్ధిమంతులు మాత్రమే గ్రహింపదగినది. ఎంతరుచిరమైన యర్థమైనను శ్రుతిరమ్యమైన శబ్దముచే ప్రతిపాదింప బడినపుడే బుద్ధినిచేరగలదు. కనుకనే రమణీయమైన అర్థమును ప్రతిపాదించు రమణీయమైన శబ్దమే కావ్యమని జగన్నాథపండితరాయలు ఆంధ్రుల కావ్యమతమును ప్రతిపాదించెను.

నన్నయనాటికి దేశమున వామనుని రీతిప్రస్థానము సుప్రతిష్ఠితమై యున్నది. ఆనందవర్ధనుని ధ్వనిప్రస్థానము కూడ నన్నయకు సుపరిచితమే అయి యుండును. ఆయన శబ్దశాసనత, సంహితాధ్యాసత, అక్షరరమ్యతా ప్రవణత, పరికించినచో నన్నయ రీతిమార్గమునే అతిశయముగా ఆదరించెననిపించును. కథాకవితార్థయుక్తిని చూచినచో ధ్వనిమార్గమున వస్తుధ్వనియందే యెక్కువ దృష్టి యుంచినట్లు తోచును.

నన్నయరీతి వైదర్భి. సమగ్రగుణ గుంఫితమైన వైదర్భి సర్వరస నిర్వాహకి, పృథక్పదమైనను, సమాసభూయిష్ఠమైనను, ఆయన రచన రమ్యతా ధర్మమును వీడదు. రమ్యతలు నానా ప్రకారములు. ఉపనాగరిక, పరుష, కోమల ఇత్యాది వృత్తిభేదముల సంక్రమణముచే ఆయనరీతి నస్తురసభావాది వ్యంజనా సమర్థములైన ఛాయాభేదములను పొందుచుండును.

'అలఘు తపస్సమాధి నియతాత్మలకున్ బహుపుణ్య లోకకాం
క్షులకు, విశుద్ధమానసులకున్ సతతంబును సంశ్రయంబవై
లలిత నిలింప దంపతి విలాస విహార మహోత్సవంబులున్
గలిగి వెలుంగు రత్నమయ కందరసుందర ! మందరాచలా !'

ఇందలి మాధుర్యము కృతజ్ఞతారూపమైన ప్రీతిని వ్యంజించునది. పూర్వార్ధమున తపోధనుల స్మరణచే ఓజోలేశసంక్రమణము ఉత్తరార్ధమున నిలింపదంపతి విలాసస్మరణచే శుద్ధమాధుర్యము.

'అతుల రణాంతరంబున నిరంతర మత్పటుబాణ పాతితో
చ్ఛిత దనుజాంగ నిర్గళ దసృగ్జలధారలు సూడనొప్పె, నా
తత గిరిశృంగ సంగ దళిత ప్రచలజ్జలవాహజాల సం
తత గళదంబుధారల విధంబున నంబరమెల్ల గప్పుచున్'

అర్జునుడు నివాత కవచులను సంహరించివచ్చి తన వీరకృత్యమును ధర్మజాదులకు వర్ణించి చెప్పుచున్నాడు. ఈ పద్యము వీరరస వ్యంజకముగాలేదు. ఉండనక్కర లేదు. ప్రీతిపూర్వకమైన అద్భుతమును వ్యంజించుట ఈపద్యమునకు కర్తవ్యము. కనుక ఓజోమాధుర్యములు క్షీరనీరన్యాయమున ఈపద్యమున కలసియున్నవి.

'అవనీనాథ! తదాహవాంతరమునం దస్మత్కరాకృష్ట శా
ర్ఙ్గవినిర్ముక్త నిశాతసాయక శతాగ్రచ్ఛిన్నమై దైత్యదా
నవదేహప్రకరంబు వాత విధుతార్ణః పూర్ణసంఘూర్ణితా
ర్ణవ కుక్షింబరియెం గపిప్రవర సైన్యక్షిప్త శైలాకృతిన్'

ఇది శ్రీకృష్ణుడు తాను సాల్వుని సంహరించిన వృత్తాంతమును ధర్మజాదులకు వర్ణించి చెప్పుసందర్భములోనిది. తన పరోక్షమున ద్వారకను ముట్టడించి వసుదేవుని చెరబట్టి అవమానించిన రాక్షసాంశ సంభూతుడైన సాల్వునిపై తాను విజృంభించిన తెఱగును శ్రీకృష్ణుడు వర్ణించుచున్నాడు. ఇదియు భూతార్థస్మరణ పూర్వకమైన వర్ణనమే. రౌద్రమిశ్రితమైన అద్భుతమును వ్యంజించుట దీని కర్తవ్యము. అందుకు తగినట్లే ఓజస్సున మాధుర్యసంచారము ఈపద్యమున స్పష్టపడుచున్నది.

'ప్రణుత క్షత్త్రగుణంబు, విక్రమము, దర్పంబేర్పడన్ విక్రమ
క్షణదానం బొనరింపుమీ క్షణమ విఖ్యాతంబుగా సంగరాం
గణ మధ్యంబున జేయు మర్జున బృహద్గాండీవ నిర్ముక్తమా
ర్గణ ధారావళి ధార్తరాష్ట్ర కదళీకాంతార విచ్ఛేదమున్'

ఇది భీమసేనోక్తి. శత్రుసంహారోన్ముఖమైన ఈ యుత్సాహము పరుషమైనది. రేఫ, రేఫసంయోగావృత్తిచే అది సుష్ఠుగా నిర్వహింపబడుచున్నది.

'దేవర్షి ద్యుచరాహిలోకములు, నాదిత్యాశ్వినీ లోకముల్
దేవాధీశ్వరు జూచితిన్, మఱియు నద్దేవేంద్రు నొద్దన్ సగాం
డీవోద్దామ మహాభుజార్గళు గిరీటిన్ సవ్యసాచిన్, జయ
శ్రీ విభ్రాజితు బార్థు జూచితి; జగత్సేవ్యా! మునీంద్రోత్తమా!'

ఇది భయభక్తిభావ సంక్రాంతమైన అద్భుతరసము. ఈ వృత్తము, ఈ యక్షర వృత్తి ధర్మజునకు స్వాభావికములు కావు. అచింతితోపనతమైన అతిలోకవస్తు దర్శనమున ఆయన పొందిన పరమాశ్చర్యము ఈ పద్యము.

'అశనాశా వివృతాస్య గహ్వరఁ గృతాంతాకారు, నిశ్వాసధూ
మశిఖాధూసరితోగ్ర దుర్గతరు గుల్మవ్రాతు, హారిద్రవ
ర్ణశరీరున్, భృశరూక్ష దర్శను మహానాగప్రభుంగాంచె న
ర్ధశశాంకద్యుతిహాసిదారుణ చతుర్దంష్ట్రున్ జగత్త్రాసకున్'.

మృగయా పరిశ్రాంతుండైన భీమసేనునకు కనబడిన అజగరస్వరూపము. 'ఇది ప్రకృతి సర్పంబుగా దెద్దియేనియు నొక్క యద్భుతరూపంబు' అని భీమసేను డాశ్చర్యపడునంతటి మహానాగప్రభునిమూర్తి ఈ మత్తేభపాదములలో పట్టుబడి ఊష్మమహాప్రాణాక్షరములలో బుసలు కొట్టుచున్నది.

నన్నయ రచనమున అక్షరములు పదములు పదబంధములు పరివృత్తి సహింపనంతటి నిబిడమైన మైత్రితో పొందియుండును. అక్షరఘటనము పదఘటనము పరిపక్వములై శ్రోతను కావ్యార్థగ్రహణోన్ముఖుని చేయుటయందు ఆయన గద్యపద్యములు సమ్మోహన మంత్రములవలె పనిచేయును.

శబ్ద శాసనత

నన్నయ తాను విపులశబ్దశాసనుడనని చెప్పికొనెను. ఆయన శాసనమునకు లోబడిన శబ్దములలో తెలుగుశబ్దములకంటె సంస్కృత శబ్దములే అధికసంఖ్యాకములైనట్లు కనబడును. ఆయన రచనలో సంస్కృత శబ్దములే అధికము. కారకములు, వాక్యనిర్మాణములు కూడ కొంతవఱకు సాంస్కృతికములే.

ఆయన తఱుచుగా ప్రయోగించు సంస్కృతపదములు—మహా, బృహత్, పృథు, భూరి, నిరంతర, అనంత, అనవరత, అపూర్వ, అద్భుత, పరమ, పరమార్థము, ప్రభులు, తరప్ ప్రత్యయము—ఇవి అలంకారము కాని అతిశయోక్తిపట్ల ఆయనకుగల రుచిని పట్టియిచ్చును. ధర్మశబ్దమును సమాసమున ఆకారాంతముగను, వ్యస్తముగా ఉకారాంతముగను ప్రయోగించుట ఆయన కిష్టము. నీ తదర్థము, నీకృతమున, ప్రస్తవమున—ఆయన ప్రయోగించు విలక్షణ పదములు.

తిక్కనాదుల రచనలో కనబడని కారకవిశేషములు కొన్ని నన్నయ రచనలో తటచు కనబడును. ఇవి సంస్కృత భాషాసాహిత్యముల ప్రభావమున ఆయన రచనలో ప్రవేశించి యుండును. 'విదితముగ నిన్నుఁ జేయించెదఁ గ్రతువు'—'నీచేతఁ జేయించెద' అను తృతీయకు ద్వితీయ. 'నీవు మాయందుఁ గుడిచి;—దేశవాచియయిన వ్యస్తపదముగా 'అందు' ప్రయోగింపబడినది. 'ఎఱుకని యెఱుఁగక నీకున్ మీఱకువ నెదిరితిని'—నిన్ను నెదిరితిని అను ద్వితీయకు షష్ఠి. 'చానికి వర్ణించి'—వర్ణించి చెప్పి లేక వివరించి యని యభిప్రాయము. 'నన్నుఁ బ్రదక్షిణంబు నిత్యమ్మ్మును జేయక'—నాకు అను షష్టికి బదులు ద్వితీయ. 'కన్ను మూయదు నాకున్'— మూతపడదు అని అర్థము. 'పల్వుర నిర్వహించె' భరించెను పోషించెను అనుటకు. 'ఋతుపర్ణునందుఁ బ్రకాశింప'—ఋతుపర్ణుని సభయందు ప్రకటింప అనుటకు, 'ఒక్క మడువున నీళ్ళాడుచున్న'—స్నానమాడుచున్న అనుటకు.

ఏకదేశాన్వయ సమాసములు సంస్కృతమున తఱుచు. నన్నయయు కొన్ని ప్రయోగించెను. 'ప్రధానవరులందు సమర్పిత రాజ్యభారుడై,' 'హరుచేత సంప్రాప్త వరుడయ్యె,' 'పృథుభుజునకుఁ గృతప్రణాముండయ్యెన్,' 'భీష్మాదుల యందధిగతాశ్రయంబయ్యె' మున్నగునవి. 'రథంబుల షష్టిసహస్రకంబుతో' అనుట సంస్కృత పద్ధతియే.

భుజవిక్రమ ప్రకటీ కృతుల్, కలిసంప్రాప్తుడనై, ఉదిత క్రోధుండ వగుము మున్నగు ప్రయోగములుకూడ విలక్షణములు.

'అన్నల భూపాలుడు పోయిన వలనొండెఱుఁగునొకో'—అన్నచోట ఒండు శబ్దమునకు ఒకవేళ యను నర్థముగా కనబడుచున్నది.

'ఎఱలేని కఱకుఁదెఱుకఁ బేక్షించెఁ గాదనక తనకు నాయు వల్పమైన'—ఇచ్చట 'కాదు' శబ్దము అనుచితము, పాపము అను నర్థమున ప్రయోగింప బడినది.

'కాదనకిట్టి పాటి యపకారము'—అని ఆదిపర్వమునకూడ కలదు.

'నైషధేశ్వరుఁడు' నైషధుడు అనురాజు అను నర్థమునను, 'ధౌమ్యరోమశ ప్రభృతి వరులు' ధౌమ్యుడు రోమశుడు మొదలుగాగల శ్రేష్ఠులు అను నర్థమునను నిలక్షణముగా ప్రయోగింపబడినవి.

'దానశీలంబు లెందేనిఁ గాననగు నట్టివాఁడు బ్రాహ్మణుఁడు' ఇచట ఎందేని అన్న శబ్దము సంస్కృతమున యస్మిన్ అను నర్థమున ప్రయుక్తమగు యత్ర శబ్దము వంటిది.

పలికి రంతఁదరుణీ పాంచాలి బీభత్సు
కడకు నరుగుదెంచి కమలనేత్ర
యరిజయార్థ మరుగు నాతని యుత్సాహ
మెఱిగి యిట్టులయ్యె నిందువదన.

కమలనేత్ర, ఇందువదన అను విశేషణములు పాంచాలి అను విశేష్యమునకు ముందుండ వలసినవి తరువాత ఉన్నవి. ఇది సంస్కృత వాక్య నిర్మాణపద్ధతి. తనవద్దకు వచ్చి స్తుతించుచున్న దేవతలను అగస్త్యుడు 'ఏమి వచ్చితిరి' అని ప్రశ్నించుటయు, యుద్ధరంగమునుండి తన రథమును తప్పించి తెచ్చిన సారథితో ప్రద్యుమ్నుడు 'అక్రూరాదులును నేమియని నగరె సభన్' అని మందలించుటయు చక్కని తెనుగుజాతీయములు.

ఛందస్సు

ఆరణ్యపర్వమున నన్నయ రచించిన గద్యపద్యములు మొత్తము 1199. వాని వివరములు.

గద్యములు	519	కందములు	388
సీసములు	76	తేటగీతులు	75
చంపకములు	59	ఆటవెలదులు	84
ఉత్పలములు	39	మధ్యాక్కరలు	23
మత్తేభములు	10	శార్దూలములు	2
లయగ్రాహి	1	మత్తకోకిలము	10
తరలము	4	తరునోజ	2
మణిభూషణము	1	స్వాగతము	1
ఉత్సాహము	1	కవిరాజవిరాజితము	1
పృథ్వి	1	వసంతతిలకము	1
దండకము	1		

గద్యముతో కలిపి మొత్తము 21 భేదములు. వీనిలో విశేషవృత్తభేదములు, దండకము గలవు. నన్నయరచనలో ఈ పర్వభాగము కొంచెము తక్కువగా మూడవవంతున్నది. కాని ఆయన రచించిన మొత్తము వృత్తములలో, కందములలో మూడవవంతు ఈ పర్వమున కానరావు. మధ్యాక్కరలు, తేటగీతులు, ఆటవెలదులు, మూడవవంతును మించినవి. దేశీయములైన ఉపజాతులపై ఆయనదృష్టి యెక్కువగా పడెననవచ్చును. తీర్థయాత్రావర్ణనమున గద్యములు ఎక్కువగా వాడుటచే గద్యసంఖ్యయు కొంచెము పెరిగినది.

యతి, ప్రాసయతి విన్యాసవైచిత్రిచే పదునాఱు విధములయిన సీసపద్య భేదములను నన్నయ భావించెను. వానిలో 13 రకములు మాత్రమే ఆయన వాడెను. ఆరణ్యపర్వమున మాత్రము 10 రకములే వాడెను. మొత్తము 76 సీసములలో 55 పూర్తిగా సాధారణయతి పాటించినవి. పూర్తిగా ప్రాసయతి పాటించినవి 6. ఇట్టివి ఆయన రచనలో మొత్తము 33 కలవు. దీనివలన ఆయన ఆరణ్యపర్వమున సీసపద్యముల యలంకరణము తగ్గించెనని ఊహింపదగును. పద్యరచన, శైలి చక్కని పాకమున బడినవి గనుక అలంకరించుట అనవసరమని యెంచెను గాబోలు.

తేటగీతులను, ఆటవెలదులను రచించుటయందు గూడ నన్నయ యతి, ప్రాసయతి నియమము పాటించెను. ఈ పర్వమున వీని విషయమునందును ప్రాసయతి తగ్గించెను. ఈ పర్వమందలి 76 సీసములలో 70 సీసముల క్రింద ఆటవెలదులే వ్రాసెను. ప్రాసనియమముతో ఒక యాటవెలది వ్రాసెను. లాక్షణికు లట్టిదానిని పవడగీతి యనిరి.

నన్నయ ఛందోనిర్మాణ, అలంకరణ, వినియోగనైపుణిని గురించి 'ఛందఃశిల్పము' అనుగ్రంథమున విస్తరించి వ్రాసియుంటిని గనుక పునరుక్తి యని యిట విరమించితిని.

హాస్య రసికత

పరమనైష్ఠికుడైన నన్నయకు పరిహాసము రుచింపదనిపించును, కాని ఆయనయందు మృదువైన హాస్యము కలదు. అది యన్యభావములతో మిశ్రితమై తథ్యమిథ్యామధ్యస్థితిలో నుండును.

భీముడు కిమ్మీరుని జంపి చచ్చిన వానితో నిట్లనును.

"బక హిడింబులు హతులైన బనివిపనివి
యటచి శోకింపగానక యమపురమున
కరిగితక్కట రాక్షస" యనుచుదెరువు
వాయబావని తత్కళేబరమువైచె"

కళేబరమును విసరివైచుచు 'చచ్చినవారికొరకు ఏడ్చుటకును అవకాశము లేకుండ నీపును చచ్చితివి పాపము' అనుటలో కృతార్థమైన క్రోధముయొక్క క్రూరహాసము తొంగిచూచును. 'అక్కట' యనుట శోకభిన్నమైన హాస్యమును వ్యంజించుచున్నది.

దుర్బలబలీవర్దములను జనులు బాధించుచుండ చూడజాలక గోమాతయేడ్చుచు నింద్రునికడ కరుగగా ఆయన 'ఇట్లేల రోదనాకులితలోచనయయి యున్నదానవు? ఎల్లవారికి లగ్గకదా?" యని ప్రశ్నించును. కష్టమునుగూర్చి యడుగవలసిన యింద్రుడు క్షేమమును గూర్చి ప్రశ్నింపగా గోమాత యిట్లన్నది.

'నీ వజ్రము రక్షింపగ
నావారికి దక్కు ద్రిభువనంబుల గల భూ
తావలి కెల్లను సేమమ,
దేవేంద్ర! జగత్రయ ప్రదీప మహాత్మా!'

ఇంద్రుని ప్రశ్నయందు అనౌచిత్యము తోచినగోమాతకు శోకములో హాసము అంకురించినది. 'నావారికిదక్క యెల్లవారికి సేమమే యని దీనహాసమును ప్రకటించినది.

సగరుని తపస్సునకుమెచ్చి ఈశ్వరుడాతనికి అరువదివేవురు పుత్రులు పుట్టుదురని వరమిచ్చును. కొంతకాలమున కాతనిభార్య • వైదర్భి గర్భవతియై యొక్క అలాబూఫలమును ప్రసవించును. దానిని పారవేయబోవుచు సగరాదులు ఇట్లనుకొందురు—

'వరదుడైన యీశువరమున నిదియొక్క
వదరుపుట్టె నెట్టివరమో...'

ఆకాళంగజనితమైన విరక్తహాసము 'ఎట్టివరమో' అన్నమాట నుండి ఉట్టిపడుచున్నది. క్రోధశోకములు హాస్యవిరోధులు. అట్టవానినుండి నన్నయ పుట్టించిన ఈ హాస్యములు విచిత్రములైన హాస్యాభాసములు.

రసము

మహాభారతము శాంతరసప్రధానమైనదని ఆనందవర్ధనాచార్యుల వారు చెప్పిరి. ఇది ఎంత శాస్త్రసమ్మతమైనను అనుభవరూఢమైనదిగా కనబడదు. శాంత రసప్రధాన మనుటకంటె శాంతరస పర్యయసాయి యనుట యుచితమనిపించును. సంస్కృతభారతము శాస్త్రకావ్యమన్న ఆనందవర్ధనులు దానిని శాంతరసప్రధాన ముగా భావింపవచ్చును. కాని తెలుగుభారతము ఇతిహాసకావ్యము. ఇది ధర్మవీర ప్రధానము. శాంతరసము మోక్షఫలకమని అనందవర్ధనులు. ధర్మజాదులు స్వర్గా రోహణము చేసిరేకాని మోక్షముపొందలేదు. కనుక తెనుగుభారతమున స్వర్గఫల మైన ధర్మవీరమే ప్రధానరసమని భావించుటయుచితమే. కర్మఫల సంబంధ నిరూపకమైన ఇతిహాసమున చిత్రింపబడిన కర్మ వేదవిహితమైనది. దానిఫలము స్వర్గము. సశరీరముగ దానిని పొందిన ధర్మరాజు ధర్మవీరుడు. అతడు నాయకు డైన కావ్యమున ప్రాధాన్యము ధర్మవీరమునకే.

ధర్మనిష్ఠుడై పుణ్యకర్మలు, పుణ్యకథాశ్రవణము, పుణ్యతీర్థయాత్రలు మున్నగువానితో ధర్మరాజు కాలముగడపుటను చిత్రించు ఆరణ్యపర్వమున రసము ధర్మవీరమే యనుట యుచితము. దీనికిఅంగములుగా భీమునియొక్కయు అర్జునుని యొక్కయు యుద్ధవీరములు నిబంధింపబడినవి. పాండవులకు ప్రత్యక్షముగా సంబంధింపని సౌంభకాఖ్యానము యుద్ధవీరప్రధానము. ఋషిమహత్వ బోధకము లైన కథలందు రసము నివక్షింపబడదు.

నన్నయ అభినివేశముతో రచించిన నలోపాఖ్యాన మున్నది. నలదమ యంతుల దాంపత్యప్రణయము ఇందుముఖ్యము. స్వయంవరము వలకు అయోగ శృంగారము. పునఃస్వయంవరము వలకు వియోగశృంగారము. ఈ రెంటికి నడుమ దమయంతి ఎంత శోకించినను అది నలాలంబనకమైన రతికి అంగమే. నలుని శోకమును అట్టిదే.

'వనజాయతాక్షి! కతిపయదినములలోఁ జూడఁ గాంతు తివిరి నలుని' అని చెప్పి తాపసులు అంతర్హితులైన యనంతరము దమయంతియందు నలుని జీవిత మును గూర్చిన శంక పొడముటకు ఇసుమంతయు అవకాశములేదు. నలుడును 'అశనాపేక్షఁబడుచున్న యుగ్ర మృగంబుల యుదరంబులో నున్నదానవే' అను కొన్నప్పుడు మాత్రమే ఆతని చిత్తమున దమయంతీ జీవితశంక స్ఫురించును.

'నీ తల్లి దండ్రులొద్ద ధృతినున్నదానవే' అన్న యూహ కలిగినప్పుడు దమయంతీ జీవితశంక నలుని చిత్తమునుండి తొలగిపోయినట్లే. ఆతడు ఉత్కటముగా పొందిన శోకమంతయు రత్యంగమే. 'భార్యాసంగమంబును నెప్పటి రాజ్య విభవంబునునగు' నని కర్కోటకుడు చెప్పిన పిదప నలునకు దమయంతి భద్రతను గూర్చిన చింత యవసరము లేదు.

విభవనాశనమువల్ల కలుగు శోకము నలునియందు ఉత్కటముగా వర్ణింపబడ లేదు. ఏ కొంచెమో ఉన్నను అది దమయంతీ వియోగ దుఃఖమునకు పోషకము మాత్రమే యగును. విభవనాశనము ప్రవాసమునకు కారణమై విప్రలంభమునకు రూపము కల్పించినది. కాగా నలోపాఖ్యానమున పోషింపబడినది కరుణ విప్రలంభ శృంగారము.

నన్నయ్య రసపోషణమున దక్షుడేయైనను కథను ఆస్వాద్యము చేయునంత వఱకే రసమును పోషించుట ఆయన నియమముగా పెట్టుకొనెనేమో యనిపించును. రసమునకు ప్రాధాన్యము వచ్చినచో కథకు గుణభావము పట్టును. తత్పరమార్థమైన వ్యుత్పత్తికి ఆనుషంగికత్వము పట్టును, కృష్ణద్వైపాయనుడు నిబంధించి నిరూపించిన పరమార్థము తెల్లమగునట్లు ధీయుక్తితో మహాభారత సంహితను ఆంధ్రమున వెలయింప బూనిన నన్నయ రసమునకు దీప్తి కలిగించునని భావింపజాలము. ఉదాత్త రసాన్విత కావ్యనాటక క్రమములు పెక్కు చూచిన రాజరాజు భారతము ప్రాయుమన్నది వ్యాసుడు నిరూపించిన పరమార్థమును వినుటకుగాని రసానందము కొఱకు కాదుగదా! ఆయనయం దను రక్తుడై ఆయన హృదయ మెఱింగిన నన్నయ రాజురాజు నభిలాష ననుసరించియే భారతము రచించెననుట యుచితము.

రాజురాజు నభిలాషయు, నన్నయ కృషియు ఆనాడే ఫలోన్ముఖములయ్యెను. తాము కలలుగన్న—

'అనఘమై శిష్టాగ్రహార భూయిష్ఠమై
ధరణీసురోత్తమాధ్వరవిధాన
పుణ్యసమృద్ధమై పొలుచు వేంగీదేశ'

విభవంబు కన్నులార తిలకించి ఆ పుణ్యాత్ములు ధన్యాత్ములైరి. చారుతరములైన శారద రాత్రులలో, ఉజ్జ్వలలసత్తర తారకహార పంక్తులలో రెండు తారకలై

ఆ మహనీయుల పవిత్రాత్మలు తమ వేంగీదేశమును కలకాలము కన్నులు చల్లగా చూచుకొనుచుండును. వికసన్నవకైరవ గంధబంధురోదార సమీరమువలె, కర్పూర పరాగ పాండు రుచిపూరమువలె వారి మధురకీర్తి అనంతకాలము ఆంధ్రజాతిని ఆహ్లాదపరవశము కావింపగలదు.

* * *

భవ్యచరిత్రుఁ, డాపస్తంబసూత్రుండు,
శ్రీ వత్సగోత్రుండు, శివపదాబ్జ
సంతతధ్యాన సంసక్తచిత్తుఁడు, సూర
నార్యనకును బోతమాంబికకును
నందనుండిలఁ బాకనాటిలో నీలకం
తేశ్వరస్థానమై యెసకమెనఁగు
గుడ్లూరు నెలవుగ గుణగరిష్ఠత నొప్పు
ధన్యుఁడు, ధర్మైకతత్పరాత్మఁ
డెల్లనార్యుండు సకలలోకైకవిదితుఁ
డయిన నన్నయభట్ట మహాకవీంద్రు
సరససారస్వతాంశ ప్రశస్తి దన్నుఁ
జెందుటయు, సాధుజనహర్ష సిద్ధిఁగోరి
ధీరవిచారుఁడు తక్కవి
తారీతియుఁ గొంత దోఁపఁ దద్రచనయ కా
నారణ్యపర్వశేషము
పూరించెఁ గవీంద్ర కర్ణపుటపేయముగాఁ.

నన్నయ యనంతరము రెండు వందల సంవత్సరములు భారత రచనము అట్లే నిలిచియుండెను. కవులు పుట్టిరి. కావ్యములు వ్రాసిరి. కాని భారతాంధ్రీకరణమును కొనసాగించు బాధ్యత ఎవ్వరును చేపట్టరైరి. పంచమ వేదమున వ్రేలు పెట్టుటకు తగిన ఆత్మప్రత్యయము లేమియే అందుకు కారణమై యుండును.

ఎట్టకేలకు తిక్కన పుట్టెను. భారతము కడముట్ట చెప్పవలెనని సంకల్పించెను. కాని ఆరణ్యపర్వశేషమును ముట్టక విరాటపర్వముతో మొదలుపెట్టెను.

'తుదిముట్టన్ రచియించుటొప్పు బుధసంతోషంబు నిండారగన్' అని 'భారతామృతముకర్ణపుటంబుల నారఁగ్రోలి యాంధ్రావళి మోదముంబొరయునట్లుగ' భారతము రచియింతుననన్న తిక్కన సోమయాజి ఆరణ్యపర్వశేషము నేల విడిచిపెట్టెనో! ఏల విడిచిపెట్టితిరని యడిగినవారికి ఏమి సమాధానము చెప్పెనో! ఆయనకును ఆ నాటివారికిని తెలిసియేయుండును. ఆయన శిష్యుడైనమారనకు కూడ తెలిసి యుండవలెను. 'ఆది దొడంగి మూఁడు కృతు లాంధ్రకవిత్వ విశారదుండు విద్యాదయితుండొనర్చె మహితాత్ముఁడు నన్నయభట్టు దక్షతన్' అని తిక్కన యనెను. ఆయన అన్నట్లే 'భారతసంహితన్ మునుద్రిపర్వము లెవ్వఁడొనర్చె నట్టి విద్యారమణీయు నాంధ్ర కవితాగురు నన్నయభట్టుఁ గొల్చెదన్' అని మారనయు ననెను.

క్రీ.శ. 1320 ప్రాంతమున మారన మార్కండేయపురాణము వ్రాయునాటికి భారతకవులు ఇద్దరే— నన్నయ, తిక్కన. ఎఱ్ఱయసంగతి మారనకు తెలియదు. 1380 ప్రాంతముల విక్రమార్క చరిత్రము వ్రాసిన జక్కన నాటికి భారతకవులు ముగ్గురు. 'ఈత్రయి దాఁ బ్రబంధపరమేశ్వరుఁడై విరచించె శబ్దవైచిత్రి నరణ్యపర్వమున శేషము' అని ఎఱ్ఱయ ప్రబంధ పరమేశ్వరుఁడయి అరణ్యపర్వశేషము విరచించి భారతకవిత్రయిలో చేరినట్లు జక్కన చెప్పుచున్నాఁడు.

'ఉన్నత సంస్కృతాది చతురోక్తిపథంబులఁ గావ్యకర్తవై
యెన్నికమైఁ బ్రబంధపరమేశుఁడనంగ నరణ్యపర్వశే
షోన్నయ మాంధ్రభాష సుజనోత్సవ మొప్పఁగ నిర్వహించి తా
నన్నయభట్ట తిక్కకవినాథుల కెక్కిన భక్తి పెంపునన్.'

అని నృసింహపురాణములో తన తాత తన్ను ప్రశంసించినట్లు ఎఱ్ఱయ చెప్పికొనెను. ఉన్నయమనగా ఉద్ధరించుటయనియు, తిక్కనమారనల నాటికి సమగ్రముగా నుండిన అరణ్యపర్వమున శిథిలములైన భాగములను మాత్రమే ఎఱ్ఱయ పూరించెననియు కొందఅందురు. కాని ఉన్నయశబ్దము కావ్యశాస్త్రములలో కల్పించుట అనునర్థమున వాడబడుచున్నది. ఆనందవర్ధనాచార్యులవారి ప్రయోగము.

'ఇతివృత్తవశాయాతాం త్యక్త్వాననుగుణాం స్థితిం
ఉత్ప్రేక్ష్యా ప్యంతరాభీష్ట రసోచిత కథోన్నయః.'

ఇచట ఉన్నయమనగా ప్రతిభాబలమున భావించి ఉత్పాదించుటయని అర్థము. ఎఱ్ఱన అరణ్యపర్వమును ఉన్నయముచేసెననగా నన్నయయైనచో ఎట్లు రచించునో తన

ప్రతిభాబలముచే భావించి ఆ రీతిగా రచించెనని యర్థము. 'ప్రతిభతో నారణ్య పర్వశేషము(జెప్పె(గవులకు(జెవులపండువులుగా(గ' అని చెదలువాడ మల్లయ చెప్పినమాటయు, నంతకుముందే 'విరచించె శబ్దవైచిత్రి నరణ్యపర్వమున శేషము' అని జక్కన చెప్పినమాటయు పరమార్థములు. అరణ్యపర్వశేషోన్నయము నిర్వహించి నందువల్లనే ఎఱ్ఱయకు 'ప్రబంధపరమేశ్వరు(డు' అను బిరుదము లభించినట్లు పలువురు చెప్పుచున్నారు. ఇదియు సత్యముగా కనపడదు. ఎఱ్ఱయకు శంభుదాసుడు అను బిరుదము కలదుగాని ప్రబంధపరమేశ్వరుడు అను బిరుదములేదు. ఆయన ప్రబంధరచనా ప్రావీణ్యమునుబట్టి అనాటివారు ఆయనను ప్రబంధపరమేశునిగా నెన్ని స్తుతించిరి. అది బిరుదమే యైనచో ఆయన గద్యలోగాని యితర గ్రంథములలోగాని దాని ప్రస క్తి ఉండవలెనుగదా? అది బిరుదము కాకపోవుట అట్లుండ అది ఆరణ్యపర్వశేషరచనవలన లభించెననుటయు సరికాదు. ఆయన కాలమునకు సన్నిహితోత్తరకాలమందేయుండిన జక్కన 'ఈత్రయి దా(బ్రబంధ పరమేశ్వరు(డై విరచించె శబ్దవైచిత్రి నరణ్యపర్వమున శేషము' అని ప్రబంధ పరమేశ్వరుడయిన యనంతరమే ఆరణ్యపర్వశేషము రచించెనని స్పష్టముగా చెప్పి యున్నాడు. 'సకల భాషాకవిత్వ విశారదు(డవు' అని హరివంశమున వేమారెడ్డిచే కొనియాడించుకొన్న ఎఱ్ఱన 'ఉన్నత సంస్కృతాది చతురోక్తిపథంబుల కావ్యకర్త' యైనాడు. నాటి రసజ్ఞులాయనను 'ఎన్నికమై ప్రబంధపరమేశు(డు' అనినారు. ఈ విధముగా ప్రతిష్ఠనార్జించిన పిమ్మటనే ఆయన 'ఆరణ్యపర్వశేషోన్నయ మాంధ్ర భాష' నిర్వహించినాడు. ఈ నిర్వహణమునకు పూనుకొనుటకు కారణములు సుజనులకు ఉత్సవముకలిగించుట, నన్నయ తిక్కనలపట్ల భక్తి ప్రకటించుట అని చెప్పబడినది. ఎఱ్ఱయ ఆరణ్యపర్వాంతమున చెప్పికొన్న పద్యములనుబట్టి చూడగా ఈ యంశములు సత్యమేయని తోచును.

నన్నయభట్ట మహాకవీంద్రుని సరససారస్వతాంశ ప్రశస్తి తన్ను చెందిన దట. నన్నయభట్టు సరససారస్వతము భారతము, దాని యంశము ఆరణ్యపర్వశేషము. దానిని రచించు ప్రశస్తి తనకు లభించినది— తనకు పూర్వులు విడిచి పెట్టుటవలన. కనుక 'సాధుజన హర్షసిద్ధి(గోరి', 'కవీంద్రకర్ణపుట పేయముగా' ఎఱ్ఱయ దానిని రచింపదలచెను. 'బుధసంతోషంబు నిండారగన్', 'భారతామృతము కర్ణపుటంబుల నార(గ్రోలి యాంధ్రావళి మోదముంబొరయు నట్లుగ' భారత రచనకు పూనిననాటి తిక్కనసోమయాజి మనఃపరిపాకమెట్టిదో 'సాధుజనహర్షసిద్ధి(గోరి',

'కవీంద్రకర్ణపుటపేయముగా' ఆరణ్య పర్వశేషరచనకు పూనిన నాటి ఎఱ్ఱయ మనఃపరిపాకము గూడ అట్టిదే. ఈ సాధుజనులలో నన్నయ, రాజరాజు. తిక్కనకూడ ఉండుట విశేషము.

ఆరణ్యపర్వశేషమునగూడ నన్నయ వక్తృత్వము, రాజరాజు శ్రోతృత్వము చెల్లుచునే యున్నవి. అట్లు చెల్లవలయుననియే ఎఱ్ఱయ నిశ్చయము. ఇందుకు కారణములుగా— ఆరణ్యపర్వమును రచించుచు నన్నయ మరణించెను గనుక అందులో కాలుపెట్టుటకు ఎఱ్ఱయ భయపడెనని కొందఱు, అది తన తొలిరచన యగుటచే తనపేర ప్రకటించుటకు ఆయనకు ధైర్యము చాలలేదని కొందఱు చెప్పుదురు. శిథిల పూరణవాదమువంటిదే ఈ భీరుత్వవాదము.

ఎఱ్ఱయ ధీరవిచారుడు. తిక్కన ఆరణ్యపర్వశేషమును ఏల వదలిపెట్టెనో మనకు ఊహావిషయముగాని ఆయనకు నిశ్చయజ్ఞానవిషయమే. మా గురుపాదులు ఒక ఊహచెప్పిరి. భారతభాగములు పర్వములు గనుక భారతము పదునెనిమిది కణుపులు గల చెఱకుగడ. అందు రెండున్నర పర్వములు నన్నయచే రాజరాజునకు నివేదింపబడినవి. తిక్కనసోమయాజి భారతరచనము కొనసాగింప సంకల్పించినప్పుడు హరిహరనాథుడు కలలో నగపడి—

'పారాశర్యుని కృతియై
భారతమను పేరఁబరగు పంచమవేదం
బారాధ్యము జనులకుఁ ద
ద్గౌరవ మూహించి నీ వఖండిత భక్తిన్.

తెనుఁగు బాస వినిర్మింపఁ దివురుటరయ
భవ్యపురుషార్థ తరుపక్వ ఫలముగాదె
దీనికెడ నియ్యకొని వేడ్కనూని కృతిప
తిత్వమర్థించి వచ్చితిఁ దిక్కశర్మ'

అని పలికెను. తిక్కన ఆదేవుని అభ్యర్థన నంగీకరించెను. తాను వ్రాయబూనిన భారతమును ఆస్వామికి నివేదింప నిశ్చయించెను. నరునకు నివేదింపబడిన వస్తువును ఈశ్వరునకు నివేదించుట ఉచితముకాదుగనుక అయన రాజరాజు ఉచ్ఛిష్టమయిన ఆరణ్యపర్వమందలి శేషమును పరిహరించి— అనగా మూడు కణుపులను త్రుంచివైచి— నాల్గవపర్వమునుండి పదునైదుపర్వములు ఈశ్వరునకు నివేధించెను.

రాజరాజు ఉపభోగించిన మూడుపర్వములు నన్నయచే ఆయనకు నివేదింపబడినట్లే భావించి నన్నయ మూడుకృతులు చెప్పెనని తిక్కన నుడివెను. ఆయన అభిప్రాయము తెలిసిన మారనయు ఆమాటయే అనెను.

ఎఱ్ఱయ ఈ విషయములు వినెను. నాటికవులే చెప్పిరో, ఉభయకవిత్వ ప్రౌఢుడైన ఆయన తండ్రియే చెప్పెనో! ఆరణ్యపర్యశేషరచన తనకొక కర్తవ్యముగా నేర్పడినపుడు ఎఱ్ఱయ ధీరముగా విచారించెను. తిక్కనపై నాతని కమిత మైన భక్తి. తిక్కన సమకాలికులైన వృద్ధులు ఆ మహనీయుని మహిమాన్వితమైన చరిత్రమును కొనియాడుట ఆయన చెవులారవినెను. తనతండ్రి నూరిపోసిన పదునేను పర్వముల సారమును చక్కగా జీర్ణించుకొనెను. తిక్కన కావించిన సృష్టి తక్కొరులచేతకాదని, ఆయన కవిబ్రహ్మయని మనసున పట్టించుకొనెను.

తిక్కన మూడుకృతులు అన్న మాటకర్థమేమి? అయన దేవతా నివేదనమునకు పనికిరాదన్న దానిని తానెట్లు రచింపవలెను, ఎవ్వరికర్పింపవలెను? వేదధర్మ ప్రియులైన సాధుజనులు తన్ను ప్రబంధ పరమేశ్వరుడని యెన్నికచేసి ఆరణ్య పర్వశేషము పూరింపుమని అర్థించుచుండిరి. ఎఱ్ఱయ ధీరముగా విచారించి నిశ్చయించుకొనెను. తిక్కనచెప్పినట్లు ఈ మూడుపర్వములు నన్నయపేరనే చెల్లవలెను. నరుని యుచ్ఛిష్టము ఈశ్వరున కర్పింపరాదుగదా? ఒక నరుని యుచ్ఛిష్టమింకొక నరున కర్పింపవచ్చునా? అర్పింపరాదు. కనుక ఈ మూడుపర్వములు రాజరాజునకే నివేదింపబడవలెను. రాజరాజు నాస్థానమున సరసకావ్య రచనా ధురీణులైన కవులెందరో యుండిరి. అయినను రాజరాజు భారతాంధ్రీకరణమున నన్నయనే నియోగించెను. ఆ మిత్రుల జీవలక్షణముల సంవాదమట్టిది. రాజరాజునకు నన్నయకవితారీతి ప్రీతిపాత్రము. కనుక ఎఱ్ఱన నన్నయ కవితారీతియు కొంత తోచునట్లు వ్రాసిననే రాజరాజునకు ప్రీతికలుగును, తాను ప్రతిభావంతుడు. బాల్యమునుండియు తనపై ఉభయకవిత్వ ప్రౌఢుడయిన తన తండ్రి కవితారీతి ముద్రపడి యున్నది. దానిపై చెఱుపరానంత గాఢముగా తిక్కన ముద్ర పడియున్నది. ఎఱ్ఱయ బుద్ధిపూర్వకముగా ప్రయత్నించి నన్నయ కవితారీతి కొంతయైనను తోచునట్లు ఆరణపర్వశేషము పూరింప నిశ్చయించెను. ఇది యంతయు ఎప్పటి మాట?

జననాభిజనములు

ప్రజ్ఞాపవిత్రుఁ డాపస్తంబసూత్రుండు
శ్రీవత్స గోత్రుఁ డూర్జిత చరిత్రుఁ
డగుబొల్లనకుఁ బోలమాంబకుఁ బుత్రుండు
వెలనాటి చోడని వలన మిగుల
మన్ననగన్న భీమనమంత్రి పౌత్రుండు
పేరమాంబామనఃప్రియుఁడు పోత
మాంబికావిభు సూరనార్య మజ్జనకుని
బొల్లధీనిధికిని బోలనకును

జన్ననకు ననుజన్మునిఁ గన్నతండ్రి
వేఁగినాఁటఁ గరాపర్తి వృత్తిమంతుఁ
డనఘుఁ డెలపోతసూరి కంసారిచరణ
కమల మధుకరపతి సారవిమలయశుఁడు

ఈ పద్యమునుబట్టి ఎఱ్ఱన తాత తాతయైన భీమన వెలనాటిచోడని సమకాలికుడు. 1170–80 నడుమ ఆచోడనిచే మన్ననగన్న మంత్రి. భీమన జననము 1130 ప్రాంతము కావచ్చును. తరమునకు ముప్పదియైదేండ్లు చొప్పున చూడగా బొల్లన 1165 ప్రాంతమునను, ఎఱపోతసూరి 1200 ప్రాంతమునను పుట్టియుందురు. సూరనార్యుడు ఎఱపోతసూరికి నాల్గవకుమారుడు కనుక ఆయనపుట్టుక 1250 లో కావచ్చును. ఈ ప్రకారము ఎఱ్ఱయపుట్టుక 1285 ప్రాంతమగును. ఏఱపోత సూరి వేగినాట కరాపర్తి వృత్తిమంతుడై యుండెను. వెలనాటిచోడుల పతనము తరువాత తిక్కన కుటుంబమువలె ఎఱ్ఱన కుటుంబముకూడ నెల్లూరిమండలమునకు తరలిపోయెను, ఉభయ కవిత్వప్రౌఢుడైన సూర్యసుకవియే నెల్లూరిచోడులనో, అద్దంకి ప్రాంతమందలి పంటరెడ్లనో ఆశ్రయించుటచే నెల్లూరి మండలమునకు వచ్చి నీలకంఠేశ్వర స్థానమైన గుడ్లూరున నివాసమేర్పరచుకొనియుండును. ఎఱ్ఱన పాకనాటనే పుట్టినట్లున్నది. 'పోవంబనిలేదు', 'సందేహింపంబనిలేదు', అను తీరున నెల్లూరి మాండలికము తిక్కనకువలెనే ఆయనకును పట్టుపడినది. తిక్కన తఱుచు ప్రయోగించు, నెల్లూరి మాండలికమా యనిపించు 'పొంపిరివోవు కూడ' ఎఱ్ఱనకు పట్టువడినది.

ఎఱ్ఱయతాత పరమవైష్ణవుడు— 'కంసారిచరణ కమలమధు కరపతి.' ఎఱ్ఱయ తండ్రి పరమశైవుడు— 'ఆరాధ్యసర్వజ్ఞుండు.' ఎఱ్ఱయ 'శంభుదాసుఁడనంగాఁ బఱగియు గోవిందగుణాదర సంభృతసౌమనస్య ధన్యుఁడు.' తండ్రి తత్త్వము, తాతతత్త్వము ఆయనయందు జక్కగా సమన్వయమొందినవి. ఎఱ్ఱన శంకరస్వామి సంయమివల్ల దీక్షపొంది శంభుదాస లక్షణాధేయము నందియు గోవింద గుణాదరముచే నిండైన సౌమనస్యము పెంపొందించుకొని ధన్యుడగుటకు తిక్కన భారతసంసేవనము కూడ కొంత కారణము కావచ్చును. రామభక్తుడైన మల్లారెడ్డి ఎఱ్ఱననుచేపట్టి ఆతతశ్రీతో సముపేతుని చేయుటకు ఎఱ్ఱయ భవ్యచరిత్రయు, ప్రతిభా పాండిత్యములును మాత్రమే కాక ఈ సౌమనస్యము కూడ కారణమై యుండును.

క్రీ. శ. 1325 ప్రాంతముల మల్లారెడ్డి గుండ్లకమ్మ తీరముననున్న చెదలువాడలో శ్రీరామాలయము కట్టించెను. ఆయన అన్నయైన ప్రోలయ వేమారెడ్డి ఆ ఆలయమునకు ఒకగ్రామమును తమ్మునిపేర మల్లవరము అను పేరుపెట్టి అగ్రహారము గావించెను. ఆ సందర్భముననే మల్లారెడ్డి ఎఱ్ఱయను వేమారెడ్డికి పరిచయము చేసియుండును. మల్లారెడ్డికి అన్నగారనిన పరమభక్తి. రామునకు లక్ష్మణుడెట్టివాడో వేమయకు మల్లారెడ్డి అట్టివాడని ఎఱ్ఱయమే చెప్పినాడు. రామభక్తుడైన మల్లారెడ్డి ఎఱ్ఱయచే రామాయణము వ్రాయించి దానిని తన అన్నగారి పేర అంకితము చేయించెనని భావింపవచ్చును. ఎఱ్ఱయ ఈ విధముగా ప్రోలయ వేమారెడ్డి ఆస్థానకవియై అద్దంకిచేరుకొనెను. హరివంశ రచనము ఆరంభించు నప్పటికి ఆయనవయస్సు నలువదియేండ్లకు పైబడియుండవచ్చును.

1335 నాటి చీమకుర్తి శాసనమున వేమారెడ్డికట్టించిన శ్రీశైలాహోబిల సోపానముల ప్రస్తుతిగలదు. హరివంశమున లేదు. కనుక అప్పటికే హరివంశరచన పూర్తియై యుండవలెను. ప్రోలయవేముని రెండవకుమారుడైన అనవేమారెడ్డి అప్పటికి పుట్టలేదు. పెద్దకుమారుడైన అనపోతారెడ్డి బాలుడు. హరివంశ తృతీయాశ్వాసాంతమున 'రామాయణ హరివంశ శ్రీమన్మధుర ప్రసంగసిద్ధ చిరయశస్సామర్థ్య కరణనిపుణా' అన్నసంబోధన యుండుటచే ప్రోలయ వేమారెడ్డి ఎఱ్ఱనచే సంస్కృత హరివంశమును ముందే విని పిమ్మట ఆంధ్రీకరణము చేయించినా యని పించుచున్నది. సంతానకాంక్షులు హరివంశ పారాయణముచేయుట పరిపాటి. "వంశవర్ధనము సమస్తపుణ్య ఫలదంబిది వక్తకు శ్రోతకున్ నృపా' అని వైశం

పాయనుడు జయమే జయునకు చెప్పినమాట ఎట్టన వేమారెడ్డికి చెప్పినట్లున్నది. మూలహరివంశ పారాయణఫలముగా యువరాజైన అనపోతారెడ్డియు, ఆంధ్ర హరివంశ శ్రవణఫలముగా అననేమారెడ్డియు జన్మించిరి కాబోలు.

అనపోతారెడ్డి 1364 లో వేయించిన కొల్లూరు శాసనములో ఆరాజు తమ్ముడు అనవేమ భూపతి ఎట్టయ ప్రగడగారికి కొంతభూమి ధారవోసినట్లున్నది. అనవేమారెడ్డి ఎట్టయపట్ల ప్రత్యేకమైన అభిమానమును చూపుటకు కారణము ఆంధ్ర హరివంశ శ్రవణఫలముగా తాను జన్మించి యుంటినన్న భావమే కావచ్చును. పూర్ణ పురుషాయుష జీవితధన్యుడైన తాతగారివలెనే ఎట్టయకూడ పూర్ణపురుషాయుష మనుభవించుచు 1360 తరువాతకూడ జీవించియుండెనే కాని హరివంశమువ్రాసి 1335 లో వేలూరి శివరామశాస్త్రిగారు చెప్పినట్లు మరణింపలేదు.

అయినచో 1335 నాటికే హరివంశ రచన ముగించి ఆమీద 1360 దాటువరకు ఎట్టన ఏమిచేసినట్లు? ఆరణ్యపర్వశేషము వ్రాసెను. నృసింహపురాణము వ్రాసెను.

గ్రంథముల ఆనుపూర్వి

1345 నాటి అమరావతి శాసనమువల్ల అప్పటికి మల్లారెడ్డి మరణించినట్లు తెలియుచున్నది. 1340 నాటి మంచాళ్ళ శాసనమువల్ల వేమారెడ్డి రాజధాని అద్దంకి నుండి కొండవీటికి మాఱినట్లు తెలియుచున్నది. అప్పటికే మల్లారెడ్డి మరణించి యుండెనేమో. మల్లారెడ్డి మూలమునసే ఎట్టయ వేమారెడ్డి ఆస్థానమున ప్రవేశించెను. మల్లారెడ్డి అనిన ఆయనకెంత ప్రేమయో హరివంశము నందలి ఆశ్వాసాంత పద్యము లెన్నో చెప్పుచున్నవి. మనుమసిద్ధి మరణమువల్ల తిక్కన విరక్తుడైనట్లు మల్లారెడ్డి మరణమువల్ల ఎట్టయయు విరక్తుడై యుండును. రాజాస్థానము వదిలి, మిత్రుని స్మృతులను రేకెత్తించు చెదలువాడలో హృదయమునకు శాంతిలేక యెట్టయ తిరిగి నీలకంఠేశ్వరస్థానమైన గుడ్లూరునకే పోయినట్లున్నది. ఆస్తిపాస్తులు చెదలు వాడయందే యున్నను ఆయన మాత్రము గుడ్లూరునే నెలవు గావించుకొనెను, అచ్చటనే ఆరణ్యపర్వశేషము వ్రాసెను.

ఆరణ్యపర్వశేషమే ఎట్టన తొలిరచనయని కొందఅందురు. రెండు వందల సంవత్సరములు ఎవ్వరును ముట్టసాహసింపనిది, తిక్కనవంటివాడు జీవితపరిపక్వ

దశయందుగాని చేపట్ట సాహసింపనిది అయిన భారతరచనమును ఎట్లయ తొలి రచనగా చేపట్టెననుట ప్రాచీన కవుల చిత్తవృత్తి నెఱుగక చెప్పెడిమాట. హరి వంశమునకు పూర్వమే ఆరణ్యపర్వశేషము వ్రాయబడి యుండినచో ప్రోలయ వేమారెడ్డి —

భారతపరాంశమని యిం
పారగఁజెప్పుదురు బుధుల్ హరివంశము నీ
వారమ్యకథ దెనుంగున
ధీరోత్తమ నిర్వహించి లెలుపుము మాకున్.

అని హరివంశ రచనకు ప్రోత్సహించునపుడు ఆరణ్యపర్వశేషము పూరించి నట్లే ఈ చివరి భాగమును గూడ నీవే పూరింపుమని చెప్పియుండవలసినది. ఆరణ్యపర్వశేష రచనాప్రసంగమునకు ఇది సరియైన యదను. ఇచ్చట అదిలేదు.

నృసింహపురాణమున ఎఱపోతసూరి—

'గిరిశ పదభక్తిరసత
త్పర భావము కలిమి శంభుదాసుఁడనంగాఁ
బరఁగియు గోవింద గుణా
దర సంభృత సౌమనస్య ధన్యుఁడ వెందున్,'

అనెను. శంభుదాసుడయ్యు 'గోవిందగుణాదర సంభృత సౌమనస్య ధన్యుఁడు' అనిపించుకొనుటకు ఎట్లయ గోవిందగుణ కీర్తన బంధురములైన గ్రంథము లేవేని రచియించి యుండవలెనుగదా. ఎఱపోతసూరి మటియు నిట్లనెను,

గురుభజన పరాయణుఁడవు
సరసబహు పురాణ ధర్మశాస్త్ర కథా వి
సరవేదివి వినయోదయ
భరితుఁడ వతులానుభావ భవ్యుఁడవీ మహిన్.

కావునఁ బ్రబంధ రచనా
ప్రౌఢిమ్యము నీకు సహజపరిణతి సిద్ధం
బై వెలసినయది యొకకృతి
గావింప జగద్ధితంబుగా నేఁ బనుతున్.

ఇచ్చట ఈ రెండు పద్యములకు కార్యకారణభావము పొసగుటలేదు. రెండింటికి నడుమ రామాయణ హరివంశముల రచనను ప్రస్తావించు పద్యముండెనేమో. ఉండనిచో ప్రబంధ రచనా ప్రౌఢిమ్యము నీకు సహజ పరిణతి సిద్ధంబై వెలసిన యది అను మాట యెట్లు పొసగును, సహజసిద్ధము వేఱు, సహజపరిణతి సిద్ధము వేఱు. ప్రబంధ రచనాశక్తి ప్రతిభావంతునకు సహజసిద్ధము కావచ్చును, అందలి ప్రౌఢిమ్యము మాత్రము అభ్యాసమువల్ల పరిణమించి సిద్ధము కావలసినదే. కనుకనే యెఱ్ఱయ రామాయణ హరివంశములను రచించి ప్రబంధరచనా ప్రౌఢిమ్య సిద్ధినంది ప్రబంధపరమేశ్వరుడుగా ఎన్నికచేయబడి వేదధర్మ ప్రియులైన సాధు జనుల హర్ష సిద్ధికొఱకు ఆరణ్యపర్వము పూరింప దొరకొనెను. భారతము ఆంధ్రీకృతమై నది. దానికి శేషమైన హరివంశము ఆంధ్రీకృతమైనది. ఆరణ్యపర్వ శేషముకూడ ఆంధ్రీకృతమైనచో మహాభారతాంధ్రీకరణము సంపూర్ణ మగును.

మంత్రిభాస్కర హుళక్కి భాస్కరాదులు చూపినత్రోవన రామాయణము వ్రాయవచ్చును. నన్నయభట్ట తిక్కకవినాథులు చూపిన త్రోవన హరివంశము వ్రాయవచ్చును. ఆరణ్యపర్వశేషమును మాత్రము నన్నయ చూపిన త్రోవన కాక నన్నయ వ్రాసినట్లే వ్రాయవలసి యుండును. ఇది కత్తిమీదిసాము, ఎఱ్ఱయ ఎంతో పరిశ్రమచేసి ఆ సామునకు సిద్ధపడెను. నన్నయరీతి కొంత అలవఱచుకొని ఆయన వ్రాసినట్లే వ్రాసితినని తృప్తిపడి ఆయన నివేదించినట్లే రాజరాజునకు నివేదించెను. పర్యాంతమున రాజరాజును సంబోధించు పద్యములకు ముందే తన విషయమును వివరించు పద్యములుంచి 'ఇది నన్నయ సరససారస్వతాంశము. తత్కవితారీతియు కొంత తోప ఎఱ్ఱనార్యుడు రచించినది. కర్ణపుటపేయమైనది' అని రాజరాజునకు నివేదించి "ఇది సకలసుకవిజనవినుత నన్నయభట్ట ప్రణీతంబయినది" అని ఆంధ్రులకు విన్నవించెను. జనమేజయునకు వైశంపాయనుడువలె రాజరాజునకు 'పాండుతనయుల వనవాస ప్రకారంబు సవిస్తమధురంబుగా నుపన్యసించి' 'అనవరతానంద సుఖసమగ్రత' యొసగెను.

రామాయణమును ఎఱ్ఱన ప్రబంధమనెనో లేదో. హరివంశమును 'జగదర్చితంబైన ప్రబంధంబు' అనెను. శ్రీకర కవిప్రబంధానేక అని ఆఱువ యాశ్వాసము మొదట ప్రబంధశబ్దము వాడెను. నృసింహపురాణమున ప్రబంధశబ్దమును ఆఱు పర్యాయములు వాడుటేకాక అందు రెండు పర్యాయములు మహాప్రబంధ శబ్దము కూడ వాడెను. తాను 'మహాప్రబంధ కల్పనాకుతూహలాయత్తంబగు చిత్తంబుతో'

నున్నట్లు చెప్పినాడు. ఇంతవఱకు ఎఱ్ఱయచేసినవి అనువాదములు. ఇప్పుడు చేయ వలసినది మహాప్రబంధకల్పన. ఇది నైసర్గిక చాపలమనియు, కీర్తిసంగ సుఖ లీలకు కాంక్షచేయుట యనియు ఎఱ్ఱనభావించెను. ఇట్లనుటవల్ల నృసింహపురాణమును ఎఱ్ఱన ఆత్మప్రత్యయము లేని లేతవయస్సున రచించెను అందురు. రఘువంశము కాళిదాసుని కావ్యములలో చిట్టచివరిదని పండితుల యభిప్రాయము. కాని రఘు వంశారంభమున కాళిదాసు—

క్వసూర్య ప్రభవో వంశః క్వచాల్ప విషయామతిః
తితీర్షుర్దుస్తరం మోహాదుడుపేనాస్మి సాగరమ్.
మన్దః కవియశఃప్రార్థీ గమిష్యామ్య పహాస్యతామ్,
ప్రాంశులభ్యే ఫలే లోభాదుద్బాహురివ వామనః.
రఘూణా మన్వయం వక్ష్యే తను వాగ్విభవోఽపి సన్
తద్గుణైః కర్ణమాగత్య చాపలాయ ప్రచోదితః.

అనెను. ఇది వినయమేకాని భయము కాదని పెద్దల యభిప్రాయము, ఎఱ్ఱన వాడిన మాటలు కాళిదాసు వాడినవే. ఈయనది మాత్రము వినయముకాక భయమెట్లగును? ఇది బాల్యరచన యెట్లగును? నిర్వచనోత్తర రామాయణమున 'అమలోదాత్త మనీష నే నుభయకావ్య ప్రౌఢి పాటించు శిల్పమునం బారగుఁడన్ కళావిదుఁడ' నని అహంకరించి పలికిన తిక్కన భారతమున 'నా నేర్చిన భంగిఁజెప్పి వరణీయుఁడ నయ్యెద భక్తకోటికిన్' అని ఎంతో వినయము ప్రకటించెను. హరివంశమున 'సకల భాషాకవిత్వ విశారదుఁడవు' అని వేమారెడ్డిచే చెప్పించుకొన్న ఎఱ్ఱయ నృసింహపురాణమున తాను వినయము ప్రకటించి, తాతచే 'వినయోదయ భరితుండవు' అని చెప్పించుకొనెను. ఎఱ్ఱయవినయము వయఃపారిపాకధర్మమే కాని బాల్య లక్షణము కాదు.

మల్లారెడ్డి ప్రీతికొఱకు రామాయణమును, వేమారెడ్డి ప్రీతికొఱకు హరివంశ మును రచించి ఎఱ్ఱన 'సాధుజన హర్షసిద్ధిగోరి' లోకారాధన బుద్ధితో ప్రతిఫల నిరపేక్షముగా ఆరణ్యపర్వ శేషము పూరించెను. మల్లారెడ్డి ఇచ్చిన ఆతతశ్రీ ఆయ నకు చాలియుండెను. ఫలాపేక్షచే రాజుల నారాధింపవలసిన యవసరము తీరిపోయెను. తన కవితాసంపత్తిచే లోకారాధనము, ఈశ్వరారాధనము చేసి తరించుటకు అనువైన చిత్తపరిపాకము ఆయనకు సిద్ధించెను.

ఎఱ్ఱన 'మహాప్రబంధ కల్పనా కుతూహలాయత్తంబగు చిత్తంబుతో' ఒక్కనాడు తదను సంధానానుబంధ సమాధి నిమీలితేక్షణుఁడై' యుండెను. భారత రచనము సంకల్పించి—

అని రచనా కౌతుకమున
మనమలరఁగ నీ ప్రబంధమండలి కధినా
థునిగా నే పురుషుని బే
ర్కొను వాఁడనొ యను తలంపుగూరిన మదితో.

తిక్కనసోమయాజి యించుక నిద్రించిన సన్నివేశము వంటిదే ఈ సన్నివేశము, తిక్కనకు వచ్చినట్లే ఎఱ్ఱయకును స్వప్నము వచ్చెను. కావ్యరచన సంకల్పించిన వారికెల్ల, సంకల్పించినపుడెల్ల స్వప్నములురావు. లోకారాధనమును ఈశ్వరారాధనమును ఆశయములుగా బెట్టుకొని తత్సాధన సమర్థములైన కావ్యములు నిర్మింప సంకల్పించి సమాధిగతులు కాగల పుణ్యాత్మలకే స్వప్నములువచ్చును. తిక్కనకు తండ్రియు, హరిహరనాథుడును దర్శనమిచ్చిరి. ఎఱ్ఱనకు తాతయు, నృసింహావతార కథయు దర్శనమిచ్చెను. పంచమవేదమైన భారతమును రచించుట భవ్యపురుషార్థ తరు పక్వఫలమనియు 'జనాభ్యర్చితమైన భారత మపార కృపా పరతంత్ర వృత్తిమై(బేర్చిన దేవదేవునకుఁ బ్రీతిఁగ నిచ్చుట సర్వసిద్ధి' అనియు తిక్కన తన ధన్యతను కొనియాడుకొనెను. ఎఱ్ఱయకూడ నృసింహపురాణము రచించి నృసింహదేవునకే అంకితము చేయుట పరమ ధన్యతగా భావించెను.

కృతికి విభుండు శ్రీ విభుఁడు, కీర్తిన పావనమైన తద్గుణ
స్తుతి కృతి, విష్ణుదాసులు యశోనిధు లూర్జిత పుణ్యు లుత్తముల్
కృతిఁ గొనియాడువారు, కృతకృత్యుఁడ నైతి మదీయ వాంఛిత
ప్రతతికిఁ జెందఁ గల్పతరుపాకము శ్రీకరకావ్యరూపతన్

ఈ పద్యమందలి సన్నివేశ మెంతటి ధన్యతాహేతువో హరివంశమందలి సదృశ సన్నివేశముతో పోల్చిచూచినపుడు స్పష్టమగును.

నన్నయభట్ట తిక్కకవినాథులు చూపిన త్రోవ పావనం,
బెన్నఁ బరాశరాత్మజ మునీంద్రుని వాఙ్మయమాదిదేవుఁడౌ
వెన్ను నివృత్త, మీవు కడు వేడుకతో వినునాయకుండ; వి
ట్లెన్నియొ సంఘటించొ మదభీప్సిత సిద్ధికి రాజపుంగవా!

విష్ణుమహిమ వర్ణనాత్మకమైన ప్రబంధమును వేమయకు వినిపించుట ధన్యతయో విష్ణుదేవునికే వినిపించుట ధన్యతయో సహృదయులు భావింపగలరు హరివంశము చివట—

శ్రీవేమ క్ష్మావల్లభ !
భూవల్లభ పూజనీయ భుజవైభవ ! ల
క్ష్మీ వల్లభ ! గుణవితరణ
పావన ! నినుఁ బొందుఁ గాత భవ్యశుభంబుల్.

అని వేమారెడ్డి ఉప్పు తినినందుకు హరివంశ సంకీర్తన ఫలమంతయు ఆయనకే ధారవోసి ఎఱ్ఱయ ఆయను ఋణము తీర్చికొనెను. సాధుజన హర్షసిద్ధిగోరి ఆరణ్య పర్వశేషము పూరించి తన్ను ప్రబంధ పరమేశ్వరుడని కొనియాడిన ఆంధ్రజాతి ఋణమును తీర్చికొనెను. తన పేరివాడని తన్ను ఎంతో ముద్దుగా చూచిన తాత 'అతులితానంద జలధి నోలాడుగాత' అనియు, తన్ను కనిపెంచి కవిగా తీర్చిన తండ్రి 'ముదావేశోజ్జ్వ లుండయ్యెడున్' అనియు నృసింహపురాణము రచించి పితృ ఋణము తీర్చుకొనెను. ఆ మహాప్రబంధమును నృసింహదేవున కంకితముచేసి దేవఋణము తీర్చికొనెను. ఈ విధముగా భవ్యచరిత్రుడైన ఎఱ్ఱన తన సాహిత్య తపస్సుచే సర్వఋణ విముక్తి సాధించి తనజీవితమును కవితను చరితార్థము చేసికొనెను.

ఆరణ్యపర్వ శేష పూరణము

ఎఱ్ఱన రామాయణము నాంధ్రీకరించిన పద్ధతి యెట్టిదో ! 'వల్మీకభవు వచో వైఖరి రామాయణంబు నాంధ్రప్రబంధముగఁజేసె' నన్న మల్లన మాటనుబట్టి వాల్మీకి రామాయణమునకు అనువాద ప్రాయముగనే తన రామాయణమును రచించెనని ఊహింపవచ్చును. రామాయణము కావ్యముగనుక దాని యనువాదము పురాణేతిహాసముల యనువాదముకంటె కొంత భిన్నముగా నుండక తప్పదు. తొలి రచనమునసే కావ్యానువాద పద్ధతి ననుసరించి యుండుటచే ఎఱ్ఱన అనువాదపద్ధతిపై దాని ప్రభావము కొంత పడక తప్పదు. పురాణేతిహాసముల అనువాదమునందు సాధ్యమైనంత సంక్షేపణము కావ్యానువాదమున సాధ్యముకాదు. ఆరణ్యపర్వ రచనమున ఎఱ్ఱన అనువాదపద్ధతి నన్నయపద్ధతికంటె కొంత విస్తరణాత్మకముగా ఉన్నట్లు కనబడుచున్నది.

నన్నయ అనువదించిన మూలము	—	6981 శ్లోకములు
నన్నయ అనువాదము	—	1299 గద్యపద్యములు
ఎఱ్ఱయ అనువదించిన మూలము	—	6683 శ్లోకములు
ఎఱ్ఱయ యనువాదము	—	1595 గద్యపద్యములు

నన్నయమూలముకంటె ఎఱ్ఱయమూలము మూడువందల శ్లోకములుతక్కువ. నన్నయ యనువాదముకంటె ఎఱ్ఱన యనువాదము మూడువందల గద్యపద్యములు ఎక్కువ. మూలమునకు ఎక్కువ సన్నిహితమగుటయు, ఎడనెడ రసభావాను గుణములైన వివరణలు వర్ణనలు ఎక్కువగా చేరుటయు కారణములుగా ఎఱ్ఱయ యనువాదము నన్నయ యనువాదముకంటె కొంత భిన్నమై, తిక్కన మార్గము ననుసరించుచు, శ్రీనాథులకు త్రోవచూపుచున్నట్లున్నది.

మూలమున 739 శ్లోకములో నున్న రామోపాఖ్యానమును ఎఱ్ఱన 310 గద్యపద్యములలో రచించెను. అనగా విస్తరించెననియర్థము. అంతకు పూర్వమే వాల్మీకి రామాయణము నాంధ్రీకరించిన లక్షణములు, దానినొక చిన్న రసవత్ప్రబంధముగా రూపొందింపవలెనన్న ఆసక్తియు రామోపాఖ్యాన రచనమున స్పష్టముగా నగపడుచున్నవి.

జటాయువు నోడించి రావణుడు లంకాభిముఖుడై పోవుచుండగా సీత తన యాభరణములను మూటకట్టి జాఅవిడుచు సందర్భమున వ్యాసుని మూలము—

'యత్ర యత్ర తు వై దేహీ పశ్యత్యాశ్రమ మండలమ్
సరోవా సరితోవాపి తత్ర ముంచతి భూషణమ్
సా ద దర్శ గిరిప్రస్థే పంచ వానర పుంగవాన్
తత్ర వాసో మహద్దివ్య ముత్ససర్జ మనస్వినీ.'

ఈ సందర్భమున వాల్మీకి మూలము—

హ్రియమాణాతు వై దేహీ కంచిన్నాథ మపశ్యతీ
దదర్శ గిరిశృంగస్థాన్ పంచ వానర పుంగవాన్
తేషాం మధ్యే విశాలాక్షి కౌశేయం కనకప్రభం
ఉత్తరీయం వరారోహ శుభాన్యాభరణాని చ
ముమోచ యది రామాయ శంసేయు రితి మైథిలీ.

ఇక్కడ ఎఱ్ఱయ రచన—

"జానకి దనకు దిక్కెవ్వరు లేమిఁజేసి నిరాశయై యొక్క శైలశృంగంబు నందుఁ గొందఱు వానరులు మెలంగుచున్నంగని తనకట్టినపుట్టంబు కొంగు సించి భూషణంబులు ముడిచి తత్ప్ర దేశంబున వైచె"

ఇచ్చట ఎట్టిన వ్యాసుని వదలి వాల్మీకి ననుసరించుట స్పష్టముగనే ఉన్నది కదా. హనుమదాదులు సీతయునికి దెలిసికొనివచ్చి మధువవమున విహరించి సుగ్రీవ దర్శనమునకు వచ్చిన సందర్భమున వ్యాసుని మూలము—

'హనుమత్ ప్రముఖాశ్చాపి విశ్రాంతాస్తే ప్లవంగమాఃఅభిజగ్ము ర్మహీంద్రం తం రామలక్ష్మణ సన్నిధౌ'

ఈ సందర్భమున వాల్మీకి మూలము సుందరకాండ 62 వ సర్గము చూడవలెను. ఇచట ఎట్టియ రచన—

తేనెలు గ్రోలిక్రోలి, కడుఁ దియ్యని కమ్మని పండు లింపుసొం
పానఁగ నానియాని, పరపందిన నీడలు మెచ్చిమెచ్చి, మం
దానిల శైత్యసౌరభ సమగ్రతకుం గడుఁజొక్కి చొక్కి, యు
ద్యానమునందు మారుతసుతప్రముఖుల్ విహరించి తృప్తులై,

ఇది వ్యాసుని మూలమునకు రమణీయమైన విస్తరణము. ఈ విస్తరణమునకు మూలము వాల్మీకి రామాయణము.

మాయాయుద్ధము విఫలము కాగా ఇంద్రజిత్తు యుద్ధరంగమునుండి మరలిపోయి తిరిగి యుద్ధము చేయవచ్చును. ఈ సందర్భమున వ్యాసుని మూలము—

"ఇంద్రజిత్ కృతకర్మాచ పిత్రే కర్మ తదాత్మవఃనివేద్య పునరాగచ్ఛత్ త్వరయాఽఽజిరః ప్రతి"

ఇచ్చట ఎట్టియ యనువాదము—

"ఆ రక్కసుండు తనచేసిన పౌరుషంబు ప్రతిహతం బగుటకు విస్మయం బంది మగుడి హోమకార్యంబును దొడంగంబోయిన నెఱింగి విభీషణుండు లక్ష్మణుం జూచి యిన్నీచునకు హోమసమాప్తి యయ్యెనేని నెవ్వరికిం గెలువ నశక్యంబు; వీని వెన్నడిం దగిలి తెగటార్పు మనిన నతఁడు"

ఆమూలకమైన యీ హోమకార్యప్రసంగము వాల్మీకినుండి తెచ్చుకొన్నది. రామాయణమున నీ సందర్భమున ఇంద్రజిత్తు నికుంభిళ యాగము చేయబోవును.

సీత యగ్నిప్రవేశ ప్రసంగము వ్యాసుని మూలమునలేదు. 'నేననలంబుఁ జొచ్చి వెడలెదఁ గనుఁగొనుము' అని యెట్టియ సీతచే ననిపించుట వాల్మీకిరామాయణ ప్రభావము వల్లనే.

వర్ణనా కౌశలము

"విచిత్రాలంకారోజ్వల కవితాలాపకలాప సంతతానందమతీ" అ ని యు "మహాకావ్యరసప్రయోజనానందమతీ" అనియు ఎట్టియ రాజరాజును సంబోధించు నప్పుడు తన యభిరుచులనే ఆయనకు ఆరోపించుచున్నట్లు తోచును. ఎట్టియ కవితయందు జక్కన శబ్దవై చిత్రిని, శ్రీనాథుడు సూ క్తివై చిత్రిని కనిపట్టియుండిరి. అలంకారసుందరములు, రసభావాది వ్యంజకములునై న యెట్టిన వ ర్తనలందీ లక్షణములున్నవేమో చూడవచ్చును. శబ్దవై చిత్రి యనగా అక్షరరమ్యత, సూ క్తి వైచిత్రి యనగా అర్థగతమైన ప్రౌఢతయని భావింపవచ్చును. ఆరణ్యపర్వశేష రచనయే వర్ణనతో నారంభమై నది. నన్నయ వర్ణించిన శరద్రాకాచంద్రికలలో మై మఱచి నిద్రించుచుండిన యాంధ్రజాతికి స్ఫురదరుణాంశురాగరుచి చూపి యెట్టిన మెలకువ తెప్పించెను. వర్షర్తువు శరత్తు గా పరిణమించిన తీరు ఎట్టియ రమ్యముగా వర్ణించెను.

"దానాంభఃపటలంబునం బృథుపయోధారావలిం దాల్చి. గ
ర్జానిర్ఘోషము బృంహితచ్ఛలనఁ బ్రచ్ఛాదించి, ప్రావృట్ పయో
దానీకంబు శరద్భయంబున నిగూఢాకారతం డిగ్గె నా
గా నొప్పారె మదోత్కట ద్విరద సంఘంబుల్ వనాంతంబునన్"

ఈపద్యమున 'దాల్చి' అన్న పదము 'దాచి' యని యుండవలయును. పృథుపయోధరలను దానాంభఃపటలంబునను, గర్జానిర్ఘోషమును బృంహితమునను దాచికొని శరద్భయముచే మేఘములు ఆకాశమును వీడి యడవులలో మదపుటేనుగులై తిరుగుచున్నవి. మదపుటేనుగులు ప్రచ్ఛన్నవర్షా మేఘములుగా ఉత్ప్రేక్షింపబడినవి. "వారి ధారల, ననివారిత నిర్గళద్దాన ధారల"నని తృతీయాశ్వాసము-355 పద్యమున నన్నయ కావించిన వర్ణనమున కిది యవస్థాభేదము ననుసరించి చేయబడిన

రూపాంతర కల్పనము. అచ్చటి భ్రాంతి యిచ్చట ఉత్ప్రేక్షమైనది. స్వర్గమునుండి నన్నయ దిగివచ్చి యెట్టియ రూపమున గూఢముగా నరణ్యపర్వమున విహరించు చుండెనా యన్న మృదువైన ధ్వనియు నీ పద్యమున భావుకహృదయములను స్పృశించుచున్నది.

"విశద శారదాంబుద పరివేష్టనమున,
బొల్పు గగనంబు ప్రతిబింబమో యనంగ
విశద కాశవనీ పరివేష్టనమున
నతిశయిల్లె నిర్మల కమలాకరములు"

ఈ పద్యమందలి యుత్ప్రేక్షకు జన్మస్థానము "భూసతికిందివంబునకు" అన్న పద్య మందలి నన్నయ భావనయే. నన్నయ బింబము, ఎట్టియ ప్రతిబింబము.

"కలనీలకంఠ కోలా
హల లీలలు సెందె రాజ హంసకులంబున్"

అన్న భావమునకు బీజము "అరుదగు తత్పయోదసమయంబున" అన్న పద్యమున జూడవచ్చును. వర్షను శరత్తుగా నవతరింపజేయుటలో నన్నయ యెట్టియగా నవతరించినట్లుది.

సీ॥ కమనీయ కమలినీ కహ్లారదళ కేస
రాన్విత జలముల నర్ఘ్య విధియు,
దరళతరంగ హస్తముల, బాద్యంబు, ను
న్మద చక్రసారస మధుపహంస
రుతుల, బ్రియోక్తులు, రుచిరవానీర ని
వేశనచ్ఛాయల విశ్రమంబు,
మందసంచారిత మారుతంబుల నుర్వ
తాపనోదనమును దగిలి యెపుడు

ఆ. వె. నాచరించుచును సమంచితాతిథి జన
సేవనమున, దనదు జీవనంబు
ఫలము నొంద నొప్పు పంసాసరోవరం
బెదుర, గాంచి రన్నరేంద్ర సుతులు."

ఈ పద్య మందలి పంపాసరస్సు వ్యాసుని విస్తరించి, వాల్మీకిని సంగ్రహించి, నన్నయను అనుకరించి 'గురుభజన పరాయణు'డైన యెట్టన రూపించి చిత్రించిన తపోవన గృహిణి. నన్నయ సముద్రము నుత్ప్రేక్షించిన జాడనుబట్టి యెట్టయ పంపాసరస్సును సందర్భోచితముగా రూపించె నని గుర్తింపవచ్చును. జీవన శబ్దమును శ్లేషించి సాదృశ్యము సాధింపబడినది.

"రాక్షసాః ప్రాద్రవన్ భయాత్" అను వ్యాసుని వాక్యార్థమును ఎట్టయ రాక్షసోచితమైన యుపమచే-

"ఆకులపడి నలుదెసలం
గాకులక్రియఁ జెదరి కడు వెగడుపడి రక్షో
నీకములు లంక యెనిమిది
వాకిళ్ళం దూఱెఁ బౌరవర్గము దలఁకన్"

అను పద్యమున కన్నులకు గట్టునట్లు చేసినాడు. జలధరద్విరదతతులను ప్రక్క్రనే యుంచి భ్రమ పెట్టిన నన్నయవలె ఎట్టనయు లంకను చుట్టుముట్టిన వానర సేనయందు దానిని చుట్టుముట్టియున్న ఘనసాగరవీచి రేఖను కానిపించినాడు—

"పరువడి మొత్తములై బం
ధుర మోషంబెసఁగఁ బొంగి తోతెంచు హరీ
శ్వర బలమునందు ఘన సా
గరవీచి వికాసరేఖ కానఁగనయ్యెన్"

వానర సేనకు సాగరమునకు సాదృశ్యము వ్యంజించు ఉక్తివై చిత్రి యిది. ఉపమా లంకారమున ఆర్థీభేదముగా దీనిని గణింపవచ్చును. ఆర్థీ ఉపమలు ఉక్తి చమ త్కారములు. శ్రీనాథునకిట్టి వానియందు మక్కువ. ఎట్టయ ప్రయోగించిన ఈ యుక్తి చూడుడు—

"అని తలంచుచు నల్లన యక్కుమారుఁ
జేరఁబోయిన నాతఁడు సితసరోజ
రేఖ దలకొనఁగా నలర్పించెఁ గన్ను
లవధరించెను నను లోచనాంచలముల"

నేత్రవికాసము సరోజవికాసమువలె నున్నదని చెప్పు ఉక్తివైచిత్రి యిది. ఈ ఉక్తివైచిత్రి నేత్రోన్మీల నానుభావవర్ణనమును చమత్కారము చేయుచున్నది. రసతత్పరుడైన ఎట్టన వివిధాను భావముల వర్ణన యందు నన్నయకంటె ఎక్కువ యాసక్తి ప్రదర్శించెను. ఇది తిక్కన ఫక్కి.

ఇంద్రద్యుమ్ను నెఱుంగుదువా యని నాడీ జంఘాదులు ప్రశ్నింపగ అకూపారుండను కచ్ఛపము "ఒక్కింతసేపు దలఁచికొని, కన్నుగవ నశ్రుజలము లురుల, ఎలుంగు రాల్పుడ వారలంగనుంగొని– అక్కట! నేనెఱుంగనె మహాగుణభూషణు నమ్మహాత్ము"ననుట చక్కని సాత్విక వ్యభిచారిభావానుభావ వర్ణన.

యోగనిద్రాభంగము గావించిన మధుకైటభులకు విష్ణువు వరమిత్తుననగా "కలకలనవ్వి యయ్యసురవరులు, నీవుమాకేమి యిచ్చెదు? నీక మేము వరము లిచ్చెద" మనుటయు. విష్ణువు 'నాచేమృత్యువు బొందుడిపుడు' అనగా "వారలొం డొరుల మొగంబులు" చూచుట– మగని వశపచుకొను నుపాయము చెప్పుమని సత్యభామయడుగగా "మదినించుక గినుకవొడమ నడచుకొనుచు, గృష్ణ మృదుల హాసిని యగుచు నిర్వికారాకృతియై" సత్యభామను మందలించుట—

దుర్యోధనుడు విహారార్థము వచ్చుచున్నాడు, తొలగిపొండని పలికిన సేవకులపై గోపించి గంధర్వులు "ఒండొరువుల మొగంబులు సూచిపెలుచ" నవ్వుట– తిక్కన యనుకరణములైనను చక్కని యనుభావ వర్ణనలు.

లంకలో సీతను జూచివచ్చి హనుమంతుడు శ్రీరామున కామె పంపిన చూడామణి నీయగా—

"అమ్మనోజ్ఞ రత్న మక్కువఁ గదియించి
పులక లెగయఁ గ్రొంతప్రొద్దు విభుఁడు
జానకీకుచాగ్ర సంగమ సుప్తుఁడై
నట్లయుండె ముకుళితాక్షుఁడగుచు"

అని వర్ణించుట విభావాది సామగ్రీసంయోగమున రసము సముల్లసింపజేయుట. శ్రీరామచంద్రుని కఠోరవాక్యముల విని మూర్ఛిల్లి తెలిసిన సీత వర్ణన తిక్కన యుత్తర రామాయణమున లక్ష్మణుని సందేశము విన్నప్పటి సీతవర్ణనమును బోలియున్నది.

"పడతి యల్లన మఱికొంత వడికిఁదెలిసి
యలసమూర్తియై దందడి నశ్రు లురులఁ
గేలుమొగిడించి వసుమతీపాలుఁ జూచి
యెలుఁగు కుత్తుకఁ దగులంగ నిట్టులనియె"

"కాష్ఠదలనంబు సేయందొడంగి, శ్రమంపడి, యొల్లంబోయి, గొడ్డలి పుడమి పయివై చి నిరంతరనిశ్వాస వేగవివర్ణ వదనుండగుచు సావిత్రింగనుంగొని సత్యవంతుడు—

"ఒడలు వశంబుగాదు, భ్రమనొందిన యట్లు మనంబు దూలెడిన్
గడగి శిరంబు శూలశిఖప్రకరంబుల నొంచినట్టి ద
య్యెడు, నిలువంగనోర్వ, నొకయించుక సేపు శ్రమంబుదీర నీ
యెడ శయనింతు ; నావుడు సితేక్షణ మొత్తని సంభ్రమంబుతో"

ఇది యెఱ్ఱయ మనస్తత్వనిరూపణ నైపుణిని ప్రదర్శించు స్వభావసుందర మైనవర్ణన. మాయలేడి చేష్టలను, వాలిసుగ్రీవుల ద్వంద్వయుద్ధమును ఎఱ్ఱయ ఆశ్చర్యకరమైన లోకజ్ఞతతో వర్ణించెను. ఎఱ్ఱయ నెల్లూరుమండలమున బుట్టి పెరిగినవాడు. కాటమరాజు కథకు రంగస్థలమైన ఆ సీమ పశువులకు కాణాచి. మోషయాత్ర పోయిన దుర్యోధనుడు చూచిన ఆలమందలు వెలిగొండలలోని పచ్చికబయళ్లలో కదుపులుగట్టియున్న ఆలమందలే. ఎఱ్ఱయ గోకదంబవర్ణన వ్యాసుని, భారవిని మించిపోయినది.

సీ. నానాసహస్ర సంఖ్యానంబులై సంత
తానంద విగత భయత్వలీల
నక్కానమున నేదిక్కు సూచిన నతి
సంకులంబుగఁ గుందశంఖ చంద్ర
హారనీహార డిండీర పటీర ము
క్తాహారహీర సంకాశములును
గాదంబ కాలేయ కాదంబినీ నీల
జాల తమాలికా సన్నిభములు.

గీ. ప్రౌఢ బంధూక పల్లవ భాసితములు
వికచ కాంచన చంపక విస్ఫుటములు
నైన వర్ణంబులొప్ప నేత్రాభిరామ
భంగి నలరారు గోకదంబముల(గనియె.

ఇన్నిరంగుల యావులు, ఇన్నివేలు మందలుగట్టి నేత్రాభిరామభంగి నలరా రుట ఎట్టిన ఎన్ని పర్యాయములు చూచి ఆ దృశ్యమును హృదయమున పదిల పఱచికొనెనో.

ఛందస్సు

ఆరణ్యపర్వశేషమున ఎఱ్ఱయ రచించిన గద్యపద్యములు మొత్తము 1595. వాని వివరణములు.

గద్యము	496	తరువోజ	2
కందము	413	ఉత్సాహము	2
సీసము	102	స్రగ్ధర	2
తేటగీతి	109	మహాస్రగ్ధర	2
అటవెలది	91	మాలిని	1
చంపకమాల	135	వనమయూరము	1
ఉత్పలమాల	126	లయగ్రాహి	1
శార్దూలము	18	మధ్యాక్కర	1
మత్తేభము	69	మధురాక్కర	2
మత్తకోకిల	13	ప్రగ్విజి	1
తరలము	8		

గద్యములతో కలిపి మొత్తము 21 భేదములు. నన్నయరీతి కొంత తోచు నట్లు చేయుటలో ఎఱ్ఱయ ఛందముల విషయమునను గొంతయత్నము చేసెను. ఇతరులు వాడని, తాను ఇతర గ్రంథములలో వాడని మధ్యాక్కరను, మధురాక్క రను నన్నయ వాడెను గనుక తానును వాడెను. సీసములందు, తేటగీతులందు, ఆటవెలదులందు నన్నయపాటించిన యతి, ప్రాసయతి నియములు తానును ఈ పర్వమున పాటించెను. నన్నయ వ్రాసిన 13 సీసభేదములలో 7 భేదములు

మాత్రమే వాడెను. కాని నన్నయ వాడిన సర్వ్రాసయతి సీనమున నొక విశేష నియమమును పాటించుచు రెండు సీసములు వ్రాసెను.

ఆరాజపుత్రుల, నారూఢ తేజుల,
వీరుల నున్నతోదార భుజులఁ
గనుఁగొని సుగ్రీవుఁ డనఘుఁ డగ్గిరిశృంగ
ముననుండి తానును దన సచివులుఁ
జింతించి, వారి వృత్తాంతము నెఱుఁగంగ
సంతతోత్సాహు, ధీమంతు, శౌర్య
వంతు నుత్తము, హిమవంతుఁడుఁబోని య
త్యంత సుస్థిరు, హనుమంతుఁ బనిచె

నతఁడు నరిగి నృపతి సుతుల తెఱంగెల్ల
నెటిఁగి, వనచరేంద్రు నెఱుఁగఁ జెప్పి
యుగ్రతేజుఁడైన సుగ్రీవుతోఁ జెల్మి
యొనర సంఘటించె మనుజ పతికి

సీసపాదములందలి యుభయ ఖండములందును ఒకే ప్రాసాక్షరము పాటించుట యిందలి విశేషము.

ధృతరాష్ట్ర సఖుఁడైన యతిరథుండను సూతుఁ
డతివలుఁ దానును నతివిభూతి
గంగలో జలకేళి సంగతుండై యుండి
తుంగతరంగానుషంగ వశతఁ
జనుదెంచు మంజూషఁగని, కడువేడుకఁ
దన పరిజనములఁ బనిచి పట్టి
తెప్పించి ధీయుక్తి యొప్ప నేకతమున
నప్పెట్టె దెఱచి, తానప్పుడందు

వినుత హేమకవచుఁ గనకకుండలధరు
ననుపమానతేజు, ఘనుఁగుమారుఁ
గని, మనంబులోన ననయంబు విస్మయం
బొనర గ్రుచ్చి యెత్తికొని ముదమున

పై పద్యమందలి విశేషములోపాటు దీనిలో ఎత్తుగీతి యందలి సర్వపాద ములందును ప్రాసాక్షరము పాటింపబడినది. నన్నయ రచనలో నిట్టివి లేవు. లాక్షణికులు చెప్పిన సీసభేదములలో నివి యిముడవు.

నన్నయ రచించిన 251 సీసములలో 225 సీసములకు ఎత్తు గీతులు ఆటవెలదులు. ఎర్రయరుచి దీనికి భిన్నము. ఆయన వ్రాసిన 102 సీసములలో 62 సీసములకే ఆటవెలదులు గలవు.

తేటగీతి, ఆటవెలది విషయమునగూడ నన్నయ నియమములను ఎట్టియ పాటించెను. వీనిలో మూడింట రెండు వంతులు కేవల యతిమైత్రి గలవి.

భిన్నవృత్తములను స్వీకరించుటలో నన్నయకు ఎట్టనకు ఎంతో రుచిభేదము కనబడుచున్నది. ఆరణ్యపర్వమున—

	నన్నయవి	ఎట్టినవి
శార్దూలము	2	18
మత్తేభము	10	69
ఉత్పలము	39	126
చంపకము	59	135
కందము	388	413
గద్యము	519	496

ఆరణ్యపర్వమున నన్నయ రచన 1299 గద్యపద్యము లనియు, ఎట్టిన రచన 1595 గద్యపద్యములనియు దృష్టియందుంచుకొని చూచినచో నన్నయ కంటె ఎట్టిన పద్యములందును, విశేషించి వృత్తములందును ఎక్కువ ఆసక్తి ప్రదర్శించినట్లు స్పష్టముకాగలదు. వారు రచించిన భాగములందలి వస్తుస్వభావము దీనికి కొంత కారణమైనను ప్రధానకారణము వారి యభిరుచి భేదమే.

కవితారీతి

ఉన్నతగోత్రసంభవము నూర్జితసత్త్వము భద్రజాతి సం
పన్నము నుద్ధతాన్య పరిధావి మదోత్కటము న్నరేంద్ర పూ
జోన్నయనోచితంబు నయి యొప్పెడు నన్నయభట్ట కుంజరం
బెన్న నిరంకుశోక్తిగతి నెందును గ్రాలుట ప్రస్తుతించెదన్.

నన్నయనుగూర్చి ఎఱ్ఱన ప్రత్యేకించి చేసిన ప్రశంస యిది. నన్నయ భట్ట కుంజరముయొక్క నిరంకుశోక్తిగతి ఎఱ్ఱియను ఆకర్షించినది. 'తత్కవితా రీతియుఁ గొంతదోప' ఆరణ్యపర్వ శేషము రచింతునన్నపుడు 'రీతి' యనగా ఎఱ్ఱన పద సంఘటనా రూపమైన రీతినే ప్రముఖముగా ఉద్దేశించి యుండవలయును. నన్నయ యక్షర రమ్యతయు అందే అంతర్భవించును. నన్నయ పద్యరచనావిధానము అందే గతార్థమగును. ఇదియే ఎఱ్ఱియ అభిప్రాయమైనచో ఆయన తన సంకల్ప నిర్వహణమున చరితార్థుడైనట్లే భావింపవచ్చును.

రయ విచలత్తురంగమ తరంగములన్, మదనాగనక్ర సం
చయములఁ జంచలచ్చటుల సైనిక మత్స్యములన్, మహోన్నతం
బయి కురురాజచంద్రు నుదయంబునఁ దద్దయుఁబొంగెఁ బ్రస్ఫుర
ద్భయదమనోహరప్రకట భంగులఁ దద్భటవార్ధి యుద్ధతిన్.

చామర పుండరీక విలసత్పిత చారుపతాకలం గురు
గ్రామణియాత్ర యెంతయును గాంతి వహించె నభంబు, శారదో
ద్దామ మరాళమండలసిత స్ఫుట పద్మవనీ పరిస్ఫుర
త్తామరసాకరంబున విధంబున భూచర నేత్రపర్వమై.

అతులితపుష్ప పల్లవ ఫలాన్విత భూరుహభూరి వల్లరీ
వితతముఁ జారుకైరవనవీన సరోరుహషండ మండలా
యతసరసీ మనోహరమునైన పురోపవనంబునన్ సము
న్నత విభవుండు వాసభవనంబు లొనర్పఁగఁ బంచియిమ్మిలన్,

మొదటి పద్యమున సగము నన్నయ కవితయే. తక్కిన వానిలో కొంతయేకాక యించుమించుగా నంతయు నన్నయ కవితారీతియే. నన్నయ పద్యములే యనిపించునవి ఎఱ్ఱయ రచనలో వందలు కలవు. అది ఆయన సాధనచేసి సాధించిన నైపుణి. ఇట్లని ఆయన వ్యక్తిత్వమును చాటు పద్యములు లేకపోలేదు.

అలస విలాస లాలస రసాన్వితలైన నితంబినీ జనుల్
వలసిన, భూరివిస్ఫురితవస్తు సమగ్రములైన గ్రామముల్
వలసిన, నుల్లసన్మణి సువర్ణవిభూషణ గోధనావళుల్
వలసినఁ గోరు మిచ్చెద ధ్రువంబుగ" నావుడు నాతఁడిట్లనున్.

ఈ పద్యరచన ఆయన స్వోపజ్ఞమే. క్రియాపదముతో పద్యమునెత్తికొనుట ఆయనకు మిక్కిలి యిష్టము.

కనియెం గోమల నీలమేఘ సుభగాకారున్, జటావల్కలా
జినధారున్, సితభూతి భూషితుని, రాజీవాక్షు గల్యాణ కీ
ర్తను గాకుత్స్థకుల ప్రదీపకుని, సీతాలక్ష్మణోపేతు, స
న్మునిలోకార్చితు, సత్కృపాభరణు, రామున్, రాజచూడామణిన్.

ఇది భరతుడు చిత్రకూటమున శ్రీరాముని చూచినప్పటిది.

దదర్శ దండకారణ్యే స రామం సహలక్ష్మణం
తాపసానా మలంకారం ధారయంతం ధనుర్ధరమ్,

అనిమూలము. పద్యమునెత్తుగడకు మూలమే దారిచూపినను ఆయెత్తుగడ మత్తేభ మున రాణించినంతగా మూలశ్లోకమున రాణించుటలేదు. సావిత్రి యముని చూచినపుడును, ధర్ముడు యక్షరూపమున ధర్మరాజునెదుట నిల్చినపుడును పద్యముల ఎత్తుగడ ఇట్లేయున్నది. ఆకస్మిక వస్తుసాక్షాత్కార వ్యంజనమునకు ఇట్టియెత్తుగడ మిక్కిలి యుచితముగా నున్నది.

ఎఱుగక తప్పుగా మెలగెనేనియు, దానికి సైచి నేరుపుల్
గఱపి ప్రియంబుతో గొలువు గైకొనగా దగుమీకు; బాలురుం
దెఱవలు, వృద్ధులుం- దమకుదెల్లమ- దప్పులు సేసిరేనియున్
మఱతురుగాని యల్గరు సమగ్రశమాన్వితులైన తాపసుల్,

లోకవ్యవహారమునకు అత్యంతసన్నిహితమైన వాక్యయోజన తిక్కనరీతి. ఈ పద్యము తిక్కనముద్ర వహించిన యెఱ్ఱనరచన.

ప్రీతుండై చనుదెంచె నాశ్రితజనాభీష్ట క్రియాశీలుడు
ద్గీతామ్నాయుడు. నిర్విధూత దురితక్లేశుండు, యోగామృత
స్నేతస్వాంతుడనంతసంతతసవ్యావిర్భూత కారుణ్యధా
రాతోయస్నపనైకశీలుడగు పారాశర్యుడచ్చోటికిన్.

ఈ పద్యము నందలి ధార నన్నయది, విఱుపులు తిక్కనవి, పదము లిరువురివి, కూర్పు ఎఱ్ఱనది. ఈ పద్యమున కవిత్రయమున్నది. కవిత్రయమున కాశ్రయమైన వేదవ్యాసుడున్నాడు.

ఉపసంహారము

కలియుగధర్మము వర్ణించుచు ఎఱ్ఱయ ఒక పద్యముప్రాసెను.

వివిధవ్యాఘ్ర మృగోరగాకులములై, విస్తీర్ణశూన్యాటవీ
నివహాభీలములై, యరాజకములై, నిర్మూలధర్మంబులై
ద్రవిళాభీ రతురుష్క బర్బరపులిందవ్యాప్తి దుష్టంబులై
భువిలోనెల్లెడ బాధగున్ జనపదంబుల్ దద్యుగాంతంబునన్

కలిధర్మము అన్నిదేశము లందును వ్యాపించినది. ఆంధ్రదేశమున మాత్రము అడుగుపెట్టలేదు. వేమారెడ్డివంటి ప్రభువు, మల్లారెడ్డివంటి దండనాధుడు, ఎఱ్ఱాప్రెగ్గడవంటి భవ్యచరిత్రుడైన మహాకవి వేదధర్మమును రక్షించుచుండగా ఆంధ్ర దేశమున కలిధర్మము ఎట్లు కాలుపెట్టగలదు ?

తననాటి కవీశ్వరులచే ప్రబంధపరమేశ్వరుడని కొనియాడబడిన ఎఱ్ఱన నన్నయభట్ట తిక్కకవినాథుల కెక్కిన భక్తి పెంపున ఆరణ్యపర్వశేషము పూరించి, గంగాయమునలవంటి ఆమహనీయుల కవితానదీమతల్లుల నడుమ సరస్వతీనది వంటి తన కవితను అంతర్వాహినిగా చేసి ఆంధ్రమహాభారతమునకు కవితా త్రివేణీ సంగమ పవిత్రతను నమకూర్చెను. ఎఱ్ఱయ ఎంత సౌమ్యమతియో ఆయన కవిత అంత సౌందర్యవతి. విఖ్యాతమాధుర్య మనోహరముగా ఆయన రచించిన ఆరణ్య పర్వశేషము ప్రతిపద్యరమణీయమైన పుణ్యకథాప్రబంధమండలి. దానియందములు సవిస్తరముగా నుపన్యసించుటకు ఈపీఠిక చాలదు. నాకు శక్తియును చాలదు.

వావిళ్ళ వారి ప్రతిని ఉస్మానియా విశ్వవిద్యాలయము వారి సంశోధితప్రతిని ఆధారము చేసికొని ఈ సంస్కరణమును సిద్ధము చేసితిని. ఈ పీఠికను తయ్యారు చేయుటతో ఎందరెందరి రచనలో ఉపయోగపడినవి. వారందరికి వందనములు. ఈ ప్రతిని సిద్ధముచేయుటలో తోడ్పడిన శిష్యులకు ఆశీర్వచనములు.

అందఱికి అందుబాటులో నుండునట్లు ఆంధ్రమహాభారతమును పండ్రెండు సంపుటములుగా ప్రకటింపబూనిన ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీ వారి ఉద్యమము ఉదారమైనది. పీఠికా సహితముగా ఆరణ్యపర్వమును సిద్ధముచేయు బాధ్యత నాకు అప్పగించి తాము తలపెట్టిన పుణ్యకార్యమున పాలుగొనుటకు నాకు అవకాశము కల్పించిన సాహిత్య ఆకాడమీ పాలకవర్గమునకు కృతజ్ఞత నివేదింతును.

ఇతి శివమ్.

23, జనవరి 1971.

పాటిబండ మాధవశర్మ.

విషయసూచిక

ఆరణ్యపర్వము – ప్రథమాశ్వాసము

విషయము		పుట.
శౌనకుఁడు ధర్మరాజునకు ధర్మంబులు సెప్పుట	....	4
ధర్మరాజు సూర్యు నారాధించి వరంబుఁ గొనుట	....	8
విదురుఁడు ధృతరాష్ట్రుని విడిచి పాండవుల యొద్దకుఁ బోవుట	....	10
ధృతరాష్ట్రునకు వ్యాసుఁ డింద్రసురభి సంవాదంబు సెప్పుట	....	14
మైత్రేయుఁడు దుర్యోధనుని శపించుట	....	18
కిమ్మీరుఁ డను రాక్షసుఁడు భీమునిచేఁ జచ్చుట	....	20
యాదవ పాంచాలాదులు పాండవుల కడ కేతెంచుట	....	21
ద్రౌపది శ్రీకృష్ణునితోఁ దనపరిభవంబు సెప్పి దుఃఖించుట	....	24
కృష్ణుఁడు ధర్మరాజునకు సౌభకాఖ్యానంబు సెప్పుట	....	27
సాల్వుఁడు ప్రద్యుమ్ననిచే బాధితుండై మరలి పోవుట	....	31
పాండవులు ద్వైతవనంబునకు వచ్చి యుండుట	....	35
ద్రౌపదీ ధర్మరాజుల సంవాదము	....	37
భీమసేన ధర్మరాజుల సంవాదము	....	43
కృష్ణద్వైపాయనుఁడు ధర్మరాజు నొద్దకు వచ్చుట	....	49
ఈశ్వరుండు గిరాతవేషంబున నర్జును నొద్దకు వచ్చుట	....	54
అర్జునుఁడు పరమేశ్వరుని స్తోత్రము సేయుట	....	58
ఇంద్రుఁడు దేవగణంబులతో నర్జునునకుఁ బ్రత్యక్షం బగుట	....	61
అర్జునుఁ డమరావతికిఁ బోవుట	....	63
ఊర్వశి యర్జును నపుంసకునిఁగా శపించుట	....	67

ఆరణ్యపర్వము - ద్వితీయాశ్వాసము

ధర్మరాజునకు బృహదశ్వుండు నలోపాఖ్యానంబు సెప్పుట	....	75
నలుఁడు దమయంతి యొద్దకు దేవదూతయై పోవుట	....	80
నలుఁడు స్వయంవర లబ్ధయైన దమయంతిం బెండ్లి యగుట	....	83
నలుండు దమయంతీ సహితుండై యడవికిఁ బోవుట	....	86
దమయంతి శాపంబునం గిరాతుండు సచ్చుట	....	90
దమయంతి సుబాహుపురంబు ప్రవేశించుట	....	94

విషయము		పుట
నలుఁడు గర్కోటకునిచేత దష్టుం డగుట	...	96
చేదిపురంబున సుదేవుఁడను బ్రాహ్మణుఁడు దమయంతి నెఱుంగుట	....	99
దమయంతి నలు నెడఁబాసి విదర్భాపురంబు సేరుట	....	101
నలుండు గలిచేత విముక్తుండై విదర్భకుఁ బోవుట	...	106
కేశిని యను దూతి దమయంతితో నలుని గుణంబులు సెప్పుట	....	109
నఱుఁడు నిజరూపంబుతో దమయంతిం గూడుట	...	113
ధర్మరాజు నొద్దకు నారదమహాముని వచ్చుట	....	115
రోమశమహాముని ధర్మరాజు నొద్దకు వచ్చుట	....	130
రోమశుండు ధర్మరాజునకు ధర్మవిశేషంబులు సెప్పుట	....	133
అగస్త్యుండు లోపాముద్రను వివాహం బగుట	....	137

ఆరణ్యపర్వము – తృతీయాశ్వాసము

అగస్త్యచరిత్రము	...	142
దేవతలు వైకుంఠమునకుఁ బోయి విష్ణుని స్తుతియించుట	....	144
అగస్త్యుఁడు వింధ్యంబు పెరుఁగకుంట వారించుట	....	145
అగస్త్యుఁడు సముద్రోదకంబు పానంబు నేయుట	....	147
భగీరథుండు సముద్రము జలముచే నించుట	....	149
సగరసుతులు కపిలమహాముని కోపాగ్నిచే భస్మమగుట	....	152
రోమశుఁడు ధర్మజునకు ఋష్యశృంగు చరిత్రము సెప్పుట	....	156
ఋష్యశృంగుఁడు వేశ్యను మునికుమారునిఁగా భావించుట	...	157
విభాండకుఁడు ఋష్యశృంగుని వెదకుచు వచ్చుట	....	161
అకృతవ్రణుఁడు ధర్మరాజునకుఁ బరశురాముని మహిమ సెప్పుట	....	163
పరశురాముఁడు కార్తవీర్యునిఁ జంపుట	....	167
రోమశుఁడు ధర్మజునకు సౌకన్యాఖ్యానంబు సెప్పుట	...	171
చ్యవనుఁ డాశ్వినుల సోమపీథులఁ జేయుట	....	173
మాంధాతృ చరిత్రము	....	175
సోమకుం డను రాజర్షి చరిత్రము	....	177
శిబి యను రాజర్షి చరిత్రంబు రోమశుఁడు ధర్మజునకుఁ జెప్పుట	....	180
రోమశుఁడు ధర్మజునకు నష్టావక్రు చరితంబు చెప్పుట	....	182
రోమశుఁడు ధర్మరాజునకు యవక్రీతు చరిత్రంబు చెప్పుట	...	185
దేవత అర్వావసునకు మెచ్చి కోరిన వరంబులెల్ల నిచ్చుట	....	189
పాండవులు గంధమాదన పర్వతంబునకుం బోవుట	...	192
భీముఁడు సౌగంధికహరణార్థంబు పోవుట	...	196

విషయము		పుట.
భీమునకు హనుమంతుండు చతుర్వ్యాచార వర్తనంబులను దెలుపుట	—	201
హనుమంతుఁడు భీమునకుఁ దనపూర్వ రూపంబుఁ జూపుట	—	202
భీముఁడు యక్ష రాక్షసులతో యుద్ధంబు సేయుట	—	206
భీముఁడు జటాసురునితో యుద్ధంబు సేయుట	—	209

ఆరణ్యపర్వము - చతుర్థాశ్వాసము

ఇంద్రుండు పాండవుల యొద్దకు వచ్చుట	—	219
అర్జునుఁడు నివాతకవచు లను రాక్షసుల జయించిన కథ	....	222
అజగరోపాఖ్యానము	....	228
ధర్మరాజు భీమసేనుని వెదకఁ బోవుట	—	230
ధర్మరాజు నహుష ప్రశ్నంబులకుఁ బ్రత్యుత్తరంబు లిచ్చుట	—	232

ఇక్కడ నుండి ఎఱ్ఱాప్రగ్గడ కవిత్వము

శ్రీకృష్ణుఁడు సత్యభామతోడఁ బాండవుల యొద్దకు వచ్చుట	—	236
మార్కండేయుం డను మహాముని పాండవుల యొద్దకు వచ్చుట	....	239
మార్కండేయుఁడు ధర్మజునకు బ్రాహ్మణ ప్రభావంబు సెప్పుట	....	242
అత్రిగౌతముల పరస్పర సంవాదము	—	245
మార్కండేయుండు ధర్మరాజునకు వైవస్వతు వృత్తాంతంబును దెల్పుట	....	248
మార్కండేయుండు ధర్మరాజునకుఁ బ్రళయప్రకారంబు సెప్పుట	....	252
నారాయణుఁడు మార్కండేయునకుఁ దన ప్రభావంబు సెప్పుట	....	256
మార్కండేయుండు ధర్మరాజునకుఁ గలియుగధర్మంబులు సెప్పుట	....	259
కలియుగంబున విష్ణుండు గల్కిరూపంబున ధర్మంబు ప్రతిష్ఠించుట	....	263
మార్కండేయుండు ధర్మరాజునకు బ్రాహ్మణ ప్రభావంబు సెప్పుట	....	265
,, ,, ఇంద్రద్యుమ్ను చరిత్రము సెప్పుట	—	273
,, ,, కువలాశ్వు చరిత్రము సెప్పుట	....	275
,, ,, మధుకైటభుల చరిత్రము సెప్పుట	....	279

ఆరణ్యపర్వము - పంచమాశ్వాసము

ధర్మజునకు మార్కండేయుఁడు పుత్రున కుండఁదగు గుణంబులం దెల్పుట	....	284
మార్కండేయుఁడు ధర్మజునకుఁ బతివ్రతామాహాత్మ్యంబు సెప్పుట	....	285
కౌశికుండను బ్రాహ్మణుఁడు ధర్మవ్యాధుని యొద్దకుఁ బోపుట		289
ధర్మవ్యాధుడు కౌశికునకు ధర్మవిశేషము లెఱిఁగించుట	....	291
ధర్మవ్యాధుఁడు కౌశికున కహింసాస్వరూపంబు సెప్పుట	....	293

విషయము		పుట
ధర్మవ్యాధుఁడు కౌశికునకు జీవలక్షణంబులు సెప్పుట	....	297
ధర్మవ్యాధుఁడు కౌశికునకు బ్రహ్మవిద్యా ప్రపంచంబెఱింగించుట	....	298
ధర్మవ్యాధుఁడు కౌశికునకు సత్వరజస్తమో గుణముల తెఱంగెఱింగించుట	—	310
ధర్మవ్యాధుఁడు కౌశికుని దన తల్లిదండ్రులకడకుఁ గొనిపోవుట	....	305
ధర్మవ్యాధుఁడు కౌశికునకుఁ దనపూర్వజన్మ వృత్తాంతంబు సెప్పుట	....	306
మార్కండేయుఁడు ధర్మజునకు నంగిరసుం డగ్ని యైన తెఱంగు సెప్పుట	—	309
ఇంద్రుఁడు గేశియను రాక్షసునిఁ బాఱఁదోలుట	....	315
కుమారస్వామి యవతారము	—	320
ఇంద్రుఁడు కుమారస్వామిపై నెత్తివచ్చుట	....	322
ఈశ్వరుండు కుమారస్వామియొద్దకు వచ్చుట	—	325
కుమారస్వామి సప్తమాతృకల బాలగ్రహంబులఁ జేయుట	—	328
ఈశ్వరుండు గుమారసహితుండై భద్రవటంబు నేరుట	....	330
కుమారస్వామి మహిషాసురుఁ జంపుట	....	331
సత్యాద్రౌపదీ సంవాదము	....	335
ద్రౌపది సత్యభామకుఁ బతివ్రతాధర్మంబు సెప్పుట	....	339
ధృతరాష్ట్రుఁడు పాండవుల వనవాసక్లేశంబునకు దుఃఖించుట	....	342
కర్ణశకుని దుర్యోధనులు మంతనంబు సేయుట	....	345
కర్ణసౌబలులు ధృతరాష్ట్రుఁచేత ఘోషయాత్ర కనుజ్ఞ గొనుట	....	348
దుర్యోధనుఁడు ఘోషయాత్రవోవుట	....	349
చిత్రసేనుండను గంధర్వరాజు దుర్యోధనునితో యుద్ధము సేయుట	....	354
భీమార్జున నకులసహదేవులు గంధర్వులతో యుద్ధంబు సేయుట	—	358
చిత్రసేనుఁడు ధర్మరాజునొద్దకు వచ్చి దుర్యోధనుని విడిచిపెట్టిపోవుట	—	361

ఆరణ్య పర్వము - షష్ఠాశ్వాసము

దుర్యోధనుని విషాదము	—	363
దుర్యోధనుండు ప్రాయోపవేశము సేయఁబూనుట	—	366
ప్రాయోపవిష్టుండైన దుర్యోధనునిఁ గృత్య పాతాళంబునకుఁ గొనిపోవుట	—	371
దుర్యోధనుఁడు ప్రాయోపవేశము మాని కరిపురంబునకుఁ బోవుట	—	374
దుర్యోధనుఁడు వైష్ణవంబను యజ్ఞము సేయుట	—	376
ద్వైతవనంబునందలి మృగసమూహము ధర్మజుస్వప్నమునందు వచ్చి తమ దుఃఖంబు సెప్పుట	—	380
వ్యాసుఁడు ధర్మజునకు ప్రీహిద్రోణాఖ్యానంబు సెప్పుట	....	383
ముద్గలునకు దేవదూత పుణ్యలోకంబు తెఱంగు సెప్పుట	....	385

విషయము		పుట
సైంధవుండు ద్రౌపదిం జూచి మోహించుట	...	388
ద్రౌపది సైంధవునితో నిష్ఠురోక్తులు వలుకుట	...	393
సైంధవుఁడు ద్రౌపదిని బలాత్కారముగా నెత్తికొని పోవుట	...	395
పాండవు లేవురు సైంధవుపై యుద్ధమునకుఁ బోవుట	....	398
అర్జునుఁడు సౌవీర కుమారులం బన్నిద్దఱిఁ జంపుట	....	403
భీముఁడు సైంధవం బట్టికొని పరిభవించుట	....	405
ధర్మజునకు మార్కండేయుఁడు రామాయణ కథ నెప్పుట	...	408
బ్రహ్మ రావణకుంభకర్ణ విభీషణులకు వరంబు లిచ్చుట	....	411
దశరథుఁడు రామవిశ్లేషముచే సురలోకగతుం డగుట	....	415
మారీచుఁడు మాయామృగంబై చనుదెంచుట	...	419
రావణుఁడు సీత నెత్తికొని లంకకుఁ బోవుట	....	422
శ్రీరాముఁడు కబంధుఁ డను రాక్షసుం జంపుట	....	425
వాలిసుగ్రీవుల యుద్ధము	...	428
త్రిజట తన స్వప్న వృత్తాంతము సీతతోఁ జెప్పుట	...	431

ఆరణ్యపర్వము - సప్తమాశ్వాసము

రాముఁడు లక్ష్మణుని సుగ్రీవునొద్దకుఁ బంపుట	....	436
హనుమంతుఁడు రామునితో సీతం జూచిన వృత్తాంతము నెప్పుట	...	439
వానర వీరులు నానాదేశంబులనుండి సుగ్రీవునొద్దకు వచ్చుట	...	443
రాముఁడు దర్భశయనుం డై సముద్రుం బ్రార్థించుట	....	445
అంగదు రాయబారము	....	447
ప్రహస్తధూమ్రాక్షుల యుద్ధము	....	451
కుంభకర్ణుఁడు యుద్ధము సేయుట	....	454
ఇంద్రజిత్తు లక్ష్మణునితోడ యుద్ధము సేయుట	....	458
ఇంద్రజిత్తు లక్ష్మణునిచేతఁ జచ్చుట	....	461
శ్రీరాముఁడు రావణాసురుని సంహరించుట	....	464
మార్కండేయుఁడు ధర్మజునకు సావిత్ర్యుపాఖ్యానంబు నెప్పుట	....	467
సావిత్రి సత్యవంతుని వివాహం బగుట	....	472
సత్యవంతుఁడు సావిత్రిసహితుండై వనంబునకుఁ బోవుట	....	474
సావిత్రి యమునివలన నభీష్టవరంబులు వడయుట	...	477
సత్యవంతుడు సావిత్రితోడ మరలి తన యాశ్రమంబునకు వచ్చుట	....	483
సూర్యుఁడు బ్రాహ్మణ వేషంబునఁ గర్ణునకు హితంబు నెప్పుట	....	486
సూర్యుఁడు గర్ణునితో నింద్రుచే శక్తిఁ గైకొనుమని చెప్పుట	...	490

విషయము		పుట
కుంతి దుర్వాసునకుఁ బరిచర్య సేయుట	—	493
కుంతి సూర్యుని వరంబున గర్భంబు దాల్చి కర్ణుం గాంచుట	—	496
ధర్మరాజు బ్రాహ్మణుని యరణి దెచ్చుటకుఁ బోవుట	—	503
నకులాదులు యక్షుని నిరాకరించి నీరు ద్రావి మూర్ఛితులగుట	—	505
ధర్మరాజు యక్షప్రశ్నముల కుత్తరంబు లిచ్చుట	—	510

శ్రీః

గణేశ శారదా గురుభ్యో నమః

శ్రీ మదాంధ్ర మహాభారతము.

ఆరణ్యపర్వము - ప్రథమాశ్వాసము

శ్రీ కీర్తిశ్రీ వల్లభ
లోకజనస్తుత్య సర్వలోకాశ్రయ ర
త్నాకరపరివృతసకలధ
రాకాంత జితారి రాజరాజనరేంద్రా. 1

వ. అక్కథకుండు శౌనకాదిమహాములకుం జెప్పె; నట్లు పాండవులు నిజాయుధంబులు ధరియించి కృష్ణాసహితులై యుత్తరము మించి యరిగిన నింద్రసేనాదులైన మూలభృత్యులు పదునాలుగువేల రథంబులతోడ సుభద్రాభిమన్యు ప్రతి వింధ్యాదులం దోడ్కొని వారిపిలుంద నరిగి; రంత నప్పాండవులం జూచి పౌరు లెల్లఁ బరమదుఃఖితులై. 2

క. "చనునె యధర్మద్యూతం
బున నిట్టుల పాండురాజపుత్రులఁ బ్రభులఁ
వనగతులఁ జేయ దుర్యో
ధనధృతరాష్ట్రులకు విగతదయహృదయులకుఁ? 3

క. క్రూరతరధార్తరాష్ట్రుని
కారము వారింప నైరి గాంగేయుఁడు న
బ్భారద్వాజుఁడుఁ గృపుఁడు ను
దారుఁడు విదురుండు; నేమి దలఁచిరో బుద్ధిఁ? 4

సీ. కర్ణజయద్రథగాంధారు లాప్తులై
యుండంగ లోభి దుర్యోధనుండు
రాజు గా నీతని రాజ్యంబునం దెట్టు
లుండఁగ నేర్తు మీయుర్వి నింక

నేది ధర్మ్మవు? ప్రజ నెవ్వరు గాతురు ?
పరమధార్మ్మికులై న పాండుసుతుల
యరిగినచోటిక యరుగుద"మని వారి
పిఱుదన చని పాపభీతమతులు

ఆ. "వీరులార ! మమ్ము విడిచి మీ కరుగంగ
జనునె? మాకు నొండుశరణ మెద్ది ?
సాధులకు నసాధుసహావాసమునఁ బాప
సంప్రయోగ మగుట సందియంబె ? 5

క. తిలలును నీళ్ళును వస్త్రం
బులుఁ బుష్పసుగంధ వాసమున సౌరభముం
బొలు పెసఁగఁ దాల్చుఁ గావున
నలయక సత్సంగమమున నగు సద్గుణముల్. 6

వ సాధుసమ్మతంబు లైన గుణంబుల నొప్పి జన్మవిద్యాకర్మ్మంబులం బ్రశ
స్తుల లై యార్యవృత్తుల లైన మీసహావాసంబుననుండి ధర్మ్మపరులమై
కృతార్థుల మగుదుము; దుష్కృత్యంబులయం దనారంభు లయ్యును
జనులు దుర్జనదర్శనస్పర్శనసంభాషణసహాసనంబులంజేసి ధర్మ్మవిహీను
లగుదురు; గావున నేము దుర్యోధను రాజ్యంబున నుండ నోపము; మా
యనుగమనంబున కొడంబడవలయు"నని కృతాంజలు లైన నప్పాండవులం
జూచి ధర్మ్మతనయుం డిట్లనియె 7

క "మాయందు లేని గుణములు
మీ యనురాగమునఁజేసి మిగిలి వెలింగెఁ;
మీ యనుగతి మాకు నభి
ప్రాయము; వనవాసదుఃఖభర మోపుదురే ? 8

తే. వలవ దుడుగుండు మి"రని వారినెల్లఁ
గరుణఁ బాండవజ్యేష్ఠుండు గ్రమ్మఱించెఁ;
బౌరు లట్టు నివర్తింపఁబడి నిరంత
రార్తనాదు లై యరిగిరి హస్తిపురికి. 9

వ. ఇట్లు పాండవులు గృతప్రస్థానులై గంగాతీరంబునం బ్రమాణాఖ్య వటంబున విడిసి గంగాస్నానంబు సేసి నాఁటిపగలును రాత్రియు నంద యుండి; రంతఁ బ్రభాత సమయంబున. 10

చ పరువడి నగ్నిహోత్రములు, బంధులు, శిష్యులుఁ దోడ రా మహీ
సురవరు లెల్లఁ బాండునృపసూనుల యొద్దకుఁ బ్రీతి నేఁగుదెం
చిరి బహువేదఘోషములఁ జేసి నిరస్తసమస్తకిల్బిషో
త్కరు లగుచున్న ధన్యులు జగత్పరిపూజ్యులు బ్రహ్మసమ్మితుల్ 11

వ. ఇట్లు దమతోడన వనవాసంబు సేయ నిశ్చయించి వచ్చిన విప్రుల నతి ప్రీతి గౌరవంబున నర్చించి తదాశీర్వాదంబుల సభినందితుం డై ధర్మ తనయుండు వారల కిట్లనియె. 12

క. "అపహృతసర్వస్వుల మై
సపత్నుల నికారమునఁ బ్రచండాటవిలో
విపులఫలశాకమూలము
లుపయోగించుచును నిష్ఠ నుండెదు మాతోఁ. 13

క. రా నేల? వచ్చి నవయం
గా నేల? నివాసములకుఁ గ్రమ్మటి చనుఁ; డు
గ్రానేకపశార్దూలభ
యానకవనవాస మర్హ మగునే మీకుఁ?" 14

వ. అనిన విని బ్రాహ్మణులు పరమదుఃఖితులై "మీర కాని మాకు నొండు గతి లేదు; మమ్ము ననన్యశరణ్యుల విడుచుట ధర్మంబు గాదు. 15

ఆ. ఆశ్రితులను, భక్తు లగువారి నన్యుల
నైన విడువఁజాల రట్టి! విప్ర
వరుల, భక్తిపరుల వసుధేశ! మీయట్టి
ధార్మికులకు విడువఁ దగునె చెపుమ? 16

వ. అగ్నిత్రోషణోపాయచింత సేయ వలదు; వన్యమూలఫలంబుల నేమ తెచ్చికొని యుపయోగించుచు జపహోమాది పుణ్యక్రియల మీకుం బ్రియంబు సేయుచునుండెద; మధర్మవర్తి యయి మీ కపకారంబు సేసిన ధార్తరాష్ట్రుల రాష్ట్రంబున నుండ నోప" మనిన వారలరాక కొడంబడి. 17

తే. "ఇష్టమృష్టాన్నములఁ దొల్లి యెల్ల ప్రొద్దుఁ
దృప్తు లగుచున్న వసుమతీదేవవరులఁ
గానలందు శాకాశనుల్ గాఁగ నెట్లు
సూడనోపుదు"నని ధర్మసూనుఁ డపుడు. 18

—: శౌనకుఁడు ధర్మరాజునకు ధర్మంబులు సెప్పుట :—

వ. శోకమూర్ఛితుండై మహీతలంబుపయిం బడిన నాతని నాశ్వాసించి శౌనకుండను బ్రహ్మఋషి దొల్లి యాత్మవ్యవస్థానార్థంబు జనకకృతంబు లయిన శ్లోకంబుల యర్థంబులు యుధిష్ఠిరున కిట్లనియె. 19

క. "శోకభయస్థానంబు ల
నేకంబులు గలిగినను విహీనవివేకుం
డాకులతఁ బొందునట్లు వి
వేకము గలవాఁడు బుద్ధివికలుం డగునే ? 20

క. శారీరమానసమహా
దారుణదుఃఖములఁజేసి తఱిఁగి శరీరుల్
క్రూరతరబాధఁ బొందుదు;
రా రెంటిని జెఱుతు రార్యు లమలినబుద్ధిన్. 21

వ. వ్యాధి శ్రమానిష్టసంస్పర్శనేష్ట వివర్జనంబులను నాశ్లింటంబుట్టి శారీరదుఃఖంబు లాశుక్రియాది ప్రతియోగంబుల నుపశమిల్లు; మఱి స్నేహజంబు లయిన మానస దుఃఖంబులు జలంబుల నగ్ని యుపశమిల్లునట్లు విమలజ్ఞానంబునం జేసి యుపశమంబునం బొందు. 22

క. స్నేహార్ణవమగ్నుం డయి
దేహి మహాదుఃఖముల నధృతిఁ బొందును; దుఃఖా
హాతుఁడు శోకతాపవి
మోహి యగున్; స్నేహమూలములు రాగాదుల్. 23

వ. కావున బంధుమిత్రధనసంచయంబులవలని స్నేహంబు విడుచునది; పద్మపత్రంబు నీరం బొందనియ ట్లెఱుకగలవారి నెట్టియెడలను స్నేహంబు వొందదు; స్నేహంబున రాగంబును రాగంబునం గామంబును గామంబునం గ్రోధంబును గ్రోధంబునం దృష్ణయు వర్తిల్లు. 24

క. అది సర్వదోషముల కా
స్పద; మది దురిత క్రియానుబంధంబులకుఁ
మొదలు; నిరంతరదుఃఖ
ప్రద మని మది దలఁచి తృష్ణఁ బాతురు సుమతుల్. 25

వ. మఱియుఁ దృష్ణాతురుం డర్థలోభంబునఁ గోటరస్థం బయిన యనలుం బునం జేసి దగ్ధంబగు వృక్షంబునుంబోలె వినాశంబునం బొందు; నర్థాసక్తుండైన వాఁడు శుభంబులు వడయ నోపండు; మృత్యువువలనం ప్రాణులకు భయంబు గలుగున ట్లర్థవంతులకు రాజ చోర స్వజన జలానలంబులవలన భయంబు నియతంబు. 26

తే. జలములందు మత్స్యంబులు, చదలఁ బక్షు
లామిషం బెట్లు భక్షించు నట్లు దివిరి
యెల్ల వారును జేరి యనేకవిధుల
ననుదినంబును భక్షింతు రర్థవంతు 27

క. అర్థమ యనర్థమూలం;
బర్థమ మాయావిమోహనావహము; నరుం
డర్థార్జనదుఃఖమున న
పార్థీకృతజన్మఁ డగుట పరమార్థ మిలఁ. 28

వ. అట్టియర్థంబువలన దర్పకార్పణ్యమానభయోద్వేగంబులు వుట్టుఁగావున నర్థోపార్జనచింత సేయవలదు; రూపయౌవన ధనవిభవ ప్రియసంవాసంబు లనిత్యంబులగుట నందు బుద్ధిమంతులు విమోహింప"రనిన నమ్మునివరునకు ధర్మతనయుం డిట్లనియె. 29

సీ ఆత్మోపభోగార్థ మర్థలాభేచ్ఛ నా
కెన్నఁడు లేదు; మహీసురాగ్ర
గణ్యుల నత్యుగ్రకాననాంతరమున
నెవ్విధంబున భరియింతునొక్కొ-
యని యిప్డు వగచెద; ననవద్యగుణయు క్తి
ననఘ! మాయట్టి గృహస్థతతికిఁ
బోష్యుల నెయ్యెడఁ బ్రోవక యుండను
విప్రుల నతిథుల వృథయ పుచ్చఁ

ఆ. జనునె ? నిజధనంబు సంవిభాగించి యీ
వలయు; సాధురక్ష వలయుఁ జేయ;
నభిమతాశ్రమంబు లందు గృహస్థాశ్ర
మంబ కాదె యుత్తమంబు వినఁగ. 30

వ. మఱి యార్తునకు శయనంబును, భీతున కభయంబును, దృషితునకు జలంబును, బుభుక్షితునకు నన్నంబును, శ్రాంతునకు నాసనంబును నిచ్చుట సనాతనం బైన యుత్తమగృహస్థధర్మంబు; తృణభూమ్యుదకప్రియవచనాదరదానం బెల్ల వారికి నవశ్యంబ; యాత్మార్థంబుగా నన్న పాకంబును, నసాక్షిక భోజనంబును, వృథాపశుఘాతంబును బాపహేతువు; లగ్నిహోత్రంబులు, ననడ్వాహంబులు, నతిథిబాంధవ విద్వజ్జన గురు మిత్రభామినీ నివహంబు లపూజితంబులై యెగ్గు సేయును; గావున గృహస్థుండు సర్వసంతర్పకుండు గావలయుం; గావునం బ్రతిదినంబును బక్షిశునకశ్వపచార్థంబు సాయంప్రాతస్స్నల యందు వైశ్వదేవంబు సేసి యమృతాశియు, విఘసాశియుఁ గావలయు; యజ్ఞశేషం బమృతంబు నాఁ బరఁగు; నతిథిభుక్తశేషంబు విఘసంబు నాఁబడు; నట్టిప్రవృత్తి వర్తిల్లువాఁ డుత్తమగృహస్థుం"డనిన ధర్మ రాజునకు శౌనకుం డిట్లనియె.

క. "హరివిషయాభిలాషము
గారణముగ నెంతయొఱుక గలవారును దు
ర్వారవికారముఁ బొందెడు
వారు నిజేంద్రియము లవి యవశ్యము లగుటఁ. 32

వ. సంకల్పజంబైన కామంబునం దగిలిన మనస్సుచేతం బ్రేరితంబై శ్రోత్రాదీంద్రియంబులు శబ్దాదివిషయంబులం బరిభ్రమించుటంజేసి విషయాభిషలాషవిశిఖవిద్ధులై దేహులు తేజోలుబ్ధంబులైన శలభంబులుం బోలె శోకానలంబునం బడి తమ్మెఱుంగక యవిద్యాకర్మతృష్ణలం జేసి సంసారచక్రంబునందుఁ బ్రవర్తిల్లుదు; రట్టి బ్రహ్మాది తృణపర్యంత భూతప్రవృత్తియందు రాగద్వేషవిముక్తులై యభిమానమత్సరంబులు విడిచి వేదచోదితంబైన సమ్యక్సంకల్పసంబంధం, బింద్రియనిగ్రహంబు, వ్రతవిశేషంబు, గురుసేవనం, బాహారయోగం, బధ్యయనాగమంబు,

కర్మసన్న్యాసంబు, చిత్తనిరోధం బను నెనిమిదింటను గర్మానుష్ఠానంబు
సేసిన మహాత్ములు దమ తమ తపోమహత్త్వంబునం జేసి సంసారంబు
జయింతురు; నీవును శుశ్రూషా శ్రవణ గ్రహణ ధారణోహాపోహార్థ
విజ్ఞాన తత్త్వజ్ఞాన సమన్వితుండవు; నీచేతం బ్రారబ్ధంబు లైన యవి
సర్వంబులును సంపన్నంబు లగు. 33

క. వసు రుద్రాదిత్యాదులు
వసుధేశ ! తపంబు గౌరవంబున నైశ్వ
ర్యసమృద్ధు లైరి; తపమునఁ
బ్రసిద్ధముగ నిష్టసిద్ధి వడయుము నీవున్. 34

వ. తపస్సిద్ధు లైనవారు దమ తలంచినదానిని క్రమంబునం బడయుదురు;
గావున నీవు నుపశమవంతుండవై తపంబు సేసి యోగార్థసిద్ధి వడసి
బ్రాహ్మణుల ననుచరించుచు నీమనోరథంబు సఫలంబు సేయు'' మనిన
శౌనకు వచనంబు సేకొని భ్రాతృమధ్యగతుం డైన ధర్మతనయుండు
ధౌమ్యునకు నమస్కరించి యి ట్లనియె. 35

తే. ''వనమునకు వచ్చి నవయంగ వలవ దుడుగుఁ
డనిన నుడుగక మితోన యరుగు దెంతు
మనిరి బ్రాహ్మణుల్; వీరి కాహార మేయు
పాయమున నుగ్రవనమునఁ బడయ నేర్తు? 36

వ. వీరల విడువనోప; నేమి సేయుదు?'' ననిన విని ధౌమ్యుండు
పెద్దయుం బ్రొద్దు చింతించి ధర్మరాజున కి ట్లనియె. 37

ఆ. ''భూతరాశి దొల్లి పుట్టి బుభుక్షాభి
తప్త మయినఁ జూచి తద్భయంబు
నపనయింపఁ గడఁగి యదితిసుతాగ్రణి
గమలబాంధవుండు గరుణతోడ. 38

వ. ఉత్తరాయణగతుం డై యుర్వీరసంబు పరిగ్రహించి, దక్షిణాయన
గతిం బర్జన్యభూతుం డై యోషధులం బడసి, రాత్రులయందుఁ జంద్ర
కిరణామృతంబునం జేసి వానిం దడుపుచు వర్ధించి, యం దన్నంబు
వుట్టించి ప్రజారక్షణంబు సేయుటం జేసి యన్నం బాదిత్యమయం బని

యెటింగి తొల్లి భీమవైన్యకార్తవీర్యనహుషాదులు యోగసమాధిస్థి
తులై సూర్యభజనంబున నన్నంబుఁ బడసి యాపదలవలనం బ్రజల
సముద్ధరించిరి గావున. 39

లయగ్రాహి.

వారిరుహమిత్ర, నమరోరగమునిద్యుచర
చారణగణప్రణుతచారుగుణ, లోకా
ధారు, నఖిల శ్రుతిశరీరు, హరిశంకరస
రోరుహభవప్రతిము, దారుణతమిస్రా
వారణమరీచిపరిపూరితదిగంతరుని,
భూరికరుణానిరతు, సూరుఁ, ద్రిజగద్ర
క్షారతు సహస్రకరుఁ, గోరి భజియింపుము మ
నోరథఫలంబు లగు భూరమణ నీకున్.'' 40

వ. అని ధౌమ్యుండు విశుద్ధాంతఃకరణుం డైన ధర్మరాజునకు సూర్యుం డర్థ
ముండు, భగుండను నివి మొదలుగాఁగల నామంబుల యష్టోత్తర
శతంబు నభీష్టసిద్ధిప్రదం బయిన దాని విస్పష్టార్థవర్ణోచ్చారణంబును
విధియుక్తంబునుగా నుపదేశించి ''దీనిని దొల్లి యింద్రువలన నార
దుండు వడసె; నారదువలన వసువను రాజు వడసె; నాతనివలన నేను
బడసితి; నేను నీ కిచ్చితిఁ; గిది దేవనిర్మితంబు; దీన నాదిత్యు నతిభక్తి
నారాధింపు'' మనిన. 41

—: ధర్మరాజు సూర్యునారాధించి వరంబు గొనుట :—

సీ. హితుఁడైన తపసిపురోహితు నుపదేశంబు
పేర్మితోఁ జేసికొని, ధర్మసుతుఁడు
నెమ్మిఁ బుష్పోపహారమ్ముల నాదిత్యుఁ
బూజించి, భాగీరథీజలంబు
లందుండి విషయంబులం దింద్రియంబుల
నమలవ్రతానుభావమున నొడిచి,
వాయుభోజనుఁడు ప్రాణాయామపరుఁడునై
సూర్యనామంబుల సూర్యుఁ గొలిచి

ఆ. జపము సేయుచున్నఁ దపనుఁ డాతనికిఁ బ్ర
త్యక్ష మయి త్రిలోకచక్షుఁ డమర
వరుఁడు దురితహరుఁడు తరణి త్రయీమూర్తి
వనజమిత్రుఁ డిట్టు లనియెఁ గరుణ. 42

వ. "నీ తపమునకు మెచ్చితి; నీ పంఁడెండ్లును వన్యఫలమూలశాకం
బులు నీ మహానసంబున ద్రుపదరాజపుత్రిచేత సాధితంబులై యక్ష
యంబు లైన చతుర్విధాహారంబులగు" నని యొక్క తామ్రస్థాలి
యిచ్చి వరం బిచ్చి వనజహితుం డంతర్హితుండైన. 43

చ. అడరఁగ ధర్మనందనుఁ డహర్పతిచేత వరంబు పేర్మితోఁ
బడసి మహీసురోత్తముల భవ్యలఁ బల్వుర నిర్వహించె న
ప్పుడు ద్రుపదాధిరాజసుత పొల్పుగ వండిసశాకమూలముల్
గడురుచి నిష్టభోజనసుఖంబులఁ దృప్తులఁ జేయు చుండఁగన్. 44

వ. ఇట్లనేక సహస్రమహీసురవరుల ననుదినంబును నభిమతభోజనంబులం
దనిపి విషసామ్యతభోజనంబులం దృప్తులైన తన పతుల భుక్తశేషంబు
ద్రుపదపుత్రిక యుపయోగించుచుండ గొన్నిదినంబు లంద యుండి
పాండవులు బ్రాహ్మణులచేతం గృతస్వస్త్యయనులై బ్రహ్మర్షిసంఘం
బులతోఁ గామ్యకవనంబున కరిగి; రంత నిట ధృతరాష్ట్రుండు విదురుం
బిలిపించి "నీవు భార్గవుకంటె బుద్ధిమంతుఁడవు; పాండవకౌరవులకు
సమ్మతుండవు; చెప్పు మింక నప్పాండవు లేమి సేయువా" రనిన
విదురుం డిట్లనియె. 45

మత్తకోకిలము. "దేవమూర్తులు పాండుపుత్త్రులు ధీరచిత్తులు; వారిపెం
పి వేఱుంగనివాఁడవే? ధరణీశ! వాయుసుతుండు, గాం
డీవియున్ భుజవిక్రమప్రకటీకృతుల్, వివిధాస్త్రవి
ద్యావిశేషులు వైరివీరులఁ దక్కనిత్తురె పోరులన్? 46

క. మొనసి యధర్మద్యూతం
బున భేదము వుట్టుఁ బాండుపుత్త్రులకును నీ
తనయుల కని మును చెప్పిన
విన నొల్లక కొడుకుపలుకు వింటిని కడఁకన్. 47

వ. ఇక నయినను వారి రావించి, తొల్లి నీచేతం బడయు బడిన రాజ్యంబునందుఁ బ్రతిష్ఠించి, కీర్తియు ధర్మంబును నిలుపుము; రాజ్యంబును ద్రివర్గంబును ధర్మమూలంబులు; గావున నందవర్తిల్లు; ధర్మువు విడిచి యధర్మవర్తి యయి కర్ణశకుని దుశ్శాసనశిఖితుం డైన దుర్యోధను దుశ్చేష్టితంబుల కొడంబడ వలదు. 48

తే. వీడు పుట్టిన పాపంపు వేళఁ బెక్కు
దుర్నిమిత్తముల్ వుట్టిన నిర్ణయించి
యేను జెప్పితిఁ దొల్లియు వీనిచేత
నెట్టుఁ గౌరవులకు నెగ్గు వుట్టు ననియు. 49

వ. కులదూషకు దూషించి కులంబు రక్షించుట ధర్మువు; ధర్మరాజు నఖిల మహీరాజ్య రక్షకుం జేసి పుత్రపౌత్రమిత్రామాత్యబంధువర్గంబుల నెల్ల రక్షింపుము; సభామధ్యంబునందు ద్రౌపదీభీమసేనులం బ్రార్థింప దుశ్శాసనుం బంపుము. 50

చ. అతిశయితామరోత్తముఁ, డహార్పతితేజుఁ, డజాతశత్రుఁ, డూ
ర్జితుఁ, డజితుండు నీసుతులు సేసినయెగ్గు దలంపఁ; డాతనిఁ
ధృతి నభిషిక్తుఁ జేయుము ప్రతీపకులోద్వహ! యిట్ల యైన నీ
కృతమునఁ గౌరవాన్వయ మకిల్బిషకీర్తిఁ బ్రకాశితం బగున్." 51

వ. అని పలికిన విదురు పలుకులు విని కడు నలిగి ధృతరాష్ట్రుం డిట్లనియె. 52

క. నాదేహంబునఁ బుట్టిన
యాదిసుతుఁ విడువ నెట్టు లగు? నాత్మజులం
గాదనక విమోహించుద
యామూరులు గలరె? యిట్టు లన నీ కగునే? 53

—: విదురుఁడు ధృతరాష్ట్రుని విడిచి పాండవులయొద్దకుఁ బోవుట :—

వ. నీవు నాకొడుకులయున్నతి కెన్నండు సహింపవు; నీసహాయత్వంబు నేనొల్ల; పాండవులకడకేనియు, నొండుగడకేనియు నీ కిష్టం బైన చోటికి నరుగు" మనిన నాఫణింబ విదురుండు మనోజవైకరథారూఢుం డై పాండవులకడకుం గామ్యకవనంబున కరిగె; నంత నతని రాక దవ్వులం గని ధర్మరాజు భీమసేనున కిట్లనియె. 54

సీ "గాండీవమాదిగాఁ గల యాయుధావలు
లుక్కివంబున నప్పు డొడిచికొనఁగ
మఱచినవాఁ డయ్యు మందాత్మఁ డాధార్త
రాష్ట్రేండు గాంధారరాజతనయు
వచనముల్ విని యతువతి నెపంబున వానిఁ
గష్టుఁ డై కొన సమకట్టి మనల
మగుడింపఁగా యుష్టమతిఁ జేసి విదురుఁ బు
త్తెంచెఁ గాకున్న నేతేరఁ డితఁడు;

ఆ. నింక జూద మాడ నే నోప; నిది పని
గాఁగ వచ్చు నొక్కొ కడఁగి విదురుఁ!
డేమి సేయువార? మితని నియోగంబు
మనకుఁ జేయ కునికి మానుషంబె?" 55

వ. అని తమలోఁ బలుకుచున్న సమయంబున విదురుం డేతెంచిన నతనికిఁ బ్రత్యుద్గతు లై వినయప్రియసత్కారంబుల సంతుష్టుం జేసి తదాగమన నిమిత్తం బడిగిన వారికి విదురుం డిట్లనియె. 56

క. "మతి వారికి మాకును గడు
హితుఁడవు; చెపు మయ్య యింక నెయ్యది కార్య
స్థితి? యని ధృతరాష్ట్రుం డే
కత మిష్టం బైన కార్యగతి నన్నడుగఁ. 57

వ. ఏ నుభయపక్షంబులవారికి, జగంబునకు లగ్గుగ హితం బైన విధంబు సెప్పిన నది సర్వజనరుచికరం బైన యాహ్వారంబు రోగాతురునకు. నరుచికరం బైన యట్ల యతనికి రుచియింప దయ్యె. 58

ఆ. కార్యగతులతెఱఁగు కలరూపు సెప్పిన,
నధికమతులు దాని నాదరింతు;
రల్ప కార్యబుద్ధి లగువారలకు నది
విరసకారణంబు విషమపోలె. 59

వ. దానసచేసి ధృతరాష్ట్రుండు న న్నొల్లక యెగ్గులు పలికి 'నీవు విపరీత చేతస్కుండ; విందుండ వలవదు; పాండవులకడకుం బొమ్మనిన

వచ్చితి; రూపలావణ్యవతియై వృద్ధ శ్రోత్రియునిచేతం బరిణీతయైన
తరుణియుంబోలె రాజ్యలక్ష్మి యద్దురాత్మునందు విరక్తయ కాని
ప్రీతి పుట్టదండ్రు. 60

ఆ. ధర్మరహితు లైన ధార్తరాష్ట్రులకు భూ
రాజ్యలక్ష్మి సుస్థిరంబు గాదు;
ధర్మతనయ! నిన్నుఁ దద్రాజ్యసంపదల్
వలచి తమకుఁ దామ వచ్చి పొందు. 61

వ. నావచనంబున నెగడునది" యనిన ధర్మరాజు 'నట్ల చేయుదు' నని
యున్నంత నిట ధృతరాష్ట్రుండు పాండవులయొద్ద విదురు నునికి
యెఱింగి ధృతిహీనుండై తన హృదయంబును దృష్టియుం బోని
విదురుం బాసి నిమిషం బేని నిర్వహింప నోపక సంజయున కిట్లనియె.

క. "నెమ్మిగలవాని, నా చి
త్త మ్మెఱిఁగెడువాని, విదురు, ధర్మప్రియు, నా
తమ్ము నిట వేగ తోడ్కొని
ర మ్మారుగుము కామ్యకాఖ్య రమ్యాటవికిన్." 63

వ. అని పంచిన నప్పుడ సంజయుం డతి త్వరితగతిం గామ్యకవనంబున
కరిగి. 64

మ. ధరణీదేవ సహస్ర సంఘములతో ధౌమ్యుండు, ధర్మతనూ
భరణుల్ నల్వురు దమ్ములు, విదురుఁడుం, బాంచాలియుం, బ్రీతిబం
ధురు లై కొల్వఁగ నొప్పుచున్న బుధబంధున్, ధర్మరాజుం, బ్రభా
స్వరతేజుం బ్రభుఁ గాంచి సంజయుఁడు సంజాతప్రమోదాత్మఁ డై. 65

క. వనవాసము సేసియుఁ దిగ్ర
వనరాజ్యము సేయునట్టివడువున సంతో
షనిబద్ధబుద్ధి యగు యమ
తనూజునకు భక్తి నెఱఁగి తా నిట్లనియెన్. 66

వ. "మిమ్మును, ధర్మార్థవిదుం డైన విదురునిం గౌరవేంద్రుం డెప్పుడుం
దలంచు చుండు; మీ యనుమతంబునఁ దన యనుజుం దోడ్కొని తేర
నన్నుఁ బుత్తెంచె" ననిన విని ధర్మరాజు విదురున కిట్లనియె. 67

తే. "సర్వజనులును ధృతరాష్ట్రు శాసనంబు
సేయుచున్నచో మనకు విశేషభక్తి
జేయవలయు; గావున నెడసేయ కరుగు"
మనిన విదురుండు గజపురి కరిగె నంత. 68

వ. ధృతరాష్ట్రుండును వినయవినమితోత్తమాంగుం డైన విదురు నతి స్నేహంబునం గౌగిలించుకొని మూర్ధాఘ్రాణంబు సేసి "నీవు నిత్య ఋమానిరతుండవు; నా బుద్ధి లేమికి ఋమియింపు" మనిన విదురుం డిట్లనియె. 69

ఆ. "నీవు, నీసుతుండు నెఱి దప్పి పలికిన
బథ్య మయిన పలుక పలుకవలయు;
వీరు లయిన పాండవేయులతో నిగ్ర
హంబు సేయు టిది నయంబు గాదు." 70

వ. అనుచు నెప్పటియట్ల కార్యసహాయుం డై విదురుండు ధృతరాష్ట్రు నొద్ద నున్న నయ్యిద్దఱ సంగమంబునకు శంకించి దుర్యోధనుండు కర్ణ శకునిదుశ్శాసనులతో నిట్లనియె. 71

క. "పాండవహితుఁ డగు విదురుఁడు
వెండియుఁ జనుదెంచి కార్యవిధులందు సహా
యుం డయ్యె; నతనితోడ హి
తుండయి మంతనముసేయఁ దొడఁగెఁ విభుఁడున్. 72

వ. వీర లింకఁ బాండవుల నిందులకు రావించువార లయిన నగ్నివిషజలం బులు ప్రయోగించి వారల కపాయంబు సేయుద" మనిన విని శకుని దుర్యోధనుం జూచి "యి ట్లేల బాలిశం బైన మతిఁ దలంచితివి; విదురధృతరాష్ట్రులు విపరీతమతులై రావించినను నిత్యసత్యనిరతులైన యప్పాండవులు దమ చేసినసమయంబు సలుపక యేల వచ్చువా రగుదు" రనిన శకుని దుర్యోధనులకుఁ గర్ణుం డిట్లనియె. 73

ఉ. "ఇత్తటిఁ బన్నిపోయి, పయి నెత్తి, రణం బొనరించి, వారలఁ
మిత్తికి నంపి, ధాత్రి నిరమిత్రముఁ జేయుద; మిట్టు లైనఁ ద
ద్వృత్తులు నీక దక్కుఁ; గురువీర కడంగుము" నావుడుఁ మదో
న్మత్తుఁడు గౌరవుం డతనిమాటకు సంతస మంది చెచ్చెరఁ. 74

వ. సమరసన్నద్ధుఁ డై సమస్త బలంబును సమకట్టి వెలువడిసం దన దివ్య దృష్టి నంతయు నెఱింగి కృష్ణద్వైపాయనుండు వచ్చి "యిది ధర్మం బుగా; దుడుగు" మని దుర్యోధనుని వారించి ధృతరాష్ట్రున కిట్లనియె.

క. "పుడమియు రాజ్యముఁ గోల్పడి
యడవుల నేకతమ యున్న యప్పాండవులం
గడఁగి వధియింతు ననినీ
కొడు కరిగెడు; నిట్లు తలఁపఁ గూడునె బుద్ధిన్? 76

క. ధృతియుతులై సత్యవ్రత
రతులయి పదుమూఁడువత్సరంబులు ధర్మ
స్థితి సలిపి వార కడఁగెద
రతులపరాక్రములు మీఁద నాహవమునకున్. 77

క. వనగతు లని వారలపైఁ
జని భంగముఁ బొంది రాఁగ సమకట్టెదు నీ
తనయుఁడు; గావున నీ వా
తని వారింపు మది యనుచితం బని నెమ్మిన్. 78

క. విను మేనును, నీవును, శాం
తనవుఁడు, విదురుండు నుండి తగునె యధర్మం
బున నీయుపేక? ననయం
బును పాండవవిగ్రహంబు పుట్టుట లగ్గే?" 79

వ: అనిన విని ధృతరాష్ట్రుండు దుఃఖితుం డై "నాకును, గాంధారికిని, భీష్మవిదురకృప ద్రోణులకు ననిష్టంబైన దుష్టద్యూతంబు ప్రవర్తించి దుర్బుద్ధియైన దుర్యోధనుం బుత్రస్నేహంబున విడువ నోప" ననిన ధృతరాష్ట్రునకుఁ గృష్ణద్వైపాయనుం డిట్లనియె. 80

—: ధృతరాష్ట్రునకు వ్యాసుఁ డింద్రసురభిసంవాదంబు సెప్పుట :—

ఆ. "ఎల్ల నెయ్యములకుఁ దల్లి దండ్రులయందు
సుతులవలనినెయ్య మతిశయంబు;
ధనము లెంత గలిగినను సుతరహితుల
కెమ్మెయిని మనఃప్రియమ్ము లేదు. 81

వ. తొల్లి సకలగోమాతయయిన సురభి సురరాజుకడకుం బోయి కరుణంబుగా నేడ్చిన దానిం జూచి సురపతి విస్మితుం డై "యి ట్లేల రోదనాకులితలోచన వయి యున్నదాన; వెల్ల వారికి లగ్గ కదా" యనిన నింద్రునకు సురభి యి ట్లనియె. 83

క. నీవఱ్ఱము రఱింపఁగ
నా వారికి దక్కఁ ద్రిభువనంబులఁ గల భూ
తావలి కెల్లను గుశలమ;
దేవేంద్ర ! జగ త్త్రయప్రదీప ! మహాత్మా !

వ. దీనిం జిత్తగింపుము; బలంబు గల బలీవర్దంబులతో బలహీనంబు లయిన వానిం బూన్చిన నవి దుర్వహభారవహనమహాలాంగలాకర్షణంబు లయం దసమర్థంబు లై న నడిచియుం, బొడిచియు, ములుకోలలం గుట్టియు దుర్బలబలీవర్దంబుల జనులు బాధింపం జూచి యేను దానికి దుఃఖించెద" ననిన సురభికి సురపతి యి ట్లనియె. 84

క. "నీకు నపత్యశతంబు ల
నేకంబులు గలవు; వాని కేకాకృతి దుఃఖాకులత సంభవింపదు;
శోకింపకు" మనిన సురభి సురపతి కనియెన్. 85

వ. "దేవా ! దీనాననంబు లయి దుర్బలంబు లయిన యపత్యంబులదుఃఖం బే నెట్లు సూడ నోపుదు" ననిన నగి యింద్రుండు దానికిం గరుణించి వర్షంబునఁ దృణవర్ధనంబు నేసి దుర్బలబలీవర్దంబులకు బలంబు గావించె నని యింద్ర సురభిసంవాదంబు వేదంబులయందుఁ వినంబడుఁ గావున నీకుం బుత్త్రి స్నేహంబు సామాన్యంబుగా; దై నను దీనుల్ వనంబున నవయుచున్న యప్పాండవులకు దయాళుండ వగుము. 86

తే. నీవుఁ బాండుండు విదురుండు నెమ్మి నాకు
నొక్కరూ పైనయట్లు, నీ కుదితయశులు
నీసుతులు మూర్వ్వురును, బాండునృపతనూజు
లేవురును నొక్కరూప కా నెఱుఁగవలయు. 87

క. సుజనుల సహవాసంబునఁ
గుజనులు సద్ధర్మమతు లగుట నిక్కము ధ
ర్మజునొద్దనుండి నీయా
త్మజుఁడు ప్రశాతుండు ధర్మమార్గుండు నగుఁ. 88

వ. రాజర్షి యైన ధర్మరాజుతోడి సహవాసంబు సర్వజనహితంబు; గావున నాతని నుపాసించి దుర్యోధనుండు గొండొకకాలం బుండునట్లుగాఁ బనుపు; మట్లయిన నుభయపక్షంబులకు లగ్గగు"ననిన ధృతరాష్ట్రుండు గృతాంజలి యయి "మునీంద్రా! దుర్యోధనుండు నాపలుకులు వినండు; కురుకులంబు రక్షించునట్టి బుద్ధి గల దేని వాని మీర శిక్షింపుం"డని మ్రొక్కిన. 89

క. "అనఘుఁడు మైత్రేయుం డను
మునినాథుఁడు వచ్చి ధర్మమున నాతనిఁ దా
ననుశాసించుఁ దిరంబుగ"
నని చెప్పుచు నప్పరాశరాత్మజుఁ డరిగెఁ. 90

వ. అంత. 91

ఉ. న్యాయవిదుండు గామ్యకవనంబున ధర్మజునొద్దనుండి మై
త్రేయుఁడు ధీయుతుం డరుగుదెంచిన నప్పుడ యమ్మునీంద్రు నిం
ద్రాయితుఁ డాంబికేయుఁ డుచితస్థితిఁ బూజితుఁ జేసె నాత్మని
శ్చేయసలాలసుం డయి విశేషసపర్యలఁ జేసి భక్తితోఁ. 92

వ. ఇట్లు దనచేతం బూజితుం డై సుఖవిశ్రాంతుం డైన మునివరునకు ధృతరాష్ట్రుండు ముకుళితహస్తుండై "భట్టారకా! యెందుండి వచ్చితి" రని యడిగిన నతనికి మైత్రేయుం డి ట్లనియె. 93

చ. "అలఘు తపోభరంబున జటాజినముల్ ధరియించి, రూక్షవ
ల్కలములు గట్టి, కూరలును గాయలుఁ బండులు భోజనంబుగా
నలయక కామ్యకం బను మహావిపినంబున నున్న పాండవే
యులకడ నుండి వచ్చితిఁ గురూత్తమ! నీసుతు, నిన్నుఁ జూడఁగఁ. 94

వ. ఏ నఖిలతీర్థదర్శనార్థంబు పరిభ్రమించుచుఁ గురుజాంగలంబున కరిగి యందుఁ గురుకులోత్తము లైన పాండుపుత్రులం జూచితి." 95

ఆ. అనిన నవనతాస్యుఁ డయి ధృతరాష్ట్రుఁ డి
ట్లనియె "నెట్లు సెప్పుఁ డయ్య ! యందుఁ
బాండవులకు సత్యభాషణులకుఁ గుళ
లంబె? వార లీట దలంతురొక్కొ! 96

క. అమితభుజశక్తి నంతక
సము లప్పాండుసుతు లిందు సౌభ్రాత్రస్నే
హమునకు విచ్ఛేదముగా
సమయాతిక్రమము సేయ సమకట్టరుగా?" 97

వ. అనిన మైత్రేయుం డి ట్లనియె. 98

క. "చనుదెంచి మహామునివరు
లనవరతము వారలకుఁ బ్రియం బొనరఁగ దీ
వన లీగిఁజేసి కుశలమ
మనుజేశ్వర వారు ధర్మమతియుతు లగుటఁ. 99

క. వారలు సమయను దప్పిన
వారిజరిపుహితులగతు లవశ్యముఁ దప్పుఁ;
వారికి సకారణంబ ని
కారము నీకొడుకు సేసెఁ గడు నహితుం డై." 100

వ. అని దుర్యోధనుం జూచి "యయ్యా నీవు బుద్ధిగల వేనిఁ బాండవులతో
విరోధం బుడుగు; మట్లయిన నీకును, వారికిం, గురుకులంబునకు
లగ్గగు; నాపలుకుఁ జేకొనుము. 101

సీ. వజ్రసంహనను, లవార్యపరాక్రముల్,
పాండుకుమారు, లాఖండలాభు;
లందఱు నాగశతాయుత ప్రాణు, లు
గ్రాహవకాండు, లుత్సాహపరులు;
వారలలో బలవంతుండు, బకహిడిం
బాసురు లనువారి నాసురమునఁ
జంపి, నాగాయుతసత్త్వు జరాసంధు
నెక్కటి యోర్చిన యక్కజుండు;

తే. ఘోరవనమున వీరుఁ గిమ్మీరుఁ డను సు
రారి, నిశ్చల భీకరా కారుఁ బట్టి
పోర వధియించినట్టి సమీరజునకు
భూరిభుజునకు మార్కొనువారుఁ గలరె? 102

—: మైత్రేయుఁడు దుర్యోధనుని శపించుట :—

వ. వారికి వాసుదేవ ధృష్టద్యుమ్నులు సంబంధ సహాయులు; జరామరణ వంతు లైన మనుజులు వారిం జెనకి యెట్లు జీవింతురు? నీవు వారితో నొడంబడియుండు; మిది కార్యం"బనిన మైత్రేయు పలుకు లాదరింపక పాదాంగుష్ఠంబున నేల వ్రాయుచు బాహువెత్తి దొడలు సఱచి నగు చున్న యాదుర్యోధనుం జూచి మైత్రేయుండలిగి"యీయపరాధంబున నాహవంబగు; నందు భీముగదాఘాతంబున నీయూరు యుగళంబు భగ్నం బయ్యెడు"మని శాపం బిచ్చిన, వెఱచి ధృతరాష్ట్రుండు "మునీంద్రా! యట్లు గా కుండం బ్రసాదింపు" మనిన నమ్మునివరుం డి ట్లనియె. 103

తే. "కడఁగి సమబుద్ధి వీనికిఁ గలిగెనేనిఁ
గాదు శాపఫలం; బట్లు గాక బుద్ధి
హీనుఁడై గర్వితుం డగు నేని శాప
హవ్యవాహఫలంబు వీఁ డనుభవించు." 104

వ. అని ప్రసన్నుం డైన మైత్రేయునకు నాంబికేయుం డి ట్లనియె. 105

వ. "కిమ్మీరుం డను రక్కసుఁ
డమ్మారుతతనయుచేత నత్యుగ్ర వనాం
తమ్మున నిహతుం డయిన వి
ధ మ్మెట్టులు? సెప్పు మద్భుతం బిది" యనినఁ 106

వ. "నాపలుకులు నీకొడుకు వినం డయ్యెనే నేల చెప్పెద? దీనిం బాండవ సహాయులైన విప్రులచేత విదురుం డిమ్ముగా నెఱిఁగినవాఁ; డతని వలన విను" మని చెప్పి మైత్రేయుం డరిగినం గిమ్మీరవధకథాశ్రవణ పరుండై తన్నడిగిన ధృతరాష్ట్రునకు విదురుం డి ట్లనియె "నిం దుండి చని పాండవులు మూఁ డహోరాత్రంబులు నిరంతర ప్రయాణంబు

నేసి కామ్యకవనంబుఁ జొచ్చువా రొక్కనాటి యర్ధరాత్రంబున రాక్షస ప్రచారవేళయందుఁ బరిభ్రమించుచు రాక్షసమాయ గావించుచున్న వాని, నతినిశితదంష్ట్రాకరాళం బైన తన వదనగహ్వ్వరంబుఁ దెఱచి గ్రుడ్లు మెఱవ, బభ్రుకేశంబులు దూల, బాలార్కరశ్మియుతం బయిన బలాహకంబునుం బోలె సకలప్రాణి భయజననంబుగా గర్జిల్లు చున్న వాని నిజపాదఘట్టితమహీతల ప్రచలన వేగవేల్లిత వల్లీపల్లవ శాఖాపరిరంభణసుఖంబు భావపంబుల కాపాదించుచున్న వాని, నెదురనొక్క రక్కసుం గని; రంత వాఁడును బ్రాహ్మణసంఘంబు ముందటఁ కృష్ణాజినావృతు లై వచ్చుపాండవుల దవ్వులం గని మార్గనిరోధిత్తై మహాపర్వతంబునుం బోలె నున్న నదృష్టపూర్వ ప్రమాణం బైన వాని దేహంబుఁ జూచి నిమీలిత నయన యయి దుశ్శాసనకరాకృష్టవికీర్ణ వేణీభరంబు వెనువెంట నొలయం బాంచాలి పంచపర్వతంబులనడిమి నదియుంబోలెఁ బతులనడుమ భయవ్యాకుల చిత్తయైన, నింద్రియంబులు విషయరతిం బరిగ్రహించునట్లు లేవురు నక్కోమలిం బట్టుకొని భయపడకుండ నాశ్వాసించు చున్నంత. 107

క. రక్షోఘ్నమంత్రముల నా
రాక్షసమాయా పరిస్ఫురణఁ జెఱిచెఁ గ్రియా
దక్షుఁడు ధౌమ్యుఁడు పాండవు
లీక్షించుచు నుండఁగా నహీనప్రతిభఁ. 108

వ. అంత. 109

క. ప్రతివిహితమాయు, నత్యా
యతభుజయుతుఁ, గోపఘూర్ణితారుణ విస్ఫా
రితనేత్రు, నసురఁ జూచి భ
రతకులవర్ధనుఁడు ధర్మ రాజి ట్లనియెఁ. 110

వ. "నీ వెవ్వరివాఁడ? వెవ్వండ? వివ్వనంబున నేల యున్న వాఁడ?"
వనిన వాఁ డి ట్లనియె. 111

క. "ఏను బకాసురు ననుజుఁడఁ;
గీనాశుఁడ; మానవులకుఁ గిమ్మీరుఁ డనం

గా నెగడుదు; నీకామ్యక
కాననమున సర్వసత్త్వఖాదనబుద్ధి. 112

క. పాయక యుండుదు; రాత్రుల
మాయల సమరంబు సేసి మనుజుల విగతో
పాయులఁ జంపుచు భక్షణ
సేయుదు; నమరాదులకు నజేయుఁడఁ బోరఁ. 113

వ. నాకు వెఱచి యెల్లవారును దూరంబున దీనిం బరిహరింతురు; మీ రెవ్వ? రిందుల కేల వచ్చిరి? మిమ్ము వధియించి యిపుడు భక్షించెద" ననిన వానికి యుధిష్ఠిరుండి ట్లనియె. 114

ఆ. "ఏను ధర్మసుతుఁడ; నీతఁడు భీముండు;
వాఁడు విజయుఁ; డల్ల వారు గవలు;
పాండవులము సమయపడి వనవాసంబు
సేయ వచ్చితిమి విశేషయుక్తి." 115

సీ. అనవుడు రాక్షసుం డట్టహాసంబుతో
"నెట్టుట్టు! భీముండె యీతఁ? డేమి
పుణ్యమో! వీని నెప్పుడు సంపఁగాంతునో
యని యున్నచోఁ, దాన యరుగుదెంచె;
నధికు మాయన్న బకాసురు, నాయిష్ట
సఖు హిడింబాసురుఁ జంపి యున్న
ఖలు ఘ్రింగి జీర్ణంబు గావింతు వాతాపిఁ
దడయక ఘ్రింగిన తపసియట్ల"
ఆ. యనిన రక్కసునకు నలిగిన యగ్రజు
నలుక యెటోఁగి వీరుఁ డర్జునుండు
మొనసి గాండివంబు మోపెట్టె సునిశిత
ఖడ్గపాణు లై రి కవలు నంత. 116

—: కిమ్మీరుఁ డను రాక్షసుఁడు భీముచేఁ జచ్చుట :—

ఆ. ఘోరపరాక్రములో, ప్రబలకోపపరులో, పృథుసారభూరిభూ
మీరుహపాణు, లుద్ధతు, లమిత్రవిభీతులు, వీరబృందబృం

దారకు లార్చు చొండొరులఁ దాఁకిరి దారుణభంగిఁ బొంగి కి
మ్మీరసమీరసూనులు సమీరవిధూతపయోధు లట్లయై. 117

తరలము.

పొరిని వారలచేతి యున్నత భూరుహాయుధముల్ పర
స్పరకఠోరశిరస్థ్సలంబుల పై వడిం బడి మత్తకుం
జరశిరఃపతితంబు లైన లసన్మృణాళములట్లజ
ర్జరిత మయ్యెఁ దదారవప్రతిశబ్ద మొప్ప నభంబునఁ. 118

వ. ఇట్లొక్క ముహూర్తంబు వృకయుద్ధంబు సేసి, యాసన్న మహీరు హంబులు సమసిన, నయ్యిద్దఱు శిలాయుద్ధంబునకుఁ దొడంగి చేయు నెడం బవనజుఁడు ప్త నిష్ఠురశిలాహతహృదయుం డై భానుం బట్టుకొను స్వర్భానుండునుంబోలెఁ గిమ్మీరుండు భీముం బట్టుకొనిన, భీముండు వాని హీనబలుం గా నెఱింగి; కృతాంతదండానుకారంబు లయిన తన బాహుదండంబుల నమ్మనుజకంటకు కటి కంఠ ప్రదేశంబులు పట్టు కొని, నేలం బెట్టి, దేహయష్టి విఱిచి, బకుం జంపినవిధంబునఁ గిమ్మీరు విగతప్రాణుం జేసి. 119

తే. "బకహిడింబులు హతులైనఁ బనివిపనివి
యఱుచి కోకింపఁ గానక యమపురమున
కరిగి తక్కట రాక్షస" యనుచుఁ దెరువు
వాయఁ బావని దక్కశేబరము వై చె. 120

వ. ఇట్లు ధర్మరాజు వచనంబునఁ గిమ్మీరు నక్షమంబున వధియించి తద్వన వాసులకు రాక్షసభయం బుడిపిన మహావీరు నమ్మారుతాత్మజు ధర్మా ర్జుననకులసహదేవులును ధౌమ్యాదిమహీసురవరులు ప్రశంసించి" రని విదురుండు గిమ్మీరువధ సెప్పిన విని ధృతరాష్ట్రునకు హృదయదళనం బయ్యె; నిట పాండవులు గామ్యకవనంబున నుండునంత.

—: యాదవపాంచాలాదులు పాండవులకడ కేతెంచుట :—

సీ. వసుమతీ రాజ్యంబువలన నిరస్తులై
మునివృత్తి నత్యుగ్రవనములోన

నవయుచుఁ బాండుభూనాథనందను లున్న
వా రని విని యతిక్రూరమతుల
ధృతరాష్ట్రసుతుల నిందించుచుఁ బాంచాల
యాదవ వృష్ణిభోజాదు లెల్ల
నచ్యుత ప్రముఖు లై యప్పాండవులకడ
కేతెంచి శోకపరీతు లగుచు

ఆ. నున్న నధికధర్మ యుక్తుఁ డుపేంద్రుండు
నికృతిఁ జేసి పాపనియతబుద్ధిఁ
బాండవులకు నట్లపాయంబు నేసిన
ధార్తరాష్ట్రులకును దద్ద యలిగి. 122

క. "అనిఁ గర్ణశకుని దుర్యో
ధన దుశ్శాసన నవాస్రధారాపాతం
బునఁ దృప్తివొందు వసుధాం
గన రాతుసకాక గృధ్రగణములతోడఁ. 123

క. అవినీతుల, వధ్యులఁ, గౌ
రవపాంసులఁ జంపి ధర్మరాజునకుఁ గురు
ప్రవరున కొనరింతమ యీ
యవనీరాజ్యాభిషేక మవిజితశక్తిఁ." 124

వ. అని యుగాంతకాలకుపితకృతాంతాకృతి నున్న జగన్నాథు జనార్ద
నుం బ్రశాంతచిత్తుం జేసి యర్జునుం డతని నిట్లని కీర్తించె. 125

ఆ. "పూజ్యుఁడవు, పురాణపురుషుండ, వీశుండ,
వప్రమేయుఁడవు; చరాచరంబు
లయిన భూతరాసు లచ్యుత! నీయంద
పుట్టు, నిలుచు, లయముఁ బొందు చుండు. 126

వ. నీవు దొల్లిగంధమాదనంబునం గందమూలఫలాశనుండ వై పది
వేలేండ్లు తపంబు నేసి, పుష్కరంబున నేకాదశసహస్రవర్షంబులు జలం
బుల యాహారంబుగా నుండి, ప్రభాసం బను తీర్థంబున దివ్యసహస్ర
వర్షంబు లేక పాదస్థితుండ వయి యుండి, బదరీవనంబునం బవనంబు

భఱించుచు నూర్ధ్వబాహుండ వయి యేక పాదంబున ననేకసహస్ర వర్షంబులు నిలిచి, సరస్వతీసత్త్రంబున నవకృష్ణోత్తరాసంగుండవై నియమకృశీకృతశరీరంబుతోఁ బండ్రెండువర్షంబు లశేషవ్రతంబులు సలిపిన తపోనిధానంబవు: నిఖిలలోకక్షత్రుండ వయి చైత్రరథంబున నుత్తమక్రతువు లనేకంబులు సేసి, యొక్కొక్క క్రతువునకు నూఱేసి లక్షలు సువర్ణంబులు దక్షిణలిచ్చిన యజ్ఞపురుషుండవు, తపోయజ్ఞంబులు రెంటను సమృద్ధతేజుండవయి దైత్యదానవేంద్రుల వధియించి యింద్రున కింద్రత్వం బేకాధిష్ఠితంబు సేసిన లోకప్రభుండ; వదితికింగశ్యపునకు సుదయించి యింద్రానుజుండ వై త్రివిక్రమంబునం ద్రిజగంబుల నభివ్యాపించిన విశ్వరూపధరుండవు. 127

క. నరకశిక్షుపాలు రాదిగ
ధరణీకంటకుల నధికతరదర్పులఁ బ
ల్వుర వధియింపఁగ మహి నవ
తరించిన మహాత్ముఁడవు నుతస్థిరశక్తిన్. 128

క. అనృతము, మదమును, మత్సర
మును, క్రోధము నను వికారములు వొరయునె ని
న్ననుపగుణముల నీ కొరు
లెన పోల్పఁగఁ గలరె? సురమునీంద్ర ప్రణుతా." 129

వ. అని కృతాంజలి యయిన ధనంజయుం జూచి దనుజభంజనుండి ట్లనియె. 130

తే. "నరుఁడు నారాయణుండు నాఁ బరగు నాది
మునుల మిద్ధఱు; మందు నీ వనఘ! నరుఁడ;
వేను నారాయణుండ; ననూనశక్తి
యుతుల మై మర్త్యధామునిఁ బుట్టితిమి పేర్మి.

తరువోజ. నిరతంబుగా నేను నీవనుభేద
నియమంబు లే; దైక్యనిష్ఠయ మనకు
నిరుపురకును; నీకు నిష్టుండ నాకు
నిష్టుండు; మఱి నీ కనిష్టుండ నాకుఁ

గర మనిష్టుం; డట్లు గా నమ్మ్మ"మనుచు
ఘనభుజుల్ భువనోపకారై కమతులు
హరియు నర్జునుఁడుఁ బ్రియంబుతోఁ దగిలి
యన్యోన్యహితభాషు లగుచుండునంత.

ఒ—: ద్రౌపది శ్రీకృష్ణునితోఁ దన పరిభవంబు సెప్పి దుఃఖించుట :—

వ. అఖిల రాజలోకపరివృతుం డయి యున్న నారాయణునొద్దకు వచ్చి ద్రుపదరాజ పుత్రి ముకుళితకరాంబుజ యయి "నిన్ను నాదిప్రజా సర్గంబునఁ బ్రజాపతి పని యసితుం డయిన దేవలుండును, సత్యంబు వలన యజ్ఞం బుద్ధరించుటంజేసి నిత్యసత్యమయుండ వయిన యజ్ఞ పురుషుండ వని కశ్యపుండును, శిరంబున దివంబును, పాదంబుల మేది నియును, లోచనంబుల సూర్యుండును, నవయవంబుల లోకంబులు నభివ్యాపించుటం జేసి సర్వమయుండ వని నారదుండును, నఖ యజ్ఞాననిధి వని సర్వమునిముఖ్యులును జెప్పిరి. 133

మధ్యాక్కర.

అని ననివృత్తు లై పుణ్యచరితు లై, యాత్మ్మప్రబోధ
వినిహితచిత్తులై, సర్వధర్మ్మార్థ విదు లయి తృప్తిఁ
దనరెడు రాజర్షివరులకును, యోగధరులకు సాధు
జనులకు గతి నీవ నిత్యకారుణ్య! సర్వశరణ్య! 134

వ. నీయంతఃకరణ ప్రవృత్తి కగోచరం బెద్దియు లే; దయినను నా పడిన పరాభవం బెఱింగించెద. 135

సీ. పార్థివప్రభుఁ డైన పాండుమహీపతి
కోడల నయి, యుద్ధకుశలు లయిన
పాండుతనూజుల భార్యనై పూజ్యుఁడ
వైన నీయనుజనై, యధికశక్తిఁ
బరఁగు ధృష్టద్యుమ్ను భగినినై, ధృతరాష్ట్ర
పట్టిచే సభఁ దల పట్టి యీడ్వఁ
బడి పాపకర్మ్మచేఁ బరిధాన మెలువంగఁ
బడి, దారుణం బైన పరిభవంబు

ఆ. పడితి; నట్టి నన్నుఁ బాండవుల్ సూచుచు
నుండి రొరులువోలె నుక్కుదక్కి;
యాపగాతనూజుఁ డాదిగాఁ గల వృద్ధ
బంధుజనులు సూచి పలుక రయిరి. 136

క. శరణనినవారిఁ గరుణా
కరు లయి రక్షించు పురుషకారాన్వితులే
శర ణని యఱచిన నాలింపర
భీమార్జునుల బాహుబల మేమిటికిఁ? 137

వ. భ్రాతృపుత్త్రిబంధుజనంబులు నాకుం గలిగియు లేనివా రయి; రట్టి
యెడం గర్ణుండు నన్నుం జూచి నగియె. 138

ఆ. కర్ణునగవు లోక గర్హితుండగు దుస్స
సేను చెయిదికంచె శిఖియపోలె
నడరి నామనంబు నతిదారుణక్రియ
నేర్చు చున్నయది మహీధరుండ! 139

వ. తొల్లి వేదాధ్యయనంబు సేయుచు బాలకేళీవినోదంబున నున్న
కాలంబునఁ బ్రమాణకోటియందు సుప్తుం డయిన భీమసేను నంటఁ
గట్టి గంగమడువునం ద్రోపించియు, విషంబుఁ బెట్టియు, విషసర్పంబు
లం గఱపించియు, జననీసహితులైన యేవురను వారణావతంబున
లక్కయిల్లు సొనిపి యందు దహనంబుఁ బ్రయోగింపం బంచియు,
ననేకంబు లైన యపకారంబులు సేసి, యిప్పుడు దుర్యోధనుం
డధర్మద్యూతంబున రాజ్యంబు నపహరించి, రాజలోకసమక్షంబునం
దమ్ము నిరాకృతులం జేసినను బరాక్రమపరాఙ్ముఖు లైన పాండవులు
నాపరిభవంబు "నెట్లు దలఁగెద" రని బాష్పధారాస్నపితపయోధర
యయి పాణిపల్లవంబుల నయనసమ్మార్జనంబు సేయుచున్న పాంచా
లిం జూచి వాసుదేవుండి ట్లనియె. 140

చ. "తనుకుచు నున్న నీ హృదయతాపనిమిత్తమునఁ సురేంద్రనం
దను పటుబాణపాతహతిఁ దద్ధృతరాష్ట్రిబలంబు మృత్యుసా
దనమున కేఁగుఁ జు; మ్మిదియ తథ్యము; నావచనంబు దప్ప ది
వ్యనిధు లేడు నింకిన, దివంబును రాత్రియు సంచలించినఁ. 141

వ. అనిన నర్జునుండు ద్రౌపదిం జూచి యి ట్లనియె. 142

ఉ. "ఈ పురుషో త్తముండు మన కిందఱకుం గుశలంబు సేయుచుం
బాపకలంకపంకములఁ బాయఁగఁ జేయుటఁ జేసి దుర్మదో
ద్దీపితశత్రుసంహతి హతిం బరమార్థము పొందు; నేల సం
తాపము నీకుఁ జేయఁగఁ ద్రిధామజయోన్నతి గల్గి యుండఁగన్?" 143

వ. అనిన సక్రోధుండై ధృష్టద్యుమ్నుం డి ట్లనియె. 144

క. "వినయవిహీనుల దుర్యో
ధనదుశ్శాసనులఁ బవనతనయుఁడు, రాధా
తనయుని నరుఁ, డేఁ గుంభజు,
ననిఁ జంపుదు మేల వగవ నంబుజనేత్రా." 145

వ. అని యందఱు ద్రుపదరాజపుత్రి నూఱ్ఱార్చి; రంత నచ్యుతుండు
ధర్మరాజున కి ట్లనియె. 146

తే. "ద్వారవతినుండి యే యుయుధానువలన
ధారుణీశ! యింతయు విని తత్క్షణంబ
యరుగుదెంచి యాపన్నుఁడ వైన నిన్నుఁ
జూచి దుఃఖోపహత మనస్కుండ నైతి. 147

వ. అయ్యవసరంబున నేను మీ మొద్ద నుండమిం జేసి యిట్టి దుర్వ్యస
నంబు సంభవిల్లెం; గామజంబు లైన స్త్రీ ద్యూతమృగయాపానంబు
లను నాలుగు దుర్వ్యసనంబులం బ్రవర్తిల్లకుండఁ బ్రతిషేధింపవలయు;
నందును విశేషంబుగా ననర్థమూలంబయిన ద్యూతంబుఁ బరిహరింపని
నాఁడు పాపం బగు నని హేతుదృష్టాంతంబులు సూపి కృపద్రోణ
విదురగాంగేయులం దోడుసేసికొని యాంబికేయు నొడంబఱిచి దుష
ట
ద్యూతంబు సర్వప్రకారంబుల వారింతు. 148

క. వలచి హితంబునఁ బథ్యముఁ
బలికినఁ జేకొనని ధర్మబాహ్యుల నవివే
కుల నిగ్రహింతు; మీకె
గ్గులు మత్సాన్నిధ్యమున నగునె యేయెయ్యెడలన్? 149

—: కృష్ణుఁడు ధర్మరాజునకు సౌంభకాఖ్యానంబు సెప్పుట :—

వ. ఏను సముద్రతీరంబున సాల్వుతోడం బదినెలలు యుద్ధంబుసేసి వాని వధియించు పొంచె నక్కడ మసలితి; నది గారణంబుగా మీకుదుర్వ్యసనావసరంబున నలబ్ధసన్నిధానుండ నయితి" ననిన నది యెట్లని యుధిష్ఠిరుం డడిగిన నాతనికి సౌంభకాఖ్యానంబు సవిస్తరంబుగాఁ గృష్ణుం డిట్లని చెప్పె; "నీ యజ్ఞంబున నర్ఘ్య నిమిత్తంబున నసహిష్ణుం డయిన శిశుపాలుండు నాచేత నిహతుం డగుట విని, వాని తమ్ముండు సాల్వుం డనువాఁడు తద్వధప్రవర్తిత క్రోధుం డయి కామగమనం బయిన తన సౌంభకం బను నగరంబుతో సన్నద్ధుం డయి వచ్చి ద్వారవతీపురంబు నవరోధించి. 150

చ. "ప్రతినరపాలకాలు, శిశుపాలు, బలాధికుఁ జంపి దర్పసం
హితుఁ డగు చున్న వృష్ణిశలుఁ డెక్కడ నెక్కడ? నాతనిం జయో
న్నతి వెలయంగఁ జంపెద రణంబున"నంచు నలంఘ్యవిక్రమో
ర్జితుఁ డయి దానిచుట్టు విడిసెం జతురంగమహాబలంబుతోఁ. 151

క. మే లగు తత్పుర బాహ్యవి
శాలోద్యానముల తాల సాల సరళ హిం
తాల తమాలావలి ని
ర్మూలితముగఁ జేసెఁ దచ్చమూసామజముల్. 152

వ. మఱి తృణజలధాన్యసమిత్సమృద్ధంబయి శతఘ్ని ప్రముఖానేకయంత్రంబుల, నలంఘ్యపరిఖాప్రాకారంబులను, నపారబలరక్షితఘనకవాటచతుర్గోపురంబులను, లబ్ధప్రభూతవేతన ప్రహృష్టపుష్టధృష్టవీరసుభటసంకులంబులను, నపరిమిత గజతురంగశతాంగంబులను, బ్రదీప్తాలాతశాత శర చక్ర తోమర పరశు పాశాంకుశ కూటంబులను, వీర యోధారూఢవిశాలాట్టాలకంబులను నొప్పి పరుల కసాధ్యం బయిన ద్వారవతి భేదింప నేరక దాని వెలిం బ్రపా చైత్య దేవాయతన వల్మీకంబులు వర్జించి, సమతలప్రదేశంబున నిబిడంబుగా శిబిరసన్నివేశంబు నేసి, నిత్యంబు నుపప్లవంబు సేయుచున్న సౌంభకవిజృంభణంబునకు సహింపక సమరసంరంభంబున సర్వాయుధసన్నద్ధు లయి. 153

క. ఉద్యద్బలులు గుమారులు
విద్యాధరసములు పురము వెలువడిరి రణై
కోద్యములు చారుదేష్ణుఁడుఁ
బ్రద్యుమ్నుఁడు, సాంబుఁడును విపశుజిశూంసఁ.

మణిభూషణము: రామవిక్రముఁ డజేయుఁ, డరాతిగజావళీ
సామజాహితుఁడు, సాంబుఁడు సాల్వచమూపతిఁ
జేమవృద్ధి యనువాని నకృత్రిమసాహసో
ద్దామఁ దాఁకె శరధారల ధారుణిఁ గప్పుచుఁ. 155

క. జాంబవతేయు బృహద్వి
శంబులకుఁ బెదర కెదిరి ఘనుఁ డేసె రణా
గ్రంబున నాతనిపై నవి
లంబితుఁ డై జేమవృద్ధి లఘుశరంబుల్. 156

వ. వాని యేయు నేర్పునకు సహింపక సాంబుండు జాంబూనదపుంఖంబు
లయిన విశిఖంబులం దదీయరథాశ్వమర్మంబుల నేసిన నవి మర్మభేద
వేదనలం దలరి యతి వేగంబున రణంబు వెలువడ రథం బీడ్చుకొని
సారథికి వశంబు గాక పఱచె; నట్లు సాల్వచమూపతి సమరవిముఖుం
డయిన. 157

స్వాగతము: వేగవంతుఁ డను వీరుఁడు సాంబుఁ
వేగవంతుఁ డయి వీఁకను దాఁకెఁ
వేగబాణపదవీతతులఁ ది
గ్భాగముల్ విశిఖపంజరముల్ గాన్. 158

ఆ. సాంబుఁ బాయు మనుచుఁ జారుదేష్ణుం డల్గి
వేగవంతుఁ దాఁకి వీఁకతోడ
వాని మస్తకంబు వ్రయ్యంగ వడి గదం
బొడిచె రుధిరవారిపూర మొలుక. 159

వ. ఇట్లు చారుదేష్ణు విష్ణురగదాఘాతంబున వేగవంతుండు విగతజీవుం
డయి నిర్ఘాతపాతభిన్నోన్నతగిరిశిఖరంబునుంబోలె నేలఁ బ్రెళ్ళినం
జూచి విచింత్యం డనువాఁ డవిచింత్యవిక్రముండయి. 160

తే. చారుదేష్ణుపైఁ గడువాఁడి శరము లేసె;
నతఁడు కార్ముకహస్తుఁడై యాక్షణంబ
వానిపై నభిమంత్రించి వహ్నిబాణ
మేసె నుగ్రస్ఫులింగంబు లెసఁగఁ జదల. 161

క. అనలాస్త్ర మట్లు వఱుముఁ
గొనిన విచింత్యుండు గూలెఁ గుతలం బద్రువఁ;
ఘను వానిఁ జూచి హాహా
స్వనను లెసఁగ పాల్వుసేన సంక్షోభించెఁ. 162

వ. సాల్వుండు నిజసేనాసంక్షోభం బుడిచి, సర్వాయుధసనాథం బయిన రథం బెక్కి; యాదవకుమారవాహినిపయి నెత్తి, యేయుచు వ్రేయుచుం బొడుచుచుఁ బ్రతిబలంబు నెల్ల నాయుధమయంబుగాఁ జేయుచున్న వాని కలిగి. 163

సీ. హంసవర్ణోత్తమహయములఁ బూనిన
రథ మెక్కి, కాంచనరమ్యయష్టి
సంభృతమకరధ్వజం బొప్ప బద్ధ గో
థాంగుళిత్రాణుఁడై, యతులశాత
సాయకావళిఁ జేసి సాల్వుఁ బిల్చుచు వాని
మీఁదఁ బ్రద్యుమ్నుఁ డమేయబాణ
వర్షంబు గురిసిన, వాఁడును వానిపైఁ
గడువాఁడిబాణముల్ గడఁగి యేసె;
ఆ. నధికవీరు లయినయయ్యిద్ధఱకు నస్త్ర
కోవిదులకుఁ బోరు ఘోర మయ్యెఁ;
దద్ధ భయము వొంది తద్ద్వారకాపురి,
సొంభకమున జనులు సంభ్రమింప. 164

క. అనిమొన సాల్వుఁడు ప్రద్యు
మ్ననిశాతశరాలివిద్ధమర్మ్ం డయి పె
ల్చన మూర్ఛవోయి పడియెం
దనరథముపయిఁ ధరిత్రిఁ దల్లడపడఁగఁ. 165

ఉ. అంతన మూర్ఛదేటి కలుషానలదీప్తముఖుండు సౌంభకుం
డంతకదండదారుణము లైన శరంబుల రౌక్మిణేయు ది
గ్దంతిబలాఢ్యు నేయుడు నతండును మూర్ఛితుఁ డయ్యె; వాని సం
భ్రాంతిఁ దదీయసారథి యపాస్తరణాంతరుఁ జేసెఁ దెచ్చెరఁ. 166

వ. ఇట్లు మూర్ఛితుం డయిన ప్రద్యుమ్నుం దోడ్కొని చని రణంబునకు
దూరంబుగా నరదంబు నిలిపికొని దారుకసుతుం డున్నంత నొక్కిం తొ
ప్రొద్దునకు మూర్ఛ దేటి ప్రద్యుమ్నుండు సూతున కిట్లనియె. 167

క. "ఘోరాహవరంగమునకు
దూరముగా నన్ను నిట్టు దోడ్కొని తేరఁ
దారుకసుత! నీ కుచిత మె ?
వీరారంభంబు సూచి వెఱచితె? చెపుమా." 168

వ. అని మఱియు సారథిం జూచి విహ్వల మానసుం డయి యి ట్లనియె.

క. "సమరవిముఖత్వమును రణ
విముఖులఁ జంపుటయు, శరణు వేఁడిన రక్షిం
పమియును, యాదవవంశో
త్తములకుఁ గలనైనఁ గలవె దారుకతనయా ! 170

క. విక్రమము విడిచి సమరా
క్రాంతుఁడ నయిన నన్ను బలదేవుఁడునుం
జక్రధరుండుఁ గుమారులు
నక్రూరాదులును నేమి యని నగరె సభన్." 171

వ. చెట్ట సేసి; తింక నయినఁ దెచ్చెర సాంబచారుదేష్ణ లున్న చోటికి
సాల్వాభి ముఖంబుగా రథంబు వఱపు"మనిన సారథి యి ట్లనియె.

క. "రథి కిమ్ము గానియెడ సా
రథి ధృతి మెయిఁ గావ వలయు, రథియును దత్సా
రథిఁ గావ వలయు; రథిసా
రథులు పరస్పరశరీరరక్షకు లగుటఁ. 173

ఆ. సాల్వబాణవిగత సంజ్ఞుఁడ వైన ని
న్నిట్లు దెచ్చితిని సహింప వలయు;
నా రథాశ్వముల, ఘనస్యందనము నిదె
చూడు మనుచు సూతసూనుఁ డపుడు. 174

వ. సవ్యాపసవ్యచిత్రమండలగతుల నాకుణంబ సాల్వునకు నప్రదక్షిణా
బుగా రథంబు వఱపిన, దాని సహింపక సాల్వుండు మూఁడమ్ముల
సారథి నేసి మఱియు రాకసమాయ ననేకశరంబులు ప్రద్యుమ్ను వై
నేసిన. 175

క. అమ్మాయాశరములు భ
గ్నమ్ములు గాఁ జేసి, తన్ముఖమ్మునఁ, దద్వ
ధమ్మున నొక్కట బ్రహ్మ
స్త్రమ్మును బ్రద్యుమ్నుఁ డేసె దారుణభంగిన్. 176

వ. ఇట్లు బ్రహ్మాస్త్రపీడితుం డయి సాల్వుండు మూర్ఛవోయి రథంబు
పయిం బడిన, వాని వెండియు నొక్క దివ్యబాణంబున నేయ సమ
కట్టిన, నంతరిక్షంబున హాహారవంబు లెసఁగె; నంత దేవగణప్రేరితు
లయిన నారద మారుతులు ప్రద్యుమ్ను పాలికి వచ్చి యి ట్లనిరి.177

తే. "వీఁడు నీచేత వధ్యుండు గాఁడు; మిన్న
కేయ కుండుము; వీని నారాయణుండు
మొనసి వధియించు ననిపల్కె వనజగర్భుఁ"
డనినఁ బ్రద్యుమ్నుఁ డేయక యనఘుఁ డుండె. 178

—: సాల్వుఁడు ప్రద్యుమ్నునిచే బాధితుం డై మరలిపోవుట :—

వ. అంత సాల్వుండును నివృత్తుండయి ద్వారకాపురియవరోధం బుడిగి
తన సౌంభకం బెక్కి క్రమ్మటి చనియె; నంత నీ యజ్ఞుంబు నిర్వృ
త్తం బయిన నే నరిగి బలభగ్నీకృతపాదపవనంబులదాని, ననభిజ్ఞాత
ద్వార దేశంబులదాని, నస్వాధ్యాయస్వాహాకార మహీసురాగారం
బయినదాని, నపేతభూషణయోషిజ్జనంబుల దాని ద్వారవతిం జూచి
యాహుకాత్మజువలన నంతవృత్తాంతంబును నెఱింగి, సాల్వుం జంపి
కాని యిప్పురంబు సొర నొల్ల నని నిశ్చయించి, దీని నప్రమాదులరై

రఱించుకొని యుండుం డని బలదేవాదులం బంచి, యప్పుడ ప్రయా
ణభేరి సఱువం బంచి, కృతస్వస్తివచనపురోహితప్రముఖ బ్రాహ్మణ
వరులకు నమస్కరించి శైబ్యసుగ్రీవంబు లను వాహంబులం బూనిన
దివ్యరథం బెక్కిన. 179

• ఆ. పాంచజన్యరవముఁ, బంచమహాశబ్ద
రవముఁ జెలఁగె దిశలు సెవుడువడఁగ;
నొలసి జనులదీవనలు మించె: రమ్య మై
గరుడకేతనంబు గ్రాలెఁ బదల. 180

వ. అట్లసంఖ్యాతచతురంగసైన్యంబులతో నరిగి గిరి వన సరోవర సరి
ద్దేశంబులు గడచి మార్తికావతదేశంబున కరుగునంతకు ముందర
సాల్వుండు సౌంభకారూఢుం డయి సముద్ర కుక్షి దేశంబునకుం
బోయిన. 181

క. ఏనును వానిపిఱుందన
మానక చని తచ్చమూసమాజముతోడఁ
భూనాథ! రణము సేసితి
నానానిశితాస్త్రవర్షణ వ్యాప్తముగఁ. 182

క. వీరు లగుసాల్వయోధుల
నారాచావళులు గప్పె నారథముపయిఁ,
సారథితురంగములపయి.
జారుధ్వజయష్టిపయి నసంఖ్యాతముగఁ 183

వ. వాని నెల్ల. నస్మదీయగోచరంబులు గాకుండ ననేకాయుతశరంబు
లేసి సాల్వసైన్యంబుతో మహాయుద్ధంబు సేసిన. 184

మ. అవనీనాథ! తదాహవాంతరమునం దస్మత్కరాకృష్టశా
ర్ఙవినిర్ముక్తనిశాతసాయకశతాగ్రచ్ఛిన్న మై దైత్యదా
నవదేహప్రకరంబు వాతవిధుతార్ణఃపూర్ణసంఘూర్ణితా
ర్ణవకుక్షిం బడియెం గపిప్రవరసైన్యక్షిప్తశైలాకృతిఁ. 185

చ. ఘనతరదైత్యదానవనికాయకళేబరపాతఘట్టనం
దనరి యుగాంత్యకాలచలితంబునుబోలెఁ బయోధి భ్రమోసె; న

వ్వనధిరవంబుకంటె ననివారిత మై చెలఁగెన్ మదీయవా
హిని భటసింహనాద హయ హేషిత సింధురబృంహితధ్వనుల్. 186

వ. అట్టిమదీయసేనోత్సాహంబును, నిజసేనాక్షీణతయుం జూచి సహిం
పక సాల్వుండు వెండియు సౌంభకారూఢుం డయి నాతో మాయా
యుదంబు సేయ సమకటి. 187

పి. పరశు పాశాంకుశ కరవాల శూల ము
ద్గరములు నామీఁద దెరలఁ గురిసె;
నేను గడఁగి యద్దానవుశస్త్రములు
వాయంగఁ జేసితి; మాయఁ జేసి
వెఱవక సాల్వుండు వెండియు నామీఁదఁ
బరుషశిలావృష్టి గురిసె; వరుస
నమరఁ దమఃప్రకాశములతో దుర్దిన
సుదినశీతోష్ణముల్ గదియఁ జేసి;

ఆ. దితిసుతాధముండు శతసూర్యశతచంద్ర
శతసహస్రవిష్ణుతతులు వెలుఁగ
గగనతలము సేసెఁ బగ లిది రే యిది
యని యెఱుంగనయితి మనములోన. 188

క. మనుజేంద్ర! సర్వమాయా
పనోదనం బయిన యగ్నిబాణంబున న
ద్దనుజవినిర్మితమాయా
వినివర్తనఁ జేసితిని సవిస్మయమతి నై. 189

వ. అట్టియవసరంబున ద్వారవతినుండి యాహుకప్రేషితుం డయి యొక్క
రుం డతి త్వరితగతిం బల్కఁదెంచి సాల్వుచేత నక్కడ వసుదేవుండు
పట్టువడియె; నీ వెవ్వని తోడం గయ్యంబు సేసెదు? క్రమ్మరి చని
పురంబు రక్షించుకొను" మనిన విని యదరిపడి "మహాబలపరాక్రము
లయిన బలదేవాదులు రక్షించుకొని యుండ వసుదేవుఁ డేల పట్టు
వడు? నిదిపోల"దని సంశయించుచు విమనస్కుండనయి యుండునంత.

సీ, పుణ్యకర్మంబులు వొలిసిన నుర్వికి
నేతెంచునట్టి యయాతివోలె
భూషణదీప్తులు వొలియంగ వివృతకే
శాంబరుం డయి సౌంభకంబువలనఁ
బఱతెంచు వసుదేవుఁ బాపనిశాచర
బలపీడ్యమాను దవ్వులన కాంచి
యత్యంత మోహశోకాంధుండ నయిన నా
హస్తంబువలన విస్రస్తమయ్యె
ఆ. శార్ఙ్గ; మప్రియావసన్న దేహుండ నై
యుడిగి రథముమీఁదఁ బడితి నేను;
దానిఁ జూచి భయము దగిలి మత్తైన్యంబు
దల్లడిల్లి యులిసెఁ బెల్లురేఁగి. 191

వ. అంత నెంతయుం బ్రొద్దునకుఁ దెలిసి సాల్వు సౌంభకంబున వసుదేవుం గానక, దాని మాయఁగా నెఱింగి పదంపడి మాయావి యయిన సాల్వుం జూచి, వాని పయి నలిగి యే నేసిన నయ్యసురయు సౌంభకంబు నదృశ్యం బగుటయు. 192

క. అసురులయాక్రోశధ్వను
లెసఁగెం బదిదిశల; నంత నేనును దద్రా
ఙ్ముసులఁ గతాసులఁ జేసితిఁ
బ్రబసభంబున శబ్దభేదిబాణప్రతతిన్ 193

వ. అంత సాల్వుండును దనసౌంభకంబుఁ బ్రాగ్జ్యోతిషంబుఁ జేసి తానును దానవుండయి పర్వతవర్షంబు నాపయిం గురిసిన. 194

ఆ. పరుషవిషమభూరిపాషాణభీషణ
గిరులు వచ్చి నన్నుఁ దెరలఁ గప్ప
వజ్రబాణ మేసి వాని నన్నింటిని
బాచి యున్న నన్నుఁ జూచి యపుడు. 195

క. దారుకుఁ డి ట్లనియె "మహా
వీరు నుపేక్షింపఁ దగునె వీనిని మాయా

ప్రారంభు? నుపేక్షింప ర
పారపరాక్రములు పోర; ప్రాకృతునైన" 196

వ. అనిన వానిపలుకులు విని యలిగి యనలజ్వాలాకరాళం బయి, ప్రతి కూల రాక్షస యక్ష గంధర్వ దైత్య దానవభస్మసాత్కరణం బయిన చక్రంబు నభిమంత్రించి సొంభకంబుపయి వైచిన నది యుగ్మాంత కాలపరివేషభీషణం బయిన రవిమండలంబునుంబోలె గగనంబునం బఱచి సొంభకమధ్యంబునం బడిన. 197

చ. తడయక ఘోరదర్శనసుదర్శనపావకుచే దహింపఁగాఁ
బడి పరమేశ్వరోగ్రశరపావకదగ్ధపురత్రయాభ మై
యెడరి ధరిత్రిమీఁదఁ బడియెం జెడి సొంభక; మంత సాల్వుఁడుం
బడియె మదీయచక్రపటుపాతరయంబున రెండువ్రయ్య లై." 198

—: పాండవులు ద్వైతవనంబునకు వచ్చి యుండుట :—

వ. అని యిట్లు సాల్వునిం దన చంపిన విధంబు నెప్పి చక్రధరుండు పాం డవుల వీడ్కొని సుభద్రాభిమన్యులం గాంచనరథం బెక్కించుకొని తోడ్కొని ద్వారవతి కరిగె; ధృష్టద్యుమ్నుండును ప్రతివింధ్యాదు లయిన ద్రౌపదేయులం దోడ్కొని ద్రుపదపురంబునకుం జనియె; నిట పాండవులును రథంబు లెక్కి యాయుధంబులు ధరియించి యింద్ర సేనాదిమూలభృత్య లిరువదుండ్రు ముందట రా, ననేక సహస్ర బ్రాహ్మణవరులతో ద్వైతవనంబున కరిగి; రంత ధర్మరాజు తమ్ముల కిట్లనియె. 199

మధ్యాక్కర. "ఇది మహోగ్రాటవి; సింహ శరభోరగేంద్ర శార్దూల
మదగజాకీర్ణంబు; దీనిలోన నేమఱు కుండ వలయు;
నదియునుంగాక పరప్రయోగమాయలు గల; వెఱఁగి
మది నుండునది" యన్న నన్న కిట్లను మఘవనందనుఁడు. 200

వ. బ్రహ్మవిదులును, దపోవృద్ధులైన బ్రహ్మణులును, నఖిలలోకద్వారంబుల నప్రతిహతు లయిన నారదద్వైపాయనాది మునివరులు నీచేత నుపా సితు లయి నీకుశలంబ కోరుచుండుదురు; భవత్పరితాపం బెల్ల వారిని రక్షించు; నివ్వనంబు సకల కాల కుసుమఫలభరిత వనస్పతి

శాఖాశిఖారూఢ మయూర కీర కోకిలాలాప మధురంబును, బక బలాక కోక కారండవ సారస రమ్య మధుకర సౌమ్య సరోవరసంకులంబును, విమలశీతలజలప్రవాహనదీశోభితంబును, మహర్షిగణసేవితంబును నై యొప్పుచున్నయది; యిం దుండుద "మని లలిత లతా వితానాదిరమణీయంబు లయిన పృథుమూలంబుల నేవురు వేఱువేఱ నివాసంబులు నేసి నియతాత్మ లయి యిష్టంబున దేవపితృకార్యంబులు నేయుచుం దమ్మీఁ జూడ వచ్చిన మహామునులకు బ్రాహ్మణులకు మనఃప్రియంబు లయిన యాహారంబులు వెట్టుచు ద్వైతవనంబున నుండునంత. 201

క. పాండవులకడకు ధర్మవి
దుండు, తపోదహనదగ్ధదురితౌఘుఁడు మా
ర్కండేయుం డను మునినా
థుం డంతేవాసిగణముతోఁ జనుదెంచెన్. 202

వ. ఇట్లు వచ్చి వారలచేత నర్చితుం డయి వనవాసక్లేశదుఃఖితు లయిన పాండవులను ద్రౌపదిం జూచి యమ్మార్కండేయుం డిట్లనియె.

సీ. "పితృనిదేశమ్మునఁ బృథివీశ్వరత్వంబు
విడిచి సానుజుఁ డై పవిత్రచరిత
జానకిఁ దోడ్కొని చని వసంబున నున్న
రఘుకులనం దను రాముఁ దొల్లి
జూచితి; నిపుడు భూసురవంశపోషకు
సాధుజనస్తుత్యు సత్యధర్మ
నిత్యు ధర్మజు రమణీయకీర్తి పియు
శమవంతుఁ జూచితి; సగర భరత

ఆ. నల యయాతి వైన్య నాభాగు లాదిగ
నాదిరాజు లెల్ల నధికధర్మ
సత్యయుక్తిఁ జేసి సకలలోకంబులు
వడసి భాగధేయభాగు లయిరి. 204

వ. పాపసాబలప్రయుక్తుం డయిన ధార్తరాష్ట్రునట్లు ధర్మువు దప్పిన వారెవ్వరును లేరు; మీరు ధర్మనిత్యులగు సత్యవ్రతులరు గావున మీ

కిష్టసిద్ధి యగు"నని మార్కండేయుం డరిగిన నపరసంధ్యోపాసనాసీనుం
డయిన ధర్మరాజును, సాయం హోమార్థప్రజ్వలితజ్వలనంబు లయిన
యనేక సహస్రబ్రాహ్మణాగ్నిహోత్రంబులం జూచి బకదాల్భ్యుం
డను మహాముని యిట్లనియె, 205

ఉ. భూమిసురోత్తనుల్, ప్రకృతిపుణ్య విధాయులు, వీరు బుగ్యజు
స్సామపరాయణుల్, పరమసాధుచరిత్రులు మీకు సంతత
ప్రేమమునఁ శుభోన్నతులు వెంచుచు నుండుటఁజేసి సద్గుణో
ద్దామ యరణ్యవాస మిది దద్దయు నొప్పెడు మాకుఁ జూడఁగఁ 206

వ. బ్రాహ్మణానుగ్రహంబునంజేసి తొల్లి వైరోచనాదు లనేక కాలంబు
లక్షయలక్ష్మీ విభవులయి సముద్రనేమి భూచక్రంబు రక్షించిరి; యనిల
సహాయుండయిన యగ్నిదేవుం డరణ్యంబులు దహించునట్లు బ్రా
హ్మణసహాయుండయిన మహీశుండు శత్రువర్గంబు నిశ్శేషంబుసేయు;
వినీతుండయి విప్రులచేత ననుశాసితుండయిన రాజునకు నలబ్ధలాభా
దితయంబు సంపన్నం బగు; బ్రాహ్మణరహితుండయి ధర్మహీనం
డయిన రాజును బ్రజ వలవలదు; ప్రజానురాగంబు లేనివానికి
రాజ్యంబు సుస్థిరంబు గానేరదు; మీరు బ్రాహ్మణ ప్రియులరు;
ధర్మనిత్యుల; రెప్పుడును మీ కభ్యుదయం బగు" నని బకదాల్భ్యుం
డరిగినఁ బాండవులుం దమ యిష్టంబున నుండి దుఃఖోపశమనంబు
లయిన కథలు సెప్పుకొనుచున్న యవసరంబున ద్రౌపది ధర్మరాజున
కిట్లనియె. 207

—: ద్రౌపదీ ధర్మరాజుల సంవాదము :—

ఆ. "వృద్ధు గొడుకుపలుకు విని క్రూరుఁ డై పాప
బుద్ధిఁజేసి మిమ్ము భూతలంబు
వెలువరించి రాజ్యవిభవంబు గొని యిప్పు
డలుక సెడి సుచిత్తుఁ డయ్యె నొక్కొ! 208

ఆ. అద్దురాత్మహృదయ మది యయఃపాషాణ
నిష్ఠురంబు; ధర్మనిధుల మిమ్ము
నట్లు గొడుకు లెగ్గు లాడంగఁ బోయిన
వల దనండ కలహావాంఛఁజేసి. 209

సీ. విమలహార్మ్యంబుల విహరించువారలం
బ్రియ మహోర్వాసనశయనరతులఁ
జందనాగురులిప్తచారుసర్వాంగుల
నతనరనాథసేవితుల; మిమ్ము
వనమునఁ గ్రుమ్మరువారిఁ గాఁ, గుశబృసీ
శయనాభిరతులఁగా, నియతరూక్ష
భూరేణుధూసరీభూతవిగ్రహులఁ గా
ద్రుతవన్యమృగనిషేవితులఁ గాఁగ
ఆ. నిట్లు సూచి చూచి యే నెట్లు చిత్తోప
శాంతి సేయుదాన? సకలభోగ
విషయవిరతిఁ జేసి విధియును ధృతరాష్ట్రు
నట్లు మీకు నహితుఁ డయ్యె నొక్కొ! 210

క. భవదాజ్ఞానిగళంబునఁ
డవిలి పరాక్రమము విడిచి ధరణీశ్వర! నీ
యవరజు లిడుములఁ బడి కడుఁ
జివికిరి చెఱఁ బడిన సింహశిశువులభంగిన్. 211

ఆ. పరనరేంద్రమకుటపద్మ రాగద్యుతి
నరుణ మగు భవత్పదాబ్జయుగము
పరుషధాతుశిలలపై నిప్పు డరుగుట
నరుణ మయ్యెఁ బర్వతాంతరముల. 212

క. అనవరతసౌఖ్యసంపదఁ
బెను పొందుచు నుండు మీకు భీకరకాంతా
రనివాసాయాసంబుల
ననఘా! యిబ్భంగి నవయ నలమట వొడమెన్. 213

వ. నిత్యంబునుం బదివేవురు బ్రాహ్మణులు బ్రాహ్మవిదులు బసిండితళిగల నిష్టాన్నంబులు గుడిచి తృప్తు లయినం దద్భుక్తశేషం బుపయోగించు చుండు నీకు వన్యమూల ఫలాశనంబు లుపయోగించుచు నన్యుల యందుఁ గ్రోధంబు విడిచి యునికి యుచితంబు గాదు. 214

సీ. పదివేలగజముల బలమున విలసిల్లు
ననిలసుతుండు గాఱడవిలోనఁ
గ్రుమ్మరి, కాయలుఁ గూరలుఁ దిని వేద
వడినఁ జూచియు, దీర్ఘ బాహుయుగళుఁ
డయ్యును బాహుసహస్రంబు గలిగిన
యర్జునుకంటె బలాఢ్యుఁ డగుచు
నేక వేగంబున నేనమ్మ్ల లొక్కయ
మ్మేసినవిధమున నేయ నేర్చు
ఆ. నర్జునుండు వనమృగావలిఁ గలిసి యి
ట్లున్నఁ జూచియును, సుఖోచితాత్మ
లైన కవలు దీను లై యున్నఁ జూచియు
నుపశమంబుఁ దాల్చి యుండఁదగునె ? 215

వ. క్షమయును దేజంబును నయ్యయికాలంబులఁ బ్రయోగింప నేరని రాజునకుం బ్రజానురాగప్రతాపంబులు లేవను నీయర్థం బితిహాసంబున వినంబడు; క్షమాతేజంబులలోన నెయ్యది విశేషంబు దానిన నిర్ణయించి చెప్పు మని బలీంద్రుండు దొల్లి తన పితామహుం డయిన ప్రహ్లాదు నడిగిన నాతండు బలీంద్రున కిట్లనియె. 216

ఆ. "క్షమయ తాల్చి యుండఁ జన దెల్ల ప్రొద్దుఁ; దే
జంబ తాల్చి యుండఁ జనదు పతికి;
సంతతక్షముండు, సంతత తేజుండు
నగుట దోష మందు రనఘమతులు. 217

వ. అదియెట్లనిన నిత్యక్షమాన్వితుం డయిన వానికి భృత్యులు వెఱవక యవమానంబు సేయుదు; రర్థంబులయం దధికృతు లయిన వారలు ధనంబు లపహరించి దర్పంబు సూపుదురు; మఱి నిత్యతేజోధికుండైన వాఁడతిక్రూర దండంబున సర్వజన సంతాపంబు సేయుచు గృహగతం బైన సర్పంబునుంబోలె నెప్పుడు నుద్వేగకరుండగుం; గావునఁ గాలోచితంబులుగా క్షమాతేజంబులు గల్పించునది; యథాకాల కల్పితక్షమాతేజుండైన వానికి నుభయలోకసిద్ధి యగు; నని బలీంద్ర ప్రహ్లాద సంవాదంబు సెప్పి వెండియు ద్రౌపది యిట్లనియె. 218

తే. ఆది నపరాధ మొక్కటి యైన, నదియు
నల్పమైనను క్షమియించునదియగాక;
చెనసి యపరాధములు పెక్కు సేయు చున్న
పాపకౌరవ్యులకు సహింపంగ నేల ? 219

క. ఇది తేజంబున కవసర
ముదితక్రోధుండ వగుమ యొక్కించుక; దు
ర్మదు లగు సుయోధనాదుల
నదయుల వధియింతు రుగ్రులై నీతమ్ముల్." 220

వ. అనిన ధర్మ రా జిట్లనియె. 221

సీ. "క్రోధంబు పాపంబు; గ్రోధంబునన చేసి
యగుఁ జువ్వె ధర్మకామార్థహాని;
గడుఁ గ్రోధి గర్జంబు గానండు; క్రుద్ధుండు
గురునైన నిందించుఁ; గ్రుద్ధుఁ డైన
వాఁ డవధ్యులనైన వధియించు; మఱి యాత్మ
ఘాతంబు సేయంగఁ గడఁగుఁ గ్రుద్ధుఁ;
డస్మాదృశులకు ధర్మానుబంధుల కిట్టి
క్రోధంబు దాల్చుట గుణమె చెపుమ?

ఆ. యెఱుక గల మహాత్ముఁ డెఱుక యన్నలమున
నార్చుఁ గ్రోధ మను మహానలంబు;
గ్రోధవర్జితుండు గుఱుకొని తేజంబు
దాల్చు దేశకాలతత్త్వ మెఱిఁగి. 222

క. క్షమ గలవానికిఁ బృథ్వీ
సమునకు నిత్యంబు విజయసంసిద్ధి యగున్;
క్షమియైన వాని భుజవి
క్రమము గడుఁ బెలయు సర్వకార్యక్షమ మై. 223

వ. తేజఃప్రభవంబు లైన యమర్ష దాక్షిణ్య శౌర్య శీఘ్రత్వంబు లను
నాలుగు గుణంబులు క్షమావంతునంద వీర్యవంతంబు లగు; దొల్లి
కశ్యపగీత లైన గాథలయం దీయర్థంబు వినంబడు; వినుము; వేదం

బులు, శౌచంబును, సత్యంబును, విద్యయు, ధర్మ్మవు, సచరాచరం బయిన జగ మంతయు ఋమయంద నిలిచినవి; తపస్స్వాధ్యాయ యజ్ఞ కర్తలయు, బ్రహ్మవిదులయుం బడయు పుణ్యగతులు ఋమా వంతులు వడయుదు; రదియునుంగాక కృష్ణద్వైపాయన భీష్మ విదుర కృప ద్రోణసంజయ ప్రభృతులు నా యుపశమంబ కీర్తింతు; రీపశ మహీనుం డయిన దుర్యోధనుకారణంబున ధార్తరాష్ట్రుల కెల్లం బ్రళయం బగు"ననిన ద్రౌపది వెండియు ని ట్లనియె 224

మధ్యాక్కర. ఋమయంద చిత్తంబు నిల్పి నిర్గతకల్మషబుద్ధి
గ్రమమున ధర్మ్మవునంద వర్తిల్లు కరుణాత్ము నిన్ను
నమర ధర్మంబు రక్షించుఁ బ్రీతితో నని శత్రులందు
సమబుద్ధి సేయంగఁజను నె? నీకు నజాతశత్రుండ! 225

ఆ. ధర్మదూరు లైన ధార్తరాష్ట్రులయందు
ధర్మ్మ మేమి సేయు? ధరణినాథ!
నికృతిపరులయందు నికృతి సేయనివారు
వారి నికృతిఁ జేసి పధ్యు లంద్రు. 226

క. ఆర్యులకు విహీనతయు, న
నార్యుల కున్నతియుఁ జేసి యవినీతుఁడ వై
కార్యము దప్పితి; నీకు న
నార్యులు చుట్టములె? యార్యు లరులె? విధాతా! 227

వ. అని విధాతృని ధర్మ్మవు నాక్షేపించు ద్రౌపదిం జూచి ధర్మ్మరా జిట్లనియె; నాస్తికులయట్లు ధర్మ్మాభిశంకిని వై దైవదూషణంబు సేసె దు; శిష్టచరితం బయిన ధర్మ్మంబు నధిక్షేపించు చున్న దుర్మ్మతికిం బ్రాయశ్చిత్తంబు లేదు/ ధర్మ్మవు దప్పక నిత్యులై జీవించు చున్న మైత్రేయ మార్కండేయ వ్యాస వసిష్ఠ నారదప్రభృతులం బరమ యోగధరులం బ్రత్యక్షంబ చూచెదము; వీరెల్ల నన్ను ధర్మ్మపరుం డని మన్నింతు; రన్య లన్యాయంబు సేసి రనియు నే నెల ధర్మ్మవు దప్పుదు ? 228

క. ధీరమతియు క్తిఁజేసి వి
చారింపఁగ నిక్కువంబు సర్వజనస్వ
ర్గారోహణసోపానం
బారఁగ ధర్మంబ చూవె యతిరమ్యం బై. 229

వ. తపస్స్వాధ్యాయబ్రహ్మచర్యదానధర్మ యజ్ఞంబు లను పుణ్యకర్మంబు లఫలంబులగు నేని వీని నేల ఋషిగణంబులు సేవింతురు? నీ జన్మం బును, ధృష్టద్యుమ్న జన్మంబును బుణ్యకర్మఫలసద్భావంబునకు నిద ర్శనంబులు గావె? మఱి పుణ్యఫలంబులు గలయట్ల పాపఫలంబులును గలవు; తొల్లి బ్రహ్మ దన పుత్రులకుం గర్మఫలసద్భావంబు నెఱ్ఱె; నందుఁ గశ్యపుండు ధర్మప్రబోధనంబునఁ జేసి పుణ్యఫలప్రాప్తుం డయ్యె; విధాతృనియోగంబునం బుణ్యపాపఫలంబు సంప్రాప్తంబగు; విధాతృ ననుగ్రహంబునన కాదె పుణ్యకర్మంబులు ప్రవర్తించి మర్త్య లమ ర్త్యత్వంబును బొందుదు"రనిన విని ద్రౌపది యిట్లనియె. 230

ఆ. "కర్మఫలము లేదు; కర్మఫలాప్తికిఁ
గారణంబు విధియుఁ గా దనంగ
నంత యెఱుక లేనె? యార్తనై విధిచెడ్డి
కలసి పలికితిం బ్రియంబు దప్పి. 231

ఆ. వేదశాస్త్రములును విధివిధానములును
నప్రమాణ మను దురాత్మకులకుఁ
బుణ్యగతులు లేమి భూనాథ! యెఱుఁగని
దానఁ గాను ధర్మతత్త్వయుక్తి. 232

వ. తొల్లి నీతిమంతు లయిన బ్రాహ్మణులు మదీయజనకునకుం జెప్పంగ వింటి; నెఱుక గలవారికిం గర్మంబు గర్తవ్యంబు; గర్మరహితు లయి స్థావరంబులయట్లు జనులు జీవింప నేర; రల్పఫలంబుఁ నైనను గర్మంబుఁ బ్రవర్తించు చున్నవారిం జూచెదము; దైవమానుషంబులు గర్మఫలప్రాపికి నిమిత్తంబులు; పురుషుండు మనంబున నర్థసిద్ధి నిశ్చయించి కర్మంబునందుఁ గృతోత్సాహుండు గావలయు; నట్టివానికి దైవంబు సహాయం బయి కర్మసిద్ధి గావించు. 233

మధ్యాక్కర: తిలలందుఁ దైలంబు, గాష్ఠములయందుఁ దిరముగా నగ్ని
గలుగు చెటీఁగి యుపాయపూర్వమునఁ గడఁగి తత్సిద్ధి
యలయక యుత్సాహవంతుఁడు వడయున ట్లనుత్సాహ
మొలసి దైవపరుఁ డిది వడయంగను నోపునె యెందు!

మధ్యాక్కర: కడు నిమ్ముగా దున్ని బీజములు సల్లి కర్షకుం డున్నఁ
దడయక వర్షంబు గురిసి కావించుఁ దత్ఫలసిద్ధి;
నడుమఁ బర్జన్యుఁ డనుగ్రహింపనినాఁ డేమి సేయుఁ?
గడఁగి చేయం గలదానిఁ జేయును గాక కర్షకుఁడు. 235

వ. కర్మఫలంబులు దైవమానుషసిద్ధంబు లయిననుం బురుషోత్సాహసము
పార్జితంబులయిన నవి సుస్థిరంబు లయి సురక్షితంబు లయు వర్తిల్లు;
ననీహమానుం డయి దైవపరుం డయినవాఁడు నీరిలోని యాన
పాత్రంబునుంబోలె నవసన్నుం డగుం; గావునఁ గర్మఫలసిద్ధి నిశ్చ
యించి యుత్సాహవంతుండ వయి నీయనుజుల పరాక్రం బునం
బరుల జయించి మనయందలి యర్థకృశత్వం బపనయింపు" మనిన
యాజ్ఞసేని వచనంబుల కనుగుణంబుగా భీమసేనుండు ధర్మ రాజున
కి ట్లనియె. 236

—: భీమసేన ధర్మరాజుల సంవాదము :—

మ. పితృపైతామహ మైన రాజ్య మరినిర్భేద్యంబు, గాండీవిచే
నతిగుప్తంబు, బలారి కైనను నహార్యం; బిట్టిదానిఁ సుదు
ర్మతి నన్యార్థము నేసి నీకుఁ జనునే మత్స్యేశ! యుద్యోగవిన్
వ్రతముల్ సల్పుచు ధర్మలేశచరణవ్యాసక్తి నిట్లుండఁగఁ? 237

క. ఆమిషము సింహములచే
గోమాయువు గొన్నయట్లు కువలయ రాజ్య
శ్రీ మనచేఁ గొని కౌరవుఁ
డే మని తలఁచునొకో బుద్ధి నిష్టులుఁ దానున్. 238

క. దుర్మతులను దుర్జనులను
ధర్మస్థితి నోర్వఁ దగునె? ధరణీశ్వర! దు
ష్కర్మ్ల లగుధా ర్తరాష్ట్రుల
పేర్మి యడంగింపఁ గడఁగు పృథుభుజశక్తిఁ. 239

వ. ధర్మకామప్రభవం బయి సర్వార్థసాధనం బయిన యర్థంబు విడిచి మిత్రుల కప్రియంబు, నమిత్రులకు హర్షంబునుంగా మునివృత్తిం జేకొని ధర్మువు ధర్మ మనుచు ధర్మువునందు చిత్తంబు నిలిపి దుర్బలు నట్లుండఁ దగునె ? 240

ఆ. బాహుబలము మెఱసి పరులసంపదలు సే
కొనఁగ లావు లేని కుత్సితుండు
నియతదుఃఖవృత్తి నిర్వేదపరుఁ డగుఁ
గాక! నీకుఁ దగునె? కౌరవేంద్ర! 241

చ. నరనుత! నీయనుజ్ఞఁ గొని, నాఁడ విరోధుల నెల్లఁ బోరిలో
సరభసవృత్తి నుక్కడఁగఁ జంపితిమేని మహోగ్రకాననాం
తరముల నుండ కుండ, నతిదారుణదుర్మృగసంగమంబునం
బొరయక యుండఁగా మనకుఁ బోలు నమందమనఃప్రియంబుగఁ. 242

క. సమయాతిక్రమభీతిని
ఋమాయుతుల మైన మనలఁ గౌరవులు పరా
క్రమహీనులుగాఁ దలఁతురు,
సమరోత్సాహంబు విడిచి జడమతి సున్నన్. 243

తే. తగిలి నిత్యంబు నేకాంతధర్మనిరతుఁ
డగుట యుక్తమె పురుషున? కట్టివాని
వెలయ నర్థ కామంబులు విడుచుఁ ప్రాణ
విగతు సుఖదుఃఖములు రెండు విడుచు నట్లు. 244

సీ. ధర్మకామంబులు దఱుఁగంగ నర్థార్థి
యగువాఁడు పతితుఁ డౌ, నర్థసేవ
నర్థార్థముగఁ జేయు నతఁ డుగ్రవనములో
గోరఱ సేయు నక్కుమతి బోలు;
నర్థధర్మములకు హానిగాఁ గామార్థి
యగునాతఁ డల్పజలాశయమున
జలచరం బెట్టు లజ్ఞలములతోఁ జెడు
నట్లు కామంబుతో హానిఁ బొందు;

ఆ. నర్థధర్మములు మహోర్వి మేఘములట్టు
లుభయమును బరస్పరోదయమ్ము;
లిట్లు గాఁ ద్రివర్గ మెఱిఁగి సామ్యమున నే
వించువాఁడు సర్వవిత్తముండు 245

వ. భవదాచరితం బైన యీధర్మం బర్థకామంబులక కాదు, నీకును, నీబాంధవులకును బాధాకరంబు; దాన యజ్ఞ సత్ప్రాజలు గావింప నర్థహీనున కశక్యంబు; జగంబులు ధర్మమయంబులు; ధర్మ్మవునకు మిక్కిలి యొండెద్దియు లే; దయినను నర్థార్థంబు గాని ధర్మ్మవు ప్రత్యవాయుల కయుక్తంబు. 246

ఉ. శత్రుల నాజి నోర్చుటయు, సర్వభయంబులఁ బొంద కుండగా
ధాత్రిఁ బరిగ్రహించి యుచితస్థితిఁ గాచుటయుం, ద్రియంబుతోఁ
బాత్రుల కర్థ మీగియును, బ్రాహ్మణపూజయుఁ జువ్వె యుత్తమ
ప్రత్యవధర్మముల్, సుగతికారణముల్, విపులార్థమూలముల్. 247

వ. కేవలధర్మాచరణంబు శత్రుజయంబునకు సాధనంబు గాదు; నికృతి పరులయందు నికృతి వలయుఁ; బూర్వభ్రాత లైన యసురుల నమరులు నికృతిన కాదె నిర్జించిరి; కావున నీవు సమయధర్మ రక్షణ వ్రతం బుడిగి శత్రుపుల జయింప నుద్యోగింపుము. 248

క. జయశీలి వైన నీకుం
ద్రియ మెనరింపంగ నున్న పృథుయశులు ముదా
శ్రయ లగుచుఁ బృంజయకే
కయయవపాంచాలు రాఁగాఁ గల సుహృదుల్, 249

తే. మిత్రసంపన్నుఁడైన నమిత్రు మిత్ర
బలముతోడ ఖేదించి, దోర్బలముఁ జలముఁ
గలిగి, దేశబలంబును గాఁచలము
గలుగువాని కసాధ్యంబు గలదె? యెంచు. 250

తే. బలము గలవానిఁ బలుఁడీరు బలవిహీను
లొక్కటై కూడి నిర్జింతు రుత్సహించి;
మధువుఁ గొన నుత్సహించిన మనుజుఁ బట్టి
కుట్టి నిర్జించు మధుకరకులమునట్లు. 251

వ. తుదాగ్నిసంబునందలి దుగ్ధంబునుంబోలె దుర్యోధను రాజ్యంబు దూష్యం బగుటఁ బౌరజానపదబ్రాహ్మణవరులు నీ కనురక్తులయి భవద్రాజ్యంబ వలచి యుండుదురు; దీని నేల యెడ సేసెదు? సర్వాయుధసనాథం బైన రథం బెక్కి గజపురంబున కభిముఖుండ వై విజయప్రయాణంబు సేయుము. 252

మ. ప్రణుతశూత్తిగుణంబు, విక్రమము, దర్పం బేర్పడఁ విక్రమ
ఋణదానం బొనరింపు మీప్సణము; విఖ్యాతంబుగా సంగరాం
గణమధ్యంబునఁ జేయు మర్జునబృహద్గాండీవనిర్ముక్తమా
ర్గణధారావళి ధార్తరాష్ట్రికదళీకాంతారవిచ్ఛేదమున్. 253

క. బహురథగజవాహనభట
సహితులు బలవంతు లని విచారింపకు నీ
యహితులు; మద్బాహుగదా
నిహతికి మార్కొనఁగఁ బోర నిలువంగలరే? 254

క. అరివరుల నోర్చి సాగర
పరివృతభూచక్ర మెల్లఁ బాలింపు; ప్రజా
పరిపాలనంబుకంటెను
ధరణీశ! విశేష మొండు ధర్మ్మవు గలదే? 255

వ. రాజ్యపదస్థుం డైన క్షత్త్రియుండు భూరిదక్షిణంబు లైన యజ్ఞం బుల దేవబ్రాహ్మణులం దృప్తులం జేసి, బ్రాహ్మణులకు నగ్రహారం బులు గోసహస్రంబులు నిచ్చి, దురితంబులవలనం బాసి, తమోవిముక్తుం డైన చంద్రుండునుంబోలె వెలుంగు"ననిన భీమసేనునకు ధర్మ్మరాజిట్లనియే. 256

ఉ. "నీవచనంబు ధర్మ్యము, వినీతము నీతియుతంబు నిష్టసి
ద్ధ్యావహ, మత్యుదార మిది; యైనను నిప్డు దలంపఁగా విచా
రావసరాప్తికిన్ విషయ మైనది; కార్యఫలంబు లెల్ల స
ద్భావమునన్ విచారసులభంబుల యంద్రు విచారపారగుల్. 257

క. వనమునఁ బండ్రెండు దొండ్లును
జనపదమున నెఱుఁగ కుండ సరి నొకవర్షం

బును జలుప బూని సత్యము
దనరఁగఁ జేసితిఁ బ్రతిజ్ఞ దగ వృద్ధసభన్. 258

చ. అలఘుగుణంబులం దధికుఁ డైన మహాత్ముఁడు రాగకోపమా
యలఁ బడి, యతుమావివళుఁ డై, యచిరాంశులతావిలాసచం
చల మగులక్ష్మి కాసపడి, సత్యము ధర్మ్మవుఁ దప్పి, సత్సభా
వలిఁ దగువారియొద్దఁ దగువాఁ డయి సద్విధి నుండ నేర్చునే? 259

వ. ఏ నెట్లును సత్యసమయం బతిక్రమింప నోప; శుభోదయ కాలంబుఁ
బ్రతీక్షించి యుండుము; రాజ్యంబులుఁ బుత్రులును, ధనంబును,యశం
బును, సత్యంబునకు సమంబులు గా''ననిన భీమసేనుం డిట్లనియె. 260

ఆ. అంతకుండు జనుల కాసన్నుఁ డై యుండ
నిమిషమాత్రమేని నిశ్చయింపఁ
దగని జీవనంబు దద్ద సుస్థిరముగాఁ
జేసి కార్య మెడయుఁ జేయఁ తగునె ? 261

వ. శరీరికి మరణంబు నియతంబు; మరణంబునకు ముందర వెరంబు
దీర్పనివాని జన్మంబు నిరర్థకంబు; సకల రాజసమ్మతంబునం బరులచేత
నట్లు మన పడిన పరిభవంబునకుం బ్రతీకారంబు సేయునంతకు రేయు
నుం బగలును నా హృదయంబు దపించుచుండు; నాకంటె నర్జున
నకుల సహదేవులుం, గుంతీదేవియు నంతస్తాపంబున నెంతయు సం
తప్తు లగుచున్న వారు. 262

క. వీరల దుఃఖము దీర్పక
క్రూరనికారు లగు రిపులకును ముదముగ ను
గ్రారణ్యములో ధర్మ్మవుఁ
గారుణ్యముఁ దాల్చి యునికి కార్యమె నీకున్ ! 263

వ. ఇది బ్రాహ్మణధర్మ్మంబుగాని క్షత్త్రియధర్మ్మంబు గాదు; మను ప్రణీ
తంబు లైన రాజ ధర్మ్మంబులు నీయెఱుంగనియవి లేవు; శత్రుసంహా
రంబు సేయనినాఁ డత్యంతహాని యగు; నట్లుం గాక. 264

తే. వనమునందుఁ బండ్రెండుసంవత్సరంబు
లుండ నేర్చితిమేనియు, నొరు లెఱుంగ

కుండ నజ్ఞాతచర్యయం దొక్కదివస
మైన నుండఁగ నేర; మెట్లనిన వినుము. 265

వ. ఆబాలవృద్ధప్రసిద్ధుండ వై పార్థివసూర్యుండ వైన నిన్నును, సింహ సంహానను లైన నీతమ్ములను నెఱుఁగని వారు లేరు; మన గూఢ భావంబు మేరువు నిగూఢభావంబునుంబోలె నఘటమానం; బిట్లేని నివ్వన వాసక్లేశం బెన్నఁడును మనకుఁ బాయ నేరదు; మన మిప్పు డివ్వనమునఁ బదుమూఁడుమాసంబులు సలిపితిమి; సంవత్సర ప్రతినిధిగా మాసంబులు సేసికొనుట యెందునుం గలయదియ; దీన ధర్మ విరోధంబు లేదు; విజయారంభంబున కిది యవసర"మనిన భీమసేను పలుకులు విని నిశ్వాస వ్యాకులితముఖుం డై పెద్దయుం బ్రొద్దు చింతించి ధర్మ రా జి ట్లనియె. 266

క. "క్రమమునఁ బాండిత్య పరా
క్రమ గర్వములందుఁ గడుఁ బ్రగల్భుండవు; మ
ధ్యమ! నీ చెప్పినయది కా
ర్యమ యయినను ధీరబుద్ధి వై విను మసఘా! 267

ప. "అల్పోపాయం బైన కార్యంబు సాహసారబ్ధం బైనను దోషంబు లే; దిది మహాకార్యంబు; సాహసక్రియాసాధ్యంబు గాదు; సువిచారితం బై సిద్ధిం బొందు; విచారపూర్వారబ్ధకార్యంబునకు దైవంబును నను కూలం బగుఁ; గావున నిమ్మగా విచారింపవలయును. 268

సీ. శూరులు ధృతరాష్ట్రసుతులు దుర్యోధనా
దులు దురాధర్షు లందొయిను మనకు
నాతతాయులు; మటి యంగభూవిభుఁడును
భూరిశ్రవుఁడు శలభూమిపతియు
నాదిగాఁ గల పీరు లవిజేయవిక్రము
లొలసి తత్సహ్యాదు లై యున్న వారు;
మనచేత జితు లైన మనుజేశు లెల్లను
జని సుయోధనుచేత సత్కరింపఁ

ఆ. బడి, కడంగి వాని ప్రస్తవంబున నాజి
వేచి ప్రాణములను విడువ నున్న
వారు; వార లెల్ల వసుధఁ బ్రసిద్ధులు
వినఁగ నస్త్రశస్త్రవిద్యలందు. 269

క. వినవయ్య కర్ణగర్వం
బని నాతఁ డభేద్యకవచుఁ డగుటయు, విలునే
ర్పును, నతనిబాహువిక్రమ
మును దలఁచినవాఁడు గన్ను మూయదు నాకున్, 270

వ. మఱియు భీష్మద్రోణకృపాచార్యులు సము లయ్యును వారియొద్దన యున్న వారు; వార లపారదివ్యాస్త్రవిశారదులు; వారల నోర్చి కాని దుర్యోధను నిర్జింపం బోల"దని విచారించు సమయంబున. 271

—: కృష్ణద్వైపాయనుఁడు ధర్మరాజునొద్దకు వచ్చుట :—

క. వారలపుణ్యోదయమున
వారిజభవనిభుఁడు లోకవంద్యుఁడు వచ్చెం
బారాశర్యుఁడు, ధర్మశ
రీరుఁడు గృష్ణాజినోత్తరీయుఁడు ప్రీతిన్. 272

వ. ఇట్లు వచ్చి పరమభక్తిపరులైన పాండవులచేతం బూజితుం డై కృష్ణద్వైపాయనుండు ధర్మ రాజున కిట్లనియె. 273

క. వీరు లగు భీష్మకుంభజ
శారద్వతకర్ణ లమితసత్త్వులు; వారిం
బోర వధియించు టెంతయు
భారం బని యున్న నీదు భర మెటిఁగి మదిన్. 274

ఆ. దాని నపనయింపగా నిప్డు వచ్చితి;
నధిక యోగలబ్ధ మతిరహస్య
మీవిశేషవిద్య నేవింపఁగాఁ బార్థుఁ
బనుపు; మితఁడు దీనఁ బడయు సిద్ధి. 275

వ. అని ధర్మతనయు నేకాంతప్రదేశంబునకుం దోడ్కొని చని సత్యవతీ సుతుండు విధిదృష్టవిధానంబునం బ్రతిస్మృతి యను విద్య నుపదేశించి

దీనిశక్తి నర్జునుం డధిక తపోవీర్యవిభవుం డై యింద్రయమవరుణకుబే
రాదిదేవతలను, నీశ్వరునిఁ బ్రత్యక్షంబు సేసికొని, వారలవలన దివ్యా
స్త్రంబులు వడసి శత్రువుల జయించు; మఱి యివ్వనంబు భవచ్చిర
నివాసనంబునం జేసి విరళఫలకుసుమపాదపం బై మృగకులోపరో
ధియై యొప్పకున్న యది; యొక్క చోటన పెద్దకాలం బునికి
యెవ్వరికిం బ్రీతిజననంబు గాదు; కావున నొండువనంబున కరుగునది''.
యని చెప్పి యమ్మునివరుం డరిగినఁ దద్వాక్యముదితు లై ద్వైత
వనంబుఁ బాసి పాండవులు బ్రాహ్మణ వరులతోన కామ్యకవనంబున
కరిగి సరస్వతీతీరంబునందు నివాసంబు సేసి కొండొక కాలం బుండ
నొక్కనాఁ డజాతశత్రుం డర్జునుఁ జూచి యిట్లనియె. 276

క. సాదితశాత్రవు లగు భీ
ష్మాదులయం దధిగతాశ్రయం బయ్యె జతుః
పాదం బగు చున్న ధను
ర్వేదము; బ్రాహ్మణులయందు వేదమపోలెన్. 277

వ. అయ్యది మహనీయం బయి, దివ్యమంత్రకలితం బయి. వారలకు
సన్నిహితం బగుఁ గావున. 278

క. వారలు దుర్యోధనుచే
నారాధితు లిష్టసత్క్రియల; నగుట రణ
ప్రారంభ మయిన నెదిరెడు
వార పరాక్రాంతు లై యవశ్యము మనతోన్. 279

వ. దివ్యాస్త్రవిదు లైనవారల నోర్చునట్టి యుపాయంబు కృష్ణద్వైపాయ
నుండు ప్రసాదించె; నీవిద్య నీవు ప్రతిగ్రహించి కవచకార్ముకప్రాస
ఖడ్గధరుండ వై యన్యుల కజేయుండ వై, యుత్తరదిక్కున కరిగి
తపోయోగబలంబున నింద్రుఁ బ్రత్యక్షంబు సేయుము; తొల్లి వృత్రు
నకు వెఱచి వేల్పులు తమ యాయుధంబులు, బలంబులు, నింద్రు
నందు సమర్పించి; రవి యెల్ల నీకుఁ దత్ప్రసాదంబున నగు; మఱి

యింద్రు నుపదేశంబున నీశ్వరు నారాధించి తదనుగ్రహంబున నిష్ట
సిద్ధివడయు; మిది వేదవ్యాసు నుపదేశం బని. 280

క. ధృతినియమవ్రతునకు, దీ
క్షితునకుఁ బార్థునకు విగతకిల్బిషునకు ధ
ర్మ్మతనూజుఁడు ప్రీతిఁ బ్రతి
స్మృతి నుపదేశించెఁ దా నమిత్రజిగీషన్. 281

వ. అర్జునుండును నయ్యోగవిద్యాగ్రహణప్రభావంబున నధికతేజో
మూర్తియై దివ్యాస్త్రలాభార్థం బగ్రజుచేత ననుజ్ఞాతుం డై విధివిహి
తహోమసంతర్పిత వీతిహోత్రుండును బ్రాహ్మణకృతస్వస్త్యయ
నుండును నై ధౌమ్యాదిమహీసురవరులను భ్రాతృవరులను వీడ్కొని
తపంబున కరుగ సమకట్టిన. 282

సీ. ఆతని గాండీవహస్తు నక్షయబాణ
తూణీరయుగళు నత్తుంగభుజునిఁ,
గనకవర్మావృతఘనతరతనుఁ జూచి
పొంగి యంతర్హితభూతములును
బ్రాహ్మణప్రవరులుఁ బార్థుని మనమునఁ
దలఁచిన యర్థంబు దడయ కిష్ట
సంసిద్ధి యయ్యెడు; సర్వవిఘ్నములును
శాంతిఁ బొందెడు; మని సంతసమునఁ

ఆ. బలికి; రంతఁ దరుణి పాంచాలి బీభత్సు
కడకు నరుగుదెంచి, కమలనేత్రి
యరిజయార్థ మరుగు నాతని యుత్సాహ
మెఱిఁగి యిట్టు లనియె నిందువదన. 283

క. అవమానాసహ మగు నీ
యవమతు త్రిగ్రుకులంబునం దిం కిట పు
ట్టువు గా కుండెడు; తత్క్షమ
మవు బ్రాహ్మణకులమునంద యయ్యెడు నాకున్. 284

చ. అరికృతదుష్పరాభవమహార్ణవమగ్నుల మమ్ము నందఱం
గరుణ సముద్ధరింపుము; జగన్నుత! యన్యులు వూనఁ గాని యీ

భరము వహింపఁ బూనిన యపార గుణాన్వితు నిన్ను దిక్కులు
ధరణియు. సోముఁడుఁ. నభము, ధాత్రియు, గాడ్పును గాచు
చుండెడున్. 285

వ. అని దీవించి పాంచాలరాజపుత్రి దన స్నేహలాలసవిలోలాపాంగవి
లోకనంబులం బార్థుఁ బరిగృహీతపాథేయుం జేయుచుఁ, దద్వియోగ
తరళం బైన హృదయం బెట్టకేనియు నొక్కింత సేసికొని యుండెఁ;
మఱి పార్థుడునుం బూర్వోత్తర దిశాభిముఖుండై యొక్కరుండ యరిగి
యైంద్ర యోగశక్తి నిఖిలభూతదుర్నిరీక్ష్యం డగుచు హిమశైల
గంధమాదనంబుల నతిక్రమించి. 286

ఉ. వీరుఁడు యోగవిద్యయును, విల్లును దోడుగ నింద్రకీల మ
భూరినగంబుపైఁ గడఁగి పోవఁగఁ బోయినఁ, "బోవ కుండు ము
గ్గారివిభేది నీ" వను మహామధురధ్వని వించె వానికిఁ;
బోరన నంతరిక్షమునఁ బొల్చె నిరంతరపుష్పవృష్టియున్. 287

వ. దానికి విస్మయం బంది చనువాఁడు ముందట నొక్కవృక్షమూలంబున
నున్న వృద్ధ బ్రాహ్మణు, బ్రహ్మతేజోధికు, నవిరతయమనియమ
కృశీభూతశరీరుం గని నమస్కరించి తత్సమీపంబున విశ్రమించియున్న
నప్పార్థుం జూచి బ్రాహ్మణుం డిట్లనియె. 288

క. ఎందుండి వచ్చి తయ్యా? య
నిందితతేజుఁడవు ధర్మనియతుండవు; నీ
కిం దుండ నేల? సిద్ధిం
బొందితి; చేకొను మభీష్టభూరిఫలంబుల్. 289

క. ఇది శాంతతపస్వుల కా
స్పద; మిందుఁ గృపాణకవచ బాణాసనసం
పద దాల్చి యుండ నేటికి?
విదితక్షత్రియకులుండవే నీ వనఘా! 290

వ. వీతహర్షక్రోధు లైన బ్రాహ్మణు లుండెడు పుణ్యనివాసంబున
నాయుధంబులు ధరియించి యుండవలదు! వినివిడువు" మని నిషేధిం

చిన నవ్విఘ్న వచనంబులకు సంచలింపకయున్న యాతని ధైర్యం బునకు మెచ్చి సహస్రాక్షుండు నిజరూపంబుఁ జూపి యతని కిట్లనియె. 291

ఆ. "ఇష్టమైన వరము లిచ్చెదఁ బ్రీతితో
వేఁడు"మనిన సమరవిభున కపుడు
గరము భక్తి మ్రొక్కి కరములు మొగిచి యి
ట్లనియెఁ బురుషవృషభుఁ డర్జునుండు. 292

వ. "దేవా! నాకిష్టం బైనవరంబు భవత్ప్రసాదంబున దివ్యాస్త్రలాభం" బనిన "నది యేమి గహనంబు? దానిన యిచ్చెదఁ; బుణ్యలోకంబులు, దేవత్వంబును, సర్వకామంబులు వేఁడు"మనిన నర్జునుం డిట్లనియె. 293

సీ. దివిజాదినాథ! నా కవి యెల్ల నేటికిఁ?
బరమాస్త్రలాభంబ కర మభీష్ట;
మరులు సేసిన మహాపరిభవక్లేశంబు
వాపంగ నోపక యేపు టడవి
నురుదుఃఖితుల సహోదరుల నందఱఁ బెట్టి
చనుదెంచి, మిన్నక చనిన నన్నుఁ
దగువారు జగములోఁ దెగడరే?" నావుడు
సుతునకుఁ బ్రీతుఁ డై శతమఖుండు
ఆ. గరుణ నిట్టు లనియెఁ "బరమాస్త్రలాభంబు
నీకు నిష్టమేని లోకవంద్య
గరళకంఠు, నీకుఁ, బరము, బ్రసన్నుఁగా
వేగ చేయు మధికయోగశక్తి. 294

వ. అట్లేని నిఖిలలోకపాలసహితుం డై యీశ్వరుండు నీయభిమతం బొనరించు"నని సహస్రలోచనుండు లోచనాగోచరుం డైన నర్జునుండును దద్వచనంబున సమాహితచిత్తుం డై హిమశైలశిఖరంబున కరిగి వివిధకుసుమఫలవృక్షంబులను, విమల నిర్ఝరజలంబులను, గమలకుముదకల్హారకలహంససంకులపంకజాకరంబులను రమ్యం బైన తపోవనంబునందుఁ బరమేశ్వరు నుద్దేశించి తపంబు సేయం దొడంగిన. 295

క. సుతదుందుభినాదంబులు
సురపాదపసంభవ ప్రసూనసుగంధో
త్కరవాసితపవనము వి
స్తరిల్లె నాతనికి హృదయసమ్మద మెసఁగఁ. 296

వ. అందు మనోవాక్కాయ కర్మనియతుం డై పరమేశ్వరుం దన చిత్తం బున నిలిపి, నిరంతర త్రిరాత్రోపవాసంబుల నొక్క మాసంబుఁ జలిపి, ద్విగుణిత త్రి రాత్రోపవాసంబుల రెండవమాసంబుఁ జలిపి, షష్ఠోప వాసంబుల మూఁడవమాసంబు సలిపి, యూర్ధ్వబాహుం డై యేక పాదాంగుష్ఠాగ్రంబున నిలిచి వాయుభోజనంబు సేయుచు నాలవ మాసంబు సలిపి, యిట్లతిఘోరతపంబు సేయుచున్న యర్జునుంజూచి యంచలి ఋషులు విస్మయంబంది యీశ్వరుపాలికిం జని యి ట్లనిరి.

ఉ. "భూరిబలుండు పాండవుఁ డపూర్వతపం బొనరించుటం దదీ
యోరుతపఃప్రభావ దహనోత్థితధూమచయంబు లంబుదా
కారము లై వనాంతరము గప్పె; జగత్ప్రియనాథ! తత్తపో
భారము సర్వజీవుల కపారభయావహ మద్భుతం బిలన్. 298

వ. ఆతని యభిమతంబుఁ బ్రసాదించి, తత్తపోభారంబు వారింపు"మనిన వారల పలుకులు విని పరమేశ్వరుండు దరహసితవదనుం డగుచు "వాని యభిప్రాయం బే నెఱుంగుదు; నిష్టవర ప్రసాదంబున వానికి మనఃప్రియంబుఁ జేసెద; మీరు మీ యాశ్రమంబుల కరిగి సుఖం బుండుం'"డని యప్పుడు. 299

—: ఈశ్వరుండు గిరాతవేషంబున నర్జును నొద్దకు వచ్చుట :—

సీ. కాంచనవర్ణాపఘనుఁ డై మహోన్నత
కార్ముకహస్తుఁ డై, కాలకంఠుఁ
డెఱుకురా జయ్యె; నద్రీంద్రతనూజయు
వనచరీభావంబు వఱలఁ జూచెఁ;
గుఱుచచేతులు, మిడిగ్రుడ్లును, గడుకొన్న
తఱుటులు, మటి చెంచుఁదలలు నమరఁ
దడవిండ్లు సేపట్టి తడయక యెఱుకు లై
యార్చుచు భూతమ్ము లాత్మగతుల

తే. నెఱుకుసతులఁ గావించి యయ్యెఱుకురాజు
ముందటం, బక్కయల నొక్క మొగిన నిలిచి;
రంత వేఁటనెపంబున నంధకారి
గదలెఁ దద్వన మెల్ల గ్రక్కదలు చుండ. 300

చ. అలుగుల గ్రుంది యందుల మృగావలియున్ విహగంబులుఁ భయా
కులగతిఁ బొంది మూఁగలును గుంటులుఁ జీకులు నైనయట్టు లై
యులియక యున్నచో నడఁగి యుండఁ గిరాతబలంబుతోడఁ బిం
గలనయనుం డుమేశ్వరుఁడు గవ్వడి డాయఁగ వచ్చెఁ జెచ్చెరన్. 301

వ. అంత నీశ్వరచోదితుం డయి మూకుం డను దైత్యుండు సూకరం బై
భీకరా కారంబున బీభత్సు వధియింప సమకట్టి పయిం బ ఱ
తెంచిన. 302

క. అనఘుండు దాని దవ్వులఁ
గని ఘనుఁ డయి పాండవుండు గాండీవగుణ
ధ్వని సేయుచు డాసినఁ బె
ల్చన యేయఁ గడంగి నిలిచె సంరంభమునన్. 303

వ. అదియును నాతుణంబ యేసిన యమ్ములును బోలె నతివేగంబున దా
నాసన్నంబై న, దాని నేయ కేయకు మని యెఱుకురాజు వారించి
నను వాని వచనం బాదరింపక. 304

చ. పటువిశిఖంబునం ద్రిదశపాలతనూజుఁడు పంది నేసె; ము
న్నట పరమేశ్వరుండను రయంబున దానిన యేసె; నిట్టు లొ
క్కొటఁ బడియెఁ హరార్జునుల ఘోరశరంబులఁ పందిపైఁ గుభృ
త్తటముపయిఁ వడిం బడు నుదగ్రమహోశనులట్ల ప్రమోయుచున్. 305

క. హరుశరమును, నరుశరమును
సరి నిరుపక్కయలు దాఁకి జవ మఱి, శరసం
భరమునఁ దిరిగె వరాహము
శరనిధిమథనమునఁ దిరుగు శైలమపోలెన్. 306

వ. ఇ ట్లిద్ధఱుచేత శరవిద్ధుం డై మూకదైత్యుండు నూకరరూపంబు విడిచి
నిజరూపంబు తోడ నదృశ్యుం డయ్యె; నంత నర్జునుండు విస్మితుండై

ముందట నత్యున్నత చాపధరు, మేరుశిఖరాకారు, నపారకిరాతపదా
తిసమేతు, నభినవయౌవనవనచరీ సహస్రపరివృతు నొక్కపురుషుం
గని "నీ వెవ్వండవు? మనుష్యగోచరంబు గాని యివ్వనంబునఁ బ్రియ
వనితానుగతుండ వయి యేల క్రుమ్మరియెదు? మటి నా యేసిన
మృగంబు నేసి మృగయాధర్మవిరోధం బేల చేసితి? నిన్ను నిప్పుడ
నానిశిత బాణజాలంబులపాలు సేసెద"ననిన నగుచు నాతనికి నయ్యె.
ఱుకురా జి ట్లనియె. 307

ఆ. "ఏను నామృగంబు నేసితి; నది మదీ
యాస్త్రనిహత మయ్యె నవికలముగఁ;
జనునె నీకు లేని శౌర్యసంపదఁ జెప్పి
కొనఁగ నుదము మిగిలి కుజనునట్లు? 308

క. పలుకుల నొప్పదు; బీరము
గలవేని రణంబు సేయఁ గడఁగుము; నీ దో
ర్బల మిప్పుడ యుడిపెద"నని
తలరక యేయుచుఁ బినాకి తాఁకెఁ గిరీటిన్. 309

వ అంత 310

చ. ప్రతిబలదర్పభంజనుఁడు పార్థుఁడు దారుణబాణవర్ష ము
న్నతి నతిపీరుఁ డై కురిసినం, బరముండు మహోంబువృష్టిఁ బ
ర్వతము గ్రహించునట్లు బలవంతుఁడు దాని గ్రహించి, పోర న
ద్భుతతనుఁ డయ్యె; వాని నతిగర్వితుఁ బార్థుఁడు సూచి యాత్మలోన్.

చ. "ఇతఁడు సురేంద్రుఁడొండెఁ, బరమేశ్వరుఁ డొండె, దినేశుఁ డొండెఁగా
కతులబల ప్రభావయుతుఁ డన్యుఁడు గాఁ; డొరుఁ డైన మదృజా
పితధనుర్విము క్తశరవేగము పోర సహించి యిట్టు ల
ద్భుతుఁడు, నమూర్ఛితుండు నయి కంపముఁ బొందక యుండ నేర్చునే?

వ. నా యేసిన యపారదుర్వారనారాచంబు లవివేకియందుఁ బ్రయు
క్తంబు లయిన సుభాషితంబులుంబోలె ఫినియందు నిష్ఫలంబు లగు
చున్నయవి. 313

ఆ. ఎఱుకు నన్ను నుఱక యేసిన శరములు
నెఱకు లాడి నాకు నిశితదివ్య
విశిఖతతులయట్లు వేదన గావించు
టిది యపూర్వ; మీతఁ డెవ్వఁ డొక్కొ ! 314

వ. ఇప్పర్వతంబు దైవనివాసంబు గావున నితండు కిరాతరూపప్రచ్ఛ
న్నుండైన యెయ్యేని యొక్క దివ్యపురుషుండు గావలయు"నని
యశనికల్పంబు లయిన దివ్యశరంబు లయ్యెఱుకుపయి నేసి, యర్జు
నుం డఱుయబాణంబు లైన తన తూణీరమ్ములయం దమ్ములు గానక
"ఖాండవదహనంబునాఁ డగ్ని దేవుండు నాకిచ్చిన యఱుయ శరధు
లిప్పుడు యుగాంతకాలరిక్తంబు లైన శరధులుంబోలె నున్నయవి;
యిది యేమి యద్భుతంబో !"యనుచు నలిగి గాండీవం బెత్తికొని
యెఱుకుపయిం బఱచి. 315

క. అపహృతగాండీవుఁడు నై
యపరిమితక్రోధహృదయుఁ డన్నరుఁడు పరం
తపుఁ డెఱుకు మస్తకంబునఁ
గృపాణపాతంబుఁ జేసెఁ గిట్టి కడంకన్ 316

క. అదియు వృథ యైనఁ బార్థుఁడు
వదలక వృక్షముల, రాల, వైచెను రణదు
ర్మదు వనచరుఁ నవి యెల్లం
దదంగముల నడఁగె నద్భుతంబుగ నంతన్. 317

క. హరుఁ బెనఁగి పట్టుకొని భీ
కరబలుఁ డర్జునుఁడు ముష్టిఘాతంబుల సం
గర మొనరించెను; వనచర
వరు లాతని శౌర్యగౌరవముఁ బొగడి రెదన్. 318

క. తనదివ్యగాత్రమున న
ర్జును గాత్రనిపీడఁ జేసె శూలధరుం డం
తన మూర్ఛవోయి పీడిత
తనుఁడై పార్థుండు ధరణితలమునఁ బడియెన్. 319

వ. అంత. 320

చ. వరదుఁడు పార్థశౌర్యవిభవంబున, కాతని ధైర్యవృత్తిక
ష్ఠరుదుగ మెచ్చి సన్నిహితుఁ డయ్యె జటామకుటేందు రేఖయుం,
గరమున శూలముఁ, గరళకాలగళంబు, బృహద్గజాజినాం
బరముఁ, దృతీయలోచనముఁ, బన్నగహారము నొప్పు చుండఁగఁ.

వ. ఇట్లు విరూపాక్షుండు నిజరూపంబుతో నర్జునునకు సన్నిహితుం డై "యర్జునా! క్షత్రియు లొరు లెవ్వరు నీయట్టి శౌర్యధైర్యవంతు లెందును లేరు; నీ తపఃక్షాత్ర గుణంబులకు మెచ్చితి; నీకోర్కి సఫలంబు సేసెద; దేవాసురమానుషం బైన జగంబంతయు నీవ జయింతు; నాస్వరూపంబు సూడు"మని దివ్యదృష్టి యిచ్చినం జూచి పార్థుండు కృతార్థుం డయి దండప్రణామంబు సేసి. 322

క. వరదు, సురాసురవందితుఁ
గరుణాకరు, హరుఁ, బినాకకరుఁ, గరిచర్మాం
బరు, శంకరు, గిరిజాసుం
దరు నిట్లని సంస్తుతించెఁ దద్దయు భక్తిఁ. 323

—: అర్జునుఁడు పరమేశ్వరుని స్తోత్రము సేయుట :—

దండకము. "శ్రీకంఠ! లోకేశ! లోకోద్భవస్థానసంహారకారీ! పురారీ! మురారిప్రియా! చంద్రధారీ!మహేంద్రాదిబృందారకానందసందోహ సంధాయిపుణ్యస్వరూపా! విరూపాక్ష! దక్షాధ్వరధ్వంసకా! దేవ! నీవైన తత్త్వంబు భేదించి, బుద్ధిం బ్రధానంబు, గర్మంబు, విజ్ఞాన, మధ్యాత్మయోగంబు, సర్వక్రియాకారణం బంచు నానా ప్రకారంబులఁ బుద్ధిమంతుల్ విచారించుచుఁ నిన్ను భావింతు; రీశాన! సర్వేశ్వరా! శర్వ! సర్వజ్ఞ! సర్వాత్మకా! నిర్వికల్పప్రభావా! భవానీపతీ! నీవు లోకత్రయీవర్తనంబుఁ మహీవాయుఖాత్మాగ్నిసోమార్కతోయంబులం జేసి కావించి; సంసార చక్రక్రియాయంత్రవాహుండవై; తాదిదేవా! మహాదేవ! నిత్యంబు నత్యంత యోగస్థితిఁ నిర్మలజ్ఞాన దీప ప్రభాజాల విధ్వస్త నిస్సార సంసార మాయాంధకారుల్, జిత క్రోధరాగాదిదోషుల్, యతాత్ములో, యతీంద్రుల్ భవత్పాదపంకే

రుహధ్యానపీయూష ధారానుభూతిఁ సదా తృప్తులై, నిత్యులై; రవ్యయా! భవ్య సేవ్యా! భవా! భర్గ! భట్టారకా! భార్గవాగస్త్యకు త్సాది నానామునిస్తోత్రదత్తావధానా! లలాటేక్షణోగ్రాగ్నిభస్మీ కృతానంగభస్మానులిప్తాంగ! గంగాధరా! నీ ప్రసాదంబునఁ సర్వ గీర్వాణగంధర్వులుఁ సిద్ధసాధ్యోరగేంద్రాసురేంద్రాదులుఁ శాశ్వ తైశ్వర్యసంప్రాప్తులై; రీశ్వరా! విశ్వకర్తా! సురాభ్యర్చితా! నాకు నభ్యర్థితంబుల్ ప్రసాదింపు; కారుణ్యమూర్తి! త్రిలోకైకనాథా ! నమస్తే! నమస్తే! నమః!" 324

వ. అని యిట్లు స్తుతియించి కృతాంజలి యై కిరీటి వెండియు నిట్లనియె.

క. "ఎఱుకని యెఱుఁగక నీకుఁ
మఱుకువ నెదిరితిని; దీని మఱువుము; నన్నుం
గఱుకంతా! క్షమియింపుము;
నెటి నెవ్వరి కెఱుఁగ నగునె నీచరితంబుల్?" 326

వ. అనిన నప్పార్థుం గరుణారసప్రీతివిస్తారిత విలోకనామృతమ్మున సం తర్పితుం జేసి, నగుచు నీశ్వరుండు వానిచేయి పట్టుకొని "ధనంజయా! నీ చేసిన వ్యతిక్రమంబు క్షమియించితి; నతిమానుషంబైన నీపరాక్ర మంబునకు మెచ్చితిఁ; బూర్వజన్మంబున నీవు నరుండను దేవర్షివి; నారాయణసఖుండవు; నరనారాయణు లనంగా మీరిద్దఱు బదరీ వనంబున ననేకాయుతవర్షమ్ములు తపమ్ముఁ జేసిన మహావీర్యవంతు లరు; మీతేజంబున జగమ్ములు రక్షితమ్ము లగుచున్నయవి; యిగ్గాండీ వమ్ము దొల్లియు నీయదియ; దీననచేసి శత్రాభిమేకమ్మునాఁ డసు రుల జయించి; తది యిప్పుడక్షయ శరధులతోడ మదీయమాయా గ్రస్తం బయ్యెఁ; నీగాండీవమ్మును, నక్షయ శరధులు, నీకిచ్చితిం గొను; మింక నీకిష్టం బైన వరమ్ము వేఁడు; మిచ్చెద"ననిన నర్జు నుండి ట్లనియె. 327

క. "త్ర్యంబక! నాకు నభీష్టవ
రంబుఁ బ్రసాదించెదేని రౌద్రను, దివ్యా
స్త్రం బనఁ బరఁగిన పాశుప
తంబుఁ బ్రసాదింపు మిందుధర! దయతోడఁ 328

వ. ఇదియును బ్రహ్మశిరం బను నస్త్రంబును యుగాంతకాలంబునందుఁ బ్రయుక్తమ్ములై జగత్సంహారమ్ము సేయు; దీనివలన నభిమంత్రితమ్ములై యనేక శతసహస్రసంఖ్యల శూలంబులు, గదలు, నాశీవిషంబుల యట్టి యమ్ములు, నుద్భవిల్లు నని విందు; నీ కారుణ్యమ్మున దీనిం బడసి దైత్యదానవయక్షరాక్షసపిశాచోరగమ్ముల జయింతు; నతి వీరులైన భీష్మద్రోణాదులను జయింతు; సహజకుండలుండైన కర్ణుని వధియింతు;" ననిన నీశ్వరుండును గరుణించి విశుద్ధాత్ముం డైన పార్థునకు మంత్రధ్యానజపహోమ పూర్వకంబుగా, సంధానమోక్షణసంహారసహితంబుగాఁ బాశుపతాస్త్రం బిచ్చి, "దీనికి నసాధ్యం బెద్దియును లే; దల్పులయందుఁ బ్రయుక్తం బైన జగత్సంహారము సేయు. 329

క. దీని విధానం బెఱుఁగం
గా నింద్రకుబేరవరుణ కాలాదులకుం
దా నతిగహనం బనినను
మానవులకు నెఱుఁగు టఘటమానము గాదే. 330

వ. ఈ దివ్యబాణమ్మున నీ వఖిలలోకమ్ములు జయింతు"వని కొంతే యునకు వరం బిచ్చి పురాంతకుం డంతర్హితుం డయ్యె; నంత. 331

చ. అవిరళసూర్యమండలసహస్రసమప్రభ మై, ధనంజయ
ప్రవరుకరమ్మునఁ వెలుఁగు పాశుపతాస్త్రముఁ జూచి, దైత్యదా
నవసురయక్షరాక్షసగణమ్ము గడమ్ము భయమ్ముఁ బొందె; నం
దవనియు దిర్దిరం దిరిగె సబ్ధిలోచ్చయ సంచయంబుతోఁ. 332

క. త్రిణయన గోత్రస్పర్శం
బున నిజగాత్రము పవిత్రమును, ముక్తాఘుం
బును. నతితేజోవీర్యం
బును నైన బృథాసుతుండు ముదితుండగుచుఁ. 333

క. "మంటి; హరుదేహ మంటం
గంటి; నుమాధీశు నసురకంటకహాను, ము
క్కంటిఁ, గఱకంటుఁ జూడం
గంటిఁ; గృతార్థుండ నైతిఁ గడుఁ బుణ్యమునఁ. 334

క. ఇమ్మిల ధర్మజునకు జన
సమ్మతునకు రిపుజయంబు, సకలమహీరా
జ్యమ్ము సమకూరు నేఁడు ఘ
నమ్ముగ సర్వప్రయోజనమ్ములతోడన్." 335

—: ఇంద్రుఁడు దేవగణంబులతో నర్జునునకుఁ బ్రత్యక్షం బగుట :—

వ. అని సంతుష్టహృదయుం డై యున్నంత. 336

సీ. హరుచేత సంప్రాప్తవరుఁ డయ్యె నరుఁ డని
యెఱిఁగి యింద్రుండు ధనేశధర్మ
వరుణేశ్వరులతోడ సురగణసహితుఁ డై
దివ్యవిమానముల్ దివమునందు
వెలుఁగంగఁ గౌరవకులవీరుపాలికి
వరదుఁ డై గరుణతో వచ్చె; నట్టి
యవసరమ్మున ఘనరవగభీరం బై న
మధుర వాక్యముస ధర్మప్రభుండు
ఆ. ప్రీతి నిట్టు లనియె బీభత్సునకు "ధర్మ
నిత్య! పాండుపుత్ర! నీకు మెచ్చి
వరము లిచ్చువేడ్క వచ్చిరి నెయ్యురై
యమరనాథుఁ దొట్టి యమరు లెల్ల. 337

వ. వీరలం జూడు"మని దివ్యదృష్టి యిచ్చి, "నీవు నరుం డను పూర్వ
ఋషివి; బ్రహ్మనియోగంబున మనుష్యుండ వై యుత్తమ క్షత్రియ
కులంబున నుద్భవిల్లితి; మటి సూర్యాంశజుం డై కర్ణుని, దేవదైత్య
దానవగంధర్వయక్షరాక్షసాంశజు లై న రాజులను పధియింతు; నీ క
ఱుయకీర్తియగు"నని దండధరుం డప్రతివారణం బై న దండంబు
విధియుక్తంబుగా నిచ్చిన. 338

క. ఘోరారి దారుణము లగు
వారుణపాశంబు లిచ్చె వరుణుఁడు; మటి కౌ
బేర మస్త్ర మిచ్చె నపుడు కు
బేరుఁడు విజయునకు నహితభేదిఁ బ్రీతిఁ. 339

వ. ఇట్లు దివ్యపురుషుం డైన పార్థుండు లబ్ధదివ్యదృష్టియై యమర్త్య రూపధరు లైన పిత్రదేవతలతోడం దన ముందట నిలిచిన మహానీల వర్ణుండైన వైవస్వతుని, వైడూర్యవర్ణుండై యర్ణవనదీశైల సేవితుం డైన వరుణేశ్వరుం, జాంబూనదవర్ణుండై యక్షరాక్షసగణంబుతో నున్న కుబేరునిం జూచి, వారివలన దివ్యాస్త్రంబులు వడసి వాక్పుష్పఫల జలంబుల నందఱం దృప్తు లం జేసి వెండియు. 340

ఆ. అమరగణసమేతు, నైరావణారూఢు,
వజ్రధరుఁ, ద్రిలోకవంద్యు, నింద్రు,
వృత్రశత్రు, నమరవిభుఁ జూచి యెద నాది
మునివరుండు నరుఁడు ముదమునొందె. 341

ఉ. ఇందుధరప్రసాదమున నిష్టవరంబులు గాంచి బాంధవా
నందవిధాయి యైన నిజనందను దండితశత్రు సద్గుణా
నందితుఁ జూచి వేడ్క నయనంబులు వేయును గన్న తత్ఫలం
బందెఁ బురందరుండు పరమాద్భుతసమ్మద పూరితాత్మఁ డై. 342

వ. ఇట్లు దేవేంద్రుండు ధనంజయుం జూచి సంతసిల్లి "నీవు పరమేశ్వరు వలనఁ బరమసిద్ధితో దేవత్వంబు వడసితివి; దేవకార్యంబు దీర్ప నర్హుండవు; గాన నారథంబుఁ బుత్తెంచెద; నమరావతికి రమ్ము; నీకు దివ్యాస్త్రంబు లంద యిచ్చెద"నని దేవేంద్రుండు దేవగణంబులతో నమరావతికి నరిగె; నర్జునుండును ద్రథాగమనంబు ప్రతీక్షించు చుండునంత. 343

సీ. వారిదమార్గంబువలన మహానీల
వైజయంతీవిభవంబు వెలయ,
నాబద్ధవివిధరత్నావళిప్రభఁజేసి
రమ్యమై రోదోంతరంబు వెలుఁగ,
నురునేమిరవమున నుర్వరాధరదరీ
ముఖములు ప్రతిశబ్దముఖరితంబు
లగుచుండ, నానావిధాయుధంబులు దాల్చి
యశనివిద్యుత్సహస్రాభిశోభి

ఆ. తామ్రసదృశ మై, మహోజవాశ్వాయుత
వాహ్యమాన మైన వరరథంబు
మఘవు నాజ్ఞఁజేసి మాతలియుక్తమై
యింద్రతనయుఁ డున్న యెడకు వచ్చె. 344

వ. మాతలియు నర్జునుం జూచి "సురాసురకిరీటతటఘటితరత్న ప్రభా
సురపదుం డైన మహేంద్రుండు మీయయ్య భవద్దర్శనం బపే
ఱించి నిన్ను నమరావతికి రాఁబనిచె; రాజసూయాశ్వమేధశతంబులం
జేసినవారికైనను దుర్లభం బీరథంబు; దీని నెక్కు" మనిన నర్జునుండును
గంగాస్నానపవిత్రీకృతగాత్రుం డై దేవఋషి పితృతర్పణంబులఁ జేసి
మాతలిప్రయుక్తం బైన యాదివ్యరథం బెక్కి. 345

—: అర్జునుఁ డమరావతికిఁ బోవుట :—

చ. అలఘుతపస్సమాధినియతాత్ములకుఁ, బహుపుణ్యలోకకా
మ్యులకు, విశుద్ధమానసులకుఁ సతతంబును సంశ్రయంబ వై
లలితనిలింపదంపతివిలాసవిహారమహోత్సవంబులుం
గలగి వెలుంగు రత్నమయకందరసుందర! మందరాచలా! 346

వ. నీయందలి పుణ్యతీర్థంబులు సేవించుచు, గంగాంబు ధౌతస్థలరుహ
వనస్పతి ఫలంబు లుపయోగించుచు సుఖం బుండితి; నమరావతికిం
బోయి వచ్చెద"నని మందరనగంబు వీడ్కొని పురందరనందనుండు
దేవపథంబున కరిగి. 347

సీ. పరమధర్మస్థితిఁ బ్రజఁ బ్రీతిఁ గాచిన
రాజర్షులకు, నుగ్రరణమునందుఁ
బతుల ప్రస్తవమునఁ బ్రాణముల్ విడిచిన
వీరులకును, యజ్ఞవిధులఁజేసి
సురలను వసుమతీసురులను దనిపిన
ధర్మాత్ములకు, మహాతాపసులకు,
నిలయంబు లై రమణీయంబు లగునట్టి
హర్మ్యవిమానసంహతులదాని
తే. సకలభువనంబులం గల సత్పురముల
కెల్ల నుపమాన మై దహనేందురవుల

దీప్తి లే కున్నఁ దన చైనదివ్యదీప్తి
విస్తరంబున నెప్పుడు వెలుఁగుదాని 348

వ. మఱియు ననాహితాగ్నులకు, నతీర్థసేవకులకు, నసృతవాదులకుఁ, వేదవిరుద్ధాచారులకు రణపరాఙ్ముఖులకుఁ జోర నవిషయంబును, నతి గహ్వారంబును నైన దాని నమరావతిఁ జొచ్చి, తద్గోపురసమీపంబున ననవరతగండస్థలగళదవిరళ మదజలకుల్యాభిరామం బై, నిరంతర నిర్ఝరనీహారనగంబునుంబోలె నొప్పుచున్న యై రాంతంబు జూచుచు సురసిద్ధసాధ్యగణంబుతో విద్యాధరాప్సరో గంధర్వకిన్నర గీయ మానుం డగుచు జను నప్పుడు. 349

క. సకలర్తుకుసుమసౌరభ
సుకుమారోద్యానతరుల సుడియుచుఁ బ్రణయో
త్సుకుఁడై పవనుఁడు పాండవు
నకు నభిముఖుఁ డయ్యెఁ దన్మనఃప్రియ మెసఁగన్. 350

క. నరుఁడెన యాదిమునియని,
హరిసుతుఁ డని, హరిసహాయుఁ డని, హరుచేతఁ
వరములు వడసినవాఁ డని
సుర లెల్లను వచ్చి పార్థుఁ జూచిరి ప్రీతిఁ. 351

వ. అర్జునుండు నయ్యమరావతివిభవంబు చూచి హర్షించుచు నప్సరోగీ యమాన మంగళహితగీతావహితమానసుం డగుచు, సిద్ధమునిగణాశీ ర్వాదంబులు సేకొనుచుం జని మాతలి నిర్దేశంబున దివ్యరథావ తీర్ణుండై.

క. శతమఖునకు, భువనావన
రతశీలున, కఖిల దేవరాజర్షి సమ
న్వితునకు, వజ్రాభీలో
న్నతపృథుభుజునకుఁ గృతప్రణామం డయ్యెఁ. 353

చ. అనిమిషనాథుఁడుం బ్రచలితాంగదతుంగభుజాయుగంబునం
దనయునిఁ గౌఁగిలించుకొని, తత్క్షణజాతనితాంతసమ్మదం

బునఁ బులకాంకితాంగుఁ డయి, మున్ను నిజాంకతలస్థుఁ జేసి య
త్యనఘు నిజాసనార్ధమున నాదట నుంచెఁ గరంబు నెమ్మితోఁ.

క. లీలై రావతకుంభా
స్ఫాలనకర్కశకరములఁ బలుమరును మరు
త్పాలకుఁ డంటుచు నుండె గు
ణాలంకృతుఁ డైన పార్థు నంగముఁ బ్రీతిఁ. 355

వ. ఇట్లధికవిలాసంబుతో సురవిలాసినీ కరకలిత చారు చామీకరదండ
చామరసమీరాలోలకుంతలుండగుచు సురరాజుతో నేకాసనంబున
నున్న యప్పార్థుం జూకశాసను శాసనంబున దేవగంధర్వసిద్ధవిద్యాధరు
లతిప్రీతి నర్చించి; రంత.

తే. పాకశాసను పనుపునఁ బార్థుఁ డొక్క
మణిమయం బైన మహనీయమందిరమున
నెలమి గంధర్వసంగీతహృద్యగోష్ఠి
నుండెఁ జెవులకు నుత్సవం బొందుచుండ. 357

వ. అంత సూర్యాస్తమయసమయంబునఁ జంద్రుం డుదయించి సాంద్ర
చంద్రికా విలాసంబున దిగ్వనితల నలంకరించుచుండ, నిలింపపతి పం
పున సొంపార నూర్వశి యర్జునసంగమకాంక్షుం జేసి చంద్రికాధవళ
దుకూలంబు గట్టి మృగమదకర్పూర కుంకుమోన్మిశ్రితసుగంధం బలఁది,
వివిధసురభికుసుమవిస్తరంబులు ముడిచి, మణిమయభూషణాలంకృత
యై నిలుకడ వడసిన క్రొమ్మెఱుంగుదీఁగయుంబోలె మణిమయ
మంజీరఝళంఝళనినాదంబును, గంకణఝణఝణాత్కారంబును, గటి
కలాపకింకిణీక్వేంకారంబును మదనాజ్ఞావాద్యఘోషఁబునుం బోలె
బ్రమోయుచుండ మందగమనంబునఁ బురందరనందను మందిరంబున
కరుగుదెంచిన, నప్పురుషసత్తముండు భయభక్తిసంభ్రమంబులతోఁ
బ్రత్యుత్థానంబును దండప్రణామంబునుం జేసి కరకమలంబులు
మొగిచి యిట్లనియె. 358

క. "నను బుత్రస్నేహంబున
మనమున మన్నించి శుభసమగ్రునిఁ జేయం

జనుదెంచి తీవు ముదమున
జనయిత్రీ! యేఁ గృతార్థజన్మఁడ నైతిఁ." 359

తే. అనిన నూర్వళి యిట్లను నాత్మనేత్ర
మధుపము లతని సౌందర్యమధువు గ్రోలు
చుండఁ దమకంబు మీటి యనూనధర్మ
నిపుణుఁడగు నర్జునునితోడ నెయ్య మొనర. 360.

చ. "అనుపమశౌర్య! నీదు సముదగ్రగుణంబులు నారదాదిస
న్మునివరులెల్లఁ జెప్పఁగఁ బ్రమోదమునఁ భవదీయసంగమం
బనిశముఁ గోరుచుం దగఁ బ్రియంబున వచ్చితి; నేను గోరఁగా,
నను జనయిత్రి వంచు నొక నాయముఁ బల్కెదు వక్రభాషలఁ. 361

తే. నీకు నేనాఁటి తల్లిని? నిజము సెపుమ;
యమరలోకంబువేశ్యల మైన మాకు
నిట్టితగవులు నడవ; వహీనభావ
వీర్య! యిచ్చట వావులు వెదకఁ జనునె. 362

వ. ఈలోకంబున వనితలుఁ, బురుషులు విచ్చలవిడిఁ గ్రీడింతు; రిచ్చటి కిది యనిందితంబై నయాచారంబు; నీవును ద్రిదివంబునకు వచ్చినయప్పుడ దివ్యపురుషుండవు; గావున నా మనోరథంబు సఫలంబుగా మందార మంజులమంజరీమకరంద పానమత్తమధుకరగాన మనోహరస్థలంబులను, మేరుశైలకందరంబులను, మండపవనంబులు గల నందనాదివనంబుల యందును, నితాంతకాంతవికసిత కనకారవింద సమధిక సౌరభసం వాసితమహానందకందంబు లైన మందాకినీతీర మణిమయవేదికల యందును, జంద్రికాసుందరంబు లైన సికతాతల్పంబులను, మటియు నిర్జరనిహార స్థానంబుల ననవరతసురత కేళీసౌఖ్యాంబుధి నోలలాడు" మనిన నిర్వికారధైర్యధుర్యం డై యర్జునుం డిట్లనియె. 363

క. "టహో! యిమ్మెయి ధర్మ
ద్రోహోక్తులు పలుకఁ దగునె? దోసం బది గా
దే? హరి హరి; మనమునఁ దగ
వూహింపక నన్నుఁ బలుకు టుచిత మే నీకుఁ. 364

—: ఊర్వశి యర్జును నపుంసకునిఁగా శపించుట :—

వ. జగంబులు వుట్టింపను మనుపను సమయింపను గర్తలైన దేవతలకు నెట్లు నడచిన నెగ్గు లేదు; నేను గర్మభూమిని జనియించి కర్మఠుండ నైతి; నాకు నిచ్చటి యాచారం బుచితంబు గాదు; మదీయవంశకర్త యైన పురూరవునకుఁ బత్నివైన కారణంబునను, బురందరునకుఁ బరిచర్య యొనర్చుటను నాకు జనని వగుట సందియంబు లేదు; తల్లీ! నన్నుం బుత్రవాత్సల్యంబునం జూడు''మనిన మదనబాణ పీడిత యై కోపారుణిత నయనంబుల నర్జునుం జూచి యూర్వశి ''యేను గామించి వచ్చిన నామనోరథంబు విఫలంబుఁ జేసినవాఁడవు, నీవు మర్త్యలోకం బున మానవర్జితుండ వై, మానినీమధ్యంబున నపుంసకుండవై యుండు"మని శాంప బిచ్చి నిజగృహంబునకుఁ జనియె; నంతఁ బ్రభాతసమయంబునఁ దద్వృత్తాంతం బంతయు విని సురపతి కొడుకున కిట్లనియె. 365

క. ''నీయట్టి ధైర్యవంతుని
నేయుగముల నైనఁ గాన మెన్నండును; ధ
ర్మాయత్తమతివి; మునులకు
నీయింద్రియజయము గీర్తనీయము తండ్రీ! 366

తే అనఘ! యూర్వశి యిచ్చినయట్టిశాప
మనుభవింపంగవలయు నీ కవనియందు;
నింక మీపదుమూఁడవయేఁడు సత్య
సరణి నజ్ఞాతవాసంబు సలుపవలయు. 367

వ. అక్కాలంబున నీవు షండరూపంబునఁ బ్రచ్ఛన్నుండ వై రాజకన్యకలకు నృత్యంబు గఱపుచుండి తదంత్యంబున శాపమోక్షంబు వడయు'' మని యనుగ్రహించె; నీయాఖ్యానంబు విన్న పుణ్యపురుషులు సకల దురితవిముక్తు లగుదు రని చెప్పి వైశంపాయనుండు జన మేజయున కిట్లనియె. 368

సీ. వజ్రాస్త్ర మాదిగా వరదుఁడై వివిధది
వ్యాస్త్రములు పార్థున కమర నిచ్చి
తత్ప్రయోగంబులుఁ దద్రహస్యంబులుఁ
దన్నివర్తనములుఁ దడయ కపుడు
దయ నుపదేశించి, " దారుణాహవములం
దవిజేయవీర్యుండ వగుము వేర్మి"
నని మహాసోహార్దుఁడై చిత్రసేనుఁ డ
గ్గంధర్వపతితోడ గారవమున
ఆ. వజ్రధరుఁడు గీతవాద్యనృత్యంబులు
గఱవఁ బంచెఁ బార్థుఁ గడఁగి; యిట్లు
లమరనాథునొద్ద నర్జునుం డుండ నే
నేఁడు లరిగె నిట మహీతలమున. 369

వ. అంత నొక్కనాఁడు రోమశుం డను మహాముని యింద్రు నొద్దకు
వచ్చి సురగణ పూజితుం డై సురేంద్రుతో నేకాసనంబున నున్న
యర్జునుం జూచి యాశ్చర్యం బంది యింద్రున కి ట్లనియె. 370

క. "కోరి యనేకయుగంబు ల
పారతపోయుక్తు లైన వారికిఁ బడయఁ
దూరము నీసభ; మటి నీ
కారుణ్యం బింతకంటెఁ గడు దవ్వెందుఁ. 371

వ. అట్టి యందు నీతో నొక్కట నేకాసనం బెక్కి నీ రెండవమూర్తియుం
బోలె నున్న యిమ్మనుజుం డెందులవాఁ? డెవ్వఁ"డనిన నమ్మునీంద్రు
నకు దేవేంద్రుం డి ట్లనియె. 372

క. "నరుఁ డను మహరి యీతఁడు
నరలోకమునందుఁ బుట్టె నాయంశమునఁ;
గురుమతిఁ గౌంతేయుఁడు భా
సురతేజుఁ డుపేంద్ర సఖుఁడు సువ్వె మునీంద్రా! 373

తరలము: శివుఁడు వీనికిఁ బ్రీతుఁ డై దయ సేసెఁ బాశుపతాస్త్ర; మీ
దివిజముఖ్యులతోడ నేను దివ్యబాణము లిచ్చితిం;

దివిరి యీతఁడు మత్ప్రియంబున దేవకార్యము దీర్పఁగా
సవినయస్థితి నున్న వాఁడు నిజప్రతాపబలోన్నతిఁ. 374

వ. మఱియు వసుమతీఖ్యాతగర్వితు లైన సగరసుతులం దన దృష్టితీవ్ర దహనంబునం జేసి దహించిన కపిలుం డను మహాముని నారాయణుం డయ్యె; నట్టి నరనారాయణు లాదిమునులు, జగదుపకారులు; జగతీభారావతరణకారణు లై దైత్య దానవ వధార్థంబు మర్త్యం బునం బుట్టినవారు గావున. 375

క. దేవతలకు నపకారము
గావించిన యన్నివాతకవచులఁ బాతా
ళావాసుల దానవుల మ
హావీరుఁడు వీఁ డభేద్యుఁ డై వధియించుఁ." 376

వ. అని తత్ప్రభావంబు సెప్పి యింద్రుండు రోమశున కిట్లనియె. "మునీంద్రా! నీవు మర్త్యలోకంబునకుం బోయి, ధర్మజుం గని, యతనికిం దత్సహోదరులకు సంతోషంబుగా నాయొద్ద బార్థుం డున్న కుశలవార్త యెఱింగించి, " భీష్మద్రోణకర్ణాదివీరుల నోర్చునట్టి దివ్యాస్త్రంబులు వడసె; నతండు మీయొద్దకు వేగంబ వచ్చు; వగవకుండుం"డని చెప్పి, నావచనంబున ధర్మజు నఖలతీర్థసేవ సేయం బంపు; మట్లయిన నపేతదురితుం డై యఖిలమహీరాజ్యంబు వడయు; నతండు తీర్థాభిగమనంబు సేయునపుడు నీ వాతనికి సహాయుండవు గమ్మని" యింద్రుండు రోమశుం బనిచె; నిట ధృతరాష్ట్రుం డర్జును దివ్యాస్త్రలాభంబుఁ బారాశర్యవలన నెఱింగి పరమ వ్యాకులహృదయుం డై సంజయున కిట్లనియె. 377

సీ. "సురసమూహంబుతో సురరాజు నోడించి
ఖాండవం బెక్కటి కాల్చి యున్న
వీరున, కఖలాబ్ధివృతవసుంధరఁ గల
రాజుల నోర్చి పరాక్రమమున
నగ్రజు రాజసూయాధ్వర మనిచిన
యధికసమర్థున, కర్జునునకుఁ,
బ్రబలసింహమునకుఁ బక్కెర వెట్టిన
యట్లు దేవతలు నెయ్యంబుతోడఁ

ఆ. బరముఁదొట్టి పాశుపత మాదిగా దివ్య
శరము లిచ్చి రట్టి శౌర్య మెసఁగ;
నట్టినరుఁడు యోధుఁ డైయున్న పాండవ
వరులఁ జెనయునంతవారుఁ గలరె? 378

క. వారికి, ధర్మ్మవు దప్పని
వారికి, ధృఢవచను లైన వారికి, విమలా
చారుల కెద్దియుఁ బడయఁగ
దూరమె? పాండవులఁ బోలుదురె వీరు లొరుల్? 379

వ. వారలతో నిగ్రహించి దుర్యోధనుండు దనకుఁ, దన బాంధవులకు, సుహృజ్జనంబులకు హాని సేసికొనియె. 380

ఆ పర్వతములు వజ్రపాతాహతినిఁ బోక
తక్కు నేని నింద్ర తనయు దివ్య
నిశితబాణతతుల నిశ్శేష మగు ననఁ
బరులసైన్య మెట్లు బ్రదుక నేర్చు? 381

వ. లయకాలోదితసహస్రకరుకిరణంబులం జరాచరంబులు దప్తంబు లగు నట్లు పార్థ బాణంబులంజేసి దుర్యోధనాదులు దుస్సహాతాపంబు బొందుదు''రని దుఃఖితుండైన ధృతరాష్ట్రునకు సంజయుం డి ట్లనియె. 382

క. ఈసున దుర్యోధన దు
శ్శాసను లొగిఁ బాండవులకు సభలో నెగ్గుల్
సేసిన విని వారల ననుఁ
శాసింపఁగ, వలవ దనఁగ, జనదే నీకున్. 383

వ. నీయుపేక్షంజేసి దుర్యోధనుచేత దుర్ద్యూతపరాజితు లై రాజ్యంబు విడిచి పాండవులరిగి కామ్యకవనంబున నున్నఁ గృష్ణుం డనేక రాజ సమన్వితుం డై వారి యొద్దకువచ్చి నీకొడుకులు సేసిన నికారంబున కుం గృష్ణాపరిభవంబునకు దుఃఖితుం డై, కడు నలిగి, ''మీకు నిట్లు సేసిన దుర్యోధనాదుల దూషించి గజపురంబున ధర్మ్మరాజు రాజ్యా భిషిక్తుం జేయుదు'' ననియు ''రాజసూయంబు సేయువాఁ డింద్ర

ప్రస్థంబున నైన విభూతికంటె విశేషవిభూతి గావింతు"ననియు ద్రుపద సృంజయ కేకయ ధృష్టద్యుమ్న బలదేవసాంబసాత్యకిప్రభృతుల సమ ఝంబునం బలికి, సత్యసమయు లైన పాండవులచేత సంరంభనివారి తుం డై పార్థు సారథ్యంబునకుఁ ప్రార్థితుండయ్యె ననివింటిమి. 384

క. పదుమూడేండుం బోయినఁ
బదునా ల్గగునేఁడు ఘనులు పాండవులు జగ
ద్విదితముగ నుత్సహింతురు
వదలక రణమునకుఁ గేశవపురస్కృతు లై. 385

క. వరములు వేల్పులచే దు
ష్కరతపమునఁ బడయుదురు జగంబున నొరు; లీ
శ్వరుచే వరములు వడసెం
గరుణ ధనంజయుండు దనదుకార్ముకశక్తిఁ. 386

వ. అయ్యర్జును దివ్యశరసంఘాతంబును, భీమసేను చిత్రగదాఘాతంబును, నీయుపేక్షా నిర్ఘాతంబును, గౌరవపరిక్షయంబునకు" గారణభూతంబు లనిన సంజయునకు ధృతరాష్ట్రుం డిట్లనియె. 387

క. "వృద్ధని, జాత్యంధుం డని
బుద్ధివిహీనుఁ డని నన్నుఁ బుత్త్రుఁడు బలవ
రోధ్దతుఁ డై మెచ్చుఁ; డసం
బద్ధంబులె కాని వినఁడు పలికినపలుకుల్. 388

వ. దుర్యోధనుండు దుర్బుద్ధి యని యేమి సెప్పవలయు? భీష్మద్రోణవిదు రాదుల నాదరింపక కర్ణశకునుల నాప్తులం జేసికొని వారివచనంబుల నెగడు; నే నేమిసేయుదు?"నని ధృతరాష్ట్రుండు మిన్నకుండె; నిటు పాండవులు పార్థు మసలుటకు దుఃఖితులై. 389

ఉ. "పాండవసింహ మర్జునుఁడు పాండుయశంబు పెలుంగుచుండ నా
ఖండలుదొట్టి నిర్జరనికాయముచేత వరంబు గాంచి యె
న్నం డిట వచ్చునొక్కొ! సుజినస్తుతు నాతనిఁ బ్రీతిఁ జూడ నె
న్నండొకొ కాంతు!" మంచును మనంబునఁ గోరుచునుండి రెంతయుఁ

వ. అట్టియవసరంబున యుధిష్ఠిరునకు భీముం డిట్లనియె. 391

మత్యాక్కర.''నీ నిదేశంబున నరిగి పార్థుండు నిష్ఠతోఁ దపము
మానుగాఁ జేయుచు నున్న వాఁ; డేల మసెలెనో రాక;
వాని ధర్మస్థితుఁ బాసి యున్న యివ్వర్షముల్ యుగస
మానంబు లైనవి మనకు నతని సమాగమకాంక్ష. 392

వ. మఱి పాండవపాంచాల వీరుల జీవనంబు లాతనియందు నిలిచినవి; తదీయ భుజాశ్రయబలంబునం బరుల జయించి ధరణీరాజ్యంబుఁ బరిగ్రహింత మని యున్న వారము; గావునం గాలయాపనంబు సేయక యర్జునుం దోడ్కొని తేర జనార్దనుఁ రాఁ బనిచి నియోగింపుము. 393

మ. సమయాబ్దంబులకంటె ముందర మహోత్సాహంబునఁ బాహువి
క్రమ మొప్పఁ విజయుండు నేనుఁ దగ సంగ్రామంబులో నేకకా
లమునం దాధృతరాష్ట్రజాధముల నెల్లం జంపి, భూచక్ర రా
జ్యము సేకొందుము కౌరవేంద్ర! మురజిత్సఖ్యప్రసాదంబునఁ. 394

వ. సత్యభంగభీతుండవు గావున నీ విందయుండి, పదుమూఁడేండ్లుం జలిపి, పదంపడి కరిపురంబునకు వచ్చి రాజ్యాభిషిక్తుండవగుము; దుష్టద్యూతంబున మన రాజ్యం బపహరించిన సుయోధనుండు సుచిరప్రతిష్ఠితుండు కాకుండ, నిప్పుడ యద్దురాత్ముదూషింతుము; నికృతి పరుల నికృతినచేసి నిర్జించినఁ బాపంబు లేదు; సర్వప్రకారంబులను శత్రువుల జయించి రాజ్యంబు సేకొనుట రాజులకు విధిచోదితం బైన రాజధర్మంబ'' యనిన భీమసేను మహారంభసంరంభంబునకు సంతోషించి ధర్మనందనుం డాతని దనపైకిం దిగిచికొని మూర్ధాఘ్రాణంబు సేసి యిట్లనియె. 395

తే. ''అనలునకు గాడ్పు దోడైనయట్లు లింద్ర
తనయునకు నీవు దోడైనఁ దడయ కాజి
బోరి రిపులకు బ్రతుకంగఁబోల; దైన
ననఘ! యిది కోపమునకు ననవసరంబు. 396

క. పదుమూఁడేండ్లుం బోయినఁ
బదపడి పార్థుండు నీవుఁ బరనృపతుల దు

ర్మదుల వధియించి విజయా
స్పదబాహుల రగుఁడు ధర్మపరిరతకు లై. 397

వ. ఏ నెట్లును సత్యభంగంబు సేయుట కొడంబడ నోప" నని ధర్మతన
యుం డనుజు ననూనయించె; నని జనమేజయునకు వైశంపాయనకథి
తం బైన పుణ్యకథ యతి రమణీయంబుగాను. 398

•క. బిరుదాంకభీమ! భీమే
శ్వర కృతకృత్యప్రసాద! సౌజన్యగుణా
భరణ! పరగండభైరవ!
పరన్పపమణిమకుటఘటితపద! బుధవినుతా. 399

ఉత్సాహము. రాజవంశరత్న! రాజ రాజ దేవ! నిత్యల
క్ష్మీజయాభిరామ! ధర్మ మిత్ర! మిత్రవిద్వదం
భోజవనపయోజమిత్ర! భూరి కీర్తికౌముదీ
రాజితత్రిలోక! నిఖిల రాజలోకపూజితా ! 400

గద్యము. ఇది సకలసుకవిజనవినుత నన్నయభట్టప్రణీతం బైన శ్రీ మహా
భారతంబునం దారణ్యపర్వంబునందుఁ బాండవవనప్రవేశంబును, గిమ్మీ
రవధయును, గృష్ణపాంచాలాభిగమనంబును, సౌంభకఖ్యానంబును,
నింద్రకీలాభిగమనంబును, గైరాతంబును, నర్జును తపశ్చరణంబును,
నీశ్వరుతోడ యుద్ధంబును, బరమేశ్వరు చేతఁ బాశుపతాస్త్రంబు వడ
యుటయును, లోకపాలసందర్శనంబును, స్వర్గగమనంబును, నూర్వశీ
శాపంబును, దేవతలవలన దివ్యాస్త్రలాభంబును నన్నది ప్రథమా
శ్వాసము.

శ్రీ:

గణేశశారదా గురుభ్యో నమః

శ్రీ మదాంధ్ర మహాభారతము

ఆరణ్యపర్వము - ద్వితీయాశ్వాసము

శ్రీరమ్యభర్మనిత్య
ప్రారంభవిభాసి ! రాజపరమేశ్వర ! భూ
రారిమదకుంభికుంభవి
దారణ దారుణకృపాణదక్షిణహస్తా ! 1

వ. అక్కథకుండు శౌనకాదిమహామునులకుం జెప్పె; నట్లు సాంత్వనవచ
నంబుల భీమసేనునకుం గోపాటోపోపశమనంబు సేయుచున్న ధర్మ
రాజునొద్దకు బృహదశ్వుండను మహాముని వచ్చి విధిదృష్టవిధానంబు
నం బూజితుండయి విశ్రమించియున్న నమ్మునివరునకు ధర్మతనయుం
డధర్మపరు లయిన పరులచేతం దమ పడిన నికార ప్రకారం బంతయు
నెఱింగించి యిట్లనియె. 2

క. "పుడమియు రాజ్యము బంధుల
విడిచి మృగావలులఁ గలసి, విపినంబులలోఁ
గడుకొని మాయ ట్లిడుమలఁ
బడిన నృపులు గలరె యొరులు? పరమమునీంద్రా!" 3

వ. అనిన నయ్యుధిష్ఠిరునకు బృహదశ్వుం డిట్లనియె. 4

క. "దేవసము లైన యనుజుల
తో, విప్రులతో, రథాలితో వచ్చి యర
ణ్యావాసము సేసెదు ధర
ణీవల్లభ! నీవు ధర్మనిష్ఠితబుద్ధిన్. 5

క. నరసుతుఁడు దొల్లి నలుఁ డను
ధరణీశుఁడు జూదమాడి, తన విభవము పు
ష్కరుచేత నోటువడి యొ
క్కరుఁడ కరం బిడుమఁ బడఁడె? కాననసీమ.'' 6

—: ధర్మరాజునకు బృహదశ్వుండు నలోపాఖ్యానంబు సెప్పుట :—

వ. అవిన నది యె ట్లని ధర్మనందనుం డడిగిన బృహదశ్వుం డి ట్లనియె;
''నిషధేశ్వరుం డయిన వీరసేనుని కొడుకు నలుం డనువాఁ డనేకాక్షౌ
హిణీపతి యనవరతాక్ష ప్రియుం డజేయంబైన తన తేజంబున నెల్ల
రాజుల జయించి బ్రహ్మణ్యుం డయి బ్రహ్మోత్తరంబుగాఁ బ్రజాపాల
నంబు సేయు చుండ. 7

సీ. అట విదర్భాధిపుఁ డైన భీముం డను
వాఁ డనపత్యుఁడై, వ్రతము లోలి
సలుపుచు, దమనుఁ డన్నమ్మునిఁ బ్నియుఁ
దాను నుపాసించి, తద్వరమున
దమయంతి యను కూఁతు, దమ దాంత దమను ల
న్నతులను బడసె విశ్రుతగుణాఢ్యఁ;
డందుఁ గన్యారత్న మగు దమయంతి దా
నత్యంతకాంతి రూపాభిజాత్య
ఆ. విమలగుణసమృద్ధి వెలుఁగుచు సురసిద్ధ
సాధ్యకన్యలట్టి సఖులు నూర్వు
రొలసి తన్నుఁ గొలుచుచుండఁగ మహి నొప్పు •
చుండె నధికవిభవయుక్తి తోడ. 8

వ. అంత. 9

క. నలుగుణములు దమయంతికి,
నలునకు దమయంతిగుణణంబులు జను లి
మ్మొలఁ బొగడుట నిరువురకును
వెలసె మనోభవవికారవిభ్రమ మెదలన్. 10

వ. ఒక్కనాఁడు నలుఁడు దమయంతీగుణబద్ధచేతస్కుండై మదనానలం
సహింప నోపక, ప్రమదవనంబున నుండునంత నంతరిక్షకాంతాహార
వళియుం బోలె హంసావళి యవనీతలంబున కవతరించిన. 11

ఆ. వీరసేనసుతుఁడు వీరుండు హంసల
నడబెంగుఁ జూచి, నగుచు, వాని
నెగచి యెగచి యందు నెగయకుండఁగ నొక్క-
హంసఁబట్టుకొనియె నతిరయమున. 12

ఆ. దాని విడిచి పోవఁగానోప కటచుచు
నంతరిక్షమునను హంసలెల్లఁ
బిండు గట్టి తిరుగుచుండె వాతోద్ధూత
శారదాభ్రశకలచయముఁబోలె. 13

వ. అదియును దన కమ్మనుజేశ్వరుఁ డపాయంబు సేయుంగా వగచి,
మనుష్యవాక్యంబుల నిట్లనియె.: "నయ్యా! యేను నీకుం బ్రియంబు
సేసెద; నీహృదయేశ్వరి యైన దమయంతిపాలికిం బోయి నీగుణం
బులు దానికి వర్ణించి, యక్కన్య యన్యుల నపేక్షింపక నీయంద
బద్ధానురాగ యగునట్లు గాఁ జేసెద."

క. అనిన విని హంస పలుకులు
దన హృదయంబునకు నమృతధారాపాతం
బునుబోలెనైన నృపనం
దనుఁ డనురక్తుఁ డయి విడిచెఁ దడయక దానిన్. 15

వ. హంసపిండుతో నదియును విదర్భాపురంబునకుఁ బఱచి యం దుప
వనంబున సఖీజన పరివృతయై యున్న దమయంతి యంతికంబునకు
వచ్చి విహరించుచుండె; నంతవానిం జూచి పరమకౌతుకమ్మున. 16

తే. ఒండొరులఁ గడవంగ నయ్యువిదలెల్లఁ
బఱచి యొక్కొక్క కలహంసఁ బట్టి కొనఁగఁ
జెలువముగ నందు దమయంతిచేతఁ బట్టు
వడియె నలుచేత విడువంగఁబడిన హంస. 17

క. దమయంతికి నలునకు సం
గమకారణదూత యైన కలహంస మనో
జ్ఞమనుష్యవాక్యముల న
ద్దమయంతికి హర్ష మెసఁగఁ దా ని ట్లనియెఁ. 18

వ. "నీ హృదయేశ్వరుం డైన నలునొద్దనుండి వచ్చితి; నపారపారా
వార పర్యంతానంత మహీతలంబునందు నా చూడని రాజు లెవ్వరు
లేరు; సర్వగుణసౌందర్యఁబుల నెవ్వరు నలుం బోలరు. 19

తె. నీవు నలునకుఁ బేర్మితో దేవి వైనఁ
గాక నీ సముజ్జ్వల రూప కాంతి విభవ
నిత్యసౌభాగ్య భాగ్యాభిజాత్య భద్ర
లక్షణావలు లవి సఫలంబు లగునె? 20

వ. నీవు నారీరత్నంబ; వాతండు పురుషరత్నంబు; గావున మీయిద్దఱ
సమాగమం బన్యోన్యశోభాకరం బగు" ననిన విని సంప్రాప్తహృదయ
సమ్మద యై దమయంతి దాని కి ట్లనియె.

మత్యాక్కర. "ఆ రాజుగుణములు నా కెటింగించినట్టులు నన్ను
నా రాజునకు నెటింగించి కరుణ నాయందుఁ గావింపు
మారంగ" ననుడు నిషధవిషయమున కరిగి యా హంస
వీరసేనజునకు దాని గుణరూప విభవముల్ సెప్పె. 22

వ. అంత. 23

చ. నలదమయంతు లిద్దఱు మనఃప్రభవానలబాధ్యమానులై
సలిపిరి దీర్ఘ శ్వాసరనిశల్ విలసన్నవనందనంబులఁ,
నలినదళంబులఁ, మృదుమృణాళములఁ, ఘనసారపాంసులఁ
దలిరులశయ్యలఁ, సలిలధారలఁ, జందనచారుచర్చలఁ. 24

వ. ఇట్లిద్దఱు నన్యోన్యరూపగుణశ్రవణసంజాత ప్రీతు లై యుండునంత
నంతఃకరణ సంతతమనోజాతసంతాప వివర్ణవదన యైన యాదమయం
తిం జూచి భయసంభ్రమాక్రాంత లై సఖీజను లెల్ల నక్కొమలి
వృత్తాంతం బంతయు భీమున కెటింగించి యి ట్లనిరి. 25

సీ. "కలహంస పలికిన పలుకులు గుణియించు;
వడి దానిపోయినవలను చూచుఁ;
బలుకదు సఖులతో లలితాంగి; మిన్నక
యలయుచు నుండుఁ దా ననుదినంబుఁ;
జారువిభూషణాహారవిహారశ
య్యాసనభోగంబు లందు విముఖ
యయి, రేయుఁ బగలు నిద్రయు నెప్పుడెఱుఁగక
దమయంతి నలుఁడను ధరణినాథు

ఆ. నంద బుద్ధి నిలిపి కందర్పబాధిత
యగుచు నున్నయది ధరాధినాథ!
ధరణిపతుల నొరుల నురుగుణాఢ్యుల విన
నొల్ల దెంత విభవయుక్తు లయిన." 26

వ అనిన విని భీముం "డేమి సేయుదు? నెవ్విధంబున నమ్మహీపతి నిట
రావింప నగునో"యని చింతించుచు, సంప్రాప్తయౌవన యైన
కూఁతుం జూచి యప్పుడు. 27

క. ఆ వైదర్భుఁడు నిఖిలధ
రావలయములోనఁ గలుగు రాజన్యుల నా
నా విషయాధీశ్వరులను
రావించెం దత్స్వయంవరవ్యాజమునన. 28

క. మనుజేశ్వరు లెల్లను బో
రన దమయంతీస్వయంవరమునకు నొప్పం
జను దెంచిరి సైన్యస్యం
దనఘట్టన నవనితలము దల్లడపడఁగన్. 29

వ. ఆ సమయంబునఁ బర్వతనారదు లను పురాణమునులు భూలోకం
బెల్లం గ్రుమ్మరి యింద్రలోకంబునకుం బోయిన, నింద్రుండు వారిం
బూజించి భూలోకంబున కుశలవార్త యడిగి "యిది యెట్లు? ధర్మ
పరిపాలనపరు లై వీరు లై రణనిహతు లైన రాజు లమరయలోక
సుఖంబు లనుభవింప నతిథు లై యిందులకు నింత కాలంబయ్యె రాని
కారణం బేమి?"యని యడిగిన నారదుం డి ట్లనియె. 30

క. "నర సిద్ధ సాధ్య విద్యా
ధర సుర కన్యకలకంటె దమయంతియ సుం
దరి; దాని సుస్వయంవర
మరు దై వర్తిల్లుచున్నయది యిప్డు మహిఁ. 31

క. అందులకు ధరణీఁ గల నృప
నందను లెల్లను ముదంబునం బోయెడు వే
డ్కం దమలోఁ గలహాంబును
గ్రందును లే కున్నవారు గడు నెయ్యమునఁ" 32

వ. అనిన నింద్రుండును లోకపాలవరులును దదాలోకనకౌతుకంబునం గనకరత్న రమ్య దివ్యవిమానారూఢు లయి భూలోకంబునకు జను వారు ముందట దమయంతీస్వయంవరంబునకుం బోయెడువాని నాదిత్యులలోన విష్ణుండనుంబోలెఁ దేజోధికుండైన వాని, ననన్య సాధారణరూపవిభవంబున రెండవ మన్మథుండునుంబోనివాని, నలుం గని యంతరిక్షంబున విమానంబులు నిలిపి భూతలంబునకు వచ్చి వాని కిట్లనిరి. 33

సీ. "నిత్యసత్యవ్రత! నిషధేశ! నీవు మా
కమరంగ దూతవై యభిమతంబు
సేయుము" నావుఁడుఁ "జెచ్చెర నట్టుల
చేయుదు; మటి నాకుఁ జెపుఁడు మీర
లెవ్వార? లేను మీ కిష్టంబుగా దూత
నై యేమి సేయుదు?" ననిన నతని
కమరేశ్వరుం డిట్టు లనియె" నే నింద్రుండ;
వీరు దిక్పాలురు విదితయశులు;
ఆ. ధరణి నొప్పుచున్న దమయంతి సుస్వయం
వరముఁ జూచువేడ్క వచ్చి యున్న
వార; మీవు మమ్ము వారిజాక్షికి నెటిం
గింపు నామధేయకీ ర్తనముల 34

వ అట్లయిన నకోర్కమలి మాయందుఁ దన వలచిన వాని వరియించు" ననిన నింద్రునకుఁ గృతాంజలి యై నలుం డిట్లనియె. 35

ఆ. "ఎటీఁగి యెటీఁగి నన్ను నేకార్థసము పేతుఁ
బాడియయ్య యిట్టిపనికిఁ బనుప?"
ననిన "నుత్సుకుండ వై యేల చేసెద
నంటి? చేయ కుండ నగునె యింక? 36

ఆ. నిన్ను నిత్యసత్యనిరతుఁగా నెటీఁగి, యి
క్కార్యమునకు వలను గలుగు నెటీఁగి
పనుప వలసె దూతభావ మపేక్షించి;
దేవహితము దీనిఁ దీర్పవలయు.

వ. ఆయుధీయసురక్షితం బయిన రాజగృహం బెట్లు సొర నగు నని శంకింప వలదు; దమయంతీనివేశంబు ప్రవేశించునపుడు ని న్నెవ్వరును వారింప నోడుదు" రనిన శక్రు వచనంబుల నశంకింతు డయి నలుం డప్పుడ విదర్భాపురంబునకుఁ బోయి యొక్కరుండ దమయంతీగృహం బు సొచ్చి.

—: నలుఁడు దమయంతియొద్దకు దేవదూత యై పోవుట :—

గీ. హంసచేఁ దన వినిసంతకం బెను రూప
విభవాతిశయమున వెలయుదాని,
సురకన్యకలయట్టి సురుచిరశతకన్య
కాళిచేఁ బరివృత యైన దాని,
హృదయేశుఁడై న త న్నెప్పుడు వినుచున్కి-
నలయ కాశ్వాసిత యైన దాని,
దమయంతిఁ జూచి కందర్పశరావిద్ధుఁ
డయ్యె నలుం; డంత నతనిఁ జూచి
ఆ. యితఁ డపూర్వమనుజుఁ డెందుండి వచ్చెనో
యనుచు నుదరిపడి లతాంగు లెల్ల
నాసనములు డిగ్గి యప్పు డభ్యుద్గత
లై రి మనములందు హర్ష మెసఁగ. 39

వ. అంత.

క. దమయంతి మనోభవనిభు
నమరేంద్రప్రతిము, దినకరాభు. సుధారుక్
సము, వరుణసదృశు, ధనదో
పము. నళ్వీసమానుు, నిషధపతిఁ జూచి నలుఁడు. 41

క. వారిరుహనేత్ర మదన
ప్రేరిత యై లజ్జ యుడిగి భీతిల్లక బృం
దారకమూర్తికి రాజకు
మారున కిట్లనియె మందమందమృదూక్తిఁ. 42

వ. "నీవు మహానుభావుండ వెవ్వండ? విందులకేమి కారణంబున నేకతంబ
వచ్చితి? విదియత్యుగ్రశాసనుండై న మదీయ జనకుచేత సురక్షితంబగుట
నెవ్వరికిఁ జొర నశక్యంబు; దీని నెవ్వరు నెఱుంగకుండ నెవ్విధంబునం
జొచ్చితివి? నాకు మనోజ వేదనావివర్ధనుండవై న నీతెఱం గెఱిగింపు"
మనిన దానికి నలుం డి ట్లనియె. 43

ఆ. "ఏను దేవదూత; నింతి! నలుం డను
వాఁడ; నింద్ర దహన వరుణ యములు
నీ స్వయంవరంబు నెమ్మనోఁ జూడంగ
నరుగుదెంచి నన్ను నబల! మున్న. 44

క. నీయెుద్దకుఁ బు త్తెంచిరి
"మాయం దొక్కరు నభీష్టమతి వరియింపం
దోయజముఖిఁ బ్రార్థింపుము;
మాయందఱకును బ్రియం బమర్పుము ప్రీతిన్." 45

వ. అని పంచినఁ దత్ప్రభావంబున నన్యులచేత నలక్షితుండనై వచ్చితి
నింద్రాదులకుఁ బ్రియంబు సేయు" మనిన నవనతవదనయై దమయం
దొల్లి హంసచేత నలు విని వానియందు బద్ధానురాగయై నవయు
చున్న యది యపు డతని నలుంగా నెఱింగి తద్వచనశ్రవణదుఃఖాయ
మానమానస యగుచు ని ట్లనియె. 46

తరువోజ. "ఏ నేడ? నింద్రాదు లేడ? వారలకు
వెప్పుడు బ్రియుక్కుదు; నేను నీ ధనము;

భూనాథ! నీగుణంబులు వానచేతఁ
బొలుపుగా విని మనంబున నిల్పియున్న
దాన; భవన్నిమిత్తమున నిట్లఖిల
ధారుణీనాథసార్థంబు రావింపఁ
గా నిట్టి వలసె; లోకఖ్యాతకీర్తి!
కరుణించి పతిబుద్ధిఁ గావింపు మిందు. 47

వ. నీవు దీని కొడంబడనినాఁడు రజ్జువిషాగ్నిజలంబులం బ్రాణపరి
త్యాగంబు సేసికొందు'' ననిన దానిం జూచి నలుం డిట్లనియె. 48

మత్తకోకిలము. భూరిసత్త్వులు, సర్వలోకవిభుల్, విభూతిసమృద్ధు, లి
ద్దోరుతేజులు నిన్నుఁ గోరుచు నున్నవా రమరోత్తముల్;
వారి పాదరజంబుఁ బోలనివాని నన్ను మనుష్య సం
సారిఁ గోరఁగఁ జెల్లె నీకుఁ బ్రసన్న లై సురలుండఁగాన్?

క. దేవతల కప్రియంబులు
గావించి మనుష్య లధమగతు లగుదు రిలం;
గావున వారి కభీష్టము
గావింపుము; ననుఁ బ్రీతిఁ గావుము తరుణీ! '' 50

వ. అనిన దమయంతి నయనాంతర్గళితబాష్ప ధారాకలితక పోలయుగళ
యగుచుం బెద్దయుంబ్రొద్దు చింతించి ''నీయభిప్రాయంబునకు నిరపా
యంబయిన యుపాయంబుగంటి; నింద్రాదులు నాస్వయంవరంబునకు
వచ్చెదరేని వారిసన్నిధిన నిన్ను వరియించెద; నట్లయిన నీకు నిర్దోషం
బగు'' ననిన నలుండు లోకపాలురపాలికిం బోయి దమయంతికిం దన
పలికిన విధంబును, దనకు దమయంతి పలికిన విధంబును జెప్పె; నంతఁ
బుణ్యతిథినక్షత్రముహూర్తంబున దమయంతీ స్వయంవరంబు ప్రవర్తి
ల్లిన. 51

ఆ. "నలున కాని నలినదళనేత్ర వరియింప
దగ్గె! చూత'' మనుచు నమరవరులు
నలువురును గడంగి నలరూపమున వచ్చి
రా స్వయంవరమున కతిరయమున. 52

వ. అంత 53

సీ. దమయంతి సితపుష్పదామాభిశోభిత
హస్తయై చనుదెంచి, యంబుజాక్షి
యమ్మహోత్సవదర్శనాగతరాజన్య
నివహంబు నీక్షించి, నెమ్మితోడ
నలువురు వేల్పులు నలుఁదొట్టి యప్పుడే
కాకారులై యున్న నందు నలుని
నేర్పరింపఁగ నేర, "కింద్రాదులను, నలు
నెఱుఁగునుపాయ మిం కెద్దియొక్కొ!"
ఆ. యనుచు సంశయాకులాత్మయై "సురలార!
నలు నెఱుంగువిధము నాకుఁ జేయుఁ;
డాత్మరూపధరుల రగుఁ" డని పరిదేవ
నంబు సేసెఁ దన మనంబులోన. 54

వ. దేవతలు దాని పరిదేవనంబు విని కరుణించి యనిమిషలోచనంబులు, నస్వేదగాత్రంబులు నొప్ప నవనీతలంబు ముట్టక యాసన్నులై నిలిచి; రంత లోకపాలురును, భూలోకంబునం గల రాజలోకంబు నవలోకించు చుండఁ బుణ్యశ్లోకుండయిన నలు ధర్మవిధానంబున వరియించి దమయంతి తదీయస్కంధంబున సుగంధికుసుమదామకంబు వెట్టిన. 55

క. దేవతల సాధువాదము
తో, విప్రాశీరవంబుతో, బహుతూర్యా
రావంబులు సెలఁగెను బా
రావారరవంబుఁబోలె ననివార్యము లై. 56

—: నలుండు స్వయంవరలబ్ధ యైన దమయంతిం బెండ్లి యగుట :—

వ. ఇట్లపూర్వస్వయంవరలబ్ధ యైన దమయంతి నత్యంత విలాసంబుతో వివాహంబైన యానలునకు నింద్రుండు వాని యజ్ఞంబుల యందు నిజరూపంబుఁ జూపను, నగ్నియు వరుణుండును వాని వలచిన చోటన యగ్నిజలంబు లుత్పాదింపను, ధర్ముండు ధర్మవునంద వాని బుద్ధి వర్తిల్లను వరంబు లిచ్చి దేవలోకంబున కరుగువా రెదుర ద్వాపరంబుతో వచ్చు కలిం గని "యెందులకు బోయెద?" వని యడిగిన నింద్రాదులకుఁ గలి యిట్లనియె. 57

తే. "అవనిలో దమయంతీస్వయంవరంబు
వి స్తరిల్లుట విని కడు వేడ్కతోడ
నేను దమయంతిచే వరియింపఁబడుదు
నని తదర్థి నై యరిగెద నానఁజేసి." 58

వ. అనిన నందరు నగి "నీ వందుల కేలపోయె? దది ముందర నిర్వర్తంబయ్యె; నక్కొమలి యెరుల నెవ్వరి మెచ్చక నలుఁడనువాని వరియించె" ననినం గలి కరంబలిగి "యన్నలునకు దమయంతికి రాజ్యవిభవపరిత్యాగంబును, బరస్పరవియోగంబునుం జేసెద" నని నిశ్చయించి వాని నక్షరతుంగా నెఱింగి, యక్షంబులం జొచ్చి యుండ ద్వాపరంబుం బనిచి, నలుండు సేయుచున్న యశ్వమేధాది కానేకభూరి దక్షిణమహాక్రతువులయు, జపహోమదానాదివివిధ పుణ్యకర్మంబులయుఁ, గారణంబుసం జొర నవసరంబు గానక యంతరం బన్వేషించుచుఁ బెద్దకాలం బుండి, యొక్కనాఁ డతండు కృతమూత్రుం డయి జలోపస్పర్శనానంతరంబున శాదశౌచంబు సేయ మఱచి సంధ్యోపాసనంబు సేసిన నుపలబ్ధావసరుం డయి కలి నలునందుఁ బ్రవేశించి, పుష్కరుం డనువానిపాలికిం బోయి, తన్నెఱింగించి, "నీవు నలునితో జూదం బాడి వాని రాజ్యంబును సర్వస్వంబును నొడిచికొ" మ్మని చెప్పి తానును వానిఁ బ్రవేశంబున సహాయుండయి యక్షంబులు గొని పుష్కరుతో నొక్కటం జని నలుం గాంచి "నీవు మాతోఁ జూదం బాడు" మనిన 59

క. "ద్యూతార్థము తత్కృతవా
హుతుఁడ నై జూప మాడకుండుట ధర్మ్మ
పేతం" బని యభిముఖుఁ డై
యాతనితో నలుఁడు జూద మాడఁ గడంగెఁ. 60

క. కల ధనము లెల్ల నొడ్డుచు
నలయక జూదమున విజితుఁ డగుచుండె నిజా
ప్తులు వారించిన నుడుగక
నలుఁడు కలిప్రేరణంబునను హతమతియై. 61

వ. ఇట్లనేకమాసంబులు దుర్వ్యసనాసక్తుం డయిన యన్నలుండు
వివిధవస్తువాహన నివహంబు లొడ్డి, పుష్కరున కోటువడంబోయిన
నెటింగి, పౌర బ్రాహ్మణప్రధాన వరులు దమయంతీపురస్కృతు
లయి వచ్చి వారించి కలిసమావేశపరవశుండైన యన్నలుచేతం
బ్రతిహతు లయి పలుకకుండి; రంత దమయంతి చింతాక్రాంత
చిత్తయై. 62

ఆ. "ఎంత యోటువడిన నంతియ జూదంబు
నందుఁ దగులుఁ, జలము నతిశయిల్లు;
నేమి సేయుదాన? నిది యెగ్గునకు మూల"
మని లతాంగి దుఃఖితాత్మ యగుచు. 63

సీ. అక్షముల్ పుష్కరునందు వశ్యంబులై
యునికియు, నలునియం దొండువిధము
లగుటయు, నెట్టింగి నిజాధీశ్వరున కప
జయమ కా లక్షించి, సరసిజాక్షి
భర్తయనుజ్ఞ ముఁ బడసి, వార్ష్ణేయుఁ డఁ
సారథిఁ బిలిచి, "యీ స్యందనమున
నిద్ధసేనుం డను నిక్ష్వాకుమారకు, నింద్ర
సేన యాన్యూఁతుఁ జెచ్చెరను దోడు

ఆ. కొని, విదర్భ కరిగి, గుఱుకొని మద్బంధు
జనులయొద్దఁ బెట్టి చట్ట రమ్మ"
యంచు నెమ్మిఁ బచ్చె నా ప్తపురోహిత
మంత్రి బాంధవాభిమతము గాఁగ. 64

క. నలుఁడును ధరణీరాజ్యము
దలఁగఁగ, సర్వంబు నపహృతంబైనఁ, గడుం
దలరి దమయంతిఁ దోడ్కొని
వెలువడియె నశేష రాజ్యవిభవచ్యుతుఁడై. 65

తే. పురము వెలి మూఁడహోరాత్రములు వసించి
యున్న నలుపాలి కెవ్వరు నోడి రరుగ

జనవిభుం డైన పుష్కరుశాసనమునఁ,
గలికృతద్యూతవిద్వేషకారణమున. 66

వ. ఇట్లు సర్వజన సత్కారార్హుం డయ్యును నలుండు విధికృతంబున నెవ్వరివలనను సత్కారంబు గానక జలంబు లాహారంబుగాఁ దత్పుర సమీపంబున దమయంతీ ద్వితీయుం డై యుండి బుభుక్షాపీడ సహింప నోపక, హిరణ్యపక్షంబులతోఁ దమ ముందటఁ దిరుగు చున్న పక్షులం గని యవి భక్ష్యంబు లగు నని, యప్పక్షులం బట్టికొన సమకట్టి తన కట్టిన పుట్టింబు వానిపై వైచిన నవి పుట్టంబుతోన గగనంబున కెగసి నగుచు విగతవస్త్రుం డైన నలున కిట్లనియె. 67

—: నలుండు దమయంతీసహితుండై యడవికిఁ బోవుట :—

తే. "నీధనంబును రాజ్యంబు నికృతిఁ గొన్న
యక్షముల మేము ; నీ వస్త్ర మపహరింపఁ
బక్షిరూపుల మై వచ్చి పార్థివేంద్ర !
యపహరించితి" మని చెప్పి యరిగెఁ జదల. 68

వ. నలుండును వానిం జూచి విస్మయం బంది "యీ యక్షుంబుల దోషం బునం గాకేమి నా కిట్టి దయ్యె" ననుచు దమయంతి కట్టినపుట్టంబు చెఱంగు గట్టికొనియె ; న ట్లిద్దఱు నేకవస్త్రులయి యొండొరుల మొగంబులు సూచి దుఃఖించుచో నలుండు దమయంతి కిట్లనియె.

క. ఇది దక్షిణాపథంబున,
కిదియు విదర్భాపురమున, కిది కోసల, కి
య్యది యుజ్జయినికిఁ దెరువులు ;
మది నిన్నిటిలోన నరుగ మన కెద్ది యగున్ ? 70

క. అడవులలో నాతోఁ గడు
నిడుములు పడనోప ; వరుగు మిందుముఖీ ! యి
ప్పుడు నీబంధుజనంబుల
కడ" కనవుడుఁ దరుణి శోకగద్గద యగుచున్. 71

ఆ. అతని కిట్టు లనియె "నవనీశ నీవును
నేనుఁ జని విదర్భ నిష్టలీల

నుండుదము మృగాకులో గ్రవనంబుల
కరుగ నేల ? యిడుమ లంద నేల ?" 72

వ. అనిన విని నలుం డవనతాననుం డై "నీచెప్పినట్లు విదర్భేశ్వరు
రాజ్యంబును మన రాజ్యంబ ; యేను దొల్లి యధికైశ్వర్యయుతుం
డనై యందులకుం బోయి బంధు జనులకు హృదయానందంబు సేసి,
యిప్పు డివ్విధంబున సర్వస్వహీనుండ నై యెట్లు పోవ నేర్తు ?"
ననిన దమయంతి యి ట్లనియె. 73

తే. "అధికదుఃఖరోగార్తున కౌషధంబు
సురుచిరంబుగ భార్యయ చూవె ; యెందు
నొనర భార్యసమేతుఁడై యున్న వాని
కెంత లయ్యును నాపద లెఱుకపడవు. 74

క. అలసినెడ, డస్సినెడ, నాఁ
కలి దప్పియు నైనయెడల, గడుకొని ధరణీ
తలనాథ ! పురుషునకు ని
మ్మిల భార్యయ పాచుఁ జిత్తమున దుఃఖంబుల్. 75

వ. కావున నిది "మనుజీవిత యనియును, ననువ్రత యనియు, నను
కంపనీయ యనియు నన్ను విడువక, నాయనుగమనంబున,కొడంబడు"
మనిన "నట్ల చేయుదుఁ; బ్రాణసమాన వై న ని న్నేల విడుతు ?
నోడ కుండు" మని నలుండు దన దేవి నాశ్వాసించుచు నొక్కటఁ
జని, విజనంబై న విపినంబున నొక్కసభం గని, యందు విశ్రమించి,
పరుషధూళిధూసరస్థలంబున శయనించి మార్గశ్రమనిమీలితనయ
నుండై దుఃఖమునఁ గన్ను మొగుడ కున్న లేచి, తన పాదంబుల
యంతికంబునఁ గ్లేశపరవశ యై నిద్రవోయెడు దమయంతిఁజూచి. 76

సీ. "ధరణిరాజ్యంబుతో ధన మెల్లఁ బరులచే
నవహృతం బగుటయు, నాప్తమిత్ర
బంధుజనంబులుఁ, బ్రకృతిజనంబులు
విడుచుటయును, మహావిపినభూమిఁ

బత్నితోఁ దన పరిభ్రమియించుటయు, నప్డు
దలఁచి శోకించి, యిత్తరుణి దొల్లి
మృదుశయనంబున మెలఁతలు మెలపుతో
నడుగులొత్తఁగ నిద్ర యనుభవించు.

ఆ. కోమలాంగి; యిపుడు గుఱుకొని పాంసుల
స్థలమునందు నిద్ర దగిలినదియుఁ ;
బంకజాక్షి నాకు భార్యయై యింత దుఃఖంబు వొందె దైవఘటనఁజేసి. 77

వ. ఏను దీని దుఃఖంబుఁ జూడనోప ; నెటయేనియుం బోయెద ; నిది నన్నుం గానక తన బంధువుల యొద్దకుం బోయి దుఃఖంబులం బొరయకుండు'' నని విచారించి పోవ సమకట్టి యక్కొమలి మేలుకొనకుండ మెల్లన దానివస్త్రంబునం దర్ధంబు సించి; తనకుం బరిధానంబు నేసికొని, వెలువడి కొండొకనేల పోయి, దమయంతియందు ఘనంబైన తన నెయ్యం బతిశయింప నేరక క్రమ్మఱి వచ్చి. 78

చ. కలి దమయంతీ శాప సమకట్టు ; బొరిం బతి వాయ నోపఁ డా
లలన నుదీర్ణసౌహృదబలంబున ; నిట్టులు రెంటఁజేసి యు
న్నలుఁడు విమోహరజ్జులఁ బెనంగి గతాగతకారి యైన యు
య్యెలయునుబోలె నూఁడక యెంతయుఁ బ్రొద్దు వినిశ్చితాత్ముఁడై.

తే "శాల నొక్కర్తు నిక్కానపాలు సేసి
నిష్ఠురుండ నై యే నెట్లు నేర్తుఁబోవ ?"
ననక కలిచేత నాకృష్టుఁడైన నలుఁడు
విగతకరుణుఁడై దమయంతి విడిని చనియె. 80

వ. అంత దమయంతి మేలుకని పతిం గానక తన వస్త్రార్ధనికృంతనంబును జూచి లేచి నలుగడం బరికించి భయశోకవ్యాకులచిత్త యయి.

సీ. "హా మహారాజ! మహామహీరమణ
దడుదక్షిణబాహుదండ! దండి
తారాతి! నిషధరాజాగ్రణి! నన్నిట్లు
వీతదయుండ వై విడిచి చనఁగఁ

దగునె? నీ వెన్నఁడు ధర్మ్మవు దప్పని
వాఁడవు; సూనృతవ్రతరతుండ;
వోడకు మని నన్ను నూఱడఁ బలికిన
పలు కిట్లు మఱవంగఁ బాడి యగునె?
ఆ. పొదలలోన డాఁగి పొడసూప కిఁ ట్లేల
యున్న వాఁడ? విట్టియుగ్రభావ
మేల నీకు వలసె? నెట వోదు? నిం కెట్లు
గాంతు నిన్ను నుగ్రకాననమున? 82

క. వగవఁగ సాంగోపాంగము
లగు నాలుగు వేదములయు నధ్యయనము పొ
ల్పుగ నొకసత్యముతో సెన
యగునే? యెవ్వీయును బోలవఁ సత్యంబున్! 83

వ. ప్రాణసమానవయిన ని న్న వశ్యంబును విడువ నని పలికితి; సత్య
ప్రతిపాలనంబు సేయు" మని ప్రలాపించుచుం దన యేకాకిత్వం
బునకు, నబలాభావంబునకుఁ, బ్రతిపదన్యాయజాయమానకంటకమృగ
పన్నగభయంబునకు వగవక నిజనాథు నసహాయత్వంబునకు, దుస్సహ
క్షుత్పిపాసాశ్రమాకులత్వంబునకు వగచుచు. 84

క. అలయుచుఁ, బులుఁగుల యెలుఁగుల
కులుకుచు, నుగ్రాతపమున కోపక వృకుం
బులనీడల నిలుచుచు, నెలుఁ
గులఁ బులులం జూచి భయముగొని వగ వగచుఁ. 85

క. ఏచిన పొదలఁ బొరల్పడఁ
ద్రోచుచు, ముండ్లకును నల్లఁ దొలఁగుచు, దిక్కుల్
సూచుచుఁ, దొడరుచుఁ, ద్రెళ్లుచు,
లేచుచు లలితాంగి సంచలించుచు నరిగెఁ. 86

వ. ఇట్లరుగు చున్న దమయంతి నంతికన్యస్తచరణ యైనదాని నాహా
ర్థి యయి యొక్క యజగరంబు వట్టికొనిన నక్కోమలి మెదల
నేరక. 87

ఆ. "ఇంక నైన నన్ను నేల యాలింపవు?
నాకు శరణ మగుము నాథ!" యనుచు
నటుచుచున్న దాని యాక్రందనధ్వని
వినుచు నొక్క యెఱుకు వేగ వచ్చి. 88

వ. తన పట్టిన సురియ నప్పెనుఁబాము వదనంబు వ్రయ్యం దటిగిన రాహుముఖవిముక్త యైన చంద్ర రేఖయుం బోలె నజగరముఖంబు వలన వెలువడిన యా దమయంతి నాశ్వాసించి, తత్సమీపసరోవర స్నాతను, వన్యస్వాదుఫలాహారనుంగాఁ జేసి, విగత శ్రమం గావించి "నీ వెవ్వరిదాన? వి శ్లేల యేకతంబ యివ్వనంబునకు వచ్చి?" తని యడిగి మధురభాషిణి యైన యమ్మగువవలన నంత వృత్తాంతంబు నెఱింగి. 89

కవిరాజవిరాజితము—

రజనికరాననఁ, బీనపయోధర, రాజితరాజసుతఁ, విలస
ద్గజపతిగామినిఁ, జందనగంధిఁ, బ్రకాశితకాంతిసమన్వితఁ, బం
కజదళలోచనఁ, జూచి కిరాతుఁడు కామనిశాతశరాహతుఁ డై
నిజహృదయం బెఱుఁగించె లతాంగి కనింద్యచరిత్రకు వేడుకతోఁ. 90

ఆ. అగ్ని శిఖయుఁబోలె నంటను, డాయను,
జూడ రానియట్టి శుభచరిత్ర
నెఱుకలేని కఱకు నెఱు కపేక్షించెఁ గా
దనక తనకు నాయు వల్పమైన. 91

—: దమయంతి శాపంబునం గిరాతుండు నచ్చుట :—

వ. దమయంతియు వాని నలిగి చూచి "యేను పతివ్రత నైతినేని, యద్దురాత్ముం డైన కిరాతుం డివ్వుడు మృతుం డయ్యెడ" ని శాపం బిచ్చిన వాఁ డప్పుడ యగ్ని దగ్ధం బైన వృక్షంబునుం బోలె విగతజీవుం డై పడియె; నట్లు పరమపతివ్రతా గుణ ప్రభావంబున. 92

క. బాల హృదయమున నృపశా
ర్దూలు నిజాధీశు నిలిపి దుష్టోరగశా
ర్దూలాభీలమృగావలి
కోలిన భయ మంద కరిగె నుగ్రాటవిలోఁ. 93

వ. మఱియును. 94.

సీ. "సహకార ! మత్ప్రియసహకారుఁ, బున్నాగ !
పున్నాగుఁ, దిలక ! భూభువనతిలకుఁ,
జందన ! బుధహరిచందనుఁ, బుష్పితా
శోక ! సుహృజ్జనశోకదమను,
వకుళ ! కులైకదీపకు, విభీతక ! భయో
పేతా ర్తిహరు ; నలుఁ బ్రీతితోడఁ
గానరే కానలలోన లోకో త్తరు"
నని ప్రమానిప్రమానికి నరిగి యరిగి

ఆ. యడుగు ; నడుగు లెండఁ బొడవొడఁ బొక్కిన
నిర్ఝరాంతరముల నిలుచుఁ ; బిలుచు
గిరుల దరులయెడల ; నురుగుహాగృహాములఁ
దొంగితొంగి చూచుఁ దోయజాక్షి. 95

వ. ఇట్లు దమయంతి నిజనాథు నన్వేషించుచు భీషణారణ్యంబునం దిరుగు
నది నుండఁట. 96

మత్తకోకిలము.

వారిభక్షులు, పర్ణభక్షులు, వాయుభక్షులు, శాకనీ
వారభక్షులు, వృక్షమూలనివాస యుక్తులునై తపం
బారఁ జేయు మహామునీంద్రుల యాశ్రమం బెడఁ గాంచె నం
భోరుహాక్షి పురాసమార్జితపుణ్యకర్మఫలంబునన్. 97

వ. ఇట్లు మృగవ్యాళతస్కరకిరాతనిరంతరం బయిన కాంతారంబునం
బుణ్యనదీతీరంబున నొక్క మునిపల్లియం గని, యందు వసిష్ఠవామ
దేవ వాలఖిల్య భృగు నారద సదృశులైన మహామునులం గని,
నమస్కరించి యున్న, నమ్మునులు దమయంతిం జూచి యచ్చెరువడి
"యవ్వా నీ వెవ్వరిదాన ? విన్వనదేవతవొ ? దేవభామినివొ ?
దివ్యంబైన తేజంబుతో నేకతంబ యేల క్రుమ్మరియెద ?" వనిన
వారలకు దమయంతి యిట్లనియె. 98

క. "వినుఁ డే బుణ్యశ్లోకుం
డనఁగ, సదా యజ్ఞ నిరతుఁ డనఁగ, ధరిత్రిం

దనరిన నలుభార్యను ; స
జ్జనుత దమయంతి యన నెసంగినదానఁ. 99

వ. విధివశంబున నన్నుంబాసి హృదయేశ్వరుం డెటయేనియుం బోయినఁ
దద న్వేషణాసక్తచిత్తనై పిపినపరిభ్రమణంబు సేసెద ; మీ తపో
వనంబునకు వచ్చి నలుండు భవత్పాదాభివందనకృతార్థుం డయి
యెక్కడికిం బోయె ? నతని పోయినవల నెఱుంగుదురేని నానతిండు;
కొన్ని దినంబులలోనఁ దద్దర్శనంబు సంభవిల్లినినాఁడు దేహంబు
విడుతు" యని యేడ్చుచున్నదానిం జూచి కరుణించి మును లి
ట్లనిరి. 100

క. "వనతాయజాక్షి ! కతిపయ
దినములలోఁ జూడఁ గాంతు తివిరి నలుని, భూ
జనుతు, నెప్పటియట్టుల
తన పురమున రాజ్యలీల, దనరెడివానిఁ. 101

వ. మేము మా తపోదృష్టిం జూచితిమి ; దుఃఖింప కుండు" మని తాప
సులు దమ యగ్ని హోత్రంబులయు, నపారఫలపుష్పతరునదీరమ్య
తపోవనంబులయుఁ దోడ నవృక్షులైనం జూచి దమయంతి "యిది
కలయో నిక్కువంబో" యని విస్మయం బందుచుం జని ముందట
నొక్క చనుపం గని దానిం జొచ్చునపు డందలి జనంబులు. 102

సీ. పాంసుజాలములు పైఁ బ్రాకిన కరము రూ
క్షము లగు నూర్ధ్వాలకముల దాని,
మలినం బైన యర్ధవస్త్రంబుచే
నావృతం బగు దేహయష్టిదాని,
నాఁకలి తృష నిద్ర లనువీని నెఱుఁగక
యున్మాదినియుఁబోలె నున్నదాని ;
దమయంతిఁ జూచి కొందరు పిశాచం బని
పఱచిరి ; కొందరు భయమ్ము వొంది ;

ఆ. రందుఁ గొంద ఱధికహాస్యంబు సేసిరి ;
యడవి నేమి రోసె ? దనిరి కొంద ;
అవ్వ ! నీవె వేల్ప వగు దని కొందరు
మొగిన కేలు మొగిచి ప్రొక్కిరంత. 103

వ. దమయంతి సార్థవాహులం జూచి యిమ్మహాగహనంబున నిట్టి జన
సంకులం బైన సార్థంబు గానంబడియెడు ; నెట్టిపుణ్యంబో ! యని
పల్క మటియు ని ట్లనియె. 104

క. "ఏను నలుభార్యఁ ; బుణ్యవి
హీనతఁ బతిఁ బాసి నవసి యే కాంతమ యీ
కానలఁ బరిభ్రమించెదఁ ;
గానరె మీ రమరసదృశుఁ గరుణాత్ము నలుఁ ?" 105

వ. అనిన దానికి సార్థవాహుండు శుచి యనువాఁ డి ట్లనియె. 106

క. "నలుఁ గాన ; మిష్వనంబునఁ
గల వెప్పుడుఁ గాంతు ముగ్రకరులను, సింహం
బుల, భుక్తుంబుల ; నిది మ
ర్త్యుల కవిషయ ; మాతపంబు డూఅదు దీనఁ." 107

వ. అనిన "నిచ్చనుప యెట వోయెడు ?" నని యడిగినఁ "జేతిపతి యైన
సుబాహుపురంబు నకుం బోయెడు" నని చెప్పిన "నట్లేని మీతోడ
వచ్చెద" నని యప్పరమపతివ్రత పతిదర్శనలాలస యై మునుల పలు
కుల తలఁచుచు సార్థంబుతో నరిగిన. 108

క. కడు నెండ యెక్కు నంతకు
నడుగక యచ్చనుప నడచి యుగ్రాటవిలో
విడిసె బహుశీతజలముల
బెడఁగగు నొకచెఱువునొద్దఁ బెద్దయు డప్పిఁ. 109

వ. అంత. 110

సి. అర్ధరాత్రమునప్పు డందుల కేతెంచె
గజయూథములు జలకాంక్షఁ జేసి
యంబుధివిమలతోయంబు లాస్వాదింపఁ
జనుదెంచు జలధరసమితియట్ల ;
యచ్చన్నలోన నిద్రాసక్తులై నవా
రున్నతద్వీపముల యుగ్రపాద
హతిఁ జేసి మర్దితు లై రి కొందఱు; దంత
హతిఁ జేసి భిన్నాంగు లై రి కొంద ;

ఆ. ఱుచి ప్రాణభీతిఁ బఱచి మహీజంబు
లెక్కి రందుఁ గొంద ఱుక్కడంగి ;
చనుప యిట్టిపాటఁ బెనుపఱి, యవినీతు
సిరియుఁబోలె నడఁగి విరిసి చనియెఁ. 111

వ. అట్టి సంక్షోభంబున మరణంబునకుఁ దప్పి దమయంతి యాత్మ గతంబున. 112.

ఆ "జీవితార్థు లైనజీవుల, సుఖసుప్తు
లైనవారిఁ జంపె నఱవ నఱవ ;
మరణకాంక్షు నన్న మగువఁ జంపక నను
మఱచె విధి కరంబు మందబుద్ధి. 113

సీ. ఇచ్చనప్పతోఁ జని యివ్వనక్లేశంబు
దలుగుదు నని బుద్ధిఁ దలఁచి యున్న,
నురుతరసార్థపయోరాశి హస్తియూ
థాగస్త్యుచేఁ బీత మయ్యె నదియుఁ ;
దొలిమేనఁ జేసిన దుష్కృతశక్తియో,
వగవక నా స్వయంవరమునాఁడు
సురవరు లర్థులై చూచుచు నుండఁగ
నలు వరియించిననాఁటి యెగ్గు
ఆ. దలఁచి యిట్టియాపదలు నేసిరో వేల్పు !
లమరకోపమునన యయ్యె నాకు
నివ్వియోగదుఃఖ ; మింకేమి సేయుదు ?"
ననుచు వగచుచుండె నంబుజాక్షి. 114

—: దమయంతి సుబాహుపురంబు ప్రవేశించుట :—

వ. ఇట్లు దుఃఖించుచు దమయంతి ప్రభాతంబ హతశేషులైన యచ్చ నుపలోని బ్రాహ్మణవరులతో సనవరతప్రయాణంబులం జేదిపతిపురంబు సొచ్చి జనసంకులం బైన రాజమార్గంబు దఱియవచ్చుచున్న దాని దినకర ప్రభాపటలధూసరితప్రభాత చంద్ర రేఖయుంబోలె దీప్తివిహీన యై, డస్సియు రమ్యాకృతి యైనదాని. దమయంతిం బ్రాసాదగత యైన రాజమాత దవ్వులం గని తన దాది కిట్లనియె. 115

తే. "జీర్ణమై కడు మాసినచీర గట్టి
ధూళిధూసరాలకములు దూలు చుండ
నబల యున్మత్తవేషిణియైన లచ్చి
కరణి నిట వచ్చుచున్నది కంటె దాని! 116

వ. అక్కొమలియందు నా కతిస్నేహంబై యున్నయది; దానిం దోడ్కొనిర" మ్మనిన నదియు దమయంతిం దోడ్కొవి రాజమాత యొద్దకుం జనిన, నారాజమాతయు, దానిం జూచి "నీ వెవ్వరిదాన? విశ్లేల దుఃఖావేశవివశ వై యున్న దానవు? చెప్పు" మనిన దమయంతి యిట్లనియె. 117

మధ్యాక్కర. జితవైరి, మత్పతి జూద మాడి నిర్జితుఁ డయి చనినఁ.
బతితోడ నీడయుంబోలె నేనును బాయక యరిగి,
యతిబుభుక్షాతురుం డైన పతిచేత నవ్వ! దైవాను
మతిఁజేసి వంచిత నైతి నొక్కచో మఱచి నిద్రించి. 118

వ. అంతనుండియు నమ్మహానుభావు, నేకవస్త్రి, ననికేతను నన్వేషించుచు సైరంధ్రీవృత్తంబు సేకొని, వియోగానలంబునం గంది, కందమూల ఫలంబుల యాహారంబుగాఁ, బ్రొద్దువడినచోట నివాసంబుగా, మృగకులంబ సహాయంబుగా, నవంబులం బరిభ్రమించితి" నని బాష్పజలంబులం బయోధరస్థలపరాగంబు పంకంబు సేయుచుఁ బలుక నేరకున్న యా దమయంతికి రాజమాత యిట్లనియె. 119

క. "నీ వుండుము నాకడ; నిం
దీవరదళనేత్ర! నీ పతిని రోయఁగ భూ
దేవోత్తములం బంచెద"
నావుడు నిట్లనియె భీమనందన నెమ్మిన్ 120

వ. "ఏను సైరంధ్రి నయి యుండియు నుచ్ఛిష్టంబు మట్టును, బదధావనంబు సేయను, బరపురుషులతోఁ బలుక నోపఁ; బతి నన్వేషించుపోంటె నరిగెడు బ్రాహ్మణులతోఁ బలుకుదు; నట్లయిన నీయొద్ద నుండుదు; నొండువిధం బైన నుండనేర" ననిన "నీకిష్టంబైన విధంబున నాయొద్దన యుండు" మని దాని నతిగౌరవంబునం జేకొని యుండఁ దన కూఁతు సునంద యనుదాని సమర్పించిన. 121

క. అలయక పుణ్యవ్రతములు
సలుపుచు, సైరంధ్రి యనఁగఁ జై ద్యేశుపురిఁ
నలుదేవి యుండె నెదఁ బతిఁ
దలఁచుచు దుస్సహవియోగతాపార్దిత యై. 122

వ. అట నలుండు దమయంతిం బాసి దారుణారణ్యంబులో నరుగు
వాఁడు ముందట. 123

చ. అవిరళవిస్ఫులింగనివహంబుల నభ్రపథంబు నంటుచుఁ
దవదహనం బుదగ్రతరుదాహము సేయుచు నున్నఁ జూచి, మా
నవపతి దానియంతరమునఁ వినియెఁ" నరనాథ! నన్ను గా
రవమునఁ గావ వేగ యిట ర''మ్మనునార్తమహానినాదమున్. 124

క. విని శంకింపక చెచ్చెర
ననఘుం డతుగ్రతరదవానలమధ్యం
బున కరిగి కనియె దీనా
నను కుండలితాంగు నొక్కనాగకుమారున్, 125

వ. అన్నాగకుమారుండును నలునకుం గృతాంజలి యై "యేను గర్కోట
కుం డనువాఁడ; గర్మవంశంబున నొక్కబ్రహ్మఋషి నుపాలంభించి
తచ్ఛాపంబున నెక్కడం గదల నేర కున్నవాఁడ.

క. నాలుగుదిశలను దావ
జ్వాలావలి గవిసె; బ్రమంది చా నోప; మహీ
పాలక! న న్నొకసరసీ
కూలముఁ జేరంగ నెత్తికొని పొమ్ము దయన్. 127

—: నలుఁడు గర్కోటకునిచేత దష్టుం డగుట :—

వ. నన్ను రక్షించిన నీకుం బ్రియంబు సేయ నోపుదు "ననిన వాని నెత్తి
కొనిపోసం జులుకనై యంగుష్ఠప్రమాణదేహుండై యున్న నెత్తికొని
నలుం డతిర్వరితగతి నరిగి తాపవర్జితం బైన యొక్క సరోవర సమీ
పంబున విడువం బోయిన, నింకను బదియడుగు లరుగుము; నీకు
శ్రేయఃప్రాప్తిఁ జేసెద" ననిన నడుగు లెన్నికొనుచు నరిగి, పది
యగు నడుగునప్పు డప్పామువేత దష్టుండై తన రూపంబు విడిచి,

వికృత రూపంబుతో నున్న; నన్నలునకుం గరోకటకుం డాత్మ రూపంబు సూపి యి ట్లనియె. "నయ్యా! నీవు నాచేత విపపీడితుండ వైతినని దుఃఖింప వలదు; ని న్నొరు లెఱింగిన నెగ్గగుం గావున వికృత శరీరుం జేసితి; నెంతకాలము నీ శరీరంబున నా విషం బుండు నంతకాలంబును నీకు విషోరగరాక్షసపిశాచశత్రునివహంబు వలని భయంబు లేదు; సర్వసంగ్రామజయంబును, భార్యాసంగమంబును, నెప్పటి రాజ్యవిభవంబును నగు; నీ కెప్పుడేని నిజరూపంబు సేకొన నిష్టం బయ్యె నప్పుడ నన్నుం దలంపు; మీవస్త్రంబు నీయొద్దకు వచ్చు; దీని ధరియించుడు నిజరూపప్రాప్తి యగు"నని వరం బిచ్చి వెండియు ని ట్లనియె. 128

మధ్యాక్కర. "ఇలఁ బ్రసిద్ధుడు ఋతుపర్ణుఁ డనెడు మహీశుఁ డిక్ష్వాకు
కులంజుడు నీకు సేవ్యుం డగు; నతనిఁ గొలిచి యం దుండు
నెలకొని; యతనికి నశ్వహృదయ మనెడివిద్య యిచ్చి
వెలయ నతనిచేత నక్షహృదయ మన్విద్యఁ జేకొనుము. 129

వ. మఱియు బాహుకుం డను నామంబుతో సూతవృత్తి నుండు" మని హితోపదేశంబు సేసి కరోకటకుం డదృశ్యుండైనఁ, దర్వచనంబున నలుండయోధ్యా పురంబునకుం జని ఋతుపర్ణుం గని "యేను బాహుకుం డనువాఁడ; నశ్వశిక్షయందుఁ గుశలుండ; నన్న సంస్కారంబుల శిల్పంబులఁ బెక్కువిధంబుల రచియింప నేర్తు; భవత్సేవార్థినై వచ్చితి" ననిన ఋతుపర్ణుం డి ట్లనియె. 130

క. "నాయొద్ద నుండుదేని మ
దీయరథాశ్వములకును ద్రుతిని శీఘ్రముగాఁ
జేయుము" నావుడు నట్టుల
చేయుదు నని నలుఁడు వాని సేవించెఁ దగన్. 131

వ. ఇట్లు ఋతుపర్ణునొద్ద నశ్వాధ్యక్షుండయిదుష్టాశ్వంబుల వశంబుఁ జేయుచు, నశ్వారోహకుల నారోహణంబుల శిక్షించుచు, రసవంతంబులుగ నన్న సంస్కారంబులు సేయుచు, ఋతుపర్ణచేత నియుక్తులయిన వార్ష్ణేయ జీవలులు దనకు సహాయులుగాఁ బ్రచ్ఛన్నుండై యుండి యొక్కనాఁడు.

సీ. "ఇభరాజగమన! నీ వెందుల కరగి? త
త్కుచాభోగ! యెం దున్న దాన?
వబల! యెవ్వరిచేత నడవులలోఁ బట్టు
వడి? తళనాపేక్ష బఱచుచున్న
యుగ్రమృగంబుల యుదరంబులో నున్న
దానవే? నీతల్లిదండ్రులొద్ద
ధృతి నున్న దానవే?" దేశాంతరంబుల
నున్న దానవె? యంచు నుదితమదన

ఆ. హతి విమోహితాత్మఁ డై హృదయేశ్వరిఁ
దలఁచి రాత్రులెల్లఁ దాపమునను
నిద్రలేక వంది నిట్టూర్పు లూర్చుచు
నుండె నలుఁడు శోక ముత్కటముగ. 133

వ. ఆతని ప్రలాపంబు విని యొక్కనాఁడు జీవలుం డాత్మగతంబున. 134

క. "అఱపొఱఁడు కుఱుచచేతులు
నొఱపరశరీరంబుఁ గలిగి యొరులకుఁ జూడం
గొఱగా కుండియు మన్మథు
నొఱపుఱఁ బడియెడు నితండు యువతీప్రియుఁడై.

వ. వీనిచేతఁ దలంపంబడియెడు వనిత వీనికంటె లెస్సది కాకున్నె?" యనుచు బాహుకు నొద్దకు వచ్చి "నీతలంచుచున్న భార్యకు నీకు నేల వియోగం బయ్యె" నని యడిగిన బాహుకుం డిట్లనియె.

ఆ. "నన్నుఁ జూచి నగరె? నలినాక్షి నాకేల?
విప్రయోగ మేల? వినవె తొల్లి.
యేలయో యెఱుంగ నేను, మంద ప్రజ్ఞుఁ
డను భటుండు దసలతాంగిఁ బాసి. 137

వ. దాని నన్వేషించి యెందును గానక దుఃఖితుండై ప్రలాపించినం దత్ప్రలాపం బేను ననుకరించితి" నని చెప్పి యిట్లయోధ్యాపురం బున బాహుక నామంబుతో నలుం డుండె; నంత నిట విదర్భేశ్వ రుండు నలురాజ్యభ్రంశంబు విని కూఁతురు నల్లుండు నెట వోయిరో, యెం దున్నవారో యని శోకించి. 138

క. వారల రోయఁగఁ బంచెన
పారబలుం డిష్టులైన బ్రాహ్మణుల, సదా
చారుల, విద్వాంసుల స
త్కారంబులఁ దనిపి వారిఁ గడు నెయ్యమునన్. 139

వ. మఱియు నలనమయంతు లున్నచో నెఱిఁగి వచ్చినవారికి వేయు
గద్యాణంబు లిత్తు ననియు, వారలం దోడ్కొని వచ్చినవారికి
గోసహస్రంబులు నగ్రహారంబులు నిత్తు ననియుఁ బలికి పంచిన. 140

—: చేదిపురంబున సుదేవుఁ డను బ్రాహ్మణుఁడు దమయంతి నెఱుంగుట :—

క. జగతీచక్రమునం గల
నగర మహాగ్రామ పక్కణంబులు కలయన్
జగతీదేవో త్తము లి
మ్ముగ రోసిరి నిఖలదేశముల కరిగి వడిన్. 141

వ. అందు సుదేవుం డను బ్రాహ్మణుండు చేదిపతి యైన సుబాహుపురం
బునకుం జని పుణ్యాహంబు సేయింపం బోవు బ్రాహ్మణులతో రాజ
గృహంబు సొచ్చి, యంతఃపురంబున సుసంధాసహిత యై యున్న
దాని ధూమజాలనిబద్ధం బైన యగ్ని ప్రభయు నుంబోలె, నీలాభ్ర
సంవృతం బైన చంద్ర రేఖయుంబోలె, బహుపంకనిమగ్నంబైన
మృణాళియుంబోలె, నేర్పడ కున్ననుం దదీయభ్రూయుగమధ్యగతం
బైన సూక్ష్మ లక్షణం బిమ్ముగా నిరీక్షించిఁ దాని దమయంతిఁగాఁ
నెఱిఁగి, యాత్మగతంబున "నిది పతివిముక్త యై. శుష్క ప్రవాహ
యైన నదియున్నుంబోలె, శూన్యకమల యైన సరినియుంబోలె, నచేత
చూతం బైన వనంబునుంబోలె నొప్ప కుండియుఁ దన పతివ్రతా
గుణంబున నొప్పు చున్నయది. 142

తే. అనపహార్యంబు, తేజోమయంబు, సర్వ
గుణములకు నలంకారంబు, గురుతరంబు
భామలకుఁ బతిభక్తియ పరమ మైన
భూషణం ; బిట్టివే వెఱభూషణములు ? 143

వ. రోహిణికిఁ జంద్రసమాగమంబునుంబోలె దీనికి భర్తృసమాగమం బెన్నం డయ్యెడునో! తుల్యశీలవయోరూపాభిజాత్య లైన నల దమయంతు లొక్కట నుండం జూచి విదర్భేశ్వరుం డెన్నఁడు కృతార్థుం డయ్యెడునో!" యంచు నల్ల నల్లన దమయంతి కిటనియె. 144

తే. "అవ్వ! నీ తల్లిదండ్రుల, కాత్మజులకు
బంధుజనులకుఁ గుశలంబు; భామ! నీదు
కుశల మెఱుఁగునంతకు వంతగూరి వగచు
చున్నవారు వారికి వంత యుడుగు నింక. 145

వ. దేవీ! యేను భవద్భాగ్యసఖుండ సుదేవుం డను బ్రాహ్మణుండ; విదర్భేశ్వరుండు నీయున్నచో మెఱుంగం బెక్కండ్రు బ్రాహ్మణులం బుచ్చిన నిందులకు వచ్చి నాపుణ్యంబున నిన్నుం గంటి" ననిన దమయంతి వాని నెఱింగి తన పుత్రుల, దల్లిదండ్రుల, బాంధవులం బ్రత్యేకంబ యడిగి, యశ్రుజలంబు లురుల నేడ్చుచున్నం జూచి "యేలకో యిప్పుడు సైరంధ్రి యేడ్చుచున్నయది" యని సునంద తన జననికిం జెప్పి పుచ్చిన. 146

క. చనుదెంచె నంతిపురమున
వనితానివహంబుతోడ వారిజదళలో
చన రాజమాత నృపనం
దన యగు దమయంతికడకుఁ దద్దయు వేడ్కన్. 147

వ. ఇట్లు వచ్చి తమలో మాటలాడు చున్న బ్రాహ్మణుని దమయంతిం జూచి రాజమాత బ్రాహ్మణుని కిట్లనియె: "నయ్యా! యిది యెవ్వనికూఁతు? నెవ్వని భార్య? యేమి కారణంబునం దన భర్తను బాంధవులనుం బాసి పుణ్యవ్రతంబులు సలుపుచున్నయది? నీ వెఱింగి? తికోక్కమలినాచుం బేమి?" యని యడిగిన సుదేవుం డిట్లనియె. 148

మధ్యాక్కర. "నలినాక్షి యిది విదర్భేశుతనయ; పుణ్యశ్లోకుఁ డైన
నలుదేవి దమయంతి సుమ్మి; విధికారణంబున రాజ్య

చలితుఁ డై నిజనాథుఁ డరిగినఁ, దోన చనియె ; నవ్వార్త
వెలయంగ విని వీరి రోయఁ బంచెభూవిభుఁడు బ్రాహ్మణుల.

వ. ఏ నిందులకు వచ్చి మీ చేత సురక్షిత యై యున్న యిక్కోమలిం
జూచి దీని భ్రూమధ్యంబునం బద్మ ప్రభం బై విభూత్యర్థంబుగా
విధాతృనిర్మితం బైన పుణ్య లక్ష్మంబు పాంసుపటలచ్ఛన్నం బై
యున్న నుపలక్షించి మారాజపుత్రింగా నెఱింగితి" ననిన సునంద
శుద్ధోదకంబుల దాని భ్రూమధ్యంబు గడిగిన నది విస్పష్టంబగుడు
నందఱు నాశ్చర్యం బంది రంత. 150

సీ. ఆసందభరితాత్మ యై రాజమాత య
క్కమలాక్షిఁ బ్రీతితోఁ గౌఁగిలించి
కొని "తల్లి ! నీవు నాకూఁతుర ; వేను, నీ
జననియుఁ బేర్మి దశార్ణరాజ
తనయల ; మదియు విదర్భేశుసతి యయ్యె ;
నే విరభాహున కింతి నై తి ;"
ననిన నయ్యప్పకు నతివినయంబుతో
నలుదేవి మ్రొక్కి, సునంద నెత్తి

ఆ. కొని, కరంబు నెమ్మిఁ గొన్నిదినంబు లం
దుండి యిట్టు లనియె నొక్కనాఁడు
"దేవి ! యిదియు నదియు ధృతి నాకుఁ బుట్టిన
యిండ్లు ; కడుసుఖంబ యిందు నందు. 151

వ. అయినను దల్లిదండ్రుల, ననుజుల, నాత్మజులం జూడ వేడుక యైనది;
విదర్భకుంభోయెద;నాన తి"మ్మని కృతాంజలి యైన దమయంతి నతి
స్నేహంబున సుభాహుజనని సుత్రపేషిత బలంబుతో సువర్ణమణిమయ
విమానోపమానయానంబున ననిచి పుచ్చిన. 152

—: దమయంతి నలు నెడఁబాసి విదర్భాపురంబు సేరుట :—

ఉ. భామ విదర్భ కేఁగి తనబంధుజనంబులయొద్ద నుండియుం
గోమలి దేహసౌఖ్యములకున్ వెలి యై, మలినార్ధవస్త్రముఁ,
భూమిరజంబు, నంగమునఁ బొల్పగు చుండఁగ నుండె జీవిత
స్వామి నిజేశుఁ జూచుదివసంబుల కోరుచు సువ్రతంబుతోన్ 153

వ. ఇట్లు భర్తృనియోగాతురయై దమయంతి ప్రాణంబు భరియింపనోపక యొక్కనాఁ డేకాంతంబునఁ దన జనని కిట్లనియె. 154

క. "శోకాపనోదిఁ బుణ్యశ్లోకుని నలు రోయఁ బనుపు శుభచరితుఁ; దదాలోకన విహీన నై పర
లోకకృతావాస నగుదు లోకం బెఱుఁగన్" 155

వ. అనిన నదియును గూఁతు నభిప్రాయంబు భీమున కెఱిఁగించిన నాతండు నలుమార్గణంబున బుజుమార్గు లయిన బ్రాహ్మణుల నియోగించినం దన పతిఁ నన్వేషింప నరుగు బ్రాహ్మణులకు దమయంతి యిట్లనియె.

ఆ. "నైషధేశ్వరుండు నలుఁ డీప్సు డసమర్థుఁ
డగుటఁజేసి తన్ను నన్య లెఱుఁగ
కుండ నుండుఁగాన యురుసభాంతరముల
కరిగి యరిగి యిట్టు లనుఁడు మీరు. 157

సీ. "సత్యనిత్యుండవు; సతి నిట్లు వంచించి
దాని వస్త్రార్ధంబు చఱిగి నీకుఁ
బరిధానముగఁజేసి పాడియె పోవంగ?
భార్య భర్తవ్య నాఁ బరఁగు ధర్మ;
మది మిథ్య యయ్యె నీయందు; నీ కిట్టి ని
ర్దయబుద్ధిఁ జేకొనఁ దగునె? యట్టి
సాధ్వీఁ గరుణఁ బ్రసన్నుండ వగు"మని
యెల్లచోఁ బలికిన నెవ్వఁడేనిఁ
ఆ. బలుకు వడఁగ నోడి ప్రతివచనం బిచ్చు
నతఁడు నలుఁడుగాఁ బ్రియంబుతోడ
నెఱిఁగి, నన్ను నతని కెఱిఁగించి, తోడ్కొని
రండు రానినాఁడు రం డెఱిఁగి." 158

వ. అని పంచినం బని పూని బ్రాహ్మణులు దమయంతి కఱపిన పలుకు లెల్ల సభలం బలికి యెందునుం గానక వచ్చి; రఁదుఁ బర్ణాదుం డను బ్రాహ్మణుండు దమయంతి కిట్లనియె "నే నయోధ్య కరిగి నీ కఱపిన

పలుకు లెల్ల ఋతుపర్ణసభం బలికిన, నొక్క పురుషుండు, కఱుచ చేతులవాఁడు, ఋతుపర్ణనొద్ద నూఱుగద్యాణంబులు జీవితంబు వాఁడు, శీఘ్రయానకుశలుండు, సూదక్రియానిపుణుండు, విరూపాం గుండు బాహుకుండను నశ్వశిక్షకుండు విని, నన్ను నేఁతంబు కనుం గొని వెలువెల నగుచు దీర్ఘనిశ్వాసపురస్సరుం డై యి ట్లనియె. 159

. . ఆ. "పురుషునందు దోషపుంజంబు గలిగిన
నెఱిఁగి యెద సహించునేని భార్య,
పురుషునం దభీష్టభోగంబు దేహాంత
రంబునందు ధర్మరతియుఁ బడఁయు." 160

వ. అని యొండెద్దియుఁ బలుకక తన నివాసంబునకుం బోయె " నని చెప్పిన విని వెద్దయుం బ్రొద్దు చింతించి, "నలుండు గానివాఁడు ప్రతివచనం బేల యిచ్చు? నింకను వనుగలవారలం బంచి యాతని నిమ్మగా నెఱుంగ వలయు" నని నిజజనని యనుమతంబున సుదేవు రావించి వాని కి ట్లనియె. 161

క. "న న్నెఱిఁగి తెచ్చినట్ల జ
గన్నుతు నలు నెఱిఁగి తెమ్ము కోశలమున వి
ద్వన్నాథ! సర్వగుణసం
పన్నుండవు నీవ బుద్ధిఁ బరికింపంగన్. 162

క. అరుగు మయోధ్యకు దేశాం
తరవిభుఁడవై; రవి ప్రతాపోన్నతు, ను
త్తర కోసలేశు, భాంగా
సరినిం గను మనఘు, నమరసముఁ, ఋతుపర్ణున్. 163

వ. మఱి "విదర్భావిభుం డగు భీముండు నలు రోయం బంచి యెంతనుం గానక యింకను దమయంతికిఁ బునస్స్వయంవరంబు రచియింపం బోయిన, నందులకు భూవలయంబునం గలరాజు లెల్లను బోయెద"రని యతిత్వరితంబుగా ఋతుపర్ణునకుం జెప్పుమని పంచిన సుదేవుం డయో ధ్యానగరంబునకుం బోయి ఋతుపర్ణుం గాంచి "విదర్భాపురంబున దమయంతీ ద్వితీయస్వయంవరం బెల్లియే యయ్యెడు"నని చెప్పిన

విని ఋతుపర్ణుండు బాహుకుం జూచి "నాకు దమయంతీ స్వయం వరంబుఁ జూడ నొక్కనాఁటన విదర్భకుం బోవలయు; నీ యశ్వశిక్షా నైపుణ్యంబుఁ బ్రకాశింపు" మనిన నట్లు చేయుదు నని నలుండు దన మనంబున దుఃఖించి. 164

ఆ. "అడవిఁ దన్నుఁ బాసి యరిగిన నలిగి కా
కున్నె యిట్లు సేయ నువిద గడఁగె?
నెట్లయేనిఁ గూర్తు రింతులు మా కని
విశ్వసించువారు వెడఁగు లెందు. 165

ఆ. సాధ్వి నాపుఁ గూర్చు; సంతతి గలయది;
చెలువ యిట్టు లేల చేయు? నైన
నెఱుఁగ వలయు దీని; నే ఋతుపర్ణతో
బోదు నని నలుండు బుద్ధిఁ దలఁచి. 166

వ. వార్ష్ణేయుండు దెచ్చిన తన రథంబునందు నిజహయంబుల నా లక్ష్యమాణ శుభలక్షణంబులు, మనోవాయువేగంబులు నైన వానిం బూన్చికొని వచ్చిన, ఋతుపర్ణుం డా రథం బెక్కినప్పుడు హయంబులు ప్రమోగ్గినం జూచి, "యిప్పేద గుఱ్ఱంబు లతిసూరం బెట్లు పోవనోపు? నొండు గుఱ్ఱంబులం బూన్పు" మనిన బాహుకుం డిట్లనియె. 167

క. "అవనీశ! యీహయంబులు
పవనగతిం బఱచుఁ బ్రొద్దువడకుండఁగ నేఁ
డ విదర్భకు" ననవుడు విని
కువలయపతి మెచ్చి బాహుకున కిట్లనియెఁ. 168

వ. "అట్లయిన నీ హయతత్త్వకౌశలం బెరింగి నీకు నభిమతం బొనరింతు" నని రథంబెక్కి బాహుక వార్ష్ణేయసహితుం డయి యరుగువాఁడు.

మధ్యాక్కర. ఎదురను దవ్వులఁ జూచిన పొడవులు లెల్ల వత్తనమ
కదియఁగా, నవ్వి యెంతయును దవ్వయి కనఁబడఁ బిఱుఁద,
"నిది దినేశ్వరురథమో! యనూరుఁడో యితఁ!"డంచు నపుడు
హృదయమునను గడు విస్మయం బందె నిక్ష్వాకుకులుఁడు.

వ. వాగ్దేయుండును బాహుకు రథంబు గడుపు నేర్పున కచ్చెరువడి
యాత్మగతంబున. 171

క. "ఈతండు శాలిహోత్రుఁడో !
మాతలియో ! నలుఁడో ! యొరులు మానవులు జవో
పేతముగ నిట్లు హయముల
నీతి యెఱుంగుదురె ధారుణీవలయమునన్. 172

వ. వయోవిద్యావైభవంబుల నితండు నలుం బోలియు, వికృతరూపధరుం
డయిన కారణం బేమియొ? మహాపురుషులు దైవనియుక్తులై
ప్రచ్ఛన్నవృత్తినుండుదురు; వారి నెఱుంగంబోలునె" యనుచుఁ
జనునప్పుడు బుతుపర్ణుండు దన యుత్తరీయంబు జారి భూతలంబు
పయిం బడిన మలంగి చూచి "బాహుకా! వార్ష్ణేయుండు వోయి
యుత్తరీయంబు దెచ్చునంతకు రథగమనం బించుక మందంబు సేయు"
మనిన బాహుకుండు నగి "నీ యుత్తరీయంబు వడినయెడ యిచ్చోటికి
నొక్కయోజనంబు గలదు; దాని వార్ష్ణేయుం డెట్లు దే నేర్చు?"నని
రథగమనవేగమాహాత్మ్యంబు నెప్పుచు ననేక దేశంబులు గడచి చని
యొక్కయెడ నగణ్యపర్ణఫలశాఖాలంకృతంబయిన విభీతకవృక్షంబు
గని; రంత బుతుపర్ణుండు బాహుకున కిట్లనియె. 173

ఆ. "ఎల్ల వారు నెఱుఁగ రెల్ల వానిని; భిన్న
విషయు లెల్ల వారు విద్యలందుఁ;
దొలఁగ కే నెఱుంగుదును దృష్టిమాత్రన
సకల మైన వస్తుచయము సంఖ్య.

వ. ఇవ్విభీతకంబున ఫలవర్ణసముదాయ సంఖ్యఁ జెప్పెద వినుఁ; మీ రెండు
శాఖలంగల పర్ణఫలంబులు పదివేలు నొక్కండు; దక్కిన శాఖలం
గలయవి రెండువేలుం దొంబదే" ననిన బాహుకుండు విని "వీని
నెన్ని కాని నిశ్చయింప నేర"నని తన రథంబు నిలిపి, యా వృక్షం
బాతుణంబ యురులం ద్రోచి, యయ్యైశాఖలం గల యాకులుం
బండులు నెన్నిన, బుతుపర్ణుండు చెప్పినయన్ని యయిన. నచ్చెరువడి
"యివ్విద్య నాకు నుపదేశింపవలయు నని" యడిగిన బుతుపర్ణుం
డిట్లనియె. 175

క. ''ఇది యశ్వహృదయ మనఁగా
విదితం బగు విద్య; దీని విధ్యుక్తముగా
మది నెఱుఁగు నరుఁడు సంఖ్యా
పిదుఁ డగు, దుష్కృతకళంక విషముక్తుఁ డగుఁ. 176

చ. సకలగుణప్రసిద్ధుఁ డగు సర్వహితుం డగుఁ జూవె యంచు బా
హుకునకుఁ బ్రీతితోఁడ విధియుక్తముగా నుపదేశ మిచ్చె న
త్యకుటిలబుద్ధి నశ్వహృదయంబుఁ, గరంబు రయంబుతో విద
ర్భకుఁ జనుపేడ్కఁ జేసి ఋతుపర్ణుఁడు పూర్ణమనఃప్రసన్నుఁ డై. 177

వ. ఇట్లు నలుండు ఋతుపర్ణువలన నశ్వహృదయంబు వడసి, సంతుష్టుండై ''నీకు నశ్వహృదయం బిచ్చెదఁ; బరిగ్రహింపు'' మనిన ఋతుపర్ణుం ''డట్ల చేయుదు; సది యంతకు నీయంద యుండ నిమ్ము; నావలసి నప్పుడు గొందు'' ననియె నంత నయ్యశ్వహృదయ సామర్థ్యంబున నప్పుడు. 178

—: నలుండు గలిచేత విముక్తుం డయి విదర్భకుఁ బోవుట :—

క. నలుఁ దొల్లి యాక్రమించిన
కలి గర్కోటకవిషంబు గ్రక్కుచు నొడలన్
వెలువడి, నలునకు విహితాం
జలియై, త న్నెఱుఁగఁ జెప్పెఁ జంచలుఁ డగుచున్. 179

ఆ. వానిఁ జూచి నలుఁడు దా నల్గి శాప మీ
నున్నఁ, గలి యెఱింగి ''నిన్నుఁ బొందిఁ
యహివిషంబుచేత నసిశంబు దగ్గుండ
నైతి'' నింక నాకు నలుగ వలదు. 180

వ. నిన్నుం గీర్తించిన జనంబులు నావలనిభయంబుఁ బొందరు; నాకుం గరుణింపు'' మనిన నలుండు గోపం బుడిగెఁ; గలియు నవ్విభీతక వృక్షంబు నాశ్రయించె; నది మొదలుగా విభీతకం బప్రశస్తం బయ్యె; నట్లు నలుండు వికృతరూపమాత్రంబు డక్కఁ దక్కిన దుష్కృతంబుల వలన విముక్తుండై, రథం బెక్కి, యతివేగంబున ఋతుపర్ణవార్ష్ణేయ సహితుం డై విదర్భకుం జనియె; నంత సాయాహ్నంబున. 181

క. మానుగ బుతుపర్ణుఁడు భీ
మానుజ్ఞాతుఁ డయి చొచ్చె నా ప్రోలు రథ
ధ్వానంబు ప్రమోయుచుండఁగ
నానాదిఙ్ముఖములఁను ఘనధ్వనివోలెఁ. 182

సీ. దమయంతి యారథధ్వని విని "యిది నలు
రథఘోష"మని యనురాగ మొంది,
నలు, నిషధేశుఁ, బుణ్యశ్లోకు, లోకోప
కారకుఁ జూడంగఁ గాంతు నేఁడు;
ఘనభుజుఁ జూడంగఁ గాననినాఁడుఁ, ద
ద్భుజపరిరంభణోచిత సుఖమునుఁ
బడయనినాఁడును. ప్రాణముల్ విడుతు నే
నని తలంచుచుఁ గమలాయతాక్షి.

ఆ. యారథాధిరూఢుఁ డై వచ్చు బుతువర్ణుఁ
జూచి, యప్పు డధికశోకత ప్త
యగుచు నుండె; నంత నా బుతుపరుండు
భీముఁ గానవచ్చెఁ ప్రియముతోడ. 183

వ. భీముఁడును వానిం బూజించి యొక్క రమ్యహర్మ్యంబున విడియించిన బుతుపర్ణుం డప్పురంబున స్వయంవరం బను శబ్దంబు మొదలుగా వినం గానక యాత్మగతంబున. 184

క. "ధరణీ గల రాజు లిట యె
వ్వరు వచ్చినవారు లేరు; వైదర్భి యెఱఁ
వరియింప నంత ధర్మ్మ
తరచరిత యె?" యనుచు నుండెఁ దద్దయు లజ్జన్. 185

వ. బాహుకుండును రథశాల రథాశ్వంబుల బంధించి, రథసమీపంబున విశ్రమించి యుండె; నంత దమయంతి బాహుక వార్ష్ణేయులతోడ వచ్చిన బుతుపర్ణుం జూచి విఫలమనోరథ యై, యుండనోపక కేశిని యనుదానిం బిలిచి "బుతుపర్ణు నయోధ్యాపతిం గా, వార్ష్ణేయు సూతపుత్రుం గా నెఱింగితి; బాహుకుం డనువాఁ డెవ్వండో? వాని యందు నాహృదయంబు ముదితం బగుచున్నయది; మన పర్ణాదునకుఁ

బ్రతివచనం బిచ్చినవాఁడు వాఁడ కావలయు; వానికడకుం బోయి యెటిఁంగిర'' మ్మని వంచిన నది వోయి బాహుకుం గని, ''దమయంతి నీ కుశలం బడుగఁబు త్తెంచె; నిందుల కేమి కారణంబున వచ్చి?'' తనిన దానికి బాహుకుం డి ట్లనియె. 186

క. "ప్రియమున దమయంతి పున
స్స్వయంవరము సేయఁ గడఁగి సకల భూత్రా
న్వయవీరుల రావించిన
నయనిధి ఋతుపర్ణుఁ డొక్కనాఁటన వేడ్కన్. 187

క. వినవె శతయోజనంబులు
సనుదెంచె నయోధ్యనుండి సరి నిందుల; కా
తని రథసారథివై యే
మను వచ్చితి సతనితో మనోవేగమునన్." 188

వ. అనిన మూఁడవవాఁ డెవ్వఁ డని యడిగిన నక్కేశినికి బాహుకుం డి ట్లనియె. 189

క. "నలు రథచోదకుఁ డతఁ డ
త్యలఘుఁడు వార్ష్ణేయనాముఁ" డనవుడు "వాఁడ
న్నలభూపాలకు పోయిన
వల నొం డెఱుఁగునొకో?" యనిన వాఁ డి ట్లనియెన్. 190

వ. వార్ష్ణేయుండును నలు పుత్రుల విదర్భేశ్వరునొద్దఁ బెట్టిపోయి. నడుమ నలు రాజ్యభ్రంశంబు విని, ఋతుపర్ణుం గొలిచి యుండె; నాతండును నలు నెఱుంగఁడు. 191

క. నలుతో నొక్కట నరిగిన
నలినాయతనేత్ర భీమనందన యొండెన్,
నలుఁడొండె నెఱుఁగుఁగా క
న్నలు నొరులకు నెఱుఁగ గారణముగలదె మహిన్?'' 192

వ. అనిన విని కేశిని యి ట్లనియె. 193

సీ. "అడవిలో వస్త్రార్థహారి యై దయ లేక
ప్రాణేశ్వరుఁడు దనుఁ బాసి చనిన
నాఁటివస్త్రార్థంబు నలినాక్షి యిప్పుడుఁ
బరిధానముగఁ, బాంసుపటలమలిన
మగు చున్న తనువుతో, ననయంబు జడగొన్న
యలకావలులతోడ, నవనితలము
శయనంబుగా, ధర్మచారిణి దమయంతి
యనఘవ్రతం బిట్టు లాచరించు
ఆ. చున్న" దనిన నవిరళోద్గతబాష్పపూ
ర్ణంబు లైన లోచనంబు లెఱుక
వడక యుండ, వదనపద్మంబు వాంచి, తా
నొండువలను సూచుచుండె నలుఁడు. 194

వ. కేశినియును బాహుకు పలుకులు, నాకారంబును దమయంతి కెటింగిం
చిన నది యాతని నలుం గా శంకించి "యింకను వానికడ కేఁగుము;
వాఁడు ఋతుపర్ణ వంటలవాఁడ కె! పచన సమయంబున వాని చరితం
బిమ్ముగా నెటింగి ర"మ్మని పంచిన నప్పుడ చని కేశినియు బాహుకు
నందు దైవమానుషనిమిత్తాద్భుత క్రియలు సూచి వచ్చి దమయంతి
కి ట్లనియె. 195

—: కేశిని యను దూతి దమయంతితో నలుని గుణంబులు సెప్పుట :—

క. "అతని చరితంబు నెప్పఁగ
నతిమానుష, మపగతప్రయాస, మదృష్ట
శ్రుతపూర్వము; పరమార్థమ
యతనిని వే ల్పనఁగ వలయు నంబుజనేత్రా! 196

సీ. వినవమ్మ! తృణమ ష్టిఁ గొని వాఁడు వీచుడు
నం దగ్ని యుదయించి యతనివంట
లమరునంతకు నింధనము లపేక్షింపక
యుడుగక మండుచు నుండు; మటియుఁ

గడకతో నంజళ్లు గడుగంగ సమకట్టి
జల మపేక్షించుడు సంభవిల్లి
కుంభముల్ నిండి దివ్యాంభఃప్రవాహా మ
ఋయ మగుచుండుఁ దత్క్షణమ చూడ;
ఆ. సతని కరతలద్వయావమర్దితము లై
కందియును, మహాసుగంధకుసుమ
తతులు దొంటియట్ల తమ కంపు విడువక
యుండు, నతని తేజ మున్నతంబు". 197

వ. అనిన విని దమయంతి వెండియుఁ గేశినిం బంచి, బాహుకు వండిన నఁజుళ్ళు దెప్పించి, యాస్వాదించి, బాహుకునందు నలు లక్షణంబులు గలుగు టెఱింగియు నూఱడ నోపక వానిపాలికిఁ గొడుకునుం గూఁతునుం గేశినితోడం బుచ్చిన నక్కు-మారులం జూచి. 198

ఆ. వశముగాక బాష్పవారి యొల్కుచునుండఁ
గొడుకుఁగూఁతు నెత్తికొని నలుండు
హర్షపులకితంబు లయిన నిజాంకంబు
లందు వారి నునిచి యాదరమున. 199

వ. అక్కేశినిం జూచి "యిక్కు-మారు లిద్దఱు నా కొడుకునుం గూఁతునుం బోలిన, వీరి నెత్తికొని దుఃఖించితి" నని తన్నేర్పడకుండం బలికి దాని కిట్లనియె. 200

క. "నీ విట పలుమఱు పచ్చుచుఁ
బోవుచు.నున్కి గని చిత్తముల నొండుగ సం
భావింతు రితరజనములు;
గావున రా వలవ దింకఁ గార్యార్థినివై. 201

వ. ఏము దేశాంతరంబుననుండి వచ్చిన యతిథులము; నీకు మాతోడి దేమి?" యనినఁ గేశిని గ్రమ్మఱి వచ్చి బాహుకుమార్గం బంతయు దమయంతికిం జెప్పిన నది సంతసించి నిజజనని కిట్లనియె. 202

ఉ. "సందియ మేల? సర్వగుణసంపదఁ జూడఁగ బాహుకుండు భూ
పందితుఁ డైన నైషధుఁ డవశ్యముఁ దా నగు; నామనంబు నా

నందముఁ బొందు చున్నది ఘనంబుగ; వాఁడిట వచ్చువాఁడొ, యే
నందుల కేగుదాననొ రయంబున నాతని నిశ్చయింపఁగన్." 203

వ. అనిన నది యప్పుడ భీము ననుమతంబున దమయంతి యొద్దకు
పాపకు రావించిన. 204

క. చనుదెంచి, యందు దీనా
ననఁ, నవిరళపంకమలిన నతగాత్రఁ, దప
స్వినిఁ, నతికృశ దమయంతిం
గనియె నలుం డుదితబాష్పకణకలితముఖున్. 205

క. దమయంతి నలుని వికృతాం
గముఁ జూచియు నతని నన్యఁ గా వగవక, నె
య్యమునను, లజ్జను, నతిసం
భ్రమమున వివశాత్మ యగుచుఁ బతి కిట్లనియెన్. 206

వ. "విజనం బైన విపినంబునందు నలసి నిద్రవోయిన దాని, నబల, నతి
సాధ్వి, ననుగ్రత నగ్నిసన్నిధిఁ బాణిగ్రహణవిధిలబ్ధ యైనదానిం బాసి
నలుస ట్లొరులు నిర్దయులై యరిగినవారు లేరు. 207

క. సురవరులఁ దొఱఁగి తన్నున్
వరియించితి; నన్నుఁ బుత్రవతి నేలోకొ చె
చ్చెర విడిచె; నాతనికి ని
ష్కరుణున కే నేమి యెగ్గు గావించితినో? 208

వ. నిన్ను విడువ; నోడ కుండు మని పలికిన యప్పలుకు లేల మఱచెనో"
యని శోకతప్తంబైన తన హృదయంబు దడుపుచున్నదియునుం
బోలె బాష్పధారలం గుచమండలంబు దడుపుచు నున్న దమయంతిం
జూచి శోకాకులుండై నలుండి ట్లనియె. 209

తే. "కలిసమావిష్టవతి నయి కష్టవృత్తి
నట్టియిడుమలఁ బడితి నే; నవి మదీయ
తపము బలమున, నీ దుఃఖదాహమునను
నష్టమైపోయెఁ; గలి యిప్డు నన్ను విడిచె. 210

వ. ఏ నిందులకు నీతదర్థంబు వచ్చితి; నది యట్లుండె; నన్ను ననురక్తు, ననువ్రతుఁ, దలంపక యన్యాపేక్షం బునస్స్వయంవరంబు రచియిం చుట యిది కులస్త్రీ ధర్మంబుగాదు; రాజుల నెల్ల నీ స్వయంవరంబు నకు రావించుటంజేసి కాదె బుతుపర్ణుండు వచ్చె" ననిన వెఱచి కృతాంజలియై దమయంతి యి ట్లనియె. 211

తే. "నిన్ను రోయంగ విప్రులు నెమ్మి నరిగి
పలికి రెల్లచో నాచేతఁ బలుకఁబడియ;
యందుఁ బర్ణాదుఁడను విప్రుఁడయ్యయోధ్య
కేఁగి ప్రతివచనంబుల నెఱిఁగె నిన్ను.

వ. ఆ పర్ణాదువలన ని న్నెఱింగిన దాననై నిన్నిట రావించు నుపాయంబు దలంచి యెల్లి దమయంతీ ద్వితీయ స్వయంవరం బగు నని బుతుపర్ణ నందుఁ బ్రకాశింప సుదేవుం డను బ్రాహ్మణుం బు త్తెంచితి. 213

క. నరవరుఁడు నలుఁడు గా కే
వ్వరు శతయోజనము లొక్కవాసరమున న
త్తురు నరు లొరు; లని దీనిం
బరికింపఁగ గడఁగి యిట్టు పంచితి నధిపా! 214

ఉ. ఏ నతిపాపభావమును నెగ్గుఁ దలంపక యుండునట్లుగా
నానతవైరి! నీయడుగు లంటఁగ నోపుదు; నట్టిదైన న
న్నీనలినాప్తుఁడీ, యనలుఁ, డీమృగలాంఛనుఁ, డీసురో త్తముల్,
జాను సెడంగ నీపణమ చంపరె కోపపరీతచిత్తు లై?" 215

వ. అనుచున్న యవసరంబున నఖిలభూతాంతర్గతుఁడయిన వాయుభట్టార కుం డెల్ల వారలు విన నాకాశంబుసనుండి నలున కి ట్లనియె. 216

చ. "అమలచరిత్ర నిట్లు దమయంతిఁ బతివ్రతఁ బల్కదే? నృపో
త్తమ! విను; దీనియందు విదితం బగు శీలవిధిఁ సుధాంశుఁడుం.
గమలహితుండు, నేను నయి కాచితి మొక్కట మూఁడువర్షముల్;
గొమరుగఁ దీనిఁ జేకొనుము; కోమలి నీ కనురక్త" నావుడున్.

క. కురిసె మరుద్వచనానం
తరమున సురపుష్పవృష్టి; గడయక మ్రోసెఁ.
సురదుందుభినాదఁబులు;
కరము ప్రసన్నుఁడయి వీచె గంధవహుండుఁ. 218

వ. ఇ ట్లెల్లవారికి నాశ్చర్యంబుగా వాయుదేవుండు ద న్నెఱింగించి దమ
యంతి పతివ్రత తాగుణంబులును, బతియందలి యకృత్రిమానురాగం
బునుం జెప్పిన విని నలుండు పరమప్రమోద పరిపూర్ణ హృదయుండై,
తత్క్షణంబ కర్కోటకుం దలంచి, వాని యిచ్చిన పుట్టంబు పైఁ బెట్టి
కొని, నిజరూపంబుదాల్చిన. 219

—: నలుండు నిజరూపంబుతో దమయంతిం గూడుట :—

ఉ. ఆయతబాహుఁ, డ ప్తకనకాంచితవర్ణు, మనోజరూపు, నిం
ద్రాయితు, సూర్యతేజు, నిషధప్రభు, నన్నలుఁ జూచి పద్మప
త్రాయతనేత్ర యప్డు దమయంతి గరంబు ముదంబు నొంది ల
జ్జాయుత యయ్యె బంధులకు మిత్రులకుఁ హృదయ ప్రియంబుగన్.

వ. ఇట్లు సంగతు లైన యయ్యిరువురకు విరహపరితాపంబుతోడన శరీర
మలినత్వంబు వాసెఁ; బరస్పరానురాగంబుతోడన విభూషణ శ్రీవిశేష
విలేపన యోగంబులు విస్తరిల్లె; నంత నంతయు విని భీముండు జాత
సస్యమైన వసుధ తోయసంప్రాప్తి నాప్యాయితయైన ట్లజ్ఞాతచర్యుం
డైన తన పతిం బడసి పరమ సంతుష్టహృదయయై చంద్రుతోఁ
గూడిన రోహిణియుం బోలెఁ బతిం గూడి యెప్పుచున్న దమయంతిం
జూచి సంతసిల్లి తన పురంబునం దష్టశోభనంబులు. దేవగృహంబుల
యందు విశేషపూజలు సేయించె; నట్టి మహోత్సవం బెఱింగి ఋతు
వర్ణుండు నలు నొద్దకు వచ్చి " నీవు నిఖిలలోక పూజ్యుఁడ వయ్యును
నాయొద్ద బాహుకుండనంగాఁ బ్రచ్ఛన్నప్రవృత్తి నున్న నిన్ను నెఱుం
గక నీచకర్మంబులందు నియోగించితి; దీని క్షమియించునది" యని
నలుచేత సత్కృతుండై, యశ్వహృదయోపదేశంబుగొని, యయో
ధ్యకుం జనియె; నిట నలుండును విదర్భాపురంబున నొక్క మాసంబు
నివాసంబు సేసి, విదర్భేశ్వరు వీడ్కొని, దమయంతి నంద పెట్టి,

యొక్క రథంబును, బదియూ ఱేనుంగులును, నేఁబది గుఱ్ఱంబులు, నాఱునూఱు కాల్బలంబులుఁ బనకుఁ దోడుగా నిషధపురంబున కరిగి పుష్కరుం గని యి ట్లనియె. 221

క. దమయంతి రోయిగా జూ
దము నీతో నాడఁ గడఁగెదను; ధరణీ రా
జ్యము నీవు నాకు రో యిడు;
మమరఁగ జూదంబు నీకు నభిమత మేనిన్. 222

మత్తకోకిలము. పీరభోజ్యము సుమ్ము రాజ్యము; వించె ? నీవను, నేను దు
ర్వారవృత్తి రథంబు లెక్కి యవంధ్యవిక్రమ మేర్పడఁ
భూరివీరరణం బొనర్తము; పోర నోర్చినవాఁడ యి
ద్ధారుణీతలరాజ్యసంపదఁ దాల్చు పీరగుణోన్నతిన్. 223

వ. ఈ రెంటిలో నీ కెయ్యది యిష్టంబు ? దానిన కడంగు" మనినం బుష్క
రుండు రణంబునందుఁ బరాజితుండు గావున, నలుం దొల్లియు
జూదంబున నొడిచినవాఁడె , యింకను నొడిచి దమయంతిం జేకొని
కృతార్థుండ నగుదు నని సంతసిల్లి, యే నోటువడితినేని నిఖిల మహీ
రాజ్యంబు నీయది; నీ వోటుపడినేని దమయంతి నాయది" యని
పలికి యొడ్డి నలుతో జూద మాడి యోటుపడిన. 224

క. ఘనముగ జంబూద్వీపం
బునఁ గలవా రెల్ల నెఱుఁగఁ బుష్కరుచేతం
గొనియెఁ బునర్ద్యూతంబున
ననఘుఁడు నలుఁ డఖిలరాజ్య మత్యున్నతితోఁ. 225

వ. ఇట్లు జూదంబునఁ బుష్కరు నొడిచి సకల మహీరాజ్యంబును జేకొని
నలుండు వాని కిట్లనియె. 226

క. "కలిసంప్రాప్తుఁడ నై కడు
బల మటి నీచేతఁ దొల్లి బలవద్ద్యూత
చ్ఛలజితుఁడ నైతి; నది నీ
బల మని గర్వింపవలదు బలవంతుఁడ వై. 227

వ. నీవు నా పితృవ్యపుత్రుండవు; ని న్నెద్దియుం జేయనోపఁ; బో " మ్మని పుష్కరు విడిచి పుచ్చి పుష్కలం బైన రాజ్యంబుతో నలుం డున్నంత. 228

క. భీమప్రస్థాపిత యయి
కోమలి దమయంతి పుత్రకులుఁ దానును ల
ఘీమహిమ వెలుఁగుచుండఁగఁ
దామరసదళాక్షి వచ్చె దన పతికడకుఁ. 229

వ. అట్లు దన మనోవల్లభ యైన దమయంతిం గూడి నలుండు విధివిహితా నేకాచరిత మఖుం డై శతమఖు విలాసంబుతో సకలరత్నయుతం బైన రత్నగర్భాధిరాజ్యంబుసేసెఁ; గావున నక్షజితుండ నైతి నని వగవ వలదు; నీవును దైవమానుష సంపన్నుండ వయి శత్రువుల జయించి సకలమహీసామ్రాజ్యంబు వడయుదు" వని బృహదశ్వుండు ధర్మజునకు నక్షహృదయం బుపదేశించి. 230

సీ. "ఇన్నలోపాఖ్యాన మెప్పుడు దత్తావ
ధాను లై వినువారుఁ దవిలి సభలఁ
జదివెదువారును. జగతీశ ! కలిదోష
నిర్ముక్తు లగుదురు; నిఖిలపుణ్య
ఫలభాగు లగుదురు; బహుపుత్రపౌత్రాయు
రారోగ్యధనయుక్తు లగుదు; రెల్ల
విషములకును, దుష్టవిషయంబులకు దూరు
లగుదురు; ధర్మాత్ము లగుదు రుర్వీఁ;
ఆ. గడుఁ బ్రసిద్ధ మిదియుఁ గర్కోటకుని, దమ
యంతిఁ, బుణ్యమూర్తి యైన నలుని,
ఋజుచరిత్రుఁ డైన ఋతువర్ణుఁ గీర్తింపఁ
గలిభయంబు లెల్లఁ గ్రాఁగు నధిప !" 231

—: ధర్మరాజునొద్దకు నారదమహాముని వచ్చుట :—

వ. అని చెప్పి బృహదశ్వుం డరిగినం బాండవులు గాండీవిరాకయ
కోరుచుఁ దదాలోకనప్రీతి నుండునంత నంతరిక్షం బెల్లఁ దన తేజం

బున వెలుంగుచుండ నారదుండు వచ్చి యనుజసహితుండైన ధర్మ
రాజు చేతం బూజితుండై యిట్లనియె 232

ఆ. "ధర్మపుత్ర! నీయుదారచరిత్రకు
ధర్మమతికిఁ దృప్తతముఁడ నైతి;
నడుగు మిష్ట మెద్ది" యనినఁ గృతాంజలి
యై మహీశుఁ డిట్టు లనియె భక్తి. 233

వ. "మునీంద్రా! నీపు తృప్తుండ వైనం ద్రిజగంబులకుం దృప్తి యగు;
నిన్ను జూచి కృతార్థుండ నైతి; నా కెప్పుడు నొక్క ధర్మసందే
హంబు గలదు; దాని నిర్ణయించి యానతీవలయు. 234

చ. ధరణిఁ ద్రిదక్షిణంబుగ ముదంబునఁ ద్రిగుమ్మరి, తీర్థసేవనా
పరు లగుచున్నధన్యులు శుభస్థితి నెట్టిఫలంబు నొందఁ గాం
తురు? బహుతీర్థకీర్తనముతో నెటిఁగింపుము దీని"నావుడున్
సరవరుఁ డైన పార్థునకు నారదుఁ డిట్లని చెప్పెఁ ద్రీతితోఁ. 235

క. "ధీరుఁడు భీష్ముఁడు గంగా
ద్వారమునం దొల్లి పితృహితంబుగ శుభక
ర్మారంభుఁ డగుచు నుండె ను
దారుం డధ్యయనసంతతవ్రతపరుఁ డై. 236

వ. అతని పితృదేవతాభక్తికిఁ, బరమధర్మ చరితంబునకు మెచ్చి తద్ధర్మ
నాపేతుం బులస్త్యుం డను మహాముని వచ్చిన నతిభక్తుం డయి
యా భీష్ముఁ డమ్మునిఁ గుశ పీఠంబున నునిచి, యర్ఘ్యపాద్యాది
విధులం బూచించి, యతని యడుగులు తలనిడుకొని, దక్షిణజాను
స్పృష్టమహీతలుం డయి "యేను భీష్ముండ; భవద్దాసుండ"నని
ముకుళితహస్తుం డయి యున్న వానిఁ బులస్త్యుం డి ట్లనియె. 237

క. "పితృదేవభక్తిఁ బుణ్య
వ్రతచర్యను నీవ యెల్లవారికి నత్యు
న్నతుఁడవు; గావున నీచే
ధృతిఁ గానఁగఁబడితి నేఁ ద్రిభీపకులేశా! 238

వ. నీయిష్టంబు సెప్పు; మే నమోఘకర్మనుండ" ననిన భీష్ముండు ముదిత
హృదయుం డై "మునీంద్రా! నాయందు నీకుఁ బ్రసాదబుద్ధి
గలదేనిఁ జెప్పు"మని. 239

క. మనుజేంద్ర! నన్ను నీయడి
గినయట్లు పులస్త్యుఁ బుణ్యకీర్తను గంగా
తనయుం డడిగిన, నతనికి
నసఘచరిత్రునకు నిట్టు లని ముని సెప్పెన్. 240

సీ. "కడఁగి బుద్ధీంద్రియ కర్మేంద్రియంబుల
యందు సంయతచిత్తు లైనవారు,
ధృతి నహంకారప్రతిగమోపేతుల
యందు నివృత్తాత్ము లైనవారు,
నల్పభోజనులు, ననారంభకులు నయ్య
నత్యంతసంతోషు లైనవారు,
సత్యవ్రతులు, శుభాచారు, లక్రోధను
లగుచు ధర్మాన్వితు లైనవారు,

ఆ. నఖిలతీర్థశతము లాడిన ఫలములు,
నఖిలయజ్ఞవిధుల నైనఫలముఁ
బడయుదురు : విహీనభాగ్య దుష్కృతులకుఁ
బరమతీర్థనేవఁ బడయ నగునె ? 241

క. తిల గో సువర్ణదానం
బులు, నుపవాసములుఁ, దీర్థముల సేవయు ని
మ్మలఁ జేయనివారు దరి
ద్రులు రోగులు నగుదు రాత్మదోషముచేర్మిన్, 242

క. క్రతుఫలములు వడయఁగ దు
ర్గతులకు దొరకొనదు, తీర్థగమనంబునఁ ద
త్క్రతుఫలము లందుదురు దు
ర్గతులును ; నిది మునుల మతము గౌరవ వృషభా!

వ. తీర్థగమనఫలం బెల్ల పుణ్యంబులకు విశేషంబు ; దీని వినుము. 244

చ. నమితవిరోధి ! పుష్కర మనంగ జగద్విదితంబు పుణ్యతీ
ర్థము మునిసిద్ధసేవ్యము ; ముదంబున నందుఁ బయోజసంభవుం
డమరులతోడ సన్నిహితుఁ డై వసియించుఁ ; ద్రిపుష్కరంబులుఁ
సమములు ; వాని నెప్పుడును సంస్మృతి సేసినఁ బాయుఁ బాపముల్ .

క. పదివేలకోట్లతీర్థము
లుదితము లై పుష్కరముల నుండు ; మునీంద్ర
త్రిదశవరు లందుఁ జేసిరి
మదిఁ గృతకృత్యు లయి తపము మఖములుఁ బ్రీతిన్ . 246

వ. అందుఁగృతస్నాను లై దేవర్షిపితృతర్పణంబులు సేసినవారు దశాశ్వ
మేధఫలంబులు వడయుదురు ; కార్తిక మాసంబున నొక్క దివసంబు
పుష్కరసేవ సేయుటయు నొకయేఁ డగ్నిహోత్రంబు వేల్చుటయు
సమంబు. 247

క. అమరవరులందు ; బురుషో
త్తముఁ డెట్లు విశేషుఁ, డట్ల ధరణిం గల తీ
ర్థములందుఁ బుష్కరత్రిత
యము గరము విశేష మభిమతార్థప్రద మై. 248

వ. పుష్కరంబునఁ బదియేండ్లు వసియించినవారికి సర్వక్రతుఫలంబును,
బ్రహ్మలోక ప్రాప్తియు నగు ; మఱియు జంబూమార్గంబు, దండులి
కాశ్రమంబు నగస్త్యవటంబును తీర్థంబు లాడి యశ్వమేధఫలంబు వడ
యుదురు ; కణ్వాశ్రమంబును. ధర్మారణ్యంబును, యయాతి పత
నంబునుం జూచిన సర్వపాపక్షయం బగు ; మహాకాళంబును, గోటి
తీర్థంబును నశ్వమేధఫలప్రదంబులు ; రుద్రవటం బను రుద్రస్థానంబున
రుద్రుం బూజసేసి గణపతిత్వంబు వడయుదురు ; నర్మదాస్నానంబున,
దక్షిణ సింధుస్నానంబునఁ, జర్మణ్వతీతీర్థస్నానంబున నగ్నిష్టోమఫలంబు
లగు. 249

క. అసవద్య వసిష్ఠాశ్రమ
మున నొకదివసంబు శాకమూలాశను లై
జను లుండి పడయుదురు బహు
ధనసంపద, గోసహస్రదానఫలంబుల్ . 250

వ. మటీ పింగం బను తీర్థంబు సేవించి శతకపిలగోదానఫలంబు వడయుదు; రెండేని నగ్నిదేవుండు ప్రత్యక్షం బైయుండు, నట్టి ప్రభాసతీర్థం బాడి యగ్నిష్టోమాతి రాత్రఫలంబు పడయుదురు; దుర్వాసునకు విష్ణుదేవుండు వరం బిచ్చుటంజేసి వరదానం బనం బరంగిన తీర్థం బాడియు, సరస్వతీసాగరసంగమం బాడియు గోసహస్ర దానఫలంబు వడయుదురు. 251

క. ద్వారవతీపురమునఁ బిం
డారక మను తీర్థమున బెడం గై ముద్రా
కారంబు లై త్రిశూలా
కారము లై పంకజములు గానంగఁబడున్. 252

వ. అందుఁ బరమేశ్వరుం బూజించి పాపవిముక్తు లగుదురు; సాగరసింధు సంగమ స్నాతు లైన వారు వరుణలోకగతు లగుదురు; శంకుకర్ణేశ్వరంబున నీశ్వరుం బూజించి దశాశ్వమేధఫలప్రాప్తు లగుదురు; వసుధారయును, వసుసరంబు నను తీర్థంబులాడి వసుప్రాప్తు లగుదురు; సింధూత్తమస్నానంబున బహు సువర్ణదాన ఫలం బగు; బ్రహ్మతుంగ సేవనంబున బ్రహ్మలోకప్రాప్తి యగు; శక్రకుమారీవిలోకనంబున శక్రలోకగతి యగు; శ్రీకుండంబునఁ బితామహునకు నమస్కరించి యు, సౌవర్ణరాజతంబు లైన మత్స్యంబులు గల విమలఁ బను తీర్థం బాడియు వాసవ సాయుజ్యంబు పడయుదురు; బడబ యను తీర్థంబున నగ్ని దేవునకు నైవేద్యంబిచ్చిన సది యక్షయం బై పితృదేవతలకుఁ దృప్తిఁజేయు; గోసహస్రదానంబునకు నశ్వమేధ సహస్రంబునకు విశేషంబు. 253

క. దేవిక యను తీర్థంబునఁ
దేవసమూహంబుతోడఁ ద్రినయనుఁ డుండున్;
సేవిత మై జనులకు నది
గావించు ననూనధర్మ కామార్థంబుల్. 254

వ. అర్ధయోజనవిస్తృతం బై, పంచయోజనాయామం బైన యద్ధేవికానదియును, గామాఖ్యంబును, రుద్రతీర్థంబును, యజనయాజన బ్రహ్మవాలుకంబులును, బ్రహ్మాది దేవతల దీర్ఘసత్రస్థానం బైన

దీ ర్ఘసత్రస్థానంబును, సేవించినవారికి నిష్టసిద్ధి యగు; వినశనం బను తీర్థంబున నదృశ్యం బై, మేరువునకుం బోవునెడ నాగోద్భేదశివోద్భేద చమసోద్భేగంబుల నెందేని సరస్వతి గానంబడియె నట్టి సరస్వతియందు నభిషిక్తులై న వారు నాగలోకంబు వడయుదురు; శశరూపపుష్కరంబులు గల శశ యానం బను తీర్థంబున స్నానంబును గోసహస్రదానంబును సమంబు.

మధ్యాక్కర. ఏ మేమ మున్ను పూజింపుదుము రుద్రు నిం దని వేడ్కతో మునికోటి చా రున్న నీకుఁ డందొఱకును బ్రీతిగా మతితోఁ గోటిరుద్ర రూపముల్ గావించె; నదియు భూమిఁ బ్రసిద్ధ మై రుద్రకోటి నాఁ బొలిచి వెలింగె.

వ. అందుఁ రుద్రుఁ బూజ సేసి రుద్రలోకప్రాప్తు లగుదురు. 257

క. నరనుత! నై మిశమునఁ బు
ష్కరమ ల మూఁటను జగత్ప్రకాశిత మై యి
ద్ధరణిఁ గురుక్షేత్రము దు
స్తరదురితౌఘముల కెల్ల ది వ్యగు చుండున్. 258

తే. అమరలోకనివాసుల యంద్రు పిబుధు
లా కురుక్షేత్రవాసుల; నదియు పినఁగ
నుత్తమంబు దృషద్వతి యుత్తరమునఁ,
దపనతేజ! సరస్వతి దక్షిణమున. 259

వ. అక్కురుక్షేత్రశమంతపంచకంబుల నడుమ రామహ్రదంబు నడుమఁ బితామహు నుత్తరవేది యనంబడు నట్టి కురుక్షేత్రంబు ముట్టిన వారికిఁ; గురుక్షేత్రంబునకుం బోయెద మనినవారికిఁ, గురుక్షేత్రంబున వసియించెద మని తలంచినవారికి సర్వపాపక్షయం బగుఁ; దదనంతరంబున విష్ణుస్థానంబున విష్ణువు నర్చించిన నశ్వమేధ ఫలం బగుఁ; ద్వారిప్లవం బను తీర్థమాడి యగ్నిష్టోమఫలంబు వడయుదురు; పృథివీతీర్థంబాడిన గోసహస్రదానఫలం బగు; శాలూకిని యను తీర్థం బాడిన దశాశ్వ మేధఫలం బగు; సర్పతీర్థం బాడి, యందుఁ దరండకుండను ద్వారపాలకునిం జూచినవారి కిష్టసిద్ధి యగు; నెందేని విష్ణుండాదివరాహం బయ్యె, నట్టి వరాహతీర్థం బాడినవారికి నగ్ని

ష్టోమఫలం బగు; నశ్వినీతీర్థం బాడిన రూపవంతు లగుదురు ; జయంతి
యందు సోమతీర్థస్నానంబును, గృతశౌచతీర్థస్నానంబును, రాజ
సూయ పౌండరీకసమంబు; లగ్ని వటంబున, ముంజవటంబున నీశ్వరుం
బూజించి గాణపత్యంబు వడయుదురు; యక్షిణితీర్థ మాడి యిష్ట
ఫలంబులు వడయుదురు; కురుక్షేత్రద్వారంబుఁ బ్రదక్షిణంబు సేసినం
బాపత్రయం బగు 260

క. వీరుండు క్షత్త్రియులఁ దన
దారుణపరశువున జామదగ్న్యుఁడు రౌద్రా
కారుఁడు వధియించి దదీ
యారుణమున నేను మడువు లాపాదించెన్. 261

వ. అందుఁ బితృతర్పణంబు సేసినం బిత్రదేవత లాతనికిం బ్రత్యక్షం
బయి, నీ కిష్టంబైన వరంబు వేఁడు మనినఁ, బరశురాముండు వారల
కిట్లనియె. 262

తే. "క్షత్త్రివధ నైన పాపంబు ప్రాఁగ వలయుఁ;
గడఁగి సద్గతియును నాకుఁబడియవలయు;
నివియుఁ బుణ్యతీర్థంబు లై యిద్ధరిత్రి;
బరఁగుచుండంగ వలయు మీ కరుణఁజేసి." 263

వ. అని పితృదేవతల వగంబునం బుణ్యతీర్థంబులఁ జేసె; నట్టి రామ
హ్రదంబు లాడిన వారికి నశ్వమేధఫలం బగుఁ; గాయశోధనం బను
తీర్థంబాడి కాయశుద్ధు లగుదు; రెందేని విష్ణుదేవుండు లోకంబుల
నుద్ధరించె నట్టి లోకోద్ధారం బను తీర్థ మాడి ఫలం బుద్ధరింతురు;
శ్రీతీర్థం బాడి శ్రీమంతు లగుదురు; కపిలతీర్థం బాడి కపిల గోస
హ్రదాన ఫలంబుఁ బడయుదురు; సూర్యతీర్థంబాడి యం దుపవసిం
చిన సూర్యలోక ప్రాప్తు లగుదురు; గోభవనం బను తీర్థం బాడి
గోసహస్రసమృద్ధు లగుదురు; శంఖినీతీర్థం బాడి యుత్తమరూపంబు
వడయుదురు; యక్షేంద్ర తీర్థం బాడి తరండకుం డను ద్వారపాలకుం
జూచినవారు, సరస్వతీస్నాతు లైన వారు నగ్నిష్టోమ ఫలంబు
వడయుదురు; మాతృతీర్థదర్శనంబునం బ్రజావృద్ధి యగు; బ్రహ్మ

వర్తంబును, శరవణంబునుం జూచిన సర్వవ్యాధివిముక్తులగుదురు; శ్వావిల్లోమాపహంబను తీర్థంబునం దేకాదశతీర్థంబులు గల; వందుఁ బ్రాణాయామంబు సేసిన విప్రులకు స్వలోమాపనయనం బగు; నెఱుకుచేత నేయంబడి కృష్ణమృగంబు లెందేని నొక్క తీర్థంబు సొచ్చి మానుషత్వంబు వడిసె, నట్టి మానుషతీర్థం బాడి సర్వదురిత వినుక్తులై, దేవత్వంబు వడయుదురు; దాని తూర్పున నొక్క యిరవున నాపగయను మహానదిం బితృతర్పణంబు సేసి పితృదేవో. ద్దేశంబున నొక్క బ్రాహ్మణునకుం గడువం బెట్టినఁ గోటి బ్రాహ్మణులు గుడిచిన ఫలం బగుఁ; బితృదేవతలు దృప్తియు నొందుదురు; బ్రహ్మోదుంబరంబు, సప్తర్షికుండంబుఁ, గేదారంబును జూచి బ్రహ్మలోకంబు వడయుదురు; కపిలకేదారంబుఁ జూచి పాపవిముక్తులై యదృశ్యులగుదురు; నరకం బను తీర్థం బాడి, కృష్ణచతుర్దశినాఁ డీశ్వరుం బూజించి యెల్లకోర్కులం బడయుదురు; మూఁడు కోట్ల కూపహ్రదంబులు గల యిలాస్పదంబను తీర్థం బాడి పితృతర్పణంబులు సేసినవారికి వాజపేయఫలం బగుఁ; గిందాన కింజప్యంబు అను తీర్థం బులందుఁ జేసిన దానజపంబు లక్షయంబు లగు; నారదతీర్థంబైన యంబాజన్మంబునందుఁ బ్రాణత్యాగంబు సేసినవారు సర్వలోకంబులం బడయుదురు; శుక్లదశమిం బుండరీకంబను దీర్థంబాడి పౌండరీక ఫలంబు వడయుదు; రందు వైతరణిస్నాతులై రుద్రునకు నమస్కరించి సర్వపావవిముక్తులగుదు; రెందేని దేవత లనేక సహస్రవర్షంబులు దపంబుసేసి గట్టి ఫలకీవనం బను తీర్థంబాడి యగ్నిష్టోమాతిరాత్రఫలంబులు వడయుదురు; ద్వైపాయనుం డనేక తీర్థంబులు మిశ్రీకరించుటంజేసి మిశ్రకం బనం బరఁగిన తీర్థంబాడినవారికి సర్వతీర్థస్నాన ఫలం బగు; వ్యాసవనంబును, మనోజవంబును, మధువటియు నను తీర్థంబుల నాడిన గోసహస్రదానఫలంబు వడయుదురు; కౌశికీ దృషద్వతీసంగమంబున స్నాతులై సర్వపాపవిముక్తు లగుదురు; కిందత్తంబునఁ దిలప్రస్థదానంబు సేసి పితరుల ఋణంబు నీఁగుదు; రహస్సుదినతీర్థంబుల నాడి సూర్యలోకప్రాప్తులగుదురు; మృగధూమంబున గంగాస్నాతు లై మహాదేవు నర్చించిన మహాత్మ లశ్వ

మేధఫలంబు వడయుదురు; వామనం బను తీర్థబాడి, వామను నర్చిం చినవారు విష్ణులోకప్రాప్తులగుదురు; పావనం బను తీర్థంబాడి కులంబు పవిత్రంబు సేయుదురు; శ్రీకుంజంబున సరస్వతీస్నాతులై యగ్ని ష్టోమఫలంబు వడయుదురు; ఋషు లెందే నుండి యాత్రాపరులై కురుక్షేత్రంబునకుం బోదు. రట్టినై మిశకుంజం బాడి ఋషితృప్తి సేయుదురు; బ్రహ్మతీర్థం బాడి వర్ణాంతరులు బ్రాహ్మణులగుదురు; బ్రాహ్మణులు బ్రహ్మలోకప్రాప్తులగుదురు. 264

సీ. అనఘుఁడు మంకణుం డను నొక్క బ్రహ్మర్షి
తన చేయి వ్రయ్యంగ దర్భఁ గొనిన,
సాంద్రమై శాకరసం బందు నిర్గతం
బగుడును హర్షించి యాడుచున్నఁ
జూచి, సహింపక సురలును మునులును
హరుపాలి కరిగి, "దేవాదిదేవ!
మునివృత్త మేవిధంబున నివృత్తం బగు
నట్లుగాఁ జేయవే" యనిన హరుఁడు

ఆ. దపసిరూప మపుడు ధరియించి, యమ్మునిఁ
కడకు వచ్చి, "యేమి కారణమున
నాడె? దేమి విస్మయం బిందుఁ జూచితి?
చెప్ప నుచిత మేనిఁ జెప్పు" మనిన. 265

వ. "నాకరంబున శాకరసంబు వెలువడిన విస్మితుండ నయి హర్షించి యాడెద" ననిన "నిది యేమి విస్మయంబు? దీనిం జూడు" మని హరుండు తన యంగుష్ఠంబున నంగుళి తాడనంబు చేసిన, నందు భ్రామ సన్నిభం బయిన భస్మంబు వెలువడినం జూచి, లజ్జితుండయి, "నీవు పరమేశ్వరుండ" వని నమస్కరించి, వేదమంత్రంబుల స్తుతియించి, "దేవా! నీ ప్రసాదంబున నాకుఁ దపోవర్ధనంబు గావలయు" ననిన నమ్మునివరునకు నీశ్వరుండు గరుణించి "నీకుఁ దపోవర్ధన మగు; నేను నీ యాశ్రమంబున నుండుదు" ననియె; నట్టి సప్తసారస్వతతీర్థంబులాడిన వారికిసారస్వతసిద్ధి యగు; బ్రహ్మాది దేవతలచే నధిష్ఠితంబులయిన యౌశనసతీర్థంబును, గపాలమోచనంబు, విశ్వామిత్రంబుఁ, గార్తికేయంబునని యెడు తీర్థంబుల నాడి పాపవిముక్తు లయి, బ్రహ్మలోకంబువడయుదురు. 266

క. వేదములయందు వినఁగఁ బృ
థూదకతీర్థంబ యుత్తమోత్తమము, సురేం
ద్రాదిసురవరులకును, వ్యా
సాదిమహాయోగివరుల కాస్పద మగుటఁ. 267

వ. అందు శరీరత్యాగంబు సేసినవార లపారపాపవిముక్తులై ముక్తులగుదురు; సురకన్యాసరస్వతీసంగమస్నాతు లయినవారు బ్రహ్మహత్యాదిపాతకంబులవలనఁ బాయుదురు; దర్భినిర్మితం బయిన యర్థకోలతీర్థం బాడిన శూద్రులు బ్రాహ్మణు లగుదురు; బ్రాహ్మణులు పరమసిద్ధులగుదురు; శతంబును, సహస్రంబు నను తీర్థంబు లందుఁ జేసిన జపదానోపవాసంబులు శతసహస్ర గుణంబు లగు; వేల్పు లెల్లం గుమారుసేనాపతింగా నెండే నభిషేకించి, రట్టి తేజసంబను తీర్థంబును, దానితూర్పున నుండు కురుతీర్థంబును, స్వర్గద్వారం బను తీర్థంబును, జూచినవారికి స్వర్గ ద్వారంబు వివృతంబగు; రుద్రపత్ని యను తీర్థంబున శంకర నారాయణుల నర్చించి సర్వదుఃఖవిముక్తు లగుదురు; స్వస్తిపురంబుఁ బ్రదక్షిణంబు సేసి గోసహస్ర దానఫలంబు వడయుదురు; గంగమడువున నొక్క కూపంబున మూఁడుకోట్ల తీర్థంబులు సన్నిహితంబు లయియుండు; నందుఁ గృతస్నానులయినవారికి సర్వతీర్థస్నానఫలం బగు; బదరీవనంబునందు, వసిష్ఠాశ్రమంబునం ద్రిరాత్రంబులు బదరీఫలభక్షణంబుసేసి పాపవిముక్తు లగుదు; రేకరాత్రంబను తీర్థంబున నేకరాత్రోపవాసంబుసేసి బ్రహ్మలోకంబు వడదురు; రాదిత్యాశ్రమం బను వనంబున నాదిత్యుం బూజించి యాదిత్యలోకగతు లగుదురు; దధీచతీర్థంబునం గన్యాశ్రమంబునందుఁ ద్రిరాత్రంబు వసియించిన వారికి స్వర్గఫలం బగు. 268

క. జలరుహసంభవుఁ డాదిగఁ
గల వేల్పులు, ఋషులు, సిద్ధగరుడోరగులుఁ
నెల నెల సేవింతురు భూ
తలమున సన్నిహతి యనఁగఁ దగు తీర్థంబున్. 269

వ. సూర్యగ్రహణంబున దాని నాడినవారు శతాశ్వమేధఫలంబు వడయుదురు; ధర్ముఁడు దపంబు చేసిన ధర్మతీర్థం బాడి ధర్మశీలు రగుదురు;

జ్ఞానపావనంబును, సౌగంధికంబు నను తీర్థంబుల నాడినం, జూచిన సర్వపాపవిముక్తు లగుదురు; దేవహ్రద యను సరస్వతీహ్రదంబునందు పల్మీకంబున వెలువడు జలధార లాడి పితృతర్పణంబు సేసినవా రశ్వమేధఫలంబు వడయుదురు; సుగంధయు, శతకుంభయుఁ బంచయజ్ఞయుఁ ద్రిశూలఖాతయు ననుతీర్థంబు లాడి దుర్గతులవలనం బాయుదురు; తొల్లి పార్వతి యెందేని శాకాహారిణియై దివ్యసహస్రవర్షంబులు తపంబుసేసె, నట్టి శాకంభరీతీర్థం బాడి, యొక్క దినసంబు శాకాహారులయినవారు పండ్రెండేండ్లు శాకాహార తపంబు సలిపిన వారి ఫలంబు వడయుదురు; సువర్ణాఖ్యం బను తీర్థంబున రుద్రుం బూజించి, రుద్రలోకగతు లగుదురు; ధూమావతి యను తీర్థంబును, రథావర్తం బను తీర్థంబును, ధార యను తీర్థంబు నాడి శోకవిముక్తు లగుదురు. 270

క. ధారుణి లోపల స్వర్గ
ద్వారం బయి ఋషినిషేవితం బగు గంగా
ద్వారం బాడిన ధన్యులఁ
జేరును శతకోటి తీర్థసేవాఫలముల్. 271

వ. మఱియు సప్తగంగాసంగమంబును, ద్రిగంగాసంగమంబును, శక్రావర్తంబును, గవ్యూతంబును, గంగాసరస్వతీ సంగమంబు నాదిగాఁ గల పుణ్యతీర్థంబుల నాడి పుణ్య లోకంబులు వడయుదురు; భద్రకర్ణేశ్వరంబున రుద్రపూజయు, నరుంధతీపటంబును, సింధుప్రభవంబును, యమునాప్రభవంబు నను పుణ్యతీర్థంబుల సేవయు, సర్వసిద్ధికరంబులు; వేదిక యను తీర్థంబును, ఋషికుల్య యను తీర్థంబును, గృత్తికామఘ తీర్థంబులును, విద్యాతీర్థంబును, వేతసిక యను తీర్థంబునుం జూచిదురితంబులవలసందొలంగుదురు; బ్రహ్మతీర్థం బాడి పద్మవర్ణయానంబుల బ్రహ్మలోకగతు లగుదురు.

చ. సురచిరకీర్తి! నైమిశముఁ జూచినమాత్రన పాయుఁ బాప మ
చ్చెరువుగ; నందు మాసము వసించి యనంతఫలంబు లొందఁ గాం
తురు; బహుతీర్థసేవనముతోడ సమానము నైమిశంబునం
దరుదుగ నొక్కనాఁడు శుచి యై యుపవాసము సేయఁ గాంచినన్.

వ. మఱియు గంగోద్భేదతీర్థంబు, నిందీవరతీర్థంబు, గంగాద్వారంబు, దిశాపతితీర్థంబు లనియెడు తీర్థంబుల నాడి వాజపేయఫలంబుఁ బడయుదురు; బాహుద యను తీర్థంబాడిన ననేక సత్రయాగఫలం బగు; నెందేని రాపుండు స్వర్గగతుఁ డయ్యె, నట్టి సరయూప్రదేశం బున గోప్రతారం బాడియు, దేవతలకు, ఋషులకు యజ్ఞభూమి యయిన తీరంబులు గల గోమతి నాడియు, నశ్వమేధఫలంబు వడయుదురు; కోటితీర్థంబునం గుమారు నర్చించియు, వారణాసియందు రుద్రు నర్చించియుఁ, గపిలాహ్రదం బాడియు, రాజసూయఫలప్రాప్తు లగుదురు; మార్కండేయతీర్థం బయిన గంగా గోమతీసంగమం బాడియు, బ్రహ్మకల్పితం బయిన యూపంబుఁ బ్రదక్షిణంబు సేసియు వాజపేయఫలంబు వడయుదురు. 274

సీ. పలుపురఁ గొడుకులఁ బడయంగవలచు; నం
దొక్కరుం డయినను నోపి గయకు
నరుగునో యనియును, నశ్వమేధం చొప్పఁ
జేయునో యనియును, శ్వేతమైన
యూఁబోతు విడుచునో యనియును, గోరుదు
రనవద్యు లైనగృహస్థు; లట్టి
గయ కేఁగి యుభయపక్షములు వసించినఁ
గడుఁ బుణ్యు లుభయపక్షములవారి

ఆ. నుద్ధరింతు; రంద యొగిఁ బిండ మిడినవా
రనఘ! పితృ దయను గృతార్థు లగుదు;
రందు ఫల్గుతీర్థ మాడినవారికిఁ
బరమసిద్ధితో శుభంబు పెరుఁగు. 275

వ. మఱి యక్షిణీతీర్థంబునందు జలపానంబు సేసిన బ్రహ్మహత్యాదిదోష విముక్తు లగుదురు; మణినాగం బను తీర్థం బాడినవారికి నాశీవిష విషంబు లొందవు; గౌతమవనంబునం దహల్యాహ్రదం బాడి, యుద పానం బను తీర్థం బాడియు నశ్వమేధఫలంబుఁ బడయుదురు; రాజర్షి జనకకూపం బాడి విష్ణులోకప్రాప్తు లగుదురు; శకంపనయు, మహా నదియు ననుతీర్థంబుల నాడినవారు పౌండరీకఫలంబు నొందుదురు;

దేవపుష్కరిణిని, మహేశ్వరధారను, మహేశ్వరపదంబున నాడిన నశ్వమేధఫలంబు వడయుమరు, తొల్లి కూర్మరూపుం డయిన యసుర చేతం గోటితీర్థంబు లపహృతంబు లయిన వానిఁ దెచ్చి విష్ణుం డెందేని నిలిచె నట్టిమహేశ్వరపథం బను తీర్థంబాడియు, విష్ణుస్థానం బయిన సాలగ్రామం బను తీర్థం బాడి విష్ణు నర్చించియు, నందు సన్నిహిత చతుస్సముద్రం బయిన కూపంబు నాడియు, విష్ణులోకగతు లగుదురు; భరతాశ్రమంబునఁ జంపకారణ్యంబున దేవీసహితు నీశ్వరుం బూజించి మిత్రావరుణలోకంబు వడయుదురు; కన్యాసందేశం బను తీర్థంబునఁ గన్యాదానంబుసేసి యశ్వమేధఫలప్రాప్తు లగుదురు; దేవకూటం బను తీర్థం బాడి బ్రహ్మలోకంబుఁ బడయుదు; రెందేని విశ్వామిత్రుండు సిద్ధిం బొందె. నట్టి కౌశికహ్రదం బాడియుఁ గుమారవీరాశ్రమంబున నొక్క మాసంబు వసియించియు, నశ్వమేధఫలంబు వడయుదు; రగ్ని ధారయుఁ, బితామహసరంబునం బుట్టిన కుమారధారయు నాడి త్రి రాత్రోపవాసంబు సేసినవారు బ్రహ్మహత్యాది దోషవిముక్తు లగుదురు; గౌరీశిఖరకుండం బాడిన, నందినీకూపం బాడిన, నశ్వమేధఫలం బగుఁ; గాళికా కౌశికాసంగమంబునందుఁ ద్రిరాత్రోపవాసంబు సేసినవారు సర్వపాపవిముక్తులగుదురు; రూర్వశీతీర్థం బాడిన సర్వపూజార్హు లగుదురు; గోకర్ణం బను తీర్థం బాడి జాతిస్మరణంబు వడయుదురు; సరస్వతీతీర్థస్నాతు లయి వృషభద్వీపంబునం గుమారుఁ బూజించి దేవవిమానగతు లగుదురు; సందయు, నౌలకమును, గరతోయంబును, గంగాసాగరసంగమంబు ననుతీర్థంబుల నాడి శతాశ్వమేధఫలంబు వడయుదురు; శోణా నర్మదా ప్రభవంబును, బదరీతీర్థంబును నాడి యాయుష్మంతు లగుదురు; మహేంద్రంబు, రామతీర్థంబును, మతంగ కేదారంబును, వంశగుల్మంబు ననుతీర్థంబుల నాడి యశ్వమేధఫలంబుఁ బడయుదురు. 276

తే. పరమమైన తీర్థంబు శ్రీపర్వతంబు
నందు దేవహ్రదం బాడి, యాది దేవు
నీశు నర్చించి, వడయుదు రిష్టఫలము
నశ్వమేధఫలంబును నవనిజనులు. 277

వ. తొల్లి శతక్రతుండు నూఱుక్రతువులు సేయుటంజేసి పవిత్రం బయిన కృష్ణవేణియందు దేవహ్రదం బాడిన సర్వపాపవినాశనం బగుఁ; బాండ్యపర్వతంబునం గావేరి తీర్థంబును: దుంగభద్రయు, సముద్ర తీర్థంబును, గన్యాతీర్థంబును నాడి యశ్వమేధఫలంబు వడయుదురు; గాయత్రీస్థానంబునం ద్రిరాత్రంబు గాయత్రీజపంబుఁ జేసినవారికి జన్మదుఃఖంబులు లేవు; వెన్న యను మహానది నాడిన మయూర హంస విమానగతు లగుదురు; గోదావరి స్నానంబు సేసిన దశాశ్వమేదఫలంబు వడయుదురు; పయోష్ణియు, దండకారణ్యంబును. శరభంగాశ్రమంబును, శుక్రాశ్రమంబును, జమదగ్నిసేవితం బయిన శూర్పారకంబును, సప్తగోదావరితీర్థంబును నాడిన పుణ్యులు పుణ్యలోకప్రాప్తు లగుదురు. 278

సీ. అసురులభయమున నడఁగిన వేవంబు
ఓంకారపూర్వమై యుండ నాంగి
రసుఁ డుద్ధరించి, సారస్వతప్రముఖులఁ
జదివించె నెందేని శాశ్వతముగ,
నమగనియుక్తుఁ డై యజియించె నెందేని
భృగుఁ డెల్లవారికిఁ బేర్మి; నట్టి
రమణీయతుంగకారణ్యంబు సూచిన
మాత్రన దురితకర్మంబు లెల్లఁ

తే. బాయుఁ; గాలంజరం బను పర్వతంబు
నందు దేవహ్రదం బాడి యభిమతములు
వడయుదురు; మేధికంబు నాఁ బరఁగు తీర్థ
మాడి మేధాసమన్వితు లగుదు రెందు. 279

వ. మఱి చిత్రకూటంబున మందాకిని సేవించి, పితృస్థానంబునం గుమారుం బూజించి, జ్యేష్ఠ స్థానంబున రుద్రు నర్చించి, రామనివాసం బైన శృంగి బేర పురంబున గంగాస్నాతు లయి గంగాధరు నర్చించినయు సర్వపాపవిముక్తు లగుదురు. 280

క. యాగశతంబులకంటెఁ బ్ర
యాగ నివాసము విశేష మని మునులు, మహా

యోగులు, సిద్ధులు, సాధ్యులు,
నాగులు నం దుండుదురు మనఃప్రియ మెసఁగన్. 281

వ. అది ప్రజాపతి యజ్ఞవేది గావున నందు మూఁడగ్నికుండంబు లెప్పుడు గానంబడు; మఱి వేదంబులు, యజ్ఞంబులు మూర్తి మంతంబులై యఱువదికోట్ల పదివేలు తీర్థంబులు సన్నిహితంబులై, గంగాయమునా సంగమంబు సేవించియుండు; నందుఁ గృతస్నాను లైనవారు రాజ సూయాశ్వమేధులయు, సత్యవాదులయుఁ, జతుర్వేదాధ్యయులయు, బుణ్యలోకంబు వడయుదురు; భోగవతియు, వాసుకియు, హంసప్రతంబు నను తీర్థంబుల నాడి దశాశ్వమేధఫలంబు వడయుదురు. 282

క. విదితముగఁ దీర్థకీర్తనఁ
జదివిన ధన్యులకు వినిన సజ్జనులకు న
భ్యుదయ మగు, సర్వతీర్థ స
మదయస్నానబహుయాగముల ఫలము లగున్. 283

క. ఇది నిక్కువ మని మనములఁ
బదిలంబుగఁ దీర్థసేవ భక్తిఁ దలఁచినన్
విదితముగ దురితహర మగు
సదమలసుజ్ఞాను లగుట సత్యము ధరణిన్. 284

క. సకలదురితములఁ బాయుదు
రకలంక మనస్కు లగుదు; రారోగ్యోత్తమవ
ర్తకు లగుదురు; సజ్జనగుణ
నికరంబుల వెలయుదురు సునిశ్చితమతులై. 285

చ. వ్రతములు లేనివారు, నుపవాసపరాఙ్ముఖు లైనవారు, దు
ర్మతులు, విహీనశౌచులుఁ గ్రమంబునఁ దీర్థము లాడ నోపఁ రా
తతగుణశాలి వీ వఖిలధర్మవిదుండవు గావునన్ శుభ
స్థితిఁ జని తీర్థసేవనమ సేయుము నీకు నభీష్టసిద్ధిగఁ". 286

వ. అని సకలతీర్థకథనంబు సెప్పిన పులస్త్యు వచనంబున భీష్ముండు దొల్లి యెల్లతీర్థంబులు సేవించి కృతార్థుం డయ్యెఁ; గావున నీవును దీర్థసేవ సేసి. 287

క. పూరు పురూరవులట్లు, భ
గీరథ రఘుపతులయట్లు. కృతకృత్యుఁడవై
ధారుణి రక్షింపుము వి
స్తారగుణాధార! ధీర! ధర్మతనూజా! 288

వ. రోమశుం డను దేవర్షి దేవలోకంబిననుండి నీకడకు వచ్చుఁ; దదుపదే
శంబున ధౌమ్యానుమతుండ వయి తీర్థసేవనఁ జేయు" మని చెప్పి
నారదుం డరిగిన నజాత శత్రుండు ధౌమ్యుం జూచి యిట్లనియె.

చ. అలయక మాకు నందఱి కహర్నిశముం బ్రియకారి యైన య
త్యలఘు పరాక్రమాన్వితు, మహాభుజు, నర్జును దివ్యసాయకం
బులు వడయంగ నొక్కరున పుచ్చితిఁ దద్దయు వేడ్క; నెద్దియుం
దలఁపన యిప్డు తద్విరహిత మ్మగు కామ్యక మొప్ప దయ్యెడిఁ.290

వ. అంబుదాగమనం బపేక్షించు చాతకంబు లట్లు మన మందఱ మర్జునా
గమనంబు ప్రతీక్షించుచున్న వారము; వాఁడునుం దనపూనిన కార్యం
బు నిర్వహించి కాని నివృత్తుండు గాఁ; డపశ్యంబును దివ్యాస్త్రం
బులు నడసి యాతని వచ్చునంతకుఁ దీర్థసేవ సేయుద'మనినఁ"గరంబు
ల గ్గగు; నట్ల చేయుద"'మని. 291

—: రోమశమహాముని ధర్మరాజునొద్దకు వచ్చుట :—

ఉ. నాలుగు దిక్కులందును వినన్ నిదితం బగు చున్న పుణ్యతీ
ర్థాలితెఱుం గెఱుంగఁగ మహాత్ముఁడు ధౌమ్యుఁ డజాతవైరి కం
దోలిన చెప్పుచున్నతటి నొప్పుగ రోమశుఁ డేఁగుదెంచెఁ దే
జోలలితుండు, నిర్మలయశుం డగుధర్మతనూజుపాలికిన్. 292

వ. ఇట్లు వచ్చిన మహాముని నతిభక్తి సనుజబ్రాహ్మణ సహితుండై ధర్మ
జుండు పూజించి "మునీంద్రా! యెందుండి వచ్చితి"రని యడిగిన
నాతనికి రోమశుం డి ట్లనియె. 293

తే. ఎల్లలోకంబులును జూచి, యింద్రలోక
లోకనార్థి నై యే నింద్ర లోకమునకుఁ
బోయి, సురరాజుచేఁ బ్రీతిఁ బూజితుండ
నై మహీనాథ! యందు నీ యనుజు, ననఘు. 294

ఉ. ఈసున నీకుఁ దొట్టి సుర లెల్ల నభీష్టవరంబు లిచ్చుటం
జేసి కృతార్థుఁ డైన కురుసింహము, నూర్జితశౌర్యు, నర్జునున్,
భాసురతేజు విశ్వపరిపాలకుఁ డైన మహేంద్రుతోడ నే
కాసన మెక్కి యున్న మహిమాస్పదు, నింద్రతనూజుఁ జూచితిన్.

క. బలవంతు లైన భీష్మా
దుల నర్జునుఁ డోర్చి నూర్జితుం డై; మటి పో
రులఁ గర్ణుండు పదాఱవ
కళకు సమానుండు గాఁడు గవ్వడితోడన్. 296

వ. అతని యున్న విలాసంబు సూచి విస్మితుండ నయిన నాకు నింద్రుండు
దత్పరిభావంబు సెప్పి "వీఁ డమృతసంభవం బయిన పాశుపతం బను
దివ్యాస్త్రంబుఁ బరమేశ్వరు చేతను, నాచేతను, యమవరుణకుబేరా
దులచేతను దివ్యాయుధంబులఁ బడసె; నితండు మనుష్యుండు గాఁడు
దివ్యపురుషుం; డన్యుల కళక్యం బయిన దేవకార్యంబు దీర్చి మసలక
వచ్చునని మర్త్యలోకంబునకుం బోయి భ్రాతృ సహితుం డయిన
ధర్మరాజునకుం జెప్పు" మనిన వచ్చితి నని వెండియు నిట్లనియె.

క. "నిరతముగఁ దీర్థసేవా
పరు లగు శాంతాత్ములకుఁ, దపస్వులకును దు
ష్కర మెద్దియు లేదని చె
చ్చెర ధర్మజుఁ దీర్థసేవ సేయింపు మొగిన్." 298

క. అని పనిచిన నమరేశ్వరు
పనిఁ దత్పార్శ్వమున నుండి పన్నగ నిట యేఁ
జనుదెంచితి; నీ కార్యము
ధనంజయున కభిమతంబు ధరణీనాథా! 299

క. అనవద్య తీర్థసేవన
మును గపిలాస్వర్ణదానములు, నుగ్రతపం
బులు జేయనివారికిఁ బో
లునె పడయఁగఁ బేర్మి నుభయలోకసుఖంబుల్. 300

వ. ఏను దొల్లి భూమిం గల తీర్థంబు లెల్ల నినుమూఱు సూచితి; నిప్పు డింద్రు నియోగంబున నీతోడన వచ్చి యఖలతీర్థసేవ సేసెద" ననిన ధర్మజుం డతని కి ట్లనియె. 301

ఉ. "నన్నఁ దలంచి తీర్థగమనం బొనరింపఁగఁ బంచె నట్టి వి
ద్వన్నుత! దేవవల్లభుండు; దానఁ గృతార్థుఁడ నైతి; దానిపై
నిన్ను సహాయుఁగాఁ బడసి నెమ్మి నశేషవిశేషతీర్థముల్
పన్నుగఁ జూడఁ గాంచి కడు భవ్యుండ నైతి మునీంద్ర! నీదయన్. 302

ఆ. విజయు కుశలవార్త వేడుక నీ చేత
వినినయంతకంచె విస్తరిల్లె
హృదయసంప్రమోద మీ రెంట నాకంచుఁ
దద్ద సంతసిల్లె ధర్మసుతుఁడు. 303

వ. "మునీంద్రా! యేను దొల్లియు నారదధౌమ్యుల వచనంబులం దీర్థగమనోన్ముఖుండనయి యున్నవాఁడ; నిప్పుడు భవన్ని దేశంబునం దీర్థసేవ సేసి కృతార్థుండ నగుదు" నని కృతనిశ్చయుండై భిక్షాభుజు లయిన బ్రాహ్మణులను యతులను రోమశువచనంబున నివర్తించి, ధౌమ్యపురస్కృతకతిపయ బ్రాహ్మణులతో ననుజులుం దానును గృష్ణాసహితు లయి, కామ్యకవనంబున మూఁడుదినంబులు వసియించి, మార్గశీర్షమాసావసానంబునం దీర్థసేవార్థంబు గృతప్రస్థానుం డయిన యుధిష్ఠిరునకు బ్రాహ్మణు లిట్లనిరి. 304

ఉ. "నీయనుజుల్ ధనుర్ధరు, లనింద్య చరిత్రులు, దీర్ఘ తీక్ష్ణకా
ష్ఠేయకపాణు, లత్యమలకీర్తులు గావఁగ, రోమశుండు దే
వోయుతుఁ డెల్ల తీర్థములుఁ జూపఁగఁ, దీర్థము లాడువేడ్క ల
క్ష్మీయుత! యిప్డ ని న్ననుగమింపఁగఁ గంటిమి పుణ్యసంపదన్. 305

వ. రాక్షసపిశాచశ్వాపదంబుల కారణంబున నడవులలో నేకతంబ యరిగి తీర్థసేవ సేయ మాయట్టివారికి నశక్యంబు; గావున మీతోడ వచ్చెద" మని బ్రాహ్మణులు ధర్మరాజుచేత ననుజ్ఞాతు లై; రంత. 306

క. పారాశర్యుఁడుఁ, బర్వత
నారదులను బాండు రాజనందనుల, గుణో
దారుల, ననఘులఁ, దీర్థ
ప్రారంభులఁ గాన వచ్చి పరమ ప్రీతిన్. 307

క. వారలచేఁ బూజితులై
భూరితపోధనులు, లోకపూజ్యులు ధర్మ
ప్రారంభనిత్యమతులకు,
వారల కిట్లనిరి సత్యవచనులు గరుణన్. 308

వ. "శారీరనియమంబులు మానుషవ్రతంబు లనంబడు; మనోబుద్ధిశౌచం బులు దేవవ్రతంబు లనంబడు; నట్టిసౌమ్యవ్రతవిశేషంబులు సలుపుచు ఋజుమార్గులరై తీర్థంబులు సేవించునది; తీర్థాభిగమనంబున మహా భిష నాభాగ భరత భగీరథ ముచుకుంద మాంధాతృ సగర సార్వ భౌమాష్టక రోమపాదులయట్ల శత్రు జయంబును, సర్వలోకసుఖం బులుఁ బడయుదు" రని చెప్పి మునివరులు మువ్వురరిగి; రంత నజాత శత్రుండు రోమశున కిట్లనియె. 309

క. "ధరణి నధార్మికు లగు కా
పురుషుల కభివర్ధనంబుఁ బుణ్యచరిత్రం
బరఁగెడు ధార్మికులకు దు
ర్ధర మగు నవివర్ధనంబుఁ దగునె? మునీంద్రా! 310

వ. మటియు నచేతనంబులయ్యును గిరిసరిత్సరోవరంబులు పుణ్యతీర్థంబులై జగత్పావనంబులై జనులకు దురితాపహారంబులయిన కారణం బేమి?" యని యడిగిన నతనికి రోమశుం డిట్లనియె.

—: రోమశుండు ధర్మరాజునకు ధర్మవిశేషంబులు సెప్పుట :—

చ. వసుధ నధర్మవర్తు లగువారల వర్ధన మెన్నఁడున్ సమం
జస మయి నిల్వ నేరదు; భృశంబుగ నాశము వొందు; దుర్మద
వ్యసను లధర్మవర్తనఁ బ్రవర్ధితు లయ్యును, నేము చూడ రా
క్షసులును, దైత్యదానవులుఁ గ్రాఁగరె తొల్లి సహస్ర సంఖ్యలన్.

క. దేవతలు ధర్మవర్తులు
గావున నభివృద్ధిఁ బొం దిఘనమగు నిత్య
శ్రీవిభవాన్వితు లయి ధర
ణీవల్లభ! యున్నవారు నిరుపమశక్తిన్. 313

క. ధర్మసుత! ధార్తరాష్ట్రులు
ధార్మికులై పెరిఁగిరేనిఁ దడయక విధిచే
నిర్మూలితు లగుదురు దు
ష్కర్మంబున నసురులట్ల కడు నస్థిరు లై. 314

వ. అది యెట్లనిన నధర్మవర్తులయందు దర్పంబు వుట్టు; దర్పంబువలన మానంబు వుట్టు; మానంబువలనఁ గ్రోధంబు వుట్టుఁ; గ్రోధంబువలనం జేసి లజ్జయు, వృత్తంబునుం జెడు; నష్టలజ్జావృత్తు లయినవారి నుపశమంబును, లక్ష్మియు విడుచు. 315

క. మీ రమర సదృశులరు, ధ
ర్మారంభవిశిష్టమతుల రగుటను సుచిర
శ్మారమ్యు లగుదు; రాజ జి
తారాతుల రగుదు రుద్ధతాహవములలోన్. 316

వ. ధర్మవర్తులై న దేవతలు, ఋషులు నాశ్రయించుటంజేసి తీర్థంబులు పవిత్రంబు లై సర్వకామప్రదంబు లై వర్తిల్లుచుండుఁ, దీర్థసేవను, దానంబులను, బ్రాహ్మణుల దీవనలను జనులు సర్వదుఃఖవిముక్తులయి శ్రేయఃప్రాప్తులగుదురు" రని చెప్పిన నమ్మునివరువలన నొండుధర్మస్థితులు వించుఁ బాండవు లరిగి నైమిశంబు, నశ్వతీర్థంబును, గంగాఘోషంబును, గన్యాతీర్థంబును, గోమతియును, బాహుదయును, మహానదియును, దేవయజనం బయిన ప్రయాగయు, గంగాయమునా సంగమంబును నాడి యందు బ్రాహ్మణులకు గోహిరణ్యదానంబులు సేసి, ప్రయాగం గొన్నిదినంబు లుండి, వేదవిదు లయిన బ్రాహ్మణుల వలన వేదార్థంబు లెఱుంగుచుఁ జని, యనేక పుణ్యనదీసముద్భవం బయిన గయపర్వతంబును రామసరంబును, బ్రహ్మసరంబును, వైవస్వతతీర్థంబునుం జూచి, గయయందు నక్షయవటంబున నాశ్లేయం బైన

విధానంబునం జాతుర్మాస్యక్రతువులు సేసి, ఋషులవలనంబుణ్యకథలు వినుచున్న యవసరంబున శమఠుం డను మహాముని ధర్మరాజున కిట్లనియె. 317

సీ. "అనఘుం డమూర్తరయఃప్రియపుత్రుండు
గయుఁ డను రాజర్షి క్రతువు లిందు
బ్రహ్మసరంబునఁ బరఁగంగ మును చేసె;
నాతని యజ్ఞంబులందు సకల
జనభుక్తశేషాన్నశైలంబు లిరువది
యే నగుసంఖ్య దా నెఱుఁగ నయ్యెఁ;
దత్కృత క్రతుబహుదక్షిణా సంఖ్యయు
నుడుసికతాసంఖ్యయును నెఱుంగఁ

ఆ. గాదు జనుల; కట్టి గయునామమున గయ
యనఁగఁ బుణ్యతీర్థ మయ్యె నిదియుఁ;
బితృహితార్థ మిందుఁ బిండప్రదానంబు
సేయఁ గనిన నిష్టసిద్ధి గలుగు." 318

వ. అని చెప్పిన శమఠువలన గయామాహాత్మ్యంబు విని యగస్త్యాశ్రమం బున కరిగి; రంత ధర్మరాజు రోమశున కిట్లనియె. 319

మధ్యాక్కర "వాతాపి యనువాని నెట్లు సంపె సద్వంద్యుఁ డగస్త్యుఁ?
డాతతతేజోధికుండు నా విందు నమ్మనినాథుఁ;
బ్రీతిని దచ్చరితంబు వినఁగ నభీష్ట మిం"దనిన
నాతని కిట్లని చెప్పె రోమశుం డన్మని పేర్మి. 320

క. "వీతభయుఁ డిల్వలుండును
వాతాపియు ననఁగఁ బరఁగు వరదైత్యులు వి
ఖ్యాతబలులు పసియింతు ర
రాతిహరుల్ మణిమతీపురంబున నొప్పన్. 321

వ. అం దగ్రజుం డయిన యిల్వలుం డొక్క బ్రాహ్మణు నతిభక్తి నర్చించి నాకు సకల కామసిద్ధికరం బగు మంత్రం బుపదేశింపు"మని ప్రార్థించి విఫలప్రార్థనుం డై యరిగి, తన తమ్ముఁ, గామరూపధరు, వాతాపి

నపుడు మేషరూపంబు సేసి వధియించి. వానిమాంసం బిమ్ముగా
వండించి, దాని నావిప్రునకుఁ గుడువం బెట్టించి. 322

తే. విప్రుకడుపులో నున్న యవ్వీరు ననుజుఁ
బిలిచె వాతాపి రమ్మని ప్రియముతోడ;
జీవితుం డయి వాఁడు సెచ్చెరను విప్రు
కడుపు ప్రచ్చుచు వెలువడి ప్రాఁచె విప్రు. 323

వ. అది మొదలుగా నిల్వలుండు దనకడకు నతిథు లై వచ్చు విప్రుల నిప్పాట నంతకు పురంబున కతిథులం జేయు చున్నంత నట యగస్త్యుండు బ్రహ్మచర్యాశ్రమంబునం బెద్దకాలం బుగ్రతపంబు సేయుచు వనంబునఁ బరిభ్రమించువాఁడొక్క సల్లకీపల్లవంబున నధోముఖు లయి ప్రేలుచున్న తన పితరులం జూచి "యివ్విధంబున మీ రున్న కారణం బేమి?" యని యడిగినఁ బితరు లి ట్లనిరి. 324

తే. "అయ్య! యేము నీపితరుల; మధికనిష్ఠ
బ్రహ్మచారి వై నీవు తపంబు సేయు
చున్నవాఁడవు సంతతి నొల్ల; కదియ
కారణంబుగ మా కూర్ధ్వగతియు లేదు 325

వ. ఇంక నైనను నీవు వివాహంబై సంతానంబు వడసిన మాకుఁ బుణ్య గతి వడయనగు"ననిన "నట్ల చేయుము"నని యగస్త్యుండు దన తపశ్శక్తిం జేసి పుత్రకామముండైన విదర్భరాజున కొక్క కూతుం బుట్టించిన నది లోపాముద్ర యను నామంబుతో జలంబులయందు నలిని యుంబోలె, వినీతునందు లక్ష్మియుంబోలె,నుద్యుక్తునందు విద్యయుం బోలెఁ బెరిఁగి యౌవనంబు దాల్చి, రూపవతియై మఱయో రూపంబుల ననురూప లయిన కన్యకాశతంబుతో నొప్పుచున్నంత. 326

క. తరుణి నగస్త్యభయంబున
వరియింపఁగ నోడి రాజవరులు మనోజా
తురు లగు చుండిరి; తగియెడు
వరు రోయుచు నుండె సుతకు వైదర్భుండున్. 327

వ. అంత నగస్త్యుండు విదర్భరాజుపాలికి వచ్చి "నాకు లోపాముద్ర నిచ్చునది" యనిన విదర్భేశ్వరుండు తన తనూజ నమ్మునిం కీనోపక మనంబున ననుతాపించి యక్కన్యకం జూచి యాత్మగతంబున. 328

ఉ. నారలు గట్టి, కూర లశనంబుగ, నుగ్రవనంబులోఁ దపో
భారమునం గృశుం డయిన బ్రాహ్మణుఁ డీలలితాంగిఁ బెండ్లి యై
నారలు గట్టి, కూర లశనంబుగ, నుగ్రవనంబులోఁ దపో
భారను దాల్చి యుండు మని పంపక మిన్నక యుండ నిచ్చునే?

ఆ. ఎటీఁగి యెటీఁగి దీని నెట్లోఁగ నగు? భోగ
యోగ్య యైనయది పయోజనేత్ర;
యీనినాఁడు శాప మిచ్చుఁ గా కిమ్మునిం
యేల సైఁచు? నింక నెట్టులొక్కొ?" 330

వ. అని వైదర్భుండు దానునుం బత్నియు వగచు చున్న వారిపాలికి వచ్చి లోపాముద్ర యి ట్లనియె. 331

క. "ఇమ్మునివరునకు నన్నుఁ బ్రి
యమ్మున నిచ్చునది; మీకు నతిచింతాభా
ర మ్మేల?" యనిన నిరువురు
నమ్మోదితకు సంతసిల్లి యధికవిభూతిన్. 332

—: అగస్త్యుండు లోపాముద్రను వివాహం బగుట :—

వ. విధ్యుక్తంబుగా నకోకమలి నగస్త్యునకు వివాహంబుఁ జేసిన నగస్త్యుండు లోపాముద్రం బరిగ్రహించి దాని దివ్యాంబరాభరణంబులపనయించి, వల్కలాజిన ధారిణిం జేసి, ధర్మ చారిణిం దోడ్కొని చని, గంగాద్వారంబునం దపంబు సేయుచు నొక్కనాఁడు. 333

క. నీచతరనాభిఁ, జపలవి
లోచనఁ, బృథుజఘనచక్ర, లోపాముద్రం
జూచి మునీంద్రుఁడు మన్మథ
గోచరుఁడై దానిఁ బ్రీతిఁ గూడఁగఁ దివిరెన్. 334

వ. అదియును మునివరు నభిప్రాయం బెఱింగి, లజ్జించి, ముకుళిత కరాంబుజ యై యి ట్లనియె. 335

క. "పతి పత్నీ బ్రజార్థముగా
ధృతిఁ బడయుట యెందుఁ గలయదియ; యైనను న
న్నతిరుచిరాంబరభూషా
న్వితఁ జేసి మనఃప్రియంబు నిర్మింపు దయన్. 336

క. మునినాథ! నీవు ననులే
పసమాల్యవిభూషణప్రసన్నుఁడ వై నా
కొనరింపు మపత్యార్థా
ధన మీబుతువాసరములు దప్పక యుండన్." 337

వ. అనిన నాకుఁ దపోధనంబ కాని యొండు ధనంబు లేదు; నీకోరిన విధం బెట్లు సేయ నేర్తు? దపంబునంజేసి సర్వంబునుం బడయ నగునంచేని నేను దపోవ్యయంబు సేయ నోప" నని యగస్త్యుండు వసుభిక్షార్థి యై బ్రుతపర్వుం డను రాజుపాలికిఁ బోయి వానిచేతం బూజితుం డయి "యేను ధనార్థి నై వచ్చితి; నీపోష్య జన పోషణంబునకు విఘాతంబు గాకుండ మిగులు ధనంబు గలదేని నా కిమ్మని" యడిగిన నతం డాయవ్యయంబులు సమంబు లగుటంజేసి మిగులు లేమి యెఱింగించిన, వాఁడును దానును బ్రబధ్నశ్వుం డను రాజుపాలికిం బోయిన, నతండును నయ్యిరువురం బరమభక్తిం బూజించి తదాగమనప్రయోజనం బెఱింగి, తనయందుల నాయవ్యయంబులు సమంబు లగుట యెఱింగించిన. 338

క. ఇరుపురఁ దోడ్కొని తానును
నరిగెం ద్రసదస్యుఁ డను జనాధిపుకడకుం;
గర మర్థితోడ నంగఱఁ
బురుకుత్సతనూజుఁ డతండు పూజించి తగన్. 339

వ. వారల చెప్పినట్లు తన నిర్వాహంబు సెప్పి త్రసదస్యుం డగస్త్యున కిట్లనియె. 340

క. ఇమ్మణిమతీపురంబునఁ
దమ్ముండును దాను నతిముదంబున నుండుఁ
నెమ్మని నిల్వలుఁ డనువాఁ;
డిమ్మహి ధనవంతుఁ డతఁడ యెవ్వరికంటెన్. 341

వ. అతఁడు మన యభిమతఁబు దీర్ప నోపు'' నని రాజర్షులు మువ్వురు మహర్షి దోడ్కొని యిల్వలు పాలికిం జనిన నయ్యిల్వలుఁడును వారి నాతిథ్యవిధానంబుల నర్చించి వాతాపి నెప్పటియట్ల సంస్కరించి యగస్త్యుని కశనంబుగా సమర్పించిన. 342

తే. దాని నెటోఁగి యమ్మువ్వురు ధరణిపతులు
మునివ రేణ్యున కప్పుడు మ్రొక్కియనిరి
''విప్రవరులకు భక్ష్యమై వీని తమ్ముఁ
డుదరములనుండి విప్రుల నొగిన చంపు 343

చ. వలవదు నీనియింటఁ గుడువఁ మనకుఁ ; ధన మిచ్చునేని ని
మ్ములఁ గొని పోద మిప్పు'' డని ము న్నెటోఁగించిన నమ్మునీంద్రుఁ డ
త్యలఘుఁడు వారిమాటకు భయంపడ కెంతయుఁ బ్రీతితోడ న
గ్గలముగఁ జేసె భోజనము గంతముదాఁక నకుంఠవీర్యుఁ డై. 344

ఆ. ఇల్వలుండు ననుజు నెప్పటిక్రియఁ బిల్వ
నెటోఁగి దాని నమ్మునీశ్వరుండు
గడుపుఁ డడివికొనుచుఁ గట్టనఁ ద్రేఁచిన
నసుర జీర్ణమయ్యె నాతఁ డణంబ. 345

వ. ఇల్వలుండును మునివరుశక్తికి భయంపడి విషణ్ణుం డయ్యునుం
బ్రసన్నుండపోలెఁ దన వంచన యేర్పడకుండం గృతప్రణాముం డై
తదాగమనప్రయోజనం బడిగిన వానికి నగస్త్యుం డి ట్లనియె. 346

సీ. ఈరాజవరులతో నేను ధనార్థి నై
వచ్చితి నీకు ద్రవ్యంబు గలుగు
నెటోఁగి'' నావుడు '' నటులేని మీ కభిమత
మెంత యంతయ ధన మిత్తు'' ననినఁ
''బదివేలుమొదవులు, బదివేలగద్దియల్
పసిఁడియు నిమ్మహీపతుల కిమ్మ
యొక్కొక్కనికి ; మఱియొక్కని కిచ్చిన
దానికి రెట్టిగోధనము, నొక్క

ఆ. హేమమయరథంబు నిమ్మొ నా'' కనిన ని
ల్వలుఁడు దక్షణంబ తలఁచి యిచ్చె
నయ్యగస్త్య చెప్పినంతధనంబు ము
వ్వురు మహీపతులకుఁ గరము నెమ్మి. 347

వ. మఱియు విరావ సురావము లను నళ్వంబులం బూన్చిన సౌవర్ణ
రథంబును, నిరువది వేల మొదవులు, నిరువదివేల గద్దెల పసిండియు
మునివరున కిచ్చినం దద్రథంబున. 348

క. మునివరనృపతులఁ, దద్గో
ధనకాంచనతతులఁ, దత్పతాకినులను నో
లిన తాల్చి యగస్త్యాశ్రమ
మునకుం దక్షణమ రథ్యములు పడిఁ బఱచెఁ. 349

వ. రాజర్షులు నగస్త్య వీడ్కొని చని; రంత నగస్త్యుండు లోపాముద్ర
కభిమతం బొనరించి. 350

మధ్యాక్కర. పదుగురఁ బోలెడు సుతుల నూర్వురఁ బడయంగ వలతొ?
పదుగుర నూర్వుర కెనయగు సుతులఁ బడయంగ వలతొ?
పదలక వేవురు సుతులఁ బడయఁగ వలతొ? వేవురకుఁ
గదియంగ నుత్తము నొక్కరు వలతొ? కమలాయతాక్షి!"

వ. అనిన ముదితహృదయ యై లోపాముద్ర మునీంద్రున కిట్లనియె.

క. "వేపురఁ బోలెడువాని మ
హావీర్యగుణాఢ్యు నొక్కయాత్మజుఁ బడయం
గా వలతు; నపేతగుణుల్
వేవురసుతు లయ్యు నెందు విఫలమ కాదే?" 351

వ. అనిన "నీకోరినట్ల గుణవంతుం డయిన కొడుకు నీకు జన్మించు" నని
దానికి గర్భా ధానంబు సేసి, యగస్త్యుండు దపోవనంబున కరిగె;
నిట లోపాముద్రయు నేడేండ్లు గర్భంబు దాల్చె; నంత నక్కొమలికి.

క. తనయుఁడు, దృఢస్యుఁ డనఁగా
ననపద్యుఁడు, వేదములు రహస్యంబులతో

నొనరఁగ జపంబు సేయుచు
నినతేజుఁడు పుట్టె భువన మెల్ల వెలుంగఁగ. 355

వ. వానికిం దేజస్వి యను ముని పుట్టి యపారం బైన యిధ్మభారంబు వహించుటం జేసి యిధ్మవాహుం డనం బరఁగె; ని ట్లగస్త్యుండు పుత్రవంతుం డయి తన పితరుల బుణ్యలోకగతులం జేసె; నని వైశంపాయనకథితకథాక్రమం బతి రమ్యంబు గాను. 356

క. కలికాలభరత ! లక్ష్మీ
లలనాస్పదవీరగుణవిలాస ! విరోధి
ప్రళయాంతక ! నిఖిలమహీ
వలయోద్వహబాహు ! విష్ణువర్ధనమూర్తి! 357

పృథ్వీవృత్తము :—
సమస్తభువనాశ్రయా ! వినయసత్యనితోద్యయా !
సమీహిత గుణక్రియా ! స్థిరవిశాలకీర్తిప్రియా !
నమన్నృపకిరీటచుంబిచరణద్వయా ! సంతత
క్షమాభరణ ! రాజరాజ ! పరగండభేరుండకా ! 358

గద్యము. ఇది సకలసుకవిజనవినుత నన్న యభట్టప్రణీతం బైన శ్రీమహాభారతంబునం దారణ్యపర్వంబున బృహదశ్వోదర్శనంబును, నలోపాఖ్యానంబును, నారదాగమనంబును, సకలతీర్థకీర్తనంబును, రోమశుం డర్జును కుశలవార్త జెప్పుటయు, రోమశ మహాముని యుపదేశంబున ధర్మజుతీర్థాభిగమనంబును, నగస్త్యుండు లోపాముద్రం బరిగ్రహించుటయు, వాతాపిభక్షణంబును నన్నది ద్వితీయాశ్వాసము.

శ్రీ

గణేశ శారదా గురుభ్యో నమః

శ్రీ మదాంధ్ర మహాభారతము

ఆరణ్యపర్వము - తృతీయాశ్వాసము

శ్రీ మందిర ; బుధజనచిం
తామణి ! కోదండపార్థ ! ధర్మవిచారో
ద్దామ ! నలన్నగభగీరథ
రామచరిత్రాభిరామ ! రాజనరేంద్రా !

—: అగస్త్య చరిత్రము :—

వ. అక్కథకుండు శౌనకాదిమహాములులకుం జెప్పె : నట్లు ధర్మతనయుం డగస్త్య మాహాత్మ్యంబు విని వెండియుఁ దచ్చరిత్రంబు రోమశు నడిగిన నమ్మునియిట్లనియె. 2

సీ. "కృతయుగంబునఁ గాలకేయగణంబుతో
వృత్రుఁ డన్నసుర గర్వించి, యమర
పతిఁ దొట్టి వేల్పుల బాధించు చున్నఁ, ద
ద్భయమున నమరులు బ్రహ్మకడకుఁ
జని "పోరిలో వృత్రుఁ జంప నుపాయ మె
య్యది యెు మా కానతిమ్మన నజుండు
దివిరి సరస్వతీతీరంబునందు ని
శ్చింతుఁ డై తప మొప్పఁ జేయు చున్న

ఆ. యా ఋషీచికడకు నరిగి వేఁడుండు ; ని
జాస్థి లిచ్చు మీకు నమ్మహాత్ముఁ ;

డవి జయించు వజ్ర మాదిగా నిఖలది
వ్యాయుధంబు లై సురారివరుల. 3

వ. అందు వజ్రంబున నింద్రుండు వృత్రు వధియించు" ననిన నమసు
లెల్లం గమలాసనుశాసంబున దధీచిపాలికిం జని కృతప్రణాము లై
యి ట్లనిరి. 4

క. "భువనజనస్తుత ! నిజగౌ
రవ మెసఁగఁగ నమరపతిపురస్కృతు లగు ని
ద్దివిజుల కెల్ల హితంబుగ
భవదస్థిచయంబు లిమ్ము పరమమునీంద్రా !" 5

వ. అనిన విని దధీచి సంతసిల్లి కృతార్థుండ నై తి నని దేవహితార్థంబుగా
నిజప్రాణం బులు విడిచె ; నమరు లెల్ల నమ్మహామునియస్థు లాయు
ధంబులుగాఁ బరిగ్రహించి రందు 6

ఆ. త్వష్ట యంత నూఱుధారల గమ్యమై
యనలకణకరాళ మైన వజ్ర
మొనరఁ జేసి "దీన నోర్వను దైత్యుల"
ననుచు నిచ్చె దాని నమరపతికి. 7

వ. అవ్వజ్రంబున నింద్రుండు వృత్రు వధియించె నంత 8

చ. అనుపమదివ్యశస్త్రధరు లైన యమర్త్యుల కాహవంబులో
మొనయక కాలకేయులు సముద్రముఁ జొచ్చి, దిపఁబు లెల్ల న
వ్వనధి నడంగి యుండి, బలవంతులు వెల్వడి రాత్రు లెల్ల భూ
జనులకు బాధ సేయుచు భృశంబుగ నుండిరి క్రూరచిత్తు లై. 9

చ. మఱియు విఖ్యాతపోయుక్తు లై, ధర్మచరితు లైన వారికారణంబున
జగంబు లపాయంబు నొందక సుఖం బున్నయవి; గావున నట్టివారిన
రోసి వధియించి జగంబుల కపాయంబు సేయుద మని యసురులు
వసిష్ఠాశ్రమ బున నూటతొంబదిగే డ్వురను, జ్యవనాశ్రమంబున
నూర్వురను, భరద్వాజాశ్రమంబున నిరువదుంద్రనుం గాఁ బలువురు
బ్రాహ్మణుల బ్రహ్మమయుల వధియించి భక్షించి యిప్పాట ననచర
తంబు నఖిలమునిగణాశ్రమంబుల కుపద్రవంబు సేయుచున్న. 10

—: దేవతలు వైకుంఠమునకుఁ బోయి విష్ణుని స్తుతియించుట :—

క. యాగాదిపుణ్యకర్మ
త్యాగము మర్త్యమున నైనఁ, దా రధికభ యో
ద్వేగంబునఁ బురుహూతపు
రోగము లై యగ్ని యమ వరుణ ధనదాదుల్. 11

క. చని వైకుంఠంబునఁ ద్రిభు
వనపతి, వైకుంఠు, గరుడవాహను, విష్ణు
దనుజవిభంజనుఁ గని యి
ట్లని రెంతయు భక్తితోఁ గృతాంజలు లగుచున్. 12

వ. "దేవా! నీవు వరాహరూపధరుండవై మహీతలం బెత్తి, నరసింహ రూపంబు దాల్చి యాదిదైత్యు హిరణ్యకశిపు వధించి, వామనుండవై బలిం గట్టి, యజ్ఞమూర్తివై యజ్ఞవిఘ్నకరుండైన జంభుం డను దానవుం జంపి, యండజజరాయుజస్వేదజోద్భిజ్జంబు లనం బరఁగిన చతుర్విధప్రజల రక్షించు చున్న జగద్రక్షకుండవు; గావున నీకు విన్న పంబు సేసెద; మిప్పుడు జగంబుల కైన యుపద్రవంబు చిత్తగింపుము

సీ. కాలకేయులు మహాకాయులు పగ లెల్ల
జలదుర్గబలమున జలధి నుండి,
రే లెల్లఁ జని నలి రేఁగి మునీశ్వరా
శ్రమముల సద్ధర్మచారు లైన
బ్రాహ్మణప్రవరులఁ బాయక వధియింతు;
రెట్టి పాపాత్ములు నెయ్యుగముల
బ్రాహ్మణహింస యాపాదింతురే? యది
వీరలవలనన వినఁగఁబడియెఁ;

ఆ. బరమసాధు లైన బ్రాహ్మణులకు బాధ
యగుడు మహికి బాధ యగు; ధరిత్రి
కైన బాధఁజేసి యఖిలలోకంబులుఁ
గరము బాధ నొందుఁ గమలనాభ! 14

వ. ఎట్లనిన వేదంబులు ధరియించి విప్రులు వేదచోదితంబు లైన పుణ్య కర్మంబులు విధియించుటంజేసి హవ్యకవ్యంబుల దేవతలుం బితరులుఁ దృప్తులైన, వారివలన నెల్ల లోకంబులకు సుఖం బగుం గావున బ్రాహ్మణోపద్రవంబు పరిహరించి లోకంబులు రక్షింపు" మనిన దేవత లకు విష్ణుదేవుం డిట్లనియె. 15

మత్తకోకిలము కాలకల్పుల, నుగ్రతేజులఁ గాలకేయుల, భూరిర
త్నాలయస్థుల, వీర్యవంతుల నర్ణవంబు సమస్తస
త్త్వాలి దోఁపఁగ వట్టినన్ విషయం బగున్ వధియింపఁగాఁ;
బోల దొండువిధంబునం బరిపూర్ణ వార్ధి జలోన్నతిఁ. 16

క. వరుణజుఁబుల మిత్రా
వరుణతనూజుండు వీర్యవంతుం డై చె
చ్చెరఁ ద్రావ నోపు నిందఱు
నరుగుఁడు, ప్రార్థింపుఁ డమ్మహాత్ము నగస్త్యన్." 17

వ. అనిన నమరు లెల్ల నగస్త్యాశ్రమంబునకుం జని యమ్మునివరు స్తుతియించి యిట్లనిరి. 18

క. "అమరహితంబుగ జగదహి
తము దలుగుము పేర్మితోఁ; బుధస్తుతగుణ! వింధ్యము దొల్లి పెరిఁగి జగదహి
తము సేసిన నీవ కావె తలిగితి దానిఁ?" 19

వ. అని దేవతలెల్ల నగస్త్యుఁ గీర్తించి" నని విని ధర్మజుం "డిది యెట్లు? వింధ్యం బేల పెరిఁగె? దానిం బెరుఁగకుండ నగస్త్యుం డెవ్విధంబునఁ వారించె?" నని యడిగిన నాతనికి రోమశుం డిట్లనియె.

—: అగస్త్యుఁడు వింధ్యంబు పెరుఁగకుండ వారించుట :—

ఉ. "నెమ్మి నినుండు మేరుధరణీధరనాథుఁ బ్రదక్షిణంబుగాఁ
బ్రిమ్మరు చున్నఁ జూచి, పటుదీధితికిం గర మల్గి, వింధ్యశై
లమ్మనియెఁ "దినేంద్ర! యచలప్రభు నన్నుఁ బ్రదక్షిణంబు ని
ష్క్రమ్మును జేయ కేల మతి దప్పితి? మేరువుఁ గొల్వ నేటికిఁ?"

వ. అని గర్వించి పలికిన నప్పర్వతంబునకు భానుం డి ట్లనియె. 22

క. "అనవతరము విధియోగం
బున నేఁ ద్రిమ్మరుదు నమరభూధరముఁ బ్రియ
మ్మున; నాత్మేచ్ఛ యొనర్పఁగఁ
జన" దనవుడు నలిగి వింధ్యశైలం బంతన్. 23

క. ఇనశశితారాదులకుం
జన రాకుండంగఁ బెరిఁగి జలధరపథ మె
ల్లను గప్పి యుండె వింధ్యం
బనుపమ ముత్తుంగమై సురాద్రిస్పర్ధన్. 24

క. రవిశశిగతు లుడుగుడు 'నిది
దివ మిది రాత్రి' యని వసుమతీజనులకు, న
ద్దివిజమునివరుల కెఱుగఁగఁ
నవగాఢం బయ్యె; నంధ మయ్యె జగంబుల్. 25

వ. ఇట్లు పెరిఁగిన వింధ్యంబునొద్దకు వచ్చి వేల్పు లెల్ల దానివర్ధనంబు వారింప నోపక యగస్త్యాశ్రమంబునకుం జని వింధ్యంబు పెక్కువ యెఱింగించి యి ట్లనిరి. 26

క. "భువనవ్యవహారమునకు
వ్యవధానం బయ్యె వింధ్యవర్ధనమున, న
ద్దివసకరరజనికరగతు
లవిహతమగునట్లు సేయు మమర మునీంద్రా!" 27

వ. అని దేవతలు ప్రార్థించిన నగస్త్యుండు లోపాముద్రాసహితుండై విధ్యంబు సమీపంబునకు వచ్చి దానిచేతం బూజితుండై యి ట్లనియె.

క. "చనియెద దక్షిణదిశ కే;
నొనరఁగఁ దెరు మిమ్ము నాకు; నుర్వీధర! నీ"
వనవుడు నట్టుల చేయుదు
నని పెరుఁగుట యుడిగి వింధ్య మతివినయముతోన్. 29

వ. "భట్టారా! విజయంచేయు" డని భూమిసమాన మై యున్న దాని కగస్త్యం డిట్లనియె. 30

క. "నా మగుడి వచ్చునంతకు
భూమీధర! యీ ప్రకారమున నుండుము; నా
తో మైత్రిఁ జేయు" మని లో
పాముద్రాధీశ్వరుండు వలికి ముదమునన్. 31

వ. దాని నొడంబటించి, దక్షిణదిశకుం జని, లోకంబులకు హితంబుగా నంద యుండె; వింధ్యంబు నగస్త్యుండు మగుడి వచ్చునంతకుఁ బెరుఁగ నోడి యున్న" దని యగస్త్య మాహాత్మ్యంబు ధర్మజునకుం జెప్పి వెండియు రోమశుం డి ట్లనియె. 32

ఆ. "అమరు లెల్లఁ దన్ను నట్లు కీర్తించుచు
నున్న జూచి, మనిగణోత్తముండు
వారి నడిగె "నేమి వచ్చితి? రెఱిఁగింపుఁ
డని దయాళుఁ డై ప్రియంబుతోడ. 33

వ. అనిన. 34

చ. అమరులు గాలకేయకృత మైన జగద్భయ మెల్లఁ జెప్పి "యు
త్తమమునినాథ! తత్ప్రీతివిధానము సేసి జగంబు గావఁ జి
త్తము గలదేని, విభ్రమదదభ్రతరంగమహార్ణవంబుఁ బా
నము దగఁ జేసి, చేయుము ఘనంబుగ మాకు మనఃప్రమోదమున్. 35

క. ఆతోయధి నీచేత ని
పీతం బగుడుం, గడంగి భీమాసురసం
ఘాతంబు దత్క్షణంబ ని
పాతింతుము దివ్యశస్త్రపటుఘాతములన్. 36

—: అగస్త్యుండు సముద్రోదకంబు పానంబు సేయుట :—

వ. అనిన నగస్త్యుం డట్ల చేయుదు నని యమరపరు కెల్ల సంతోషంబుగా నప్పుడు.

సీ. రంగదుత్తుంగ తరంగహస్తంబుల
నాడెడునది వోలె, నతులవేగ
వాతవిధూత మై వఱలెడునది వోలెఁ,
బర్వతకందరోపాంతతతులఁ

దొడ రెవ్వడునది వోలె, ధ్రువ ఫేనవితతుల
నగి యెడునది వోలె, నాగనక్ర
మకరకులక్షుభ్యమాణ మై తదాఖ్య
కోపనియది వోలె నుచ్చభీమ.

ఆ. నినద మగుచు నున్న నీరధి యొద్దకు
సమరగణముతో మహామునీంద్ర
గరుడ ఖచర సిద్ధ గంధర్వ పన్నగ
యక్షగణముతోడ నరుగు దెంచి. 38

ఉ. అందఱుఁ జూచుచుండఁగ మహాబ్ధిజలంబులఁ ద్రావె విష్టపా
నందకరుం డగస్త్యుఁ డఘనాశనుఁ; డట్లు పయోధి రిక్తమై
సం దిమి కూర్మ కర్కటక నక్ర భుజంగచయంబుతో భయం
బందుచుఁ గాలకేయులు బయల్పడి తోఁచిరి దానిలోపలఁ. 39

వ. అంత. 40

క. గీర్వాణప్రభు: డాదిగ
గీర్వాణగణంబు గాలకేయులతోడన్
గర్వించి రణము సేసి ర
ఖర్వపరాక్రములు గడిమిఁ గడు సుద్ధతులై. 41

క. అనిమిషదివ్యాయుధహతి
ననిఁ గొందఱు వడిరి; గొంద అధికవిభీతిం
జని పాతాళముఁ జొచ్చిరి
దనుజులు దైత్యులును వీర్యదర్పచ్యుతులై. 42

వ. ఇట్లు కాలకేయులందొట్టి యసురుల నెల్ల నిశ్శేషంబుఁ జేసి జగంబుల
యుపద్రవం బుడిపి దేవత లగస్త్యునిం గీర్తించి యిట్లనిరి. 43

క. "మునినాథ! నీయనుగ్రహ
మున నుడిగెను బాధ నిఖిలభువనంబుల, కి
వ్వనధిఁ బయఃపూర్ణముగా
నొనరింపుము; నీవ కాని యెరు లోప రిలఁ. 44

వ. ఇది యనేక సత్త్వాక్రియంబు గావున రిక్తంబై యుండఁ దగ'' దనిన నగస్త్యుం డిట్లనియె. 45

సీ. '' మున్న జీర్ణం బయ్యె మున్నీటి నీరు నా
కడుపున; నే నింక బడయ నేర ;
జలరాశి నిండంగ జల మొండు '' నావుడు
నమరులు మునులును గమలగర్భుఁ
గాసంగఁ జని '' దేవ ! మీనాకరం బేమి
తెఱఁగున నిండు ? మా కెఱుఁగఁ జెపుము ''
యని విన్నపంబు సేసినఁ బెద్దప్రొద్దు చిం
తించి, వారలకు విరించి యనియె

ఆ. '' వనధిఁ బెద్ద కాలమున భగీరథుఁ డను
వాఁడు నించుఁ; గాని వసుధ నొరులు
పూని దీని నింపఁగా నోప '' రనవుడు
నమరవరులు మునులు సరిగి రనిన. 46

క. వనరాశి యేమికారణ
మున నెట్లు భగీరథుండు భూరిజలౌఘ
బున నించె ? దీనిఁ జెప్పుమ "
యని యడిగిన ధర్మజునకు సమ్మని సెప్పెన్ 47

—: భగీరథుండు జలముచే సముద్రము నించుట :—

వ. '' తొల్లి యిక్ష్వాకువంశంబున సగరుం డను రాజు హైహయుల నిర్జించి, నిఖిలమహీరాజ్యంబు సేయుచు నపుత్రకుండై వైదర్భియు, శైబ్యము నను నిద్దఱు భార్యలతోడం గైలాసంబున కరిగి యందు.

క. దశముఖకుయ్యకరు, నిట
లాకుజ హుతభవ్యభుక్తానంగు, విరూ
పాకు, మహోత్తుధ్వజుఁ బ్ర
త్యక్షము గావించె నుగ్రతపమున నేర్మిన్. 49

తే. హరుఁడు వానికిఁ బ్రత్యక్షమయి వరంబు
వేఁడు మనవుడుఁ "దైర్యలోక్యవిభుఁడ! నాకు

దయ నొనర్పుము సంతానదాన'' మనుచు
వేఁడెఁ బుత్రార్థియై కడు వేడ్కతోడ. 50

వ. ఈశ్వరుండు వానిఁ వైదర్భియం దఱువదివేవురు గొడుకులును, శైబ్యయం దొక్కకొడుకుం గా వరం బిచ్చి, యయ్యఱువదివేవురు నతిదర్పితు లై యేకకాలంబునఁ గాలగోచరు లగుదు రనియు, నయ్యొక్క కొడుకు వంశకర్త యగు ననియుం జెప్పి యదృశ్యుం డైన. 51

క. కొడుకులఁ బలువురఁ బడసియుఁ
బడయనియట్టి దయి, ధర్మపత్నులుఁ దానుం
గడుసంతసపడ కరిగెను
దడయక సగరుండు మగుడి తనపురమునకున్. 52

వ. అంతఁ గొంతకాలంబునకు నయ్యిద్దఱు గర్భిణు లైన, నందు వైదర్భికి నొక్క యలాబూఫలంబును, శైబ్యకు నసమంజసుం డను కొడుకునుం బుట్టిన. 53

ఆ. ''వరదుఁ డైన యీశువరమున నిది యొక్క
పదరు వుట్టె, నెట్టిపరమొ!'' యనుచు
దానిఁ బాఱవైవఁ దా రున్న నాకాశ
వాణి యిట్టు లనియె వసుమతీశ! 54

తే. ''సాహసం బట్టు సేయంగఁ జనునె? దీని
బీజములు ఘృతఘటములఁ బెట్టి రక్ష
సేయు, మఱువదివేపు రూర్జితులు సుతు లు
మేశువరమునఁ బుట్టుదు రిందు నీకు''. 55

వ. అనినం దద్వచనానురూపంబు సేసి రక్షించు చున్న, రెన్నెలలకు.

క. సుతషష్టి సహస్రక ము
ద్గత మై వర్ధిల్లి, గగనగతిఁ బఱచి, శత
క్రతులోకముఁ దొట్టి మదో
ద్ధతిఁ జేసె సమస్తలోకతతులకు బాధల్. 57

క. సగరసుతు లట్లు జగముల
కొగి బాధలు సేయు చున్న నోడి, మరుత్వ
న్నగవరు లరిగిరి నాలుగు
మొగములు గల వేల్పుకడకు మునిసంఘముతోఁ. 58

ఆ. వారిజాసనుండు వారలు వచ్చిన
విధ మెఱింగి "మీకు వెఱువ నేల?
సగరసుతులు దగ్ధు లగుదురు; దర్పితు
లైనవారి వేర్మి యధ్రువంబు." 59

వ. అని కమలభవుం డానతిచ్చిన నరిగి యమరవరు లాదిగా నఖిలలోక
నివాసు లెల్ల సగరసుతపరిక్షయం బపేక్షించి యుండునంత. 60

సీ. అశ్వమేధంబు సేయంగ దీక్షితుఁ డయ్యె
సగరుండు; వాని యశ్వంబు సగర
తనయులచే రక్షితం బై వసుంధర
యెల్లఁ గ్రుమ్మరి. తోయహీన మైన
జలధిలోపల నదృశ్యం బైనఁ, గానక
సగరుస కెఱిఁగించి సగరసుతులు
జనకుశాసనమునఁ జని, భూతలమునందుఁ
దడయక రోసి, పాతాళతలము

ఆ. సందు రోయఁ గడఁగి, యఱువదివేపురు
నొక్క మొగిన గ్రొచ్చి రుపధిలోన
జలధిపంకమగ్నసత్త్వముల్ నిశిత కు
ద్దాలహతి విదారితములు గాఁగ. 61

వ. ఇట్లు గ్రొచ్చిగ్రొచ్చి సగరసుతులు సముద్రపూర్వోత్తరదేశంబునం
గపిలుం డను మహామునియాశ్రమ సమీపమునందుఁ దమ గుఱ్ఱంబుఁ
గని సంతోసిల్లి. 62

ఆ. "అశ్వమేధమునకు నర్చితం బైన యీ
యశ్వరాజు నిట్టు లపహరించి
ప్రుచ్చుగొనక యీసముద్ర దేశంబున
నోట మెడఁద లేక యున్నవాఁడు." 63

—: సగరసుతులు కపిలమహాముని కోపాగ్నిచే భస్మ మగుట :—

వ. అని కపిలుం బరిభవించిన నమ్మువివరుం డలిగి యనలశిఖలు దూల నతిఘోరదృష్టిం జూచిన నప్పుడు సగరసుతు లందఱు భస్మంబై న.

క. వీరు లగు సగరతనయుల
దారుణదాహంబుఁ జూచి తడయక చని యం
భోరుహగర్భతనూజుఁడు
నారదుఁ డంతయును సగరునకు నెఱిగించెఁ. 65

క. దాని విని సగరుఁ డురుళో
కానలదంద హ్యమానుఁ డయ్యును నయ్యా
శానువచనంబు దలఁచి ధ
రానాథుఁడు శోకభరపరావృత్తుం డై. 66

వ. అసమంజసపుత్రు నంశుమంతుం దన మనుమనిం జూచి "యయ్యా! నీయయ్య లఱువదివేవురు నొక్కటఁ గపిలకోపానలకబళితశరీరు లయిరి; భవజ్జనకుం డట్టిక్రూరహృదయుం డై పౌరబాలకుల న కారణంబ వధియించి మహానదిలో వైచుచున్న నెఱిఁగి పౌరజనా క్రోశంబునం దనుక్రోశపరుండ నై నాని విడిచితి. 67

క. కొడుకులకు వగవ; మును నా
కడఁగిన హయమేధమఖము గడచనమికిఁ నేఁ
గడు దుఃఖితుండ నయ్యెద
దడయక నీ విపుడు దీనిఁ దలఁగుము కడఁకన్." 68

వ. అనిన నంశుమంతుం డాక్షణంబ చని, సగరసుతఖాతద్వారంబున సముద్రంబుసొచ్చి, యందు సూర్యసహస్రద్యుతియై వెలుంగుచున్న కపిల మహాముని కి నమస్కరించి, నిజాగమనప్రయోజనం బెఱింగించినఁ గపిలుండును వానికిం గరుణించి యాజ్ఞీకం బైన యశ్వంబు నిచ్చి యి ట్లనియె. 69

క. "ఘనభుజ! నీకారణమునఁ
జనఁ గాంతురు పుణ్యగతికి సాగరులు ముదం

బున; సగరునకును దొరకును
నొనరఁగ సుతవంతు లైన యుత్తముల గతుల్. 70

వ. మటియు నీచేత నుపనీతం బైన యీాయశ్వంబున నశ్వమేధంబు సేసి సగరుండు గృతార్థుం డగు; నీ పౌత్రుం డైన భగీరథుచేతఁ దేరఁబడి యెడు గంగాజలౌఘంబులం జేసి సంసిక్తు లై, సగరసుతులు స్వర్గగతు లగుదురు; సముద్రంబు సంపూర్ణంబగు" ననిన నంశుమంతుండు సంతుష్టుం డై కపిలప్రసాదంబున నశ్వంబుఁ దెచ్చి సగరున కిచ్చి, కపిలు వచనంబు నెఱింగించిన సగరుండును బుత్రశోకం బుడిగి యశ్వమేధంబు సేసి, సముద్రుం దనకుం బుత్రుఁగాఁ గల్పించిన నది మొదలు సముద్రంబు సాగరఁబు నాఁ బరఁగె; నిట్లు సగరుండు పెద్దకాలంబు రాజ్యంబు సేసి నిజరాజ్యభారం బంశుమంతునందు సమర్పించి చనిన.

తే. తన పితామహునట్టుల ధరణి యేలి
యంశుమంతుండు నిజపుత్రుఁ డగు దిలీపు
నందు రాజ్యభారముఁ బూన్చి యఖిలలోక
పూజితుండు దపోవనంబునకుఁ జనియె. 72

వ. దిలీపుండును దన పితామహు లైన సాగరు లధోగతులు గాకుండ గంగావతరణంబునందు యత్నంబు సేసి యశక్తుం డయ్యె. 73

చ. ప్రథితయశుఁ, సుతుం బడసె భారసహిష్ణు, మహారథుఁ, భగీ
రథుఁ డను చక్రవర్తి, నపరాజితతేజు, నిజాన్వవాయదు
ష్పథవినివర్తకున్, సకలపార్థివపైత్రు, మదోద్ధతాసుహృ,
న్మథను, సుగాపగానయసమర్థతపోగుణయుక్తు నుత్తముఁ. 74

వ. ఆ భగీరథు నపారభూభారధురంధరుం జేసి దిలీపుండు దపోవనంబున కరిగిన. 75

తే. కపిలుకోపాగ్నిఁ జేసి సాగరులుగ్రాఁగి
రనియు, గతిఁ గానకున్న వా రనియు, నెటిఁగి
వారలకు హిత మొనరింప వగచి, గంగఁ
దేరఁ గడఁగె వీరుఁడు భగీరథుండు 76

వ. ఇట్లు భగీరథుండు గంగావతరణంబునందుఁ గృతనిశ్చయుండై యరిగి, బహువిధాకారధాతుమంతంబు లైన యుత్తుంగశృంగంబులను, జలభర

వినమ్రప్రబల బలాహకవ్యూహసంఛాదితశ్యామాయమానంబు లైన
తుహినస్థలంబులను, సిద్ధవిద్యాధర గంధర్వ గీర్వాణమిథునసంసేవ్య
మానంబు లైన నానారత్నకందరంబులను, శుక పిక పారావత
ఋక్షాపాంగ సారంగ శతపత్రపుత్రప్రియ దాత్యూహవ్యూహశబ్ద
శబ్దాయమానంబు లైన తరువనరేఖలను, సింహ శరభ శర్దూల
ఋండాల గోలాంగూల కోలాహలాన్వితంబు లైన గుహాగహ్వా
రంబులనుం జేసి రమణీయభయానకం బైన హిమవత్పర్వతంబున. 77

చ. సతతకృతోపవాసముల, శాకఫలోదకమూలపారణ
వ్రతముల, దేవపూజల, నపారజపంబులఁ జేసి నిష్ఠతో
నతులతపంబు సేసె నమరాపగ నుర్వికిఁ దెచ్చువేడ్కతో
ధృతియుతుఁ డై దిలీపకులదీపుఁడు దివ్యసహస్రవర్షముల్. 78

వ. ఆ భగీరథు తపంబునకు మెచ్చి గంగాదేవి ప్రత్యక్షం బై నీయిష్టంబు
వెస్పు మనినం గృతాంజలి యై యి ట్లనియె. 79

సీ. "తపనతేజుం డైన కపిలుకోపంబున
గతజీవు లై పుణ్యగతులయందు
విహతు లై మత్పితామహు లున్న వారు; నీ
దగు పుణ్యజలముల సగరసుతులు
సిక్తులై స్వర్గానుభక్తిఁ బ్రాపింతురు,
గావున దేవి! యిద్దేవపథము
సందుండి వసుమతీ కొందంగఁ జనుదేర
వలయు" నావుడు "మహీతలయమునకు

ఆ. నేను వచ్చునపుడు నా నిరంతరజలౌ
ఘంబు దాల్వ నీలకంఠుఁ డోపుఁ
గాని యెరులు దాల్వఁగా నోప; రయ్యమా
నాథుకరుణఁ బడయు నన్నుఁ దాల్వ." 80

వ. అనిన గంగాదేవివచనంబునఁ గైలాసంబున కరిగి భగీరథుండు భగ
వంతు, నంతకాంతకు, నీశ్వరుగుఱించి పెద్దకాలంబు దపంబు సేసిన
నీశ్వరుండు వానికి సన్నిహితుం డయి "నీవు భూలోకంబునకు గంగా

వతరణంబు సేయు; మేను గంగ ధరియించెద" ననిన భగీరథుండు వెండియు గంగ నారాధించిన నాతనికిం గరుణించి. 81

మ. ఇలకుఁ గంగ తరంగసంగతులతో నేతెంచె, నాశాంతరం
బులు, నాకాశముఁ గప్పుచుం; దగ మహాభూతప్రపంచంబుతోఁ
జెలు వై యుండఁగ దాని నీశ్వరుఁడు దాల్చెఁ సంగతోత్తుంగపిం
గళజూటాగ్రమునందుఁ బద్మదళసంకాశంబుగా లీలతోఁ. 82

సీ. సురమునిసిద్ధ ఖేచరవరుల్ వచ్చి య
చ్చెరు వంది చూడంగ హరుశిరంబు
నం దుండి భువనైకవందిత సురనది
ధరణీతలంబున కరుగుదెంచి,
కలహంసగతియు, నిర్మలఫేనహాసంబు,
నాకీర్ణమీనవిలోకనములు,
నాలోలపవనవాచాలితకల్లోల
లసితమృదూక్తులు నెసఁగు చుండఁ

గీ. బ్రీతితో భగీరథుఁ డను దూత చేత
నీత యై మహామునిపరిపీతరిక్త
మగు సరిత్పతిఁ గూడి యా సగరజులకు
హితముగా దాని నించె నాతతజలముల. 83

క. సాగరులకు సద్గతి గా
సాగరమున కట్లు సలిలసంపూర్ణము గా
భూగత యై భాగీరథి
భాగీరథకీర్తి భువనపక్తుంల నించెఁ." 84

వ. అని యిట్లు గంగావతరణంబును, భగీరథుమాహాత్మ్యంబును రోమ
శుండు సెప్పిన విని ధర్మజుం డనుజసహితుం డై యరిగి నందయు
నపరనందయును ననుమహానదులయందుఁ గృతస్నానుం డై, హేమ
కూటంబున నుపలంబులవలన వెలునడు దహనంబున నాసన్నాతంబు
లై వచ్చు మేఘంబులను జూచి విస్మయం బంది, దాని విధం బడిగిన
వానికి రోమశుం డిట్లనియె "ఋషభకూటంబున ఋషభుం డను
ముని యతికోపనుం డై యెవ్వరు వలికిన నపుడె యుగ్రానలాకారుం

డై యుపలంబులవలన వెలువడి మేఘంబులం బిలిచి వారల వారించు; దానంజేసి తపోదానధర్మశమదమరహితు లైన జనుల కది దురారోహంబు; దేవతలు, దేవదగ్ధనులైన ఋషులు నమ్మునిం జూడ వత్తురిందు దేవఋషులు యజ్ఞంబు సేసిన యజ్ఞభూములందుఁ గుశాకారంబు లైన దూర్వాంకురంబులు. యూపాకారంబులైన వృక్షంబులుఁ గానంబడు; ననిన నా పుణ్యతీర్థంబున స్నానంబు సేసి యరుగుచున్న ధర్మరాజునకు రోమశుం డిట్లనియె. 85

క. "ఇది విశ్వామిత్రునియా
స్పద; మిది కౌశికి యనంగఁ బరఁగినయది; యల్లది ఋశ్యశృంగుఁడనుమునీ
శ్వరా" మనవుడు ధర్మతనయుఁ డమ్మునిఁ గనియెన్. 86

—: రోమశుఁడు ధర్మజునకు ఋశ్యశృంగు చరిత్రము సెప్పుట :—

వ. ఋశ్యశృంగుం డను ముని జన్మంబును దచ్చరితంబును వినవలయునది యె "ట్లని యడిగిన రోమశుం డిట్లనియెఁ; "దొల్లి కశ్యపపుత్రుండగు విభాండకుం డను మునివరుం డఖండితబ్రహ్మచర్యంబునం దపంబు సేయుచు నొక్కనాఁ డొక్క మడువున నీళ్లాడు చున్న యవసరంబున.

క. సురుచిరసురూపగుణసుం
దరి యూర్వశి యను లతాంగి తద్దర్శనగో
చర యగుడు, నపుడ చేతఃస్ఖలనం బమ్మునికిఁ నయ్యెఁ గామకృతమునన్. 88

వ. అయ్యమోఘవీర్యంబుతో మిశ్రం బయిన జలంబు నొక్క దుప్పి పెంటి మృగంబు ద్రావి గర్భంబు దాల్చిన, నందు ఋశ్యశృంగుం డను కుమారుండు జన్మించి, తండ్రినింబాశ్రమంబునుంగాని యెందెఱుంగక ఘోరతపంబు సేయుచున్నంత. 89

తే. బలియుఁ డంగాధిపతి రోమపాదుఁ డనఁగ
ధరణిఁ బరఁగిన వీరుండు దన పురోహి
తాపరాధకృతమున బ్రాహ్మణులచేత
విడువఁబడినఁ దన్మహి కనావృష్టియయ్యె. 90

ప. దానికి వెఱచి యాతండు బ్రాహ్మణులఁ బరమభక్తి నుపాసించి "యీ యనావృష్టి దోషం బేమి కారణంబున నయ్యె? దీనికిం దగిన ప్రతికారం బెద్ది?" యని యడిగిన వానికిం బ్రసన్నుఁ డై బ్రాహ్మణు లిట్లనిరి. 91

క. "కడు దర్పితుఁ డని నిన్నుఁ
బిడిచిరి బ్రాహ్మణులు; వారు విడుచుడు నమరుల్
విడిచిరి; దానన వర్షను
దడసె భవద్దేశమునకు ధరణీనాథా! 92

ఉ. శాంతుఁడు బుష్యశృంగుఁ డను నమ్మని యున్న యెడఁ ధరిత్రికిఁ
సంతతవర్షణం బగు; భృశం బగు నట్టివరంబు దొల్లి వ్ర
క్రాంతకుఁ చే దయఁ బడసె నమ్మని; గావున బుశ్యశృంగు వే
దాంతసువేది రాఁ బనుపు మంగమహీశ్వర! నీదునేర్పునన్." 93

వ. అనిన విని రోమపాదుండు దన చేసిన బ్రాహ్మణావమానంబునకుం దగిన ప్రాయశ్చిత్తంబుఁ జేసి, బ్రాహ్మణవచనంబున నపుడ బుద్ధి మంతులతో విచారించి, విదగ్ధ వేశ్యాంగనలం బిలువం బంచి, "మీ నేర్చువిధంబుల బుశ్యశృంగుం బ్రబోధించి యిట తోడ్కొని రం" డని పంచిన. 94

క. ఆ వేశ్యాజను లధికర
సావహభక్ష్యములు, విలసదనులేపనమా
ల్యావళులుఁ గొనుచు నరిగిరి
నావాశ్రమమునకు నమరనారులలీలన్. 95

వ. అట విభాండకుండును యథాకాలం బగ్నిహోత్రంబు వేల్పం దన పుత్రు బుశ్యశృంగు సమర్పించి, వన్యఫలాహారణార్థంబు వనంబున కరిగిన యవసరంబున నం దొక్క జరద్వేశ్య దన కూఁతు, నభినవయౌ వనవిలాసవిభాసిన నమ్మునిపుత్రు పాలికిం బుచ్చిన, దానిం జూచి బుశ్యశృంగుండు సంభ్రమంబున. 96

—: బుశ్యశృంగుఁడు వేశ్యను మునికుమారునిఁగా భావించుట :—

మధ్యాక్కర. ఎందుండి వచ్చితి బుషికుమారక? యెన్నండు నిట్టి
సుందరాకారు మునిసుతు నేఁ దొల్లి చూచి యెఱుంగ;

నిం దుండు మీవని కృష్ణమృగచర్మకృతకుశాసనము
నం దుండఁగాఁ బనిచె ఋషి యనుబుద్ధి నత్తన్వీ భ్రీతి.

వ. మఱియు నర్ఘ్యపాద్యాదివిధులను, వన్యస్వాదుఫలదానంబులఁ దాని కతిథిపూజ సేయ నున్న నది యమ్మునివరున కిట్లనియె. 98

క. "మాయాశ్రమ మిందులకుఁ
న్యాయనిధీ! మూఁడు యోజనంబులు గల; దేఁ
బోయెద; నీవును విజయం
చేయుమ యందులకుఁ; జెలిమి సేయుము నాతోన్. 99

వ. అట్లేని నీచేత సత్కారంబు గొందు" ననిన ఋష్యశృంగుం "డట్లు సేయుదు" నని దాని నాతిథ్యవిధానంబునం బూజించి, తనకు దాని యిచ్చిన దివ్యగంధమాల్యంబులును, సరసభక్ష్యపానంబులును, విచిత్ర వస్త్రంబులుం బరిగ్రహించిన నదియును. 100

క. మునిముందటఁ గందుకన
ర్తనమృదుగీతములయందుఁ దన కౌశల మె
ల్లను జూపి, విరచితాలిం
గన యై మునిపతికి ముదము గావించె మదిన్. 101

వ ఇట్లు ఋష్యశృంగుం బ్రబోధించి వేశ్యాపుత్రి యరిగిన, దానిపోయిన వలను సూచుచు ఋష్యశృంగుం డగ్నిహోత్రంబు వేల్పక మఱచి, విపరీతబుద్ధి యై యున్న, నంత నడవినుండి వన్యఫలంబులు గొనివచ్చి విభాండకుండు గొడుకుం జూచి "యి ట్లేల చింతాపరుండ వై యగ్నిహోత్రంబు వేల్పక, కాలాతిక్రమణంబు సేసె దనినఁ దండ్రికి ఋష్యశృంగుం డి ట్లనియె. 102

సీ "కాంచనవర్ణుండు, గడురూపవంతుండు,
గమ్మనిజడలతో ఘనము లగుచు
సనయంబు వట్రువ లగు రెండుపిండంబు
లురమున విలసిల్లు చుండ, నఱుత
వెలుఁగుచు జపమాల వ్రేలంగ, నన్నువ
నడుమను వడకంగ, నడచునపుడు

కలహంసకూజితకలనాద మెసఁగ నా
పాలికి నేఁ డొక్కబ్రహ్మచారి
ఆ. వచ్చి, పోయె ; వాని వదనంబువలన వె
ల్వడు సుగంధి మధురభాషితంబు
పొలుచు వినఁగ సమఁడపుంసోక్కికిలాలాప
చారు వగుచు హృదయసమ్మదముగ. 103

క. ఆ ఋషికుమారు కట్టిన
చీరలు నతిమృదులములు, విచిత్రములు, మనో
హారము వానిబృహత్కటి
భారమునం దొక్క కనకపట్టము వెలుఁగున్. 104

క. వవన సమీరితమధుపం
భవవివిధప్రసవసౌరభముఁ బోలి మని
ప్రవరుని తనువునయుం దు
ద్భవ మై రమ్య మయి సౌరభము విలసిల్లన్. 105

వ. మఱియు నక్కుమారుం డొక్క యెఱ్ఱని ఫలంబు దన దక్షిణ పాణి తలంబున నందంద చఱచుచు నది నేలంబడి యెగయం బోయిన వల నికి వ్రాలుచు, వాతా వధూతం బైన బాలవృక్షంబునుంబోలె నొప్పు చున్న, నమ్మునిపుత్రునందు నా హృదయంబు దద్దయుం దగిలిన యది. 106

ఉ. నన్నును గౌఁగిలించుకొని, నావదనంబునకున్ నిజాస్య మూ
సన్నముఁ జేసి, యొక్క మృదుశబ్దము సేసె మనోహరంబుగా;
నెన్నఁడు నట్టిశబ్దము మునీశ్వర ! మున్ వినియే నెఱుంగ; న
య్యన్నవ బ్రహ్మచారిముఖ మంబురుహంబుసమంబు సూడఁగన్.

వ. నాయిచ్చిన వన్యస్వాదుఫలంబు లాదరించి యారగింప కమ్మునికుమారుం డమృతోపమానంబు లైన ఫలంబులు, నతిమధురంబులైన పానీయంబులు నాకు నిచ్చిన నుపయోగించితి; నట్టి రసవిశేషంబు లేను మున్నెన్నఁడు రుచియించుటలేదు; మఱియును. 108

క. తనచేతి పుష్పములఁ జ
ల్లిన నంతటఁ దెదరి యవి యళిప్రకరనిభే
వన మొప్ప నున్నయవి; యి
వ్వనకుసుమము లట్లు గావు వరగంధంబుల్. 109

వ. నాకు నమ్మునిపుత్రు నాశ్రమంబునందు వానితో నొక్కటఁ దపంబు
సేయుచుండ నిష్టం" బనినఁ గొడుకు పలుకులు విని విభాండకుండు
విస్మితుం డై "తపస్వుల తపంబులకు విఘ్నంబులు సేయ
ననేక రూపులయి రాక్షసులు వనంబునం గ్రుమ్మరు చుండుదురు;
తజ్జనదత్తంబు లయిన పానీయంబు లపేయంబు; లతిసుగంధులయిన
కుసుమంబులు మునులకు వర్జనీయంబు" లని కొడుకుం బ్రబోధించి
యెప్పటియట్ల వన్యఫలంబులు దేర నరిగిన. 110

క. చనుదెంచి తరుణి మునినం
దనుచిత్తంబునకు వైకృతముఁ జేసె; విలా
సినుల సహాలాప సహా
సన సహాయానములు బంధసమములు గావే? 111

వ. ఇట్లు ఋశ్యశృంగుఁడు విలాసినీమోహితుం డయి తండ్రి కెఱిఁగింపక,
స్వచరితం బయిన తన యాశ్రమంబు విడిచి, మనుష్యయోగంబునం
దగిలి యక్కొమలి పిఱుందన చని, యంగదేశంబు సొచ్చి, యందు
రోమపాదునాదేశంబున రాజాశ్రయం బను భవనంబున నుండునంత.

మత్తకోకిలము. అమ్మునీశు నివాసశక్తిఁ దదంగదేశమునందు మే
ఘమ్ము లెల్లవలంకులం గదుఁ గ్రమ్మి, సద్వ్యజన ప్రమో
దమ్ముగాఁ బ్రభవద్బృహజ్జలధార లొప్పఁగ వృష్టిఁ జే
సె మ్మహానదులున్ మహాసరసీవరంబులు నిండఁగాన్. 113

వ. ఇట్లు ఋశ్యశృంగు నాగతంబున నంగవిషయంబున నవగ్రహదోషంబు
నిరస్తంబై న సంతసిల్లి రోమపాదుండు తన కూఁతు శాంత యను
దాని నత్యంతకాంతిమతి నమ్మునివరునకు వివాహంబు సేసి. 114

క. అనుభోగ యోగ్యములుగా
ధనరాసులు, భూషణములుఁ దాసీనివహం
బును, గాంచనమయశయ్యా
సనములు మని కిచ్చె హృదయసంతోషముగాఁ. 115

—: విభాండకుఁడు ఋశ్యశృంగుని వెదకుచు వచ్చుట :—

వ. మఱియు గోసహస్రంబు లనేకంబు లిచ్చి, గోకులసంకులంబుగా ఘోషంబులు దేశంబుల నెల్ల నిలిపి, నిత్యసత్కారంబుల ఋశ్యశృంగు నకుఁ బ్రియంబు సేయుచుండె; నంత నట విభాండకుండు దన యాశ్ర మంబునఁ గొడుకుం గానక, యెల్ల దేశంబులు రోయుచు నంగదేశం బునకు వచ్చి, గోగణసంకీర్ణం బైన యొక్క ఘోషంబునందు గోప సత్కృతుండై యొక్క దివసంబు వసియించి, యిది యెవరి ఘోషం బని గోపాలుర నడిగిన వార లి ట్లనిరి. 116

క. "యతినాథ! వినవె యిది నీ
సుతుఘోషం; బిదియ కాదు చూడ ననేకా
యుతధేనుఘోషంబులు గల వు
న్న తగుణనకు ఋశ్యశృంగునకు నిద్ధరణిన్." 117

వ. అనిన విని విభాండకుండు సంతసిల్లి ఋశ్యశృంగు తొట్టుపట్ల విశ్ర మించుచు రోమ పాదపురంబునకు వచ్చి యందు శాంతాసహితుం డైన ఋశ్యశృంగుం జూచి, సంతుష్ట హృదయుండై, తన కొడుకుం గోడలిం దోడ్కొని నిజాశ్రమ.బున కరిగె; నందుఁ వసిష్ఠున కరుంధ తియు, నగస్త్యునకు లోపాముద్రయు, ముద్గలునకు నాలాయిని యైన యింద్రసేనయుంబోలెఁ దనకుఁ బరమభక్తి యుక్తయై శాంత పరి చర్యసేయుచుండ ఋశ్యశృంగుండు సుఖం బుండె" నని చెప్పిన నాకౌశికహ్రదంబున నందఱు నభిషిక్తులై, యేనూఱుమహానదుల సమాగమస్థానం బయిన గంగా సాగరసంగమంబుఁ జూచుచు సముద్ర తీరంబునం జని, కళింగదేశంబున వైతరణి యను మహానదిం గని; రంత రోమశుండు ధర్మరాజున కి ట్లనియె. 118

క. "మునిదేవనరులు యజ్ఞము
లొనరించిరి తొల్లి దీని యుత్తరతీరం
బున; నిది పుణ్యాస్పద మై
తనరును యజ్ఞావభృథశతస్నానములన్. 119

వ. మఱియు సకల యజ్ఞంబులయందును బ్రశస్తం బయిన పశుభాగంబు పశుపతికి దేవతలును ఋషులు నిందుఁ గల్పించి; రితిర్థం బాడినవారు దేవయానగతు లగుదు" రనినం గృష్ణాసహితుం డై ధర్మతనయుండు దమ్ములుం దానును వైతరణిస్నానంబు సేసి రోమశుం జూచి "మునీంద్రా! నాకు భవత్ప్రసాదంబున నఖిలలోకంబులుం గాననయ్యె; వైఖానసుల వేదాధ్యయనశబ్దంబులు విననయ్యె" ననిన విస్మితుండై రోమశుండు "వైఖానసుల నివాస బిందులకుం ముప్పదివేల యోజనంబులు గలదు; వారల యధ్యయన శబ్దంబులు వింటివి గావున నీవు దివ్యుండ" వంచు నరిగి యనవరతఫలాలంకృతం బైన యొక్క వనంబు గని యిట్లనియె "నిందుఁ దొల్లి స్వాయంభువుం డైన విశ్వ
కర్మ యజ్ఞంబు సేసి. 120

క. దక్షుఁ డయి యజ్ఞదక్షిణ
దక్షిణభూభాగమెల్లఁ దా నిచ్చె నశే
షితిధరవనములతో
నతయ గతిఁ గశ్యపునకు నార్త్విజ్యమునన్. 121

వ. దాని కలిగి భూదేవి కశ్యపునకుం బట్టీక. రసాతలంబునకుం బోయినఁ దత్ప్రసాదార్థి యై కశ్యపుం డుగ్రతపంబు సేసినం బ్రసన్నయై భూమిదేవి నీరిలో నుండి వెలుపడి, వేదిరూపంబునం గశ్యపునకుఁ నిజ రూపంబు సూపె; నవ్వేది యిది సుమ్ము; దీని నెక్కినవారు వీర్య వంతు లగుదుఁ రీమంత్రంబున దీని నెక్కుండు; పెఱనాఁ డిది దా వీక సముద్రంబు సొచ్చు" నని "యగ్నిర్మాత్రోయోని" యను నివి యాది గాఁగల మంత్రంబు లుపదేశించిన. 122

క. అనుజులుఁ దానును మునిశా
సనమున నవ్వేది యెక్కి సమధిక వీర్యం

బున నొప్పె బ్రాహ్మణుల దీ
వన లెసఁగఁగ ధర్మసుతుఁడు వాసవలీలన్. 123

క. ధరణీసురవనమునిగణ
పరివృతు లై యరిగి కనిరి పాండవులు వియ
చ్చర సేవితబంధురసుం
దరకందర మగు మహేంద్రధరణీధరమున్. 124

వ. అందుల మహాతపోధనులకు నమస్కార సత్కారంబుల మనఃప్రియంబు
సేసి ధర్మరా జి ట్లనియె. 125

తే. "పరమమునులార! యిగ్గిరిఁ బరశురాముఁ
శుభచరిత్రుని మీ రెప్డు సూతు రట్టె!
యమ్మహాభాగు మీ చూచునవసరంబు
నందు మాకును జూడంగ నమరునొక్కొ?" 126

వ. అనిన నమ్మునిసంఘంబులోన రామానుచరుం డయిన యకృతవ్రణుం
డను ముని ధర్మరాజున కి ట్లనియె. 127

తే. "ధర్మతనయ! మీరాక ముందర యెఱుంగు
జామదగ్న్యుండు నిర్మలజ్ఞానదృష్టి;
ననఘ! యెల్లి చతుర్థి నమ్మహాత్ముఁ
జూచు రిమ్మును; లీవును జూడు మిచట." 128

వ. అనిన ధర్మతనయుండు మహేంద్రంబున నారాత్రి వసియించి యకృ
తవ్రణు నిట్లని యడిగె. 129

క. "భువన స్తుత్యం డగు భా
ర్గవచరితము వినఁగ నాకుఁ గడుఁ గౌతుక గా
రవ మైనది; దాని మునీ
ప్రవర! యెఱిఁగింపు కర్ణపథరమ్యముగాన్". 130

—: అకృతవ్రణుఁడు ధర్మరాజునకుఁ బరశురాముని మహిమ సెప్పుట :—

వ. అని యడిగిన ధర్మరాజునకు నకృతవ్రణుం డి ట్లని చెప్పెఁ "దొల్లి
కన్యాకుబ్జంబున గాధి యను రాజుకూఁతు సత్యవతి యనుదాని భృగు

పుత్రుం డగు ఋచీకుండను మహాముని వివాహార్థియై గాధి నడిగిన, నమ్మునివరునకు వాఁ డి ట్లనియె. 131

సీ. "ఒక్క కర్ణంబు నీలోత్పలశ్యామ మై
తను వెల్ల శశివాంసధవళ మైన
యిట్టిగుఱ్ఱములు వే యిక్కన్య కుంకు; వి
ట్లీ నోపు దేని మునీంద్ర! దీని
నమరంగఁ బెండిలి యగు; మిది మాకుల
ధర్మంబు" నావుడుఁ దరుణిఁ బెండ్లి
యగు వేడ్క భార్గవుఁ డప్పుడ వరుణేంద్రు
పాలికిఁ జని, వానిఁ బడసి తెచ్చె;

ఆ. నవనినాథ! గంగయందుఁ, గన్యాకుబ్జ,
పురవరంబునందుఁ బుట్టె నట్టి
హాయసహస్ర మమల మై; నాఁటఁగోలెను,
నశ్వతీర్థ మనఁగ నయ్యె నదియు. 132

వ. ఋచీకుండును గాధికి నిచ్ఛాసమంబు లైన హయంబుల నిచ్చి, వాని కూఁతు సత్యవతిం బాణిగ్రహణవిధిం బరిగ్రహించిఁ సుఖంబున్నఁ గన్యాకుబ్జంబునకు భృగుండు వచ్చి, వారలచేతం బూజితుం డై, కొడుకునుం గోడలిం జూచి సంతసిల్లి, యొక్కనాఁడు కోడలి కి ట్లనియె. 133

క. "లలితాంగి! యేను నీ గుణ
ముల కతిహృష్టుండ నైతి; ముద మొనరఁగ ని
మ్ముల నిచ్చెద వేఁడుము నీ
వలచువరం" బనిన సత్యవతి యి ట్లనియెన్. 134

వ. "దేవా! నీ ప్రసాదంబున నా కొక్క కొడుకును, మజ్జనని కొక్క కొడుకు నుదయింప వలయు" నని మ్రొక్కినం గరుణించి భృగుండు నీ కోరినయట్ల యగు; ఋచిస్నాతలయి నీవు మేడిమ్రానిం గౌఁగిలింపుము, నీ జనని నశ్వత్థంబుఁ గౌఁగిలింపు మను" మనిన నయ్యిద్దఱుఁ దదాలింగనవిపర్యాసంబు సేసిన నెఱింగి భృగుండు గోడలి కి ట్లనియె.

ఉ. "పుత్రుఁడు నీకు బ్రహ్మకులపూజ్యుఁడు పుట్టియు, వాఁడు దారుణ
ధాత్రీచరిత్రుఁ డై పరఁగు సత్త్వమునఁ; మఱి నీ సవిత్రికిన్
ధాత్రియుఁ దుచ్ఛవిల్లియు నఘక్షయ కారణుఁడున్, మహాతపః
పాత్రుఁడు నై ధృతిం బడయు బ్రాహ్మణభావము భూరితేజమునఁ."

వ. అనిన సత్యవతి గృతాంజలియై క్షత్రియభావంబు దనపుత్రునకుం గాక పౌత్రున కగునట్లుగా శ్వశురువలన వరంబు వడసి కతిపయ కాలంబునకు గర్భిణియై. 137

క. ఆదిమునిచరితుఁ బడసెఁ బ్ర
సాదసమన్వితు, సుపుత్రు, జమదగ్నిఁ జతు
ర్వేదంబులయందు, ధను
ర్వేదమునందును, నతి ప్రవీణు మహాత్మునఁ. 138

వ. ఆ జమదగ్ని ప్రసేనజితుం డను రాజుకూఁతు రేణుక యనుదాని వివాహంబయి, దానియందు రమణ్వా త్సుషేణ వసు విశ్వావసు రాము లనువారి నై దుగురు కొడుకులం బడసి, వనంబున ననుగ్రతపంబు సేయుచు నొక్కనాఁడు వన్యఫలంబులు దేరం గొడుకులు వోయిన, రేణుక వారి పిఱుందన పోయి యొక్క సరోవరంబునందు సభార్యుం డయి జలక్రీడ లాడుచున్న వాని, మార్తికావతపతియగు చిత్రరథుం డను రాజుం జూచి, కామమోహిత యై వ్యభిచరించిన దాని దుశ్చరితం బెఱింగి కోపోన్మాదపరవశుం డై. 139

క. తనయుల నలువురఁ గ్రమమునఁ
బనిచెఁ జమదగ్ని దనదు భార్య వధింపఁ;
జననీఘాతమ్ము పాతక
మని వారలు పలుక కుండి రవ్యవసితు లై. 140

క. కడు నలిగి యమ్ముసీంద్రుఁడు
గొడుకులకును శాప మిచ్చె "ఘోరాటవిలో
జడమతి మృగపక్షులయ
ట్లుడుగక యజ్ఞానవృత్తి నుండుం" డనుచున్. 141

వ. మఱియు నిశితపరశుహస్తు రాముం జూచి "దీని వధియింపు" మని జమదగ్ని పంచిన వాఁడు గురువచనంబున దల్లిం తత్క్షణంబున వధియించిన. 142

క. శమితనిజక్రోధుం డై
జమదగ్ని తనూజు సాహసమునకుఁ దన వా
క్యము లంఘింపమికిఁ బ్రస
న్నమనస్కుండై తనూజునకు ని ట్లనియెన్. 143

వ. "నా వచనంబున నతిదుష్కరం బైన కార్యంబు సేసితి; నీ కిష్టం బైన వాని నెల్లను వేఁడు మిచ్చెద" ననిన రాముండు సంతుష్ట హృదయుం డై "మదీయజనని జీవించి యుండను, నాకుఁ దద్వధ దోషనిష్కృతియు, సహోదరులు శాపవిముక్తు లయి యెప్పటియట్ల యుండను, సమరంబుల నా కప్రతిహతశక్తియు, దీర్ఘాయువుం గాఁ బ్రసాదింపుం" డని తండ్రివలనం దన యభిమతంబులు వడసి యుండు నంతఁ గొండొకకాలంబున. 144

చ. అమితబలుండు, హైహయుఁ డహార్పతితేజుఁ డజేయబాహువి
క్రముఁడు, సహస్రబాహుఁ డనఁగా విదితుం డగువాఁడు తద్వనాం
తమున మృగవ్యథన్నుఁ డయి తా జమదగ్నిమహామునీంద్రు నా
శ్రమమున కేఁగుదెంచె బహుసైన్యముతో నధికక్రమార్తుఁ డై. 145

వ. అందు మునివరు చేతం బూజితుఁ డయ్యును, వాఁడు దన రాజ్య మదంబున మెచ్చక, యయ్యాశ్రమవాసుల కవమానంబు సేసి, యందల వృక్షంబు లెల్ల విటీచి, జమదగ్ని హోమధేనువును దరుణ వత్సంబుతోఁ గట్టి కొనిపోయిన నప్పు డవ్వనం బునుండి సమిత్కుశ ఫలంబులు గొనివచ్చిన రామునకు జమదగ్ని యి ట్లనియె. 146

క. "వినవయ్య! కార్తవీర్యుఁడు
మనధేనువుఁ బట్టుకొని సమర్థుం డయి పె
ల్చన పోయె; నేమి సేయుద
మనవుడు రాముండు విని మహాక్రోధమునఁ. 147

క. గురువచన బోధితుం డై
సరభసగతి వానిపిఱుఁదఁ జని, తత్సలమున్
శరవృష్టి ముంచి చంపె న
పరిమితలయకాలమేఘపటలముపోలెన్. 148

వ. మఱియును. 149

—: పరశురాముఁడు కార్తవీర్యుని జంపుట :—

చ. బలిమి నశేషలోకపరిభావిమహోద్ధతశౌర్యసంపదం
బొలుచు సహస్రబాహుకరముల్ గులిశాతినిశాతబాణధా
రల నతివీరుఁ డై తునిమి, రాముఁ డరాతులకున్ భయంబుగాఁ
గలహాములోన వాని నతిగర్వితుఁ జంపెఁ బరాక్రమోన్నతిన్. 150

వ. అంతం గార్తవీర్యుని పుత్రులు బద్ధవైరు లై రామరహితం బయిన
జమదగ్న్యాశ్రమంబునకు వచ్చి యందు 151

మ. మునులం దిట్టుచుఁ, బుష్పవృక్షతతు లున్మూలించుచుం, గ్రూరు లై
యనవద్యున్ బమదగ్నిఁ బట్టి బలిమిన్ హోరామ హోరామ యం
చును నాక్రోశము సేయుచుండఁగ, మునుల్ శోకింప, ధర్మాత్ము న
మ్మునిముఖ్యున్ వధియించి రాగ్రహమునన్ మోహాంధులై
హైహాయుల్.

చ. వఱలఁగ రాముఁ డంత ననవద్యుఁడు వచ్చి బహుప్రలాప యై
యఱచుచు నున్న తల్లిని, గృతాంతచకస్థితుఁ డైనతండ్రి, న
త్తఱిఁ గని తీవ్రశోకపరితాపహతుం డయి, తత్ప్రతీకార మం
దెఱిఁగి ముహూర్తమేనియు సహింపఁగ నోపక కోపదీప్తుఁ డై. 153

చ. "అనఘు, ననాథతాయిఁ, గరుణాత్మ్ఁ, బ్రశాంతుని, దాంతు నిమ్మహా
మునివరుఁ జూచి చూచి యధమున్ వధియించిరి; దీనఁజేసి దు
ర్జను లగుచున్న క్షత్త్రియులఁ జంపుదు" నంచుఁ బ్రతిజ్ఞ సేసె భూ
వినుతుఁడు జామదగ్న్యుఁ డతివీరుఁడు లోకభయంకరాకృతిన్. 154

వ. ఇట్లు కృతప్రతిజ్ఞుం డై క్షత్త్రియుల నెల్ల వధియించి, దిగ్జంతిదం
తార్గళాఘాట మహీచక్రంబు సాధించి, విహిత వివిధాధ్వరుం
డై కశ్యపునకు నార్త్విజ్య దక్షిణగా నఖిలభూవలయంబు నిచ్చి,
నిస్సంగుం డై మహేంద్రపర్వతంబునం దపోనిత్యుం డై యున్నవాఁ"

డని పరశురాము చరితంబు సెప్పిన విని ధర్మజుం డనుజ బ్రాహ్మణ సహితుం డై మునిగణోపదేశంబునం జతుర్దశినాఁడు పరశురాముం జూచి పరమభ క్తిం బూజించి, తత్ప్రీతిపూజితుం డై దక్షిణదిక్కునకుం జని. 155

క. భూవినుతం బై త్రిభువన
పావనమై త్ర్యంబకప్రభన మైన జలౌ
ఘావళిఁ బవిత్ర మగు గో
దావరిఁ బుణ్యనదిఁ గనియె దక్షిణగంగన్. 156

శా. గోదేవక్షితిదేవభ క్తి పరుఁడై, గోదావరీస్నాతుఁ డై,
గోదానంబులు, హేమదానములుఁ, బెక్కుల్ రత్నదానంబులున్
భూదేవో త్తమపూజ సేయుచు జగత్పూజ్యుండు ధర్మాత్మజుం
డాదిత్యాభుఁ డనేకతీర్థశత సేవా సక్తపుణ్యాత్ముఁ డై. 157

వ. ద్రవిళదేశంబున నగస్త్యతీర్థం బాడి, యందుఁ దొల్లి యర్జునుచేసిన గోసహస్రదానాదివివిధదానంబులు విని, వానిం బ్రశంసించుచుం జని, శూర్పాకారం బను తీర్థంబునం బర్వతోత్సేధం బయిన పరశురామవేదిం గని, సముద్రతీరంబునకుం జని, ప్రభాసతీర్థంబునం బండ్రెండు దినంబులు పంచాగ్నిమధ్యంబునం బవనాంబు భక్షకుం డై ధర్మజుండు దపంబు సేసిన. 158

ఆ. దాని నెఱిఁగి రామ దామోదరులు వృష్ణి
వరులతోఁడ ప్రీతి నరుగుదెంచి
కనిరి సకలతీర్థగమన పథ్లక్లేశ
కృశులఁ, బాండుసుతుల, పీతదయశుల. 159

క. చీరాజినధారుల నవి
కారతపోయుతులఁ జూచి కడు దుఃఖితు లై,
వారిజదళాక్షి ద్రౌపది
నూరార్చి రుదారహితమృదూక్తుల నొప్పఁ. 160

వ. వారికి ధర్మతనయుండు దమ వనవాసతీర్థగమనాయాసంబును, నర్జును దివ్యాస్త్రలాభంబును, నింద్రునొద్ద నాతని యునికియుం జెప్పిన విని రాముండు గృష్ణాదులైన వృష్ణివరుల కిట్లనియె. 161

సీ. "మతిహీనుఁ డై తన సుతుని పల్కులు విని
ధృతరాష్ట్రుఁ డీపాండుసుతులఁ, బాప
భీరుల, నపగతధారుణీరాజ్యులఁ
జేసి యుగ్రారణ్యవాసగతులఁ
గావించె; నిది ధర్మమే? విచారవిహీనుఁ
డయ్యె; భీష్మాదులు నెయ్య మమర
వారింపఁగా దీని నేరర; దృఢసత్య
రతులకు, దేవనిర్మితుల కహిత

ఆ. మాచరించుచున్న నీచ దుర్యోధనా
దులకు వర్ధనమును, నలఘు లైన
పాండునందనులకు చండితారుల కవ
ర్ధనము నిట్లు సేయఁ బనునె విధికి? 162

క. ధరణీతలంబు నిర్ధా
ర్తరాష్ట్రిముగఁ జేసి. యనఘ ధర్మైకధురం
ధరు ధర్మతనూజు వసుం
ధర కధిపతిఁ జేయకుండఁ దగునే మనకున్? 163

వ. అనిన బలదేవునకు సాత్యకి యిట్లనియె. 164

చ. "అనుపమశౌర్యవంతుల, రనంతబలాఢ్యుల రీవు, నీజనా
ర్దనుఁడును, సాంబసారణులు, దర్పకవీరుఁడు నుండఁ బాండునం
దనులు సుయోధనాదులకృతంబున నిట్టు లనాథులట్ల యి
వ్వనమున నుండఁగాఁ దగునె వన్యఫలాశనహీనవృత్తితోన్? 165

తరలము. అహితచిత్తవిదారణక్రియలందుఁ బ్రౌఢము లై, జగ
త్కుహర మంతయు ప్రోయుచుండఁగ ఘోరయాదవసైన్యస
న్నహనదుందుభినాదముల్ గగనంబు దిక్కులు నిండ, దు
స్సహము లయ్యెడు ధార్తరాష్ట్రులసైన్యవీరభటాలికిన్. 166

మ. ఘన మై నీపృథుబాహులాంగలముఖాఘాతంబుతోడ జనా
ర్దనశార్ఙ్గచ్యుతసాయకావలియుఁ, గంధర్వేషుజాలంబు, నీ
యనిరుద్ధోగ్రశిలీముఖాలియు, మదియాస్త్రోఘమున్ ధార్తరా
ష్ట్రినికాయోత్తమకాయఖండనపటిష్ఠం బయ్యెడుం బోరిలోన్.

వ. కేకయసృంజయపాంచాలవృష్టిభోజాంధకవీరులుం గృష్ణానుమతులయి
యుద్ధంబున ధృతరాష్ట్రి పుత్రులను భీష్మద్రోణకర్ణాదులను వధియిం
తురు; ధర్మరాజు దమ్ములుం దానును సమయాబ్దంబులు సలిపి
రాజ్యాభిషిక్తుండగునంతకు నతిరథు నభిమన్యు నఖిలరాజ్యదత్తకుం
జేసి యుండుద"మనిన సాత్యకి పలుకుల కనుకూలుండయి వాసు
దేవుండు ధర్మరాజున కిట్లనియె. 168

ఉ. "ఈతనిపల్కినట్ల ధరణీశ్వర! నీరిపులఁ మహాబలో
పేతులఁ బోరఁ జంపుదు రభేద్యులు వీరలు; మీకు భూరిధా
త్రీతలరాజ్య మెల్ల నగుఁ దెల్లము" నావుడు ధర్మనందనుం
డాతతకీర్తి యిట్లనియె నమ్మురవైరికి, సీరపాణికిన్. 165

ఉ. "పిదయ మాకఁ గల్గఁగ నమిత్రుల నోర్చుట యేమి పెద్ద? ధ
ర్మోదయనిత్యబుద్ధులను, నుత్తమకీర్తుల నొప్పు ద్రోణభీ
ష్మాదుల సన్నిధానమున నమ్మెయిఁ బల్కినపల్కు దప్పఁగాఁ
గా"దని ధర్మనందనుఁడు గ్రమ్మఱిచెఁ యదువీరకోపముల్. 170

వ. యాదవులు పాండవుల పిడ్కొనిపోయి; రిట పాండవులు సోమమిశ్రిత
తోయ మైన పయోష్ణియందుఁ గృతస్నాను లయియున్న, నందు
ధర్మరాజునకు రోమశుం డిట్లనియె.

క. "మనుజేంద్ర! దినీతీరం
బున భృగుఁ డనురాజు యజ్ఞములఁ జేసిన నం
దనిమిషపతి తృప్తుం డై
దనుజుల నోర్చెనఁట ఘోరతరశస్త్రములన్ 172

వ. మఱియు నింద తొల్లి యా ధూర్తరయసుం డైన గయుండు
హిరణ్మయంబు లయిన చషాలస్థాలీయూపచమసపాత్రీ స్రుక్స్రువం
బులును, దేవస్థాపితంబు లయిన యూపంబులు నొప్ప నే డశ్వమేధం

బులు సేసి, యసంఖ్యాతంబు లైన ధనంబుల ఋత్విజులను సదస్యులనుం బూజించి, సువర్ణమయగోదానంబు లనేకంబులు బ్రాహ్మణుల కిచ్చి, యశ్వయంబు లయిన యింద్రలోకసుఖంబులం బడసెఁ; బయోష్ణి యందుఁ గృతస్నాను లైనవారు దేవసాయుజ్యంబుఁ బడయుదు"రని చెప్పుచుం జని నర్మదాస్నానంబుఁజేసి వైదూర్యపర్వతంబుఁ గని రోమశుండు ధర్మరాజున కిట్లనియె "నిది త్రేతాద్వాపరసంధి; యీ సరోవరతీరంబు శర్యాతియజ్ఞప్రదేశంబు; మఱియు నిందు భృగుపుత్రుం డయిన చ్యవనుండు శర్యాతి యను రాజుకూఁతు సుకన్య యనుదాని వివాహం బయి వాని యజ్ఞాంతమున నింద్రు నాద రింపక యాశ్వినుల సోమపీథులం జేసె" ననిన "నది యెట్లని యడిగిన ధర్మజునకు సౌకన్యాఖ్యానంబు సవిస్తరంబుగా రోమశుం డిట్లనియె. 173

—: రోమశుఁడు ధర్మజునకు సౌకన్యాఖ్యానంబు చెప్పుట :—

క. "ఇక్కొలని సమీపంబున
బెక్కగువేలేండ్లు తపను భృగుసుతుఁడు గరం
బక్కజముగ నొనరించెను
వెక్కసమగు నియమ నిరతి వీరాసనుఁ డై. 174

క. అమ్మునిదేహము వల్మీ
కమ్మునఁ గప్పంగఁబడి, నికటవల్మీగు
ల్మమ్ములు పైఁ బ్రాకిన నన
యమ్మును నేర్పడక యుండె నవ్వనభూమిఁ. 175

వ. అంతం బెద్దకాలంబునకు శర్యాతియను రాజు, దన చతుస్సహస్ర దేవీనివహంబుడోడఁ దత్సరోవరంబున విహరింప నరిగిన, నాతని కూఁతురు సుకన్య యనునది యిష్టసఖులతోఁ గ్రుమ్మరుచున్న నవ్వ ల్మీకంబునందు. 176

క. విద్యుల్లతాంగి భార్గవు
నుద్యన్నయనములు మెఱచుచున్నను విలస
ద్భద్యోతద్యుతులొకో ! యని
సద్యస్సంజాతబుద్ధిసంభ్రమ యగుచున్. 177

వ. అప్పు డప్పుట్ట గ్రొప్పించిన నలిగి నిమీలితనయనుం డై చ్యవనుండు శర్యాతి సైన్యంబుల కెల్ల మూత్రపురీషనిరోధంబుఁ జేసిన, నది తన సైన్యాపరాధంబున నయ్యెఁ గా వగచి వాఁ డెల్లవారి నడిగి తత్కా రణం బెఱుంగ నేరక చింతాపరుం డై యున్నఁ దండ్రికడకు వచ్చి సుకన్య యి ట్లనియె. 178

తే. "మిన్నమిడుఁగుఱుల్లట్టు లై మెఱసి రెండు
మెఱుఁగు లొకపుట్టలో నున్న నెఱుఁగ కేను
బుట్ట గ్రొప్పించి యా రెంటి పొడవుఁ గాన
కుడిగి వచ్చితి విస్మయపడి మనమున. 179

వ. ఈ సైన్యనిరోధంబున కిది నిమిత్తం బగునో" యనిన శర్యాతి యప్పు డా పుట్ట యొద్దకు వచ్చి యందుఁ దపఃక్లేశంబునఁ గృశత్వా గస్థిభూతశరీరు, నతివృద్ధు భార్గవుం గని నమస్కరించి యి ట్లనియె.

క. "అమితం బగు మీతపము మ
హిమ యొఱుఁగక యిట్లు చేసె నిది; దీని సహిం
పుము దయ; మత్సైన్యనిరో
ధము వాపుమ, యొఱుక గలరె తరుణులు ధరణిఁ?" 181

వ. అనిన భార్గవుండు కరుణించి యతిశయరూపయౌవనగర్విత యైన యా కన్యకంబరిగ్రహించి కాని సహింప ననిన శర్యాతి తన కూఁతు నమ్మునికరున కిచ్చి నిజసైన్య నిరోధంబుఁ బాచికొని చనిన. 182

ఉ. పతిఁ బరమభక్తిఁ బరిచర్య సేయుచు
నొనరఁగా సుకన్య యుండునంత
నాలతాంగికడకు నాశ్విను లేతెంచి,
తమ్మొఱుంగఁ జెప్పి దాని కనిరి. 183

వ. "అవ్వా నీ వెవ్వని కూఁతుర? వెవ్వని భార్య?" వని యడిగిన "నేను శర్యాతి కూఁతుర; భార్గవుం డయిన చ్యవమని భార్య" నని చెప్పిన విని వారలు నగి, "యక్కటా! యిట్టి రూపవిభవంబులు వడసి. కామభోగపరాఙ్ముఖ్యఁ డయిన వృద్ధు భార్గవుని వరియించి, నీ జవ్వనం బెల్ల వృథ చేసి; తింక నైనను నీ వయోరూపంబులకుం

దగిన వరు వరియింపు; మేము వానిఁ దెచ్చెద" మనిన నప్పలుకులు
సహింపక సుకన్య యాశ్వినుల కిట్లనియె. 184

ఆ. చ్యవనునందు నాకు సంతతప్రీతియై
యుండ నిట్లు పలుకు టుచిత మగునె?"
యని నిజేశ్వరునకు నప్పుడ వారల
పలుకు లెఱుఁగ జెప్పెఁ బంకజాక్షి. 185

వ. చ్యవనుండు దాని పతివ్రతాత్వంబునకు సంతోసిల్లి వారల పలుకుల కొడంబడు మని పంచిన, నది పతిచేత ననుజ్ఞాత యై చని, నాకు నవయౌవనపరుం గావింపుండనిన, నాశ్వినులప్పు డక్కొలను సొచ్చిరి; భార్గవుండును వాఁదోడ సరఃప్రవేశంబు సేసె; నిట్లమ్మిథునంబువ్వురు నవయౌవనులయి సుకన్యకడకు వచ్చి నిలిచి "మాయందు నీ వలచు వానిని వరియింపు" మనిన నది తన పతి యైన భార్గవుని వరియించె; నంత నయ్యాశ్వినుల కతిప్రీతుండయి చ్యవనుండిట్లనియె 186

—: చ్యవనుఁడాశ్వినుల సోమపీథులఁ జేయుట :—

తే. ఏను మీకారణంబున నిపుడు లబ్ధ
యౌవనుండ నై ధన్యుండ నైతి; మిమ్ము
సోమపీథులఁ జేసెద సురలరాజు
సూచు చుండగఁ శర్యాతి సుక్రతువున." 187

వ. అని చెప్పిన నాశ్వినులు సంతసిల్లి యరిగి, రిట శర్యాతి భార్గవు జరా భారపరిత్యాగంబు విని విస్మితుం డై యల్లునిం గూఁతుం జూడ వచ్చిన నాతని సత్కృతుం జేసి భార్గవుం డిట్లనియె. 183

క. "విదితముగ నిన్నుఁ జేయుం
చెదఁ గ్రతువు ధరాధినాథ! చేయుముఁ నీ క
భ్యుదయం బగు; సంభారస
ముదయము సమకట్టు" మనిన మునివచనమునఁ. 189

క. అనఘుఁడు శర్యాతి మఖం
బొనరించె విధిప్రయోగయుతముగ: నం దా

శ్వానులకు సోమం బీఁ బో
యిన భృగుపుత్రునకు నలిగి యింద్రుం డనియెఁ. 190

క. "వీ రర్ధఱు సోమార్హులు
గా రమరులవెఱ్ఱు: లిది యకర్తవ్యము; బృం
దారకులు గానివారికి
వారింపక సోమ మిచ్చువారుం గలరే?" 191

వ. అనిన నింద్రవచనం బాదరింపక చ్యవనుం డాశ్వినుల సోమపీథులం
జేసిన దాని సహింపక యింద్రుం డలిగి. 192

క. జృంభించి వజ్ర మెత్తిన
జంభాంతకు వజ్రయుతభుజాస్తంభము సం
స్తంభించి, యతని, భటుసం
రంభంబునఁ జంపఁ గడఁగి రౌద్రాకృతితోఁ. 193

క. చ్యవనుఁడు వేల్చిన నం దు
ద్భవ మయ్యె నపారఘోరబలయుతుఁడు, మహా
జవుఁడు, మదుం డను రాక్షసుఁ
డవనిచరద్యుచరభీకరాకారుం డై. 194

వ. ఇట్లుద్భవించి దశ సహస్రయోజనాయామంబు లైన బాహుదండం
బులయు, శతయోజనాయామంబు లైన చతుర్దంష్ట్రలయు, దశ
యోజనాయామంబు లైన దశనంబులయు, శశిరవిమండల సదృశంబు
లైన నయనంబులయుఁ, గాలాగ్ని సన్నిభం బైన వక్త్రంబును,
దిగ్భాగభోగసంకటం బైన శరీరంబునుం దోడ భూమి నొక్క
హానువును, దివంబున నొక్క హానువుగా వదనగహ్వరంబు దెఱచి
జగజ్జన సంత్రాసనవ్యగ్రసంచలనం బైన దీర్ఘజిహ్వా నధరోష్ఠపుటంబు
నాకుచు, నత్యుగ్ర నాదంబున దిక్కులు ప్రచ్ఛాదించుచు, వచ్చు మహారాక్ష
సుం జూచి సురేంద్రుండు వెఱచి భార్గవ స్తంభితభుజుండు గావున
వాని నెద్ధియుం జేయనేరక చ్యవను నొద్దకు వచ్చి, కృతాంజలియై
"మునీంద్రా! నీ తపోవీర్యమహారంభంబు మిథ్యయగునే? యాశ్వి
నులు నేఁడు మొదలుగా సోమార్హులగుదురు; నీవు నాకుఁ బ్రస
న్నుండ వై క్షమింపు" మనిన. 195

క. మునినాథు నలుకతోడన
యనిమిషపతివజ్రయుతమహోభుజసంస్తం
భన ముడిగె; నంత భృగునం
దను పిడ్కొని యింద్రుఁ డరిగెఁ దనపురమునకున్.

196

వ. అమ్మదరాక్షసుండు నాకుణంబ చ్యవను నుపదేశంబున మద్య స్త్రీ మృగయాకుఁబుల నాశ్రయించె; నాశ్వినులు సోమపీథు లై దివంబున్న కరిగి; రిట భార్గవుం డైన చ్యవనుఁడు తన తపోమహత్వంబునందుఁ బ్రకాశింపఁ జేయుటంజేసి నాఁటం గోలె నది యార్చీకపర్వతంబు నాబరఁగె" నని రోమశుండు సెప్పిన నందులఁ బుణ్యసరోవరంబునం గృతస్నాను లై పాండవు లరిగి యంత శంతను ఘనక నర నారాయణ విధాతృతపోవనస్థానం బై, దేవర్షి నివాసం బైన సైంధవారణ్యంబునం జంద్రసరోవరంబునందు రోమశనియుక్తు లై చరువులు చేసి, యతిథులం బూజించి చని యమునానదిం గని; రంత వారలకు రోమశుం డి ట్లనియె.

197

—: మాంధాతృ చరిత్రము :—

క. "ఇది యమున యను మహానది
త్రిదశనదీనిభము; దీని తీరమున జగ
ద్విదితుఁడు మాంధాతృఁడు సం
పద్ప్రతువులఁ జేసెఁ దొల్లి బహువత్సరముల్."

198

వ. అనిన "మాంధాతృ జన్మంబును, వానిచరితంబును వినవలతుం జెప్పు" మని యడిగిన ధర్మరాజునకు రోమశుం డి ట్లనియె.

199

ఉ. "వీకున నశ్వమేధములు వే యొనరించిన ధర్మశీలుఁ, డీ
క్ష్వాకులలోద్భవుఁడు. బలవంతుఁ, డనంతయశుం, డవార్యవీ
ర్యాకరుఁ, డుత్తముండు, యువనాశ్వుఁ డపత్యము లేమిఁ జేసి దుఃఖాకులుఁ డై ప్రధానవరులందు సమర్పిత రాజ్యభారుఁ డై.

200

వ. భృగునాశ్రమంబునకుం జని పుత్రకాముం డై పెద్దకాలం బమ్మునిసుపాసించిన నయ్యు వనాశ్వునకుం గరుణించి భృగుండు పుత్ర కామేష్టిఁ జేసి యందు మంత్ర పూతజలపూరితంబై పుత్రోదయకారణంబైన కలశంబు వడసి, దాని రక్షించి యుండ బుత్విజులం బంచిన.

ఆ. రాత్రి జాగరణభరశ్రాంతు లై వారు
నిద్రఁ బొంది; రంత నీరు వట్టి
ధారుణీశ్వరుండు తన్మంత్రకలశోద
కంబు లెల్లఁ ద్రావెఁ గడుపు నిండ. 202

వ. దాని నెఱింగి భృగుండు యువనాశ్వుం జూచి "నీకుఁ బుత్రార్థంబుగా మదీయ తపోవీర్యలబ్ధం బైన యమ్మంత్రజలంబు నీ భార్య కీనున్న చో, నీ వధిక పిపాసావరుండవయి యుపయోగించి యకర్తవ్యంబుఁ జేసితి; దైవకృతం బెవ్వరికిఁ దప్పింప నశక్యంబు? దీనంజేసి నీకు గర్భం బై యింద్రసదృశుం డైన పుత్రుం డుద్భవించు" ననిన విని యువ నాశ్వుండు తన పురంబునకుఁ జని యున్నంత నూఱేండ్లకు యువ నాశ్వు వామభాగంబు భేదించుకొని బాలార్కతేజుం డైన బాలకుండు వెలువడిన, నక్కొడుకుం జూడ నింద్రుండు వచ్చి వానివదనంబున నిజపదేశినిఁ బెట్టి, "యమృతమయం బగు దీనిం ద్రావు" మనిన యింద్రువచనంబున నమరు లెల్ల నక్కుమారునకు మాంధాతృం డను నామంబుఁ జేసి; రట్లు సురేంద్ర సంవర్ధితుం డై. 203

తే. ధ్యానమాత్రనచేసి వేదములు, సర్వ
శాస్త్రములు, ధనుర్వేదము, సకలదివ్య
సాయక ప్రయోగంబులుఁ జట్ట వచ్చి
పొందె మాంధాతృఁ ద్రిభువన పూజ్యు నొప్ప. 204

వ. మఱియు నమ్మాంధాతృండు మహేంద్రుచేత మహామహీరాజ్యంబున కభిషిక్తుండై చక్రవర్తియై శక్రునర్ధాసనం బెక్కి యాజగవం బను ధనువును; దివ్యాస్త్రంబులు నభేద్యకవచంబును ధరియించి నిఖిలలోక జైత్రుం డై సంపూర్ణదక్షిణ క్రతువు లనేకంబులు చేసి, పద్మసంఖ్యలు గోదానంబుల బ్రాహ్మణులం దనిపి, నిజ శాసనంబునఁ బ్రజల నెల్ల నిలిపి. 205

మధ్యాక్కర. భూమి కనావృష్టి యైనఁ గడు నల్గి పురుహూతుతోడ
భీమసంగ్రామంబుఁ జేసె; దన దివ్యసృథుసాయకముల
సామజావలి నేయునట్లు మేఘసంచయముల నేసి,
భూమికిఁ గురియించె వర్షములు సస్యముల్ వృద్ధిఁ బొంద. 206

వ. ఇది యమ్మాంధాతృదేవయజనస్థానంబు; మఱి యిక్కురుక్షేత్రంబు నందు నరస్వతీ తీరంబున సోమకుం డనువాఁడు యజ్ఞంబుఁ జేసి పుత్ర శతంబుఁ బడసె" ననిన నది యెట్లని ధర్మజుం డడిగిన రోమశుం డిట్లనియె. 207

—: సోమకుం డను రాజర్షి చరిత్రము :—

క. "సోమకుఁ డనురాజర్షి మ
హామఖ మొనరించి జంతుఁ డను నొక్కసుతుఁ
భూమీశ! పడసె; నాతని
భామలు నూర్వురును గొడుకుఁ బరమప్రీతిన్. 208

క. తమ తమ పుత్రుఁడ కాఁ జి
త్తములం జేకొని దయం బృథగ్భావము లే
క ముదంబునఁ బెంచిరి లో
కమున జనుల్ చోద్య మందఁగాఁ గడువేడ్కన్. 209

వ. ఒక్కనాఁ డబ్బాలకు కురువు చీమ గుట్టినఁ దద్వేదన సహింప నోపక యేడ్చు చున్న వానికడకుఁ దల్లు లందఱుఁ బఱతెంచి యేడ్చిన నయ్యాక్రందన ధ్వని విని సంభ్రమించి సోమకుం డంతఃపురంబునకుం జని కొడుకు నూఱార్చి సభాస్థితుం డై మంత్రులకు ఋత్విజునకు నిట్లనియె. 210

ఆ. "కోరి యొక్కకొడుకుఁ గొడుకుఁగా నే నెట్లు
నమ్మి యుండనేర్తు? నాకు సతులు
శతము గలిగియుండ సంతాన మల్ప మై
యునికి మీకుఁ జూడ నుచిత మగునె?" 211

వ. అనిన వానికి ఋత్విజుం డిట్లనియె 212

తే. ధరణినాథ! నీ భార్యా శతంబునందుఁ
బరఁగ నూర్వురు పుత్రులఁ బడయ నీకు
నభిమతం బేనిఁ, దగుఁ దగ దనక నీవు
కడఁగి మా చేయఁబంచిన క్రతువు సేయు. 213

వ. ఈ జంతుం బళువుగా వధించి తద్వపాహావ్యంబుల హావ్యవహునిం దనిపిన దాన నీ నూర్వురు భార్యలకు నూర్వురు కొడుకులు పుట్టుదు; రం దగ్రజుం డైన జంతుండు సౌవర్ణలఱణలఱీతసవ్యపార్శ్వం డై యుదయించు" నని చెప్పి ఋత్విజుండు సోమకునిచేత ననుజ్ఞాతుండై.

క. తనయుఁ బళువటీచి తద్వపఁ
గొని వేల్చినఁ జూచి యార్తకురరీనాదం
బున నేడ్చిరి కడు నడలుగఁ
దనుమధ్యలు నూర్వురను సుతస్నేహమునన్. 215

క. ఇమ్ముగఁ దద్ధూమాఘ్రా
ణమ్మున గర్భములు దాల్చి నాతులు నవమా
సమ్ములు నిండుడుఁ గనిరి ము
దమ్మున జంతు ప్రముఖసుతప్రకరమ్ముల్. 216

వ. అందు జంతునకు నందఱు నెప్పటియట్ల తల్లులు సమస్నేహాలై యుండం, బుత్రులు నూర్వురుం బెరిఁగి సమర్థులై యున్నఁ బెద్దకాలంబునకు ఋత్విజుఁడు వరలోకగతుం డై ఘోరనరకానలంబున నెరియుచునుండె; నంత సోమకుండును దేహత్యాగంబు నేసి యమరలోకంబున కరుగువాఁడు ముందట నరకానల పచ్యమానుం డయ్యెడు ఋత్విజుం జూచి "యిట్లేల తీవ్రదుఃఖోపహతుండ వైతి?" వని యడిగిన వాఁడి ట్లనియె. 217

ఆ. "అవనినాథ! నీకు నార్త్విజ్య మొనరించి
చూవె యిట్టి నరకపాపకమునఁ
బడినవాఁడ; నీకు బహుపుణ్యలోకముల్
గలవు; నన్నుఁ గావలయుఁ గరుణ." 218

వ. అనిన సోమకుండు ధర్మరాజు పాలికిం జని తచ్ఛాసనంబునం బుణ్య లోకంబులకుం బోవుచుండి యిట్లనియె. 219

క. "నా కారణమున ఋత్విజుఁ
డే నంతమ నరకగతికి నేఁగెను; వానిం
దోకొని పోయెద" నని శుభ
లోకంబున కరిగెఁ ద్రిదశలోకస్తుతుఁ డై. 220

వ. ఇట్లు యజ్ఞపుత్రుండైన సోమకుండు దన తపోయజ్ఞఫలంబున ఋత్విజు నరక విముక్తుఁజేసి పుణ్యలోకగతుం డయ్యె; నిందుఁ దొల్లి ప్రజాపతి సహస్ర వార్షికం బైన యిష్టాకృతం బను సత్రయాగంబుఁ జేసె; నాభాగుం డైన యంబరీషుఁ డిందు యజ్ఞంబులంజేసి పరమసిద్ధికిం జనియె; నిది నహుషుయజ్ఞదేశం; బిందు దశపద్మ సంఖ్యధనంబుల నాతండు సదస్యులం బూజించె; నిది సార్వభౌమ యజ్ఞస్థానం; బిది యయాతి యజ్ఞాయతనంబు; వాని సవనంబున కింద్రుండు వచ్చె; నిది రామహ్రదం; బిది నరనారాయణాశ్రమం; బిది ప్లక్షావతరణం బను యమునాతీర్థం; బిందు దేవతలును ఋషులును సారస్వతయాగంబుఁ జేసి; రిది దేవర్షి యైన సంవర్తుచేత రక్షితం; బిందు భరతుం డనేక యాగంబులు సేసి సర్వలోకంబులుంజూచె; నీవు నిందుఁ గృస్నానుండ వై సర్వలోకంబులుం జూడు'' మనిన ననుజసహితుం డై ధర్మ తనయుం డత్తీర్థంబున స్నానంబుఁ జేసి రోమశున కిట్లనియె. 221

శా. దేవర్షిద్యుచరాహిలోకములు, నాదిత్యాశ్వినీలోకముల్,
దేవాధీశ్వరుఁ జూచితిన్; మఱియు నద్దేవేంద్రునొద్దన్ సగాం
డీవోద్దామమహాభుజార్గళుఁ, గిరీటిన్, సవ్యపాచిన్, జయ
శ్రీవిభ్రాజితుఁ, బార్థుఁ జూచితి; జగత్సేవ్యా! మునీంద్రోత్తమా!''

వ. అనిన రోమశుండు వెండియు ధర్మరాజున కిట్లనియె. 223

క. ''ఇది దక్షు మఖస్థానం;
బిదియు సరస్వతి యనంగ నిలఁ బరఁగుమహా
నది; యిందుఁ ద్రిదశతతితోఁ
ద్రిదశజ్యేష్ఠుండు సేసెఁ దివిరి మఖంబుల్. 224

వ. ఇది పంచయోజన ప్రమాణంబైన ప్రజాపతి యజ్ఞ వేది; యిందు దేహత్యాగంబు సేసి మర్త్య లమర్త్యత్వంబుం బొందుదురు; దొల్లి సరస్వతి నిషధదేశంబున భూమి సొచ్చి యిచ్చమసోద్భేదంబునందుఁ గానంబడియె; నిది సింధుతీర్థం, బిందు లోపాముద్ర నగస్త్యుండు ప్రతిగ్రహించె. 225

తే. ఇదియు విష్ణుపదంబు; దా నిది విపాళ;
యిదియుఁ గాశ్మీరమండలం; బిది వితస్త;
మిదియు మానసద్వార; మిందిందువంశ!
పరశురాముండు మును హంసపథముఁ జేసె. 226

—: శిబి యను రాజర్షి చరిత్రంబు రోమశుఁడు ధర్మజునకుఁ జెప్పుట :—

వ. ఇక్కొలనం జైత్రమాసంబునందు మహామునులచేతం బూజితుం డై యుమాసహితుం డీశ్వరుండు వారికిం బ్రత్యక్షుం బగుటయు, నరుంధతీ సహితుండై వసిష్ఠుం డిందుల వసియించె; నిది భృగుతుంగం బను పర్వతం; బిందు నుశీనరపతి శిబియనువాఁడు దొల్లి యజ్ఞంబు సేయుచున్న నింద్రాగ్నులు వానిమహాగుణంబు లెఱుంగ వేఁడి యింద్రుండు శ్యేనం బైన, నగ్ని కపోతం బై శ్యేనభయంబునఁ బఱతెంచి శిబి మఱువు సొచ్చిన, దాని నెగిచికొని వచ్చి శ్యేనంబు శిబి కిట్లనియె.

ఆ. "నిన్ను సత్య ధర్మనిర్మలుఁ గా విందు
నట్టి నీకుఁ జాడి యయ్య! యిప్పు
డతిబుభుక్షితుండ నై యున్న నాకు నా
హారవిఘ్ను మిట్టు లాచరింప ? 228

వ. సర్వభూతంబులు నాహారంబు ననుజీవించి వర్ధిల్లు; నిదినాకు భక్ష్యంబు గాని నాఁడు బుభుక్షావేదనంజేసి ప్రాణవియోగం బగు; నట్లయిన నా పుత్రులు భార్యయు జీవింప నేర; రొక్క కపోతంబు రక్షించి పెక్కు జీవంబులకు హింస సేయుట ధర్మవిరోధంబు. 229

క, ధర్మజ్ఞు లైన పురుషులు
ధర్మువునకు బాధ సేయు ధర్మువు నైనఁ
ధర్మముగా మదిఁ దలఁపరు
ధర్మువు సర్వంబునకు హితంబుగ వలయున్. 230

వ. ఇక్కపోతంబు నాకు వేదవిహితం బైన యాహారంబు; "శ్యేనాకపోతా భాదయన్తి" యను వేదవచనంబు గలదు; గావున దీని నాహారంబు గా నిమ్మనిన దానికి శిబి యిట్లనియె.

తే. "ప్రాణభయమువ వచ్చి యిప్పటి నన్ను
నాశ్రయించె; నాశ్రితు నెట్టి యధవఁడయిన
విడువఁ డనినను నే నెట్లు విడుతు దీని?
నాశ్రితత్యాగ మిది ధర్మ్మవగునె? చెపుమ 232

వ. నీవు పటివయ్యును ధర్మ మెఱింగినట్లు పలికితి; శరణాగతపరిత్యాగంబు సేయుటకంటె మిక్కిలి యధర్మం బొం డెద్ది? నీయాఁకలి దీనన కాని యొంట నుపశమింపదే? నీయత్నం బాహారార్థంబేని యిప్పు డివ్వనంబున మృగమహిషవరాహఖగ మాంసంబులు దీనికంటె మిక్కిలిగాఁ బెట్టెద; నిక్కపోతంబువలని యాగ్రహం బుడుగుము; దీని నే నెట్లును విడువ"ననిన శ్యేనం బిట్లనియె. 233

ఆ. "నాకు విహితభక్షణం బిది; యిప్పఁటి
బూని కాప నీకు బుద్ధియేని
యవనినాథ! దీనియంత నీ మాంసంబు
తూఁచి నాకుఁ బెట్టు తొలఁగ కిపుడ." 234

చ. అనిన "ననుగ్రహించితి మహావిహగోత్తమ!" యంచు సంతసం
బున శిబి తత్క్షణంబ యసిపుత్రిక నాత్మశరీరకర్తనం
బనఘుఁడు సేసి చేసి తనయంగములం గల మాంస మెల్లఁ బె
ట్టినను గపోతభాగమ కడిందిగ డిందుచు నుండె నత్తులన్. 235

క. దానికి నచ్చెరువడి ధర
ణీనాథుఁడు తనువునందు నెత్తురు దొరుఁగం
దాన తుల యొక్కి నంతన్
వానిగుణోన్నతికి మెచ్చి వాసవదహనుల్. 236

వ. శ్యేనకపోతరూపంబులు విడిచి, నిజరూపంబులఁ జూపి, "నీ ధైర్య శౌర్యాది గుణంబు లనన్యసాధారణంబులు; గావున నీకీర్తి నిత్యంబై శబ్దబ్రహ్మంబు గల యంతకాలంబును వర్తిల్లుచు నుండెడు" మని శిబికి వరం బిచ్చి యింద్రాగ్నులు చని; రిది యమ్మహాపురుషు పుణ్యస్థానంబు; మఱియు ననవరత ఫలవృక్షంబులు గల యిది యౌద్దాలకి యైన శ్వేతకేతు తపోవనం; బిందు సరస్వతి మనుష్య స్త్రీరూపధారిణి

యై శ్వేతకేతుని సేవించె; మాతులభాగినేయు లైన యష్టావక్ర శ్వేతకేతు లింద యుగ్రతపంబుఁ జేసి'' రనిన నం దష్టావక్రుమాహా త్మ్యంబు విన వలతునని యడిగిన యుధిష్ఠిరునకు రోమశుం డిట్లనియెఁ ''దొల్లి యేకపాదుం డను మునివరుండు తన విద్యావిభవంబున సుజాత యనుదాని వివాంహం బై వనంబున ఘోరతపంబు చేయుచు ననవరతంబును శిష్యుల వేదంబులు చదివించుచున్నఁ బెద్దకాలంబునకు సుజాత గర్భిణి యైనఁ దద్గర్భంబున నున్న యర్భకుం డొక్కనాఁడు తండ్రి కిట్లనియె. 237

—: రోమశుఁడు ధర్మజునకు నష్టావక్రు చరితంబు చెప్పుట :—

క. "ఎడబడక యహోరాత్రులు
వడిఁ గొనిఁ చదివింప నిట్లు వలయునె? శిష్యుల్
గడు నిద్ర లేమి నెంతయు
జడమతు లై చదువు దప్పఁ జదువుచు నుండఁ." 238

వ. అని యుపాలంభించి పలికిన, నలిగి యేకపాదుండు "నీ వధ్యయనం బునకు వక్రంబుగాఁ బలికితివి గావున నెనిమిదివంకలు గల శరీరం బుతో జన్మింపు'' మని కొడుకునకు శాపం బిచ్చిన. 239

ఆ. అగ్నికల్పుఁడై మహాత్ముఁడు కడుపునఁ
బెరుఁగుచుండె; నంత సరసిజాక్షి
ప్రసవకాలమైనఁ బతి కొక్కనాఁ డిట్టు
లనియెఁ బ్రసవభారమునకు వెఱచి. 240

క. ''ధరణిఁ గడుఁ బేద వారును
బురిటికిఁ ఘృతతై లధాన్యములఁ జెచ్చెర ముం
దర సంగ్రహింతు; రవి మన
కరుదుగ నతిదుర్లభంబు లర్థము లేమిఁ. 241

వ. ఏమి సేయుదు? నెవ్విధంబున నీ ప్రసవక్లేశంబువలనఁ బాయుదు?'' ననిన నేక పాదుండు ధనార్థియయి జనకరాజుపాలికిఁ జని, వాని యజ్ఞంబునందు వరుణపుత్రుం డైన వందితో వివాదంబు సేసి, యోటుపడి, జలమగ్నుం డై యున్న నిట సుజాత ప్రసూతియై యష్టావక్రుం గనియెఁ; దత్కాలంబున నుద్దాలకు భార్య శ్వేతకేతుం

గనియె; నిట్లు మాతులభాగినేయు లిద్దఱు సవయస్కులై పెరిగి పండ్రెండేం డ్లొక్కట నుద్దాలకుతోఁ జదివి, యధ్యయనళూరులై రందు. 242

తే. తండ్రి యనుచు నుద్దాలకుఁ, దనకు గరము
ప్రీతితో శ్వేతకేతుని భ్రాత యనుచు
ననఘచరితుఁ డష్టావక్రుఁ డనుదినంబు
నొం డెఱుంగక సుఖలీల నుండునంత. 243

వ. ఒక్కనాఁ డుద్దాలకు కురు వెక్కియున్న యష్టావక్రుం జూచి శ్వేత కేతుండు సహింపక "నీ వేల మాయయ్య కురు వెక్క యుండె? దీవు వోయి మీయయ్య కురు వెక్కు" మని చేయిపట్టి యీడ్చిన నేడ్చుచుం దల్లికడకుం జని యష్టావక్రుం డి ట్లనియె. 244

క. "మాయయ్య యెవ్వ? రెక్కడఁ
బోయిరి? సెప్పు"మని తెల్లముగ నడిగి తప
శ్శీయుతుఁడు దండ్రికడకుం
బోయెం దనమామ నెయ్యమునఁ దోడ్కొనుచున్. 245

వ. ఇ ట్లష్టావక్రుండు దానును, శ్వేతకేతుండును జనకరాజు యజ్ఞంబు నకుం జని యందు దౌవారికనివారితు లై" మూకాంధ బధిర పంగు స్త్రీ బ్రాహ్మణ సుప్రవేశం బగుచున్న యీ రాజద్వారంబున మమ్ము, విద్వాంసుల, బ్రాహ్మణుల నేల వారించి" తనిన దౌవారికుం డి ట్లనియె. 246

క. "అలఘు లగు వృద్ధవిద్వాం
సులకు, మహోయాజ్ఞికులకు, జొర నర్హం బై
విలసిల్లు యజ్ఞసభ సొర
వలవదు; చనుఁ డీరు చిఱుతవారల" రనినన్. 247

క. అలయక యేండ్లుఁ గడుం బె
క్కులు జీవించుట, నర గలుగుటయుం దగు వృ
ద్ధులలక్షణమే? జ్ఞానము
గలఁ డేనిఁ బాలుఁ డయినఁ గడు వృద్ధు మహిన్. 248

వ. కృతాధ్యయనశీలుం డై యాచారపరుం డైన వాఁడు బాలుం డయ్యును సర్వజన సంభావ నీయుం డగు; బాలు రని మమ్ము నవమానింప వలవ; దేము జనకరాజసదనంబున దర్పితు లైన వేద వాదులతో వాదంబు సేయ సమకట్టి వచ్చినవార" మనిన దౌవారి కుండు వారి నప్పుడు జనకరాజానుమతుండై లబ్ధప్రవేశులం జేసె; నంత. 249

సీ. జనకభూపాలుని సంప్రశ్నముల కెల్ల
నేర్పడ నుత్తరం బిచ్చిఁ, వాని
సభయందు భూసురసంఘమధ్యంబున
వరుణపుత్రుం డైన వందితోడ
వాదంబు చేసి, గర్వంబున నాతని
నొడిచి, తద్విజితు లై యుదధి నున్న
ధరణీసురులఁ తనదండ్రి నిగ్రహ
ముక్తులఁ జేసి, సన్మానికుమారుఁ

తే. డధికతేజుఁ డష్టావక్రుఁ డఖిలలోక
పూజితుం డైన జనకుచేఁ బూజ లంది,
యేకపాదుఁ దోడ్కొని పేర్మి నేఁగుదెంచె
బుధనుతుండు నిజాశ్రమంబునకు నొప్ప. 250

వ. అని చెప్పుచు నరిగి "యిది నమంగ యను పుణ్యానది; యిందు భరతుండు రాజ్యాభిషిక్తుఁ డయ్యెఁ, దొల్లి యింద్రుండు లక్ష్మీప్రాప్తుం డై దీని జలోపస్పర్శనంబునఁ బాపనిముక్తుఁడయ్యెఁ; నిది మైనాక కుఱి; యిం దదితి పుత్రార్థిని యై తపంబు నేనె; నిది ఋషి వైవతం బైన కనఖలనగం; బిది గంగానది; యిందు సనత్కుమారుండు సిద్ధిం బొందె; నిది యుష్ణగంగ; యిందుఁ గృతస్నానులైనం గృతార్థు లగుదు; రిది వైభ్యాశ్రమం; బిది భరద్వాజాశ్రమం; బిందు భరద్వాజసుతుండు యవక్రీతుండు తపోవిద్యాగర్వంబున నవగతజీవుం డయ్యె" ననిన "నది యె" ట్లని ధర్మ తనయుం డడిగిన రోమశుం డి ట్లనియె. 251

—: రోమశుఁడు ధర్మరాజునకు యవక్రీతుచరిత్రంబు చెప్పుట :—

క. ''అలఘులు వైభ్యభరద్వా
జులు దమలో సుహృదులై విశుద్ధతపోని
శ్చలితమతు లివ్వనంబున
నొలసి తపం బొప్పఁ జేయుచుండిరి నెమ్మిన్. 252

వ. అందు వైభ్యుండు కృతాధ్యయనశూరు లైన యర్థావసు పరావసు లను తన యిద్దఱు పుత్రులతో విద్యోత్పాదితుం డై యున్న, వానిం జూచి సహింప నోపక భరద్వాజసుతుఁడు, యవక్రీతుండు తపోబలం బున నఖిలవేదశాస్త్రాగమంబులు పడయుదు నని సమిద్ధం బైన యగ్ని యందు సంధార్యంబు సంధించుచు నుగ్రతపంబు సేయుచున్న, దాని సహింపనోపక యింద్రుండు వానియొద్దకు వచ్చి నీవేమి యుద్దేశించి యుగ్రతపంబుఁ జేసెద'' వనిన శక్రునకు యవక్రీతుం డి ట్లనియె.

ఆ. ''చదువకయును నాకు సర్వవేదంబులు,
సర్వశాస్త్రములును సంభవిల్ల
వలయు నని తలంచి వదలక నిష్ఠతో
నుగ్రతపముఁ జేయుచున్నవాఁడ.'' 254

వ. అనిన వాని కింద్రుం డి ట్లనియె. 255

క. ''గురుముఖమునఁ బడయక దు
ష్కరతపమునఁజేసి వడయఁగాఁబడు విద్యల్
పరమార్థము మదమును మ
త్సరమును గావించు నెట్టి సాధుల కైనన్. 256

వ. ఇది విద్యోపార్జనంబున కుపాయంబు గా'' దని వారించి వాసవుఁ డరిగిన నుడుగక యవక్రీతుం డెప్పటియట్ల తపంబుఁ జేయుచున్నఁ, దదీయతపస్తప్తమానసుం డై వృద్ధశ్రవుండు వృద్ధ విప్రరూపంబు ధరియించి, యశక్తు డై శోషించిన శరీరంబుడోడ సికతాముష్టి పరంపర నపారగంభీరగంగా ప్రవాహమునందు సేతుబంధంబు చేయు చున్న, నవ్వివుఁగిం జూచి యవక్రీతుండు నగుచు నిట్లనియె. 257

క. "శతవర్ష వృద్ధుఁడవు, నీ
వతికృశుఁడ, వశక్య మైన యర్థమునం దా
స్థత యేల నేసి కడు దు
ర్మతి వై? తిం కెన్నఁ డిది సమాప్తిం బొందుఁ?" 258

వ. అనిన విని యింద్రుడు వానిం జూచి "యేను నీయట్ల యఘట మానం బైన యర్థంబునందు యత్నంబుఁ జేసెద"నని నిజరూపంబుఁ జూపి, "యిట్లు నిరర్థక ప్రయాసం బేల చేసె? దుడుగు" మనిన "నే నెట్లు నుడుగ; నా యభిమతంబు సఫలంబు సేయవలయు" నని యవక్రీతుండు శక్రువలన దన యభిమతంబు వడసి, తత్పరికారంబుఁ దండ్రికిం జెప్పిన విని భరద్వాజుఁడు కొడుకు గర్వంబు సహింపక దేవగీత లైన గాథల యర్థంబు వానికి నిట్లని చెప్పె. 259

సీ. "బాలధి యను ముని ప్రవరుండు పుత్రతో
కాపన్నఁ డై ఘోర మగుతపంబుఁ
జేసి వేల్పులదయఁ జిరజీవిగాఁ బుత్రుఁ
బడసె మేధావి నాఁ బరఁగు వాని;
వాఁడు నాయుష్యగర్వమున మునీంద్రుల
నెవ్వరి మెచ్చక యేఁగి యొక్క
ధనుపాతుఁ డను తపోధనునొద్ద గర్వించి
పలికిన నలిగి. తపస్వి వాని
ఆ. నంతకాంతికమున కరుగంగఁ జేసె; గ
ర్వంబు చెట్టు; యెట్టివారి నైనఁ
గ్రాఁచుఁ దత్తతంబ గర్వంబు; గర్వంబు
నొడిచి యున్న వాఁడ యుత్తముండు. 260

వ. కావున నీవు గర్వంబు విడిచి యకోపనుండ వై, పరమశాంతు లైన వైశ్యకొడు కులతోడ నిర్మత్సరుండవు వయి యుండు" మనిన "నట్లు సేయుదు; నాకు వైశ్యుండు భవత్సమానుండ" యని యవక్రీతుండు తన విద్యావిభవంబు ముని సభల విస్తరించుచు నొక్క నాఁడు వైశ్యాశ్రమంబునకుం జని యందు. 261

ఉ. కోమలకీరషట్చరణకోకిలనాదమనోహరంబు, ను
ద్దామవసంతపుష్ప భరితక్షితిజప్రకరంబు నైన యా
రామమునందుఁ జూచె మునిరాజకుమారుఁడు రైభ్యు కోడలిం,
దామరసాక్షిఁ, గృష్ణ యనుదానిఁ, బరావసుభార్యఁ బ్రీతితోఁ. 263

ఆ. దానిఁ జూచి మదన తప్తుఁడై, తన యభి
ప్రాయ మెఱుఁగఁజెప్పెఁ బంకజాక్షి;
కదియు శాపభీతి నప్పటి కొడఁబడి
నట్లు పలికి పెలుచ నరుగుదెంచి. 264

క. తమ మామకుఁ దద్వృత్తాం
తము నంతను దెలియఁ జెప్పి. తరుణి విలోలా
క్షములందు బాష్పసలిలో
ద్గమముగఁ దల వాంచి యుండెఁ గదుఁ గోపమునఁ. 265

వ. రైభ్యుండు నయ్యవక్రీతున కలిగి నిజకోపానలశిఖాయమానై క జటావలంబనకరుం డై హుతాశనునందు వేల్చి యయ్యగ్నికుండంబు నందు. 266

క. లలితాంగిఁ బడసెఁ దన కో
డలిరూపమునకంపెఁ గదు బెడంగగు రూపో
జ్జ్వలకాంతి గలుగుదానిం
బొలఁతుక నొక్కర్తు నతితపోవీర్యమునఁ. 267

వ. మఱియు నొక్క జట యగ్నలంబించి వేల్చిన నందు విక్నతదంష్ట్రాకరాళం బైన ముఖంబుతో శూలహస్తుం డైన యొక్క రాక్షసుండు పుట్టె; నయ్యద్దనుఁ, ముకుళీకృతహస్తు లై "మాకుం బనియేమి?" యని యడిగిన "నవినీతుం డైన యవక్రీతు వధియింపుం" డని పంచిన. 268

క. ఆ తరుణి మున్ను తనిమద
నాతురుఁ డై విక్నతచిత్తుఁ డై యున్నయవ
క్రీతు కరకమండలుపుం
బ్రీతిఁ బ్రబోధించి కొనియె బెడఁగుగ నంతన్. 269

క అపహృతకమండలుం డై
యపవిత్రుం డగుటఁ జేసి యధికతపోవి
ర్యపరిణుయ మగుడును నా
తపస్విసుతు రాఁపసుండు దడయక తాఁకెన్. 269

వ. వానికి వెఱచి పఱచి యవక్రీతుండు మహానదులు, గొలంకులు సొచ్చిన
నవి శుష్కంబు లైనఁ దన జనకు నగ్నిహోత్రంబుఁ జొచ్చునంత.

ఆ. మునికుమారు నెగిచికొని వచ్చి విశితశూ
లాయుధమునఁ బొడిచి, యాసురమున
రక్కసుండు చంపి యక్కాంతయును దాను
నరిగె రైభ్యకడకు నాఁపణంబ. 271

వ. రైభ్యుండును వానికి భార్యగాఁ గృత్తి నిచ్చె; నంత నిట భరద్వా
జుండు వనంబున నుండి వచ్చి, తన కెప్పుడుం బ్రత్యుత్థానంబుఁ
జేయు నగ్ను లప్పు డడంగియున్న నచ్చెరువడి, గృహాపాలకుం డైన
శూద్రువలన నంతవృత్తాంతం బెఱింగి, నిహతుం డైన పుత్రుం జూచి
దుఃఖితుం డై. 272

ఆ. రైభ్యుఁ డధికకోపరతుఁ డంటి; నమ్మునిం
యాశ్రమంబు దెసకు నరుగ వలవ
దంటి; వినఁగ నొల్లవైతి నా పలుకులు;
గర్వితునకు బుద్ధి గాన నగునె?" 273

వ. అని ప్రలాపించుచు భరద్వాజుండు వాని దహించి, పుత్రశోకదహనంబు
సహింపనోపక తద్దహనంబున దేహత్యాగంబుఁ జేసె; నంత బృహా
ద్యుమ్నుం డను రాజు సత్రయాగంబుఁ జేయుచుండి రైభ్యపుత్రుల
నర్థాపసు పరావసులం దనకు ఋత్విజులంగా వరియించిన నయ్యిరు
వురుఁ దండ్రిచే ననుజ్ఞాతు లై వానియజ్ఞంబు నడుపుచుండి, యొక్క-
నాఁడు పరావసుండు నిజాశ్రమంబునకుఁ వచ్చువాఁడు వేగుఁబోక
చీఁకటి నడవిలో నేకతంబ తనకు నెదురుగా వచ్చు రైభ్యు నెఱుంగక,
మృగంబ కా వగచి, నిజప్రాణభయంబున వధియించి, పదంపడి
యెఱింగి, పరమదుఃఖితుండై ప్రేతకార్యంబులు దీర్చి, బృహద్యుమ్ను

సత్రంబునకు వచ్చి, తన చేసిన పితృఘాతం బగ్రజునకుం జెప్పి యిట్లనియె. 274

తే. "నీవు దీని నొక్కరుఁడవు నిర్వహింప
నోప; వే నొక్కరుండ నయ్యును గడంగి
నడప వోపుదుఁ; గావున నాతదర్థ
మాచరింపుము బ్రహ్మహత్యావ్రతంబు." 275

వ. అనిన నర్థావసుం డట్లు సేయుదు నని బ్రహ్మహత్యావ్రతంబులు సలుపుచుండెఁ; బరావసుండును నొక్కరుండ సత్రయాగంబు జరుపుచుండె; నంత నర్థావసుండు బ్రహ్మహత్యాప్రాయశ్చిత్తంబులఁజేసి యా సత్రయాగంబునకు వచ్చిన వానిం జూచి పరావసుండు బృహద్ద్యుమ్నున కిట్లనియె. 276

క. "ఇమ్మునిఁ నీయజ్ఞాయత
నమ్మునఁ బ్రవేశింపఁ దగఁడు; నరనాయక! యు
గ్రమ్మగ సలిపెడు శుభకా
ర్యమ్ములకుం జాసి బ్రహ్మహత్యావ్రతముల్," 277

వ. అనవుడు బృహద్ద్యుమ్నప్రేరితు లయిన జనులచేత నుత్సార్యమాణుండయి యర్థావసుం డనియెఁ "బరావసుండు గాని యేను బ్రహ్మఘాతకుండఁ గాను; వానికై వ్రతంబు సలిపి తత్పాతకవిముక్తుఁజేసితి" నని చెప్పిన యర్థావసు యథార్థకథనంబునకు మెచ్చి యగ్ని పురోగము లైన దేవతలు వాని కిట్లనిరి. 278

—: దేవత లర్థావసునకు మెచ్చి కోరిన వరంబు లెల్లఁ నిచ్చుట :—

తే. "తమ్ముఁచేసిన దురితముల్ తలఁగఁ బూని
ధర్మబుద్ధి వై వ్రతములు పేర్మిఁ జలిపి
తనఘ! నీకు నభీష్టంబు లైన వరము
లడుగు మిచ్చెద; మీ మెచ్చు గడవఁదగునె?" 279

వ. అనినఁ దన తండ్రియు, భరద్వాజుండును, యవక్రీతుండు నెప్పటి యట్ల జీవించి యుండను, నిజజనకుండు పరావసుచేత నిహతుం

డగుట విస్మరింపను వలయు'' నని ప్రార్థించి దేవతలవరంబున నర్థా
వసుండు వైశ్య భదద్వాజయవక్రీతుల సంజీవితులం జేసిన, నద్దేవతలకు
యవక్రీతుం డిట్లనియె. 280

తే. "ఏను బహువేదశాస్త్రమ్ము లెఱిఁగి వ్రతము
లెల్లఁ జేయుచు వైభ్యుచే నిట్లు హతుఁడ
నైతి; నా కంఱె వైభ్యున కధికశక్తి
యైనతెఱఁ గెట్టు" లనిన ని ట్లనిరి సురలు. 281

క. ''గురుశుశ్రూష యొనర్చుఁ
బరమక్లేశమునఁ జేసి పడసిన విద్యల్
స్ఫురియించుఁగాక; గురుముఖ
విరహితముగఁ బడసినవియు వెలయునె యెందున్? 282

వ. నీవు గురుముఖంబునం బడయక యొండు విధంబునం బడయుటం
జేసి నీ యధ్యయన శ్రుతఁబులు నిర్వీర్యంబు లయ్యె; గురు సంతోష
కరుం డై వైభ్యుండు బ్రహ్మజ్ఞానం బుపార్జించెం; గావున నాతం
డిట్టి శక్తి వడసె'' నని దేవతలు దివంబున కరిగి; రిది యవక్రీతు
నివాసం; బిందు వసియించినవారు దురితవిముక్తు లగుదు; రిది
కాల శైలం; బిది సప్తవిధం బైన గంగ; యిది మనుష్యుల కగో
చరం, బిందయుండి సమాధిశౌచప్రయత్నపరు లై చూడుం; డిది
మందరనగం; బిందు నానా ప్రహరణ పాణు లై యష్టాశీతిసహస్ర
గంధర్వులు, కిన్నరకింపురుషసుపర్వులు సురేంద్రుం గొలిచి పోయెద;
రిందుల కాఱుమాఱు యోజనంబులు గలదు కైలాసపర్వతం;
బందుఁ గుబేరుం డుండు" నని రోమశుండు సెప్పినం బాండవులు
కృతసమాధి శీలు లై వాని నెల్లంజూచి; రంత నంతకసుతుండు భీముని
కిట్లనియె. 283

సీ. ''దుర్గమం బైన యీ దుర్గమార్గంబున
నడవంగ నేర; మున్నత రథముల,
నింద్రసేనాదుల, నీ ధౌమ్యవిప్రుల,
ద్రుపదతనూజను దోడికొనుచు

సహదేవుఁడును నీవుఁ జట్టనఁ గ్రమ్మఱుఁ;
డేనును, నకులుండు నేఁగి రోమ
శాదేశమునఁజేసి యఖిలతీర్థంబులు
నాడివచ్చెదము; మా యరుగుదెంచు
ఆ. నంత కెంతయును బ్రయత్నంబుతోఁ గృష్ణఁ
గాచియుండుఁ'' డనిన ఘనుఁడు భీముఁ
డనియె ''నిట్టి రాక్షసాకీర్ణవనములో
నిన్నుఁ బాయ నగునె నిమిషమేని? 284

చ. అనఘచరిత్రు, నర్జును, మహోభుజు నొక్కనిఁ బాసి వంతఁ బొం
దినయెడ, నిట్టిచోట సహదేవుఁడు, నేనును, గృష్ణయున్ జగ
జ్జనుత! నిన్నుఁ బాసిన నసహ్యాతరం బగు తీవ్ర తాపవే
దన యగు నీకు మాకు, నుచితంచె పరస్పరభేద మెన్నఁడున్ ? 285

క. కడు డస్సి నడవ నోపని
యెడ నీ కమలాయతాక్షి, నీ కవలను నే
దడయక నటకట నిడికొని
కడఁకం గొనివత్తు విషమగహనాంతములన్. 286

వ. ఈ రథంబులతోఁ బోవ నిమ్మగాదేని వీని, నింద్రసేనాదుల నెందేనిం
బెట్టి పోదమనిన రోమశుం డిట్లనియె. 287

క. ''అతులతపోవీర్యబలో
న్నతిఁ బోదము గంధమాదనంబునకు; సమా
గతు నందుఁ గాంతు మర్జును,
నతివీరు, నుదారు, సురగణార్చితుఁ, బార్థున్''. 288

వ. అనిన నందఱు సంతసిల్లి యరుగువారు ముందర ననేకపహాయరథ
సనాథం బై, యపారకిరాతబలసంకులం బైన దానిఁ, బులిందాధిపతి
యైన సుబాహుపురంబుఁగని యందు వానిచేతం బూజితు లై తమ
రథసూతహాయనివహంబుల, నింద్రసేనాదిభృత్యులను సుబాహు
నొద్దం బెట్టి, పాదచారు లై పాంచాలిని, బ్రాహ్మణులను రక్షించి
కొని, గంధమాదనంబున కభిముఖు లై యరిగి; రంత ధర్మతన
యుండు భీమునిఁ గిట్లనియె. 289

సి. "అలిగి వజ్రాయుధు నైనను బోరిలో
నోర్వంగ నోపు నత్యుగ్రకీరు,
జవమునఁ బవనుఁ, దేజంబున నాదిత్యుఁ
బోలినవాని, నంభోజనేత్రు,
నాయతబాహుఁ. గృతాస్త్రు, సింహస్కంధు,
సర్వధనుర్ధరాచార్యు, విజయు,
నిత్యఋమాన్వితు, నీతమ్ము, నర్జును
శుభగుణసుందరుఁ జూచునంత

ఆ. కధికతాపతప్తమైనది నాచిత్త;
మొనర నతనితోడ నొక్కటునికి
యెన్నఁడొక్కొ మనకు నిందఱు కగు! నాతఁ
డేల మసలెనొక్కొ యిన్ని యేండ్లు ?" 290

మ. అనుచుం బార్థవిలోకనంబు మదిలో నర్థింపఁగా ధర్మజుం
డనవద్యుల్ గడు వేడ్కతో నరిగి తా రప్సాండవుల్ గంధమా
దనశైలేంద్రముఁ గాంచి రున్నతబృహద్ధాతుస్థలీసంహతి
ఘనసంధ్యాగమశంక సన్మునులకుం గావించుదానిన్ మహిన్. 291

క. నానావర్ణశిలావిహ
గానేకమృగాభిరామ మై, భూనారీ
నానాభరణవిభూషిత
పీనోన్నత కుచముఁ బోలె వెలిఁగెడుదానిన్. 292

—: పాండవులు గంధమాదనపర్వతంబునకుం బోవుట :—

క. లలితాచ్ఛస్ఫటికశిలా
తలములపైఁ బాఱు విమలతరనిర్ఝరిణీ
జలపూరము లను తారో
ల్లలదురుహారాళి నుజ్జ్వలం బగుదానిన్. 293

ఉ. వారలు గంధమాదన మవార్యబలాఢ్యులు సొచ్చుచో మహా
మారుత మప్డు వీచె నహిమద్యుతిమార్గము, దిఙ్ముఖంబులఁ
భూరుహపత్రమిశ్ర మయి భూరిపరాగము గప్పఁగా ధరి
త్రీరుహ శాఖలున్ విఱిగి త్రెళ్ళఁగ, గుల్మలతాళి సాల్పడన్. 294

చ. కడు వడి గాడ్పుచే వియుగఁగాఁ బడి త్రెళ్ళు మహీరుహాళి చ
ప్పుడు విని యందఱుం జెదరి భూమిపయిన్ గగనం బుదగ్రతం
బడియెనో, శైలశృంగములు భగ్నము లయ్యెనో, యంచు ధూళి నె
క్కడఁ జన నేర కొండొరులఁ గానక యుండిరి సంచలాత్ములై. 295

వ. ఇట్లు మహారేణుపటలం బంధకారంబునుంబోలె నీ రంధ్ర మై కప్పినఁ,
బతిత తరువిటప లతాగుల్మంబులు కరతలంబులం బాయం ద్రోచుచు,
విశాల దృఢతరుమూలంబు లాశ్రయించి, యగ్నిహోత్రంబులతో
ధౌమ్యధర్మ్మజసహా దేవు లొక్కచోట, సుదృఢధనుష్కుం
డైన భీమసేనుండును ద్రౌపదియు నొక్కచోట రోమశుం
డును, నకులుండును, బ్రాహ్మణులు నొక్కచోటనుగా నందఱు
వేఱువేఱు యుండిరి; రంత. 296

చ. కురిసెఁ బ్రచండవృష్టి; ఘనఘోషము లెల్ల కెలంకులఁ భయం
కరములు గాఁ గరాళ కరకాతతు లొప్ప, దటిల్ల తాళి వి
స్ఫురితముగాఁ, బ్రపూర్ణ జలపూరములన్ గిరికుంజభూమిని
ర్ఝరతటినీ విశాలకటసాలచయంబు విమూలితంబుగఁ. 297

వ. అట్లు గాడ్పుతోడివాన పెద్దయుంబ్రొద్దు కురిసి యుడిగిన నందఱు
నొక్కచోటికివచ్చి యెప్పటియట్ల యరుగునెడ, నతివిషమశిలాసంకట
పథంబున నడవనేరక ద్రౌపది దొడరి పడి మూర్ఛిత యైనం, బవన
తనయుం డక్కోమలి నెత్తికొని యజినాస్తరణంబుపయిం బెట్టి
కదళీదళంబుల వీచుచున్నం, గవలు దాని పల్లవ తామ్రపాదతలంబు
లాయుధాభ్యాసవళంబునం గిణీభూతంబు లయిన తమ కరతలంబులం
జేసి మెత్తన యొత్తుచుండి; రట్టి యవసరంబున ద్రౌపదిం జూచి
దుఃఖితుండయి ధర్మ్మతనయుం డి ట్లనియె. 298

అక్కర. ''అరుణసరోరుహదళమృదువు లై న యిత్తన్వి రమ్య
చరణతలంబులు గొడిగరాలపైఁ జనుచున్కఁ జేసి
పరుసంబు లై, కడు నెట్టి నై నవి; పద్మాయతాక్షి
పరఁగ నాకారణంబునను నీ దుఃఖభారంబు దాల్చె. 299

గీ. సముచితంబగు మృదుశయనతలంబున
శయనించు నిత్తన్వి సదమలాంగి
పరుసంపుజూలపై బడి తీవ్రవేదనం
బొందినయది; "మహాపురుషు లైన
పాండవులకుం బ్రియభార్య యై, నా పుత్రి
సుఖ ముండు" నని మది సోమకుండు
పాయక సంతోషపడి యుండుంగా కున్నె"
యని విలాపించు నయ్యమతనూజు

ఆ. నుచితవచనరచన నూరార్చి రప్పుడు
ధౌమ్యుఁదొట్టి సకలధరణిసురులు;
మూర్ఛ దేఱి నంత ముదిత ద్రౌపది శీత
మందపవనసేవ్యమాన యగుచు. 300

వ. అంత దాని నాశ్వాసించి ధర్మరాజు భీమున కి ట్లనియె. 301

క. "ఈ రాజపుత్రిఁ దోడ్కొని
దారుణపాషాణ దుష్పథంబులఁ జనఁగా
నేర; మిది నడువ నోపదు;
భూరిభుజా!" యనిన ననిలపుత్రుఁ డంతన్. 302

క. అగ్రజు ననుమతమున న
త్యుగ్రనిశాచరసమేతు, నుడుమార్గగు, వి
రాగ్రణి, ఘటోత్కచుం దన
యగ్రసుతుం దలఁచె ధీరు హైడింబేయున్. 303

క. అతఁడును రాక్షసన్యా
న్వితుఁ డై తత్క్షణము వచ్చి నిర్జరవరస
మ్మితులకుఁ బ్రణమిల్లెం దన
పితృవరులకుఁ బ్రాహ్మణులకుఁ బెద్దయు భక్తిన్. 304

వ. ఇట్లు మ్రొక్కి "పని యే" మని ముకుళితహస్తుండయి తన ముందర
నున్న కొడుకుఁ గౌఁగిలించుకొని భీముఁడు వాని కి ట్లనియె. 305

తే. ''అబల యిది భవన్మాత నిత్యాధ్వగమన
ఖిన్న యైనది గజరాజ ఖేలగమన;
దీని నీ వెత్తికొని చనుదెమ్ము మా స
మీపమున" నని సుతు నియమించె నపుడు. 306

వ. వాఁడును బితృవచనచోదితుం డయి ''యిమ్మార్గం బతివరుషశీలా విషమంబు; పాదచారుల కగమ్యంబు, గావున మిమ్మిందఱ నెత్తికొని యశ్రమంబున నరిగెద నని ధౌమ్యపాండవద్రౌపదులం దా నెత్తు కొని, బ్రాహ్మణుల నెత్తికొనం దన రాక్షస బలంబులం బంచె; రోమ ఋండు సిద్ధగతి నరిగె; నిట్లందఱు గగనమార్గంబునం జని గంగా తీరంబున నరనారాయణాశ్రమం బైన బదరీవనంబుఁ గని రాక్షస స్కంధావతీర్ణు లై యందు. 307

క. లలితమధుస్రవ ఫలములు
విలసితమృదుపత్రతతులు, వృత్తస్కంధం
బులు, నవిచలితచ్ఛాయలు
గల బదరీతరులఁ జూచి కడు నస్మితు లై. 308

వ. సురసిద్ధమునిసేవితం బయిన భాగీరథిం జూచి యందుఁ గృతస్నానులయి, నియమవ్రతంబులు సలుపుచు సమాధియోగంబున మైనాక శైలంబును, హిరణ్యశృంగంబునుఁ బిందుసరస్సునుం జూచి, బదరీవనంబునం దాఱుదివసంబులు నివాసంబు సేసి యుండునంత నొక్కనాఁడు. 309

చ. అలఘులు గంధమాదనమహాధరణీధరసానురత్న వే
దులఁ, బవమాన నందనుఁడు, ద్రౌపదియున్ విహరించుచున్నచో,
లలితసహస్రపత్రకమలంబు సమీరవిధూత మై మహీ
తలముపయిఁ బడిం బడియెఁ దద్దయుఁ బొల్పుగ వారిముందటన్.

వ. ఆ సౌగంధికకమలంబుఁ జూచి, దాని యపూర్వరమణీయత్వంబునకు, ననన్యకుసుమ సాధారణం బయిన సౌరభ్యంబునకు నోటువడి, ద్రుపద రాజపుత్రి ముదితచిత్తయై ''యక్కటా! యిది యొక్క పువ్వ యయ్యు నపూర్వం బై మనోనయనానందకరం బైనది; యిట్టి

కుసుమంబులు కడుం బెక్కులు గావలవ దె? యవి కురంగటం గల వేని తెచ్చి యిచ్చి నాకు మనఃప్రియంబుఁ జేయు" మని యప్పుడ యప్పువ్వు ధర్మరాజు కడకుం గొనిపోయె; నిట భీముండు దాని యభిమతంబుఁ జేయం గడంగి రుక్మపృష్ఠం బైన ధనుశ్శ్రేష్ఠంబును, నాశీవిషోపమానంబు లైన బాణంబులు ధరియించి యక్కమలంబు దెచ్చిన గాడ్పున కభిముఖుం డయి గంధమాదనంబున వివిధరత్న బంధురకందరకదళీషండదర్శనంబులను, మందారమందిరసుగంధిగంధ వహస్పర్శనంబులను, నలికులకోకిలాలాపశ్రవణంబులను, సర్వర్తు కుసుమసురుచిరగంధాఘ్రాణంబులను, నతిమధురఫలాస్వాదనంబులను బద్ధప్రమోదహృదయుం డగుచుఁ దన కెదిరి వచ్చు మృగంబులం దాఁకి, గజంబు నెత్తి గజంబుపై వైచుచు, సింహంబు నెత్తి సింహంబుపై వైచుచు, నల్పమృగంబులం గరతల ప్రహారంబులం బ్రహరించుచు. 311

—: భీముఁడు సౌగంధికహరణార్థంబు పోవుట :—

సీ. గమనవేగంబున ద్రుమలతాజాలసం
చాలన సేయుచు, శైలగుహల
నడఁగి యదృశ్యలై కడువేడ్కతోఁ దన్నుఁ
జూచు ఖేచరసిద్ధసురభుజంగ
గరుడగంధర్వకిన్నరకామినులచేత
మానుగా నభివీక్ష్యమాణుఁ డగుచు,
ప్రసూకులు విఱుచుచు, వీకతో దివఁ
బెఱుకుచుఁ, బడహతిఁ బృథునగేంద్ర

ఆ. మద్రువ నున్నతంబు లయినెడ లెక్కుచు,
మదగజంబువోలె మధ్యముండు
పవన వైనతేయపటుజవయుక్తుఁ డై
యరిగె గంధమాదనాంతరమున. 312

వ. ఇట్లరుగువాఁడు నిజసింహనాదశ్రవణపరిత్రస్తంబు లై యెగసి పఱచు పశుల యార్ద్రిపశుంబులఁ జూచి, ముందట నాసన్నంబునం గొలను కలుగవలయు ననియుపలక్షించి, యతిత్వరితగతిం జని

చని, పవనవశ సంచలిత తట మహావన తమాల తాల హింతాల విశాలకదళీదళ వీజ్యమాన శీతలజలపరిపూర్ణం బైన యొక్క సరో వరంబునఁ గని, యందుఁ గృతావగాహుం డై, నవనలినదళమృణాల వలయా లంకృతుం డగుచు దాని వెలువడి యనేక యోజననిస్తారా యామరమణీయం బైన కదళీషండంబుఁ జొచ్చి యందు శంఖ ధ్వానంబుఁ జేసిన. 313

క. ఆ శంఖరవంబు మహేం
ద్రాశనినిర్ఘోషభీమ మై దిక్కులు నా
కాశంబు నిండె; నంత గు
హాశయుఁ డై యున్న హనుమ యను కపి పెలుచఁ. 314

క. దాని విని బెదరి లేచి "మ
హానాదం బిది మనఃప్రియం బయ్యెమదీ
యానుజు శంఖధ్వానము
దానగు" నని యెఱిఁగి హృష్టతనురుహుఁ డగుచుఁ. 315

వ. భీమునకు మార్గనిరోధంబుగా మహావృక్షంబు లురులం ద్రోచి యేకా యనపథంబున కడ్డంబ శయినించి, లాంగూలలీలాచాలనంబుఁ జేసిన.

క. గోలాంగూలో త్తము లాం
గూలస్ఫోటనరవంబు ఘోరం బై వా
చాలతఁ జేసె నశేషమృ
గాలి భయం బంద గిరిగుహాంతర ములఁక. 317

వ. అయ్యపూర్వధ్వని విని భీముండు విస్మితుం డయి చని కదళీషండ మధ్యంబున నొక్క విశాలశిలాతలంబుపయి శయనించినవాని.

సీ. హ్రస్వపీన గ్రీవు, నచలితాయతహనుఁ,
నతిచపలస్వభావాభిరాముఁ,
దనుమధ్యకటిచక్రు, దహనకణాకార
తామ్రోష్ఠు, నతికృశదశనకరజుఁ,

బృథులవిద్యుత్పింజపింగాక్షు, నుత్తుంగ
దృఢవక్షు, నాజానుదీర్ఘ బాహు,
నూర్ధ్వలాంగూల మత్యున్నతధ్వజలీలఁ
గ్రాలుచు నుండ నేకాంతయోగ

ఆ నిద్ర నున్న ధర్మనిర్మలు, హనుమంతుఁ
జూచి పాండురాజసుతుఁడు వాని
నిద్రఁ జెఱుపఁ గడఁగి నిజసత్వ మేర్పడ
సింహనాద మొప్పఁ జేసె డాసి. 319

వ. హనుమంతుఁడును మెల్ల మెల్లన మేల్కని జృంభసంభృతజలార్ద్ర సంచలవిలోచనుం డగుచు ననాదరంబున నాతనిం జూచి యిట్లనియె.

తే. " అతిజరారోగభరమున నలసి యొలసి
యొదిఁగి సుఖనిద్రమై నిట్టు లున్న వానిఁ
గడుమదంబున నేమియుఁ గరుణలేక
యేల బోధించితయ్య! నీ వెఱిఁగి యెఱిఁగి? 321

వ. తర్యగ్జాతులు ధర్మ మెఱుంగవుగాక; సర్వభూతదయాస్వరూపం బైన ధర్మ మెఱిం గెడువాడు మనుష్యులుకారె? యిట్టి మనుష్య జన్మంబు వడసి వృద్ధోపసేవ సేయవుగా కేమి; ధర్మ మెఱుంగక నిర్దయుండవై మాబోఁటి వేదమృగంబులకు భయంబుగ గర్జిలితి; వీ వెవ్వండవు? మనుష్య గోచరంబుగాని యివ్వనంబున కేల వచ్చితి? సిద్ధగతి లేనివారి కిట వోప నళక్యం; బమృతకల్పంబు లైన యీఫల మూలంబు లుపయోగించి క్రమ్మఱుము; నీయందు బద్ధస్నేహుండఁ గాన బుద్ధి సెప్పితి; నా పలుకులు చేకొను" మనిన భీముం డిట్లనియె.

తే. "క్షత్రియప్రవరుండ, విఖ్యాతబలుండ,
పాండుతనయుండ, గొంతీగర్భంబునందు
వాయువరమునఁ బుట్టినవాఁడ నన్ను
భీముఁ డంద్రు భూజనులు కపిప్రభుండ! 323

వ. ఏ నిక్కడఁ గార్యార్థినై పోయెద; నీకుం దెరు వి; మ్మీనినాఁడు దొల్లిశతయోా జనవిస్తారంబయిన సముద్రంబు లంఘించి లంకకు బోయిన హనుమంతునట్ల నిన్ను, నీ పర్వతఁబు లంఘించి పోదు'' ననిన హనుమంతుఁ ''డతం డేమి కారణంబున సముద్ర లంఘనంబుఁ జేసె? నెఱుంగు దేనిం జెప్పు'' మనిన వానికి భీముం డిట్లనియె. 324

క. ''అలఘుం డీశ్వాకు మహా
కుల వీరుఁడు రాఘవుండు గురువచనంబుఁ
సలుప వసవాసి యై తన
లలనం గోల్పడియె నట్టి లంకేశ్వరుచేఁ. 325

క. సీతాన్వేషణపరు లై
నీతిఁ గపి ప్రవరు లరిగి నియతంబుగ సం
పాతియను పక్షిచేత మ
హీతనయసువార్త లెల్ల నెఱిఁగి కడంకఁ. 326

క. వారలు వారిధి గడవఁగ
నేరక తా రున్న యెడ ననిలసుత్వమునఁ
వారిధి లంఘించె మహా
వీరుఁడు హనుమంతుఁ డనఁగ విందుఁ గపీంద్రా! 327

వ. ఏను హనుమంతునంతియ బలపరాక్రమంబులు గలవాఁడ; నా పౌరుషంబుఁ జూపుదునే?'' యనిన నవ్యక్తహాసముఖుం డగుచు ''నన్నా! యేను ముదిసినవాఁడ; లేవనోపం; బోయెదవేని నా తోఁకం బాయం ద్రోచి పొ'' మ్మనిన మెచ్చక తన వామకరంబున నెత్తం బోయి వశంబుగాక. 328

ఉ. ఏపున రెండు చేతులను నిమ్మొగఁ బట్టి యమర్చి యెత్తఁగా
నోపక మొగ్గతిల్లఁబడి యుద్గతఘర్మజలార్ద్ర దేహుఁడై,
కావురుషుండుఁబోలె నిజగర్వము దక్కి యడంగి యుండెఁ, జిం
తాపరుఁ డై వృకోదరుఁడు దద్దయు లజ్జ నధోముఖంబుతోన్. 329

వ. ఇట్లక్కపివరు లాంగూలంబుఁ గదల్చ నోపక భీముండు కృతప్రణాముండయి ''ని న్నెఱుంగక నా పలికిన దురుక్తంబులు సహింపవలయు;

నీవు కపిరూపధరుండవై న సిద్ధుండవో. గంధర్వుండవో, దేవవరుండవో? నా కెఱింగింపు" మనిన హనుమంతుండు భీముం జూచి నగుచు, ''నేను గేసరిక్షేత్రంబున వాయుభట్టారకునకుం బుట్టినవాఁడ; నీ చెప్పిన హనుమంతుఁడ; నీవు నాయనుజుండవు; దొల్లి రఘుకులేశ్వరుం డయిన రామదేవుండు రావణుం డను రాక్షసుచేత నపహృతభార్యుం డై సుగ్రీవాది వానరుల నసంఖ్యాత సంఖ్యలవారిం దనకు సహా యులం జేసికొని, సేతుబంధనంబున సముద్రంబు లంఘించి, 'సమ రంబున రావణు వధియించి, యందు నాకెలసబునకు మెచ్చి.

మధ్యాక్కర ''నర సుర స్తుత్య మై యెంతకాలంబు నా కీర్తి నిలుచు,
నిరతంబుగా నంతకాలమున్ నీవు నిత్యుండ వగుచుఁ
బరఁగు''మనివరముఁ దగ దయంజేసి ప్రభుఁ డుర్వి యెల్ల
సరి పదునొక్కండువేల యేం డ్లేలి చనియెఁ దా దివికి."

వ. అనిన విని భీముండు వాని నప్పుడు హనుమంతుంగా నెఱింగి సంత సిల్లి, వెండియు నమస్కరించి, "భవద్దర్శనంబునం గృతార్థుండ నయితి" నని యిట్లనియె. 332

ఆ. "బలిముఖుండ, దయయుఁ గలవేని దొల్లి య
ర్ణవము గడచి చనిన నాఁటి నీదు
రూపుఁ జూడ వలతుఁ; జూపు నా'' కనవుడు
వాని కిట్టు లనియె వానరుండు. 333

క. ''అక్కాలంబునరూపం
బిక్కాలమునందుఁ జూప నెట్లగుఁ? గాలం
బొక్కవిధంబున నుండక,
వెక్కు ప్రకారముల నుండు భిన్నావస్థన్. 334

వ. దానంజేసి కృత త్రేతా ద్వాపర కలియుగంబుల సంఖ్యలు వేఱువేఱు లై, యందుల చరాచరభూతంబులు భిన్నప్రకారంబు లై వర్తిల్లు" నని న "నయ్యుగంబుల యాచార ప్రవర్త నంబులు నా కేర్పడం జెప్పు" మనిన భీమునకు హనుమంతుం డిట్లనియె.

—: భీమునకు హనుమంతుండు చతుర్యుగాచారవర్తనంబులను దెలుపుట :—

తే. "కృతమకాని కర్తవ్యంబు గృతయుగంబు
నందు లేదు; చతుష్పాద మగుచు ధర్మ
మనఘ! వర్తిల్లు; నచ్యుతు డయ్యుగమున
శుక్లవర్ణుఁడై ప్రజలఁ గాచుచు వెలుంగు. 336

వ. అది సనాతనధర్మసనాథం; బందుల బ్రహ్మ క్షత్రియ వైశ్య శూద్రు లేక వేద క్రియాయోగ్యులై, యకామఫలసంయోగంబునఁ బుణ్య లోకంబులు వడయుదు; రందు నసూయాభిచార దర్ప వైశున విగ్రహ క్రోధ మద మత్సర భయ సంతాపవ్యాధి ప్రజాక్షయేంద్రి యక్షయంబులు లేవు; మఱియుఁ ద్రేతాయుగంబునందుఁ ద్రి పాదం బై ధర్మ్మవు వర్తిల్లు; నందు జనులు నిత్యసత్య వ్రతశీలులై, యజ్ఞ తపోదానాదిక్రియల వర్తింతు; రందు రక్తవర్ణుండయి విష్ణుభట్టా రకుండు ప్రజాభరణంబుఁ జేయు. 337

తే. ద్వాపరంబున రెండుపాదములఁ జేసి
నడచు ధర్మ్మవు; వేదముల్ నాల్గుదెఱఁగు
లై ప్రవర్తిల్లు; వేదశాస్త్రార్థచోది
తంబు లై ధర్మకామముల్ ధరణిఁ బరఁగు. 338

తే. సత్యశమహీను లగుదురు జనులు; గామ
కాములై చేయుదురు బహు క్రతువు లోలి;
నందుఁ ద్రైలోక్యవందితుం డచ్యుతుండు
కృష్ణవర్ణుఁడై జగము రక్షించు మఱియు. 339

క. కలియుగమునందు ధర్మము
బల మఱి వర్తిల్లు నేకపాదంబున; సం
దలఘుఁడు కృష్ణుఁడు జగతీ
వలయము రక్షించుఁ బీతవర్ణం డగుచున్. 340

వ. అందుల జనులు తమోగుణయుక్తులై, కామక్రోధాదిదోషవశంబునం ధర్మ్మ మెఱుంగక యధర్మవర్తు లగుదు; రందుఁ జేసిన తపోదానాది కర్మంబులు స్వల్పంబులయ్యును బహుఫలంబు లగు"నని యుగవర్తన

ప్రకారంబులఁ జెప్పి "నీ కిష్టావాప్తి యయ్యెడు, మరుగు" మనిన భీముండిట్లనియె 341

—: హనుమంతుఁడు భీమునకుఁ దన పూర్వరూపంబుఁ జూపుట :—

క. "నీ నాఁటితనువుఁ జూచియ
కాని యవశ్యంబు పోవఁ; గావునఁ కపినా
థా ! నాకుఁ జూపు" మనవుడు
వానికిఁ దనరూపుఁ జూపె వానరుఁ డంతన్. 342

చ. అతులితమై, ద్వితీయకనకాద్రి యొకో యిది నా, నిజాంగ మూ
ర్జితముగఁ బెంచి, పుచ్ఛమునఁజేసి దిగంతము లందు చున్న యు
న్నతుఁ, గపినాథుఁ జూచి కురునందనుఁ డప్పు నిమీలితాక్షుఁ డై
మతి నతివిస్మితుం డగుచు మారుతి కిట్లనియెన్ భయంబునన్. 343

క. "అతిభీషణ మిది యత్య
ద్భుత; మోహో ! చాలు, భూనభోమధ్యవ్యా
పితనుయ్యె; భవద్దేహా
యతత్వ ముపసంహరింపు" మనవుడుఁ గపియున్. 344

క. తన యెప్పటి రూపముఁ జే
కొని, "దీనికి నినుమడుం గగుం బ్రతిబలముం
గనినప్పుడు నారూపం
బనుపమముగ" ననిన హనుమ కనిలజుఁ డనియెన్. 345

ఉ. ఉన్నతిఁ బూని నీవు బలియుం డగు రావణు నల్పమంబునం
బన్నగఁ జంప నోపు పటుబాహుబలాఢ్యుఁడ; విట్టి యున్నతున్
నిన్ను సహాయుఁగాఁ బడసి నిర్మలనీతిపరుండు రాఘవుం
డన్నరభోజనాన్వయుల నాజి వధించుట యేమి చోద్య మే?" 346

వ. అనిన వాని కతిప్రీతిమంతుం డై హనుమంతుం డిట్లనియె "నయ్యా ! నీవు సౌగంధిక సరోవరంబునకుం బోయెడువే నందు సాహసంబు సేయవలవ; దది యక్షరాక్షస రక్షితం బై, దేవతోపభోగయోగ్యం బై యుండు; దేవతలు బలిహోమ నమస్కారంబులఁ జేసి భక్తి సాధ్యులుగాని, సాహసక్రియాసాధ్యులుగారు; నీవు నిజధర్మనిష్ఠితుండ

వై పరమధర్మంబు లెఱుంగునది; యెందేని హీనబుద్ధులు విమో
హింతు, రట్టి ధర్మాధర్మవిభాగంబు లెఱుంగు విద్వాంసుల నుపాసించి
శుభాచారుండవు గావలయు; నాచారంబున ధర్మంబు వుట్టు; ధర్మంబు
వలన వేదప్రతిష్ఠ యగు; వేదంబులం జేసి యజ్ఞంబులు ప్రవర్తిల్లు; నట్టి
యజ్ఞంబులవలన దేవతలు తృప్తులగుదురు. 347

ఆ. కార్యసిద్ధిపొంచె గాలంబు దేశంబు
నెఱిగి బుద్ధిమంతు లెల్ల ప్రొద్దు
సాహసంబు విడిచి సామాద్యుపాయప్ర
యుక్తి చేయుదురు యథోచితముగ. 348

వ. మఱియు సర్వకార్యంబులు మంత్రమూలంబులు గావున విద్వాంసు
లై ప్రబుద్ధు లైనవారలతో మంత్రంబుఁ జేయునది; బాలకులయు,
నధికక్రోధదర్పితులయు, లుబ్ధులయు, లఘుజనంబులయుఁదోడ
మంత్రంబు సేయవలదు

తే. జనులు నిగ్రహానుగ్రహశక్తుఁ డైన
రాజుశాసనమునఁ జేసి రమణతోడ
నోలిఁ దమతమ మర్యాద లొక్కనాఁడు
దప్పనోడుదు రిమ్మహీతలమునందు. 350

వ. నీవు నిగ్రహానుగ్రహసమర్థుండవు; గావున నీ కెల్ల వారును వశ్యు
లగుదురు; నిన్నుఁ జూచుటం జేసి నా నయనంబులు సఫలంబు లయ్యె;
నీ కెద్ది యిష్టంబు దానిం జేసెద. 351

మత్తకోకిలము: మీకు నెగ్గొనరించి యున్న యమిత్రులన్, హతబుద్ధులం,
జీకురాజుతనూజులం, గురుసింహ ! నీకుఁ బ్రియంబుగా
నేకమాత్రన పోరిలో వధియించి, నాగపురంబు నా
నాకులాద్రిశిలావలీగహనంబు సేయుదు" నావుడున్.

మత్తకోకిలము: "ఇంతయ్యుం గపినాథ ! నీ కిది యేమి పెద్ద ? మవోహా
భ్యంతరంబున నుద్ధతప్రతిపక్షవీరుల నేమ ని
ర్జింతు; మెవ్వరు మాకు మీదయఁ జేసి మార్కొనునంత య
త్యంతవీరులు లేరు భూవిదితప్రతాపబలోన్నతిన్." 353

వ. అనిన విని భీమసేనునకు హనుమంతుం డి ట్లనియె "నన్ను రణాంత రంబునం దలంచునది; నీయందు సౌహృదంబున నాహవంబులో నతిరథుం డయిన యర్జును రథధ్వజంబునం దుండి మీ బలపరాక్ర మంబులం జూతు" నని భీముని గౌఁగలించుకొని వానికి సౌగంధిక సరోవరమార్గంబుఁ జూపి, హనుమంతుండంతర్హి తుండైనఁ దదాలింగన విగతశ్రముండును, విపులజవశక్తి యుక్తుండును నై భీమసేనుండు.

సీ. వారిధారల, ననివారితనిర్గళ
ద్దానధారలఁ, దటిద్దామములను,
దళనధామంబుల, నళనిఘోషంబుల
ఘోరబృంహితబృహద్ఘోషణముల,
నివి ఘనబృందంబు, లివి గజయూథంబు
లని విచారింపంగ నక్కజంబు
లై, లలితోత్తుంగశైల శృంగంబులఁ
ద్రిమ్మరు జలధర ద్విరద తతుల

ఆ. విస్మయంబుతోడ వీక్షించుచుం జని
రజతగిరిసమీపరమ్యభూమి
నక్కుబేరు వనమునందు సౌగంధిక
కమలవనముఁ గనియె ఘనభుజుండు. 355

క. అందుల హేమాంబుజమక
రందరసామోదమృదుతరశ్వాసనుం డా
నందంబుఁ జేసెఁ దనప్రియ
నందనునకు భీమసేనునకు నభినుతుఁ డై. 356

వ. అంత.

క. వీరుం డై సౌగంధిక
వారిజములు గొనఁగ నిట్లు వచ్చినవానిన్
భూరిపరాక్రము భీము ను
దారగదాహస్తుఁ జూచి తా రుద్ధతు లై. 358

వ. దాని రక్షించి యున్న పదివేవురు రాక్షసు లాక్షణంబ విచిత్రాయుధ పరిచ్ఛదులై పఱతెంచి "వీఁ డొక్క దివ్యపురుషుం డాయుధంబులు

ధరియించినవాఁ, డజినంబులు గట్టినవాఁ, డధిక తేజస్వి తపస్వి వేష
ధరుం డిందులకు వచ్చినవాఁ'' డని యచ్చెరు వందుచు భీమసేనుం
డాయ వచ్చి యిట్లనిరి. 359

తరలము. "ఇది కుబేరువనంబు; దీనికి నెవ్వరుం జనుదేర నో
డుదురు; నీ విట వచ్చి యేల కడుం బ్రమాదముఁ జేసి తిం?
దుదిత తేజుఁడు గ్రీడ లాడుచు నుండు నింతలుఁ దాను స
మ్మగముతోడఁ గుబేరుఁ డీరుచిమత్సరోజవనంబునఁ. 360

వ. దీనితీరంబున దేవర్షి గణంబులు దేవతార్చనంబులఁ జేయుదు; రిందుల జలంబు లమృతోపమానంబులు; మఱి వైడూర్యనాళంబు లై, యపూర్వసౌరభంబు లైన కనకకమలంబులు గలుగుటంజేసి యక్ష రాక్షసాహోహిణీరక్షితం బగు దీని మహిమం బెఱుంగక యింత దూరంబు వచ్చిన వీరుం డెవ్వండ? వేమికారణంబున వచ్చి?" తనిన వారికి భీముం డిట్లనియె. 361

మత్తకోకిలము. "ఏను బాండుసుతుండ, భీముఁడ, నిద్ధతేజుఁడ, ధర్మ రా
జానుజన్ముఁడ ద్రౌపదీహృదయప్రియం బొనరింపఁగాఁ
బూని యిక్కమలాకరంబునఁ బుష్పముల్ గొన వచ్చితిఁ;
వీనిఁ గొందు నవశ్యముఁ సురవీరు లడ్డము వచ్చినఁ."

వ. అనిన వారలిట్లని ''రయ్యా! నీవు దివ్యపురుషుండ; వీసౌగంధిక కమలంబులు గొనియెదేని కుబేరున కెఱింగించి, తదాదేశంబునఁ గొనుము; నీవు ధర్మజానుజుండవు గావున నీకు ధర్మపథంబు తప్పం జన" దనిన రాక్షసులఁ గటాక్షరూక్షతాక్షణంబుల నిరీక్షించి భీమసేనుం డిట్లనియె. 363

క. ''గిరినిర్ఝరములఁ బుట్టిన
సరోవరం బిదియు సర్వసామాన్యము గా
కరుదుగ నొక్కనియదియే?
పరఁగఁ గుబేరుండు దీనిఁ బడసెనె మొదలఁ? 364

తే. ఉత్తమక్షత్త్రియుం డేల యొరుల నడిగి
వేఁడువాఁ డగుఁ; దన భుజావిక్రమమున

నన్యధనము లుపార్జించి. యర్థిజనుల
కిచ్చి, కీర్తి దిక్కుల వెలయించుఁగాక 365

—: భీముఁడు యక్షరాక్షసులతో యుద్ధంబు సేయుట :—

వ. నాకు మిమ్మును మీ కుబేరుం బ్రార్థించి కాని యిక్కొలని పువ్వులు గొనంగా దొకో" యని భీముండు రాక్షసుల నాదరింపక సౌగంధిక వనంబు సొచ్చి, కనక కమలంబులు గొని, యుత్తమ వీర్యవంతంబు లైన తత్సలిలంబు లుపయోగించిఁ యనంతబలసంపన్నుండై యున్న నాతని జూచి రాక్షసు లలిగి యుద్యత్తాయుధహస్తు లై తాఁకిన భీముండును భీకరాకారుండై 366

చ. తనగదఁజేసి రాక్షసుల దారుణశస్త్రచయంబు నక్షమం
బున నతివీరుఁ డై విఱిచి, పోర నిశాచరులన్ బడల్పఁడ
ఘనభుజదండచండహతిఁ గ్రాఁచిన నక్కటి రక్కసుల్ కుబే
రున కెఱిఁగింపఁ బాఱిరి సరోషవృకోదరభీమకర్మముల్. 367

వ. కుబేరుండును బాంచాలీప్రియకరం బైన పవనతనయు పరాక్రమారంభంబు విని మెచ్చి దాని నుపేక్షించె, నట్లు భీమసేనుండు రాక్షససేన నోడించి సౌగంధికకమలంబులు గొని తత్తీరకుసుమితలతాపాదపవనంబున విహరించుచున్నంత నట 368

క. వడిఁ బడియెఁ బిడుగు లుడుగక;
వడఁకె మహీతలము; పాంసువర్షము గురిసెన్;
గడు నెట్టి నయ్యె దిశ; లే
ర్పడ కుండె నినుండు తిమిరపటలావృతుఁ డై. 369

వ. ఇట్టి మహోత్పాతంబు లుపలక్షించి విస్మితుం డై ధర్మ తనయుం "డివి భీమాహవ పిశునంబు లై కానంబడియె, నేమఱి కుండ వలయు" నని నాలుగు దిక్కులుం జూచి భీమసేనుం గానక తన సమీపంబున నున్న పాంచాలి కిట్లనియె. 370

క. "ప్రియసాహసుండు భీముఁడు
భయవిరహితుఁ డెందుఁ బోయె? బహురాక్షససం

క్షయ మిగ్గిరి గంధర్వా
న్వయసేవ్యం; బేకచరుఁడు వాఁ డెయ్యెడలన్. 371

ఆ. భూరిభుజుఁడు దానె పోయెనో, నీ వెట
యేని పుచ్చితో నిజేచ్ఛ నతని''
నని యజాతశత్రుఁ డడిగినఁ బతికిఁ బాం
చాలి యిట్టు లనియె సంభ్రమమున. 372

మధ్యాక్కర. "ధరణీశ ! నీకు నా యిచ్చిన పసిఁడితామరపువ్వు
గురువాయువశమున వచ్చినను దానిఁ గొని యిట్టిపువ్వు
లపుడు గాన కుఱంగటం గలిగెనేని యర్థిఁ దెమ్మనిన
నరిగె నీశానుదిక్కునకు నీ తమ్ముఁ డతివేగమునను" 373

వ. అనిన "నట్లేని యందఱము వానిపోయినవలనం బోవుద'' మని
యెప్పటియట్ల రాజస స్కంధారూఢుఁ డై గగనగతి నరిగి సౌగం
ధిక తీరంబున. 374

చ. అతులబలాఢ్యు, నుద్యతగదాయుధహస్తు, బటు ప్రతాపవ
ర్ధితయశుఁ, బాండునందనుఁ దదీయమహోగ్రగదావిఘూతదా
రితపృథుయక్షరాక్షసశరీరచయంబులఁ, జూచి విస్మయ
స్మితముఖు లైరి బ్రాహ్మణసమేతులు ధర్మసుతాదు లచ్చటన్. 375

వ. భీమసేనుండు ధౌమ్య ధర్మజ రోమశులకు మ్రొక్కి, తనకు మ్రొక్కిన
కవలఁ గౌఁగిలించుకొని, వైడూర్యనాళంబు లైన కనకకమలంబులు
ద్రౌపది కిచ్చి యున్నంత నాతనికి ధర్మ రా జి ట్లనియె. 376

ఆ. "చనునె నీకు నిట్టి సాహసక్రియఁ జేయ?
నెల్లవారికంటె నెఱుక గలవు;
గురుభుజుండ! నాకుఁ గూ రేని చేయకు
మయ్య యిట్టిచెయ్వు లనఘ ! యింక," 377

వ అని కఱపి యి ట్లిందఱుం గుబేరోద్యానవనంబున విహరించుచు
న్నంతఁ దద్రక్షకు లైన యక్షులు వచ్చి. 378

క. దేవర్షి యైన రోమశు,
దేవేంద్ర సమాను నయ్యుధిష్ఠిరు, ధరణీ

దేవో త్తములం గని విన
యావనతులు భ క్తి నిట్టు లని రందఱకున్. 379

వ. " మీ రిందు మసల వల; దిది యతురాతుసప్రచారఘోరం" బనిన నం
దుండ నొల్లక పాండవులు తత్సమీపంబున నివాసంబుఁ జేసికొని,
రాతుస బలంబుతో ఘటోత్కచుఁ బోవం బనిచి యుండునంత జటా
సురుం డను రాతుసుండు బ్రాహ్మణ రూపధరుం డై "యేను వేద
విదుండ; ధను ర్వేదవిదుం డైన పరశురాముని శిష్యుండ" ననుచుం
బాండవుల సేవించు చున్నంత నొక్కనాఁడు. 380

ఆ. మృగవిరోధిబలుఁడు మృగయావినోదార్థ
మడవి కనిలతనయుఁ డరిగినట్టి
యవసరమున, నజ్జటానురుఁ డాసురా
కారవిక్రతరూపకంబుఁ దాల్చి. 381

క. చనుదెంచి ద్రౌపదిని. యమ
తనూజు, నకులుం దదాయుధంబులతోఁ బె
ల్చన యెత్తికొని మహోజవ
మునఁ బఱచె మహీసురో త్తములు భయ మందఁగ. 382

వ. అంత సహదేవుండు భీమునిం బిలుచుచు వనంబున కరిగె; నిట ధర్మ
తనయుం డధర్మవ ర్తి యైన యసుర కి ట్లనియె. 383

క. "దేవాసురాదు లిం దుప
జీవింతురు మనుజులకు వి శేషసుఖంబుల్
గావించుచు; నమ్మనుజులఁ
గావం గలవార మేము గౌరవయు క్తిఁ. 384

వ. ఇట్టి మా కపకారంబు సేయుట నీకు లగ్గు గాదు; నీవు ధర్మ వెఱుం
గవు; విశ్వసించిన వారికిం, గుడువం బెట్టినవారికి నెగ్గు సేయుట
కడు పాపంబు గావున. 385

మధ్యాక్కర:

మాయావి! మా యాయుధములు మా కిచ్చి మాతోరణమ్మ్ర
సేయు; మివ్వధమునఁ బోవఁ దగ" దంచుఁ జిక్కనై యసుర

నాయతబాహుఁడు గరము భరముగా నదిమె ధర్మజుఁడు,
మాయావి యగు వాని గమనంబు మందమై యుండ.

వ. ఇట్లు ధర్మజు నిబిడపీడన వేదనాభరంబున విగతవేగుం డై యరుగు జటాసురున కడ్డంబు వచ్చి సహదేవుం డి ట్లనియె. 387

క. "న న్నెఱుఁగవె పాండవుఁడఁ బ్ర
సన్న యశోవీర్యయుతుఁడ, సహదేవుఁడ ? న
త్యున్నతి యేర్పడ నిప్పుడ
నిన్నో ర్చెదఁ జక్క నెదిరి నిలువుము పోరఁ." 388

—: భీముఁడు జటాసురునితో యుద్ధంబు సేయుట :—

వ. అనుచున్న యవసరంబున ననిలసుతుం డనిలవేగంబున నరుగుదెంచి జటాసురుచేత నిగృహీతు లై గగనగతిం జను ధర్మజ నకుల ద్రౌపదులను, మహీతలగతుం డైన సహదేవుం జూచి యయ్యసుర కి ట్లనియె. 389

తే. "అతిథివై వచ్చి నీవు మాయందుఁ గుడిచి
యసురవై యిట్ల యెగ్గు సేయంగనగునె ?
యెందుఁ గుడిచినచోటికి నెగ్గు సేయ
రెట్టిదుర్జనుఁ లైనను నెఱుక విడిచి. 390

వ. నీవు బుద్ధిగలవేని వీరిని విడిచి నీ ప్రాణంబులు రక్షించుకొను; మట్లు గానివాఁడు బక హిడింబ కిమ్మీరులం జంపిన ట్లశ్రమంబునం జంపుదు" నన విని జటాసురుండు వారల విడిచి భీమసేనున కభిముఖుం డై.

క. "రయమున నీచే మను హతు
లయిన సురారాతులకు రణాంతరమున నీ
దయిన రుధిరమున నుదక
క్రియఁ జేసెద బక హిడింబ కిమ్మీరులకున్." 392

క. అనుచుఁ గడు నలిమి మారుత
తనయు మహాబాహు నసుర దాఁకె; మరున్నం
దనున కెడ సొచ్చి మాద్రీ
తనయులు తత్క్షణమ వానిఁ దాఁకిరి వీకన్. 393

సీ. వారల నిద్దఱ వారించి భీముండు
దాఁకె జటాసురు వీఁకతోడ;
భీమాసురులకు సంగ్రామంబు గడు ఘోర
మయ్యె; నిర్మ్మలంబు లయ్యె వారి
యూరుఘట్టనముల ధారణీరుహాములు;
పదఘట్టనములఁ గ్రక్కదలె ధరణి;
భూరుహాపాణులై పోరి యాసన్నభూ
రుహాములు వొలిసిన. బృహదుదగ్ర

ఆ. శిలఁ గొంతసేపు చెలఁగి పోరాడి రొం
డొరులు వెనఁగి పట్టి పరుషభంగి;
నుగ్రులైన వాలి సుగ్రీవు లట్టుల
యుద్ధ మెప్పుఁ జేసి రిద్ధబలులు. 394

క. భీమాసురవీరుల ము
ష్టాముష్టిరణచ్ఛటచ్ఛటాశబ్దం బు
ద్దామం బై తద్వీపినమ
హామృగపతులకు నతిభయావహ మయ్యెన్. 395

ఆ. అంత భీమసేనుఁ డంతకాకారుఁ డై
వాని బలవిహీనుఁ గా నెఱింగి
తడయ కపుడు వాని మెడ గ్రుంగఁ బిడికిటఁ
బొడిచె; నసురముడిఁగి పడియెఁ బుడమి. 396

వ. ఇట్లు నిర్ఘాతనిపాతభిన్నోన్నత నీలగిరిశృంగంబునుంబోలె నేలం బడిన జటాసురు కళేబరం బెత్తి యొక్క విశాలపరుషపాషాణంబుపై జర్జరితంబుగా వైచి వానింగాలగోచరుంగాఁ జేసిన వాయుపుత్రు పరాక్రమంబు ధౌమ్యరోమశాదిమహీసురవరులు వర్ణించి" రని వైశంపాయనకథితం బైన కథ రమ్యంబుగ. 397

క. భూపకులతిలక! నృపవి
ద్యాపారగ! నిత్యసత్యధనధన్య! దయా
లాపచతురాస్య! ధర్మ
వ్యాపారవిచార! విష్ణువర్ధననృపతీ. 398

వసంతతిలకము. శ్రీరమ్య ! రాజకులశేఖర ! రాజరాజా !
భూరిప్రతాపపరిభూతవిరోధివర్గా !
హారామృతాబ్జహారహాసతుషారకుంద
స్ఫారదయశఃప్రసరపాండుకృతత్రిలోకా ! 399

గద్యము. ఇది సకలసుకవిజనవినుత సన్నయభట్టప్రణీతంబైన శ్రీమహా భారతంబునం దారణ్యపర్వంబునం దధీచికథయును, నగస్త్య మాహాత్మ్యంబును, భగీరథుప్రయత్నంబునుం, గంగావతరణం బును, ఋశ్యశృంగుచరిత్రంబును, బరశురాము చరిత్రంబును, గార్తవీర్య వధయును, రామకృష్ణాదుల యాగమనంబును, సౌకన్యాఖ్యానంబును, జ్యవనుండు శర్యాతి యజ్ఞంబున నాశ్వినుల సోమపీథులం జేసి వారిచేత జవ్వనంబు వడయుటయు, మాంధాతృజన్మంబును, సోమకుండు యజ్ఞంబుఁ జేసి పుత్రశతంబు వడయుటయు, జంతూపాఖ్యానంబును, శ్యేనకపోతంబులై యింద్రాగ్నులు శిబిమాంసంబు గొనుటయు, నష్టావక్రు మాహాత్మ్యంబును, వైభ్య యవక్రీతుల సంవాదంబును, భీముండు సౌగంధికహారణార్థం బరుగుటయు, హనుమద్దర్శనంబును, రామాయణ కథయును, భీముండు గంధమాదనంబునం దుండు కొలనికిం బోయి యక్షరాక్షసుల వధించుటయును, గంధమాదనంబున నందఱుం గూడుటయు, జటాసుర వధయు నన్నది తృతీయాశ్వాసము. 400

శ్రీ

గణేశ శారదా గురుభ్యో నమః

శ్రీ మదాంధ్ర మహాభారతము

ఆరణ్యపర్వము - చతుర్థాశ్వాసము

శ్రీ రాజ రాజ ! కులని
స్తార ! సుధాహార హీరసన్నిభకీర్తి !
శ్రీరమణ ! రాజవిద్యా
పారగ ! కోదండపార్థ ! పార్థివతిలకా ! 1

వ. అక్కథకుండు శౌనకాది మహామునులకుం జెప్పె; నట్లు పాండవులు నరనారాయణాశ్రమంబునఁ గొన్ని దినంబు లుండ నొక్క నాఁడు ధర్మతనయుండు దమ్ముల కిట్లనియె. 2

మధ్యాక్కర. "ఏ నేఁడు లగుదెంచె నర్జునుం డేఁగి; యింత కేతెంచుఁ బూని దివ్యాస్త్రముల్ వడసి; యమ్మహాభుజు, భూరిసత్త్వు, నానతరిపువర్గుఁ జూడఁ గాంతు మిం" దంచు బ్రాహ్మణుల తో నేఁగె నుత్తరము మించి ధర్మనిత్యుఁడు ధర్మజుండు.

వ. ఇట్లు గంధమాదన పుణ్యతీర్థావలోకనపరు లయి పాండవు లరిగి, యందు గోదాన హిరణ్యదానాది మహాదానంబుల విప్రులం దృప్తులం జేసి, పదునే డగు దివసంబున వృషపర్వుం డను రాజర్షియాశ్రమంబు గని, యందతిప్రీతి నాతనిచేతఁ బూజితులయి, యేడుదివసంబులు వసియించి, బ్రాహ్మణుల నెల్ల నందుండ నియమించి, వృషపర్వోప దిష్టమార్గంబున ధౌమ్యరోమశప్రభృతికతిపయ బ్రాహ్మణులతోఁ జని యష్టమదివసంబున. 4

క. విమలస్ఫాటికహాటక
రమణీయదరీనిరంతరశ్వేతనగేం
ద్రము, మూల్యవంతమును ను
త్తమచరితులు సూచు చరిగి తద్వివిసమునఁ. 5

క. చలదళిపుంస్కోకిలకుల
కలరవముఖరితలతాంత కమ్రఫలాళీ
లలితమహీరుహమాలా
మిలితోద్దేశముల విశ్రమించుచు లీలన్. 6

వ. అందు విహరించుచుండ నొక్కనాఁడు శ్వేతకి యను పుణ్యనదివలన మారుతా నీతంబు లై తమ ముందటం బడిన పంచవర్ణసురభికుసుమం బులం జూచి, యందఱు విస్మయం బంది; రంత నే కాంతంబ యొక్క శశికాంత శిలాతలంబు పయి నున్న భీమసేనునకు ద్రుపద రాజ పుత్రి యి ట్లనియె. 7

క. "ప్రకటమగుఁ దొంటి సొగం
ధికకనకాబ్జమునకంఁ ది దివ్యసుగంధా
ధిక కుసుమము, లివి దద్దయు
సుకుమారము; లిట్టివానిఁ జూచి యెఱుంగన్. 8

వ. ఇక్కుసుమంబులు నాకఁ దెచ్చి యిచ్చి, మనఃప్రియంబు సేయు" మనిన విని భీముండు తత్క్షణంబ చని చక్రవాళనగసమున్నతం బయిన గిరి శృగం బెక్కి యందు వివిధరత్నరశ్మి రమ్యవేశ్మపరివృతం బయిన వైశ్రవణు నివాసంబు గని శంఖధ్వానంబు సేసిన. 9

క. దాని విని యక్షరాక్షస
సేనలు పఱతెంచి భీమసేను మహాసే
నానీసన్నిభుఁ దాఁకిరి
నానాయుధధరులు దారుణధ్వను లెసఁగన్. 10

క. వాయుసుత ప్రేరితశిత
సాయకముఖదళితరాక్షసప్రకరబృహ
త్కాయాభ్రగళితశోణిత
తోయములన ధరణిధరనదులు గడు నిండెన్. 11

ఉ. ఉక్కుటీ యిట్లు మధ్యము మహోగ్రశరంబుల ధాక కోర్వ కా
రక్కసు లెల్ల నాహవపరాఙ్ముఖు లైనఁ, గడంగి భీముఁ దా
నెక్కటి దాఁకె, దిక్కరి సహింపక సింహముదాకునట్టు లం
దక్కజుఁ డుద్యతాయతగ దాయుధుఁ డై మణిమంతుఁ డల్కతోఁ.

క. ఆరాక్షసు, నతివీరుఁ, గు
బేరసఖుం బవనసుతుఁ డభేద్యుఁడు నిజదు
ర్వారతర శాతసాయక
ధారావర్షమునఁ గప్పె దారుణభంగిఁ. 13

క. గదద్రిప్పి భీముమీఁదను
వదలక మణిమంతుఁ డలిగి వైచిన, నది వి
ద్యుదినప్రభానిభం బై
పదిదిశలును వెలుఁగ భీముపయిఁ బఱతెంచెఁ. 14

వ. అమ్మహాసాధనంబునకు మనంబున బెగడక. 15

క. దానిఁ దన నిశితబాణవి
తానంబున జర్జరీకృతముఁ జేసె మరు
త్సూనుఁడు, గుహ్యక రాక్షస
నేనల కెల్లను భయంబు నేయుచు నలుకఁ. 16

క. ఘనుఁ డమ్మణిమంతుఁడు కాం
చనదండోద్భాసి యైన శక్తి మరున్నం
దనుమీఁద వైచె; నది యా
తని భుజపార్శ్వమ్ము దాఁకి ధారుణిఁ బడియెఁ. 17

చ. గదఁ గొని భీముఁ డంత లయకాలకృతాంతుఁడపోలె నేల గ్ర
క్కదల నదల్చి, నిల్చిన, నకంపితుఁ డై మణిమంతుఁ, డాజిదు
ర్మదుఁడు త్రిశూల మెత్తికొని మధ్యముపై ననలస్ఫులింగముల్
సెదరఁగ వైచె; దానిఁ జఱచెఁ ఘనుఁ డై గదఁ జేసి భీముఁడుఁ.

వ. ఇట్లు తన శక్తి శూలంబుల శక్తి నిహతంబై నఁ బరిత్యక్తమదుం డై
మణిమంతుం డంతరిక్షంబున కెగసిన. 19

క. "పోవకు పోవకు" మనుచు మ
హావీరుఁడు గద యమర్చి యమ్మణిమంతుఁ.
లావఱఁగ వైచె నగ్గద
తో; వాఁడును బడియెఁ బ్రతిహతుం డై నేలన్. 20

క. పోర మణిమంతుఁ డిటు స
మీరణసుతు చేతఁ బ్రాప్తమృతుఁ డై పడినన్.
వారక పఱచిరి భయమున
నారాక్షసు లార్తనాదు లై తూర్పునకున్. 21

వ. అట ధర్మరాజు భీమసేను పోయినవలను ద్రౌపదిచే నెఱింగి యార్ష్టి
షేణుం డను మునివరు నాశ్రమంబున ధౌమ్యద్రౌపదీప్రభృతులం
బెట్టి. రోమశనకులసహదేవయుతుం డయి తద్గిరిశృంగం బెక్కి, కుబేర
సదనసమీపంబున నిజగదాహతపాతిత మణిమంతాది రాక్షసదారుణ
రణమధ్యంబున నున్న మధ్యమునొద్దకుం జనియె; నంత. 22

క. హతశేషు లైన రాక్షసు
లతిరయమునఁ బాఱి చెప్పి రప్పుడ యలకా
పతికి సవిస్తరముగ నిజ
మతిఁ బవనజువిక్రమంబు, మణిమద్వధయున్. 23

వ. దాని విని కుబేరుండు విస్మితహృదయుం డయి యాత్మగతంబున.

క. "తలరక మను సౌగంధిక
ములు గొని, యిప్పుడును దర్పమున నిందుల పు
వ్వులుకొని, మణిమత్ప్రభృతులఁ
బలువుర వధియించె నెట్టి బలియుఁడో" యనుచున్. 25

వ. సుర గరుడ గంధర్వ యక్ష రాక్షస సహితుం డయి యక్షప్రభుం
డరుగుదెంచి, పాండవులం గని, వారిలో గదా కృపాణ బాణాసన
ధరుండయి రణకాంక్షనున్న మహావీరు మారుతాత్మజుం జూచి, పరమ
ప్రీతచిత్తుండయి యున్న. 26

ఆ. అక్కబేరునకు మహామతుల్ పాండవుల్
ప్రొక్కి; రంత ధర్మమూర్తి యైన
ధర్మతనయుఁ జూచి తద్దయు దయతోడ
నిట్టు లనియెఁ గిన్నరేశ్వరుండు. 27

వ. "అయ్యా! నీ యనుజుండు మత్ప్రియసఖుం డయిన మణిమంతు వధియించి నా కపకారంబు సేసెనని లజ్జింప వలవ; దది యగస్త్య శాపనిమిత్తంబున నయ్యె" నని భీమసేను డాయం బిలిచి, నీ చేసిన సాహసంబు నా కుపకారంబు గావున నిన్ను మెచ్చితి" ననిన నక్కబేరునకుం గృతాంజలి యయి ధర్మతనయుం డిట్లనియె. 28

ఆ. "ఇట్టిశాప మమ్మునీంద్రుండు దా నేల
యిచ్చె? దాని నాకు నెఱుఁగఁ జెప్పు"
మనిన విస్తరించి యమరాజసుతునకు
నక్కబేరుఁ డిట్టు లనుచుఁ జెప్పె. 29

వ. "తొల్లి కుశవతి యను పుణ్యనదీతీరంబున నమరులెల్ల సత్రయాగంబు సేయుచుండి నన్ను రావించిన, నేను బుష్పకవిమానారూఢుండ నై త్రిశతమహాపద్మ సంఖ్యల యక్షరాక్షసబలంబులతో గగనగతి నందులకుఁ బోవునెడ, నూర్ధ్వబాహుండయి యమునాతీరంబున నుగ్రతపంబు సేయుచున్న యగస్త్యమహామునిమీఁద నా ప్రియసఖుం డయిన మణిమంతుం డెఱుంగక నిష్ఠీవనంబు సేసిన నలిగి చూచి, యమ్మునివరుండు నా కిట్లనియె. 30

ఆ. "నీవు సూచుచుండ నీయిష్టుఁ డిమ్మణి
మంతుఁ డిపుడు తనదు మదము పేర్మి
నన్ను నరయ కుమిసె నామీద; నిట్టి దు
ర్మదుఁడు పొలియు నొక్క మనుజుచేత. 31

వ. మఱియు నీ యక్షరాక్షసబలంబులును వానిచేతన నిహతంబులగు; నీ దురితంబు దద్దర్శనం బునంబాయు" ననియెం గావున నిట్టి శాపలంబునకు నీ యనుజుండు నిమిత్తంబయ్యె" నని చెప్పి వెండియు నిట్లనియె "నయ్యా! ధృతియును, దాక్ష్యంబును, దేశంబును, గాలంబును

బరాక్రమంబు నను పంచవిధంబులైన లోకతంత్ర విధానంబు తెలిం
గిన సప్తత్రియుండు ధర్మ్మవిదుండయి ధరణీచక్రంబు నిర్వక్రంబుగా
రక్షించి పుణ్యలోకంబు వడయుఁ; దత్కర్మ్మవిశేషంబు లెఱుంగక
వృథారంభుండయి సాహసంబున వర్తిల్లు వానికిం బాతకం బగుట
నిశ్చయంబు. 32

క. కావున నీ తమ్ము, మరు
ద్దేవాత్మజు సాహసైకధృతిఁ గాకుండన్
భూవల్లభ! శిక్షింపుము
నీవిమలజ్ఞానధర్మ్మనిష్ఠితబుద్ధిన్. 33

వ. నిన్నును, నీ తమ్ములను ధర్మ్మానిలశక్రాశ్వినులు రక్షించినట్లు యే
నెప్పుడు రక్షింతు; నా నియోగంబున మత్పరిచారకులు మీకు నిత్యం
బును నన్నపానాదులు దెచ్చి యిచ్చుచుండ నార్షి షేణాశ్రమంబున
నొక్క పక్షంబు వసియించుసది. 34

సీ. మానితయశుఁడు, భీమానుజుం, డర్జునుం
డమరులచేత దివ్యాస్త్రతతులు
వడసి దేవేశ్వరుకడ నున్నవాఁ; డాతఁ
డుపకారి యయ్యె దేవోత్తమునకు;
సప్తాశ్వమేధసంప్రాప్తపుణ్యుఁడు, ధర్మ్మ
మతి, భవత్పితృపితామహుఁడు, ఘనుఁడు,
శంతనుఁ డతనిచే సంతర్పితుం డయి
గుఱుకొని మిడైన కుశల మడిగె;
ఆ. నరుగుదెంచు నింత కయ్యర్జునుండు; మీ
కభిమతార్థసిద్ధి యగుఁ బ్రసిద్ధ"
మని యెఱుంగఁ జెప్పి యలకాధినాథుండు
యక్షగణముతోడ నర్థిగె నంత. 35

వ. ఇట్లు ధర్మ్మరాజు కుబేరాదేశంబున నార్షి షేణాశ్రమంబున నుండునంత
నాతనికి నొక్కనాఁడు ధౌమ్యుండు నిజాంగుళి నుత్తరదిగ్భాగంబు
సూపుచు నిట్లనియె. 36

క. "అదె మందరనగ; మక్కడ
యదె మేరునగేంద్ర; మమ్మహాశైలమునె
న్మిదిదిక్కుల వసియింతురు
త్రిదశేంద్రుం దొట్టి యష్టదిక్పాలవరుల్. 37

చ. కనకగిరిం బ్రదక్షిణముగా శశిభాస్కరతారకాగణం
బనవరతంబుఁ ద్రిమ్మరు మహామునిసప్తకమండలంబుతో;
ననఘ! తదీయతుంగశిఖరాగ్రమునందుఁ బయోరుహాసన
త్రినయనవిష్ణు లుండుదురు దేవగణంబులు గొల్చు చుండఁగన్." 38

వ. అని చెప్పుచుండఁ బాండవు లం దొక్క మాసంబు నివాసంబు సేసి; రంత. 39

ఉ. అంబర మాత్మదీప్తినివహంబున నొప్పఁగ, మాతలిప్రయు
క్తంబగు దివ్యకాంచనరథంబు, లసచ్చపలాంశుపుంజర
మ్యం బగుదాని నెక్కి, ధృతిమందరుఁ డింద్రసుతుండు నాకలో
కంబుననుండి వచ్చెఁ బ్రవికాసితతేజుఁ డినప్రకాశుఁ డై. 40

వ. ఇట్లు చనుదెంచి ధనంజయుండు రోమశధౌమ్యధర్మజభీమనేనుల పాదంబులకుం బరమభక్తి మ్రొక్కి, తనకు వినయవినమితోత్తమాంగు లయిన కవల నెత్తికొని, ద్రౌపదీహృదయనయనారవిందంబుల కానం దంబు సేయుచున్నంత నందఱు సంతోసిల్లి మాతలి నతిప్రీతిఁ బూజించిన నతండును దదీయరథంబు గొని దివంబున కరిగె; నట్టియవసరంబున.

క. దిననాథుఁ డస్తగిరిఁ బొం
దినఁ, జీఁకటి, కాచి, యాత్మ తేజమున దిగం
గనల విభూషించుచు రజ
నినాథకలహంస గగననిమ్నగ నొప్పెన్. 42

వ. ఆరాత్రి యర్జునుం డనుజుల నందఱ నొద్దఁ బెట్టుకొని యిష్టపూర్వ కథలు సెప్పుచు శయనించె; నంతఁ బ్రభాతంబ సిద్ధమునిగణంబులయు, రోమశధౌమ్యులయుఁ, దమ్ములయుఁ దోడ ధర్మతనయుండు సుఖోపవిష్టుం డై యున్నంత. 43

—: ఇంద్రుండు పాండవులయొద్దకు వచ్చుట :—

సీ. బోరన సురదుందుభుల నినాదంబులు,
గిన్నరగంధర్వగీతరవను
లెసఁగ, సహస్రసూర్యేందుమండలములు
వోలె విమానము వొలిచి వెలుఁగఁ,
బాండవాలోకనపరుఁడై సహస్రాక్షుఁ
డమరగణంబుతో నమ్మహాద్రి
కేతెంచెఁ బ్రీతి; నయ్యింద్రున కందఱు
నంత నభ్యుద్గతు లైరి; పాండ

ఆ. వాగ్రజుండు దాను ననుజులు నింద్రు పా
దాంబుజముల కెఱఁగి యధికభక్తి
శాస్త్రదృష్టవివిధసత్కారవిధులఁ బూ
జించె నమరఖచరసిద్ధపూజ్యు. 44

వ. ఇంద్రుఁడును వారల నందఱ హితమధురవచనంబుల నభినందించుచుఁ
దదంతిక స్థితు, నధికతపోయుక్తు, ధనంజయుం జూపి ధర్మజున
కిట్లనియె. 45

క. "ఘనుఁ డీపార్థుఁడు నావల
నన దివ్యాస్త్రప్రయోగనయనిపుణుం డై
దనుజుల నివాతకవచుల
ననిఁ జంపి, సురాలికిం బ్రియం బొనరించెన్. 46

క. ఈతఁడు పరాక్రమమున న
రాతుల వధియించి యి ద్ధరారాజ్యము వి
ఖ్యాతముగ నిచ్చు నీకు; మ
హాతేజుఁ డజయ్యవీర్యుఁ డని నెవ్వరికిన్." 47

క. అని చెప్పి యనిమిషప్రభుఁ
డనిమిషనివహంబుతోడ నమరావతికిం
జనియెఁ నిజాలోకమున
కనఘులు పాండవులు హర్ష మందుచు నుండన్. 48.

మధ్యాక్కర. ఘనముగ ధనదేంద్ర పాండుసుఖసమాగమ మొక్కయేఁడు
దనరంగ బ్రహ్మచర్యవ్రతస్థు లై తగిలి నిత్యంబు
వినిన పుణ్యాత్ములును, జదివినవారు విభుత నూఁపేండ్లు
నొనర జీవింతు రత్యంతసత్కాంతియుక్తులై ధరణి. 49

వ. ఇట్లు సురేంద్రుం డరిగిన ధర్మతనయుం డర్జునుం జూచి పరమానంద
నిర్భర హృదయుం డై యిట్లనియె, 50

సీ. "హరుఁ డాదిగాఁ గల్గు నమరగణంబుచేఁ
బడసి దివ్యాస్త్రముల్, పరమ మైన
యుపకార మమరుల కొనరించె నీ పార్థుఁ
డని నాకుఁ జెప్పె వృత్రాంతకుండు;
దివ్యాస్త్రలాభమ్ము, దేవేంద్రునకుఁ బ్రీతి
గా వేల్పులకు నుపకారివై న
విధమును మా కిప్డు విన వేడ్క యైనది"
యని తన్ను నడిగిన నగ్రజునకుఁ

ఆ. నగ్రజన్మపూజ్యు లగు ధౌమ్యరోమశ
ప్రభృతివరుల యొద్దఁ బాండవేయుఁ
దసదృశప్రభావుఁ, డతివీరుఁ డర్జునుఁ
డాత్మచరిత మిట్టులనుచుఁ జెప్పె. 51

వ. "ఏను భవదధిష్ఠితవిద్యాప్రభావంబున తపోనియుక్తుండ నై హిమ
వంతంబునకుం జని, యందు నాముందట వృద్ధబ్రాహ్మణుం డై
యున్న వృద్ధశ్రవుం గని, తదుపదేశంబున నీశ్వరు గుఱించి యుగ్ర
తపంబు నేసిన, నీశ్వరుండు గిరాతరూపధరుండై నాతోడ నతిఘోర
యుద్ధంబు నేసి నాకుఁ బ్రసన్నుండై, నిజరూపంబుఁ జూపి పాశుపతా
స్త్రంబుఁ బ్రసాదించె; ననంతరంబ యింద్రాదిదేవతలవలన నైంద్రా
గ్నేయ యామ్య రాక్షస వారుణ వాయవ్య కౌబేర గాంధర్వ
పైశాచ బ్రాహ్మ్యంబులనం బరఁగు దివ్యాస్త్రంబులు వడసి, మహేం
ద్రానుగ్రహంబున మాతలి ప్రయుక్తంబైన దివ్యరథం బెక్కి, యీ
శరీరంబుతోడన యమరావతి కరిగి, యం దమరేంద్రు నాచార్యుఁగా

వరించి, తత్ప్రసాదంబునఁ దివ్యాస్త్రంబుల ప్రయోగంబును, నుప
సంహారంబును, నివర్తనంబునుఁ, ప్రాయశ్చిత్తంబును, ప్రతిఘాతంబు
లును నేర్చిన నాకు సంతోసిల్లి సురేంద్రుం డిట్లనియె. 52

క. "నీ వఖిలశస్త్రవిదుఁడవు
గావున ని న్నాజి నోర్వఁగా నోప రొరుల్;
దేవతలకు బ్రాహ్మణులకుఁ
గావింపు హితంబు దీనఁ గడు సిద్ధి యగున్; 53

క. నాకు గురుదక్షిణార్థము
నాకహితార్థంబుగా జనస్తుత బుద్ధిం
జేకొని నా పనిచిని పనిఁ
బ్రాకటముగఁ జేయు మహితభంజనశక్తిన్. 54

తే. జలధికుక్షిలోనుండి ధీరులు నివాత
కవచు లన మూఁడుకోట్లదానవులు బలిమిఁ
ద్రిదశులకు బాధసేయుచుండుదురు; వారు
నిహతులగుదురు నీచేత మహితకీర్తి!" 55

వ. అని తన తొడిగిన యిద్దివ్యభూషణంబుల, నిమ్మణికిరీటంబున నన్ను విభూషితుం జేసి, స్పర్శరూపం బైన యీ యభేద్యకవచంబు నిచ్చి, యజగరసన్నిభం బయిన యిగ్గొనయంబు గాండీవంబు దాన యోజించి, పదివేల హంస మయూర వర్ణమాననీయహయంబుల బూనిన రథంబు, మాతలి ప్రయుక్తం బైన దాని నెక్కం బనిచి, నివాత కవచవధార్థ బరుగు మని నియోగించిన నింద్రు వీడ్కొని చనుచున్న నాతో దేవత లిట్లనిరి. 56

ఉ. "ఈరథ మెక్కి తొల్లి యమరేంద్రుఁ డనేకసహస్రసంఖ్య దే
వారుల, వృత్ర శంబర బలారుల, నుద్ధతులన్ జయించె; వీ
రారివిభేది! నీవును బలాఢ్యుఁడ వై వధియింపు ముగ్రమా
యారతులన్, నివాతకవచాసురులన్ సమరాంతరంబునన్." 57

వ. అని నాకు దేవదత్తం బను శంఖం బిచ్చిన నేను మాతలి ప్రయు
క్తంబైన రథం బెక్కి యతిత్వరితగతి నరిగి. 58

—: అర్జునుఁడు నివాతకవచు లను రాక్షసుల జయించిన కథ :—

క. ఫేనవదూర్మి చయంబుల,
నానావిధమీనకూర్మనక్రంబుల, నై
లానుకృతి నొప్పుచున్న మ
హానీరథిఁ గంటి నేను నమ్మాతలియున్. 59

వ. ఆ సముద్రోదరంబున విశాలాట్టాలక ప్రతోళికా ప్రతాన విచిత్ర పతాకా వివిధ సాలాలంకృతం బయిన పురంబుఁ గని, తద్ద్వారంబున శంఖధ్వానంబు సేసిన, నది సకల దిఙ్ముహీధర గుహాకుహరాంతరంబు లం బ్రతిశబ్దజననం బయిన, దాని విని యలిగి యద్దానవులు నానా విధాయుధసన్నద్ధు లయి నిజకాయకాళిమాంధత మోభూతభూభువను లగుచు వచ్చి నా రథంబుఁ బరివేష్టించి. 60

క. ఉరుశస్త్రవృష్టి నాపైఁ
గురిసినఁ, దృణమె యొక్కొకొనిపయి నేనున్
వరుసం బడేసి బాణము
లరుదుగ నేసితి మహాభయంకర భంగిన్. 61

క. దనుజులు మదీయరథమా
ర్గనిరోధముగాఁ బ్రచండకాండప్రకరం
బునఁ గప్పిరి రోదోంతర,
మనిమిషులును ఋషులుఁ జూచి యద్భుతమందన్. 62

క. కడుభయమున మాతలి చే
డ్పడి రథచోదనమునం దపాటవుఁ డైనన్
వడి నేన రథము గడపుచుఁ
దడయక యేసితిఁ గడంగి దానవులపయిన్. 63

వ. మాతలి నన్ను జూచి సంతోసిల్లె నంత. 64

చ. అతులరణాంతరంబున నిరంతరమత్పటు బాణ పాతితో
చ్ఛ్రితదనుజాంగనిర్గళదసృగ్జలధారలు సూడ నొప్పె, నా
తతగిరిశృంగసంగదళిత ప్రచలజ్జలవాహజాలసం
తతగళదంబుధారలవిధంబున నంబర మెల్లఁ గప్పుచున్. 65

వ. అంత నయ్యసురులు మాయాయుద్ధంబు సేయ సమకట్టి నామీఁద
వర్షాస్త్రంబు లేసిన. 66

క. బలరిపుఁడు నాకు నిచ్చిన
యలఘునిశాతముఖశోషణాస్త్రంబు విని
ర్గళదవిరళజలధారా
వలి నెల్లం దృణంబ వట్టఁగఁ జేసెఁ. 67

సీ. అద్దానవులు దారుణాశ్మవర్షంబు పైఁ
గురిసిన, నవి నన్నుఁ దెరలఁ గప్పె;
నేనును గులిశాస్త్ర మేసి పాషాణముల్
నుఱుము గావించితి నుఱుక; వెండి
యసురులు నామీఁద ననలాస్త్రజాలంబు
లేసిన, గాడ్పుతో మ్రోసి యగ్ని
కణములు నాపయిం గవిసె; నేనును శైల
సలిలాస్త్రముల వానిబల మడంచి

ఆ. యున్నఁ, దిమిరబాణ ముగ్రంబుగా వార
లేసిఁ రంత దిక్కు లెల్లఁ గప్పె;
నంధకారమగ్నుఁ డై చలియించి మా
తలి ప్రతోద మెడలి ధరణిఁ బడియె. 68

క. తురగములు పఱవ నేరక
వరరథవహనంబునందు వంధ్యము లయ్యెఁ;
సురసారథి ననుఁ గానక
"హరినందన యెందుఁ బోయి" తనేఁ గడు భీతిఁ. 69

క. అమృతనిమిత్తంబున ము
న్నమ రాసురయుద్ధ మయ్యె; నది యింత భయ
భ్రమజనకము గా; దిది యు
గ్రము దనుజు లావార్యవీర్యగర్వితు లగుటఁ. 70

తే. బ్రహ్మచేత నిర్మింపఁగఁబడిన భువన
సంప్లవం బిది" నావుడు "సంగరమున

సంచలింపక నా భుజశక్తి జూచు
చుండు'' మనవుడు మాతలి చోద్యమందె. 71

ఉ. వాసరనాయకుం దలఁచి వజ్రివరంబున సూర్యభాణ మే
నేసితి నింద్రుఁదొట్టి సుర లెంతయు సంతస మందఁగా, జగ
త్త్రాసి తమిస్ర రాశి నిహతంబుగ, దిక్కులు తెల్లగా, మహో
గ్రాసురు లాహవంబున భయంపడ, మాతలి మెచ్చి యార్వఁగాఁ. 72

క. గాండీవముక్తదారుణ
కాండవిఖండీకృతాపఘనులై దనుజుల్
భండనముఖమునఁ జేడ్వడి
కొండలు వడినట్టు వడిరి కుతలం బద్రువఁ. 73

వ. ఇట్లు నివాతకవచులు మదీయ దివ్యాస్త్రనిహతు లై మహీతలంబు
పయిం బడిన, నట యసురకాంతల యాక్రందన ధ్వను లాకసం
బద్రువ నొక్కటఁ బురంబున నెగసె; నంత నద్దానవపురంబుఁ బుర
దరు పురంబుకంటె నతి సుందరం బైన దానిం జూచి మాతలి కే
నిట్లం టి. 74

క. "నిరుపమరత్న నిరంతర
వరగృహముల నొప్పి సుఖనివాసం బగు ని
ప్పురి నుండ నొల్ల కొండొక
పురి నుండఁగ నేల వలసెఁ బురుహూతునకుఁ?" 75

వ. అనిన నాకు మాతలి యి ట్లనియె. 76

సీ. "అసురులచలన భయం బైనయపుడు వే
ల్పులకు సేమంబుగా బలవిరోధి
యాజ్ఞ జలధిలో నిమ్ముగ నిర్మించె;
దనుజులు పదపడి వనజగర్భు
వలనఁ దపోవీర్యవంతులై, యిందుండ
నమరులచేతఁ గయ్యమున నజితు
లై యుండఁ బడసిన, నమరేంద్రుఁ డెటిఁగి త
ద్విజయార్థముగఁ బంచె విజయ! నిన్ను;

ఆ. నమరులకు నసాధ్యు లైనట్టి వీరల
నీవ యోర్చి "తనుచు నెమ్మితోడ
నన్ను సంస్తుతించి నరనాథ! మాతలి
గడఁగి యపుడు రథముఁ గ్రమ్మఱించె. 77

వ. ఇట్లు నివాతకవచులం జంపి క్రమ్మఱి వచ్చునేఁడ, నా ముందట నొక్క తపోవనంబును, నతి విచిత్రంబైన పురంబునుం గని "యిది యెవ్వరిపురం" బని యడిగిన నాకు మాతలి యిట్లనియె. 78

క. "వినవె పులోమయుఁ, గాలక
యును ననఁగా నిరువు రసురయుషతులు గమలా
సను నారాధించిరి తప
మున దివ్యసహస్రవర్ష ములు గడునిష్ఠన్. 79

క. కనకమయ మైన యీ ప్రో
లును, ధమ సుతు లాహవంబులో నమరులచే
త నవధ్యులుఁ గాఁ, దగ న
వ్వనజజుచేఁ బడసి రసురవనితలు కరుణన్. 80

వ. ఇది హిరణ్యపురం; బిందుఁ బౌలోమ కాలకేయు లను నసుర లుండుదురు; వారమరులచేత నవధ్యు" లనిన "నట్లేని వారిపయిం బోదము; రథంబు వఱపు" మని యేను మాతలిం బంచిన. 81

చ. అతఁడును పప్తమారుతరయంబున దివ్యరథంబు దత్సు రా
హితపురిభూరివప్రముపయిం బఱపెన్; సురవైరు లంత ను
ద్ధతు లయి ప్రోలు వెల్వడి రథంబుల షష్టిసహస్రకంబుతో
శతమఖబుద్ధిఁ జేసి కడు సైఁపక తాఁకిరి నన్ను నల్కతోన్. 82

వ. ఏను వారల యఱుపదివేల రథంబులకు గతినిరోధంబుగా వితతవృక్ష వికటశిలా ప్రభవంబు లయిన దివ్యబాణంబు లేసిన, నసురులు మాయా యుద్ధనిబద్ధులై తమ పురంబుతోడన దివంబున కెగసి, మదీయమార్గ బాణార్గళనిరుద్ధమార్గు లై నేలం బడిన, వీరల నొండు విధంబున నోర్వఁ గా దని. 83

చ. ఉరగఫణాగ్రరత్నకిరణోల్లసదుగ్రభుజున్, వృషాంకు, శం
కరు, శశిఖండమండితశిఖండు, శివున్ హృదయాంబుజంబునం
దిరముగ నిల్పి, పాశుపతదివ్యశరం బదిఁబోసి యేసితిఁ
సురరిపుకోటిమీఁద, హరిసూతుఁడు మాతలి మెచ్చిచూడఁగాన్. 84

వ. ఆ దివ్యాస్త్ర ప్రభావంబున సింహ శరభ శార్దూల శుండాల మహిష మహోక్ష యక్ష రాక్షస పిశాచ పన్నగ గంధర్వరూపంబు లుద్భవిల్లి యసురుల నెల్ల విగతాసులం జేసిన. 85

క. వంచనయును మాయయు మా
యించి పరాక్రాంతి, నయ్యమేశాస్త్రమునం
గ్రంచఱ నంతకుపురి కే
గించితిఁ బౌలోమకాలకేయాసురులన్. 86

వ. ఇట్లు హిరణ్యపుర నివాసులం గృతాంతపుర నివాసులం జేసి వచ్చి, వాసవునకు మ్రొక్కిన వాసవుండును నివాత కవచ పౌలోమ కాలకేయులవధ ప్రపంచంబు మాతలివలన విని సంతోసిల్లి నా కిట్లనియె.

చ. "సురలకుఁ బ్రీతి సేసితి; వసుంధర కేఁగుమ; నిన్ను నీసహో
దరులు నిరంతరంబును ముదంబునఁ జూడఁగఁ గోరు చున్న వా
రరిమదభేది! నీకు విషమాజిముఖంబున మార్కొనంగ నో
పరు నరు లెవ్వరున్; హరి నిభంబులు మార్కొనునయ్య యెయ్యెడన్.

క. ద్రోణ ద్రోణజ కృప గీ
ర్వాణనదీ జాంగపతు లవశ్యమును భవ
ద్బాణహతిఁ జేసి సమర
క్షోణిఁ బరిక్షీణబలు లగుదు రపజితు లై." 89

క. అనిన నమరేంద్రు వీడ్కొని
చనుదెంచితి" నని కిరీటి శతముఖు లోకం
బునఁ దనచేసిన విధ మ
త్యనఘుం డేర్పడఁగం జెప్పె నందఱు వినఁగన్. 90

వ. ధర్మరాజును దమ్ముఁడు సేసిన మహాపరాక్రమంబునకుఁ జతురంభోధి పర్యంతమహీ రాజ్యం బప్పుడ తనకు సంప్రాప్తం బై నంతియ సంతోసిల్లి.

ఆ. దివ్యబాణములు, తదీయప్రయోగముల్
మాకుఁ జూపు మనిన మఘవసుతుఁడు
వేఱువేఱ చూపె వేలుపు లిచ్చిన
యస్త్రశస్త్రములు నిజాగ్రజునకు. 92

వ. మఱియును. 93

చ. సురవిశిఖప్రయోగములు సూపఁ దొడంగిన నేల దిర్దిరం
దిరిగెఁ, బయోనిధుల్ గలఁగె, దిగ్గజముల్ మద మేది కుందె, భా
స్కరరుచి మాసెఁ, బావకశిఖాతతితోన యడంగె గాడ్పు, లం
బరమున నిల్చి రీశ్వరుఁడు బ్రహ్మయు నాదిగ వేల్పు లందఱున్.

వ. అంత సురగణచోదితుండై నారదుం డర్జునుపాలికి వచ్చి యిట్లనియె.

తే. "ఎదురు లేక దివ్యాస్త్రంబు లిట్లు నీకుఁ
బాడియే ప్రయోగింపంగఁ బాండుపుత్ర!
సిద్ధ మివి యధిష్ఠానవర్జితములయ్యె
నేని మూఁడులోకములు దహించు నొగిని". 96

వ. అని యర్జును వారించి నారదుం డరిగిన సమరు లెల్ల నిజస్థానంబుల
కరిగి; రిట్లు పాండవులు పదిమాసంబు లుండునంత నొక్కనాఁ డమర
కన్యకలు వచ్చి యర్జునున కిట్లనిరి. 97

తే. "వనములందును బండ్రెండు వత్సరమ్ము
లలయ కజ్ఞాతచర్య యేకాబ్దకంబు
పూని నిర్విఘ్నవృత్తిఁ జల్వొదురు మీరు
పగటి నిర్జింతు రాహవాభ్యంతరమున. 98

తే. నీ పరాక్రమ బలమున నిఖిలధరణి
రాజ్యభారంబు నీ ధర్మరాజు పూను;
రఘుకులాధీశ్వరుండైన రామకీర్తి
యట్ల నీకీర్తి త్రిజగంబులందుఁ బర్వు." 99

వ, అని యాదేశించి దేవకన్యకలు వోయిన నిట దేవర్షి యైన రోమ
శుండు ధర్మరాజునకు ధర్మానుశాసనంబు సేసి దివంబున కరిగె;

నంతఁ బాండవు లెప్పటియట్ల ఘటోత్కచసేనానీతులై క్రమ్మఱి వృషపర్వనివాసంబు సూచుచు, బదరీవనంబున నొక్కరాత్రి వసియించి, సుబాహుపురంబునకు వచ్చి, యందుఁ దమ పరిచారకులైన యింద్రసేనప్రముఖులం గూడికొని, నిజరథారూఢులై ఘటోత్కచుంబోవం బనిచి, హిమవత్పర్వతంబునందు దేవర్షి బ్రహ్మర్షి యజ్ఞప్రదేశంబుల నసేకవిధయూపంబులు సూచుచు నొక్కవర్షం బుండి; రంత నొక్కనాఁడు 100

—: అజగరోపాఖ్యానము :—

క. మృగయార్థ మరిగి హిమవ
న్నగభూములయందుఁ బవననందనుఁ డొక వ
న్నగుచేతఁ బట్టువడి యి
మ్ముగ ధర్మతనూజచేత మోక్షితుఁ డయ్యెన్. 101

వ. అనిన విని జనమేజయుండు వైశంపాయనున కిట్లనియె. 102

మధ్యాక్కర. పదివేలగజములబలము గలవాఁడు, పౌలస్త్యతోడఁ
గదనంబుఁ జేసి యనేక యక్షరాక్షసుల నిర్జించి
యుదితశౌర్యోన్నతుం డైనవాఁడు, వృకోదరుఁ డేల
పడపడి నిగృహీతుఁ డయ్యెఁ దా నొక్కపన్నగుచేత ?

వ. అనిన విని వైశంపాయనుం డిట్లని చెప్పె; నట్లు భీముం డొక్కండ హిమవదుత్తుంగ శృంగోపాంతకాంతారంబుల మృగయాభ్రాంతిఁ బరిభ్రమించుచు నతిశ్రాంతుం డయి తత్ప్రదేశంబున. 104

మ. అశనాశావిపృతాస్యగహ్వరుఁ గృతాంతాకారు, నిశ్వాసధూ
మశిఖాధూసరితోగ్రదుర్గతరుగుల్మవ్రాతు, హారిద్రవ
ర్ణశరీరున్, భృశరూక్షదర్శను మహానాగప్రభుం గాంచె న
ర్ధశశాంకద్యుతిహాసిదారుణచతుర్దంష్ట్రిన్, జగత్త్రాసకున్. 105

వ. అమ్మహోజగరం బామిషార్థి యై భీముం బట్టికొని, వాని భుజయుగళంబుఁ దన ముఖంబున, నంగంబులు నిజాంగంబున బంధించిన నాగాయుతబలుం డయ్యును దదంగసంగంబున దుర్బలుం డయి, మెలంగనేరక భీముం డప్పాము బలవీర్యంబులకు విస్మితుం డయి, "యిది

ప్రకృతిసర్పంబుగా; దెద్దేనియు నొక్క యద్భుతరూపం'' బని విచారించుచు దాని కిట్లనియె. 106

మత్తకోకిలము. "ఏను భీముఁడఁ, బాండవేయుఁడ, నిద్ధతేజుఁడ, ధర్మరా
జానుజుండఁ, బిశాచపన్నగ యక్షరాక్షసవీరులం
బూని పోరుల నోర్వ నోపెడు భూరివీరుఁడ నాగ పం
చాననాదులఁ బట్టి ప్రచ్చు ననంతబాహుబలాఢ్యుఁడఁ.

ఆ. ఇట్టి నన్నుఁ బట్టి యిప్పాట బంధించు
నట్టి శక్తి యెట్టు లయ్యె నీకు ?
నిది నిసర్గశక్తి యే? వరదానసం
సిద్ధి నైనయదియె ? చెప్పు " మనిన. 108

వ. అదియును దిర్యగ్జాతి యయ్యును దన పూర్వస్మృతి సెడ కుండ
వరంబుఁ గాంచుటంజేసి వాని కిట్లనియె. 109

క. ''ఇది నా వరలాభంబున
నుదయించిన శక్తి; యెట్టి యన్నతబలసం
పదు లయిన జీవులును నా
యెదురను బలహీను లగుదు రివ్విపినమునన్. 110

ఆ. ఎదురఁ బడినఁ దాఁకి వదలక శార్దూల
శరభసామజాదిసత్త్వతతులఁ
బట్టి తినుచు నున్న యట్టి నా కిప్పుడు
భక్ష్య మైతి వీవు పాండుపుత్ర ! 111

ఆ. శక్రపదవిఁ బొంది, సద్బ్రాహ్మణుల కవ
మాన మేను జేసి, మదము పేర్మి
ననఘ ! యిట్టు లైతి నం దొక్కమునివరు
శాపశక్తిఁ దొంటిశక్తి దఱిఁగి." 112

వ. అని దుఃఖించిన యజగరంబునకు భీముం డిట్లనియె. 113

క. "కడుకొని కడుదుఃఖములై
నెడ నుచితమై యాత్మనింద ? యెయ్యెడల మనం

బడలక యేకాకృతి నె
ప్పుడు నుండుట సూనె వురుషు పురుషార్థ మిలన్. 114

—: ధర్మరాజు భీమసేనుని వెదకఁబోవుట :—

వ. కావున పురుషకారంబునంజేసి దైవంబు నివర్తింప నెవ్వ రోపుదు? రేను మహాబలుండ నయ్యును భవద్గృహీతుండ నై యిట్టి యవస్థం బొందితి; నాత్మత్యాగం బునకు వగవ; సపహృతరాజ్యానభోగులై మద్భ్రాతృవరులు దుర్గమంబైన యిప్పర్వతంబునం గ్రుమ్మరు చున్న వారు; నన్నుఁ గానక యెంతదుఃఖింతురో యని వగచెద" ననుచున్నంత నట ధర్మతనయుండు దీప్తం బైన శివారుతంబు విని, యతిశంకితచిత్తుండయి, యనంతరంబ తన దక్షిణభుజాస్పందనం బుపలక్షించి, మీఁద లగ్గగు నంచు ననుజమధ్యంబున ననిలజుం గానక యర్జునుం గవలను గృష్ణారక్షణార్థంబుగా నియోగించి, ధౌమ్య పురోగమభూసురవరులతో భీము రోయుచుం దదీయపాదతల లలిత హాలకులిశ కలశాదిలక్షణలక్షితంబైన పాంసుపథంబునం జని ముందట.

క. గిరిశిఖరాభోగబృహ
త్తరభుజగశరీరవేష్టితశరీరుండై
భరమునఁ గదలఁగ నేరక
పరమశ్రమ మడర నున్న పవనజుఁ గనియెన్. 116

క. కని యాత్మగతంబున "ని
య్యనిలజుఁ డొక పాముచేత నదె వేష్టితుఁడై
తన లావు దటీఁగి ప్రాకృత
జనక్రియ నిట్లున్న వాఁడు సామాన్యముగఁ. 117

వ. ఇది యేమి యాశ్చర్యంబొక్కొ" యనుచు ననిలజుం జూచి దుఃఖితుం డై ధర్మజుం డయ్య జగరంబున కిట్లనియె "నయ్యా! నీవు సర్పరూపంబుఁ దాల్చిన దైత్యుండవో! దేవతవో! యేను యుధిష్ఠిరుండ; నిన్నడిగెద; నిమ్మహాభుజు నాయనుజు నా మిషార్థివై పట్టితేని నీకు బుభుక్షానివృత్తి యగునట్లుగాఁ జానినంత మృగమాంసంబుఁ బెట్టెద; వీని విడువు" మనిన ధర్మజునకు నయ్యజగరం బిట్లనియె. 118

సీ. "వినవయ్య! నహుషుఁ డన్ జనపతి నేను; మీ
పూర్వజులకు నట పూర్వజుండ;
ననఘ! సుత్రామున కెన యగువాఁడ; నై
శ్వర్యగర్వంబున నార్యవృత్తి
విడిచి, వివేకంబు నెడి, సహస్రోత్తమ
బ్రాహ్మణకృత మైన బ్రహ్మరథము
నెక్కి బ్రాహ్మణులకు నక్కజం బగు నవ
మానంబు నేసినదాన నాకుఁ

ఆ. గలశభవుఁ డగస్త్యుఁ డలిగి యత్యుగ్రాహి
వగు మటంచు శాప మప్పుడిచ్చె;
మునివరేణ్యు శాపమునఁ జేసి యిప్పాట
నవయుచున్న వాఁడనాఁటఁగోలె. 119

వ. విధివిలసితంబు పేర్మి నీ కే మని చెప్పుదు? 120

చ. చదివితి నెల్ల వేదములు, సద్విధిఁ జేసితి నూఱుయజ్ఞముల్,
విదితముగా సురేంద్రపదవీస్థితిఁ బొందితి, దుర్మదంబునం
దుదిఁ బెనుఁబామ నై యధికదుఃఖితుఁ డైతి; సుఖంబు దుఃఖముల్
వదలక చేయుచోట బలవద్విధి కేమిభరంబు సెప్పుమా? 121

వ. అయ్యగస్త్యచేత నిట్లు శాపగ్రస్తుండనై శక్రాసనంబువలనం బాసి యిట వచ్చుచు నుండి "మునీంద్రా! నాకుఁ బూర్వస్మృతి నెడకుండను బలవంతంబులైన సత్త్వంబులు నన్ను ముట్టుచో బలహీనంబులై భక్ష్యబులుంగాను, శాపవిమోక్షంబున కుపాయంబును బ్రసాదింపు" మని కృతాంజలి నై యున్న నాకుం గరుణించి మునివరుండు నా వేఁడిన వరంబు లిచ్చి యి ట్లనియె. 122

క. "క్రమమున నీయడిగిన ప్ర
శ్నములకుఁ బ్రత్యుత్తరంబు సన్మతి నత్యు
త్తముఁ డెవ్వఁ డిచ్చు, నతని క
తమునను శాపాంత మగు బుధస్తుత! నీకున్. 124

వ. అది దీర్ఘ కాలంబునకుం గాని కా " దనియె; నేనును దద్వచనం బిచ్చ నమ్మి పెద్ద కాలం బియ్యడవి నున్న వాఁడఁ; నేఁడు నీ తమ్ముఁడు దుష్టకాలప్రాప్తుం డైన నాకు భక్ష్యంబయ్యె; నోపుదేని నా ప్రశ్నములకు, ప్రత్యుత్తరం బిచ్చి వీని విడిపించుకో" మ్మనిన ధర్మ జుం డి ట్లనియె. 124

క. "నీ యడిగిన యర్థాభి
ప్రాయములకు నుత్తరంబు పరువడిఁ జెప్పఁ
ధీయుత! బ్రాహ్మణులకుఁ గా
కాయతమతు లయ్యు నొరుల రవి విషయములే ? 125

—: ధర్మరాజు నహుషప్రశ్నంబులకుఁ బ్రత్యుత్తరంబు లిచ్చుట :—

వ. అయినను నా నేర్చువిధంబునం జెప్పెద నడుగు" మనిన నజగరం బి ట్లనియె. 126

ఆ. "ఘనుఁడ! యేగుణములు గలవాఁడు బ్రాహ్మణుం?
డతని కెఱుఁగఁదగినయటి వసు
వెద్ది? దీని నాకు నెఱిఁగింపు" మనిన ని
ట్లనియుఁ జెప్పెఁ బాండవాగ్రజుండు 127

సీ. "సత్య మమా దమ శౌచ దయా తపో
దానశీలంబు లెందేనిఁ గాన
నగు, నట్టివాఁడు బ్రాహ్మణుఁడు; సుఖంబు దుఃఖంబునై నెడ వివేకంబు నొంద
కునికియ వానికి నుత్తమం బగు విద్య;"
యనిన నీ చెప్పిన గుణము లివియు
క్రియ శూద్రునందఁ గల్గిన నతం డుత్తమ
ద్విజుఁడు గా నేర్చునే? నిజము విడిచి

ఆ. నట్టులయిన బ్రాహ్మణాదివర్ణవిభాగ
మెట్లు గలుగునయ్య; హీను లధికు
లను వివేక మది యపార్థకం బగుఁ గాదె?"
యనిన ననియె నంతకాత్మజుండు. 128

వ. "ప్రమాదంబున వర్ణసంకరం బయినప్పుడు వర్ణపరీక్షార్థంబుగా బ్రాహ్మణాదులకు వృత్తంబు వేఱువేఱ స్వాయంభవుం డైన మనువు సెప్పె; సత్యాదిగుణంబులు శూద్రునందుఁ గలిగెనేని వాఁడు సచ్ఛూద్రుం డగుఁగాక బ్రాహ్మణుండు గా నేర్చునే? యవియు బ్రాహ్మణునందు లేనివాఁడు శూద్రుండ యనంబడుం; గావున వృత్తంబుల యుత్తమంబులు. 129

తే. విత్తహీనుండు వెండియు వివిధవిధుల
విత్తవంతుండు గా నేర్చు; వృత్తహీనుఁ
డైనవాఁడు విహీనుండ యండ్రు; గాన
విత్తరహకుఁ గడుమేలు వృత్తరహకు. 130

వ. అనిన నజగరం బిట్లనియె. 131

తే. "అప్రియం బొగిఁ జేసియు, ననృతవాది
యయ్యు, హింస గావింపని యమ్మహాత్ముఁ
డేఁగు సుగతికినం; ద్రది యెట్లు? సెప్పు
మయ్య యనఘ! యహింస మేలైన తెఱఁగు." 132

వ. అనిన ధర్మతనయుం డిట్లనియె; "దానంబును, బ్రియంబు చేఁత యును, సత్యంబును, నహింసయు ననునివి నాలుగును సమానంబుల; యయినను నహింసయ విశేషం; బెట్లనిన దేవ మనుష్య తిర్యగ్యోను లనియెడు మూఁడుగతులయందును మనుష్యుండు దానాది గుణం బులు గలిగి యహింసాపరుం డయిననాఁడు దేవగతి వడయు; విప రీత వర్తనుం డయి తిర్యగ్యోనులం బొందు" నని యిట్లు తన చేసిన ప్రశ్నంబులకుఁ బ్రత్యుత్తరంబులు వలికిన ధర్మనందనుఁడు ప్రీతుం డయి, భీమసేనుని విడిచి శాపవిముక్తుం డయి, దివ్యరూపంబు నేకొని యున్న సహుషువలన నధ్యాత్మ విద్యా రహస్యంబు నిమ్ముగా నెఱింగి, యుధిష్ఠిరుండు వృకోదరుం దోడ్కొని నిజాశ్రమం బునకు వచ్చి యున్నంత. 133

క. ఖరకిరణతాపమున, నురు
తరదవదాహమున శోషితము లైన వనాం

తరతరుతతి కాప్యాయన
కరమై వర్షాగమంబు గడు బెడఁ గయ్యెన్. 134

క. నాలుఁగు కెలఁకుల నవఘన
జాలంబులు వ్రేలి కురిసె ఝుంఝూనిలవే
గాలోలము లై బహుల
స్థూలపయోధార లోలిఁ దుమలంబులుగాఁ. 135

క. ఘనతరనైశతమం బొకొ
యనఁగ ఘనాగమతమిస్ర మవిరలమై క
ప్పిన జనులకు వస్తువిభా
వన మొక్కొక్కయెడలఁ గలిగె వైద్యుతరుచులఁ. 136

చ. ఆరుదగు తత్పయోదసమయంబున నొక్కట విస్తరిల్లె నం
బరమున నంబుదధ్వనియుఁ, బల్వలభూముల భూరివర్ధరో
త్కరరవముల్, మహీరుహశిఖండములందు శిఖండితాండవాం
తరమదమంజులస్వనము దారతరంబగుచుఁ వనంబునఁ. 137

చ. దళితనవీనకందళకదంబకదంబక కేతకీరజో
మిళిత సుగంధబంధురసమీరణుఁ డఁ సఖుఁ డూఁచుచుండఁగా
నులియుచుఁ బుప్పు గుత్తులను నయ్యెల లొప్పుగ నెక్కి యూఁగెను
ల్లలదళినీకులంబు మృదులధ్వనిగీతము విస్తరించుచుఁ. 138

క. సురచాపచిత్రగగన
స్ఫురణం బురుణించునట్లు భూవనిత నిరం
తరచిత్రిత మై యొప్పెను
సురుచిరనవతృణశితీంద్ర సురగోపములఁ, 139

వ. తత్సమయానంతరంబున. 140

ఉ. భూసతికిం దివంబునకుఁ బొ లెసఁగంగ శరత్సమాగమం
బాసకలప్రమోదకర మై విలసిల్లె మహర్షిమండలో
పాసితరాజహంసగతిభాసి ప్రసన్నసరస్వతీక మ
జ్జాసనళోభితం బగుచు నబ్జజుయానముతో సమాన మై. 141

ఉ. శారదరాత్రు లుజ్జ్వలలసత్తరతారకహారపంక్తులం
జారుతరంబు లయ్యె, వికసన్నవకైరవగంధబంధురో
చారసమీరసౌరభము దాల్చి, సుధాంశువికీర్యమాణక
ర్పూరపరాగపాండురుచిపూరములం బరిపూరితంబులై. 142

ననన్నయభట్టకవిత్వము సంపూర్ణము

—: ఇక్కడ నుండి యెఱ్ఱాప్రెగడ కవిత్వము :—

చ. స్ఫురదరుణాంశు రాగరుచిఁ బొంపిరివోయి నిరస్తనీరదా
వరణము లై, దళత్కమలవైభవజృంభణ ముల్లసిల్ల, ను
ద్ధురతరహంససారసమధువ్రతనిస్వనముల్ సెలంగఁగాఁ
గరము వెలింగె వాసరముఖంబులు శారదవేళఁ జూడఁగన్. 143

శా. దానాంభఃపటలంబునం బృథుపయోధారావలిం దాల్చి, గ
ర్జానిర్ఘోషము బృంహితచ్ఛలనఁ బ్రచ్ఛాదించి, ప్రావృట్పయో
దానీకంబు శరద్భయంబున నిగూఢాకారతఁ డిగ్గె నాఁ
గా నొప్పారె మదోత్కటద్విరదసంఘంబుల్ వనాంతంబునన్. 144

క. కలనీలకంఠకోలా
హలలీలలు సెందె రాజహంసకులంబుఁ;
విలసించె సప్తపర్ణా
వలి; విగళితకుసుమకుటజవాటికలడరెన్. 145

మ. అతిగాంభీర్యవిభూతి నేకచుళుకాహంకారనిశ్శేషశో
షితపాథోధిపయస్కుఁ డైనముని దోఁచెం బుణ్యతేజోమయా
కృతి నయ్యాశ్యదిగంతవీథిఁ బ్రకట క్రీడాకళాగర్వగ
ర్జితమండూకకళంకితాంబుకుచితాసిద్ధప్రదాచార్యుఁ డై. 146

తే. విశదశారదాంబుదపరివేష్టనమునఁ
బొలుచు గగనంబు ప్రతిబింబమో యనంగ
వికచకాశవనీపరివేష్టనమున
నతిశయిల్లె నిర్మలకమలాకరములు. 147

వ, అట్టి శారదాగమంబున నుత్ఫుల్లకమలకల్హారకేసరకరాళకలితకల్లోల
మాలినియు, ననేక మునిలోకసతతసంసేవ్యమాన విపులపులినోత్సం

గయు, నిరంతర తీర వానీరవన మండలీవిలసితయు, నాకాశసంకాశ విశదసలిలయు నైన సరస్వతీ మహానది ననుదినస్నానపానాదివిశేషంబు లం బరితోషంబు నొందుచుఁ బాండునందను లమ్మరుభూమిం గొన్నిదినం బులు వసియించి, తదనంతరంబ ధౌమ్యాదిభూసురవరులు, నింద్ర సేనాదిమూలభృత్యులుఁ దోడ నరుగుదేరఁ గామ్యకవనంబునకు వచ్చి, యచ్చటి మునులచేత నభినందితు లై, యందు సముచితవర్తనంబుల నుండునంత నొక్కనాఁడు. 148

క. వాసవనందనసఖుఁ డగు
భూసురుఁ డొకఁ డరుగుదెంచి భూవినుతగుణో
ద్భాసితు ధర్మజు విప్రస
భాసీనుం గాంచి యిట్టు లనియెం బ్రీతిన్. 149

చ. "జనవర! నీవుఁ దమ్ములును సమ్మద మొప్పఁగ నివ్వనంబునం
దునికి ధృతివంబుగా విని మహోజ్జ్వలతేజుఁడు, దేవకీసుతుం,
డనఘుఁడు మిమ్ము జూచుటకు నై యిదె వచ్చుచు నున్నవాఁడు; మీ
కును ననిశంబుఁ దా హితమ కోరుచు నుండు నతండు నెయ్యుఁ డై.

వ. మఱియు ననేక యుగసహస్రజీవియు, నప్రమేయతపఃప్రభాసియు, వినుత విధేయుండు నగు మార్కండేయుండును భవదీయదర్శనార్థం బీక్షణంబ చనుదెంచు" నని చెప్పిన యనంతర ముహూర్తంబున. 151

—: శ్రీకృష్ణుఁడు సత్యభామతోడఁ బాండవులయొద్దకు వచ్చుట :—

సీ. శైబ్యస్రగ్వీవాదిజవనాశ్వయుక్తమై
యాబద్ధనూత్న రత్నాంశుపటల
భాసితంబై, చారుపతగపతాకావి
భూషితగగన మై పొలుపు మిగులు
దివ్యరథంబున దేవకీసుతుఁడు ప్రి
యంబున సత్యభామాన్వితముగఁ
దరళసౌదామినీదామసముజ్జ్వల
ధారాధరోత్సంగతలమునందు

ఆ. శశియుఁ దాను వెలుఁగు శతమన్యుఁడునుబోలె
నరుగుదెంచె ఘనరథాంగ నేమి
విపులఘోషతాండవితబర్హిశబ్ద
భ్రాయమానవనవిభాగుఁ డగుచు. 152

వ. ఇట్లు వచ్చి వాసుదేవుండు రథావతరణంబు సేసి ధర్మనందనుకభివం
దనం బాచరించి, భీమార్జుననకులసహదేవులం గౌఁగిలించుకొని,
ద్రౌపదిం గారవించి, ధౌమ్యాది మహీసురులచేత నభినందితుం
డయ్యె; నంతఁ గొంతేయాగ్రజుండు గదాగ్రజునకు నర్ఘ్యాది సత్కా
రంబులు నిర్వర్తించి, తమ్ములుం దానును విప్రజనంబులు నతనిం
బరివేష్టించి యుండె; నప్పుడు కృష్ణుండు ధనంజయుం దన చేరువ
నునిచికొని చిర కాల దర్శనోల్లాసితంబు లైన యాలోకనంబుల
నతని యాకారం బత్యాదరంబున నభినందించుచు ధర్మరాజున కి
ట్లనియె. 153

సీ. "భాగ్యంబు గాదె యీ పార్థుండు హరుఁ డాది
యైన నిర్జరసమూహంబువలన
నెఱమిఁ గృతాస్త్రుఁ డై యే తెంచు టరయంగ;
ధన్యుండ వై తీవు ధర్మతనయ!
నీ ధర్మనిష్ఠయు నీతపంబును జూవె
యింతకుఁ గారణం బిద్ధచరిత!
రాజ్యంబుకంటెను రాజేంద్ర! ధర్మంబ
యిష్ట మై యుండు నీ కెల్లనాఁడు;

తే. వేదవేదాంగవిదుఁడవు, వివిధయజ్ఞ
కర్త వైతి, ధనుర్వేదకర్మఠుఁడవు;
ధరణి యెల్ల నేలెడి రాజధర్మ మమర
సులభ మయ్యె నీ కిహపరశోభనములు. 154

చ. దమమును, సత్యయుక్తియును, ధైర్యనిరూఢియు, నిత్యతృప్తియున్
శమమును నీకు నైజములు; సన్మతి నర్థవశంబుఁ, గామలో
భములును బొంద; వట్లగుటఁ బార్థివకుంజర! ధర్మరాజనా
మమునఁ ద్రిలోకపూజ్యమహిమం బొగ డొందెద వెల్లకాలమున్.

వ. అని పలికి వెండియు. 156

శా. ద్యూతవ్యాజమునఁ సభాంగణములో దుర్యోధనుం డట్లు దు
ర్నీతిం గూరి యొనర్చినట్టి యఘముల్ నిష్కంపతై రోయ్నతిఁ
జేతఃస్ఫారుఁడ వైన నీ కొకనికిం జెల్లెఁ సహింపంగ; వి
ఖ్యాతక్షాంతులు లేరె ధార్మికులు! నిక్కం బిట్టి రే యెవ్వరుఁ? 157

ఉ. ఉల్లము సత్త్వసంశ్రయము నొందినవాఁడవు; వీవు విక్రమం
బొల్లమిఁ గౌరవాధముల యుద్ధతి యమ్మొయిఁ జెల్లెఁగాక; యెం
డెల్లను నేల? నీదుమది నించుక కిన్క జనించినఁ మహీ
వల్లభ; యప్డ రూ పఱుదె? వారక వైరికులంబు సర్వముఁ. 158

చ. వినుతభవ న్నియోగ మను వేల యలంఘ్యము గాన యిమ్మొయిన్
ఘనభుజవీచివిభ్రమవికాసముఁ జూపక నిల్చెఁ గాక; స
జ్జననుత! చూడ నీ యనుజసాగరముల్ దటితోడ విద్విష
జ్జనలయకారు లై కడఁగి సర్వజగంబుల నాక్రమింపవే? 159

ఉ. అంధకవృష్ణిభోజకురురాన్వయభూపతు లెల్ల నీదెసన్
బాంధవసౌహృదప్రణయభక్తివిశేషము లొప్ప, నీమనో
గ్రంథి యడంగఁ జేయ నెసకంబునఁ బూనినవారు; లోభమో
హాంధులు ధార్తరాష్ట్రులు జనాధిప! మార్కొనువారె వారలఁ?

క. చతురంభోధిపరీత
క్షితితలసామ్రాజ్యలక్ష్మికిం బతివి జగ
న్నుత! నీవ; నీవు దలఁచిన
నతిదుష్కర మెందు లే దనర్గళమహిమఁ." 161

వ. అనిన సంతోసిల్లి కుంతీనందనుండు దేవకీనందనుతోడ "దేవా! యెవ్విధంబున నైన నల్పావశిష్టం బైన యివ్వనవాసంబును, నజ్ఞాత వర్తనంబును దీర్చి లోకనింద్యంబు గాని విక్రమంబునం బగఱ జయింపఁ గోరెదము; దీని నంతయు నిర్వహించు భారంబు నీ యదియ; నీ శరణంబు సొచ్చిన మాకుం బరమ శోభనంబులును సులభంబులగుట నిశ్చయంబుగాదె" యనియె; నప్పుడు కృష్ణుండు నిజసమీపంబున నున్న పాంచాలిం జూచి యిట్లనియె. 162

సీ. "నీ పుత్రు లేవురు నీరజలోచన
యదుకుమారులుఁ దారు ముదముతోడ
ననుపమస్నేహసమాహృతహృదయులై,
కరిహయారోహణ పరతఁ దగిలి
యాడుచు, వివిధశస్త్రాస్త్రప్రయోగముల్
గఱచుచు, నొం డెల్ల మఱచియున్న
వారు; ప్రద్యుమ్నుండు వారికి దివ్యాస్త్ర
జాతంబు లెల్లను బ్రీతి నొసఁగెఁ;

ఆ. దన్వి యా సుభద్ర తన పుత్రుకంబె నీ
తనయులందుఁ గూర్మిఁ దనరఁ జేయు;
నూఱడిల్లు మింక నుజ్జ్వలోన్నతులఁ బెం
పారఁ గాల మనతిదూరమయ్యె." 163

—: మార్కండేయుం డను మహాముని పాండవులయొద్దకు వచ్చుట :—

వ. అని యాశ్వాసించు సమయంబునం బరమ తపోవృద్ధుం డయిన మార్కండేయుండు ననుదెంచినం గృష్ణుండును పాండవులు నతని నెదుర్కొని యథోక్త విధులం బూజించిరి; మునీంద్రుండును వారిని బ్రత్యేకంబ కుశలంబు లడిగెఁ; దదనంతరంబ యందఱు నాసీనులై యున్న యెడఁ బాండవహితార్థి యై వనజోదరుం డమ్మునివరున కిట్లనియె. 164

ఉ. "ఏనును, పాండునందనులు, నిమ్మునిముఖ్యులు నిప్డు లోకస
మ్మానితవాక్య! నీ దయిన మంజులవాగమృత ప్రవాహమున్
వీనులదోయి నించుచును వేడుకఁ గ్రోలికొనంగ నాత్మలం
బూనెద; మున్మదీప్సితము పూర్ణము సేయఁగ నర్హ మెమ్మెయిన్. 165

వ. కావున. 166

క. దేవ నరదేవ ధరణీ
దేవచరిత్రములు, భర్తృదేవత లనగా
భూవినుత లయిన సతుల ప్ర
భావము లెఱిఁగింపు మోలిఁ బ్రస్ఫుటములుగాన్." 167

వ. అని యడుగుచున్న యెడ నారదుం డేగుదెంచిన నందఱు ప్రత్యు
ద్గతులయి ప్రణమిల్లి, యాతని యుచితపీఠంబున నునిచి, యుచిత
సత్కారంబులం బ్రీతునిం జేసిన నమ్మహాముని మార్కండేయునిం
జూచి "కృష్ణపాండవ ప్రియహితార్థంబుగాఁ బరమపుణ్యకథాకథనం
బొనరింతువు గాక" యని పలికి వారల నా మంత్రణంబు సేసి
నిజేచ్ఛం జనియెఁ; దదనంతరంబ ధర్మతనయుండు మార్కండేయున
కిట్లనియె. 168

సీ. "కడఁగి ధర్మముతోడ నడచుచు నే మిట్లు
దండడి దుఃఖంబు లొందుటయును,
నేపున నెప్పుడు పాపంబు సేయుచు
ధృతరాష్ట్రజులు సుఖోన్నతు లగుటయుఁ,
గని యీ విపర్యయమునకు నే మూహింతుఁ
బాయక నరుఁ డిపు సేయు కర్మ
మున ఫల మిందుఁ బొందునో? పరలోకంబు
నందుఁ బొందునో? యిందు నందుఁ గనునో?

ఆ. విశ్వకర్తయైన యీశ్వరుఁ గానని
పురుషుఁ గర్మఫలము పొరయ కున్నె?
యెడలితోనఁ గృతము వెడలిపోవునో? యిది
దెలియవలయు నాకు నలఘుపుణ్య! 170

వ. ఇంతయు నెఱింగింప నీవ యర్హుండ" వనినఁ బరమజ్ఞాననిధి యైన
యత్తపోనిధి యతని కిట్లనియె "దొల్లి విధాత ప్రథమకల్పంబున
నత్యంత నిర్మలంబులును ధర్మతంత్రంబులును నైన శరీరంబులు
సృజియించె; నట్లు పుట్టింపఁబడిన యామనుష్యులు మహోసత్త్వ
సంపన్నులు, సత్యవాదులు, సత్యసంకల్పులు, బ్రహ్మభూతాత్మలు,
స్వచ్ఛందజీవులు నై దేవయానంబుల విహరించుచు, ననాయాసంబున
నధికఫలసిద్ధింబొందుచు, సర్వధర్మజ్ఞులై, విగతమత్సరులై, బహు
సహస్రసంతానులై, బహుసంవత్సరాయుష్యులై వర్ధిల్లు చుండి;
రంత గాలాంతరంబునం గామక్రోధాదిగుణంబులు దమ్మిం బొందు
టయు మాయా ప్రవర్తనులై దేవతలచేత విడువంబడి యల్పాయు

పులు: నల్పబలశరీరసత్త్వులును, దరిద్రులును, నిష్ఫలారంభులును, బహురోగపీడితులును, నాస్తికులును నై యొండొరుల మెచ్చక భరితంబులు సేయుచుఁ, దిర్యగ్యోనులం బుట్టుచు, నరకాగ్నులం గ్రాఁచుచు గతాగతభ్రమణంబుల నలయం దొడంగి; రిట్లు దిరుగు చున్న సంసారచక్రంబునందు. 170

చ. మనుజులు పుణ్యపాపములు మానక యి ట్లొనరించుచుం దుదిం
దనుపు దొఱంగి పోవునెడఁ దప్పదు. నీడయవోలెఁ గర్మముల్
వెనుకన యేఁగి భూరిసుఖనిస్మృతియుం, బటుదుఃఖదైన్యముం
దనుకఁగ జేయుఁ; గ్రమ్మఱఁగఁ దాన యొనర్చు భవంబు దేహికిన్.

క. వినుమనుజున కెవ్వీధమునఁ
దనఁ చేసిన సుకృతదుష్కృతంబులు నెఱయం
దన కనుభవింపఁ బాలివి
తనుపు సెడుం గాని కర్మతతి సెడ దనఘా! 172

వ. మఱియు నొక్క నిదర్శనంబు సెప్పెద. 173

క. ఈలోకమ యగుఁ గొందఱు
కాలోకమ కొందఱకు; నిహంబును బరమున్
మే లగుఁ గొందఱ; కధిపా!
యేలోకము లేదు సూవె యిలఁ గొందఱకున్. 174

వ. అది యెట్లనిన. 175

చ. ధనములు సాలఁ గల్గి, సతతంబును నింద్రియవాంఛ.సల్పుచున్,
మనమున నెన్నఁడున్ సుకృతమార్గము పొంతకుఁ బోక, లోభమో
హనిహతబుద్ధు లై తిరుగునట్టి జనుల్ పరలోక సౌఖ్యముల్
గనుటకు నేర, రిక్కడి సుఖంబులు మేలయి తోఁచు వారికిన్. 176

మ ఉపవాస వ్రత సంతతాధ్యయన తీర్థోపాసనాదిక్రియై
కపరత్వంబునఁ జేసి యైహికము దుఃఖప్రాయమై పోవఁగా
విపులానందముఁ బొందఁ గల్గుఁదుది నావిర్భూతభోగైకలో
లుపబుద్ధిం జిరపుణ్యశీలురకు నా లోకంబునఁ భూవరా. 177

ఉ. ధర్మము సల్పుచుం, దగిలి ధర్మపథంబునఁ జేసి యర్థముం
బేర్మియుఁ గాంచి, ధర్మవిధిఁ బెండిలి యై ప్రజలఁ సృజించి, స
త్కర్మములం బ్రశస్తములుగాఁ గ్రతువుల్ వొనరించు సజ్జనుల్
ధర్మజ! యిందు నందును ముదంబునఁ గాంతు రభీష్టసౌఖ్యముల్.

ఆ. సత్యమును శమంబు శౌచంబు లేక నా
స్తిక్యమును నిషిద్ధసేవనంబు
గలిగి తిరుగు దుష్టకష్టజన శ్రేణి
పొలియు నుభయలోకములకుఁ గాక. 179

వ. ఇది మనుష్యుల కర్మగతి ప్రకారంబు. 180

చ. జననుత ! మీరు దివ్యులరు; సమ్మతి దేనహితార్థ మిమ్మహిఁ
జననము నొందినారలు; ప్రశస్తపరాక్రమలీలఁ బేర్చి, యిం
క నఖిలశత్రునిర్మథనకర్మ మొనర్చి, మహీభరంబు దీ
ర్చి, నియతిఁ బెక్కుజన్నములు సేసి, భజింతురు దేవభావమఁ.

—: మార్కండేయుఁడు ధర్మజునకు బ్రాహ్మణప్రభావంబు సెప్పుట :—

వ. అనిన విని ధర్మనందనుండు "బ్రాహ్మణప్రభావంబు వినవలతుం
జెప్పవే" యనిన మార్కండేయుం డిట్లని చెప్పెఁ "దొల్లి హైహయ
వంశోద్భవుం డైన ధుంధుమారుండను పేరి రాజకుమారుండు మృగ
యాసక్తుండై వనంబునఁ గ్రుమ్మరువాఁ డొక్కచెడం దృణల
తాగుల్మ మధ్యంబునం గృష్ణాజినోత్తరీయుం డయి యున్నవాని,
నొకవిప్రు దవ్వులం గని మృగం బను బుద్ధిఁజేసి బాణం బేసి డాయం
జని నిశ్చేతనుం డయిన యతనిం జూచి యత్యంతదుఃఖితుం డయి,
పురంబునకుంబోయి, నిజవంశవృద్ధు లైన హైహయుల కంత వృత్తాం
తంబునుం జెప్పి, వారిం దోడ్కొని వచ్చి యవ్విప్రక శేబరంబు సూపిన.

తే. వార లందఱు వందురి వగచి, యచటి
కతిసమీపంబునను రార్ష్యుఁ డను మునీంద్రు
నాశ్రమం బున్న నయ్యెడ కరిగి, కనిరి
దేవ ముని సిద్ధలోకప్రతీక్ష్యుఁ రార్ష్యు. 183

క. కని భక్తి మ్రొక్కుటయు న
యన్యఘుఁడు దీవించి వారి కర్ఘ్యమ్మగు పూ
జనము లొనరింపఁ బంచెం
దన శిష్యులఁ బరమ సంయితవ్రతుఁడు కదయన్. 184

వ. హైహయులు నమ్మునీంద్రునకు సాష్టాంగదండప్రణామంబులు నేసి "మహాత్మా! యిక్కుమారుండు మృగయాసక్తుం డై వచ్చి యింతకు మున్న యిన్వనంబున నొక్కబ్రాహ్మణుం, గృష్ణాజినావృతు, నతి భ్రాంతుం బాపంబునంజేసి మృగం బను బుద్ధి నేసిన నతండు మృతుం డయ్యె; నేము మహాపాతకదూషితుల మైతిమి; గావున మీచేయు సత్కారంబుల కర్హులము గా; మిప్పాపంబున కెయ్యది నిష్కృతి?" యనిన నవ్వుచుఁ దార్క్ష్యం డి ట్లనియె. 185

క. "వినుఁ డెన్నఁడు మాయాశ్రమ
మున నెవ్వారకు లేవు భూరిభయవ్యా
ధి నిరోధ మృత్యు దోషా
ద్యనేకదుఃఖపులు త్రిజగదాశ్చర్యముగన్." 186

వ. అని పలికి దన పుత్రు నధిక తపోబలసమన్వితుం జూపి. 187

క. "ఈతఁ డగునె మీబాలకు
చేత నిహతుఁ డై న వాఁడు సెప్పుఁ" డనుడు వా
రాతఁడ తమ మును చూచిన
యాతండగుటకు మహాద్భుతాత్మకు లగుచున్. 188

క. "మృతుఁ డయి క్రమ్మఱ సంజీ
వితుఁ డయ్యె నితండు; కరము విస్మయ మిది; భూ
నుత! యిట్టి మహిమ కలిమికిఁ
గత మెయ్యది? యీనతిమ్మ కారుణ్యనిధీ!" 189

వ. అని యడిగినఁ దార్క్ష్యం డి ట్లనియె. 190

శా. ఆలస్యం బొకయింత లేదు; శుచి యాహారంబు; నిత్యక్రియా
జాలం బేమఱ; మర్చనీయు లతిథుల్; సత్యంబ పల్కంబడున్;

మేలొ శాంతియు బ్రహ్మచర్యమును నెమ్మిం దాల్తు; మిక్కొట నె
క్కాలంబుం బటు మృత్యురోగభయశంకం బొంద మే మెప్పుడున్.

వ. ఇది యస్మదీయప్రభావంబు; మీకుఁ బాతకభయంబు వలవ; దరుగుం"
డనినం దార్క్ష్యని వీడ్కొని హైహయులు నిజనివాసంబులకుం జనిరి;
భరతవంశోత్తమ! యిట్టిదియ బ్రాహ్మణప్రభావం" బని మజీయు
మార్కండేయుఁడు " బ్రహ్మకుత్తర్షిస్వరూపనిదర్శనం బయిన.యితి
హాసం బొక్కటి సెప్పెద వినుఁ" మని ధర్మరాజున కిట్లనియె. 192

చ. "వినుతచరిత్రుఁ డత్రి యను విప్రవరుండు తపం బొనర్పఁ గా
ననమున కేగుచుండి తన నాతిఁ గనుంగొని యిట్లనుం 'దపం
బున కిదె యేను బూని వనభూమికిఁ బోవుచు నున్న వాఁడ, నో
వనరుహనేత్ర! నీవు నట నచ్చెదొ? పుత్రులయొద్ద నుండెదో?' 193

వ. అనుటయు భార్య యిట్లనియె "నక్కట! పుత్రులకుం గుటుంబ భా
వన యగుప్పత్తి యెల్లను ధర్మవంబుగఁ జేయక, యాశ్రమాంతరం
బునకు మహాత్మ! నీకు నిటు పోవుట ధర్మ్మవు గాదు; వైన్యభూ
జనపతి యిచ్చు నర్థులకుఁ జాలఁగ నర్థము; వేఁడు కువ్విభున్!" 194

వ. అనినం గొండొక విచారించి, భార్య పలుకులు ధర్మయుక్తంబు లగు
టకు సంతోషించి, యమ్మహాద్విజుం డప్పుడ చని యశ్వమేధాధ్వర
దీక్షితుం డయి విప్రులకు నపారధనంబు లిచ్చు చున్న వైన్యుం గని
యాశీర్వాదపురస్సరంబుగా నిట్లనియె. 195

ఉ. "నీవ విధాత; విం(ద్రుఁడవు నీవ; సమస్తజనేశ్వరుండవున్
నీవ; యశేషధర్మములు నీవ యెఱుంగుదు; నిన్నుఁ బోలఁగా
నీ వసుధాతలంబున మహీశ్వరు లెవ్వరు లేరు; సన్మనీం
(ద్రావలి యెప్డు నిన్నుఁ గొనియాడుఁ బరిస్ఫుటవాక్యభంగులన్."

చ. అని పలుకంగ గౌతమమహాముని యచ్చటి నుండి యంతయున్
విని కలుషించి "యేల యిటు వీఁకున నో రఱుగంగఁ బ్రేలె? ద
జనపతియే విధాతయును శక్రుఁడు నీశుఁడు? నర్థకాంక్షి వై
మనమున శంక లేక యొకమానవు నింత నుతింప నేటికిన్?" 197

---: అత్రిగౌతముల పరస్పర సంవాదము :--

వ. అనుటయు నత్రి యిట్లనియె. 193

ఉ. "ఊరక మీఱ నాడెదవు; యుక్త మయుక్తము నాత్మ జూడఁగా
నేరవు: సర్వలోకముల నిర్మలనీతిపరాక్రమంబు లో
ప్పారఁగ నేలి ధర్మముల కన్నిటికిం గుదు వై వెలుంగు ధా
త్రీరమణుండు; మేటిగ నుతించుట వోలదె నాకు నిమ్మొయిన్". 199

వ. అని యధిక్షేపించిన గౌతముండు. 200

ఆ. "కలయ నరలు వచ్చి తల తెల్లనై నంతఁ
జేసి యెట్లు నీకుఁ జేరు నెఱుక?
జ్ఞానవృద్ధుఁ డైనవాని మాటలు గదా
సభలఁ జెల్లు నార్యజనుల కెక్కి." 201

వ. అని తొడంగి యయ్యిరువురు మహానాదంబుగా వాదంబు సేయు
చుండఁ గాశ్యపనామధేయుం డైన ముని సభాసదు లైన మునులం
జూచి "వీరలవాదు మన చేతఁ జక్కంబడ నేరదు; సకలధర్మజ్ఞుం
డయిన సనత్కుమారు నడుగుద" మనిన నాసదస్యు లందఱు సనత్కు
మారుపాలికిం జని యత్రిగౌతముల వివాదంబు తెఱం గెఱిఁగించిన
నతండు వారి కిట్లనియె. 202

ఉ. "అత్రి నిజంబ పల్కెఁ; దగు నాతనివాక్యము ధర్మయుక్త; మీ
ధాత్రి సమస్తము బృహదుదగ్రభుజాగ్రమునందుఁ దాల్చు స
క్షత్త్రియుఁ డెల్ల వారలను గావను బ్రోవఁ బ్రభుండు గావునఁ
శత్రునిషూదనుం డతఁడ శక్రుఁడు నీశ్వరుఁడుఁ విధాతయుఁ. 203

క. జనులకు నెల్లను బూజ్యుఁడు
జనపాలుం; డతని మహితశాసనమున స
జ్జనులును మునులును సద్విధిఁ
జనువారలు గాని కడవఁ జన దెవ్వరికిఁ. 204

వ. క్షత్త్రియప్రభావం బేమనవచ్చు? విరాట్టు, సమ్రాట్టు, విధిజితుండు,
సత్యమన్యుండు, యథాజీవుండు, ధర్మ్యుండు నను భవ్యనామంబుల నాగ
మంబులు పార్థివుం గొనియాడుఁ; దొల్లియధర్మంబునకు వెఱచి బ్రాహ్మ

ణులు నిజతేజోబలంబులు ఋత్త్వింబున నిక్షేపించిరి; నాఁటంగోలె బ్రాహ్మ్యంబు వలన ఋత్తంబు ప్రవర్తిల్లుచుండు; బ్రహ్మఋత్త్వింబులు పరస్పరసంశ్రయఁబులు; వెలిగా వర్తింపనేరవు; ఋత్త్వియుండు బ్రాహ్మణసంసేవనంబునం దేజోనిరూఢుం డయి యాదిత్యుండు చీఁకటి నడంచునట్లు దురితంబుల నడంచు; నట్లగుటంజేసి ఋత్త్వియుండు సర్వాధికుండగుట నిశ్చయం" బనిన నమ్మును లంగీకరించి వైన్యునకుఁ దత్పౌరోహిత్యకారం బెటింగించిన నా భూవరుం డభినందించి. 205

క. "నను నెల్ల జనులకంటెను
ఘనుఁడని కొనియాడి తీవు కడునిజముగఁ; గా
వున నిదె ప్రీతుఁడ నైతిని;
కోను మిచ్చెద నీకుఁ దనియఁ గోటిధనంబుల్." 206

క. అని యిష్టధనము లిచ్చినఁ
గొని వచ్చి, మునీశ్వరుండు కొడుకులకుఁ బ్రియం
బునఁ బంచి యిచ్చి, యిమ్మలఁ
జనియెఁ వనంబునకు ధర్మసంహితబుద్ధిఁ." 207

వ. అని చెప్పి మార్కండేయుండు పాండవేయునితో వెండియు నిట్లనుఁ "సరస్వతీ గీత యను నితిహాసం బొకటి నెవ్వెద; నందు విశిష్ట ధర్మంబు లెఱుఁగ నగుఁ; దొల్లి తార్క్ష్యుం డను మునివరుండు భారతి నారాధించి తనకు నద్దేవి ప్రత్యక్షం బగుటయు నిట్లని యడిగె. 208

క. "పురుషున కెయ్యది ధర్మువు?
పురుషుం డెద్దానఁ బరమపుణ్యాత్మకుఁ డై
చిరపుణ్యగతులు వడయును?
దిరముగ నివి యానతిమ్ము దేవి! నాకున్." 209

వ. అనిన నతనికి నప్పరమేశ్వరి యిట్లనియె.

మ. ధృతి వేదంబులు నాలుగుం జదివి, భూదేవుండు నానాధ్వర
వ్రతుఁ డై యుండెడునట్టి పుణ్యఁ డమరావాసంబునం దుండు ను
న్నతవృత్తస్తనభారమంథరమరున్నారీ పరీరంభసం
భృతరోమాంచసమంచితాంగుఁ డగుచుం బెక్కండ్లు సంప్రీతితోఁ.

సీ. మేలగు క్రేపుతోఁ బాలు సాలఁగఁ గల్గి
లాలితం బగు తొలుచూలిమొదవుఁ
బాత్రభూతుం డైన శ్రోత్రియునకు నిచ్చు
సద్గమలచరితుఁ డమ్మొదవుమేన
నెన్నిరోమము లుండు నన్ని వేలేండ్లును
సురలోకసౌఖ్యవిస్ఫురణ నొందు ;
భారంబునకుఁ జాలి భూరిసత్త్వాఢ్య మై
బిరుదైన యెద్దు భూసురున కిచ్చి
ఆ నరుఁడు ధేనుదశక మిరవొంద నిచ్చిన
ఫలము వడయు ; మంచివలువ లొసఁగి
చంద్రలోకమున కతండ్రితుఁ డై చనుఁ ;
గనక మిచ్చి నాకమునకు నరుగు. 212

క. కృతమతి యై యేడేఁడులు
హుతవహు ఘృతమునను బీతి నొందించిన సు
వ్రతుఁ డీఁడుతరంబుల
పితరులఁ గొని దివికి నేఁగుఁ బెం పెసలారన్. 213

క. సతతంబును శుచి యై దే
వతలఁ బ్రదీప్తాగ్నియందు వడలక సంత
ర్పితులుగఁ జేసి పడయు నం
చితముగ గోలోక వాసచిరసౌఖ్యంబుల్. 214

వ. అగ్నిహోత్రం బగ్నిదాత్మకం బని యెఱుంగుము ; సకలయజ్ఞంబుల
యందుఁ గల్గిం పంబడు విశిష్టద్రవ్యంబు లన్నియుఁ మదీయంబులు ;
నేను మహనీయం బైన యగ్ని హోత్రముఖంబున ననుభవింతు ;
నాత్మజ్ఞు లైన మహాత్ములకు నఖిలసంశయచ్ఛేదంబు సేయుదు ;
ననవరత స్వాధ్యాయదాన వ్రతపరాయణు లైన తపోధను లెందేని
విగతశోకులై వసియింతు రట్టిది మామకం బైన పరమపదంబు ;
వినుము ప్రచురమధుక్షీరతోయంబులును, శర్కరాసైకతంబులును,
మాంసాపూపప్రకర తీరంబులును, బాయసకర్దమంబులు నైన యేఱు

లనేకంబు లుత్పాదించి యింద్రాగ్ని ప్రభుఖు లైన దివిజులకుఁ దృప్తి
నేసి యజనశీలురు పెక్కేండ్లు మత్పదంబునం బ్రాపింతు'' రని చెప్పినఁ
దార్క్ష్యుండు కృతాంజలి యై. 215

ఉ. ''అంబ ! నవాంబుజోజ్జ్వలకరాంబుజ ! శారదచంద్ర చంద్రి కా
డంబరచారుమూర్తి ! ప్రకటస్ఫుటభూషణరత్న రోచిరా
చుంబితదిగ్వి భాగ ! శ్రుతిసూక్తవివిక్తనిజ ప్రభావ ! భా
వాంబరవీథివిశ్రుత విహారి ! ననుం గృపఁ జూడు భారతీ !'' 216

వ. అని వినుతించి కృతార్థుం డయ్యె నని చెప్పిన విని పాండు పుత్రుండు
ముకుళిత హస్తుండై 'మునీంద్రా వైవస్వతమను వెత్తెఅంగునం
బ్రభావసంపన్నుం డయ్యెం? జెప్పవే' యనిన మార్కండేయుం
డి ట్లనియె. 217

క. "విను చాక్షుషమన్వంతర
మున వైవస్వతుఁడు పరమపుణ్యుండు దపం
బొనరించె నిరాహారత
ననుపమధైర్యుండు దశసహస్రాబ్దంబుల్. 218

ఆ. అనఘుఁ డూర్ధ్వబాహుఁడై యేకపాదంబు
నందు నిలిచి బదరికాశ్రమమునఁ
జలిపె మటీయుఁ బెక్కు సంవత్సరంబులు
తపము సకలజనులు దను నుతింప. 219

—: మార్కండేయుండు ధర్మరాజునకు వైవస్వతవృత్తాంతంబును దెల్పుట :—

వ. ఆ వైవస్వతుం డొక్కనాఁడు గృతస్నానుం డయి జలాశయతీరంబున
నున్నంత నొక్క మత్స్యంబు జలంబులదరికిం జనుదెంచి యి ట్లనియె
''నయ్యా ! యేను గడు నల్పమత్స్యంబ నగుటంజేసి బలవంతంబు
లగు జలచరంబులవలన నాకుఁ దద్దయు భయంబు గలిగి యుండు;
నిమ్మడువు మహామత్స్యసంకులంబు; గావున నపాయంబు వొంద
కుండ నన్నుద్ధరించి యొండెడం బెట్టవే; యేను నీకుఁ బ్రత్యుపకా
రంబు సేయ నోపుదు" ననిన విస్మితుండై యతం డమ్మీను నెత్తి
కొనిపోయి యొక్క నూతియందు విడిచి దానిం బలుమాఱు నరసి

కొని యుండె; నదియును గ్రమంబున వర్ధిల్లి యొక్కనాఁ డమ్మును
వున కిట్లనియె. 220

ఆ. "అనఘ! నీప్రయత్నమున నా శరీరఁబు
పొదలె; నిందు నాకు మెదల నెడము
సాల; దట్లు గాన మేలుగ నొండొక
యెడకుఁ గొంచుఁ బొమ్ము కడఁగి నన్ను." 221

వ. అనిన నతం డాజలచరంబుఁ గైకొని పోయి యొక్క బావియందు
విడిచిన నది యెప్పటియట్ల యక్కజంబుగాఁ బొదలి తనకు నవ్వాపి
యందు నవకాశం బపర్యాప్తం బగుటం బెప్పి, యతనిచేత గంగమడు
వున విడువంబడి, కాలక్రమంబున నచ్చోటఁ దిరుగం బట్టు చాలకున్న
నతం డెత్తికొనిపోయి సముద్రంబునం బెట్టిన నది వాని కిట్లనియె.

క. "ఉపకారం బొనరించితి
కృపతో నీ విట్లు నాకుఁ గృతమతి వై; ప్ర
త్యుపకార మే నొసర్చెద
విపులగుణాభరణ! తెలియ విను నాపలుకుల్. 223

తే. తడవులే దింక నిఖలభూతములుఁ బ్రళయ
మొంద నున్నవి; యిప్పు డొండొండ పొంగి
కలయఁ బాఱుఁ బయోధు లుగ్రముగఁ బుణ్య
చరిత! యిదియ మన్వంతరసంధి యఁట్రు. 224

వ. కావున నీవు దృఢరజ్జుబంధనంబును, సకలధనధాన్యసహితంబును
గా నొక్క పేరోడ గావించి, సప్తమునిసహితుండవై దాని నెక్కి,
సముద్రంబు దటీయందు నన్ను దలంచునది; యేనును ఘనశృంగ
శోభితం బయిన రూపంబునఁ బొడసూపి మీకు మే లొనరించెద" నని
యమ్మత్స్యంబు సనియె; వైవస్వతుండును దదుక్తప్రకారంబున
నోడ నిర్మించి, సకలబీజంబులు సంగ్రహించి, సప్తమునిసహితంబుగాఁ
గృతారోహణుండై పయోధిఁ దటీయం దొడంగె నంత. 225

మ. మతి వైవస్వతుచేఁ దలంపబడి యమ్మత్స్యంబు దోఁతెంచె నా
యతశృంగోన్నతమూర్తి; నాతఁడుఁ దదాజ్ఞాయత్తుఁడై తచ్ఛిరో

గతశృంగాగ్రమునం దగిలెఁ నతిదీర్ఘం బైనపాళంబు; న
ద్భుతవేగంబున నోడ నీడ్చె నది యంభోరాశిమధ్యంబునన్. 226

వ. తదనంతరంబ. 227

సీ గరుసులు గడవంగఁ గదలి యల్లల్లన
యొత్తుచు నెడములఁ దరించి,
వేడుకఁ జేతులు వీచి యూఁదెడునట్లు
లోలోర్మిపంక్తులఁ గ్రాలి క్రాలి,
ప్రమదమహాసస్ఫూర్తి పచరించువిధమున
నురుఫేనరోచులఁ దెరలు గలిగి,
యురువడి వర్ధిల్లుచున్న జలంబుచేఁ
బొంగారి దెస లెల్ల ప్రింగకొనుచుఁ

ఆ. ప్రబల విలయకాల పటురయబహుళస
మీరణౌఘదుర్నివార మగుచు
నుగ్రభంగిగాఁ బయోనిధు లొక్కటఁ
బెల్లు రేఁగి జగము వెల్లి వొడిచె. 228

వ. ఇట్లు లోకం బెల్ల నేకార్ణవం బైన, నమ్మత్స్యంబు దజ్జలాంతరంబున
ననేక సహస్రహర్షంబు లయ్యోడం ద్రిప్పుచుఁ బదంపడి యప్పెనువెల్లి
యల్లనల్లఁ దగిచిపోవం దొడంగునెడం దుహినగిరిశృంగసమీపంబున
నయ్యోడ నిలిపి వారల తోడ. 229

తే. "ఈ నగంబు శృంగంబున నిపుడు మీరు
గట్టుఁ డియ్యోడ" ననిన నా ఋణమ వారు
నట్లు చేసిరి; వినుమమ్మహాద్రిశృంగ
మనఘ! నౌబంధనం బన నవనిఁ బరఁగె. 230

క. మనుసహితులైన మునులం
గనుఁగొని యమ్మీను గరము గారవమున ని
ట్లనుఁ "బ్రళయంబున కీడునఁ
బొనఁ కుండఁగ నీకు రక్ష సలిపితిఁ గరుణన్. 231

క. మునులార ! యేను విశ్వం
బునకుఁ బరమకర్త యగు ప్రభుఁడ; వాత్సల్యం
బున మత్స్యమైన రూపం
బున నిమ్మొయి నిన్ని చందములఁ జనవలసెన్. 232

వ. మీరు నిర్భయులరై చరియించునది; మటీయు నిమ్మనువును సదేవా
సురమానుషంబైన జగం బఖిలంబును సృజియించు; మత్ప్రసాదంబున
నితనికిఁ బరమజ్ఞానోదయంబగు" నని చెప్పి యయ్యాదిమత్స్యం
బదృశ్యంబయ్యె; వైవస్వతుండును మటీయు నధికతపంబు సేసి
సకలచరాచరంబుల సృజియించె. 233

క. పరమం బగు వైవస్వతు
చరితం బతిభక్తి వినినఁ జదివినను మహా
దురితంబు లడఁగు, జనులకు
నిరవుగ సిద్ధించు నఘము ! యిహపరసుఖముల్." 234

వ. అనిన నమ్మేధసీశ్వరుం డమ్మునీశ్వరునకుఁ బ్రణతుండై యి ట్లనియె.

క. "పరమేష్ఠికల్పుఁడవు, ని
ర్భరభూరితపః ప్రభావపరిపూర్ణుఁడ; వ
చ్చెరువు భవన్మాహాత్మ్యము
సురమునిలోక ప్రణామశోభితచరణా ! 236

క. అడరి నిఖిలాండకోటియుఁ
జెడునప్పుడుఁ జెడక నీవు జీవించెద ; వే
ర్పడ జగములు గ్రమ్మఱఁ గలి
గెడు నప్పుడు సూచెదవు వికృతిరహితుఁడవై. 237

చ. తొడరి చరాచరప్రతతితో జగ మింతయు వార్ధిఁ దొట్టిన
ప్పుడు లలితాబ్జపీఠమునఁ బొల్చు చతుర్ముఖుఁ బద్మగర్భుఁ బెం
పడర భజించి తీవు; జగదాదిజుఁడైన ప్రభుండు నీ యెడం
గడు ననురక్తుఁ డై యెసఁగెఁ గాదె మునీశ్వర ! యీప్రభావమున్

క. జగముల నెల్లను ద్రిమ్మరు
జగదంతకుమౌళి వామచరణం బిడఁ, బె

ల్లగు రోగజరాభరమున్
దెగ విడువఁగఁ జెల్లె నీకుఁ ద్రిభువన వినుతా!

వ. సకలచరాచరోత్పత్తి స్థితి విలయప్రకారంబులు నీకుం బెక్కు మాఱులు ప్రత్యక్షంబులయి కానంబడి యుండుఁ; గావున ని న్నడిగెద; లోకంబులు విలయకాలంబున నెట్టిభంగియగు? నెఱింగింపు" మనిన మార్కండేయుం డిట్లనియె. 240

—: మార్కండేయుండు ధర్మరాజునకుఁ బ్రళయప్రకారంబు సెప్పుట :—

సీ. "శాశ్వతు, నఖిలభూతేశ్వరు, నవ్యయు
నాదిదేవుని, జగదాదిజన్మ
నాదిమధ్యాంతనిర్భేదవిదూరు, నా
శ్చర్య కారణకర్మధుర్యు, నజరు
నీష్టసఖుఁడును నీకు ప్రెగ్గడయునై
వెలుఁగొందుచున్న యీయలఘుపుణ్యు,
లాలితదీర్ఘవిశాలసితేక్షణుం,
గనకవర్ణాంబరు, వనజనాభు,

ఆ. నింద్రనీలవర్ణు, నింద్రాదిసురగణ
వినుతుఁ గృష్ణుఁ గరము వినయ మొప్పఁ
దలఁచి యితనియాజ్ఞ దల నిడి యెఱిఁగింతు
వినుము వరుసతోడ మనుజనాథ! 241

వ. కృత త్రేతాద్వాపర కలినామంబు లయిన యుగంబులు నాలుగును బండ్రెండువేల దివ్యవర్షంబులం బర్యవసితంబు లగు; నియ్యుగంబులు నాలుగు నొక్క మహాయుగం బనం బరఁగు; మహాయుగసహస్ర పర్యంతం బైన కాలంబు బ్రహ్మకు నొక్కదినం బనంబడు; దద్దివ సావసానంబునందు శతవార్షికంబైన యనావృష్టిదోషంబు ప్రవర్తిల్లు, నప్పుడు. 242

ఆ. సప్తహాయుఁడు మూర్తి సప్తకం బొగిఁ దాల్చి
కరము వేఁడి మిగులు కరము లొప్ప
నదనదీజలములు నుదధిజలంబులుఁ,
బీల్చి జగములెల్లఁ బ్రేల్చు గడఁగి. 243

చ. దినకరతిగ్మ తేజము, ప్రదీప్తహుతాశనుఁ డయ్యుగాంతసం
జనితమహాసమీరణవశంబునఁ బేర్చి నగవ్రజంబుతో,
మనుజులతోడ, నిర్జరసమాజముతోడ, భుజంగపం క్తితో,
దనుజులతో జగత్త్రయముఁ దక్షణమాత్ర నొనర్చు నీఱుగాఁ. 244

వ. తదనంతరంబ. 245

మ. సిత పీతారుణ నీల పింగరుచు లై, స్నిగ్ధంబు లై, యుద్యతా
యతవిద్యుల్లలితంబు లై. ఘనగరీంద్రాకారఘోరంబు లై.
తతనిర్ఘాతనిపాత భీమభిదురధ్వానంబు లై సంతతో
ద్ధుతసంవర్తవలాహకంబులు వెసం దోఁతెంచు దిగ్భిత్తులన్. 246

ఉ. పెల్లునఁ గూలు తజ్జలముపెక్కువ నొక్కట నమ్మహానలం
బెల్లను నాఱిపోవుఁ; బృథివీశ్వర! యేఱులు నబ్ధులున్ వెసం
దొల్లిటియట్ల నిండుఁ; బటుతోయదసంఘము లంతఁ బోక గ
ర్జిల్లుచు వెండియుం గురియుఁ జిత్రము గాఁగ ననేకకాలముల్. 247

శా. ధారాపాతనితాంతవేగమున నిద్ధాత్రీతలం బాహతం
బై రూ పేది మునుంగుఁ దోయములలో; నత్యంతగంభీరవాఃపూరం బంతయు ముంచి మించుటయు, దిగ్భూమీనభోభాగముల్
వే రూపింపఁగ రాకయుండఁ దమముల్ వేష్టించుఁ ద్రైలోక్యమున్. 248

తే. అంతఁ బరమేష్ఠినోదిత మైన యొక్క
మారుతము నలిరేఁగి దుర్వారభంగి
విలయకాలవిశృంఖలవిపులవారి
ధరచయంబుల నెల్లను విరియఁ జేయు. 249

క. అమారుతంబు గ్రోలి పి
తామహుఁ డెంతయును ఘోరతమ మగు సలిల
స్తోమంబునందు నడుమం
దామరపై నిదురవోవుఁ దద్ధ్వని నెమ్మిన్. 250

వ. ఇట్టి కల్పాంతంబు లనేకంబులు సనియె; నింకఁ గా నున్నవి యనేకం
బులు; వినుమతీత కల్పాంతసమయంబున నేను బ్రబలాంధకారంబున
నేదెసయుం గానక యొక్కండన యత్యంతభయాతురుండ నగుచుం

బెద్దకాలంబు పరిభ్రమించుచుండ నొక్కతటీ నయ్యుదకమధ్యంబున నత్యున్నతం బయిన వటభూరుహంబు గానం బడియె; మటీయుఁ డదీయపర్ణ పర్యంకంబునందు. 251

క. కమనీయజలదవర్ణుని
హిమకరబింబాస్యు, నుద్యదినతేజు, బ్రమో
దమునఁ బవళించువానిం
గుమారు నొక్కరునిఁ గుసుమకోమలుఁ గంటిఁ. 252

వ. కని విస్మితుండ నై యాత్మగతంబున. 253

క. లోకంబులు దెగటార్చఁగ
నే కార్ణవ మైన యిచట నిబ్బాలుఁ డొకం
డేకతమున నిద్రించుచు
నేకతమున నున్న వాఁడొ? యెవ్వాఁ డగునో? 254

తే. అని తలంచుచు నల్లన యక్కుమారుఁ
జేరఁబోయిన నాతండు సీతసరోజ
రేఖ దలకొనఁగా నలరించెఁ గన్ను:
లనధరించెను ననుఁ లోచనాంచలముల. 255

వ. తదనంతరంబ గంభీరమధురస్వరంబున ని ట్లను "నయ్యా! నిన్ను నతి శ్రాంతుంగా నెటింగితిఁ; గొండొకసేపు విశ్రమింపవలతేని నవకాశం బిచ్చెద; నాశరీరంబు ప్రవేశించి సుఖంబున శయనింపు" మని తన వదనంబు వివృతంబుగాఁ జేసిన నేనును బలాత్కార నిక్షిప్తశరీరుండుబోలె బవళుండ నై తన్మార్గంబున నతని యుదరంబుఁ బ్రవేశించి యందు. 256

సీ. గంగాదినదులతోఁ, గనకశైలాది భూ
ధరములతో, సముద్రములతోడ,
వివిధ పత్తనవనద్వీపవర్షములతో,
బహుకర్మరతు లైన ప్రజలతోడఁ,

బఱిమృగవ్యాళపక్షిసంఘములతోడఁ,
దద్దయు నొప్పారుధాత్రిఁ గంటి;
సూర్యేందుతారకాజ్యోతిరుజ్జ్వల మైన
గగనంబుఁ, బవనమార్గ ములుఁ గంటి;
తే. శక్రవరుణయమాదినిర్జరసమేత
మైననాకంబు గంటి; మహాహియక్ష
రాక్షసాసురవిద్యాధరప్రముఖులఁ
గంటి; వేయేల సకలలోకములుఁ గంటి. 257

చ. అరుదుగ నమ్మహాత్ముని మహాజఠరాంతరభూమి నూఱువ
త్సరములయంతకాలము వసం బటఁ ద్రిమ్మరితిం; గడంగి య
ప్పరుసున నెందుఁ గా ల్గొనఁగఁ బట్టదు; చిత్తము భీతి మీఱఁ ద
త్పరమతి నంత నక్కపటబాలుపదంబులు సంస్మరించితిన్. 258

వ. ఇట్లు శరణ్యవరేణ్యుం డైన కారుణ్యనిధి నద్దేవుం దలంచుచుండ
నతండు నన్నుం దన వదనానిలవేగంబునం జేసి వెలువరించె; నంత
నెప్పటియ ట్లమ్మహావటపత్ర శయనుం డైన యబ్బాలు నాలోకిం
చితి; నంత.

క. ననుఁ గనుఁగొని యెలనవ్వునఁ
దనవదనము వింతచెన్ను దలకొనఁగా ని
ట్లను నబ్బాలుఁడు విశ్రమ
మొనరించితె యనఘ! యస్మదుదరములోనన్? 260

వ. అనిన నేనును సంభ్రమంబున నతనిం జేర నరిగి, కెందామరేకుల్ం
దెగడు నంగుళంబులు గలిగి తరుణకిసలయసుకుమారంబు లయిన
తచ్చరణకమలంబులు శిరంబునం జేర్చి 'దేవా! దేవరప్రసాదంబున
నత్యాశ్చర్యకరణం బైన సకలచరాచర భూతప్రపంచంబుఁ జూచితిఁ;
భవదీయమాయా ప్రభావంబు భావింపనేరకున్న వాఁడ.

శా. ఈయేకార్ణవ, పిప్పటక్షితిరుహం, బీపర్ణపర్యంక, మి
ట్లై యొప్పారుచు నుండఁగా, నుదరభాగైకప్రదేశంబునం
దీ యీరేడుజగంబులున్ మెలఁగఁ గా, నిట్టున్న బాలత్వ మే
నే యందంబున నిశ్చయించి సుఖ నై యేపారుదుం జెప్పవే. 262

క. నాదైన యాశ్రితత్వము
నీ దగు చిత్తమునఁ గల్గి నియతమయేనిఁ
సాదరఫణితుల నన్నవ
సాదితసమ్మోహుఁ గాఁ బ్రసాదింపు తగఁ. 263

—: నారాయణుఁడు మార్కండేయునకుఁ దన ప్రభావంబు సెప్పుట :—

క. అని యేను వేఁడికొనుటయు
ఘనతరకరుణారసానుకలితహృదయుఁ డై
తన దివ్యమహిమ యిట్లని
వనజాతుఁడు సెప్పె గారవంబున నాకుఁ. 264

ఆ. "అనఘ! దేవతలును మునులును నా దైన
మహిమఁ దెలియ లేరు మహితబుద్ధి:
నతులపుణ్యమతివి పితృభక్తుఁడవు గాన
యెలమి దెలియఁ జెప్పవలసె నీకు. 265

క. నారము లందురు జలముల,
నారయ నారములు నాకు నయనం బగుటన్
నారాయణుఁ డనుపేర న
పారనిరామఫణితులందుఁ బరంగుదుఁ బేర్మిఁ. 266

తే. అట్టి నారాయణాఖ్యుండ నైన నేను
శాశ్వతుండ నై ప్రభుఁడ నై సకలజగము
నోలిఁ బుట్టింతుఁ, బాలింతు, నుచితవేళ
సంహరింతుఁ జిదానందశాలి నగుచు. 267

మత్తకోకిలము:అంబుజాసనుఁ, డింద్రుఁ, డీశ్వరుఁ, డంతకుండు, ధనేశ్వరుం,
డంబుధీశుఁడు లోనుగా సుర లస్మదాకృతు; లుర్వి పా
దంబు, లగ్ని ముఖంబు, సూర్యసుధాకరుల్ నయనంబు, లీ
యంబరంబు శిరంబు గా నిటు లద్భుతాకృతి నుండుదున్.

చ. అతులితదక్షిణాన్వితమహాధ్వరసంఘము లే నొనర్చితిం;
జతురమనీషితా ప్రచురసౌఖ్యులు భూసురముఖ్య, లంచిత

వ్రతులు మహీపతుల్, సుగుణవశ్యులు వైశ్యులు భక్తి నన్ను సం
తతమును గొల్తు రీక్షితి నుదాత్తమహా క్రతుకర్మశీలు రై. 269

చ. విలయపయోధిమగ్న మగు విశ్వ మహీలవయంబు దొల్లి యే
నలఘువరాహవిగ్రహుఁడ నై వెస నెత్తితి; శేషమూర్తినై
లలితఫణాసహస్రకము లావునఁ దాల్తు నశేషధాత్రియున్
జలనిధి నిమ్నగానగ లసన్నగరీ వన మండలంబుతోన్. 270

క. బాడబదహనుఁడ నై వెస
నేడు సముద్రముల జలము లేఁ గ్రోలుదు; నీ
రేడుజగంబులు విలయముఁ
గూడునెడం దజ్జలములు గొనకొని విడుతుఁ. 271

చ. వనభుజోరుపాదముల వర్ణచతుష్టయముఁ యుగాదియం
దొదవ సృజింతు; ఋగ్యజుషసూక్తులు సామము నయ్యథర్వముఁ
విదితముగా మదీయముఖవీథుల నుద్భవ మొందు; నన్నియుం
దుదిఁ బరివర్తనక్రమవిధూతము లై నను జేరుఁ గ్రమ్మఱన్. 272

క. అనహంకృతు, లక్రోధను
లనసూయులు, సంగరహితు, లధ్యాత్మవిదుల్,
ఘనసత్త్వాత్మకులు, మహా
మునులు ననుం గొల్తు రెప్డు మోక్షాపేక్షన్. 273

తే. అఖిలపవిత్రతారాగ్రహములు, గగన
పవనదిశలును, మత్స్వరూపములు వినవె;
సకలరత్నాకరంబులు శయ్య గాఁగ
నిత్యసుఖలీలమై శయనింతు నేను. 274

క. దానము•సత్యంబు తపో
జ్ఞానాహింస లనఁ బరఁగు సాత్త్వికగుణసం
తానము, గామక్రోధా
జ్ఞానంబులు మన్మయములు సంయమియర్యా! 275

క. వినుమింకఁ బెక్కు మాటలఁ
బని యేటికి? జగమునందుఁ బ్రకటితముగఁ గ

ల్గిన యదియు నేన; లేనిది
యను నేన; సునిశ్చితముగ నూహింపు మెదన్. 276

ఉ. ఎప్పుడు ధర్మహాని యగు, నెప్పు డధర్మము మీఱుఁ, గ్రూరు లై
యెప్పుడు దైత్యు లబ్బుదురు, హీనతఁ బొందుదు రెప్డు వేల్పు, లే
నప్పుడు సత్కులీనుల గృహంబుల నుద్భవ మొంది, లీలమై
నెప్పటియట్ల నిల్పుదు సురేంద్రుల సంచితధర్మపద్ధతిన్. 277

క. సితరక్తనీలపీత
ద్యుతివిలసితరూపములఁ జతుర్యుగముల నేఁ
నతిధృతిఁ జరియించి సమం
చిత ధర్మస్థాపనంబు నేయుదు ననఘా. 278

మత్తకోకిలము. కాలచక్రము నిర్వికల్పము గాఁగ నేన నయింతు ను
న్మీలితక్రమవిక్రమైకసమృద్ధి నై; విలయ క్రియా
వేళ నిఁతయు సంహరింతుఁ బ్రవృద్ధయోగబలోల్లస
త్కాలరూపము దాల్చి దుర్వహగర్వనిర్వహబుద్ధినై.

క. నా తెఱఁ గంతయు నిప్పుడు
చేతోముద మొదవ నీకుఁ జెప్పితిఁ; ద్రిజగ
ద్ధాత యగు పితామహుఁడును
జాతుఁడుఁ నా యొడలఁ జక్క సగ బాలుసుమీ.

వ. నారాయణాభిధానుండ నైన యేను బాలరూపంబున శంఖచక్రగదా ధరుండ నై యేకార్ణవంబునందు మహాయుగసహస్రసమయం బయిన కాలంబున యోగనిద్రా పరవశుండ నై యుండుదు; నిట్టి దారుణ కల్పాంతంబు సూచి నీవు భీతుఁడ వగు నెఱింగి, నీవలని యను గ్రహంబున నాత్మ గుప్తంబు లైన సకలలోకంబులు నీకుం గనునట్టి తెఱంగుఁ గావించితి; నింక నిశ్శంక హృదయుండ వయి వలసిన యెడంజరియింపుము; మదీయనాభికమలకర్ణికాశయనుం డయియున్న చతురాననుండు మేల్కని సృజియించు లోకంబు లేర్పడం జూచెద" వని యానతిచ్చి యద్దేవుం డంతట నంతర్హితుం డయ్యె; నత్యంత విచిత్రమైన యీ వృత్తాంతం బంతయు నాకు ననుభవ గోచరం మైనయది. 281

శా. నా కమ్మైఁ బొడసూపెఁ దాను గృపతో నాఁ డందు, నేఁ డియ్యెడ
నీకున్ గాదిలి చుట్టమై సచివుఁ డై నెయ్యంబునై యున్నపు
ణ్యాకారుం గమలాయతాక్షుఁ గరుణై కాయత్తు నత్యుత్తమ
శ్లోకుం గృష్ణునిఁ గంటి; నాసుకృతముల్ శోభిల్లెఁ బక్వంబు లై. 282

క. ఈదేవదేవుఁ రుణం
. గాదే కురునాథ : నిర్వికారుఁడ నై నిఃఖేదుఁడ నై యుండుదు దే
వాదివివిధ భూతనిలయ మయ్యెడు నపుడున్. 283

తే. అనఘ యిద్దేవుసన్నిధి యగుటఁ గాదె
నాకుఁ బూర్వవర్తనకథనంబునందు
బోధ మిప్పుడు గల్గె? నిప్పణ్యుఁ బరమ
పురుషుఁ బ్రభవిష్ణుఁ గృష్ణుని శరణు సొరుము." 284

—: మార్కండేయుండు ధర్మరాజునకుఁ గలియుగ ధర్మంబులు సెప్పుట:—

వ. అనిన విని ధర్మనందనుం డనుజసహితుఁ డై కృష్ణునిం బ్రశంసా వచనంబుల నభినందించి, మార్కండేయుం జూచి "మునీంద్రా! భవత్పాదంబున నత్యద్భుత పుణ్యకథాశ్రవణపరితోషితుల మైతిమి; కలియుగంబున సకలధర్మలోపం బగునని చెప్పుదురు; తత్ప్రకారం బెటింగింపవే" యనిన నతం డతని కిట్లనియె. 285

క. "కృతయుగమునందు ధర్మ్మవు
చతురంశంబులను బరఁగఁజనుఁ; ద్రేతాది
త్రితయమున నొక్కఁ డొకఁడుగఁ
బ్రతియుగమునఁ దఱుఁగఁదొడఁగుఁ బాళులు వరుసన్. 286

వ. అట్లగుటంజేసి ధర్మంబు చరమయుగంబునఁ గరంబు దుర్లభం బయి పాదమాత్రా వశిష్టం బయి యుండుఁ; దత్ప్రవర్తనం బాకర్ణింపుము.

సీ. సత్యంబు నరులకు సంప్రాప్తమగు; సత్య
హాని నాయువు గడు నటిగి పోవు;
నాయువు దఱిఁగిన నల్పంబు లగు విద్య;
లల్పవిద్యల విమోహంబు మిగులు;

మోహంబువలనఁ బై ముసురు లోభంబు; లో
భావేశమునఁ గామ మగ్గలించుఁ;
గామంబు పెంపునఁ గడఁగుఁ గ్రోధంబు; క్రో
ధంబున వైర మెంతయును బెరుఁగు;

ఆ. వైరమున నశేషవర్ణులు ననోన్య
పీడ సేయుచును విభిన్నబుద్ధి
నొక్కఁ డొకఁడు మేర నుండక వర్ణసం
కరము సేయఁగలరు కలియుగమున. 288

క. జనియమస్వాధ్యాయ
ప్రపంచములు విడువఁ గలరు బ్రాహ్మణులు; జనా
ధిప! శూద్రులు విపులతపఃపరులు గాఁ గలరు వినవె కలికాలమునన్. 289

మ. వివిధవ్యాఘ్రమృగోరగాకులము లై, విస్తీర్ణశూన్యాటవీ
నివహాభీలము లై, యరాజకము లై, నిర్మూలధర్మంబు లై,
ద్రవిళాభీరతురుష్కబర్బరపులింద వ్యాప్తిదుష్టంబు లై
భువిలో నెల్లెడఁ బా డగున్ జనపదంబుల్ దద్యుగాంతంబునఁ. 290

క. త్రయజాతులు శూద్ర చ
రిత్రంబున, శౌర్యమును, సిరియు, దేజంబుఁ,
మైత్రియును లేక చెదరి ధ
రిత్రీశ్వర! శూన్య లై చరించెదరు దరన్. 291

క. రసగంధద్రవ్యంబులు
పస చెడు; సస్యంబు లల్పఫలము లగు; మహిం
బసిపాఁడి దఱుఁగుఁ; దరువులఁ
గుసుమఫలంబులును గరముఁ గొంచెంబు లగుఁ. 292

క. అరులు మిగులఁ గొని రాజులు
నరులకు నెంతయును భయ మొనర్తురు; ధరణీ
సురులు గడఁగి వాణిజ్యముఁ
గరిసనమును జేయఁగలరు కలికాలమునన్. 293

సీ. పాషండదర్శనబహుళంబు లై యుండు
వర్ణాశ్రమంబులు; వసుమతీశ!
తవిలి శరీరంబుఁ దద్దయుఁ బ్రోతురు
పుణ్యఫలంబులు బొంకు లనుచుఁ;
గాలంబుతోఁ గూడఁ గల్గవు వానలు
పొల్లు లై బీజముల్ వొలిసిపోవుఁ;
గ్రయవిక్రయంబులఁ గపటంబు దఱ చగుఁ;
గడఁగి యిల్లడసొమ్ము లడఁచికొండ్రు;

ఆ. సాధుచరితులైన జనులు దుర్గతుల రో
గములఁ దెగుదు రల్పకాలమునన;
పాపపరులు లగ్గుఁ బరమాయువును, నరో
గతయు. సిరియుఁ బొందఁగాంతు రెందు. 294

క. ఉఱ వగు నారికెపంటలు;
గొఱియల పాఁడియును దఱ చగుం; బురుషులకుం
దెఱవలు సుట్టము లయ్యెద;
రెఱచియ భుజియింతు రర్థి నెల్లజనంబుల్. 295

క. పితృదైవతకార్యంబుల
నితరేతరభోక్త లగుదు; రెల్ల యెడలఁ గు
త్సితదేశకాలపాత్ర
ప్రతతియ వర్తించు దైవపైత్రకవిధులన్. 296

క. హేతుప్రత్యయవాదవి
చేతసు లై, వేదనింద సేయుచును, మఖ
వ్రాతంబుల్లు ప్రతములుఁ బెడఁ
బాతురు దుర్మార్గకర్మపరు లై విప్రుల్. 297

మ. పనితా దుర్బల దీన బంధుజన సర్వస్వాపహారుల్, సుహృ
జ్జన మాతాపితృపుత్రహింతలు, యదృచ్ఛాకర్మశీలుర్, ధరఁ
జనసంపూజితు లై చరింతురు; వినష్టశ్రీకు లై విప్రు లా
జనులం జేరి ప్రతిగ్రహించెద రవజ్ఞాపూర్వదుర్వృత్తముల్. 298

మ. ధరణీరక్షణ మాచరింపక నృపుల్ దర్పంబునం బళ్యతో
హరు లై, సాధులఁ ద్రోచి, చేకుఱు తదీయశ్రీధనక్షేత్రముల్
హరియింపం గలవారు; దారుణతరం బై పెల్లు చెల్లుం బర
స్పరయుద్ధంబు ధరాతలేంద్రులకు విశ్వప్రాణినాశంబుగన్. 299

క. సుతుఁ డవమానించు జనకుఁ;
బతి నవమానించు భార్య; పడఁతులుఁ బతులున్
మతి నొండొరువుల మెచ్చక
నతతముఁ జరియింతు రిష్టసంచారములన్. 300

క. నడవవు దేవపితృక్రియ;
లుడుగును వేదార్థసమ్యగుపదేశంబుల్;
గడఁగును మోహతమంబులు;
పుడమి సమస్తంబుఁ గుజనభూయిష్ఠమగున్. 301

సీ. పదియాఱువర్షముల్ పరమాయు వయ్యెడు;
ధరణీశ! కలియుగాంతమున వినవె;
యేఁడు నెన్మిదియును నేండ్లప్రాయంబునఁ
బ్రజ లుద్భవింతురు భామినులకు;
ద్రవిణవిహీను లై దాత యొక్కఁడు లేక
యన్యోన్యతస్కరు లగుదు రెందు;
నెటిఁ గెడువారును నెంతయుఁ గ్రూరు లై
చెనపి పాపంబు సేసెదరు సూవె;

తే. యన్నవిక్రయ మొనరింతు రఖిలజనులు;
వేదవిక్రయ్ము లగుదురు విప్రవరులు;
పణ్యయోనుల యగుదురు పద్మముఖులు;
గష్టతర మైన యక్కలికాలవేళ. 302

తరువోజ:—

ఉక్కున భూద్రు లత్యుగ్రులై కవిసి
యొక్కండ పెక్కండ్ర నుఱుకచంపుటయు,
దిక్కెవ్వరును లేక దీను లై వసుమ
తీసురుల్ నాలుగు దెసలఁ బాఱెదరు;

క్రమక్కడిచోరులు ముట్టి నిశ్శేష
ముగ ధనావళిఁ గొని మొగి వధింపంగ
క్రుక్కి కాకులయట్లు శూన్యు లై చెదరి
సొంపటి యడవులు సొత్తురు జనులు. 303

క. శ్రుతిధర్మ్ములు శూద్రులు
ప్రతిభం జెప్పంగ వినుచు బ్రాహ్మణులు కడున్
మతి సెడి తత్సేవకు లై
యతినిందితకర్మ కారులయ్యెద రధిపా. 304

మత్తకోకిలము దేవతాయతనంబులున్, జగతీసురావసథంబులుం,
భావనాశ్రమభూములుం జెడి పా డగుఁ; శుభవృత్తవ
ల్లీవనంబులు నాశ మొందుఁ; గలిప్రచారమునందు దు
స్త్రీనివహారము మద్యపానముఁ జెల్లుఁ బెల్లుగ నెల్లెడన్.

క. గురుఁ గొనియాడఁడు శిష్యుఁడు;
గురుఁడును శిష్యునెడ వంచకుం డగు; మఱి నొం
డొరువుల నొల్లరు బంధులు
పొరిఁబొరిఁ గలహంబులగుఁ; బ్రజకుఁ బొడమును భయముల్. 306

తే. ఇవ్విధంబున ధర్మంబు లెల్ల నపగ
తమ నఁ బడ, జను లెల్లను దల్లడిల్ల,
బహువిధోత్పాతములు పుట్టుఁ బార్థివేంద్ర!
కడఁగి తత్కలికాలసంక్షయమునఁదు. 307

క. క్రమమున రాష్ట్రములును, నగ
రములును, నాశంబు నొందు; రక్షాచ్యుతు లై
భ్రమియింతురు జమ లతిదు
ర్గమగిరిసరిదంతికములఁ గడు నాతురు లై. 308

—: కలియుగంబున విష్ణుండు కల్కిరూపంబున ధర్మంబు ప్రతిష్ఠించుట :—

వ. అంతఁ గలియుగాంతంబునందు భువనవిదితం బయిన శంబళగ్రామంబున
విష్ణుయశుం డను పేర విష్ణుండు గల్క్యాత్మకుం డయి జనియించి,

సంస్మరణమాత్రన వేద శాస్త్రంబులును సమస్తశస్త్రాస్త్రవిశేషంబులు నధిగమించి, సార్వభౌముం డయి.

మధ్యాక్కర. అసదృశతేజుఁడు బ్రాహ్మణానీకసహితుఁ డై కడఁగి
వసుమతియందు నధర్మవర్తు లై యున్న మ్లేచ్ఛులను
మసలక నిజశక్తిఁజేసి మడియించి ధర్మంబు నిలిపి
వసునిభుం డొనరించుఁ బేర్మి వాజిమేధము నిష్ఠ యొప్ప.

క. ఘనుఁ డిల యెల్లను బ్రాహ్మణ
ధనముగ భాగించి యిచ్చి ధర్మయశోవ
ర్ధనుఁడై వార్ధకమున న
త్యనఘుఁడు దపోవనంబునందు వసించున్. 311

వ. అతనిచేతం బ్రతిష్ఠితం బయిన ధర్మంబు ననుసరించి బ్రాహ్మణాది వర్ణంబులు సమర్యాదంబు లై వర్తింపం గలయవి; దాననచేసి కృతయుగంబు సంప్రాప్తం బగు నందు. 312

శా. ఆరామవ్రజచైత్యగ్రామవనదేవాగారసౌమ్యంబు లై
భూరిబ్రహ్మతపస్విసంచలము లై. పుణ్యాధ్వరారంభసం
భారోదారము లై, నితాంతఫలితభ్రాజిష్ణుసస్యంబు లై
యారూఢస్థితి నెల్ల దేశములు నొప్పారుం బ్రకాశంబు లై. 313

క. సమయముతోడఁ గురియు వ
ర్షములు; గరము తేజ మెక్కి చరియించు నవ
క్రములై గ్రహంబు; లారో
గ్యము సౌఖ్యము సమధికముగఁ గలుగు నరులకున్. 314

వ. ఇది కృతయుగ ప్రవర్తనంబు; త్రేతాద్వాపరయుగద్వితమంబు నందును ధర్మంబ వర్తిల్లు; నిట్టి తెఱంగునం గాలగతు లనేకంబులు నాకుం బ్రత్యక్షసిద్ధంబు లయ్యె; నీ వడిగిన యతీతానాగతంబు లయిన విశేషంబు లెఱింగించితి; నింక నొక్క హితోపదేశంబు సేసెద నాకర్ణింపుము. 315

క. ధరణీసురులకు నెప్పుడుఁ
గరమిష్టము సేయుమయ్య కౌరవవంశో

త్తర! విప్రులు సంతుష్టిం
బొరసినఁ జేకుఱు నశేషపుణ్యఫలంబుల్. 316

సీ. సకలభూతములందు సదయాత్ముఁడవు గమ్ము;
పాలింపు ప్రజల నీ ప్రజలఁబోలె;
వితతవృద్ధాచారవేది వై ధర్మంబు
సలుపుము; దురితవర్జనము సేయు;
మెఱుఁగమి, శాప మొక్కించుక దొడరినఁ
జట్టన ప్రతికారశాలి వగుము;
గర్వంబు విడువుము; గరము ప్రియంబును
నిజమునుగా వచోసియతి నడపు;

తే. కాలగతు లెల్ల నెఱిఁగి యస్ఖలితబోధ
యుక్తుఁడవు గమ్ము; భరతవంశోద్భవుఁడవు
నీవు గావున నత్యంతనిర్మలుఁడవు
ప్రాజ్ఞుఁడవు నీకు వేఱ చెప్పంగ నేల?" 317

వ. అనిన విని "మునీంద్రా నీ యానతిచ్చిన వాక్యంబు లన్నియు నవ హితుండనై వింటి; నింతకు మున్ను నాయోపిన తెఱంగున లోభ మాత్సర్యాది దుర్గుణంబులు పరిహరింతు; నింకను భవదుక్తం బైన ధర్మశాసనంబును ప్రయత్నంబునం బాలించెద" నని యతనికి యుధిష్ఠి రుండు ప్రణమిల్లి మఱియును బ్రాహ్మణ ప్రభావంబు వినువాఁడై యతనిం బ్రార్థించినఁ దద్విషయం బైన యితిహాసం బతనికి నమ్మహా ముని యి ట్లని చెప్పె. 318

—: మార్కండేయుండు ధర్మజునకుఁ బ్రాహ్మణప్రభావంబు సెప్పుట :—

చ. "ఘనుఁడు పరిక్షితుం డనఁ బ్రకాశితుఁ డైన మహీవిభుండు భా
నునిభుఁడు భానువంశ్యుఁడు వినూతనకీర్తి యయోధ్య యేలువాఁ
డనుపముఁ డొక్కనాఁడు మృగయారతుఁడై చరియించెఁ గానన
మ్మున నొకరుండ యిమ్మల నపూర్వజవోగ్రహయాధిరూఢుఁ డై. 319

వ. ఇవ్విధంబునం బెక్కుమృగంబుల వధియించుచుఁ గ్రుమ్మరువాఁ డొక్క యెడ. 320

ఆ. మదభరాభిరామమృదులయానం బొప్పఁ
నల్లఁ బొలయుచును లతాంతరము లఁ
గరము లీలఁ గమ్మవిరులు గోయుచునున్న
పువ్వుఁబోఁడి నొక్కపొలఁతిఁ గనియె. 321

క. కని యంతఁ గదిసి యాకా
మిని యొప్పులు చూడ్కిఁ దగుల మీటినతమకం
బున ననిమిషలోచనుఁ డై
జననాథుఁడు మదనబాణసంహతిఁ దూలెన్. 322

వ. అదియును నతిసుందరంబైన తదీయమూర్తి విభవంబునకు మెచ్చి సాభిప్రాయంబుగా నవలోకించె; నంత నమ్మహీకాంతుం డక్కాంత కిట్లనియె. 323

ఉ. "ఎవ్వరిదాన వంబుజదళేక్షణ! యేకత మిట్టు లేల నీ
వివ్వనభూమియందుఁ జరియించెదు?" నావుడుఁ "దండ్రిపంపునం
దివ్వనభూమియందుఁ జరియించెద సద్వరుఁ గోరి; కన్య నే;
నెవ్వరిదానఁ గా వలయు? నేర్పడఁ జెప్పుము రాజనందనా!"

వ. అనిన దాని ప్రగల్భవచనంబులకు నధికవిలోలుం డై భూపాలుండు దన యభిలాషం బెటింగించిన నమ్మగువ "న న్నెన్నండును జలవిహారంబునకుఁ జొనుపకుండు నది; య ట్లయిన నిన్ను వరియించెద" ననిన వాఁడును దత్సమయంబున కొడంబడి దానిం దోడ్కొని పురంబునకుం జనుదెంచి యిష్టసుఖతత్పరుం డయి యుండె; నంత నొక్కనాఁడు శరత్సమయంబునందు. 325

చ. అతులిత పుష్పపల్లవఫలాన్విత భూరుహభూరివల్లరీ
వితతముఁ, జారుకైరవ నవీనసరోరుహషండ మండలా
యతసరసీమనోహరము నైన పురోపవనంబునన్ సము
న్నతవిభవుండు వాసభవనంబు లొనర్పఁగఁ బంచి యిమ్మెలన్.

క. దేవీసహితంబుగఁ బృ
థ్వీవరుఁ డవ్వనమునందు విహరించె ఘనాం

తావసరవాసరంబుల
భావితపద్మవనపవనపరిచితుఁ డగుచున్. 327

వ. అంత నొక్కనాఁడు నితాంతఘర్మజలకణకలితశరీరుండై ప్రియా సమేతంబుగా వాసగృహంబు వెలువడి తత్సమీపంబున నతిమనోహరం బయిన కమలాకరంబు గని దానితీరంబున నయ్యగ్నిని నిచి దాను గృతావగాహుండై. 328

క. "మేలై యున్నది జలము వి
శాలనయన! చెమట వోవఁ జయ్యన దేహ
క్షాళన మొనరింపు" మనిన
నాలేమ దరస్మితాననాంబుజ యగుచున్. 329

ఆ. మడుఁగు సొచ్చి మునిఁగి మాయమై పోయిన
నద్భుతాత్ముఁ డగుచు నవనిభుఁడు
మడుఁగు గలయ వెదకి మానినిఁ గానక
జలములెల వెడలఁ జలిఁ గడఁగి. 330

వ. ఇట్లు సల్లి యందు మండూకంబు లనేకంబు లున్నం జూచి "యివి మత్ప్రియాంగనను గ్రమింగినవి గాకేమి" యని కలుషించి యను చరులం బిలిచి "నాకుఁ బ్రియంబుసేయ వలసినవారు గలిగినం బుడమిం గల కప్పల నెల్లం బొడవడంచి రం" డని పంచిన నలుదిక్కు లకుం జని తదీయకింకరవర్గంబు. 331

చ. కొలఁకుల, వాఁగులఁ, నదులఁ, గ్రోవుల, బావుల, నిర్ఝరంబులం
గలయఁగ రోసి రోసి వడిఁ గప్పలఁ గుప్పలుగా పీఢించుచో
నలుగుల మంచ భేకనివహంబు గనుంగొని భేకనాయకుం
డలఘుతపస్విరూపమున నా నృపుపాలికి వచ్చి యిట్లనున్. 332

ఉ. "అక్కట! లోఁ మెల్ల నగ నాఱడిఁ గప్పలఁ జంప నేల? యిం
దెక్కడి వెంపు గల్గుఁ? బృథివీశ్వర! కోపము డింపు; కప్పలం
జక్కని మూడ్కిఁ జూడు; మిది చాల నధర్మము" నాపుడుఁ విభుం
డెక్కడిమాట! నాసతికి నె గ్గొనరించెఁ గడంగి భేకముల్. 333

క. నా యిష్టవనిత ప్రమింగిన
మాయపుఁబుర్వు లివి ; వీని మడియింతు ; మునీం
ద్రా యుడుగుము నీ" వనుటయు
నాయన యత్యంతదుఃఖితాత్ముం డగుచున్. 334

వ ఏను మండూకనాయకుండ ; నాయు వనువాఁడ ; నమ్మగువ నా కూఁతురు సుశోభన యనునది ; దానిచేత ననేకులు బేలుపడిరి ; నీ వెంతవాఁడ ? ' వనిని నప్పరిక్షితుం "డట్లేని నాకు నమ్మోలఁతుకఁ దెచ్చి యొప్పింపవలయు" నని ప్రార్థించిన నతండు నవ్వుచు నవ్వా మనయునం దన తలంపున రావించి, యారాజునకు నిచ్చి, దానిం జూచి కోపించి "నీవు గడుం జెట్టవు; ప్రసిద్ధులగు రాజులం బెక్కండ్రం జిక్కులంబెట్టితివి ; గావున నీకుం బుట్టెడు కొడుకులు గపటవర్తను లయ్యెడు" మని కూఁతు శపియించి మండూకరాజు నిజేచ్ఛం జనియెఁ ; బరిక్షితుండును సంప్రాప్తమనోరథుండయి సుశోభనయందుఁ గ్రమంబున శలుండును, దలుండును, వలుండును ననుమువ్వురు కొడుకులం బడసి యం దగ్రజుండయిన శలు నభిషిక్తుం జేసి తపో వనంబున కరిగె ; నంత. 335

క. శలుఁ డొక్కనాఁడు కనుకో
జ్జ్వలమగు రథ మెక్కి, వేఁట సని, పెక్కుమృగం
బులఁ జంపఁగ నొక్కమృగం
బలఘుతర శరాగ్ర విద్ధ మై వెసఁ బఱచెన్. 336

ఆ. ఇట్లు వఱచుటయును నెంతయు రయమున
నమ్మృగంబువెనుక నరిగి యరిగి,
యెయిద లేక భారుణీశుండు సారథిఁ
బరి తేరు వేగ పఱపు" మనియె. 337

సీ. అనవుడు సూతుఁ డిట్లను "దేవ! మన మెంత
తఱిమిన మృగము దద్దయు జవంబు
గలదు ; రథ్యంబులు గడుకొని కూడంగఁ
జాలవు; వలవనిఱాలి యేల ?

మన తేరిహారులు వామ్యము లైన నమ్మృగ
మగపడు, లేకున్న నలవి గాదు''
నా విని ''వామ్యముల్ నాఁగ నెవ్వనిహాయం
బులు సెప్పు'' మనియె నబ్భావిభుండు

తే. ''వామదేవమహాముని వరుని హారులు
వామ్యములు నాఁగఁజను'' నని వాఁడు సెప్పె;
''నతనియాశ్రమ మెచ్చట? నచటి కిపుడ
తేరు వోవ'' నిమ్మనియె ధాత్రీవిభుండు. 338

వ. వాఁడును రథంబు సత్వరంబుగా వామదేవునాశ్రమంబునకుం బఱపినం జని, యాతం డాతపోనిధిం గని నమస్కరించి ''మునీంద్రా! నాచేత నేటువడి యొక్క మృగంబు రయంబునం బఱచె; నమ్మృగంబు నెయిది వధియింపవలయు; భవదీయ హాయంబుల నీ వలయు ననిన నతఁడు ''నీవు కృతకార్యుఁడ వై మాహాయంబులం దడయక యెప్పింప వలయు; నట్లయినం గొనిపో'' మ్మనిన పల్లె యని వామ్యంబులం గొని రథయుక్తంబులం గావించి తదీయజవంబునకు మెచ్చుచు ముహూర్తమాత్రంబునఁ గూడమట్టి యమ్మృగంబు సమయించి మగిడి నిజపురంబునకు వచ్చి. 339

మత్తకోకిలము.

''రాజయోగ్యము లైన యీహాయరత్నముల్ జనస్త్వవి
భ్రాజితంబులు; వాని కేటికిఁ బాఱువానికి'' నంచు నా
రాజు రాజసబుద్ధి నంతిపురంబునం దిడఁ బంచె న
వ్వాజియుగ్మము; వేడ్క నూనినవాఁడు దోస మెఱుంగునే?

వ. అట వామదేవుండును దన యశ్వంబుల శలుండు గొనిపోయి మగుడ నొప్పింపక తడయుటయు నాత్మగతంబున. 341

తే. ''రాజపుత్రుండొ బలియుండు, రాజసుండు
గొండికాతండు వేడుకఁ గొనుచు నరిగె
నశ్వములఁ; గ్రమ్మఱఁగ నిత్తు ననువిచార
మెవ్విధంబున నతనికి నేల కలుగు.'' 342

వ. అని శంకించి నిజశిష్యుం డాత్రేయుం డనువానిం జూచి "శలుండు మన వామ్యంబులం గొనిపోయి యొక్క మాసం బరుగు దెంచె; వాఁడును దనయంతఁ దెచ్చుట గలుగ నేరదు; నీ వరిగి మన తురంగరత్నంబులం గొని రమ్మని" పంచిన నప్పుడ కదలి య యోధ్యకుం బోయి. 343

క. మనుజపతిఁ గాంచి యాతఁడు
"మునిపతి పుత్తేర నధిపముఖ్య! యిచటి కేఁ
జను దెంచితి; సూహాయముల
నెనసిననెయ్యంబుతోడ నిమ్మని" యెఁదగఁ. 344

క. అనవుడు శలుఁ డి ట్లనియెం
"జను నినుఁ బుత్తేర నతఁడు; సాలుదు వీవుం
గొనిపోవఁ దురంగఁబులఁ;
జను మిదుర్భాషితములు నైఁపవు మాకున్." 345

వ. అనిన నమ్మునికుమారుండు గ్రమ్మటి చని గురునకు నవ్విధం బెఱిఁగిం చిన వామదేవుండు క్రోధపరీతచేతస్కుండై శలునిపాలి కరిగి యి ట్లనియె. 346

క. "ఇమ్మ నరేశ్వర! మాతుర
గమ్మ్మల; నీకార్య మయ్యెఁగాదే; కడులో
భమ్మున నొండుల సొమ్మ్మలు
ర మ్మనినన్ వచ్చునే? యెరవు సత మగునే? 347

క. పరధనహరణము దురితము;
పరికింపుము; వరుణుచేతి పాశంబుల ని
ష్ఠురముగఁ గట్టువడకు; ని
ర్భరనరకకృశానుశిఖలఁ బడకుము మీఁదన్." 348

చ. అనుటయు నాతఁ డి ట్లనియె "నాఅడివిప్రులకేల యశ్వముల్?
ఘనతరసత్త్వమూర్తు లనఁగాఁ దగు నెడ్లను రెంటి నిచ్చెదన్;
విను మటు గాక బల్లిదపువేసడముల్ వలతేని నిత్తుఁ గై
కొనుము తగంగ; వామ్యములఁ గోరక పొ; మ్మడియాస లేటికిన్?"

క. అనిన "నివి యేటిమాటలు?
వినువారలు నవ్వ నకట! విప్రుల ధనముల్
గొని వేఱ యొంటి నిచ్చెద
ననుటిది యేనాఁటిచందఁ?" బని మునిఁ బెలుచన్.

క. పలుకుటయు నలిగి శలుఁ "డి
ప్పలుగుఁదపసి నంటఁగట్టి పటుశూలములం
బొలియింపుఁ" డనుచు భీకర
బలుల నియోగించెఁ దనదుపాగ్వ్యాజనములన్. 351

వ. అంతయుం జూచి వామదేవుండు ఘనరోషణభీషణప్రహాస దుర్నిరీక్ష్య ముఖుం డగుటయు నాభణంబ ఘోరాకారు లగు రాక్షసు లనేకులు పుట్టి నిశాత శూలంబుల నాభూపాలుం బొడిచి కాలగోచరుంజేసిరి; మునీంద్రుండు నిజేచ్ఛంజనియెఁ; దదనంతరంబ శలానుజుండు దలుం డనువాఁడు నిజరాజ్యపట్టబద్ధుం డై సుఖం బుండఁ గొఁడొక కాలం బునకు వామదేవుండు సనుదెంచి వానిం గని "మహాత్మా! నీవు ధర్మపరుండవు; ధర్మవు దప్ప నోడుదేని మాహాత్ముంబుల ని" మ్మును టయు దలుం డలిగి నిజసన్నిపంబున నున్న సారథిం జూచి యి ట్లనియె. 352

సీ. కడుఁ గ్రొవ్వి తేఁకువ సెడియె నీ పాఱుండు;
వీఁకమై నిప్పుడు వినిమ్మొమ్ము
వ్రయ్యంగఁ జేసెదఁ, జయ్యన విషదిగ్ధ
సాయకమును శరాసమ్ముఁ దెమ్ము"
నావుడు నమ్మహీదేవుండు నగుచు ని
ట్లనియె "న న్నేయఁ దెమ్మనిన విళిఖ
మంతఃపురంబున సంతసంబున నున్న
యనఘు భవత్సుతుఁ దునుముఁగాక"
తే. యనఁగఁ దదనంతరంబ ఘోరాస్త్రసహితుఁ
డయిన యబ్బాలుఁ గొంచు హాహారవంబు
లెసఁగ నంతిపురంబువా రెల్ల వచ్చి
రది ధ్రువంబుగఁ గనియును నవ్విభుండు. 353

వ. కోపఘూర్ణమాన విగ్రహుం డగుచుఁ దన దురాగ్రహంబు విడువక సమీపవర్తులం జూచి. 354

మ. "వినుఁడీ సర్వజనంబులుం, గడిఁగి యీవిఘ్నున్ దురాలాపు, దు
ర్జనునిం దున్మెద నస్మదీయసుమహచ్ఛాపోగ్రనిర్ముక్తబా
ణనిపాతచ్ఛిదురాంగర క్తఝలళోణతోణిసంగస్థుఁ గాఁ
గనుఁడీ యీ దురితాత్ము" నంచు నతి శీఘ్రప్రాప్తకోదండుఁడై. 355

క. శర మరిఁబోయుటయును ద
త్కరయుగ్మము బాణకార్ముకంబులతోఁ జె
చ్చెర సంస్తంభము నొందుఁడు
నరనాథుఁడు విస్మయావనతమానసుఁడై. 356

క. పుల్లవడి చలము రోషముఁ
బొల్లయు నై చనఁగఁ, గొంతప్రొద్దు మొగమునన్
వెల్లఁదనము గదుర నిలిచి
యెలజనులు వినఁగ మఱియు ని టని పలికెన్. 357

ఉ. "ఆడితిఁబెక్కుమాట; లవి యన్నియు వమ్మయిపోయెఁ; నస్త్రసం
తాడనశక్తి గీడ్పడియెఁ; దథ్యము బ్రాహ్మణశక్తి యెక్కు; డే
నోడుదు వామదేవునకు; నోజనసంఘములార! సజ్జనా
ప్రేమితకీర్తి నిమ్మునిని నమిత్రనిషూదను నాశ్రయించెదన్." 358

వ. అని యివ్విధంబున నతం డేటు దప్పిన జోహారు వెట్టుటయుఁ దదీయ బంధు మిత్రజనంబులు భయసంభ్రమంబులతో నమ్మునినాథు శరణు సొచ్చి యనున యించినఁ, బ్రసన్నుం డై యమ్మహాత్ముండు దత్కర యుగస్తంభనంబు మాన ననుగ్రహించి, తదీయనందను ప్రాణంబు లొసంగె; నంత నమ్మహీకాంతుండు భార్యాబంధుజనసహితంబుగా నతనికిఁ బ్రణమిల్లి హాయంబులఁ దెచ్చి యొప్పించినం గైకొని వామ దేవుం డరిగె; నిట్టిది బ్రాహ్మణప్రభావం బని చెప్పిన విని. 359

క. మునిపతికి మ్రొక్కి కుంతీ
తనయుఁడు "మీకంటె వృద్ధతముఁ డగు పురుషుం
డనఘా! కలఁడే? జగమ్మున"
నని యడిగిన నాతఁ డిట్టు లని యెఱిఁగించెన్. 360

—: మార్కండేయుఁడు ధర్మరాజునకు నింద్రద్యుమ్ను చరిత్రము సెప్పుట :—

క. ఘనుఁ డింద్రద్యుమ్నుం డను
జనపతి గలఁ, డాతఁ డింద్రసదనమున ముదం
బున నుండఁగ బహుకాలం
బున కాతనికీ ర్తి లోకమున మాయుటయున్. 361

తే. అమరు లిచ్చోటనుండ లే వరుగు మనుచు
నుర్వీ ద్రోచిన, నతఁడు నాయున్నకడకు
నర్థి జనుదెంచి యిట్లను "ననఘ! నన్ను
నిద్ధపుణ్యు నింద్రద్యుమ్ను నెఱుఁగుదయ్య?." 362

సీ. అనుడు నేనిట్లంటి "నయ్య! ని న్నెఱుఁగంగఁ
జాల నయ్యెద; హిమశైలశృంగ
వాసి యై యుఁడు ప్రావారకర్ణుం డను
పేరి ఘూకము గడుఁబెద్ద; యదియు
నాకంటె నిన్ను నిర్ణయముగ నెఱుఁగుఁ బో"
మ్మనుమటయు నన్ను రమ్మనియె నతఁడు;
"ఘనరసాయనఘుటికాప్రయోగంబున
దేహతాపంబు వర్ధించె నేఁడు
తే. గదలి రాఁజాలనే" నంటిఁ; గడఁగి యన్న
రేంద్రుఁ డశ్వమై ననుఁ బ్రీతినెత్తికొనుచు
నయ్యలూకముపాలికి నరిగి నన్ను
నడిగినట్టుల దానిఁ దా నడుగుటయును. 363

వ. అదియునుం గొండొకసేపు దలపోసి చూచి, "యేను నిక్కువంబుగా ని న్నెఱుంగ నేర; నింద్రద్యుమ్నుం బను కొలనియందు నాళీకజంఘుండను పేరి బకవల్లభుండు వసియించు; నవ్విహంగంబు నాకుఁ బెద్ద; నిన్నెఱుంగు నరుగు" మనిన నమ్మనుజపతి నాతోడఁగూడ నయ్యలూకంబు మోచికొని నాళీకజంఘునొద్దకుం జని తన పేరు చెప్పి "నన్నెఱుందే"యనిన నదియు "నేనిన్నెఱుంగంజాల; నాకంటెఁ జిరకాల జీవియైన యకూపారుం డను కచ్ఛపంబు గల; దదియును నికొ్కలనుండు;నజ్జలచరము ని న్నెఱుంగంబోలు; నడిగి చూతము గాక" యని

యక్కమఱఁబుఁ బేరొక్కని ''యిది యొక్కధర్మసందేహంబు;నిర్ణయించుటకయి యీ యార్యజనంబులు నిన్ను గుఱించి వచ్చినవారు; నీవు సనుదేర వలయు'' నని వేఁడుటయును. 364

తే. కొలను వెలువడి చనుదెంచే గూర్మవిభుఁడు;
వార లడిగి "రింద్రద్యుమ్న ధారుణీశు
నెఱుఁగుదే'' యని; యదియు నొక్కింతసేపు
దలఁచికొని కన్నుఁగవ నశ్రుజలము లురుల. 365

వ. ఎలుంగు రాల్పడ వారలం గనుంగొని యి ట్లనియె. 366

ఉ. "అక్కట! నే నెఱుంగనె మహాగుణభూషణు నమ్మహాత్ము; నన్నిక్కడఁ బెక్కుమాఱులు ననేకభయంబులఁ బొందకుండఁగా నక్కటికంబుతోడఁ దగ నాతఁడు గైకొని కాచే గాదె; పెం పెక్కిన యన్నరోత్తముని నెన్నఁటికిఁ మఱువంగ వచ్చునే. 367

తే. అమ్మహాత్ముండు బహువిధయజ్ఞదక్షి
ణార్థముగ విప్రవరులకు నర్థి నిచ్చు
గోగణంబుల గొరిజల గ్రొస్సి యయ్యెఁ
గాదె యీ సరోవరము జగన్నుతముగ?" 368

వ. అనిన యనంతరంబ దేవదూతలు విమానంబు గొనుచుఁ జనుదెంచి యింద్రద్యుమ్నుంగని "మహాత్మా! నీకీర్తి జగంబునందు శాశ్వతంబై నిలిచె; నీకుఁ ద్రిదివనివాసంబు సుస్థిరంబయ్యె; నరుగుదెమ్ము; విమానం బెక్కు" మని మఱియును. 369

క. "తనకీర్తి యెంతకాలము
వినఁబడు నిజ్జగమునందు వెలయఁగ నందాఁ
కను బుణ్యలోకసౌఖ్యం
బున నెంతయు నుల్లసిల్లుఁ బురుషుం డనఘా!" 370

వ. అనుటయు నమ్మహీకాంతుడు దిపిజకింకరులం జూచి "యిమ్ముదుసలి తాపసుని, వృద్ధవిహంగంబును గార్యార్థంబు సహాయులుగాఁ దెచ్చితి; వీరిని నిజస్థానంబుల నునిచి వచ్చెద; నించుక నిలువుం"డని వారిచేత ననుజ్ఞాతుండయి నన్నును నులూకంబును నెప్పటి నెలవులం బెట్టి

తానును దేవయానంబునఁ బుణ్యలోకంబున కరిగె'' నని చెప్పినఁ
బ్రీతుఁడై పృథానందనుండు. 371

క. ''నీకంటె వృద్ధతమునిగు
ణాకర! యెఱిఁగించి; తిది మహాద్భుత'' మని సు
శ్లోకుఁడు మునివరునకుఁ బు
ణ్యాకృతికిఁ గృతప్రణాముఁ డై కడు భక్తిన్. 372

—: మార్కండేయుఁడు ధర్మరాజునకుఁ గువలాశ్వ చరిత్ర మెప్పుట :—

వ. ''మునీంద్రా యిక్ష్వాకువంశోద్భవుండైన కువలాశ్వునకు ధుంధు
మారుం డను పే రెట్లు గలిగెఁ? జెప్పవే'' యని యడిగిన నతం
డి ట్లనియె 373

ఉ. శంకరసన్నిభుండు, జనశంకరుఁడున్, గరుణాకరుం, డనా
తంకుఁ, డుదంకుఁ డన్మని వ్రతస్థితుఁడై మరుభూమియందు ని
శ్శంకమతిన్ వసించి యనిశంబును నవ్యయు నచ్యుతున్ మనః
పంకజవేదిపై నిడి తపం బొనరించె ననేక వర్షముల్. 374

తే. అతని భక్తికిఁ బ్రియమంది యాదిదేవుఁ
డంబుజాక్షుఁ డధోక్షజుఁ, డచ్యుతుండు
గరుణఁ బ్రత్యక్షమగుటయుఁ గని యతండు
ప్రణతి యొనరించి యిట్లని ప్రస్తుతించె. 375

మత్తకోకిలము. "దేవదేవ! శ్రుతిప్రమాణవిధేయ! మాధవ! జంగమ
స్థావరాత్మకమైన లోకము సర్వముఁ భవదీయమా
యావిధేయము; విశ్వరూపుఁడ వవ్యయుండవు నీవ; స
ద్భావసుస్థితి నిన్నెఱింగినఁ బాయుఁ బాపము లచ్యుతా!

చ. అనిమిష సిద్ధ సంయమి విహంగ భుజంగమముఖ్యు లెల్ల ని
న్ననిశముఁ గొల్చి నీదయఁ గృతార్థతఁ బొందుదు; రెందు నీవు నె
మ్మనమున సంతసిల్లుడు సమస్తజగంబులు శాంతిఁ బొందు; నీ
కినుకకు మాఱు లేదు శివకీర్తన! యీభువనత్రయంబునన్. 377

మత్తకోకిలము. విక్రమత్రయలీల నోలిన విష్టపత్రితయంబుఁ బె
ల్లాక్రమించితి; క్రూరులైన సురారివీరులఁ బ్రస్ఫుర
చ్చక్రవిక్రమకేళిఁ ద్రుంచితి; సర్వయజ్ఞఫలావహా
ప్రక్రియాత్మ్మఁడ వీవు నిశ్చల భక్తిగమ్య! జనార్దనా!"

వ. అని మఱియుం బెక్కుభంగులం బ్రస్తుతించినం గరుణించి పాంచ
జన్యధరుండు వరంబడుగు మనుటయు నుదంకుండు "దేవా! భవదీయ
దివ్యరూపంబుఁ బ్రత్యక్షంబుగాఁ గంటి; నింతకంటెను మిగుల వరం
బెయ్యది గల? దైనను నామనంబు నిత్యంబును సత్యధర్మశమంబుల
యందుఁ దిరంబై నీయందు దృఢభక్తికంబుగావలయు; నిదియ నాకు
వరం" బనుటయు నద్దేవుండు "నీకోరినయట్ల యిచ్చితి; మత్ప్రసా
దంబున నీకుం బరమజ్ఞానయోగంబు సిద్ధించుం; ద్రిలోకహితం బైన
కార్యం బొక్కటి నీచేత సాధితం బయ్యెడు; నది యెయ్యది యనిన
వినుము; ధుంధుం డను దానవుండు జగంబుల కుపద్రవంబు సేయం
గలవాఁడు; తద్వధార్థంబై నీవు బృహదశ్వసూనుండైన కువలాశ్వ
నుద్యుక్తుం జేసెద; వన్న రేంద్రుండు మత్ప్రసాదలబ్ధంబై న యోగ
బలంబునను భవన్నియోగబలంబుననుం జేసి యయ్యసురం బరిమార్ప
సమర్థుం డగు; నవ్విశేషంబునకు నీవలన నఖిలలోకంబులు సంత
సిల్లెడు" నని పలికి విష్ణుదేవుం డంతర్హితుం డయ్యె; నుదంకుండును
బూర్వప్రకారంబునం దపంబు సేయుచుండె; మఱియు. 379

సీ. అనఘుఁ డిక్ష్వాకుఁ డీయఖిలభూచక్రంబు
నేలి నాకమునకు నేగుటయును
నతనినందనుఁడు శశాదుండు రాజయ్యె;
వాఁడు కకుత్స్థుఁ డన్వానిఁ గనియె;
నతఁ డనేనసుఁ డను నాత్మజుఁ బడసె; నా
పృథివీపతికిఁ బుట్టుఁ బృథుఁ డనంగ;
పృథుఁడు విశ్వకుఁ డను పేరి పుత్రునిఁ గాంచె;
నతనికి జనియించె నార్ద్రిఁ డనఁగ; 380

తే. నార్ద్రినకుఁ బుట్టె యువనాశ్వుఁ డను తనూజుఁ;
డతనికిని బుట్టె శ్రావస్తుడను విభుండు;

తత్సుతుఁడు బృహదశ్వుఁ; డా ధరణిపతికి
నుగ్రతేజుండు కువలాశ్వుఁ డుదయ మయ్యె. 381

వ. అక్కువలాశ్వునకు నఖిలాస్త్రశస్త్రవిద్యానిశారదులు నధిక సత్త్వసంప న్నులు నైన పుత్రు లేకవింశతిసహస్రంబులు వుట్టి; రంత బృహదశ్వుండు నిజపుత్రకుం గువలాశ్వుం, బ్రాప్తసంతాను, నత్యంతధర్మా న్వితు నఖిలమహీరాజ్యభారధౌరేయుంగా నభిషేకించి తపోవనంబు నకుఁ బోవ సమకట్టి యయోధ్యానగరంబు వెలువడు నవసరంబున, నవ్వార్త విని యుదంకుఁడు సనుదెంచి బృహదశ్వున కిట్లనియె.

ఉ. "నీవు ప్రజాభిరక్షణము నెమ్మి నొనర్పు; మరణ్యభూమికిం
బోవఁగ నేల? రాజులకు భూప్రజఁ గాఁచుటఁబోలు ధర్మ్మవుల్
భూవర కల్గునే? యడవిఁ బోయి వసించినఁ గాని కాదె? ర
హోవిధిఁ గాదె సద్గతులు గాంచిరి తొల్లిటిరాజముఖ్యులుఁ. 382

క. నీరక్షణంబుకతమున
ధారుణి మమబోఁటి సాధుతపసులు నిత్య
ప్రారంభ ధర్మ్మకర్మ్మో
ద్ధారు లగుట యదియు విహితధర్మ్మవు గాదే? 383

వ. విను మొక్క యద్భుతంబు సెప్పెద; మధుకైటభు లనం బ్రఖ్యాతులైన యసురుల తనయుండు ధుంధుం డనువాఁడు మహాబలపరాక్రమసంపన్నుం డై నిజతపో బలంబునం బితామహువలన వరంబు వడసి, దేవదానవగంధర్వాదులకు నజయ్యుం డై చరియించు చుండు; నయ్యసుర యిపుడు మదీయాశ్రమసమీపంబున బహుయోజన విస్తీర్ణం బగు సముద్రవాలుకాపులినతలంబునందు మహావివరంబు గావించుకొని సుఖంబున నిద్రించుచున్నవాఁడు; వాలుకాంతర్హితశరీరుం డైన వాని వదననిశ్వాసపవనంబు సధూమదహనజ్వాలాభీలం బయి సంవత్సరంబున కొక్కమాఱు వెలువడి భూనభోంతరం బెల్లను నిరంతర సికతారజఃపటలంబు మాఁటుకొనం జేయుఁ; దదీయవేగంబునఁ దత్సమీపభూమి శైల కాననంబు లేదు దినంబులదాఁకఁ గంపించుచుండు; నిట్టి దారుణత్వంబుకతంబున మాకు మా యాశ్రమంబున నుండుటఁ గడుసంకటంబు; గావున నద్దురాత్ముఁ వధియించి మాకును లోకంబులకును

బ్రియంబు సేసి కృతకృత్యుండవై మఱి తపోవనంబున కరుగుము.

తే. ఎవ్వఁ డమ్మహాసురు వధియించుపనికిఁ
బూను, నతనికి నాత్మీయభూరిశ క్తి
యిచ్చి జయ మిత్తునని యానతిచ్చె నధిప!
యాదరంబున నాకుఁ బ్రకాయుఘుండు. 385

వ. కావున. 386

చ. అతులితవిష్ణుశ క్తిసముపాహితమూ ర్తివి గమ్మ, లెమ్మ; సం
తతభుజశ క్తి నిట్టి యవధాన మెసర్పఁగ నీవ కాని యీ
క్షితి నితరుండు లేఁ; డధికకీ ర్తియుఁ బుణ్యముఁ జేరు నిన్ను; నూ
ర్జితగుణ! యింతవట్టుఁ దగఁ జేయుము, గావుము లోక మంతయున్."

వ. అనినం గృతాంజలి యై యుదంకునకు బృహదశ్వుం డి ట్లనియె.

క. "ఏమలమతి సస్త్రసన్నా హ్య
సము నేసితిఁ; దప మెనర్ప సమగట్టితి; నిం
కమునీంద్ర! తపోవనగమ
నము దప్పదు నాకు; వినుము నా విన్నపమున్. 389

చ. అనఘుఁడు, మత్సుతుండు, కువలాశ్వుడు, వీఁడె మహాబలుండు, స
జ్జనహిత కారి, ధైర్యనిధి, సంభృతకీ ర్తి భవత్ప్రసూర్థమై
జననుత! యమ్మహాసురునిఁ జంపుట కోపు నవార్యశౌర్యవ
ర్ధను లగుచున్న పుత్రులను దాను నభేద్యభుజావిభూతితోఁ. 390

వ. నాకు ననుజ్ఞ యీవలయు "నని యక్కార్యభరమునకుఁ బుత్రు
సమర్పించి, యమ్మునిచేత నభినంధితుండై బృహదశ్వుండు తపోవనం
బున కరిగె" ననిన విని ధర్మనందనుండు మార్కండేయునితో "ధుం
ధుండు మధుకైటభులపుత్రుం డని చెప్పితి; రమ్మధుకైటభు లెక్కా
లంబువా? రేమిప్రమంబున నెవ్వరిచేత నే మై?" రని యడిగిన నతండు
ధర్మనందనున కి ట్లనియె. 391

—: మార్కండేయుఁడు ధర్మజునకు మధుకైటభుల చరితము సెప్పుట :—

సీ. "అధిప! తొల్లి జగత్త్రియంబు నేకార్ణవ
మై యుండఁగా, నప్డు హరి యొకండ
భాసురభోగీంద్రపర్యంకమున భవ్య
యోగనిద్రాసుఖయుక్తి నలర,
నతిదీర్ఘ మగు కాల మరిగెఁ; బరంపడి
దైత్య లిద్దఱు మహోదాత్తబలులు
మధుకైటభులు నాఁగ మథితశాత్రవు లేఁగు
దెంచి యప్పరమాత్మ్ము దివ్యనాభి
ఆ. కమలమున వెలుంగు కమలాసనునిఁ గని
దర్పదోషనిహతిఁ దలరి వ్రేయ
నతఁడు భీతి నొంది యాక్రోశ మొనరించె,
"నాదిపురుష! నన్ను నరయు" మనుచు. 392

ఉ. ఆ తెఱఁ గాత్మఁ గాంచి కమలాతుఁడు మేల్కని, ఘోరవిక్రమో
పేతుల దైత్యసింహుల, నపేతభయాత్ములఁ జూచి "మీర లి
ట్లీతని నుక్కునం బఱుప నేల? భవద్బలశౌర్యయుక్తికిం
బ్రీతుఁడ నైతిఁ; జెచ్చెర నభీష్టవరంబులు వేఁడుఁ డిచ్చెదన్". 393

తే. అనినఁ గలకల నవ్వి యయ్యసురవరులు,
"నీవు మా కేమి యిచ్చెదు? నీక మేము
వరము లిచ్చెద; మడుగుము వలచితేని"
ననిన వారల కిట్లను నవ్విభుండు. 394

క. "సత్యవ్రతులార! వరం
బత్యంతప్రీతి మిమ్మునడిగెద; లోక
ప్రీత్యర్థముగా నాచే
మృత్యువనం బొందుఁ డిపుడ మీర లిరువురుఁ." 395

వ. అనిన వార లొండొరుల మొగంబులు సూచి యాచక్రధరున
కిట్లనిరి. 396

చ. "నగవులకేనియున్ వినుఁ జనార్దన! యెన్నఁడు బొంకు పల్కఁ; మ
త్యగణిత విక్రమోరుబలధైర్యసమ్రగుల; మెల్లభంగిఁ గా
ల గతి దొలంగఁ ద్రోవఁగఁ దలం బగునే? యగుఁ గాక నీకు మె
చ్చుగ నిదె ప్రాణ మిచ్చెదము; ప్రుక్కము చావున కాత్మ నేమియున్,

ఆ. చంపెదేని మమ్ము జలములు లేని దే
శమునఁ జంపవలయుఁ గమలనాభ!
నిక్కమింతవట్టు నీచేత మడియఁగఁ
దగుదు" మనిన నగుచు నగధరుండు. 398

వ. త్రైలోక్యంబును జలమయం బగుట నాలోకించి. 399

క. పరమేశుఁడు దనయూరులు
పరపుగ నొనరించి వానిపైఁ దచ్ఛరముల్
పరుషతరశితసుదర్శన
ఖరధారానిహతిఁ జేసి ప్రక్కునఁ దునిమెన్. 400

తే. పరఁగ నమ్మధుకైటభాసురుల సుతుఁడు
సువ్వె ధరణీశ! ధుంధుఁ డన్ శూరవరుఁడు;
వాఁడు వరగర్వమునఁ జేసి వాఁడి మిగిలి
యమరపతిఁదొట్టి వేల్పుల నవమతించె." 401

వ. అని చెప్పి యమ్మునీంద్రుం డి ట్లనియె "నట్లు బృహదశ్వచేత
ననుజ్ఞాతుం డై కువలాశ్వుండు శుభదినంబున నుదంకపురస్సరంబుగా
గృతప్రస్థానుం డై. 402

తరలము. దనుజనిర్మథనైక తత్పరతావిజృంభణ మొప్ప స
ద్వినుతతేజుఁడు ఘోరసంగరవిక్రమోత్సవలీలమై,
ఘనభుజాబలభూరిదుర్వహగర్వసంగ్రహుఁ డైన నం
దను లనేకసహస్రసంఖ్యలు దన్నఁ గొల్వ నుదగ్రుఁ డై.

మ. చతురంగధ్వజినీపద ప్రవిహతిఁ సర్వంసహాచక్ర మా
తతకంపంబునఁ బొంద నేఁగె; నపు డద్దైత్యారి యారాజునం
దతులం బైన నిజాంశశక్తి సొనిపెన్; హర్షించి రింద్రాదిదే
వతలుఁ, సన్మునిముఖ్యులుఁ నృపతి నైశ్వర్యోన్నతుం జేయుచుఁ.

ఆ. మొరసె దివ్యతూర్యములు ; నందనద్రుమ
సురభికుసుమవృష్టి గురిసెఁ గలయ ;
నప్రతీతభంగి యగు మందపవనవి
చేష్టితంబు గర మభీష్ట మయ్యె. 405

క. గగనమున సురవిమానము
లగణితముఁగఁ గ్రందుకొనియె; ననుకూలము లై
మృగపక్షిగతులు శోభన
మగు చేర్పడఁ జెవ్వె నజ్జనాధిపుయాత్రన్. 406

వ. ఇట్లు సని కువలాశ్వుండు సముద్రతీరంబున విడిసి, నిజపుత్రుల నానా సహస్రసంఖ్యులగు వారల నవారితజవసత్త్వులం దద్వాలుకాపులిన ఖననంబు సేయ నియోగించిన. 407

మ. నరనాథోత్తమునందనుల్ గడఁగి నానాశూలకుద్దాలము
ద్గరకాష్ఠాదుల సయ్యుదగ్రసికతౌఘం బంతయున్ సప్తవా
సరముల్ వాయక పాయ గ్రొచ్చి నడుమఁ సంసుప్తుఁడై యున్న యా
సురవైరిం గని రుగ్రనిశ్వసననిష్ఠ్యూతాగ్నికీలావృతున్. 408

చ. అడరి నిశాతపట్టిసగదాసిపరశ్వధశూలహస్తు లై
తడయక వార లందఱును దానవుదేహము వీఁక వ్రేసియుం,
బొడిచియు నొంప నెంతయును బ్రొద్దున కయ్యసురాధముండు బి
ట్టొడలు గదల్చి నీల్గి వివృతోగ్రముఖుం డయి యావులించినన్. 409

ఉ. బోరన విస్ఫులింగములు వొడ్మఁగఁ దన్ముఖనేత్రనాసికా
ద్వారములందు వెల్వడియె దారుణవహ్నిశిఖాకలాపముల్ ;
వారక యందు ప్రమంది రనివార్యులు రాజకుమారు లందఱున్
ఘోరత పాగరుల్ గపిలుకోపమునందు నశించుచాడ్పునన్. 410

వ. ఇట్లు దృఢాశ్వకపిలాశ్వభద్రాశ్వులు దక్కం దక్కిన కొడుకు లందఱుఁ బొడవడంగినఁ గినుకం గువలాశ్వుండు సంహారసమయసప్తాశ్వుండు నుంబోలె నుజ్జ్వలుండయి కదియుటయు, నద్ధానవుండు క్రోధసంరంభంబున సముత్థితుం డై యొక్క శూలం బెత్తికొని కవిసె; నప్పు డమ్మహీవిభుండు దదీయ దేహజనితం బై మండుచున్న యగ్ని

నాత్మీయయోగవిద్యా ప్రభావం బగు జల ప్రవాహంబునం బ్రశాం
తంబు గావించి బ్రహ్మాస్త్రంబు ప్రయోగించిన. 411

క. ఆ దివ్యాస్త్రజ్వలనము
భూదిగ్గగనములు నిండి పొదివి మహోగ్రం
బై దానవు ఘనదేహము
బూదిగ నొనరించెఁ జిత్రముగ నొకమాత్రన్. 412

వ. అంత. 413

క. "సురశత్రుఁడైన ధుంధునిఁ
బరిమార్చితి వీవు జగదభయకారివి; భూ
వర! ధుంధుమారుఁ డనఁగాఁ
బరఁగు" మనిరి సురలు మునులు పార్థివముఖ్యా! 414

వ. ఇట్లు ప్రసన్నులై యింద్రాదిదేవతలు, నుదంకప్రముఖ సంయమి ప్రముఖులు నమ్మహీవరు నభినందించి "నీ కెయ్యది యిష్టంబు సెప్పు" మనిన నతండు బ్రాహ్మణ భక్తియు, ననవరతదానశీలతయు, విష్ణుని తోడి సఖ్యంబును వరంబులుగాఁ దనకుఁ గోరిన నట్లు యొసంగి, రాక్షసనివోతు లైన యతని పుత్రులం బునర్జీవితులుగాఁ బ్రసాదించి, వార లందఱు నిజనివాసంబులకుం జని; రంతఁ గువలాశ్వుండును విజయోల్లాసభాసితుం డై, యుదంకు నిజాశ్రమంబున కనిచి, కుమార సహస్రంబుతో నిజపురంబున కరిగి, వారాంగనానృత్యగానవిశేషంబు లాలోకించుచు రాజధానిం బ్రవేశించి, సముజ్జ్వలసామ్రాజ్యసౌఖ్యంబు లం బరంగుచుండె" నని మార్కండేయుండు ధర్మరాజునకుఁ గువ లాశ్వుండు ధుంధుమారుం డైన విధంబు సెప్పెనని వైశంపాయ నుండు జనమేజయున కెటింగించినతెఱంగు. 415

క. చరమయుగ చలిత ధర్మ
స్థిరీకరణచతుర చరిత! ధీగుణలీలా
పరికరపరిచితనయవి
స్తర! వితరణవివర జైకదానవినోదా! 416

మాలని కరివరకిరికూర్మక్ష్మాధరాధీశతుల్యో
ద్ధరణగుణధురీణోద్దండబాహార్గళాగ్ర
స్ఫురితనిఖలగోత్రాభోగభాగ్యైకభోగా!
తరుణరుచిర మూర్తీ! ధర్మతంత్రానుపర్తీ! 417

గద్యము. ఇది సకలసుకవిజనవినుత నన్నయభట్టప్రణీతంబైన శ్రీమహా భారతంబునం దారణ్యపర్వంబున యక్షయుద్ధంబును, గుబేర దర్శనంబును, నర్జునాగమనంబును, బాండవులకడ కింద్రుండు సనుదెంచుటయు, నర్జునుండు నివాతకవచ కాలకేయ పౌలోమ వధప్రకారం బెటింగించుటయు, నాజగరంబును, బాండవులు గామ్యక వనంబునకు వచ్చుటయుఁ, గృష్ణ మార్కండేయాగమనంబును, బ్రాహ్మణ ప్రభావ కథనంబును, సరస్వతీగీతయు, వైవస్వతు చరితంబును, గల్మాంత ప్రకారం బును, యుగధర్మకీర్తనంబును, వామ్యాశ్వహరణంబును, నింద్రద్యుమ్నోపాఖ్యానంబును, ధుంధుమార చరితంబును నన్నది చతుర్థాశ్వాసము.

శ్రీ

గణేశశారదా గురుభ్యో నమః

శ్రీ మదాంధ్ర మహాభారతము

ఆరణ్యపర్వము - పంచమాశ్వాసము

శ్రీ యువతీప్రియ! నృపనా
రాయణబిరుదాంకభీమ! రమణీయగుణ
శ్రీయుత! నిర్మలధర్మప
రాయణ! రవితేజ! రాజరాజనరేంద్రా.

ధర్మరాజునకు మార్కండేయుండు పుత్రున కుండదగు గుణంబులం దెల్పుట

వ. అక్కథకుండు శౌనకాది మహామునులకుం జెప్పె; నట్లు బహుభంగుల మార్కండేయుండు వివరింప బుణ్యకథావిశేషంబులు విని సంతుష్ట హృదయుండై కౌంతేయపూర్వజుండు మఱియు నమ్మునీంద్రున కిట్లనియె. 2

సీ, "సమధికదర్పదుర్జయములై నిగిడెడు
నింద్రియంబులఁ గుదియించి తెచ్చి,
మనసుపొందున నిడి; మన సహంకారంబు
పొజ్జకుఁ బాపి, సద్భక్తియుక్తి
నెరయంగ ననిశంబు నిజభర్తృకుక్రూష
యందు సమాహిత యైన వనిత
యఖిలలోకోత్కృష్ట యని యెడ్డు నూహింతు;
నరయఁ బతివ్రత లైనవారి

తే. చరిత మత్యంతధర్మసూక్ష్మంబుఁ, గరము
దుష్కరముగాదె తలఁప నిర్ధూతదురిత!

యట్లు గావున విన వేడ్క యయ్యెఁ జెప్ప
వయ్య పుణ్యసతీప్రభావంబు నాకు.

వ. మఱియుఁ దల్లిదండ్రు లిరువురయందును బుత్రనిమిత్తం బైన
యాయాసం బెవ్వరి కెక్కుడు? వారలయెడం బుత్రుం డెట్టివాఁడు
గావలయుఁ? హీనయోనిజాతుఁడైన పురుషుం డేమి తెఱంగునడ
వడిం బరమధార్మికుల లోకంబులు వడయు? నివియును వివరింప
నీవ యర్హుండ''వనిన నమ్మహాముని యమ్మహీపతి కిట్లనియె. 4

సీ. "జతనంబు మిగుల మాసములు దొమ్మిది యుద
రంబునం గరము భరంబుతోడ
భరియించి, పదపడి ప్రాణసంశయదశ
నొంది, పుత్రునిఁ గాంచునెందుఁ దల్లి;
తపములు యజ్ఞముల్ దానముల్ వ్రతములు
దేవతా సజ్జన సేవనములుఁ
గావించుఁ బుత్రునిఁ గామించి జనకుఁ డి
ట్లిరువురపాటును సరియె తలఁపఁ;

తే. ననయుఁ గని తల్లిదండ్రులు దమకు నతడు
భక్తుఁ డగుటకు, ధర్మానురక్తుఁ డగుట
కాసపడుదురు; వినుమట్టియాస సిద్ధి
బొందఁ జేయునతడెఁ చువ్వె నందనుండు. 5

క, జననియు జనకుఁడు నెవ్వని
యనువర్తనమునఁ బ్రియంబు నందుదు రెవఁ ద
త్తనయుఁడు ధర్మముఁ గీర్తియు
ననూనముగఁ బొందు, బడయు నక్షయగతులన్. 6

—: మార్కండేయుఁడు ధర్మజునకుఁ బతివ్రతామాహాత్మ్యంబు నెప్పుట:—

వ. మఱియు నిజభర్తృశుశ్రూషయందు నిత్యాసక్త యయిన పతివ్రతకు
నఖిల యజ్ఞ దాన తపఃఫలంబులు సులభంబు లగు; నొక్క యితి
హాసంబు నెప్పెద; నందు నీ యడిగిన యర్థంబు లన్నియుఁ దేటపడు
నాకర్ణింపుము; కౌశికుం డను బ్రాహ్మణుండు ధర్మతపశ్శీలుండు.

సంతతాధ్యయనతత్పరుం డయి యొక్క విశిష్ట గ్రామంబుననుండు;
నతం డొక్కనాఁడు గ్రామసమీపంబునం దొక్క వృక్షమూలంబున
నాసీనుండై వేదంబులు గుణియించుచుండం దదీయశాఖాగతంబైన
కొక్కెర యొక్కం డాతనిపై రెట్ట వెట్టిన, నమ్మహాద్విజుం డలిగి
చూచుటయు, నది యప్పుడ నిశ్చేతనంబై నేలంబడినం గనుంగొని
యతఁడు. 7

క. "అక్కట! నా హృదయము గడు
నక్కటికము లేని దయ్యె; ననిమిత్తమ యీ
కొక్కెర నిటు సేసితి; నా
కెక్కడి శాంతి?" యని వికలహృదయుం డగుచున్. 8

వ. పెక్కుభంగుల వగచి మధ్యాహ్నం బగుటయుఁ గృతాహ్నికవిధా
నుండై గ్రామంబున కరిగి. యందు శుచు లైన విప్రగృహంబుల
కరిగి, భిక్షాచరణంబు సేయుచు నందొక్క పుణ్యగృహంబువాకిట
నిలిచి, 'భిక్షాం దేహి' యనుటయు, నాయింటి యవ్వయు నతిసంభ్ర
మంబున భిక్ష యిడుటకుం బాత్రశోధనంబు సేయునెడ. 9

ఉ. ఆ యెలనాఁగభర్త గడు నాఁకటఁ దూలుచు వచ్చె; వచ్చినం
దోయజనేత్ర సంభ్రమముతోఁ దగుపీఠము వెట్టి, పాద్యముం
బాయక మజ్జనక్రియయు భక్తి నొనర్చి, ప్రియోక్తు లొప్పఁగా
నాయనఁ బ్రీతుఁ జేసె రుచిరాన్నరసంబులఁ జేసి చెచ్చెరన్. 10

చ. కుడిచినపిమ్మటం గుసుమకోమలి విస్తృతసంస్తరంబుగా
నొడికపుసెజ్జ సేసి ప్రియుఁ డొయ్యన యందు శయింపఁ దమ్ములం
బిడి చరణంబు లొత్తి మదిరేక్షణ యంతటిలోఁ దలంచె ము
న్నడరఁగ భిక్షకై నిలిచినట్టి మహీసురముఖ్య నాత్మలోఁ. 11

వ. ఇట్లు దలంచి భిక్ష గొనుచుం జనుదెంచిన నమ్మగువం జూచి కౌశి
కుండు రోషరంజితలోచనుం డగుచు ని ట్లనియె. 12

క. "అడిగినయప్పుడ చెచ్చెరఁ
గడపినఁ బో నవ్వ! యేను? గడుదుర్మతి వై

పడఁతి! నను నిలిపి భిక్షుం
బిడక కడు నవజ్ఞ సేసి తేల మదమునఁ?'' 13

చ. అనినఁ బ్రతివ్రతాతిలక మాతని కిట్లను "నయ్య! మత్ప్రియుం
డనుపమితక్రుధా కలితుఁడై చనుదెంచిన, భక్తి నమ్మహా
త్మునకు సపర్య సేయుచు మిముఁ మదిలోనఁ దలంపఁ జాల నై
తి; నిదియుఁ దప్పుగాఁ గొనక ధీరత యొప్ప సహింపఁ గాఁ దగుఁ."

వ. అనిన నమ్మహీదేవుం డప్పతివ్రత కిట్లనియె. 15

ఉ. నీ మగఁ డంతయొక్కఁ డె? మనీషులు భూసురు లింతతక్కువే?
కోమలి! యేల యిట్లు గడుఁ గ్రొవ్వినఁ గానవు లోకవంద్యులన్
భూమిసురేంద్రులఁ; దివిజపుంగవుఁ డాదిగ భక్తిఁ గొల్చుచో
నేమిటనొక్కొ వారు గడు నెల్లిద మైరి నీకు నిచ్చలుఁ? 16

క అవమానితులై ధరణీ
దివిజులు క్రోధాగ్నిశిఖలు దీపించి మహా
ద్రివనద్వీపంబులతో
నవని నయినఁ బొడ వడఁతు రప్రతికారుల్. 17

వ. నీ వింతయు నెఱుంగ నొల్లవైతివి గా కేమి?'' యనిన నయ్యంగన
యిట్లనియె. 18

సీ. "దేవతాసములు భూదేవతాకరు లౌట
యేను దన్మాహాత్మ్య మెఱుఁగనయ్య?
యొక విప్రుఁ డలిగి పయోనిధిజలము ల
పేయముల్ గాఁగ శపింపఁ డెట్లు?
దండకవిషరియంబు దగంబు సేయండె
యలుక మై నొక్కమహాద్విజుండు?
వాతాపి యను దైత్యవరు ప్రమింగి యజీగించు
కొనఁడె భూదేవుఁ డొక్కొరుఁడు గినిసి?

తే. ధరణి మటీయును బెక్కువిధంబులందు
బ్రహ్మవిదులైన బ్రాహ్మణప్రభులమహిమ

వినమె? యెటీఁగి యెటీంగి సద్వినుతచరిత!
కొఱవిగొని వెట్టిసే తలగోఁకి కొనఁగ? 19

వ. నా తెఱంగు సెప్పెద నా కర్ణింపుము. 20

తే. పతియచూవె నాపాలికిఁ బరమదైవ;
మేను వాఙ్మనఃక్రియలఁ దద్ధితమ యెపుడుఁ
గోరియెనరింతు; దీనిమిగులఁగ నొండు
ధర్మ్మవులు గాన నెందును దలఁచి చూచి. 21

వ. నీ వతిక్రోధనుండ వగుటయు నెఱుంగుదు; నీ కోపంబున నొక్క కొక్కెర నిహతంబయ్యెం గాదె? యిది మదీయ పాతివ్రత్యమహిమం జేసి కాంచితింగాన క్రోధంబుగొని యాడుట లగ్గ గా"దని యిట్లనియె.

తే. క్రోధమోహనామకులైన ఘోరశత్రు
లిరువు రెరియించుచుండుదు రెపుడు నరుని
యంతరంగ; మయ్యుభయంబు నడఁపకున్నఁ
గలదె యూరక బ్రాహ్మణ్యగౌరవంబు? 23

సీ. ఎవ్వఁడు సత్యంబు నెప్పుడుఁ బల్కు, హిం
సావిదూరుఁడు, గురుజనహితార్థి,
యింద్రియంబుల నోర్చి, యెల్ల వారలఁ దన
యట్ల కాఁ జూచుఁ ధర్మ్మాభిరతుఁడు,
కామంబు దగులండు, కర్మ్మంబు లాఱును
సముచితసంప్రయోజ్యత నొనర్చు,
నట్టిపుణ్యాత్ముని ననఘు బ్రాహ్మణుఁ డని
యనిశంబుఁ గీర్తింతు రమరవర్య;

ఆ. లార్జవంబు, శమము, నధ్యయనంబును,
బరమధనము సువ్వె బ్రాహ్మణునకు;
ధర్మ్మగతికి నివియ తగుసాధనంబులు,
వేదవిహితముఖ్యవిధులు నివియ. 24

వ. ధర్మ్మంబు బహుమార్గదృష్టం బయి సూక్ష్మం బయి యుండు; నీవు కేవలస్వాధ్యాయ పరుండవు గాని ధర్మ్మసూక్ష్మత యెఱుంగవు;

గావునం దడయక మిథిలానగరంబున కరుగు; మందు జితేంద్రియుం డును, సత్యనాదియు, మాతాపిత్రభక్తుండును నయినవాఁడు ధర్మ వ్యాధుం డను కిరాతుండు నీకు నఖిలధర్మంబులు నెఱింగించి, సంశ యచ్ఛేదంబు సేయు; నాదెసం బ్రసన్నుండ వగునది; వనితలకుం బరిజ్ఞా నంబు లేదు గావున వా రెట్టి యపరాధంబు సేసినను సహింపవలయుఁ గదా" యనినఁ గౌశికుం డి ట్లనియె.

క. నను దూఱుం దగు; నీకత
మున నా చిత్తము ప్రశాంతిఁ బొరసె; బురంధ్రీ
జనవినుత! పో వచ్చెద;
ననుపమశోభనసమృద్ధుఁ లయ్యెడు నీకున్." 26

—: కౌశికుం డను బ్రాహ్మణుఁడు ధర్మవ్యాధునియొద్దకుఁ బోవుట :—

వ. అని యా ప్రణంబ యమ్మహాద్విజుండు ధర్మవ్యాధదర్శనలాలసుం డై కదలి పతివ్రత యెఱుకకు విస్మయం బందుచుఁ, దన్నుం గృతాపరాధునింగాఁ దలంచుచు, ననేక నగరగ్రామంబు లతిక్ర మించి చని యనుపమానశోభాసనాథంబయిన మిథిలా నగరంబు సొచ్చి, రాజమార్గంబు దటిసి, యచ్చటి జనంబుల ధర్మవ్యాధుం డున్న యెడ నడిగి వా రెఱింగింప నట యేఁగి ముందట నల్పమృగ మాంసఖండఁబు లంగడిం బచరించి యమ్మ్రుచున్న వాని, నవిరత విక్రయాగతజనసమావృతు, నక్కిరాతుం గని, యతిజుగుప్సితం బయిన సూనాపణంబు సేరనొల్లక తొలంగి యొక్క యెడ నుండె; నంత. 27

ఆ. వాఁడు నతని రాక పోఁడిగ నిజబుద్ధి
నెఱిఁగి యతని యున్న యెడకు వచ్చి
పరమభక్తి మ్రొక్కి ధరణిసురేశ్వరుఁ
గుశల మడిగి ప్రియము గొనలు నిగుడ. 28

చ. "అనఘ! పతివ్రతాతిలక మైన నితంబిని నా తెఱంగు సె
ప్పినఁ జనుదెంచి తీవు ననుఁ బ్రీతిఁగనుంగొన; నీమనోరథం
బును మదిలో నెఱుంగుదుఁ; బ్రమోదముఁ బొందితి; రమ్మ మద్గృహం
బున" కని పల్కి తోడుకొనిపోయె నతండు మహీసురోత్తమున్. 29

వ. కౌశికుండును ధర్మవ్యాధునెఱుక కచ్చెరువంది, పతివ్రత యొఱు
కయుం దలంచి, "యిది రెండవు నాశ్చర్యంబు గంటిఁ బో" మ్మని
తలంచుచుఁ దదీయభవనంబున కరిగి వానిచేతం బూజితుం డయి
యిష్టకథా ప్రసంగంబున నుండి యతని కిట్లనియె. 30

తే. "నీవు గడు ధర్మవిదుఁడవు; జీవహింస
జీవనంబుగ నడచుట శిష్టపథ మె?
యకట! యీఘోరకర్మంబునకు మదీయ
బుద్ధి దద్దయు దుఃఖంబు వొందె నిపుడు" 31

వ. అనుటయు లుబ్ధకుం డిట్లనియె "బ్రాహ్మణులకుఁ దప స్స్వాధ్యాయ
సత్యశౌచబ్రహ్మచర్యంబులును, రాజులకు దండనీతియు, వైశ్యులకుఁ
గృషిపశుపాలనవాణిజ్యంబులను, శూద్రులకు శుశ్రూషయు నెట్లు
పరమధర్మంబయి చెల్లు, నట్ల మాకును మృగయోపజీవనంబు పరమ
ధర్మంబు; విశేషించి యిది వంశక్రమాగం బయిన యాచారం;
బదియునుం గాక యీ దేశంబునకు రాజైన జనకుండు నిజధర్మ
తత్పరుం డయి సకలవర్ణధర్మరక్షణంబు వదలకుండు; నట్లు గాన
యాత్మకర్మంబులు విడుచు టానిం దన పుత్రుఁడైనను దండితుం
జేయుఁ; గావున నేనును నిజకర్మపరిత్యాగంబు సేయ నోడుదు;
నీదృశప్రవర్తనుండ నయ్యాను. 32

తే. జీవహింస యెన్నండును జేయ ననఘ!
యొరులు సంపి తెచ్చినమాంస మొనర విలిచి
తగినవెల కమ్మి బ్రతుకుదుఁ దద్ధనమున;
నమల మాంసంబు; శాంతియ నాధనంబు. 33

చ. వినయము విస్తరిల్ల గురు వృద్ధ జనాతిథి విప్ర దేవతా
ర్చన లొనరింతు; సత్యమును శౌచము నేమఱ; నీగి మన్ననం
దనుపుదు; భృత్యబంధుతతిఁ దాల్మి వహింతు; నసూయఁ జేయ; నెం
దును మదిఁ దృష్ణ సొన్పఁ; బరదోషకథావిముఖుండ నెప్పుడున్. 34

క. సతతోపవాపనియమ
వ్రతములఁ జరియింతు; నేకవనితా ప్రియుఁడన్;

ఋతుకాలరతుఁడ; నిందా
స్తుతులందు మనంబు నాకుఁ దుల్యత నుండున్. 35

వ. అ ట్లగుటంజేసి హీనయోనిజుండ నయ్యును నిర్మలుండ నైతిం; బ్రసంగవశం బున నింత సెప్పఁబడసె; నీవు ధర్మబోధార్థంబు నాయున్న యెడకుం జనుదెంచితి గావున నీకు ధర్మవిశేషంబు లెఱింగించెద; నవధానతత్పరుండ వయి యాకర్ణింపుము. 36

—: ధర్మవ్యాధుఁడు కౌశికునకు ధర్మవిశేషము లెఱిఁగించుట :—

క. తన కులధర్మము విడువక
మనుట,పరమధర్మ మండ్రు మాన్యులు; చిత్తం
బునఁ గృప గలుగుట ముఖ్యపుఁ
బని; సైరణ వలయు సఖిలభావములందున్. 37

ఆ. విడుపువలయు సకలవిషయవాంఛలయందు;
విడుపుఁబోలుగుణము వెదకియెందుఁ
గానరైరి బుధులు; గలదె పరిత్యాగ
శీలునకు నసాధ్యసిద్ధి యెందు? 38

సీ. సత్యహితాలాపచతురత యర్థంబు;
సంతతసుజనపూజనము వలయు;
విను కామసంరంభవిద్వేషములఁజేసి
మతి గలంగినను ధర్మంబు దప్పఁ
డొక్కొక నడుచు టుత్తమసరణి: య
ప్రియములయందును బ్రియములందు
ధైర్యహర్షంబులఁ దగులక యున్నటి
కల్యాణవర్తనకాంతు లెస్స;

తే. యెగ్గు సేసినవారికి హితము సేఁత
యార్యజనములు గీర్తింతు; రన్యదోష
కారి దన పాపమునఁ దాన కాలిపోవు;
వేఱె వానికిఁ గీడు గావింప నేల? 39

క. ధార్మికులు సలుపు నుత్తమ
కర్మముఁ జెడ నాడు నాస్తికజనము; వినుమా

దుర్మతుల తెఱఁగు గైకొని
ధర్మమునెడఁ బ్రీతి వదలఁ దగదు బుధునకుఁ. 40

క. మది మఱపునఁ బాపము దన
కొదవుటయును బిదప వగచి యొకసగమును, నే
నిది సేయ నింక ననియెడు
మదిఁ బెఱుసగమును నరుండు మలుఁగు నఘుంబున్. 41

తే. పాపముల కెల్ల నెక్కుడు పాతకములు
సువ్వె క్రోధలోభంబులు; సుప్రతాత్మ!
వాని రెంటి జయించినవాఁడుగాని
యెందుఁ బరమధార్మికుఁ డని యెన్నఁబడఁడు. 42

వ. శిష్టచరితంబులు గాని మార్గంబులు గొన్ని తృణసంవృతంబులైన కూపంబులుం బోలెఁ గపటధర్మసంవృతంబులై యుండు; వాని దవ్వులన పరిత్యజించి శిష్టాచారంబుల నడచుట ధర్మలక్షణం"బనినం గౌశికుండు "శిష్టాచారంబు లెయ్యవి? యెటిం గింపు" మనుటయు ధర్మవ్యాధుం డిట్లనియె. 43

సీ. దానంబు, సత్యంబుఁ, దపము, యజ్ఞము, నార్జ
వముఁ, గామలోభాదివర్జనంబు,
గురుజనభ్రూప, క్రోధరాహిత్యంబు,
దమము, సంతోష, మధ్యయననిరతి,
దాంభికత్వములేమి, దైన్యంబు వొరయమి,
యనసూయ, యనవాంక్రియాభియుక్తి,
దలఁపంగ నాద్యమై తనరు ధర్మమ యెప్పుఁ
గొనియాట, నాస్తికగోష్ఠిఁ జనమి,
తే. శీలసంరక్షు, తీర్థసంసేవ, శౌచ,
మఖిలభూతంబులందు దయార్ద్రిఁ డగుట,
మితహితోక్తులు, సంశ్రితమిత్రగుప్తి,
యిన్నియును శిష్టచరితంబు లిద్ధచరిత! 44

క. వినుశిష్టచరిత గైకొని
యనసూయత నడవ నడవ నతఃకరణం
బునఁ బొదలునట్టి సమ్మద
మనఘా ! దుర్లభము సూవె యన్యపథములఁ. 45

వ. కావున శిష్టాచారనియతిం జేసి గురుశుశ్రూష సలిపి కృతాధ్యయనుం డవై పరమ జ్ఞానపరిపక్వంబైన చిత్తంబుతోడం గామక్రోధమహా మకరసంకీర్ణయు, విషయజల పరిపూర్ణయునైన మోహజలధి నష్టలిత ధైర్యం బను తెప్పంజేసి యశ్రమంబున నిస్తరించి కృతార్థుండ వగు" మని మఱియు నిట్లనియె. 46

క. "క్రమమున శిష్టాచార
క్రమ మెఱుఁగఁగ ధర్మమునకుఁ గడు వాటం బై
విమలం బగుఁ జిత్తము స
త్యమును సహింసయును దనకుఁ దావలయులుగాఁ. 47

ఆ. విను మహింస ధర్మవితతి కెల్లను మేటి;
యదియు సత్యయుక్తమైన వెలయు;
ననఘ ! శిష్టచరితలందు సత్యమ కడు
నధిక మనిరి శ్రుతుల నరసి బుధులు. 48

తే. వేదవిహితంబులును, శాస్త్రవిహితములును,
శిష్టచరితంబులును ననఁ జెప్ప నొప్పి
ధర్మములు మూఁడువిధములఁ దనరుచుండుఁ
గడగి యిన్నియు సద్గతికారణములు. 49

మ. అనయంబున్ శ్రుతవంతుఁడై వినుతశిష్టాచారమార్గంబులం
జను పుణ్యాత్ముఁడు దుర్గముల్ గడచి ప్రజ్ఞాహార్మ్యసంరూఢుఁడై
కనుచుండుం బటుమోహపంకజలమగ్నం బైన లోకంబు వీఁ
క నధోభాగమునందు డింది కడు దుఃఖం బొందఁగా నవ్వుచున్" 50

—: ధర్మవ్యాధుఁడు గౌశికున కహింసాస్వరూపంబు సెప్పుట :—

వ. అని పలికి ధర్మవ్యాధుండు మఱియు నిట్లనియె "నయ్యా! నీవు దొలుత నా వర్తనంబు గనుంగొని యిది హింసాబహుళంబు గాదె

యని పలికితివి; దాని కేను దగు తెఱంగు నెప్పితి; నది యట్లుండె;
హింస యిట్టిది యహింస యిట్టి దని విభాగింప నెవ్వరికి నేర నగు?

క. మును తమ చేసిన కర్మం
బునఁ జూవె నభించు భూతములు; సంపెడువాఁ
డు నిమిత్తమాత్ర మింతయె
యని చెప్పఁగ వినమె యంచితాచారులచేఁ. 52

ప. అదియునుం గాక. 53

క. ఫలమూలౌషధిశాకం
బులుఁ బశుమృగతతులు భక్ష్యములుగా భూతం
బుల కజుఁడు సేసె నని య
స్ఖలితంబుగ ప్రేమోయు శ్రుతులు; కాదన వశమే? 54

సీ. అనఘ! యౌశీనరుం డగు శిబి నిజగాత్ర
హింస నింద్రాగ్నుల కిడఁడె మాంస?
మతనికి లే దయ్యెనయ్య యుత్తమగతి?
రంతిదేపుం డను రాజు దొల్లి
యనుదినంబును గోసహస్రద్వయంబుఁ దా
వధియింపఁడే? వేయివత్సరములు;
దురిత మమ్మహితాత్మఁ దొడరెనే? వేదార్థ
నిరతులై యత్యంతనియతు లైన.

తే. ధారుణీసురముఖ్య లధ్వరములందుఁ
బశువుల వధింపరే? తగఁ బరమపుణ్య
గతులు గలుగవె వారికిఁ? గడఁగి యగ్ను
లధికమాంసార్థులని శ్రుతులందు వినమె? 55

క. పితృదైవత కార్యములం
దతిభక్తిని మాంస మిడుట యర్హామనియుఁ, ద
ప్పితృదైవశేషములు స
మ్మతి భోజ్యము లనియు మునుల మతములు గావే? 56

మ. హాలికుం డెంతయు నోజతో దునఁగ సీరాగ్రంబునం జోఁకి ప్రా
ణు లనేకంబులు సచ్చు; హింస యడి యౌనో ? కాదొ ? వేయేల? మ
ర్త్యు లేలం జరియించుచోఁ బదములం ద్రొక్కంబడుం బెక్కుజం
తులు; హింసావిధి గా దనంగ వశమే ? దోషఘ్ను ! యూహింపుమా.

చ. సలిలము, లుర్వి, యాకసము, సర్వము జంతుమయంబు; గావునం
గలుగు నవశ్యమున్ సకలకర్మములందును హింస; హింసకుం
దొలఁగిన దేహయాత్రయును దుర్ఘటమైనటు లుండు; నింతయుం
దలఁపర; హింస సేయ మని తారు తలంతురు గొంద ఱిమ్మహిన్.

క. పనివడి యహింస వ్రతముగఁ
గొని వనమున నున్న మునులకుం దొడరదె హిం
సనము ? తరు మూల ఫల శా
కనిపీడన మదియు హింస గాదొకొ ? తలఁపన్. 59

తే. హింస సేయనివాఁడు లే డిజ్జగమున
నొక్కఁడైనను, దమతమ యోపినట్లు
హింస తెరువున కెడగల్గి యేఁగవలయు;
నదియ చూవె యహింస నా నతిశయిల్లు.

వ. ధర్మంబు బహుప్రకారం బై యుండుఁ; దదీయసూక్ష్మగతి దురవ
బోధంబు; గావున శ్రుతిప్రమాణంబువలనను, వృద్ధాచారనిదర్శనంబు
లను నెఱింగికొనునది. 61

ఉ. భూతహితంబుగాఁ బలుకు బొంకును సత్యఫలంబు నిచ్చుఁ; ద
ద్భూతభయాస్పదం బగు ప్రభూతపుసత్యము బొఁకునట్లు; ప్రా
ణాతురుఁ డైనచోఁ, బరిణయంబునయందును, బల్కు బొంకు స
త్యాతిశయంబ యంద్రు; మహితాత్మక! యిట్టివి ధర్మసూక్ష్మముల్."

వ. అని తెలిపి మఱియు నతండు. 63

క. "ఒప్పెడునది యైనను గడు
నొప్పనియది యైన నిజకులోచితపథముం
దప్పఁ దగ దంద్రు ధార్మికు;
లప్పని నిజభాగ్యవిహిత మని యుండఁ దగున్. 64

క. వినుఁ పూర్వకర్మ ఫలములు
దనకు వశము గాక పొందుఁ దఱిఁతో; వానిం
గనుఁగొన నేరక మూఢుఁడు
దన కాపద యైనచోట దైవము దూఱున్. 65

తే. కార్యఫలములయెడఁ దాన కర్త ననుట
కడు నెఱుంగమిఁ జువ్వె; తాఁ గర్తయేని
తగిలి తనదైన కార్యజాతంబు నెల్లఁ
జెడక ఫలియించునట్లుగాఁ జేయరాదె? 66

వ. అది యెట్లంచేని. 67

సీ. నీతిమంతులు, ధర్మనిరతులు, దక్షులు
నగు వారు సేయుకార్యములు గొన్ని
సిద్ధిఁ బొందవు; దుష్టచిత్తులు క్రూరు లై
చేయఁ గొన్ని విశేషసిద్ధిఁ బొందు;
మూరక యుండంగ నొందుఁ గొందఱు విపు
లార్థముల్ ; గొంద ఱాయాసపడియు
నిష్ఫలారంభు లై నిలుతురు; గొందఱు
వేదవారికిఁ బ్రజ వెల్లు వొడము;

తే. నర్థవంతులు గొందఱు కర్థి నధిక
దానములు ధర్మములు సుव్రతములుఁ జేయఁ
బ్రజలు పుట్టరు; వినుఁ మట్టిభంగి సుమ్ము
కర్మ ఫల మాత్మతంత్రంబు గాకయుండు. 68

క. పురుషుఁడు కర్మాధీనత
నరుఁగక తనవశమ యనిన నాపదలు రుజల్
మరణంబును నివి యేమియు
బొరయక యుండంగ బ్రదుకఁ బోలదె? చెపుమా. 69

ఆ. కర్మవశతఁ జూవె కలుగు దేహము; దేహ
వర్తనంబు కర్మవశతఁ బుట్టు;
దేహపాత మైన దేహస్థుఁడగు జీవు
డరుగుఁ గర్మవిహిత మైన యెడకు." 70

వ. అనినం గౌశికుండు జీవుం డెట్టివాఁ డని యడిగిన లుబ్ధకుం డి
ట్లనియె. 71

—: ధర్మవ్యాధుఁడు గౌశికునకు జీవలక్షణంబు సెప్పుట :—

క. "విను జీవుండు సనాతనుఁ
డనఘుఁడు; నిజకర్మవశత నధ్రువదేహం
బునఁ బొందు; దేహపాతం
బున నెప్పుడుఁ జెడఁ డతండు భూసురవర్యా! 72

క. ఈయొడలు విడిచి పే ఱొక
కాయముఁ గైకొని శరీరి కర్మవశగతిం
బోయి సుఖదుఃఖములు గనుఁ
బాయక వెండియును దేహబంధముఁ బొందున్." 73

వ. అనిన విని బ్రాహ్మణుండు లుబ్ధకునితోడం "బుణ్యపాపానురూపంబు
లయిన దేహబంధంబు లెట్టి" వనిన వాఁ డి ట్లనియె. 74

చ. "స్థిర మగు పుణ్యకర్మమున దేవభవం బగుఁ; బుణ్యపాపసం
కరమున మానుషత్వ మగుఁ; గల్మషముల్ పశుకీటభావముం
బొరయఁగఁ జేయు; నిప్పగిదిఁ బుట్టుచుఁ జచ్చుచు మోహవార్ధిలోఁ
దిరుగుచు నుండుఁ గాని యొకతీరముఁ జేరఁడు జీవుఁ డెన్నఁడున్.

చ. ఇది సకలంబుఁ గాంచి బుధుఁ డెన్నఁడుఁ బాపముపొంతఁ బోక, ని
ర్మదనిరహంక్రియాత్ముఁడును, మత్సరదూరుఁడు నై చరించుఁ బెం
పొదవఁగఁ ధర్మమార్గమున; నొయ్యన ధర్మముతీ పెటింగి తా
వడలఁడు సత్క్రియావిధము: వారక యొక్కొ డొనర్చు ధర్మముల్.

చ. చిరముగ ధర్మముల్ నడపఁ జిత్తము దేఱుఁ; బ్రసన్న చిత్తుఁడై
పరువడి నింద్రియార్థముల భంగులు రిత్తలుగా నెఱింగి, చె
చ్చెర నవి యంతవట్టు నిరసించి తపోదమసత్యశీలతం
బరిణతి నొందుఁ; బొందుఁ బిదపం బరమార్థపదప్రభావముల్." 77

వ. అనిన నమ్మహాద్విజుం డమ్మహామతి కిట్లనియె. 78

ఆ. "ఇంద్రియంబు లనఁగ నెయ్యవి? యవి నిగ్ర
హింపకున్నఁ బాపమేమి దొడరు?
వాని నిగ్రహించువానికి నగు ఫలం
బెట్టి?" దనిన నాతఁ డిట్టులనియె. 79

క. "విను విషయజ్ఞానమునకు
ననయంబును మనసు మూల; మది కామ క్రో
ధనిరూఢ మగుచుఁ బురుషుని
ననిశము నెలయించు నింద్రి యార్థక్రియలన్. 80

సీ. ఇంద్రియార్థంబుల కెలసిన పురుషుండు
గాఢరాగంబునఁ గరఁగుచుండు;
రాగంబువలనఁ దిరం బగు లోభంబు;
లోభి యైన కరుణకు లోను గాఁడు;
మఱి సముద్ధతవృత్తి మరగుఁ బాపక్రియఁ;
దగువారు సెప్పెడి తగవు వినఁడు;
కుజనుల దెసఁ బ్రీతి గొఱలుఁ; దుల్యంబులు
గా కుండు వాఙ్మనఃకర్మభంగు;

ఆ. లిహానునందుఁ బుణ్యహీనుఁ డై చెడిపోవుఁ
బరమునందు దుఃఖభరమునొందుఁ;
గాన యింద్రియార్థగతిఁ బోక సాధుసం
సర్గఁజేసి సుగతిఁ జనుట యెప్పు. 81

వ. ఇంద్రియంబు లన నెయ్యవి యనియు నింద్రియజయసిద్ధియు నీవు నన్నడిగితివి; తత్ప్రకారంబు బ్రహ్మవిద్యా విషయంబు; మాబోఁటి వారికి నవాచ్యం బై యుండు; నైనను నీవు బ్రాహ్మణప్రవరుండవు గావున సదాబ్రహ్మణప్రియం బవశ్యకర్తవ్యంబు; పరమ బ్రహ్మ విదు లయిన బ్రాహ్మణవరులకు నమస్కరించి, బ్రహ్మవిద్యా ప్రపంచం బెఱింగించెద; నపధానపరుండ వై యాకర్ణింపుము. 82

—: ధర్మవ్యాధుఁడు కౌశికునకు బ్రహ్మవిద్యా ప్రపంచం బెఱింగించుట :—

తే. అంబరము వాయు వగ్ని తోయమ్ము ధరణి
భూతపంచక మిది క్రమంబున; మహాత్మ!

శబ్ద సంస్పర్శ రూప రసములు గంధ
సంయుతంబుగ భూతపంచకగుణములు. 83

క. ఒనరఁగ నాకస మాదిగ
ననులోమముతోడ నిమ్మహాభూతము లే
నను బుట్టు; నొకటికొక్కటి
యనయముఁ బ్రతిలోమగతి లయంబునఁ బొందున్. 84

వ. శ్రోత్రంబును, ద్వక్కును, జక్షువును, జిహ్వాయు, ఘ్రాణంబును ననునియ్యేను నింద్రియంబులు; శబ్ద స్పర్శ రూప రస గంధంబులింద్రియ విషయంబు లై యుండు; నింద్రియపంచకంబునకు షష్ఠం బై మనస్సు ప్రకాశిల్లు; సప్తమాష్టమంబు లై బుద్ధియు నహంకారంబును వర్తిల్లు; సత్త్వంబును, రజస్సును దమస్సును గుణంబు లై యుండు; నీ చెప్పం బడిన మహాభూతప్రముఖప్రపంచం బంతయు నవ్యక్తంబను తత్త్వం బునం దావిర్భావతిరోభావంబులం బొందుచుండు. 85

క. అవ్యక్తతత్త్వ మరయఁగ
నవ్యక్తం బయ్యు నిట్టిదై లక్ష్య మగుఁ
సువ్యక్తేంద్రియభూతా
దివ్యవహారార్థలింగదృష్టాకృతి యై." 86

వ. అని చెప్పి మఱియు ని ట్లనియె. 87

తే. "అనఘ! శబ్దాదివిషయంబులందుఁ దగిలి
యిచ్చఁ జరియించు నెప్పుడు నింద్రియములు;
బుధుఁడు దత్స్వభావముఁ దన బుద్ధి నెఱిఁగి
యేమఱక వానిఁ దగఁ గుదియింపవలయు. 88

ఉ. ధీరుఁడు నిర్జితేంద్రియుఁడు దెల్లముగాఁ దనుఁ గాంచు భూతవి
స్తారనిగూఢ మైన పరతత్త్వముగాఁ; దనయందు భూతవి
స్తారము నెల్లఁ గాంచు; సతతస్ఫుటదర్శనుఁ డై, సమగ్రచి
త్సారముఁ బొంది నిర్మలతపంబులయందుఁ జలింప కెన్నఁడున్. 89

క. తప మనఁగ సకలవిషయ
వ్యాపేత మగునట్టి బుద్ధివై భవము సుమీ;

తపమున సుస్థిరుఁ డగు యో
గపరునకుం గలవె యొండు కర్తవ్యంబుల్? 90

క. స్వర్గనరకంబు లింద్రియ
వర్గసమాచరణమునన వచ్చును వినవే;
స్వర్గ మగుఁ దన్నివారణ;
దుర్గతి యగుఁ దన్ని రోధదుర్బలతమెయిన్. 91

చ. అరదము దేహ, మింద్రియము లశ్వము, లాత్ముఁడు సూతుఁ, డమ్మహా
తురగచయంబు ధైర్య మను తోరపుఁబగ్గములన్ దృఢంబుగా
నురవడిఁ బోక యుండ వెర వొప్పుగఁ బట్టినవాఁడు సేమపుం
దెరువున నేఁగు, నప్పరమధీరుఁడు సువ్వె యుదారుఁ డెయ్యెడన్. 92

తే. ఇంద్రియంబులు దివిచినయెడక పాఱు
చుండు మన సెప్పుఁ; దద్వేగ ముడుపకున్న
నెడలి చెడిపోవు బుద్ధి యుదీర్ణపవన
హతిఁ బయోనిధిలోఁ గల మవియునట్లు. 93

క. ఏనింద్రియములు మనసును
బూని తనవశంబ యైనఁ బురుషుండు గదా
ధ్యానసమాధిసమగ్రుఁడు;
వానిం గీర్తింతు రమరవరులున్ మునులున్." 94

వ. అనిన నవ్విప్రుండు సత్త్వరజస్తమోగుణంబుల తెఱం గెఱింగింపు" మనిన నెఱు కిట్లనియె. 95

ధర్మవ్యాధుఁడు కౌశికునకు సత్త్వరజస్తమోగుణముల తెఱంగెఱింగించుట

క. "అతినిందితము తమోగుణ
మతిమోహమయంబు; సత్త్వ మనయంబుఁ బ్రకా
శత నొప్పు; నుభయగుణమి
శ్రితఁ బరఁగు రజోగుణంబు సన్నుతచరితా. 96

మ. అసుఖాకారత, నిద్ర, దైన్యము, విమోహం, బకృతమత్వంబుఁ దా
మసభావంబులు; రాగ లోభ జడతా మానంబు లూహింప రా

జసవృత్తంబులు, ధైర్య శాంతి కరుణా సంతోష విద్యాదు లిం
పెసఁగఁ సాత్త్వికచేష్టితంబులు, నిజం బిట్లాత్మఁ గన్నింతయున్.

చ. అనఘుఁడు సాత్త్వికుం డగు మహాత్ముఁడు బోధనిరూఢి సర్వముం
గనుఁగొని, లోకవృత్తములు గా వని రోసి, సమస్తసంగభం
గనిరతుఁ డై తొఱఁగు మమకారవికార; మహంక్రియాచ్యుతిం
బనుపడి సంయమప్రకటభావన నుత్తమశాంతి గైకొనున్. 98

వ. సత్త్వగుణనిబద్ధుం డగునేని శూద్రుం డైనను జన్మాంతరంబున వైశ్య
త్వంబునొంది, క్రమంబున రాజ భూసురభావంబులు భజించి, భవవిము
క్తుం డగు" నని చెప్పిన నమ్మహీదేవుం డమ్మహానుభావు నభినందించి.

తే. "దేహమున ధాతుసంక్షయదీప్తి డగుచు
వహ్ని యెట్లుండు? శారీరవాయువులకు
నెలవు లెయ్యవి? యవి నాకు నిశ్చయముగఁ
జెప్పు" మనుటయు నిట్లని చెప్పెనతఁడు 100

సీ. "మూర్ధదేశమునకు వర్ధితం బై పర్వు
నాత్మాగ్ని, నాభి దధాశ్రయంబు;
శిరమునఁ బావకాంతరమునఁ జరియించుఁ
బ్రాణుండు, భూతాత్మభావుఁ డతఁడు;
వరుసఁ బ్రాణాపాను లిరువురు నయ్యగ్ని
వెలిఁగింతు రనఁబేతపృత్తు లగుచు;
గుద వస్తితలము లాస్పదములు గా వహ్ని
పరిగతుండగుచు నపానుఁ డుండుఁ,

తే. గడఁగి విణ్మూత్రనిర్గమకారి యతఁడు;
కర్మబలయత్న కారి యై కంఠ తలము
నం దుదానుండు వర్తించు; నఖిలదేహ
సంధులందును వ్యానుండు సంచరించు. 101

క. విను ప్రాణాపానులు న
య్యనలుఁడుఁ బ్రాపుగ సమానుఁ డన్నరసవిపా
చనుఁ డగుచు నాభిదేశం
బున నుండును సకలధాతుపోషకవృత్తిఁ. 102

క. ఇది పరమయోగదర్శన
విదితం: బిప్పాటఁ బవనవిదు లైన మునుల్
వలదక యభ్యాసవిధిన్
ముదమున ధరియింతు రాత్మ మూర్ధతలమునన్. 103

వ. ప్రాణాపానసమాహితుం డై సకల దేహంబులందును జరియించు చున్న పావకుండు జీవాత్ముండు గా నెఱుంగు; మతఁడు జలంబుల నున్న కమలపత్రంబునుంబోలె దేహంబునం దుండియు నిర్లేపస్వరూప దీపితుం డయి వెలుంగు చుండు; నిట్టి జీవాత్ముండ కదా పరమాత్ముండు. 104

క. చేతనగహిత క్షేత్రముఁ
జేతనముం బొరయం జేయు జీవాత్మదళో
పేతుఁడు పరమాత్ముఁడు, వి
ఖ్యాతుఁడు త్రైలోక్యసంప్రకల్పనుఁ డనఘా! 105

క. భూతములయందు వెలిఁగెడు
భూతాత్మని నెఱుఁగుదురు ప్రబుద్ధులు నిత్య
జ్యోతిర్మయు, నవ్యయు న
ద్వైతంబగు బుద్ధి సూక్ష్మధర్మమువలనన్." 106

వ. అని మఱియుఁ గౌశికునకు ధర్మవ్యాధుండు బ్రహ్మవిద్యాప్రభావంబు తెఱుంగు సంప్రయోగరహస్యంబు దెలియ ని ట్లనియె. 107

సీ "తలివి నొందిన బుద్ధిగల మహాత్ముండు శు
భాశుభకర్మములందుఁ జొరఁడు;
క్రమమున సౌఖ్యదుఃఖము లాదిగా నశే
షద్వంద్వములయందు సమత నుండు;
విను మట్టి పుణ్యున కొనరింప వలయు కా
ర్యం బెఱింగించెద; ననుదినంబు
నియతాశియును, జితేంద్రియుఁడు నై పూర్వరా
త్రమ్మున, నపరరాత్రమ్మునందు

తే. యోగధారణనిరతుఁ డై యుఁడ వలయు;
నపుడు బోధదీపంబున నాత్మ నాత్మ
యంమఁ గనుచుఁ నివాతదీపానుకారి
యై వెలుంగుచు, నమృతమయత్వ మొందు. 108

క. కామంబును క్రోధంబును
. నేమఱక జయింపవలయు నెల్లవిధములఁ;
ధీమహిత! యదియ సతత
క్షేమంకర మైన పథము కృతబుద్ధులకుఁ. 109

క. నిత్యముఁ గర్మియుఁ, గర్మఫ
లత్యాగియు నగుట లెస్స, లౌల్యవియోగం
బత్యు త్తమయోగము, ద
త్ప్రీత్యయలతుండుసూవె బ్రాహ్మణుఁడు మహిఁ. 110

చ. అరయఁగ జీవితంబు గడు నస్థిర; మింత యెఱింగి యాత్మ నె
వ్వరిదెసఁ గీడు రోయక ధృవం బగు మైత్రి భజించి, సత్కృ పా
నిరతుఁడు, నిష్పరిగ్రహుఁడు, నిత్యతపస్వియు, నిత్యతృప్తుఁడుం,
బరమశమాన్వితుండు నగు బ్రాహ్మణుఁ డొందు సనాతనస్థితిన్. 111

వ. నీ వడిగిన యఖిలధర్మంబులు సంక్షేపరూపంబున నెఱింగించితి; నింక నెయ్యది వినవల'' తనినం గౌశికుండు "మహాత్మా! వినవలయునవి యెల్లను విశదంబుగా వింటిం; బ్రబుద్ధుండ నైతి; నీవు సర్వజ్ఞుండ పగుట దెల్లం బయ్యె'' ననిన ధర్మవ్యాధుం డతని కిట్లనియె. 112

—: ధర్మవ్యాధుఁడు కౌశికుని దన జననీజనకుల యొద్దకు దోడ్కొనిపోవుట :—

క. "ఏ నిమ్మొయి నుత్తమవి
జ్ఞానోన్నతి వడయుటకు నిజంబగు మూలం
బైనది గల దొక ధర్మము;
భూనుత! యది నీకు దృష్టముగ నెఱిఁగింతుఁ, 113

వ. అభ్యంతర గృహంబునకు ర''మ్మని యతనిం దోడ్కొని చని మనో హరం బై చతుశ్శాలం బై వివిధసౌరభసంవాసితం బైన హర్మ్యంబు నందు మహితాసనాసీను లైన వారిం, దన జననీజనకుల, నభిమతా హారపరితోషితులఁ, బరమాంబరాభరణగంధమాల్యాలంకృతమూర్తుల

నతనికిం జూపి, తానును దత్పాదప్రణామంబు సేసి వారలఁ గుశలం
బడిగిన నయ్యిరువురుం బుత్రున కిట్లనిరి. 114

సీ. ''అన్న! కుమార! నీయట్టి సత్పుత్రుండు
గలుగ మా కేమిటఁ గడమ? సెపుమ;
నీ చేయు ధర్మంబ నీకుఁ దో డయ్యెడుఁ;
బరమాయు రర్థసంపదలుఁ గనుము;
నీచరిత్రంబున నిఖిలవంశముఁ బవి
త్రిత మయ్యె; మానుషదేహ మేల
ధరియించితో కాని, తథ్య మారయఁ బర
దేవత వీవు సందియము పలదు;

తే. వాఙ్మనఃకర్మములఁ బితృవత్సలత్వ
మొక్కరూపుగఁ జలుపుచు మన్నయట్టి
సద్గుణాకరు ని న్నెన్ని జామదగ్న్య
నొకని నెన్నంగఁదగుఁగాక యొరులు గలరె?''

వ. అని పలి; రప్పుడు ధర్మవ్యాధుండు వారిం గౌశికుం జూపి ''యీ
మహాత్ముండు మనలఁ జూచువేడ్క నిట వచ్చె'' ననిన నా వృద్ధు
లతనిఁ బ్రాసత్కారంబులు గావించినం గైకొని యతండు వారలఁ
గుశలం బడిగె; నంత నవ్విప్రునకు లుబ్ధకుం డిట్లనియె. 116

సీ. ''జనుత! వీరు నాజననియు జనకుండుఁ
జూవె; వీరలకు శుశ్రూష సేసి
యిట్టి పరిజ్ఞాన మేను ప్రాపించితి;
నమరులఁ బూజింతు రర్థి నెల్ల
వారును; నొండుదైవంబుల నెఱుఁగ నీ
వృద్ధుల నాపాలివేల్పు లనఘ;
కమనీయఫలపుష్పగంధభూషణవస్త్ర
ములు, మనోహరభక్ష్యభోజ్యములును

తే. వీరి కెపుడు నివేదింతు; వేడ్కఁ బుత్ర
దారసహితుండ నై నియతముగ సేవ

యూచరింతును; వేదముల్ యజ్ఞములు వ్ర
తంబులును వీర నా కను తలఁపు నిజము. 117

తే. జనని, జనకుఁడు, సద్గురుఁ, డనలుఁ, డాత్మ్మఁ
డనఁగ నియ్యేవురును నే గృహస్థుచేత
సుగతి వాంఛఁ బ్రసాదితు లగుదు రట్టి
వాఁడచూవె ధర్మాత్ముండు వసుధమీఁద." 118

వ. అని చెప్పి యి ట్లనియెఁ "బతివ్రతపనుపునంజేసి నీవు ధర్మజ్ఞానా
ర్థంబు నాయున్న యెడకం జను దెంచిన, నప్పతివ్రతవలని యనుగ్ర
హంబున నీకు నెల్లవియు నెఱింగించితిఁ; గాని నీ దెస నాదుచిత్తంబు
ప్రియంపడి యుండదు; నీచేసిన యకార్యం బొక్కటి గల దది
యెయ్యది యనిన. 119

ఉ. ఎంతయు వృద్ధు లై తమకు నీ వొకరుండవ తెప్పగాఁగ న
త్యంతముదంబునన్ బ్రతుకు తల్లిని దండ్రిని నుజ్జగించి ని
శ్చింతుఁడవై సదాధ్యయనశీలత వారియనుజ్ఞ లేక యే
కాంతమ యిమ్మెయిఁ బెడలి తక్కట! నీవు కరంబు క్రూరతఁ.120

ఆ. నీక వగచి వగచి నిర్భిన్నహృదయు లై
విగతచక్షు లై రి వినవె వార;
లరిగి యింక నైన నమ్ముదుసళ్ళ యు
దగ్రశోకవహ్ని నార్పవయ్య. 121

క. నీయధ్యయనమ్మును, సుకృ
తాయాసము నిష్ఫలంబు లై చను గురుసే
వాయుక్తి లేక తక్కినఁ;
జేయుము నాపలుకు; మేలు సేకుఱు నీకుఁ."
122

వ. అనినఁ గౌశికుం డతని కి ట్లనియె. 123

క. ఇది యట్టిద; వీ చెప్పిన
సదమలహిత వాక్యభంగి సకలము వింటిఁ;
వదలక యిమ్మెయిన చరిం
చెద; గురుజనములకుఁ బ్రీతిఁ జేసెద ననఘా! 124

క. నాదైనభాగ్యవశమునఁ
గాదే నీతోడిచెలిమి గలిగెం; బరమా
హ్లాదమనస్కుఁడ నైతి; ను
ద్భోదయముల కెల్ల నింక యుక్తుఁడ నైతిఁ. 125

క. పాపకృతంబగు దుర్గతి
ప్రాపుఁ గనక యుండ ననుఁ బ్రబోధాత్మకలీ
లాపరిణతుఁ గావించితి;
నాపాలిటివేల్ప వీవ నరసుతచరితా ! 126

చ. అనుపమ మెట్టివారలకు నందదు ధర్మపథంబు ధాత్రిలో;
విను పదివేవురం దొకఁడు విశ్రుతధర్మపరాయణుండు గ
ల్గునొ కలుగండొ సందియము; కోరి సనాతనధర్మ మూఁది యె
వ్వనికిని నీకుఁబోలె బుధవత్సల ! యిట్లు చరింప వచ్చునే ? 127

చ. నిను నొకశూద్రుఁగాఁ దలఁప నేర? గుణాకర ! నీ చరిత్రముం
గన మది నద్భుతం బొలసెఁ; గావున నెయ్యది కారణంబుగా
నొనరఁగ నిట్టిజన్మమును నొందితి చెప్పుము; భూతభావివ
ర్తనములయందు నీకు విదితంబులు గానివి గల్గ వెమ్మెయిఁ." 128

వ. అనిన నతనికి ధర్మవ్యాధుం డిట్లనియె, 129

—: ధర్మవ్యాధుఁడు గౌశికునకుఁ దన పూర్వజన్మ వృత్తాంతంబు సెప్పుట:—

క. "జనుత ! నీ వెయ్యది యడి
గినఁ దెలుపుట నా కవశ్యకృత్యము గాదే ?
విను చెప్పెదఁ బూర్వభవం
బున నే నొక బ్రాహ్మణుండఁ బుణ్యచరితుఁడన్. 130

వ. వేదవేదాంగపారంగతుండనై యుండుదు; నాకుం బ్రియసఖుండైన యొక్క రాజపుత్రుతోడి సంగతింజేసి ధనుర్వేదంబును నభ్యసించితి; నొక్కనాఁ డమ్మహీపతి వేఁట వోయిన నేనును నతనితోడఁ జని, వనంబునం బెక్కు మృగంబుల నేయుచుండ నం దొక్క బాణంబు తృణలతాంతరిత దేహుండైన మునివరు నొక్కరుం దాఁకిన, నతండు హా యనుచుం బడియె; నంత నేనును. 131

ఆ. డాయఁ బోయి తీవ్రసాయక విద్ధుఁడై
పొరలు చున్న విప్రవరునిఁ జూచి
తలరి యనునయంపుఁ బలుకులు వలికినఁ
గినిసి యిట్టు లనియె మునివరుండు. 132

ఆ. "బ్రాహ్మణుండ వయ్యుఁ శాపప్రవృత్తి వై
శూద్రకర్మమునకుఁ జొచ్చి తీవు;
గాన నిక్కువముగఁ గ్రవ్యాదజన్ముండ
వగుము మీఁద" ననియె; ననిన నేను. 133

చ. "ఎఱుఁగక తప్పు సేసితి సహింపఁగదే; కడు దుర్భవంబునం
బఱుపకు మయ్య" నావుడుఁ గృపన్ మునినాథుఁడు "దప్ప దివ్విధం;
బెఱుకకులంబునందు జనియించియు ధర్మవు లెల్ల నిమ్మగా
నెఱిఁగెదు; తల్లిదండ్రులకు నెంతయుఁ బ్రీతి యొనర్తు భక్తితోన్. 134

వ. గురుశుశ్రూషంజేసి నీకుఁ బరమశోభనం బగు; జాతిస్మరత్వంబునుం
గలుగు; నపరజన్మంబున బరమబ్రాహ్మణుండ వయ్యెద"వని యను
గ్రహించిన నవ్విప్రుని దేహఁబునందు నాటిన బాణంబు మెత్తన
వెఱి యతనిం దదీయాశ్రమంబునకుం జేర్చితి; నా చేసిన పుణ్యం
బున నమ్మహాత్ముండు నపాయంబు వొందం డయ్యె; నాకు నిట్టి
జన్మంబు నొంద బలసె" నని చెప్పినం గౌశికుం డిట్లనియె. 135

తే. "జన్మమిట్టిది, చరితంబుచంద మిట్టి;
దెన్నఁడును నిట్టి చోద్య మే నెందుఁ జూడ;
నింక జన్మాంతరముదాఁక నేల? యిపుడ
పుణ్యచరితమై నీవు విప్రుఁడవ కావె? 136

ఆ. పాపవర్తనుండు బ్రాహ్మణుం డయ్యును
నిజము శూద్రుకంటె నీచతముఁడు;
సత్యశౌచధర్మశాలి శూద్రుం డయ్యు
నతఁడు సద్ద్విజుండ యనిరి మనులు. 137

క. అనయంబు నాత్మకర్మం
బున నతినీచ మగు భవముఁ బొందవలసెనే
యని నీవు నిరంతరమును
మనమున దుఃఖింపవలదు మహిత చరిత్రా! 138

చ. నిజగుణదోషకర్మముల నెట్టన మేలును గీడువచ్చుఁ: ద
త్ప్రజనితసౌఖ్యదుఃఖములఁ ప్రాజ్ఞులు దుల్యమనస్కులై, మనో.
రుజలును దేహజంబు లగురోగములుఁ, హితధర్మకర్మ భే
షజములఁజేసి పాపుదురు, పర్వము సాత్త్వికదృష్టిఁ జూచుచున్.

ద. ప్రియములు వాయుటయును, న
ప్రియములు వెనఁ బొందుటయును బెల్లుగ నగుఁ; ద
త్ప్రియలందు మూఢమతిఁ హృ
దయతాపము వాయ దెప్పుడు దరికొనుచుండుఁ. 140

తే. వగపు పేర్మి సెవ్వారిఁ వగవఁ జనదు;
చిత్తమున నేమిటిఁ సంతసింప రాదు;
కాన గతమునందును, ననాగతమునందు
పగప రార్యులు సంతోషవంతు లగుచు. 141

క. పగపుసఁ దేజోహీనుం
డగు; నాత్మహితక్రియలకు నతుముఁ డగు; న
వ్వగపు దొఱఁగి యుద్యోగము
దగఁజేయఁగఁ గలుగు సంచితములగు శుభముల్. 142

వ. కావున భూతంబుల సదసత్ప్రికారంబులు గనుంగొని, ధీరుండవై
యుండు" మనిన నా ధర్మవ్యాధుండు "మహాత్మా! నీ చెప్పినయంత
వట్టు నిదర్శనంబులుగాఁ గొని యేను నిఃఖేదుండనై భవిష్యత్కాల
సద్భావంబునందు సమాహితుఁడనై యుండువాఁడ"ననియె; నంత
నా భూదేవుండు. 143

చ. అతులితపుణ్యమూర్తివి కృతార్థుఁడ వెందును నీవు, ధర్మ మూ
ర్జితముగ నెప్పు డేమఱక చేయుచు నుండుము, నిత్యశోభన

స్థితి వెలుఁగొందు, మేను భవదీయసమాగతిఁజేసి ధర్మసు
స్థితమతి నైతి, న న్ననుమతింపు గుణాకర! పోయి వచ్చెదన్."

వ. అని వానికిం బ్రదక్షిణంబు సేసి, వీడ్కొని చని, కౌశికుండు నిజజననీ జనకుల కతి భక్తిశుశ్రూష సేసి కృతార్థుం డయ్యెం; జాండవోత్తమా! నీ యడిగిన తెఱంగునం బతివ్రతా మహాత్మ్యంబును పితృశుశ్రూషా విశేషంబును, హీనవర్ణుం డయినవాఁడు ధర్మంబు సలుపు నుపాయంబును జెప్పితి" ననిన విని ధర్మతనయుండు సంతసిలి మఱియు మార్కండేయు నిట్లని యడిగె. 145

తే. "అగ్ని దేవుండు తొల్లి మహాతపంబు
సేసె నని విందు; నది యేల చేసె? ననఘ!
యంగిరసుఁ డేమికతమున నగ్ని యయ్యె?
నగ్ను లెన్నివిధంబుల నతిశయిల్లు? 146

మార్కండేయుఁడు ధర్మజునకు నంగిరసుం డగ్ని యైన తెఱంగు సెప్పుట

వ. ఇతయు విన వలతు "ననిన నమ్మహాముని యిట్లని చెప్పె" నగ్ని దేవుండు దేవతలతోడి యలుకం జేసి హవ్యంబులు వహింప నొల్లక వనంబునకుం జని బహుకాలంబు ఘోరతపంబు సేయుచు నత్యంత కృశుం డై యాత్మగతంబున. 147

చ. 'అలుక మెయిం దొడంగి విపినాంతరభూమికి వచ్చి యిట్లు నే
వెలుఁగక యున్న చో, భువనవృత్తము సర్వము నిల్చు; నిల్చినన్
జలరుహసూతి వే ఱొకనిఁ జయ్యన నగ్నిపదంబునందుఁ దా
నిలుపక యున్నె? నే నిచట నిల్చుట పోలదు; పోయెదన్ వెసన్:"

వ. అని తలంచి తపంబు సాలించి, నిజపదంబున కున్ముఖుం డయి చని చని, యతికుమున్న బ్రహ్మనియోగంబునం ద్రిలోకంబులకు నగ్ని యై వెలుంగు చున్న వాని నధికతపోవిజృంభితు నంగిరసుం గని భయంపడి యెప్పటియట్ల మగిడి పోవునెడ నంగిరసుం డతనిపాలికిం జనుదెంచి యిట్లనియె. 149

చ. "అనఘ! జగత్త్రయార్చితుఁడ వై తిమిరాపహరుండ వై తగన్,
వనరుహగర్భచేఁ బ్రథమవహ్నిపదంబునఁ గల్పితుండ వై

తనరుదు నీవు; నీ దగుపదంబున నే నిటు లుండ నోడుదుఁ;
ఘనముగ నీవు నీపదము గైకొనవే యవికల్పభావనన్." 150

వ. అనిన నగ్నిదేవుం డిట్లనియె. 151

క. "విను నాకీర్తి జగంబులఁ
బొనుఁగుపడియె; నీవు భువనపూజితవృత్తిం
బనుపడితి గానఁ దగు నీ
కనఘ ! యనలపదము: నాకు నలవడ దింకన్. 152

వ. నీవు ప్రథమాగ్ని వై యుండు; మేను ద్వితీయం బగు ప్రాజాపత్య
నహ్ని నై వర్తించెద" ననిన నంగిరసుండు "దేవా ! యిట్లానతీ
వలదు: ప్రథమాగ్నిత్వంబు నీవ కైకొని, నన్ను నీకుం బ్రథమపుత్రుంగా
నాదరింపు" మనినం బావకుండు దాని కొడంబడియె; నివ్విధం
బున నంగిరసుం డగ్నికి నగ్రతనయుండై యగ్ని సారూప్యంబునం
దేజరిల్లె; నయ్యంగిరసునకు శివ యనుదానికి బృహత్కీర్తియు, బృహ
జ్జ్యోతియు, బృహద్బ్రహ్మయు, బృహన్మనసుండును, బృహన్మంత్రుం
డును, బృహద్భానుండును, బృహస్పతియును నన నేడ్వురు కొడు
కులు మఱియు భానుమతియును, రాకయు, సినీవాలియుఁ, గుహువు,
గర్షిష్మతియు,మహిష్మతియు, మహామతియునన నేడ్వురు కూఁతులుం
బుట్టిరి. 153

క. తనయుఁడు బృహస్పతికి న
త్యనఘుఁడు శఁయుండు వుట్టి, యాగఁబులలో
మునుమును హవిపాజ్యము దాఁ
గొనియెండువాఁడయ్యె నధికగుణయుక్తి మెయిన్. 154

వ. ఆశంయునకు ధర్మపత్ని యైన సత్యకు భరద్వాజుండును భరతుండును
నా నిరువురు గొడుకులుపుట్టి; రందు భరతునకు భారతుం డను కొడు
కును, భారతియను కూఁతురుం బుట్టిరి: భరద్వాజునకు వీర యను
దానికి వీరుండు పుట్టె.

క. వానికి సరయువునకుఁ బటు
భానుండై పుట్టె సుతుఁడు భానుఁ డనఁగ: నా

భానునకు నిశ్చ్యవనుఁ డనఁ
గా నాత్మజుఁ డుద్భవించెఁ గడునుజ్జ్వలుఁ డై. 156

చ. అతనికిఁ బుట్టెఁ బుత్రుఁడు నిరంతర తేజుఁ డుదారకీర్తి, ని
ష్కృతి యనుపేరివాఁడు: వినుకిల్బిషభాజను లైన మానవుల్
సతతము నాకృశాను నతిసక్తమనస్థ్నితిఁ గొల్చి దోషని
ష్కృతి దగఁ గాంతు; రట్లగుటఁ గీర్తిత మయ్యెఁ దదాఖ్య వానికిఁ.

క. ఘనుఁడు రుజస్కరుఁ డనఁగా
జనియించెను నాతనికి; రుజస్కరునకు న
త్యనుపమకాంతిపరుం డై
జనియించెం గ్రోధుఁ డనఁగ జనవరతిలకా! 158

వ. ఆక్రోధునకు రసుండు పుట్టె: రసునకు స్వాహా యను కన్యకయుం గామును డను కొడుకునుం బుట్టిరి: కామునకు నమోఘుండు పుట్టె: నమోఘునకు నుక్థుండుపుట్టె; మఱియుం గాశ్యపుండును, వాసిష్ఠుం డును, బ్రాణుండును, నాంగిరసుండును, జ్యోనసుండును ననువా రేవురు తేజస్వి యైన కొడుకుం బడయుదు మని యనేక వర్ష ంబులు ఘోరతపంబు సేసి మహావ్యాహృతి స్మరణంబు సేయుచున్నంత.

చ. అనలము చాయ మస్తకము నర్కనిభం బగు బాహుయుగ్మముం,
గనక సముజ్జ్వలంబు లగు కన్నులుఁ, జర్మము, కృష్ణవర్ణతం
దనరిన జంఘలుం గల యుదాత్తసుదేహము దేజరిల్లఁగాఁ
దనయుఁడు పుట్టె వాగలకుఁ: దద్దయు నద్భుత మందె లోకముల్.

వ. ఇట్లుపుట్టిన యప్పావకుఁడు పంచజనప్రభవుండు గావునం బాంచజన్యుం డను పేరం బ్రసిద్ధుం డై, దశ సహస్రవర్ష ంబులు దపంబు సేసి, నిజ మస్తకంబున బృహద్రథంతరు లను వారలను, వదనంబున హరిని, నాభియందు శివుని, బలంబున నింద్రునిం, బ్రాణంబుల వాయ్వగ్నులను బాహుయుగదంతపుటంబుల విశ్వభూతంబుల సృజియించె మఱియును.

క. తపుఁ డను వహ్ని నిరంతర
తపోనిరూఢుఁ డయి పంచదశపుత్రుల న

త్యపరిమిత ఘోరతేజో
విపులాత్ములఁ గనియెఁ గపటవృత్తినిపుణులన్. 162

వ. ఆ పదియేవురు సుభీనుండు, నతిభీముండును, భీముండును, భీమబలుం
డును, నతిబలుండు, ననువా రొక్క మొగియును, సుమిత్రుం
డును, మిత్ర వంతుఁడును, మిత్రజ్ఞుండును, మిత్రవర్ధనుండును,
మిత్ర ధర్మ్మండును ననువారొక్క మొగియును, సురప్రవీరుం
డును, వీరుండును, సువేషుండును, సువర్చసుండును, సురహంతయు
ననువారొక్క మొగియును గా నిట్లు మూఁడు మొత్తంబు లై యజ
మానుల యజ్ఞ ఫలంబు లపహరించుచుండుదురు; తత్ప్రశాంత్యర్థం బై
యాగంబులందు నగ్నిచయనంబు సేయునది. 163

తే. అధిప విహగాకృతుల నొప్పు నగ్నిచయన
ము ల యుదగ్ర పక్షాఘాతములను విప్ర
వరుల మంత్రఘోషములను వారు నిహతు
లై భయంపడి చేరరు యజ్ఞభూమి. 164

వ. తపుండు మఱియు సకలయజ్ఞ భాగభుజు లైన పుత్రుల నేవురం గనియె
నం దగ్రజుండు. 165

సీ. వైశ్వానరుం డను వహ్ని చాతుర్మాస్య
విధులందు భూసురవితతిచేతఁ
బర్జన్యసహితుఁడై పరమార్చనముఁ గాంచు;
నధిప రెండగునాలఁ డఖిలమునకుఁ
బ్రభుఁడు ధాత్రై విశ్వసతి యన విలసిల్లు;
వినుము మూఁడగువాఁడు విశ్వమునకు
నాత్మఁ డై విశ్వకుం డన నొప్పు; నాలవు
నతఁడు భూతముల యూహారవితతి

తే. పెలుచఁ బక్వముసేయుట విశ్వభుక్కు
నాఁగఁ బెంపొందు; గోపతినామధేయుఁ
డై సమస్తధర్మక్రియలందు హేతు
వై ప్రశస్తి వహించు నే నగు నతండు. 166

వ. మఱియు భానుం డను వహ్నికి సోమపుత్రియైన బృహద్భాసయందు బలదుండును మన్యుమంతుండును ధృతిమంతుండును నాగ్రయణుం డును నగ్నియు సోముండును నన నార్వురు గొడుకులు, నిళ యను కూతురుం బుట్టిరి; సకల తపఃఫలంబులు నిర్వహించుటకయి పురంద రుండు మను నామధేయుండయిన కొడుకుం బడసె; నమ్మనువు భానుపుత్రియైన నిశాకన్యం బెండ్లియై ప్రాజాపత్యం డను పేరఁ బరఁగి పరమబ్రాహ్మణులచేత నర్చితుం డయ్యె; నిష్విధంబున ననేక వహ్నులు సకలధర్మక్రియాసాధకులై వెలింగిరి; దక్షిణాగ్ని ప్రముఖు లయిన వహ్నులు వాయుహతిం జేసి యన్యోన్యసంస్పృష్టంబు లయ్యె నేనియు, రజస్వలాదిసంకరంబులం బొరసెనేనియు, మృతకజాతకాది సంస్పర్శనంబునం బొందెనేనియుఁ దత్ప్రాయశ్చిత్తార్థంబై యష్టా కపాలేష్టి నేయ వలయు"నని చెప్పి మఱియు మార్కండేయుం డిట్లనియె. 167

క. ఆపుఁ డను వహ్ని యతులిత
రూపసి యయి ముదిత యను తరుణియందు జగ
ద్దీపకు నపారతేజు మ
హాపూజ్యుం గనియె నగ్ని నద్భుతనామున్. 168

చ. అతఁడు త్రిలోకతంత్రము నిరంతరమై చన నిర్వహించుచున్,
శతముఖుఁ డాదియైన సురసంతతి ం బ్రియ మొప్ప హవ్యముల్
సతతము మోచి యిచ్చుచు; భృశం బగు తత్పర మోర్వ లేక సు
వ్రతనిరతుం డధర్వుఁ డనువానికి ని ట్లను నాదరంబుతోన్. 169

వ. "ఏను దుర్బలుండనైతి; నీవు దేవతలకు హవ్యంబులు మోచి యిమ్మని" వానిం బంచి తాను సముద్రంబు సొచ్చి యందు దాఁగు టయు, దేవత లద్దేవముఖుండున్న యెడ రోయం దొడంగిన నబ్జి చరంబు లైన మత్స్యంబులు సురలకు నగ్నిదేవుండు జలధి నుండుట సెప్పుటయుం, గనలి యనలుండు మీలం జూచి "జనంబులు మిమ్ము నిర్దయులై వధియింతురు గావుత"మని శాపం బిచ్చె నప్పుడు.

ఆ. హవ్య వహనమునకు నమరోత్తములు దన్ను
వేయువిధుల నొలసి వేఁడుకొనిన

నెట్లు నియ్యకొనక యెంతయు విసిగి స
మీరసఖుఁడును దనదుమేను విడిచె. 171

వ. ఇట్లు సంత్యక్తశరీరుం డై ధరాతలంబు ప్రవేశించుటయు, నతనిచేత విడువఁబడిన దేహంబువలనం బూయంబున గంధకంబు, నస్థుల దేవదారువును, శ్లేష్మంబున స్ఫటికంబును, బిత్తంబున మరకతంబును, వాతంబునఁ గృష్ణశిలయు, నఖంబుల నభ్రకంబును, స్నాయుసంచయంబునం బ్రవాళంబునుం బుట్టె; నతండు భూగర్భస్థితుండై ఘోరతపంబు సేయుచున్నంత భృగ్వంగిరఃప్రముఖులయిన మహామునులు నిజతపోబలంబున నతనిఁ నాప్యాయనంబు సేయుటయుఁ, దేజస్వి యై ధరణివెలువడి వచ్చి యమ్మహాత్ముం డమ్మహామునులం జూచి తదీయతేజంబు దనకు దుస్సహం బగుటయు భయంపడి క్రమ్మఱ నంబుధిసొచ్చి యడంగిన 172

క. విను జననాయక సంయమి
జనములు వహ్నిపని యంతఁ జాలించి ప్రియం
బున సంచితవిధిసంగ్రహ
మునకై పూజించి రధికపుణ్యు నధర్వున్. 173

వ. అయ్యధర్వాగ్ని తేజంబును, నమ్మును లతనికిం జేయు బహుమానంబునుం, దన్ముఖంబున నమరులు తృప్తు లగు చునికియుం జూచి సహింపక పావకుండు సకలభూతంబులుఁ జూచుచుండ నంబుధి వెలువడి వచ్చి, నిఖిలలోకహితార్థంబుగా నెప్పటి యట్ల హవ్యవహత్వంబు నంగీకరించె; ని ట్లనేకశాఖం బయిన యగ్నివంశంబు ప్రశంసాభాజనం బయ్యె; నగ్ను లెంప జైనను దదాత్మయైన తేజం బొక్కటియ" యని చెప్పిన విని సంతసిల్లి యమ్మహామునికి ధర్మతనయుం డిట్లనియె.

క. "మునినాథ! మహాసేనుం
డనలునకుం గృత్తికలకు హరునకు సుతుఁ డై
న నిమిత్త మేమి తెఱఁగ; గే
వినఁ దగుఁ జెప్పవే సవిస్తరఫణితిన్." 175

వ. అనిన మార్కండేయు డతని కిట్లనిచెప్పెఁ "దొల్లి దైత్యులతోడరణంబు సేసి యోటువడి దేవగణసహితుం డై దేవేంద్రుండు దొలంగి పోయి దానవుల నోర్వనోపుసట్టి మహోసత్త్వం డగు సేనాపతి నెందుఁ బడ యుదునొకో యని యొక్కనాఁడు మానసం బను శైలంబునకుం జని యం దొక్కయెడ నొక్కరుండు కార్యచింతాపరుండై యున్న యెడ.

తే. 'ఒక్కదనుజాధముండు మెట్టో యనంగ
నన్నుఁ జెఱగొనిపోయెను; నన్నలార!
యెవ్వ రిట విడిపించరే? యింతవట్టు
పుణ్యమునఁ బోవ రయ్య కారుణ్యబుద్ధి'

వ. అని యిట్లు సువ్యక్తంబైన వనితావిలాపంబు వీతెంచినం బురంద రుండు నిజాంతరంగంబు గరుణాతరంగితం బగుటయు "నోడ కోడ కిదె యేను వచ్చితి" ననుచు నద్దిక్కునకు నడచి, ముంబట నతిభయం కరాకారుం, బటుగదాహస్తు, నభ్రచలిత విద్యుల్లతారుచిరమూర్తి యైన దాని నొక్క కన్నియం గొని గగనతలంబునం బఱచువానిం, బ్రబలవలాహకనీలదేహుఁ, గేళి యను దానవు గని సంభ్రమస్తుం డై.

—: ఇంద్రుఁడు కేళి యను రాక్షసునిఁ బాఱఁ దోలుట :—

ఉ. "ఓరి దురాత్మ! యీయబల నోడక యేటికిఁ బట్టినాఁడ? వం
భోరుసనేత్ర విద్యు; మెట్ట వోయినఁ బ్రాణము గొందు, నింక; ఁ బ్ర
స్ఫారగమహీధరప్రకరభంగవిహారధురీణ, ముగ్రదై
త్యారుణరంజితోగ్రకులిశాస్త్రను సు మ్మిదె" యంచు డాసినన్.

మత్తకోకిలము. ఘోరవిక్రముఁడైన కేళియుఁ గ్రోధఘూర్ణితచిత్తుఁ డై
ధీరుఁ డుక్కున నిల్చి యగ్గద ద్రిప్పి వీసవు వైచె; న
వ్వీరుఁడుఁ గద చూర్ణితంబుగ వ్రేసె నాసుగభంగిఁ బోం
గారి దారుణవజ్రపాతరయంబునం బటుహస్తుఁ డై. 180

ఆ. అసుర వీఁక నొక్క మహోచలశృంగంబు
విఱిచి వైచె నమరవిభునిమీఁద;
గోత్రవైరి ఘోరకలిశాభిహతి వ్రయ్య
నడిచె దానిఁ జదల నదరు లెగయ. 181

వ. ఇట్లు తన సాధనంబులు విఫలంబు లైనం దలంకి దానవుం డక్కన్నియ దిగవిడిచి పఱచిన నింద్రుండు దానిం జేరం జని "నీ వెవ్వరి దాన? వీగక్కసుచేత నెట్లు పట్టువడి?" తనిన నది యతని కిట్లనియె; "నయ్యా! యే నరిష్టసేమి యను ప్రజాపతి కూఁతుర; దేవసేన యనుదాన; దైత్యసేన చెలియల; నేనును మాయప్పయుం గేళికా తుకఁబునఁ దండ్రి యనుమతంబు వడసి సఖీజనసహితంబుగా వెడలి యిమ్మానసనగంబు సానుదేశంబులం గ్రుమ్మరుచుండం గేశినామ ధేయుండైన యీ యసురాధముండు. 182

క. పలుమాఱు వచ్చి తన దు
ర్విలసితములు మాకుఁ జూపు వేడుక దోఁపఁ;
బలుకును వేఁలమునఁ; జెనఁటఁ
దలఁచుఁ, గదియు, మదనకదనదళితహృదయుఁ డై. 183

తే. వానిచేష్ట లన్నియు దైత్యసేన కభిమ
తంబు లై యుండు; నాకు నెంతయును దుస్స
హంబుల; వినవే యమ్మయిన యక్కమలనయనఁ
గోరి దానవుఁ డెలయించుకొంచుఁ జనియె. 184

తే. అంతఁ బోక వెండియు వచ్చి యింతసేసె
నద్దురాత్ముఁడు నన్ను; మీ దైన కరుణఁ
దొడరి దుఃఖసాగరమునఁ బడుట దప్పె"
ననిన నయ్యింద్రుఁ డనియెఁ నయ్యతివఁ జూచి. 185

క. "విను దక్షతనూజలు మా
జననియు మీతల్లియును; నిజంబుగ మా కీ
ఎనుజ వయిలి, వనజానన
యొసరంగా వేఁడు నీకు నొకవర మితుఁ." 186

వ. అనిన దేవసేన దేవేంద్రున కిట్లనియె. 187

తే. "అనఘ! మాతండ్రియొక్కానాఁ డతిముదమునఁ
నన్ను నుపలాలనమునేసి "నాతి! నీవు
ప్రథిత పౌరుషుఁ డగు భర్తఁ బడయు" దనియె;
నట్టి వానిని నీవు నా కరయవలయు. 188

చ. అనిమిషదానవేంద్రులకు నైన నజయ్యుఁడు, నుగ్రవైరిభం
జనుఁడు, త్రిలోకరక్షణవళంవదుఁడ న్, భవదిష్టమిత్రుఁడుఁ,
ఘనగుణకీర్తనుండు నగు కాంతునిఁ గోరెద; నామరోథం
బు నెరయ సంఘటించి సురపుంగవ! నన్నుఁ గృతార్థఁ జేయవే.''189

వ. అనిన నింద్రుండు దీనికిం బతి యెవ్వం డగునొకో యని కొడొక
విచారించు నెడ నమ్మోహూర్తంబు రౌద్రనామకం బయి సోమ
సూర్యసంగమకారణం బయిన యమావాస్యాముఖం బై యుండం,
బూర్వసంధ్యారాగరక్తాంబుద ప్రతిబింబపటలపాటలితోదకం బైన
జలనిధి సమీపంబున సమరాసురసమరసంకులంబుగా నరుణకిరణుం
డుదయించుచుండఁ, దత్కాలంబున భృగ్వంగిరఃప్రముఖు లైన
ముసులు వేల్చు హవ్యంబులు మోచికొని హవ్యవహనుండు సూర్య
మండలంబు ప్రవేశించుచుండం గనుంగొని యిది సూర్యసోమాగ్ని
సమాగమం బయిన రౌద్రనామకముహూర్తంబు గాఁన సూర్య
సోమాగ్ని తేజంబున జని యించినవాఁడు దీనిఁ బ్రియుండు గావ
లయు నని మనంబున నిశ్చయించి యతం డాత్మణంబ. 190

క. బాలం దోడ్కొని యబ్జజు
పాలిఁ జని మ్రొక్కి త్రిదశపాలుఁడు "దేవా!
యీబాలనకుఁ గగు వరునిఁ గృ
పాలుఁడవై యొసఁగు" మనినఁ బద్మజుఁ డనియెన్. 191

ఉ. ''దీపితవిక్రమాస్పదుఁడు దీనిఁ వల్లభుఁ డయ్యెడుం ద్రిలో
కీపరిరక్షణప్రముఁడు, గీర్తితమూర్తి యొకండు;•వాఁడ మీ
యాపద లెల్లఁ బాపుటకు నై ధృతిఁ బూను నశేషదేవసే
నాపతిభావముఁ, బిబుధనాయక శీఘ్రమ భావ్య మంతయుఁ.''192

వ. అనినం బ్రీతుఁ డై పితామహు వీడ్కొని యింద్రుండు సనియెఁ;
దదనంతరంబ వసిష్ఠప్రముఖులైన సప్తమహామును లమావాస్యా
హోమంబు సేయ సమకట్టిన నమరు లందఱు హవిర్భాగంబులు
గొనుటకు నాసన్న లగటయు. 193

క. ఆహవనీయముఖంబున
నాహూతుఁ డై హుతాశుఁ డమ్మును లిడఁగా
నాహుతులు గొని దివిజసం
దోహమునకు వరుస నొసఁగఁ దొడఁగెం బ్రీతిన్. 194

సీ. ఆగమయంబున నమ్మునీంద్రులభార్య
లందఱు సుస్నాన మొందఁజేసి,
రనుఁగీయుమాల్యాంబరవిభూషణాద్యలం
కారంబు లొనరించి, గారవమునఁ,
జనుదెంచి పతులకు సమ్మతిం బరిచర్య
సేయుచు మెలఁగంగ, వాయుసఖుఁడు
మెఱతల వాలికమెఱుఁగుఁగన్నులయొప్పుఁ,
దెలినవ్వు మొగముల విలసనంబు,

తే. నడబెడంగులు, నన్నవ నడుములందు
వెలయు వళులభావంబులు, వలుఁదచన్నుఁ
గవల నిక్కును నేర్పుఁ గని కరంగి
మదనమార్గణవిదళితహృదయుఁ డయ్యె. 195

వ. ఇట్లు వికలేంద్రియుం డై వైశ్వానరుం డమ్మునిపత్నులయందుఁ
దగిలిన డెందంబు మగిడింప నేరక వారలం గదియ నప్పళించి గార్హ
పత్యకుండంబునం దావేళించి. 196

చ. అతిపలు దన్నుఁ జేరుటకు నాసపడుం; బొరిఁ జేరుచోట నా
యతవిలసచ్ఛిఖాగ్రముల నల్లన వారల నంటుఁ; గౌతుకం
బతిశయ మై తదంగలత లాదటఁ గౌఁగిటఁ జేర్పఁ గోరుఁ; గం
పితధృతి యై కలంగుఁ గడుఁ బెల్లగు రాగరసంబు మీంపఁగాఁ. 197

వ. అంత నమ్మునీంద్రుల హోమవిధి సమాప్తం బగుటయు, జాతవేదుండు
మదనవేదనాభరంబు సహింప నోపక నిర్జనం బయిన వనంబునకుం జని,
మునిపత్నీ సమాగమంబు దుర్లభంబుగా వగచి, వెగ డంది శరీరంబు
దిగవిడువ సమకట్టునెడఁ, దదీయవల్లభ యైన స్వాహాదేవి దత్పరికారం
బంతయు నెఱింగి, యతనికిం బ్రియంబు సేయునది యై, సప్తమును

లలో నంగిరసుభార్య శివ యనుదాని రూపంబు గైకొని చని, యేక
తంబ యున్న హుతాశనుం గనుంగొని యి ట్లనియె. 198

తే. "అంగిరసుభార్య నేను శివాభిధాన;
ననఘ! నాకును నాతోడియంగనలకు
ననుదినంబును నతిమనోహరవిలాస
మైన నీమూర్తిపైఁ గోర్కి యడరియుండు. 199

ఉ. నీమదిచంద మిట్టి దని నిక్క మెఱుంగక నే మజస్రముం
గామశరాహతిం గలఁగి కాటియ వొందుదు మాత్మలందు; నీ
కామము మాదెసం గలిమి కౌతుకచేష్టలయం దెటింగి యు
ద్దామమనోరథప్రచలితస్థితి నందఱమున్ గ్రమంబునన్. 200

చ. నినుఁ గవయం దలంచి యిట నెమ్మిమెయిం జనుదెంచినార; మిం
పునఁ జెలు లెల్లఁ దొల్త ననుఁ బొమ్మని పంచిన వచ్చితిఁ; మనం
బనవరతానురాగముగ నంగజకేళి భజింపు; మింక నొం
డని యెడ నేసితేనిఁ గుసుమాస్త్రుఁడు సైఁపఁడు నన్ను బావకా!"

వ. అనిన సంతసిల్లి యగ్ని దేవుండు దానిం గైకొనియె; నదియును
నతని నభిమత భోగంబులం బ్రీతునిం జేసి తదీయ తేజో ధాతువు
ధరించి, యచ్చోటు వాసి యాతుణంబ గరుడి యై గగనంబునకు
నెగసి, యతిత్వరితగమనంబున శ్వేతపర్వతంబునకుం జని, యం దొక్క
యెడ శరవణ స్తంబసంవృతం బైన కాంచనకుండంబునందు నిజ
భర్తృశుక్లంబు సంగ్రహించి మఱియును. 202

క. మునిపత్నులరూపులు గై
కొని యిట్టుల వరుసఁ బుష్పకోమలి ప్రియుఁ బ్రీ
తునిఁ జేయుచు రేతస్కం
దన మొనరించుచును వచ్చెఁ దత్కలశమునన్. 203

తే. విను పతివ్రతాతికిలమై వెలయునట్టి
యయ్యరుంధతిరూపంబు నలవరింప
నెట్లు నేరద; కాని యయ్యింతి యున్న
యువిద లార్వురరూపులు నొనరఁదాల్చె. 204

వ. ఉష్ణోదంబున నాఱుమాఱులు ప్రస్ఫుండితం బైన యగ్ని తేజంబున.

—: కుమారస్వామి యవతారము :—

క. ఆదిత్యనిభుఁడు, విపుల
ద్వాదశబాహుండు, షడ్వ్యగనుఁ డఖిలదిశా
రోదోంతరంబు వెలుఁగ ము
హోదారుండై కుమారుఁ డుదయం బయ్యెన్. 206

వ. ఇట్లు శుక్లపక్షంబునం బాడ్యమియందు వీర్యనిషేకంబును, విదియ యందు గర్భవ్యక్తియుఁ, దదియయందు శరీరమాత్రావిర్భావంబు నుం, జతుర్థియందు సకలావ యవసంపూర్ణతయు నై యుదయించిన కుమారుండు పంచమియందు సముత్థితాకారుం డై పేర్చి, త్రిపుర దహనసాధనం బైన హరుకార్ముకం బమ్మహీధరంబునందు నిక్షిప్తం బై యున్నదానిం బుచ్చుకొని, గుణధ్వనిసేసిన. నమ్మహాధ్వని విని కలఁపించి యైరావతసుప్రతీకంబు లను దిగ్గజంబు లయ్యగ్నిభవు మీఁదం బఱతెంచిన, నమ్మహాభుజుం డారెఁటినిం బెనఁచి పట్టి రెండు చేతుల ధరియించి తన సహాజం బైన శక్తి యొక్కకేలం. గ్రీడార్థ కల్పితం బైన కుక్కుటంబొక్క కేలను, బరిపూర్ణమాణనినదం బైన శంఖంబు గరద్వయంబునం దాల్చి, హస్తయుగళంబున గగనంబు వేయుచుం బాణియుగ్మంబు వక్త్రింబుల నిడికొని బాలోచితంబు లైన యంగుళిచర్వణంబులు పొరిఁబొరి నొనరించుచు, నిశితసాయ కంబునం గ్రౌంచపర్వతవిభేదనంబు సేసి, పటుశక్తిపాతంబున శ్వేత శైలశృంగభంగంబు గావించి, చెలంగి, యాఱుముఖంబుల నొక్క పెట్ట ఘూర్ణించినం బ్రళయభైరవారావభీషణం బైన తదాహోణంబున.

మ. కులశైలంబులు గ్రక్కునం గదలె; దిక్కుల్ ప్రయ్యలయ్యెన్; మహీ
పలయం బంతయు దిర్దిరం దిరిగె; దేవవ్రాతమల్ సాధ్వసా
కులతం బొందెఁ; బయోధు లన్నియును సంక్షోభించె; సప్తాశ్వస
ప్తులు ఱిట్టుల్క- రథంబు నల్ దెసలకుం బో నీడ్చె సంభ్రాంతివై. 208

క. ఱట్టి మహోత్పాతంబులు
పుట్టినఁ గని మునులు లోకములకు శుభముగా

నెట్టన శాంతికవిధు ల
ప్పట్టున నొనరించి రాత్మ భావనపరు లై. 209

వ. ఆ సమయంబునం జైత్రరథవననివాసు లైన జను లందఱుం గూడి యంగిరఃప్రముఖ మునీంద్రుల భార్యలకు నగ్నిదేవువలనం బుట్టిన బాలుండు లోకంబులకు నిటి యనరంబు సేయం దొడంగెనని యాక్రోశించిన, నయ్యపవాదంబునకు రోసి యా సప్తమునులలోన వసిష్ఠుండు దక్కఁ దక్కిన యార్వురుఁ దమ వనితలం బరిత్యజించిరి; మఱియును గొందఱు జనులు "వీరేమి సేయును రిన్నిపోకలం బోయినది వహ్నిభార్యయ కాక" యని పలుకం జొచ్చి; రంత నమ్మహామునులఁ బాలికిఁ బావకాంగన నందెంచి యి ట్లనియె

క. "వినుఁ డేను వహ్నివలనం
గనినకుమారుండు వాఁడు; గడు నిజ మిది; మీ
వనితలకుం బని గా; దిటు
సనునే కులసతుల విడువ సత్పురుషులకున్ ?" 211

వ. అని యెంత చెప్పిన వా రొడంబడరైరి; తదనంతరంబ విశ్వామిత్రుండు కుమారు కడ కరిగి, యద్దేవు శరణంబు సొచ్చి, వివిధ వాక్యంబులం బ్రస్తుతించి, తదాదేశంబున నతని జాతకర్మాదివిధు లొనరించిన నది యంతయు నెఱింగి యమరు లెల్ల నమరేంద్రుం గానఁ జని యి ట్లనిరి 212

ఉ. "దారుణ శౌర్యధుర్యుఁ డతిదర్పితచిత్తుఁడు, వహ్ని సూనుఁ; డ
వ్వీరుఁడు నిన్నుఁ గైకొనక వీఁక మెయిం జనుదెంచు నిప్డు దు
ర్వారత నీ పసంబు గొనువాంఛ నవశ్యముఁ; గాన యింతలో
నీరస మెత్తి వాని వధియింపుము చెచ్చెర విక్రమోద్ధతిన్. 213

వ. అ ట్లయిన నీకు నింద్రత్వంబు శాశ్వతం బగు, నేమును బ్రదుకుదుము, లోకంబు లవ్యాకులంబు లగు" ననినం బురందరుం డప్పుడ సప్త మాతృకలం బిలిచి మీరు సని వహ్నిసంభవుండైన కుమారు సమయించి నాకుఁ బ్రియంబు సేయుం"డని పంచినం బనిపూని వారు ఘోరంబుగా నతనిపై నడరి, తదీయ తేజోవిశేషంబునకు భయం బంది, యతని

శరణంబు సొచ్చి "యేము లోకమాతలము, మాయందు నీవు మాతృ భావంబు సేయ నర్హుండ" వనినం గుమారుండు వారి నభినందించి చేకొనియె; నంత నగ్నియు నిజపుత్రుపాలికి వచ్చి యతనిచేతం బూజితుం డయి తదీయరక్షాపర్వతంబున నిలిచె; మాతృగణంబు క్రోధంబునం బుట్టినయది, లోహితాక్ష్య యను భామిని కుమారునకు దాదియై యుపలాలనంబు సేయుచుండె; నఖిలభూతగణంబులుం బలుతెంచి క్రౌంచారిం బరివేష్టించె, నది యంతయు విని కలుషించి.

—: ఇంద్రుఁడు కుమారస్వామిపై నెత్తివచ్చుట :—

ఉ. స్కందునిమీఁద నెత్తి బలగర్వితుఁడై నడతెంచె నుగ్ర ట
స్యందనసామజాశ్వభటసంకులసైన్యసమగ్ర దేవతా
బృందసమేతుఁడై భువనభీకరసంగరకాంక్షు నింద్రుఁ డ
స్ఫందితశౌర్యుఁ డగ్నికణపాతభయంకరవజ్రహస్తుఁ డై. 215

వ. అంత. 216

తరలము. తరళదీధితిపుంజనిర్భరదారుణాయుధపాణు లై,
తెరలఁ ద్రోచి దివౌకసుల్ పటుతెంచి యార్చుచుఁ చాఁ రా
శపణోద్భవు, నాతఁడుం దగ సంభ్రమస్ఫుటరోషవి
స్ఫురితనిష్ఠురహాసజృంభణమున్ వహించినఁ జెచ్చెరఁ. 217

తే. అతనిముఖగహ్వారంబుల నద్భుతముగ
నుగ్రదహనశిఖావళు లుద్భవించి
వేల్పుమూఁకల నరికట్టి వేల్వఁదొడఁగె,
నంత నెంతయు సంభ్రాంతు లగుచు సురలు. 218

క. నీ కింకరులము మమ్మిం
జేకొని కృపఁ గావు మనుచు శిఖినందను న
స్తోకబలు శరణు వేఁడినఁ
జేకొని దాహభయ ముడుగఁ జేసె నతండున్. 219

వ. ఇట్లు దేవతలు కుమారు నాశ్రయించినం జూచి, బలసూదనుండు క్రోధఘూర్ణిత నయనుండై యతనిమీఁద వజ్రంబు వైచిన, నది తదీయదక్షిణపార్శ్వంబుఁ దాఁకిన, నం దొక్క పురుషుండు గాంచన

వర్ణుండును, శక్తిధరుండును, మేషవదనుండును నై విశాఖుం డను
పేరం బ్రభవించె; మఱియునుం గన్యాకుమారగణంబు లనేకంబులు
వుట్టె, నది యెల్లనుం గని జనితభయుండై హరిహాయుం డగ్నిసంభవు
నభయంబని కొలిచె; నంత నమరులు సంతసిల్లి సింహానాదంబులు
నెలంగ షణ్ముఖ శతముఖులం బరివేష్టించి'' రని చెప్పి వెండియు
మార్కండేయుం డిట్లనియె. 220

సీ. అయ్యగ్నిసంభవు, నాయతోన్నతబాహు,
నాముక్తకవచుఁ, దేజోమహిష్ణుఁ
నాలోహితాంబరు, హారికుండలకర్ణుఁ,
గనకరతోన్నజ్వలఘనరీటు,
సంపూర్ణయౌవను, సర్వలక్షణయుక్తుఁ
గని యనురాగిల్లి కమలనిలయ
సాకారయై వచ్చి యఖిలంబుఁ జూడంగ
సితపద్మహస్తయై యతనిఁ బొందె.

ఆ. శ్రీసమేతుఁడై విశేషకాంతిస్ఫూర్తి
నొలసి పూర్ణచంద్రు చెలువు దాల్చి
యున్నవానిఁ జూచి రుత్ఫుల్లలోచన
కుముదు లగుచు మునులు నమరవరులు. 221

వ. అంత షష్ఠదివసంబు సంప్రాప్తం బయ్యె; నందు మహోమును లంపఱు
మహాసేను నతిభక్తిం బూజించి కృతాంజలులై యిట్లనిరి. 222

ఉ. "పుట్టినయాఁటు నాళులకుఁ బొంపిరివోయి జగంబు లన్నియుఁ
దట్టుఁడవై జయించితి ముదంబున; నీదుమహత్త్వ మెంతయుం
జిట్టలు గాదె! యిట్టి యవిజేయుఁడ వింద్రపదంబు నీక కాఁ
బట్టముగట్టి యేలుము కృపఁ మమ్ము నెల్లను వహ్నిసంభవా'' 223

వ. అనినం గ్రౌంచారి వారలం జూచి ''యింద్రపదవి నుండువారి
కెయ్యది కరణీయం"బని యడుగుటయు వారిట్లనిరి. 224

మ. "బలముం దేజము నించి లోకముఁ గృపం బాలించు; టర్కొందు భూ
జల తేజః పవనాంబరంబులకు నస్థైర్యంబు గాకుండ ని

శ్చలశక్తిస్థితి నీగి; శిష్టజనరక్షాదుష్టశిక్షాసమా
కలనం బింద్రపదస్థుఁ డౌ నతనికిం గర్తవ్యముల్ షణ్ముఖా." 225

చ. అనునెడ నింద్రుఁ డిట్లనియె' "నట్లయినం గడు లెస్స; దేవ! నీ
వనిమిషనాయకత్వమునయం దభిషిక్తుఁడ వై ముదంబుతో
ననుఁ బనిగొమ్ము నీదుకరుణఁ దొసఁగెల్లను దీటి యుండెదఁ;
ఘసతరశౌర్యసారుఁడవు గావున నర్హుఁడ వింద్రలక్ష్మికిఁ. 226

వ. ఏను దేవేంద్రపదవి నుండ నోడుదు; నెట్లనిన భవదీయ తేజోవిశే
షంబులు సూచి విస్మితు లై కొందఱు నీకు నింద్రపదవియందు
వేడ్క పుట్టునట్లుగా నేమేనిం జెప్పి నావలనం గొఱగామి కల్పించి
నీకును నాకును భేదంబు సేయం జూతురు; దానంజేసి నీవు కుపితుండ
వై నాయెడం గృప దప్పిన నెవ్వారికి వారింప నలవి గాదు; లోక
భయంకరం బైన విగ్రహంబు ప్రవర్తిల్లుఁ గావున నపశ్యంబును దివిజ
రాజ్యంబు నీక యొప్పించితి; మమ్మెల్ల నేలికొ" మ్మనినఁ గుమా
రుండు నవ్వుచు నిట్లనియె. 227

ఉ. "అట్టివి యేల పుట్టు? సమరాధిప! నీవ జగత్ప్రభుండ వై
యిట్టల మైన తేజము వహించి సుఖంబున నుండు; మేను నీ
చుట్టమ నై భుజాబలముసొంపున నీకెలసంబు దీర్చెదం;
జట్టన నన్నుఁ బంపుము; భృశంబుగ నెయ్యది కార్య మిత్తటిన్."

చ. అనవుడు సంతసిల్లి యతఁ డాతని కిట్లను; "నట్టులైన నీ
పనుపున నేను సత్యహితభాషణ! యింద్రపదంబునందు ని
ల్చి నెగడువాఁడ నై తి; సురసేనల కెల్లను నాయకుండ వై
ఘనభుజ! నీవు సత్కృప జగద్భయ మోచన మాచరింపవే." 229

వ. అనినఁ గుమారుండు మరుత్పతి కిట్లనియె. 230

ఉ. "నీకుఁ బ్రియంబుగా భవదనీకినికిం బతి నయ్యెదఁ; భుజో
త్సేకపటుప్రతాపము లజేయము లై పెను పొందఁ బేర్చి, పూ
రాకృతు లైన నీ రిపుల నందఱఁ దున్మెద; సర్వలోకర
క్షాకరణైక వృత్తి నవికల్పుఁడ నయ్యెదఁ గట్టు పట్టముఁ." 231

వ. అనిన నతిప్రీతుం డగుచుఁ బురుహూతుండు సకల మునిగణసమేతుం డయి తత్క్షణంబ కుమారునకు నఖిల దేవసేనాధిపత్యంబునం దభిషేకం బొనరించె; మునివరుల జయజయశబ్దంబులు, నమరుల సింహనాదం బులు, గిన్నరగంధర్వగానంబులు, మంగళతూర్యరావంబులు, నప్స రోనర్తనంబులుఁ, గల్పతరుకుసుమవర్షంబులు సమకాల ప్రవృత్తంబు లయ్యెం; బరార్ధ్యభూషణమణి ప్రభాలంకృతం బైన కుమారు మౌళి భాగంబున నుజ్జ్వలం బైన ధవళాతపత్రంబు సురగిరిశిఖరోపరిగతం బగు శరచ్చంద్రబింబంబు ననుకరించు చుండె; నట్టియెడ. 232

—: ఈశ్వరుండు కుమారస్వామియొద్దకు వచ్చుట :—

శా. నానాసిద్ధగణంబు గొల్వఁ బరమానందంబునం జంద్ర రే
ఖా నవ్యాంచితమౌళి, భూరిభుజగాకల్పోజ్జ్వలాకారుఁ, డీ
శానుం, డానతశంకరుండు గిరిజాసంయుక్తుఁ డై వచ్చెఁ ద
త్సేనానిం బ్రియసూను షణ్ముఖుని వీక్షింపం గడుం బ్రేమతోన్. 233

వ. ఇట్లు వచ్చి మహాదేవుండు మహాసేనుం గౌఁగిలించుకొని యతనికి విశ్వకర్మ నిర్మితంబును, హేమమయంబును నయిన పుష్పమాలిక యొసంగె" నని చెప్పి మార్కండేయుండు పాండవేయున కిట్లనియె; "వినుము రుద్రుండు మున్ను నిజవీర్యంబు వహ్నియందు సంగ్రహిం చినఁ దత్తేజోవిశేషంబునంజేసి పావకుండు గుమారు నుత్పాదించె; నదియునుంగాక యగ్ని రుద్రుం డని వేదవిదులైన విప్రులవలన వినం బడు; నట్లగుటం గుమారుండు వహ్నిసంభవుండును, రుద్రసూనుం డునునని చెప్పంబడియె; నగ్ని భామిని గృత్తికాఖ్య లైన మునిపత్ను లార్వురరూపంబులు గైకొని ప్రియసమాగమంబు సలిపి శ్వేతశైలం బున రేతస్స్కందంబు సేయుటం బ్రభవించినవాఁడు గావునఁ గార్తి కేయ, స్కందనామంబులం బరగెఁ" నని చెప్పి యిట్లనియె. 234

తే. "అప్పు డింద్రుండు మున్ను దా నబ్జభవు ని
యోగమున సురక్షితముగ నునిచినట్టి
దేవసేనకుఁ గన్యకాతిలకమునకుఁ
జెలువముగ నలంకారంబు సేయఁ బనిచి. 235

వ. సముచితప్రకారంబున నచ్చటికిఁ దెప్పించి, కుమారుం జూచి "యిక్క
న్నియ భవదర్థం బై పరమేష్ఠిచేత సృజియింపంబడియె; గావున
నివ్వరవర్ణిని బరిగ్రహింపు" మనిన నప్పార్వతీనందనుండు మందస్మిత
సుందరవదనారవిందుం డయి యమ్మోహనార్థంబునందు. 236

ఉ. మానితవిక్రమోజ్జ్వలుఁడు మంగళతూర్యనినాద మొప్పఁ, దే
జోనిధి వహ్నిసాక్షిగ, విశుద్ధవిధిజ్ఞుఁడు దేవమంత్రి మం
త్రానుగమం బొనర్పఁగఁ, బ్రియం బెసలార వరించెఁ జారుప
ద్మాననఁ దేవసేనఁ గరియానఁ గరగ్రహణప్రయుక్తితోఁ. 237

ఆ. గుహుఁడు దేవసేనఁ గోరి పెండిలి యైన
యాదినంబు షష్టి యగుటఁ జేసి
యగ్ర్యనీయ మయ్యె నాదివసంబు, లో
కముల నెల్ల వెలసె గారవమున. 238

క. ఏదినమునందు షణ్ముఖు
శ్రీదేవి వరించెఁ గమలచిహ్నితకర యై
యాదివసము పంచమి లో
కాదరణీయంబు, లక్ష్మి కాస్పద మయ్యెన్. 239

వ. ఇట్లు నిహితమంగళాచారుం డయిన కుమారుపాలికిం జనుదెంచి
నిజభర్తలచేతఁ బరిత్యక్త లైన మునిభార్య లార్ద్రులు నధికదైన్య
వివర్ణవదన లై యిట్లనిరి. 240

చ. "కనుకనిఁ దూరి దుర్జనులు గానక చూడక యేము హవ్యవా
హనునకు విన్నఁ గంటి మని యాడిన, నందుల కోడి మమ్మఁ జ
య్యనఁ బతు లుజ్జగించిరి; ప్రియంబున నిం కిట నీవు మాకు నం
దనుఁడవు; మమ్మఁ బ్రోవ విహితంబు గుమారక! నీ కవశ్యమున్.

తే. పుణ్యలోకంబులకుఁ బాసి పొక్కుచున్న
మమ్మఁ జేకొని కరుణాసమగ్రబుద్ధిఁ
బుణ్యగతియందు నిల్పుము; పుత్రభావ
దృష్టి వెలయ మా యలమట దీర్పవయ్య." 242

క. అనినఁ గుమారుఁడు వినయం
బున ని ట్లను "నేను మీకుఁ బుత్రుఁడ; మీరల్
ననుఁ గన్నతల్లులరు; వినుఁ
డనుమానం బేల? మీ ప్రియం బొనరింతున్." 243

సీ. అనుచుఁ జేరువ నున్న యనిమిషపతిఁ జూచి
"పీరికిఁ దగుపదం బారయంగ
వలయు" నావుడు బలవై రి యిట్లనుఁ "జంద్ర
సతు లైన యా దఁకసుతలలోన
రోహిణిపొరువున రుచి నొప్పు నభిజిత్తు
నా నొక్కచుక్క దాఁ బూని యిప్పు
డందరకంటె నత్యంతవల్లభ నేన
యగుదుఁ జంద్రున కని వగచి యర్థిఁ
ఆ. దపము సేయ నరిగెఁ. దత్పదం బది రిత్త
యున్నయదియు, వీరి ననుపు మచట"
ననిన వారిఁ బ్రీతి నతఁడు వీడ్కొలిపినఁ
గడఁగి వారు సనిరి గగనమునకు. 244

వ. నాఁటఁగోలెఁ గృత్తిక లార్వ్వురు నగ్నిదైవత్యం బనం బరఁగు నక్ష త్రం బై దివంబున వెలిఁగిరి; తదనంతరంబ స్వాహాదేవి యేతెంచి కుమారుం గని "నీవు మత్పుత్రుఁడవు; నిత్యంబును నీపాల వసి యింప వలతు" ననినం బ్రీతుం డై యాతం "డట్లకాక, నీవు మత్స మీపంబుననుండి, యేనును నీకోడలుం గొనియాడం బ్రియంబున నుండు" మనియె; నప్పుడు కుమారమాత్మకల్లు హావిషయుఁ, గాళియుఁ, గౌశికయు, నుద్ధతయు, శౌరికయు, నార్యయు, వైధా త్రియు ననువార లేడ్వురుం గుమారు ముందట నిలిచి యి ట్లనిరి.

ఉ. "మమ్ము జగత్త్రియంబునకు మాతలఁగా నొనరింపు మిద్ధ, ము
న్నిమ్ముల నొప్పుమాతృల కెక్కుడు గావుత మేము, సర్వలో
కమ్ముల దొంటిమాతృకలఁ గైకొన కుండుటయుం, బ్రియంబుతో
మమ్మనిశంబుఁ గొల్చుటయు మాకు వరంబుగ నిమ్ము షణ్ముఖా!"

—: కుమారస్వామి నప్తమాతృకల బాలగ్రహంబులఁ జేయుట :—

ఆ. అనిన నగుచు నాతఁ "డట్లేల? వారల
వేర్మి మాన్పఁ దగవె? ప్రీతి నొండు
వరము వేఁడుఁ డిత్తు వదలక" యనుడు నా
స్కందమాత లనిరి గారవమున. 247

క. "అగుఁగాక యట్లు; యే మీ
జగములఁ గల శిశువులకు నజస్రముఁ బీడల్
దగ నొనరించుచు నీకృప
నెగడెద మివ్వరము మాకు నీ వొసఁగఁ దగున్." 248

వ. అనినం గార్తికేయుం డి ట్లనియె. 249

క. "అక్కట! కీడు దలంచితి;
రిక్కార్యము దగవె? యైన నిచ్చితి; మీకున్
బ్రొక్కినఁ, గొల్చిన, వేఁడిన
నక్కటికముతోడఁ గావుఁ డమ్మ శిశువులన్. 250

క. పాయక పదియాఱేఁడుల
ప్రాయమునందాఁక నరుల బాధింపుఁడు మీ;
రాయతమదంశజనితు, న
జేయు నొకని మీకు రక్షఁ జేయం బనుతుఁ." 251

వ అని పలికి యమ్మహాసేనుండు నిజదేహంబునం గాంచనవర్ణం బైన పురుషు నొక్కరు నుత్పాదించిన, వాఁడును బుట్టినప్పుడ యాఁకలి గదిరి తిరిగి నేలంబడి మూర్ఛితుం డైనం, గుమారుండు వానికిఁ జైతన్యం బొసంగె; నతండును స్కందాపస్మారం బను పేరి గ్రహం బై మాతృకాగణరక్షకుం డయ్యె; మఱియు శకునిమాత యైన వినతయు, దైత్యమాత యైన దితియు, గోమాత యైన సురభియు, శునక మాత యైన సరమయు, వృకమాత యైన కరంజయు, సర్పమాత యైన కద్రువయుఁ, గుమారుదాది యైన లోహితాస్యయు మాతృగణ సమన్వితలై గర్భపీడనంబును, శిశుపీడనంబునుం జేయుచు మనుష్యుల వలన బలి మంత్రోపహార దాన తర్పణంబులఁ దృప్తిం బొంది.

బాలురకు నాయురారోగ్యసుఖంబుల నొసంగుదురు; షోడశవర్షంబుల
మీఁదఁ గొన్ని గ్రహంబులు గలవు నెఱ్ఱెద వినుము. 252

సీ. నిద్రించుతఱినొండె, నెఱయమేల్కనియున్న
తఱినొండె, సురసముదయముఁగాంచి
భ్రమసి పల్వలుకులు పలుకుమానవుఁ జోఁకు
నదియ దేవగ్రహ మని యెఱుంగు
నది; శయానుం డయ్యు, నాసీనుఁ డయ్యుఁ బి
త్తశ్రేణిఁ గని యున్మదించెనేని
నది పితృగ్రహము; భ్రాంతాత్ముఁ డై నరుఁడు గం
ధర్వులఁ గనిన గాంధర్వమనియుఁ

తే. బరఁగు గ్రహముచోఁకది; కాలపర్యయమున
గదిరి భ్రమియించెనేని యట్టగ్రహంబు;
వాతపైత్యాదివికృతులవలన బుద్ధి
దప్పుటయు నొక్క గ్రహవైకృతంబ యండ్రు. 253

క. విను డెబ్బదియేం డ్లగుదాఁ
కను మానవులకు గ్రహోపఘాతంబులు గ
ల్గు; ననంతరంబ గ్రహము ల
పని వలవదు; ముదిమి యెల్లపనులకుఁ జాలుఁ. 254

క. నియతి గలిగి, యింద్రియముల
జయించి, శుచు లైన శాంతిసంపన్నులకున్
భయ మొనరింపఁగ లే వ
వ్యయపుణ్యా! గ్రహము లే యవస్థలయందున్. 255

వ. మఱియు నొక్కటి నెఱ్ఱెద. 256

ఆ. ఆదిదేవుఁ డగు మహాదేవుమీఁది నె
వ్వానిమనసు భక్తివై భవమున
నుల్లసిల్లు, నతని నెల్ల కాలముల డ
గ్గఱదు సూవె గ్రహవికార వితతి." 257

వ. అని చెప్పి మార్కండేయుం డి ట్లనియె "నట్లు గుహుండు గ్రహం
బుల నియోగించునెడ నగ్నివల్లభ యల్లన యతనిం జేర నరిగి
యి ట్లనియె. 258

తే "పుత్ర! విను మేను దక్షునిపుత్రి; నన్నుఁ
బావకున కిచ్చె మాతండ్రి బాల్యమునను;
నన్ను నతఁ డొల్లఁ డెంతయు; నాకుఁబతికి
నెపుడు నెడలేని పొందుగా నీ వొనర్పు." 259

వ, అనిన నగ్నిభవుండు "మహర్షిజులు వహ్నియందు హవ్యంబులు
స్వాహాకారకలితంబు లయిన మంత్రంబుల నొసంగువారు; దానంజేసి
నీకఁ బ్రియునితోడి నిత్యసహావాసంబు సిద్ధించు" ననియె; నప్పుడు
సకలమునిగణసమేతుండై చనుదెంచి కమలాసనుండు మహాసేను
నభినందించి యంతకు మున్న సన్నిహితుం డై యున్న మహాదేవు
దెసఁ జూపి యతని కిట్లనియె. 260

ఆ. "అనఘ! యితఁడె త్రిపురహరుఁడు త్రిలోచనుం;
డిదె త్రిలోకమాత హిమనగేంద్ర
తనయ; వీరు నీకుఁ దల్లియుఁ దండ్రియుఁ
జువ్వె; వీరిఁ గొల్వు సుచిరభక్తి. 261

వ. అగ్నిదేవునియందును, దదీయభార్యయందును దారు నిజయోగ
బలంబునంజేసి యావేశించి యీ దంపతులు లోకహితార్థంబుగా
నిన్నుం గని"రని చెప్పినఁ బార్వతీనందనుఁడు సానందహృదయుండయి
సకలలోకగురువులై న పార్వతీపరమేశ్వరులం బూజించి, సంస్తుతించె;
నంత నింద్రుండు గార్తికేయునకు నైరావణభూషణంబై న ఘంటా
ద్వయంబు నొసంగిన, నం దొక్కటి కుమారుండు గైకొని యొక్కటి
పిశాచున కిచ్చెం; బదంపడి. 262

—: ఈశ్వరుండు గుమారసహితుం డై భద్రవటంబు సేరుట :—

మ. తనయుం గౌఁగిటఁజేర్చుచున్, వరుస మూర్ధఘ్రాణముం జేయుచుఁ
జనితానందమనస్కుఁడై గిరిసుతాసంయుక్తుఁ డీశానుఁ డ
య్యనఘుం దోడ్కొని భద్రకేసరిసమా స్రాంచద్రథారూఢుఁ డై
చనియెఁ భద్రవటస్థలంబునకు నైశ్వర్యం బవార్యంబుగఁ. 263

వ. అమ్మహాదేవు ముందట నసేక యక్షగణపరివృతుండునుఁ బుష్పకాధి
రూఢుండునునై కుబేరుండును, వెనుకదెస నమరగణసమన్వితుండును,
నైరావతారోహణో ల్లాసియు నై వాసవుండును, దక్షిణపక్షంబునం
బ్రబలరక్షోయక్షరక్షితుండై యమోఘనామధేయుండైన యక్షో త్త
ముండును, గృతపరికరులైన వసురుద్రాదిత్యులును, దాపలిపక్షంబున
నతిభయంకరవ్యాధిమృత్యుపరివేష్టితుండై పితృపతియును, వివిధ
యాదోనివహసనాథుం డయిన వరుణుండును నడచిరి; మఱియు
మూర్తిమంతంబులై శూల పట్టిస గదా ముసలాదికంబులైన యద్దేవు
నాయుధంబులుఁ, గమండలు ప్రముఖోపకరణంబులుం జనియెఁ;
నయ్యాదిదేవునకు నాసన్నుండయి చంద్రుండును ధవళాతపత్రంబు
ధరియించె; ననిలాగ్నులు చామరహస్తులై కొల్చిరి; విద్యయు,
సావిత్రియు, గాంధారియుఁ, గేశినియు ననుదేవాంగనలు దాఁ
యణిం గొల్చి చనిరి; త్రిలోచనసఖుండైన పింగళుండను యక్షుండు
వృషభకేతనంబు దాల్చె; నివ్విధంబున నభిరామవిభవోదారుండై
కుమారగురుండు భద్రవటంబుసేర నరిగి యచ్చటఁ గుమారుం జూచి
యిట్లనియె. 264

లే. "సప్తమంబైన మారుతస్కంధమునకుఁ
బతివి గమ్మ్ము కుమార! దేవతల కెపుడుఁ
గార్య మెవినఁ జేకొని కడఁకఁ దీర్పు
మనిశమును మత్పదధ్యానఘనుఁడ వగుము. 265

—: కుమారస్వామి మహిషాసురుం జంపుట :—

క. చనుము; శుభంబుల నొందుము
తనూజ!" యని కౌఁగిలించి తద్దయుఁ బ్రేమం
బున నత్తని వీడుకొలుపఁగ
ననఘ! మహోత్పాతములు రయంబునఁ బొడమెన్. 266

ఆ. దెసలు మండె, ధరణి దిద్దిరఁ దిరిగె, న
భ్రంబు బ్రోసె, వడఁకెఁ బర్వతములు;
జగము ఘోరతిమిరసంవృత మయ్యె; ని
ర్జరుల మనము లెల్ల సంభ్రమించె. 267

వ. తదనంతరంబ. 268

మ. ఘనశస్త్రాస్త్రమహోజ్జ్వలంబు, చతురంగ వ్యాప్తభూమండలం
బు, నితాంతోద్ధతఘోరఘోషబధిరీభూతాఖిలాశాముఖం,
బనిరోధోద్ధతవేగ, మగ్రదనుజేంద్రానీక మేతెంచె నీ
సున నీశానముఖామరవ్రతతిపై శుంభధ్భుజారంభ మై. 269

వ. ఇట్లు మహిషాసురసంరక్షితం బయిన దానవసైన్యంబు పఱతెంచి, చుట్టుముట్టి, యసంఖ్యసాయకంబులు, గదా ఖడ్గ ముసల పరిఘ శతఘ్ని ప్రముఖానేకప్రహరణంబులు ప్రయోగించి, నిమిషమాత్రంబున ననిమిషసైన్యంబునం బ్రచురమాతంగ తురగరథికపదాతి ప్రకరంబులం బరిమార్చినం, గార్చిచ్చు పొదివినం జెదరిపఱచు మృగంబులుంబోలె నమరులు సమరవిముఖులై తోలంగం బాఱిసం జూచి, నముచిసూదనుండు సింహనాదంబు సేయుచు నెలుంగెత్తి సురగణంబుల కిట్లనియె. 270

చ. "వలవదు సంభ్రమంబు; గరువంబుగ నియ్యెడ నెల్ల వారు నే
ర్పలవడ వాహనంబులు మహాస్త్రములుఁ గమకట్టి క్రమ్మలుం;
డలవునఁ దున్మి వైవుఁడు దురాత్ముల దైత్యులఁ నేను గల్గఁగాఁ
దలరఁగ నేల మీకు? ధృతి దాల్పుఁడు, నిల్పుఁడు, గెల్పుఁడుక్కునన్."

ఆ. అనినఁ బోక నిల్చి యాహవోత్సాహులై
సకలవాహనాస్త్రశస్త్రచయము
లలవరించి వేర్చి యార్చి తాఁకిరి వసు
రుద్రసాధ్యముఖమరుత్ప్రవరులు. 272

మ. అమరానీకవిసృజ్యమానబహుళ స్త్రాస్త్రాహతిఁ భిన్న దే
హములై ఘోరమదేభముల్ బహుళరక్తాంగంబులై తూలఁ దీ
వ్రమహావాతనిపాతజాతరభసవ్యాధూతసంధ్యారుణా
భ్రములో నా నవశంబులై యొఱలుచుం బ్రత్యర్థిసైన్యంబులఁ.

మ. పురుహూతాగ్రసరప్రభూతబలసంభూతాస్త్రనిర్ధూత మై
తిరిగెఁ బెంపరి దైత్యవాహినుల నుద్వృత్తాశ్వికశ్రేణి, వి
స్ఫురితోత్పాతనమీరవేగవిముఖీభూతాకృతిం దూలు భీ
కరరత్నాకరజాతసంతత తరంగ వ్రాతముం బోలుచుఁ. 274

చ. అడరుచు దేవసైన్యవిశిఖాగ్నిశిఖావలి చుట్టు ముట్టినం
గడుపడి దానవధ్వజినిఁ గల్గు రథప్రకరంబు లన్నియుం
బొడిపొడి యయ్యె, నుగ్రతరభూరిదవానల మెల్లదిక్కులం
బొడమిన వట్టికట్టియలప్రోవులు రూ పఱుమాడ్కి దోఁపఁగన్.

శా. గీర్వాణప్రవిముక్తబాణపటలక్రీడావిలూనంబు లై
గర్వోన్మత్తసురారిశీర్షములు వీఁకఁ డొల్లఁ, గల్పచ్ఛిదా
నిర్విద్ధాంబుదమండలోద్గతమహానిర్ఘాతపాతావధూ
తోర్వీభృద్ఘనగండశైలములతో నూహింపఁ దుల్యంబు లై. 276

వ. ఇట్లు నిహన్యమానంబు లగుచు దైత్యసైన్యంబులు దైన్యంబునొంద నిలువ నోర్వక నలుదెసలం జెదరిన, నొదరి యందఱి నదల్చి, మహిషాసురుం డొక్క మహాశైలంబు వెఱికి యిసుఁగేల నమర్చికొని, యమరుల మీఁదం గవిసినం గని జనితోత్సాహంబైన యసురానీకం బతనిం గూడికొని భేరినిస్వాణపణవాదితూర్యరవంబులు, సింహనాదంబులుఁ జెలంగం గడంగిన నింద్రాదిసురలును జెలుచ సంగరోన్ముఖులై నిలిచిన.

క. మహిషుఁడు బల మేర్పడ న
మ్మహీధరమున్ వైచె నయ్యమరసైన్యముపై
మహి సంచలింపఁగా; దళ
సహస్ర యోధవరు లపుడు సమసిరి దానన్. 278

ఉ. అంతయుఁ జూచి యెంతయు భయంబున నింద్రునిఁ దొట్టి నిర్జరుల్
భ్రాంతమనస్కులై తిరుగఁబడ్డ, మదాంచితఘోరమూర్తియై
యంతకశౌర్యుఁ డాదనుజుఁ డంత దిగంతము దూలఁ గిట్టి, కా
లాంతకుఁ డైన రుద్రుని దథాగ్రము చెచ్చెరఁ బట్టె నుద్ధతిన్. 279

చ. హరుఁడదె చిక్కె నింక నసురాధిపుచేఁ దెగు నంచుఁ బొంగి భీ
కరముగ దైత్యులార్వఁగ, జగత్త్రితయంబును గంప మొందఁగాఁ,
దెరలి మునీశ్వరుల్ గరము దీనతఁ బొందఁగ మందహాసభా
సురముఖుఁడై పురారి నిజసూనుఁ గుమారునిఁ జూచి యిట్లనున్.

ఉ. "చూచితె వీనిసాహసము! శూరత మద్రథరోధి యయ్యెఁ; ని
న్నీచుఁ, గృతాపరాధు, నవినీతు, గతాయువు మృత్యుదేవికిన్

గోచరుఁ జేయు మీవు రణకోవిద !" నావుడు షణ్ముఖుండు గో
త్రాచలసన్నిభుఁడు మహనాంతకు మాటకుఁబొంగి యుక్కునన్.

ఉ. లోహితరత్నభూషణుఁడు, లోహితమాల్యధరుండు, విస్ఫుర
ల్లోహితలోచనుండు, ననలోహితవస్త్రిఁడు, లోహితాస్యుఁడై
యాహవకేళికిం గడఁగునప్పుడు సూడఁగ నొప్పె లోకని
ర్దాహసమిద్ధనూతనపతంగుఁడపోలె రథాధిరూఢుఁడై. 232

ఉ. ఆతని నుగ్రతేజు నిటలాంకితనూభవుఁ జూచి నిర్జర
వ్రాతము భీతిఁ బో విడిచి, వారక ధీరత నిల్చె; నంత ని
ర్ధూతవిరోధి, వైరివధదోహలియై వడి వైచెఁ దీవ్రని
ర్ఘాతముతోడఁబుట్టు వనఁ గాఁ దగు నుజ్జ్వలశక్తి దైత్యవైన్.

క. దారుణకల్పాంతాగ్ని సం
హారంభము దోఁప నమ్మహాశక్తి రయం
బారంగ నడరి దివిజేం
ద్రాదులఁ బొడిచేసెన్. 234

వ. ఇవ్విధంబున మహిషాసురుం బరిమార్చి కుమారుండు మఱియు నమ్మహా
శక్తిం బునఃపునఃప్రయోగంబు గావించుచు ననేక దైత్యదానవశత
సహస్రంబుల వధియించె; నద్దేవుని పారిషదగణంబును గవిసి యసు
రులం దునిమి తూఁటాడి తదీయ రక్తపానమాంసభక్షణంబులుసేసి
మత్తిల్లి యాడుచుం బాడుచు నతనిఁ గొనియాడుచు విహరించె;
నిట్లు వైరులం బొలియించి తిమిరంబు విరియించిన తిమిర వైరియుం
బోలె వెలుంగుచున్న కార్తికేయు నజేయుం జేర నరుగుదెంచి
దేవేంద్రుండితనిం గౌగిటం జేర్చి యిట్లనియె. 285

చ. "కమలభవప్రదత్తవరగర్వితుఁడై మముఁ జీరికిం గొనం
డమితపరాక్రముండు దనుజాధిపుఁ; డీతఁడు నీమహోగ్రకో
పమను దవాగ్నియందు శలభంబునుబోలె నశింపఁజెఁ; వీనిఁ
సము లగువారు వెండియును ఱచ్చిరి నూర్వురు దైత్య లీయనిన్.

క. లోకత్రయంబునఁదను
నీ కీర్తి వెలింగె; నమరనికరము నేనుఁ

ుబింకరులము; గుణర

త్నాకర ! రక్షింపు మమ్ము ననిశము కృపతోఁ." 287

వ. అని పలికె; నప్పుడు పార్వతీసుందరుండు నిజనందనుఁ బునఃపున
రాలింగనంబుల నభినందించి, పురంధ్రప్రముఖులం జూచి, యిక్కు
మారునందు నాయం దెట్లట్లనభక్తికచిత్తుల నై వర్తిల్లుం డని
యాజ్ఞాపించి, యనంతరంబ భద్రవటంబునకుం జనియె; నమరులు
ప్రమదంబునం దమ తమ నివాసంబులకుం జని; రివ్విధంబున. 288

ఉ. ఒక్కదినంబునందు బలియుండు సురారుల నెల్లఁ దున్మి వెం
పెక్కి దయార్ద్రుఁడై యభయ మిచ్చె జగంబుల కెల్ల షణ్ముఖుం;
డిక్కథ భక్తితో వినిన, నెప్పుడుఁ గీర్తన నేసినన్ జనుల్
నిక్కము సర్వదోషముల నీఁగి భజింతురు భవ్యభద్రముల్." 289

వ అని మార్కండడేయుండు సెప్పినఁ బాండవులు సంతుష్టహృదయులై
యమ్మహాత్మునిం బ్రశంసించిరి; వా రివ్విధంబున నభీష్టకథాగోష్ఠిం
బ్రవర్తిల్లునెడఁ గృష్ణవల్లభయైన సత్యభామయుఁ బాంచాలియు
నేకతంబ యొక్కయెడఁ బ్రియంబుల్లాపసంసక్తలై యుండి; రప్పుడు
సత్యభామ ద్రౌపది కి ట్లనియె. 290

—: సత్యా ద్రౌపదీ సంవాదము :—

సీ. "నీప్రియభర్తల, నిర్మలచరితులఁ
బ్రకటతేజుల, లోకపాలనిభులఁ
బార్థుల నీ వొకభంగిన వదలక
చెలువ యెబ్భంగి భజింతు? దగిలి
యొక్కొక్కనికంటె నువిద నీ కేవురు
ననురక్తి లగుట యత్యద్భుతంబు;
నగు మొగంబులు కాని నలినాక్షి నీదెసఁ
బతులకుఁ గింకిరిపాటు లేదు;

తే. వ్రతము పెంపొ, మంత్రౌషధవైభవంబొ,
సరసనై పథ్యకర్మకౌశలమొ, చతుర

విభ్రమోల్లాసరేఖయె. వెలఁది ! నీవి
శేషసౌభాగ్యహేతువు సెపుమ నాకు. 291

క. ఏనును నీవలన నిజము
గా నిది యంతయును నెటిఁగి, కమలదళాక్షుం
బూని వళగతునిఁ జేసి, య
నూనస్నేహాను భోగయుక్తిఁ దలిర్తు.'' 292

క. అని యడిగిన మది నించుక
గినుక వొడమ నడఁచుకొనుచుఁ గృష్ణ మృదులహా
సిని యగుచుఁ, గృష్ణభామినిఁ
గనుఁగొని యి ట్లనియె నిర్వికారాకృతి యై. 293

క. "నను నిట్లు దుష్టవనితా
జనమునటులు గాఁ దలంపఁ జనునే నీకున్ ?
మన సొప్పదు; పురుషో త్తము
వనితవు గాఁ దగవు నీవు వనరుహనయనా.'' 294

వ. అని మేలఁపుఁజందంబున దాని వివేకవిహీనత యెఱుకపడ నాడి
పాంచాలి మఱియు ని ట్లనియె. 295

చ. ''అలయక మంత్రతంత్రవివిధౌషధభంగులఁ జేసి యెంతయున్
వలతురు నాథు లంట మగువా ! కడు బేలతనంబు; దాన మున్
గలిగిన ప్రేమయుం బొలియుఁ గాని, యొకండును సిద్ధిఁ బొంద; ద
ప్పాలఁతుకతోడిమన్కి యహిపొత్తుగఁ జూచు విభుం డెఱింగినన్.

చ. మగువ యొనర్చు వశ్యనిధి, మందులు, మాకులు నొండుచంద మై
మగనిఁకిఁ దెచ్చు రోగములు, మానక మూకజడాదిభావముల్
మొగి నొనరించు; నద్ధురితముల్ దనచేసినచేఁత లై తుదిన్
జగమున కెక్కి నించయును సద్గతిహానియు వచ్చు నింతిన్. 297

క. కావునఁ బతులకు నెప్పుడుఁ
గావింపం దగదు కపటకర్మంబులు; ద
ద్భావ మెఱిఁగి యనువర్తిని
యై వనిత చరింప నదియ యగు నెల్లవియున్. 298

వ. పాండవులయెడ నే నెట్టిదాననై యిట్టి సౌభాగ్యంబు నందితి నది
నీకు నెఱింగించెద నేర్పడ వినుము. 299

సీ. పతు లాత్మ నొండొక్కపడఁతులఁ గలిసిన
నలుగ; నెయ్యెడల నహంకరింప;
మదముఁ బ్రమాదంబు మాని వారికిఁ జిత్త
మేకముఖంబుగ నెల్ల ప్రొద్దు
భక్తి సేయుదు; జూపుఁ బలుకునుఁ గోర్కియుఁ
జెయ్వులు వింతగాఁజేయ నెపుడు;
నమరగంధర్వయక్షాదులం దైనను
బురుషుఁ నన్యునిఁ దృణంబుగఁ దలంతు;

తే. స్నాన భోజన శయనాది సంప్రయోగ
మర్థిఁ బతులకు ము న్నెందు నాచరింపఁ;
బతులు పచ్చిన నాసనపాద్యవిధుల
భక్తితో నేన కావింతుఁ; జనుప నొరుల. 300

చ. తగియెడువేళలందు నియతంబుగ మజ్జనభోజనక్రియల్
దగ నొడఁగూర్తు భర్తలకు; ధాన్యధనంబులు రిత్తమై వ్యయం
బగుటకు నోర్వ నెప్పుడు; గృహ స్థల భాండవిశోధనంబు లి
మ్మొగ నొకనాఁడు నేమఱఁ; బ్రమోదము సల్పుదు బంధుకోటికిన్. 301

క. పలుమాఱుం దలవాఁట
మెలఁగుట, యసతీజనైకమిత్రత, కలహాం
బుల కెలయుట, నగుపలుకులఁ
బెలుచ నగుట నాకుఁ గాని పేరివి మగువా! 302

క. పతు లిచ్చిమెయిఁ బ్రవాస
స్థితు లైనం బుష్పగంధదీప్తాభరణ
ప్రతతి ధరియింపఁ; దద్గత
మతి నగుచుఁ దదాగమంబ మదిఁ గాంక్షింతున్. 303

ఉ. అత్తకు భక్తి గల్గి మది నాయమ సెప్పినమాడ్కి జీవికా
వృత్తము లావహింతు, గురువిప్రజనాతిథిపూజనంబు ల

తు ర్యోత్తమభక్తి నేన తగ నోపి యొనర్తుఁ; బ్రియంబు, దాల్మియుఁ
మెత్తదనంబు, సన్మతియు మేలుగఁ దాల్తు సమస్తభంగులన్. 304

క. కడుమృదువు లనుచుఁ దేకువ
సెడి యెవుడుఁ జరింప; భరతసింహులు గోపం
బడరిన నాశీవిషముల
వడుపునఁ గ్రూరు లని వెఱపు వదలక కొల్తున్. 305

సీ. మాయత్తఁ బృథ్వీసమానఁ, బృథాదేవిఁ
గుంతిభోజాత్మజఁ, గోమలాంగి;
సతతంబు భోజనస్నానాదికములయం
దిమ్ముగఁ బరిచర్య యేన చేసి
సంప్రీతఁ జేయుము; జనవంద్యఁ డగు ధర్మ
తనయునిబంతి నిత్యంబుఁ బసిఁడి
పళ్లెరంబులఁ గుడుచ బ్రాహ్మణు లతిపుణ్యు
లెనిమిదివేలు; సమిద్ధమతులు
తే. యతులు పదివేలు; వారల కనుదినంబు
నన్న పానంబు లర్హాసహాయ నగుచు
నొడికముగ నేన కావింతు; నుచితవస్త్ర
భూషణాదులఁ బరితోషముగ నొనర్తు. 306

వ. మఱియు ధర్మరాజు నగరియందుఁ గనకమణిమయభూషణాలంకృతు
లయిన పరిచారకులు నూఱువేలు; రేయును బగలును బాత్రహస్తులై
యభ్యాగతభోజనంబు లొడఁగూర్చువారు నందఱ కలరు; వీరెల్ల
నిట్టిట్టి మెలకుఁవ మెలంగుదు రని తత్కృతాకృతంబు లేన యెఱుం
గుదు; నిరంతరమదధారాతరంగితకపోలంబులయిన భద్రగజశతసహా
స్రంబులుఁ, బ్రభూతజవసత్త్వసన్నతంబు లయిన యుత్తమాశ్వ
శతసహస్రంబులుం గలవు; వానికి నన్నింటికి నిత్యోచితంబులైన
ఖాద్యంబు లొనరింపను, బాలింపను దగినవారి నేన నియమింతు;
నఖండభాండాగారపూరితంబులైన యగణ్యమణికనకాది వస్తువులును,
బ్రతిదినవిహితంబు లయిన యాయ వ్యయంబులు నా యెఱుంగని

యవియు లేవు; గోపాలజనంబులు దుదిగాఁ గల సకల భృత్యజనంబుల జీవితంబుల నరసి యేన నడపుదుం; బరమయశోధను లగు పాండు నందనులు నిజకుటుంబ భారంబు సర్వంబు నాయంద సమర్పించి, తారు నిర్భరు లై యిష్ట విహారంబుల నుండుదు; రే నెల్ల వెంటల నప్రమత్త నై వర్తింతు. 307

ఆ. వేగ జాము గలుగ వెడనిద్రఁ బొందుదుఁ
గాని రాజ్యభారకార్యయుక్తి
నబ్జనయన! నాకు నాహారనిద్రల
కెడయు లేదు సువ్వె యెల్లఁబ్రొద్దు. 308

ఆ. ఇట్టి వర్తనముల నెపుడుఁ బాండవులకుఁ
దగిలి ప్రియము సేయఁ దగితిఁ గాని,
మగువ! నీవు నెప్పు మందులు మాకులు
నింద్రజాలములును నే నెఱుంగ." 309

వ. అనిన విని లజ్జాకలితచిత్త యగుచు సత్యభామ పాండవభామిని కిట్లనియె. 310

క. "ఏ నెఱుఁగమి నిట్లడిగితి;
నా నేరమి నైవ వలయు; నగవుగఁ గొనుమీ
మానిని! నాపలుకులు; స
న్మానితము భవచ్చరిత్ర మహిమ ధరిత్రిన్." 311

వ. అనినం బాంచాలి మందస్మితానన యగుచు నది యట్ల కాక యని పలికి మఱియు నిట్లనియె. 312

—: ద్రౌపది సత్యభామకుఁ బతివ్రతా ధర్మంబులు నెప్పుట :—

క. "పతిమనసు గాఁచికొనియెడు
చతురోపాయంబు నీకుఁ జపలాక్షి! సుని
శ్చితమతిఁ జెప్పెద వినుము
ర్జితమును, ధర్మాన్వితము, సుశీలంబును గాన్. 313

చ పతిఁ గడవంగ దైవతము భామల కెందును లేదు; ప్రీతుఁ డై
పతి గరుణించెనేనిఁ గలభాషిణి! భాసురభూషణాంబరా

న్వితధనధాన్యగౌరవము, విఖ్యాతసంతతియున్, యళంబు, స
ద్గతియును గల్గు; నొండుమెయిఁ గల్గునె? యెన్ని తెఱంగులారయఁగ.

ఆ. కరము దుఃఖపడినఁ గాని యొక్కింత సౌ
ఖ్యంబు ధర్మ్మగతియుఁ గలుగ దెందుఁ;
జూడు మబల! భర్తృశుశ్రూషఫలము సం
తత శుభంబు గలదు ధర్మ్మ మొదవు. 315

క. కావున నిత్యము సమ్య
గ్భావము, ప్రేమంబు, వెరవు, భక్తియుఁ బ్రియమున్
గావింపుము నీప్రియునెడ;
భావముఁ దా నెఱిఁగి భర్త బాగుగ మరగున్. 316

మ. వనజాతుండు గడంగి నీ దగు గృహద్వారంబు సేరంగ వ
చ్చె ననంగా విని లెమ్మ్మ సంభ్రమముతోఁ; జె ల్లొందు నభ్యంతరం
బునకుఁ వచ్చిన నాసనాదికరణంబుల్ దీర్పఁ దత్తజ్జనం
బు నిమోగించితి నంచు నుండఁ, బ్రియంబుల్ సేయు మీవుం దగఁ.

చ. తివిరి మురారి నీకుఁ గడుఁ దీపుగఁ జెప్పినపల్కు గల్గినం,
గువలయనేత్ర! నీమనసుగూడినవారికి నైన నెప్డుఁ జె
ప్ప వలదు; దాన నొండొకనెపంబు ఘటింతు రెఱింగిరేని నీ
సవతులు; కృష్ణబుద్ధి విరసం బగు నీ దెసఁ దత్ప్రియుక్తిచేఁ. 318

చ. పతికి ననుంగులైన తగుబంధుల మిత్రుల భోజనాదిస
త్కృతముల నాదరించుచు నకృత్రిమభక్తి నియుక్తి సంతతో
ద్ధితమతివై చరింపుము; తదీయహితేతరవృత్తులైన వా
రతివ! భవత్సహాయ్యజనము లైనను గైకొన కుండు మెప్పుడున్. 319

క. విను ప్రద్యుమ్నాదిభవ
త్తనయులయెడ నైన నేకతంబున నేకా
సనమున నుండుట దూష్యం
బని యెఱుఁగుము; సతులచరిత లతిదుష్కరముల్. 320

క. కులవతులును, సతులును, ని
ర్మలమతులును నయినయట్టి మగువలతోడం

జెలిమి యొనరించునది; దు
ర్విలసితవనితాభియు క్తి విడువుము తరుణీ! 321

వ. ఇది నీకుఁ బరమసౌభాగ్యమూలం బయిన యుపాయం'' బనినం
బ్రీతచి త్త యై సత్యభామ యిట్లనియె. 322

సీ. ''నీవు ధర్మజ్ఞవు; దేవసన్నిభులు నీ
భ ర్తలు మహనీయకీ ర్తిధనులు;
ధైర్యతేజోబలశౌర్యసంపన్నులు
గావున వీరికి నేవిధమున
ధారుణీరాజ్యంబు సేరెడుఁ దడయక;
మీ కెగ్గు సేసిన లోకనింద్య
చరితుండు, కౌరవధరణీశు వనితలు
దిక్కు లే కలమటఁ బొక్కుచుండఁ

తే. గని ముదంబునఁ బొందెదు వనిత! నీవు;
సుతుల నత్యంతనిర్మలమతుల శౌర్య
యుతులఁ గాంచిన సద్గుణాన్వితవు; వగపు
వలదు చి త్తంబులో నీకు జలజనయన. 323

వ. ప్రతివింధ్యాదు లయిన నీపుత్రు లేవురు నిప్పుడు వచ్చి యదుపురం
బున నున్న వారు; వారి నొక్కటం గొఱంత లేదు; రుక్మిణియు
సుభద్రయుఁ దక్కినవారలు నక్కుమారులయెడం దమ కొడుకుల
కంటె గారవంబు సేయుదురు; వారి దెస నిశ్చింతవు గ'' మ్మనియె;
నయ్యవసరంబునం గృష్ణుండు పాండవుల వీడ్కొని, మార్కండే
యాదివిప్రజనంబు నామంత్రణంబు సేసి, గమనోన్ముఖుం డగుటయు
సత్యభామ యాజ్ఞసేనిం గౌఁగిలించుకొని సగౌరవంబుగా వీడ్కొ
నియె; నంత వాసుదేవుండును ప్రియాసహితంబుగా రథారూఢుం డై
ద్వారవతీపురంబున కరిగె; మార్కండేయుండును భాండవేయుల
నాశ్వాసించి నిజాశ్రమంబునకుం జనియె;'' నని చెప్పిన వైశంపాయ
నునకు జనమేజయుం డి ట్లనియె. 324

క. ''వనముల ని ట్లనిశంబును
ఘనతరదుఃఖానుభవవికల్పితు లగుచుఁ

మనుజో త్తము లప్పార్థులు
జననుత! యట మీఁద నెట్లు చరియిం చిరొక్కో.'' 325

వ. అనిన నమ్మునీశ్వరుం డి ట్లని చెప్పెఁ; ''గృష్ణుండు సనిన యనంతరంబ పాండవులు కామ్యకవననివాసంబు పరిత్యజించి యనేక వనశై లనదనదీవిశేషంబు లాలోకించుచు ద్వై్వతవనంబునకు జని; రట్టియెడం గరిపురంబున నుండి యొక బ్రాహ్మ ణుండు సరసకథాకథనకుశలుండు సనుదెంచి కౌంతేయులం గని, యుచితసల్లాపంబు సేసి, మగిడి ధృతరాష్ట్రుపాలికిం జనిన నమ్మహీ పాలుండు పాండవుల కుశలం బడుగుటయు, నవ్విపు్రండు వా రేవురు ననవరతశీతవాతాతపకర్శితాంగు లై బహుదుఃఖసాగరంబున మునింగి యున్న వా రనియును, వీరనాథ యయ్యును నసనాథయుం బోలెఁ బాంచాలి పరమశోకా ర్తయై యున్నది యనియుం జెప్పిన విని, వై చిత్ర్య వీర్యుండు విషణ్ణహృదయుం డై, కన్నీరు దొరుఁగం గొండొక సేపు పలుక కుండి పదంపడి నిట్టూర్పు నిగిడించి గద్గదకంఠుం డగుచు ని ట్లనియె. 326

—: ధృతరాష్ట్రుఁడు పాండవుల వనవాసక్లేశంబునకు దుఃఖించుట :—

క. ''నాచేసిన కీడునఁ, గడు
నీచుం డగు నాతనూజు నేరమి, నిమ్మె్ల
నోచెల్ల! పార్థులకుఁ బు
ణ్యాచారుల కెందు లేనియాపద వచ్చెఁ. 327

క. నా పెద్దకొడుకు ధర్మ్మజుఁ
గాపురుషవిదూరు, ధీరుఁ, గౌరవకులపం
దీపకు నివ్వోధమున సం
తాపితుఁగాఁ జేసెనే విధాతృఁ డదయుఁ డై. 328

చ. అమలనివాతసౌధములయందు, మనోజ్ఞమరాళతూలత
ల్పముల శయించి, రేపులు శుభస్థితి మాగధసూతగీతనా
దములఁ బ్రబోధముం బొరయు ధర్మ్మసుతుండు కఠోర భూమిభా
గమున శయించి మేల్కను సృగాలనినాదవికీర్ణకర్ణుఁ డై. 329

క. నాగాయుతసత్త్వుఁడు, ది
జ్నాగాయతహస్తుఁ, డనిలనందనుఁడు మహో
ద్వేగాత్ముఁ డగుచు డస్సిన
నాగము క్రియ నుండకున్నె నవసి వనమునన్? 330

ఉ. అన్నలుఁ దమ్ములున్ సతియు నార్తి మెయిన్ బహుదుఃఖమగ్ను లై
యున్న తెఱంగు సూచి, విజయుండు యుధిష్ఠిరవాక్యబద్ధుఁ డై
సన్నతుఁ డుగ్రపన్నగముచాడ్పున రోషముచుఁ, గ్రోధళోకవే
గోన్నతి నాత్మ నేమనుచు నుండునొ నాసుత తప్పు లెన్నుచున్. 331

క. అక్కట! మృదుగాత్రులు, గడుఁ
జిక్కనిమనసులు, గుమారసింహులు, గవ లిం
పెక్కిన సుఖముల కర్హ్యాలు;
స్రుక్కి నపయ నోర్చి యునికి చోద్యం బరయఁ." 332

వ. అని పలికి వెండియు. 333

చ. "అనుపమతేజుఁ, డున్నతభుజాగ్రుఁ, డుదగ్రుఁడు, వైరినిగ్రహుం,
డనఘుండు వాయుసూనుఁడు నిజాగ్రజుచేసినసత్యపాశబం
ధనమునఁ జిక్కి తత్సమయతత్పరుఁ డై యిటు ఘోరదుఃఖవే
దనములు సైఁచెఁ గాక; మది తద్ధయుఁ గ్రోధమయంబు వానికిఁ.

సీ. శకునికైతవము, దుశ్శాసనుచేసిన
దుష్కర్మమును, గర్ణతులుపతనము,
దుర్యోధనుని దైన దుగ్ధయంబును జిత్త
మునఁ గిరిశల్యముల్ వోలె నలఁప;
దావాగ్ని తెఱఁగున దరికొని క్రోధంబు
వనవాస మనియెడి వాయుగతుల
నంత కంతకుఁ బేర్చి యవయవంబుల నెల్ల
మండంగ నెప్పుడు మధ్యముండు

ఆ. మొగము జేవురింప ముడివడుబొమలతో
నవుడుగఅచుచును భయంకరముగ
నున్న రూపు వాయకుండు నామది; వాఁడ
మిత్తి నాదు పుత్రమిత్రతతికి. 335

క. అంతకసుతుహృదయంబున
నంత గలుగ నేర దలుక; యర్జును మదిలో
నంత గలుగ; దమ్మారుతి
యంతకనిభుఁ డధికరోషుఁ డనవరతంబున్. 336

తే. అర్జునానిలప్రేరితం బగుచుఁ బేర్చి
వాయుతనయదవాగ్ని దుర్వారభంగిఁ
గర్ణసౌబలసహితముగా మదీయ
పుత్రశతకాననము వెసఁ బొదువ కున్నె? 337

క. అగుఁ గాక కర్మఫలములు
దగఁ గుడువక పోవ వశమె; దైవకృతంబుల్
మగుడునె? కౌరవ్యులకుం
దెగుకాలం బయ్యెఁ; వగపు ఁెరు వింకేలా? 338

క. ఏను వల దన్న జూచము
మానఁడ; సుతుదుర్జయంబు మగిడింపక దు
ర్మానమునఁ గులక్షయసం
ధానమునకుఁ దొడఁగితిని విధాతృనిచెయిదిఁ. 339

తే. రాత్రి తెగుదల దిన మేల రాకయుండు?
దినము తెగుదల రాత్రి యేతేరకున్నె?
పరఁగ సుఖదుఃఖములు గాలపర్యయమున
నెందు మనుజులఁ బొంవక యేల యుడుగు? 340

ఉ. మేలున సంతసిల్లునెడ మేకొని యాపద లొందు; నాపదల్
దూలఁగఁ బూని సౌఖ్యముల్ దోఁచుఁ; గృతంబులు దప్ప వెమ్మెయిం;
బోలఁగ నింతయుం గని ప్రబుద్ధమనస్కులు ఖేదమోదని
ర్గళితధైర్యసాగరులు గాక సుఖింతురు సర్వకాలముఁ. 341

చ. సిరికిఁ దొలంగి, కానల వసించి, కృశించిన పార్థుఁ డట్లె! ని
ర్జరులపరంబునం బరమసమ్మదలీల మహాస్త్రలాభవి
స్ఫురణముఁ బొంది యద్దివికిఁ బోయి శరీరముతోన క్రమ్మఱఁ
ధరణికి వచ్చె! నిట్టివి గదా వివిధాద్భుతకర్మపాకముల్. 342

క. గాండీవము విల్లగు! యా
ఖండలనందనుఁడు విల్లు గలవాఁ డగు! త
త్కాండంబులు దివ్యము లగు!
యొండేటికి వారిధనమ యుర్వీయు సిరియుఁ." 343

వ. అని ధృతరాష్ట్రేందు బహువిధంబు లగు పలుకులు వలుక విని దుర్యోధనుండు శకునిం జూచి "యీ రా జేల యింత భీతుండ వయ్యె? నను చు నత్తండునుం దానును గర్ణసహితుం డై యొక్క వివక్షప్రదే శంబునకుం జని కార్యాలోచనంబున నున్న యెడం గర్ణుం డి ట్లనియె. 344

సీ. "పాలితశౌర్యులు పాండవేయులు దుఃఖ
శీలు రై యడవులపాలు వడిరి;
ధరణీశ! తొల్లి యింద్రప్రస్థపురమున
ధర్మనందనుపాలఁ బేర్మితోడ
శోభిల్లు చున్న విశ్రుతలక్ష్మి నీబుద్ధి
బలమున నిన్నుఁ బెం పొలయఁ బొందెఁ;
బరువడి దక్షిణపశ్చిమోత్తరపూర్వ
దేశస్థు లయిన మహీశు లెల్ల
తే. నీక యరిగాఁపు లై రిప్డు ; నిఖిలజలధి
శైల కానన ద్వీప విశాల మయిన
మహి సమస్తంబు నేలుము మహిమ యెసఁగ
లీల నింద్రుండు సురలోక మేలునట్లు.

—: కర్ణ శకుని దుర్యోధనులు మంతనంబు సేయుట :—

ఉ. జానపదుల్ పురీజనులు సంతతముం బ్రమదం బెలర్ప నీ
వై న శుభోదయంబ హృదయంబులఁ గోరుచు నున్న వారు ; స
మ్మానము నొంది, కౌరవసమాజము నిన్ను భజింప, భూరితే
జోనిధి వై వెలింగెదవు సూర్యునిచాడ్పున నీవ యిమ్మహిన్. 346

వ. పాండవు లిప్పుడు పరమదుఃఖార్తు లగుచు ద్వైతవనసరోవర సమీ పంబున నున్న వా రని వింటిమి; నీవు సకలసామ్రాజ్యవిభవంబు మెఱసి

చని యందు నీ తేజంబు ఘర్మాంబునాఁటి తపను తేజం బై
పగతురకన్నులు గమర నతిదుస్సహాం బగునట్లుగాఁ బేయుము ; దొల్లి
నహుషపుత్రుం డయిన యయాతియుం బోలె నుజ్జ్వలుండ వై యున్న
నిన్నుం జూచి పాండవులు హృదయభేదంబుగా వగచెదరు ; మిత్ర
జనమోదంబును, శత్రుజనఖేదంబునుంగదా సంపదలకు దగియెడు
ఫలంబు. 347

క. ధనధాన్యపుత్రబాంధవ
జనలాభంబులును దలఁప సరిగావు సుఖం
బునఁ దాను దనరి, శత్రులు
ఘనతరదుఃఖముల నుండఁ గని యలరుటకున్. 348

ఉ. నారలు గట్టి కూర లశనంబుగ నుగ్రవనంబులో విప
ద్భారము నొంది వందురిన ఫల్గును నుజ్జ్వలరాజ్యవైభవో
దారుల మై కనుంగొని ముదంబునఁ బొందఁగఁ గాంచుకంటె నిం
పారఁగ నొండు గల్గునె కృతార్థత యెందును గౌరవేశ్వరా? 349

తే. అతుల సౌభాగ్యపుణ్యసమగ్రగరిమ
నొప్పు చున్న నీ దేపుల యొప్పు సూచి,
ధృతి దఱిఁగి తన్నుఁ దాన నిందించుకొనుచు
హృదయమునఁ బాండవాంగన యెరియవలదె?" 350

వ. అనిన నిది వోలు నని నాగకేతనుఁడు సంప్రీతుం డై కొండొక
విచారించి రాధేయుం జూచి యి ట్లనియె. 351

క. "నాతలఁపును నిట్టివ ; నీ
వేతెఱఁ గెఱిఁగించి తది యభీష్టము ; మన మా
వ్యైవ్యతవనంబున కరుగుట
భూతలపతి యనుమతింపఁ బోలదు మదిలోన్. 352

తే. అందుఁ బాండవు లుండుట యాంబికేయుఁ
డెఱుఁగు ; మన మవ్వనంబున కేఁగుటయును
గడఁగి పార్థులతోడి విగ్రహముకొఱక
యని యవశ్యంబు వారించు నతఁడు మనల. 353

వ. అదియునుం గాక. 354

చ. ఉరుతరవిక్రమాఢ్య లనియుఁ, మహనీయతపోవిశేషసు
స్థిరు లనియుం బృథాసుతులదిక్కునఁ దద్దయు భీతుఁ డై, నిరం
తరమును మానవేంద్రుఁ డెదఁ దాపము నొందుచు నుండు; వించె! యి
క్కురువిభుఁ డింత సేపు గడుఁ గూర్చి విలాపము సేసె వారిఁ. 355

వ. అతని యొద్ద నుండి విదురుండు వారిన పోటుమానిసులుగాఁ బొగడు
చుండు; జూదంబునాఁటనుండియు విదురుండు పాండవపక్షపాతి
యగుట దెల్లం బయ్యె; మన విచారించిన యిక్కార్యంబు చిన్న
సన్న యెఱింగినేనియు నాతం డెల్ల భంగుల విఘ్నంబు సేయుం;
గావున నిది యంతయు రహస్యంబుగా నొనరించికొని ధృతరాష్ట్రుండు
దీని కనుమంతించులెఱుం గెయ్యది యట్టి యుపాయంబు నీవును శకు
నియు నూహించునది; మనము రేపకడ వచ్చి కురుపితామహుం డైన
భీష్మునిఁ, గురువంశోత్తముం డైన ధృతరాష్ట్రుని నొడంబఱిచి
వెడలుద"మని వారి వీడ్కొలిపి దుర్యోధనుం డభ్యంతర గృహంబున
కరిగి యారాత్రి సముచితప్రకారంబునఁ గడపెఁ; బ్రభాతం బగుట
యుఁ గర్ణుండు దుర్యోధను కడకుం జని యిట్లనియె. 356

ఉ. "భూతలనాథ! యే నొకటి పోల నుపాయము గంటి; నిప్పు డా
ద్వైతవనంబునందు విదితంబుగ నున్నవి గోకదంబముల్;
ప్రీతిగఁ దద్విలోకనము పేరఁ జనం దగు; ధారుణీశ్వరుం
డేతెఱఁ గైనఁ బొమ్మను; నభీష్టము సేకఱు నెల్లభంగులన్." 357

క. నా విని సుబలతనూజుఁడు
"దేవా! నీయాన; యేను దెల్లంబుగ రే
యీవెరవె నెమ్మనమ్మున
భావించితి" ననియె; నంతఁ బ్రహసితముఖు లై. 358

వ. ఒండొరులచెయి సఱచి నవ్వుచు నమ్మువ్వురుం దక్షిణంబ సమంగ
నామధేయుం డయిన గోపాలకు నొక్కనిం గఱపికొని ధృతరాష్ట్ర
పాలికిం జని, సముచితప్రసంగ సేవావిశేషంబుల నమ్మహీవిభు
సుముఖుం జేసి, యనంతరంబ "దేవా! ద్వైత వనంబునందుల కీలా

రంబుననుండి వీఁడెయొక్క గోపకుండు వచ్చె'' ననిన నతండును వాని
కభిముఖుం డై పసులసేమం బడుగుటయు వాఁ డిట్లనియె. 359

—: కర్ణ సౌబలులు ధృతరాష్ట్రచేత ఘోషయాత్ర కనుజ్ఞ గొనుట :—

ఉ. ''ద్వైతవనంబునట్టి సుఖవాసము గోవుల కెందు లేదు ; ధా
త్రీతలనాథ ! యిప్పుడు ప్రదీప్తము లై సతతంబుఁ బేర్చి గో
వ్రాతభయంకరంబు లగు వాలుమృగంబులు సంచరించు ; మీ
కాతెఱఁ గెల్లఁ జెప్పుటకు నై యిట వచ్చితి నేను జెచ్చెరన్.'' 360

వ. అనిన యనంతరంబ కర్ణసౌబలులు ధృతరాష్ట్రుతోడ ''దేవా ! య
ట్లయినం దడయక దుష్టమృగనాశనంబును. గోగణసంరక్షణంబును
జేయుటకు భవత్సూను దుర్యోధను నియోగింపు'' మనిన నతండు
గొండొక విచారించి యి ట్లనియె. 361

మ. ''తగు గోరఁట యొనర్ప ; దుష్టమృగవిధ్వంసంబు నూహింప మే
లగు ; నైనన్ వినుఁ; డవ్యవాంతరమునం దాసక్తిమై నున్న వా
రు గరిష్టాత్ములు, పాండురాజతనయుల్, రూఢప్రతాపాఢ్యు ; ల
ట్లగుటఁ మీగమనంబు నామదిఁ బ్రియం బై తోఁప దెబ్భంగులన్.

చ. వనమున కేఁగి వందురినవా రని వారల మీ రవశ్యముం
జెనకఁ దలంతు ; రప్పురుషసింహులు భూరితపోనిధుల్ ; మనం
బునఁ గలుషించి రేనియుఁ దపోమహిమన్ మిము నిర్దహింతు రొం
డె, నతులితాస్త్రశక్తిని వడిం దనుమూఁదుదు రాజి నందఱన్. 363

క. మున్నును మీచేతఁ గడున్
బన్నము వడి నొచ్చినారు పార్థులు : మిమ్మిం
గన్నంత నలుగ కుండునె
పన్నగరిపుసన్నిభుండు పవనజుఁ డాత్మన్ ? 364

వ. అదియునుం గాక. 365

చ. ఒకగుఁడ ధాత్రి యంతయును నోర్చెఁ గృతాస్త్రుఁడు గాక
యుండియుం
బ్రకటితబాహువిక్రముఁడు ఫల్గునుఁ ; డిప్డు మహేంద్రుపాల న

త్యకుటిలదివ్యబాణవిదుఁ డై యెలమిం జనుదెంచె ; నట్టివా
నికి నెదురంగ శక్య మగునే రణభూముల నింక నేరికిన్ ? 366

తే. చెనకి మీరు వారికిఁ గీడు సేయుటయును
వారు మీకెగ్గుసేఁతయు వగవ మేలు
గాదు ; వలసిన ఘోషరక్షణ మొనర్పఁ
దగిన వారలఁ బుత్తము దడయ కందు. 367

వ. అని యొడంబడ కున్న నయ్యాంబికేయునకు శకుని యి ట్లనియె.

ఉ. "పాలితవిక్రమోన్నతులు పాండుతనూజులు ; వారి కప్రియం
బేల యొనర్తు మే ? నుధిప ! యే మటు సేసితి మేనియుం బ్రతి
జ్ఞాలపితుండు ధర్మజుఁడు సత్యము దప్పునె ? తమ్ము లేల త
చ్ఛీల మతిక్రమింతు ? రిది సిద్ధము నమ్ముము నెమ్మనంబునన్. 369

క. మాకును జిత్తంబుల మృగ
యాకౌతుక మతిశయిల్లినది ; గోగణర
క్షాకరణము గార్య్యం బగు ;
యేకీడును నేల పొందు నిందు ? మహీశా." 370

క. అనిన నతఁడు గొండొకపడి
మనమున నూహించి "బుద్ధిమంతుల రై గో
ధనము నరసి తడయక రం"
డని వారికి నెట్టకేల కనుమతి యిచ్చెన్. 371

• • •

ఆ. ఆక్షణంబ కౌతుకాతిశయవ్యగ్ర
హృదయుఁ డైన ఫణధరేంద్రకేతు
నాజ్ఞఁ గరిపురంబునం దెల్ల ఘోషింపఁ
బడియె ఘోషయాత్ర ప్రకటలీల. 372

—: దుర్యోధనుఁడు ఘోషయాత్ర వోవుట :—

సీ. అంతఁ బ్రభాతాత్మఁ డై, లలితాంబరా
భరణాంగరాగవిస్ఫురితమూర్తి

నొప్పారి, విభుఁడు సహోదరులును. గర్ణ
గాంధారులును, బ్రియబాంధవులును
సముచితవాహనసైన్యసమేతు లై
కొలువంగ, వెడలె నుజ్జ్వలవిభూతి ;
నాందోళికాదివాహనము లఁ దత్ప్రియ
ప్రమదలు బహుసహస్రములు సనిరి ;

ఆ. కడఁగి పౌరులెల్లఁ గై సేసి పడఁతులుఁ
దారు నడచి రతిముదంబుతోడఁ ;
బ్రకటశకటవైశ్యపణ్యాంగనాదిసం
కులము నుల్లసిల్లె ఘోషయాత్ర. 373

వ. మఱియు నమ్మహీపతి పయనంబున కనురూపంబుగా నెనిమిదివేలు రథంబులు , ముప్పదివే లేనుంగులుఁ దొంబదివేలు గుఱ్ఱంబులు, శత సహస్రసంఖ్య కాల్వురుం గల మహాసైన్యంబు తోడ నడిచె ; మృగ యాకుశలు లైన మృగయులు, విటవిదూషక వంది వైతాళికాది జను లనేకు లనుగమించి; రిట్లు గవ్యూతిమాత్రం బగు నేల యరిగి, యచ్చట విడిసి, యద్దినశేషంబును రాత్రియుం గడిపి, మఱునాఁడు వివిధగిరిగహనంబు లతిక్రమించి, ఘోషంబు లున్న వనంబు సొచ్చి, యందొక్క రమణీయ ప్రదేశంబున శిబిరంబు గావించి యమ్మను జేంద్రుఁడు. 374

సీ. నానాసహస్రసంఖ్యానంబు లై, సంత
తానందవిగతభయత్వళీల
నక్కానినమీన నేదిక్కు సూచిన నతి
సంకులంబుగఁ గుంద శంఖ చంద్ర
హార నీహార డిండీర పటీర ము
క్తాహార హీరసంకాశములును,
గాదంబ కాలేయ కాదంబినీ నీల
జాల తమాలికాసన్నిభములు,

తే. ప్రౌఢబంధూకపల్లవభాసితములు,
వికచకాంచనచంపకవిస్ఫుటములు,

నైనవర్ణంబు లొప్ప నేత్రాభిరామ
భంగి నలరారు గోకదంబములఁ గనియె. 375

వ. కని తదీయసమృద్ధికి సంతసిల్లుచు గోపాలజనంబులు సవినయంబుగాఁ దన్నుం గాంచిన నాదరించి, వారు దనకు నగ్గోవుల పేళ్లును లక్షణంబులు నేర్వఁడ నెటింగించుచుండఁ బేరువేఱు నత్సంబులు వత్సతరంబులు మహోక్షంబులు, ధేనువులు దర్ణకంబులు మొదలైన గోవిశేషంబుల నాలోకించుచు, నయ్యెవిధంబునఁ బసికిం దగిన రక్షణంబు గావింప నర్హాజనంబుల సవిశేషంబుగా నియోగించి మఱియును. 376

క. గోపాలసమన్వితుఁ డై
యాపొలమునఁ దిరిగి గోరసాస్వాదనలీ
లాపరితృప్తిఁ దలిర్చె మ
హీపాలుఁడు నెమ్మితోడ నిష్టులుఁ దానున్. 377

వ. తదనంతరంబ గాయక నర్తకాదులు, వందిమాగధజనంబులుం గనిన నాదరించి వారికి సభిమతధనంబు లొసంగి మృగయావినోదంబునకుం దొడంగి. 378

మ. హరిణవ్రాతములం గలంచుచు. నుదగ్రానేకపక్షేణిఁ జె
చ్చెర బంధించుచు, నుగ్ర సింహనివహచ్ఛేదైకసంక్రీడబం
ధుగతం బేర్చుచుఁ, బ్రబ్భురన్మహిషశార్దూలో ద్ధతక్రోడని
ర్భరపాతంబు లొనర్చుచుం దిరిగె భూపశ్రేష్ఠుఁ డక్కాననలోన్. 379

వ. మఱియు ననవగతసురభిసరసీరుహప్రకరపరికీర్ణంబు లగు జలాశయంబు లాలోకించుచు, నతిమనోహర ప్రసూన ఫల భరిత పాదప వనాభ్యంతరంబుల విహరించుచు, నున్మదమయూర మధుకర కీర కోకిలాలాపకోలాహలంబు లాకర్ణించుచుఁ, గ్రమంబునం బరిజనసమన్వితుం డై ధార్తరాష్ట్రుండు ద్వైతవనసరోవరంబు సేరం జనియె; నంత నట ధర్మనందనుండు తత్సమీపంబున మునిజనసహాయుం డై వన్యంబు లగు ఫలమూలవిశేషంబులు సాధనంబులుగా సద్యస్కందం బను యజ్ఞంబు సేయుచుండె; నప్పుడు దుర్యోధనుండు నిజభృత్యజనుల నక్కొలనిదరిం గ్రీడాగృహంబులు నిర్మింపనియోగించిన. 380

క. వారును సంభ్రమమున న
వ్వారిరుహాకరముపొంత వదలక క్రీడా
గారములు గట్టఁ దొడఁగుడు
వారించుచుఁ బాఱుతెంచి వడి గంధర్వుల్. 381

వ. "ఇది చిత్రసేనుం డను గంధర్వపతికిం గ్రీడార్థంబు కల్పితం బైనది; గావున మీ రిక్కొలను సేరక తొలంగి పోవునది"యనిన వారు మగుడం జని దుర్యోధనునకుఁ జెప్పుటయు నతండు రణదుర్మదు లైన సైనికులం గొందఱం బంచిన నరిగి వారలు గంధర్వుల కిట్లనిరి. 382

మ. "బలియుం డాధృతరాష్ట్రసూనుఁడు, మహాబాహుండుఁ దుర్యోధనుం డలఘుం డీకమలాకరంబునకుఁ గ్రీడార్థంబు గౌతూహలం బెలయంగాఁ బ్రియకామినీసహితుఁ డై యేతెంచుచున్నాఁడు; మీ ర్వ్వల దిం దుండఁ; దొలంగి పొం" డనవుడుఁ వా రుద్ధతక్రోధు లై.

వ. ఒండొరువుల మొగంబులు సూచి పెలుచ నవ్వి వారల కిట్లనిరి.384

క. "ఎదిరిం దన్ను నెఱుంగఁడు;
మదమునఁ బ్రాణంబుఁ దనదు మానముఁ గోల్పో
మదిఁ దలఁచినాఁడు మీనృపుఁ;
డిదియేటికిఁ జెనఁటి చెయ్వు లిన్నియు నిచటన్. 385

వ. బుద్ధిమంతుఁ డై యూరక చనుట లెస్స యనుం" డనినం గ్రమ్మఱి చని వారు కురుపతికిం దద్వచనంబుల తెఱం గంతయుం జెప్పుటయు నతండు రోషావేశ వివశుం డై తమ్ముల దొరలం జూచి "మీ రిందఱు మీమిసై న్యంబుతోడంగూడి కడంగి దుర్వినీతు లైన గంధర్వుల గర్వంబు మాన్పి సరోవరం బాక్రమించునది; వారికి సహాయుం డయి సురగణసమేతంబుగ నింద్రుండు సనుదెంచెనేనియు నవలీల జయించునది" యని నియోగించిన. 386

క. అతులచతురంగసేనా
న్వితు లయి, ధృతరాష్ట్రసుతులు నిరతిశయరయో
ద్ధత సింహనాదబధిరీ
కృతదిఙ్ముఖు లగుచుఁ జనిరి గినుక యెలర్వన్. 387

వ. ఇట్టు సనుదెంచు కురువీరుల కడ్డంబు వచ్చి కొందఱు గంధర్వులు ప్రియపూర్వకంబుగా "నిట నేల వచ్చెదరు? మికు మాతోడివిద్వేషం బేటికి? నిలువుం"డనినం బెలుచ నార్చి సేనాగ్రచరులు వారలమీఁదం బ్రచురశస్త్రాస్త్రపాతంబు సేయం దొడంగినం దొలంగి చని, యాగంధర్వు లాఱుణంబ చిత్రసేనునకు నంతయుఁ జెప్పి పుచ్చినం బ్రబలరోషరంజితాననుం డై యతఁడు. 388

క. "చనుఁడు రయంబున నాదు
ర్జనులం గౌరవులఁ బొదివి సమయింపుఁడు మీ"
రని బహుసహస్రసంఖ్యులఁ
బనిచెను గంధర్వవరులఁ బ్రకటితబలులన్. 389

వ. ఇట్లు వనిచిన. 390

ఉ ఆయత కుంత కార్ముక గదాసి పరశ్వథ శూల పట్టిసా
ద్యాయుధహోరహస్తులు, గలాచల తుంగతనుల్, ప్రచండతే
జోయుతు లావియచ్చరులు శూరతమై నడతెంచి బల్విడిం
గో యని తాఁ రుగ్రగణకోవిదు లై కురురాజసైన్యముల్. 391

వ. ఇవ్విధంబున గంధర్వులు బెట్టిదంబుగాఁ గిట్టి నొప్పింపం దొడంగినం గలంగి దుశ్శాసనాది కౌరవులు ససైన్యంబుగాఁ దెరలి దుర్యోధను చేరువకుం బఱచినఁ, గర్ణుం డొక్కరుండ సుస్థిరుం డయి నిలిచి, గంధర్వుల నిలువరించి భల్లార్ధచంద్ర ప్రసుఖ బహులబాణపాతంబులం దదీయదేహంబులు ఖండించుచు నిమిష మాత్రంబునఁ జిత్ర మేను సైనికశతంబుల రూపుమాపుటయు, మటియుం బై పై గంధర్వులు శతసహస్రసంఖ్యలు తోఁతెంచినం బృథివి యెల్లను గంధ్వమయం బై నట్లుండె నప్పుడు. 392

చ. శకునియుఁ దమ్ములుం బ్రబలసైన్యముతో నడతేర, నాహవో
త్సుకమతి యై సుయోధనుఁడు సూతతనూభవుఁ డున్నచోటికిం
బ్రకటభుజోగ్రతం గడఁగి, బల్విడిఁ దద్రిపుకోటి దాఁకినన్
సకలజగద్భయంకరలసత్సమరోత్సవ మయ్యె నయ్యెడన్. 393

క. కొండొకసేపునకు మహో
ద్దండనృపానేకఘోరతరవిశిఖవ్యా
ఖండితశరీరు లై ధృతి
ఖండితముగఁ బల్లటిలిరి గంధర్వు లనిఁ. 394

—: చిత్రసేనుం డను గంధర్వరాజు దుర్యోధనునితో యుద్ధము సేయుట :—

క. గంధర్వులు దెరలుట విని
గంధర్వవిభుండు క్రోధకలుషితమతి యై
గంధగజముచందమున మ
దాంధగతిం గవిసెఁ గౌరవానీకముపై. 395

వ. ఇట్లు గవిసి చిత్రసేనుండు 396

శా. మాయాసంగరకోవిదుండు, వికసన్మాయాస్త్రజాలంబులన్
వాయువ్యాప్తి యడంగ, నర్కకిరణవ్రాతంబు రుద్ధంబుగాఁ
జేయం బొచ్చినఁ ద్రెళ్ళిఁ దేరులు, కరుల్ శీర్ణంబు లయ్యెన్, దళ
త్కాయం బయ్యె హయాళి, గూలిరి భటుల్ గౌరవ్యసైన్యంబునన్.

క. పొదలి యొకని కొక్కనికిని
బదుగురు పదుగురుగఁ గవిసి పౌరవసేనం
బొదివి సమయింపఁ దొడఁగిరి
వదలక గంధర్వు లని నవారోద్ధతు లై. 398

వ. అవ్వియచ్చరుల విక్రమంబునకు నోర్వక బెదరి చెదరి కురురాజ సైన్యంబు ధర్మనందనుం డున్న కందువకుఁ బాఱం దొడంగెఁ; నప్పుడు క్రోధేయుం డజేయుం డై కులశైలంబునుంబోలెఁ దలరక నిలిచి, గంధర్వులు గురియు శరవర్షంబున మునుఁగుచుఁ దనయోపినంత వెనంగుచుండె; సోదరసౌబలసహాయుం డై దుర్యోధనుండు గర్ణసాహాయ్యంబు వదలక నిలిచె; నంత ననంతసత్త్వు లైన గంధర్వు లనేకులు సుట్టు ముట్టి. 399

ఉ. కొందఱు సూతు, నశ్వములఁ గొందఱు, కొందఱు చాపదండమున్,
గొందఱు చక్రయుగ్మకమునఁ. గొందఱు విస్ఫురితాతపత్రమున్,

గొందఱు కూబరంబు, మఱికొందఱు కేతువుఁ, గొంద ఱక్షమున్,
డందడిఁ దున్మివైచి విరథత్వ మొనర్చిరి సూతసూతికిన్. 400

వ. ఇట్లు విరథుం డయి కర్ణుండు వికర్ణురథం బెక్కి రణభూమికిం దొలంగి చనియె; దుర్యోధనుండు విముఖుండు గాక పరబలంబు మార్కొని పెనంగం దొడంగినం గినిసి చిత్రసేనుండు వానిం దలపడి, తదీయ స్యందనంబు రాధేయు రథంబు నట్లు భగ్నంబుగాఁ జేయించి, విరథుం డగు నమ్మహీవిభుం గేశాకర్షణంబున నేలం బడ వైచి, పెడకేలుగట్టి సింహనాదంబు సేసినం దక్కిన గంధర్వులుం గనుకనిం బేర్చి యతని వనితాజనంబులను, దత్సోదరు లగు దుశ్శాసనదుర్విషహ దుర్ముఖవివింశతి చిత్రసేనవిందానువిందులను, దత్తనూభవులను, దదీయ మంత్రులను బట్టి బంధించి చిత్రసేనున కొప్పించి; రంతఁ బెఱుకౌరవులును బౌరులు సమాత్యులుం జెదరి యాక్రోశించుచుం బఱచి ధర్మపుత్రు శరణు సొచ్చి యి ట్లనిరి. 401

మ. "ఘనబాహాబలదుర్వి వారమహిమ గంధర్వవీరుల్ సుయో
ధనుఁ, దత్కాంతలఁ, దత్సహోదరుల బంధప్రాప్తులం జేసి వై
కొని వే పోపుచు నున్న వా రదె! రిపుక్షోభంబు గావించి, నీ
యనుజత్రాణముఁ గావవే కరుణ నిండారంగ రాజోత్తమా." 402

వ. అని కృతాంజలు లై పలుకు చున్నవారిం జూచి భీమసేనుండు ప్రహసితాననుండగుచు ధర్మపుత్రున కి ట్లనియె. 403

ఆ. మనకుఁ జులుక నయ్యె; మనచేయు పనియ గం
ధర్వులు గూడి తగ నొనర్చి;
రింత లెస్సయగునె? యేభారమును లేక
యూరకుండ మనల నొండె జయము. 404

తే. పుట్టుఁగల్లరియై, పాపములకు నెల్ల
దిట్ట యై, లోకములచేతఁ దిట్టువడిన
కట్టిఁడికి నిట్టికష్టంబు గా నొనర్చి
తగ విధాతృఁడు చతురుఁ డై నెగడె నేఁడు. 405

మ. విపరీతస్థితి నొంది, పూరవిపినోర్వీ వాసు లై నిన్యదుఃఖపరాధీనతఁ దూలి రంచు మనలన్ గర్వోద్ధతస్వాంతుఁ డై యపలాపింపఁగ వచ్చి, దుర్నయపరుం డాధార్తరాష్ట్రుండు దోషపరీతాత్ముఁడు దత్పలంబు గుడిచెన్ సత్యంబు సామాత్యుఁ డై. 406

వ. వానిదెసం గృప సేయ వల" దనిన ననుజునకు నగ్రజుం డి ట్లనియె.

క. "అకట! యిది పరుషవాక్యము
లకు సమయమె? శరణు సొచ్చి లఘుభావముతో
వికల గతి సున్న కౌరవ
నికరమునకుఁ గరుణ సేయ నీకుం దగదే? 408

వ. ఏ కాన్వయజాతు లై న వారికి నర్థనిమి త్తం బయిన భేదం బొక్కొక్కమాటు వ ర్తిల్లు; నంతనచేసి సహజస్నేహంబు దప్ప నేరదు; జ్ఞాతిజనంబులు దమలో నెట్టి వారై న నొప్పుం గాని యన్యులవలనం బరిభవంబు దొడరినప్పుడు దా రొండొరులఁ జేకొన కునికి లోకనింద్యంబు; దుర్యోధనుండు దుర్వినీతుం డై నను సభార్యుం డయి పరులచేతం బట్టువడియె; దీని నుపేక్షించిన మనకుం గులహాని యగు; నిదియునుంగాక శరణాగతరక్షణంబు రాజమాత్రంబువాని కెల్ల ధర్మంబు; నీయట్టి బాహుబలసంపన్నునకు నిట్టి సుకర్మంబు కర్తవ్యం బని వేఱు చెప్పనేల? లెమ్ము నీవును నీతమ్ములు నిమ్ముల రథంబు లెక్కి సర్వాయుధసన్నద్ధు లై చని సుయోధను చెఱ దలుగుం" డనినఁ బవననందనుండు ధర్మనందనున కి ట్లనియె. 409

సీ. "అనుమాన మొక్కింతయును లేక యలిగి జలంబులఁ ద్రోచె; విషంబు వెట్టె;
గృహదాహ మొనరించె; విహితదురోదర
కపటుఁ డై రాజ్యంబు నపహరించె;
జను లెల్లఁ జూడంగ వసజాక్షిఁ బాంచాలిఁ
దలవట్టి యీడ్పించె; వలువ లొలువఁ
బనిచెఁ; బుట్టినకోలె మనకు నక్కట సుయో
ధనుఁ డెగ్గు సేయనిదినముఁ గలదె?

ఆ. వానిచేత లొకటియేనియుఁ దలఁపవు
నీవు; మనుజనాథ; కేవలంపుఁ
గరుణ పూని యుండు; దరయ నెప్పుడు నిట్టు
లైన మనకుఁ గార్యహాని గాదె." 410

వ. అని పూర్వవైరస్మరణకలుషితుం డై పలి న నతనిఁ నజాతశత్రుండు సాంత్వన పూర్వకంబుగా ని ట్లనియె. 411

ఆ. "కావరయ్య యనినఁ గరము దుర్బలుఁ డైనఁ
జెనసి యోపినంత సేయు ననిన,
నూరకుండు నయ్య యుత్తమశూరుఁడు
దీనజనులయున్న తెఱుఁగు సూచి? 412

క, శరణం బని వచ్చిన భీ
కర శత్రువు నయిన బ్రీతిఁ గావఁగ వలయుం;
గరుణాపరులతెఱుం గిది;
యిరవుగ సరిగావు దీని కేధర్మంబుల్. 413

వ. ధృతరాష్ట్రసూనుండు భవదీయ బలశౌర్యంబులపేర్మి యెఱుంగుం గావునఁ దన్ను నవశ్యంబును విడిపింతురని మనదెస బద్ధాశుం డై యుండు; నిది మనకుఁ బుణ్యంబును గీర్తియుం జేకొను సమయంబు; ని న్నింత నిర్భంధింప వలన, దేన యురు గుదు; నిప్పుడు యజ్ఞదీక్షితుండ నై యున్నవాఁడఁ; గావున నాకుం జనరాదు; మీరు వేగ చని గంధర్వులం బ్రియపూర్వ కంబుగా ననునయించి, సుయోధను విడిపించునది; సామవచనంబులం దీరకున్నఁ బరాక్రమంబున నైనం బ్రతివీరుల నోర్చి కార్యంబు దీర్చునది; నాచేయు జన్నంబు సఫలంబు సేయుం"డనిన భీముం డెట్టకేనియు నియ్యకొనియె; నర్జునుండును ధర్మరాజు పనుపు గైకొని కురురాజు చెఱ దలుగఁ బ్రతిజ్ఞ సేసె; నకులసహదేవులు సుత్సాహసమేతు లయి; ర న్నలువురు నాముక్తకవచులు, నాబద్ధ తూణీరులు, నాకలితకార్ముకులు, నారూఢరథులు నయి యగ్రజు వీడ్కొని యతిత్వరితగతి నడచినం, గౌరవసైన్యం బంతయు వారిం

గూడుకొని సింహనాదంబులు సెలంగఁ జనియెఁ; నిట్లరిగి వారలు గంధమాదనంబునకయి చనుచున్న యవ్వియచ్చరానీయకంబుం గూడ ముట్టిన. 414

—: భీమార్జున నకుల సహదేవులు గంధర్వులతో యుద్ధంబు సేయుట :—

క. కని గంధర్వులు గ్రమ్మటి
ఘనులం బాండవుల నగ్నికల్పులఁ, దేజో
ధనుల, నమరేంద్రసన్నిభుల
ననఘుల మార్కొనిరి ప్రకటితాటోపమునన్. 415

ఉ. అగ్రజువాక్యముల్ దలఁచి యర్జునుఁ డప్పుడు వారితోడ న
త్యుగ్రత దక్కఁ యెంతయుఁ బ్రియోక్తుల నిట్లను "మీకు మాయెడన్
విగ్రహ మేల? నెయ్యమున విడ్వుఁడు కౌరవరాజుఁ; బార్థివ
ప్రాగ్రసరుండు ధర్మసుతు పన్విది; మీకు నలంఘ్య మిత్తటిన్."
417

వ. అనిన నతనికి గంధర్వు లిట్లనిరి. 417

తే. "ధర్మజుఁడు మాకుఁ బ్రభుఁడె? యాధర్మతనయు
నాజ్ఞ నే మేల యొనరింతు? మనిమిషేంద్రుఁ
డొక్కరుఁడ మమ్ము శాసింప నొడయుఁ; డన్య
లెందు నెవ్వారైనను భయ మేమి మాకు?" 418

వ. అనిన వివ్వచ్చుం డవ్వియచ్చరుల నుపలక్షించి, "మునున్న తెగువకుం జొరనేల? యని ప్రియంబును ధర్మంబునుం గాఁ బలికితి; నెట్లును మీరు సామసాధ్యులరు గా కునికి దోఁచుచున్నయది; గావున నుగ్రం బయిన విగ్రహంబున దుర్యోధను విడిపింతు" నని వారల మీఁదఁ నిశితవిశిఖప్రకరంబులు ప్రయోగించె; నాగంధర్వులు నతనిపైఁ బటు బాణవర్షంబులు గురిసి; రిట్లానలువురకు ననేక గంధర్వశత సహస్రంబులతో నతిఘోరసమరం బయ్యె నందు. 419

తరలము. కదిసి యర్జునుతేరు భగ్నముగా నొనర్పఁ దలంచి పె
ల్లొదవి ఖేచరకోటి గ్రమ్మటియుం, బురందరనందనుం
డదయుఁ డై పదిలక్షులం, బ్రళయాగ్నికల్పుల, దివ్యులం,
గదనశూరుల నిర్దహించెఁ బ్రకాండదివ్యశరార్చులన్. 420

మహాస్రగ్ధర. ఘనకోదండో ద్గమౌర్వీక్వణ మఖిలనభో
గహ్వారాభోగభాగం
బున నాపూర్ణంబు గా, నుబ్బునఁ గవలు మరు
త్పుత్రుఁడుం దీవ్రనారా
చనితాంతాపాతలీలాసరభసగతులై
శత్రువీరవ్రజంబుం
దునుమం, దచ్ఛోణితంబుల్ దొరఁగి మడువు లై
తొట్టె నయ్యుద్ధభూమిన్. 421

వ. ఇట్లు కౌంతేయులచేతం బీడితులై గంధర్వులు దుర్యోధనాదులఁ జెలు లేమఱుక కనుచు గగనంబునకు నెగసి, త్రోసి పోవ నుంకించిన నెఱింగి సవ్యసాచిరయంబున నతినిబిడబాణజాలంబులంజేసి దిఙ్ముఖో మార్గంబులు నీరంధ్రంబులుగాఁ గప్పిన, నగ్గగనచరులు వలలోనం జిక్కిన పులుఁగులుంబోలెఁ బోవ నేరక శరపంజరంబునం జిక్కియు, నుక్కు సెడక యన్నలువుగమీఁద వివిధాయుధ పరంపరలు ప్రయో గించిన. 422

మ. అవి యెల్లం దునుమాడి క్రీడి ఘనరోషాభీలుఁ డై శాతభ
ల్లవితానం బడరించినం దలలు డొల్లం, గాయముల్ మింటనుం
డి వడిం గుంభినిఁ గూలఁగా, రుధిరవృష్టిం గాలువల్ వాఱగా
దివి గంధర్వులక్రం దడంగె జగ ముద్వేగంబునం బొందగన్. 423

వ. మఱియు నర్జునప్రయుక్తం బయిన యాగ్నేయాస్త్రంబు దావాగ్ని నీరసవిపినంబు దహించుచెఱంగున గంధర్వనివహంబు నీటు సేయం దొడంగినం, గినిసి చిత్రసేనుండు భీమసేనానుజుమీఁదం బటుగదాదం డంబు వైచిన నతండు దాని నేడు తునియలుగా నేయుటయు,
గంధర్వరాజు మాయాబలంబున నంతర్హితుండై. 424

క. నలువురు పార్థుల నత్యు
జ్జ్వలశరవర్షముల ముంచి జలధరముక్రియం
బెలుచన గర్జిల్లుచు మెు
క్కలుఁ డయి తనవిక్రమంబుఁ గడఁకయుఁ జూపెన్. 425

ఆ. దాని నుఱక, యింద్రసూనుండు గాండీవి
శబ్దభేది లయిన సాయకములఁ
జిత్రసేనుసర్వగాత్రంబు భేదించి
యొక్కమాత్రలోన నుడిపెఁ గడఁక. 426

వ. ఇట్లు నొచ్చి గంధర్వనాయకుఁడు రణసంరంభంబు విడిచి, యర్జునుం జేరంజని, తనపొడ సూపి నిలిచిన, నవ్వీరుండును నాత్మసఖుండయిన ఖేచరపతితెఱంగు సూచి, సంహృతాస్త్రుం డయ్యె; వృకోదరాదులును సమరవిరామంబు నొందిరి; వార లందఱుఁ దమ తమ రథంబులమీఁదన యుండి యొండొరులఁ గుశలంబు లడిగి; రప్పు డర్జునుండు చిత్రసేనున కిట్లనియె. 427

క. "నీరోత్తమ! నీ కిమ్మొయి
వైరము దగునయ్య కౌరవప్రకరముతోఁ?
గౌరవపతి విడువుము త
ద్దారానుజసుతసమన్వితంబుగ నెమ్మిన్." 428

వ. అనిన నతం డర్జునున కిట్లనియె 429

సీ. "ఈదురాత్ముఁడు మిమ్ము నిష్వనంబున నితాం
తాయాసపీడితు లైన వారిఁ,
బరమధర్మాత్ముల, భార్యాసమేతుల
నపహసింపఁ దలంచి యరుగుదెంచె;
నింతయు నెఱిఁగి సురేంద్రుండు గలుషించి
యనుజవధూసహాయాన్వితముగఁ
బాపవర్తను వినిఁ బట్టి నెమ్మని నన్నుఁ
బనిచిన వచ్చితిఁ; బార్థ! వినవె;

తే. శక్రుపాలికి నిదె కొని చనుచు నున్న
వాఁడ; నీ వింక నొం డనవలదు; వినుము;
మత్సఖుండవు గావున మత్సరంబు
నలుకయును లేదు నీదెస ననఘ! నాకు." 430

తే. అనిన నర్జునుఁ డతని కిట్లనియె "నీసు
యోధనుఁడు మాకు వినుము, సహోదరుండు

గాన; యీతని పిడుచుట గర్జ; మిదియ
ధర్మజున కెంతయును బ్రమోదంబు నేఁత. 431

చ. అమరవరేణ్యుప న్వయిన నావల నెయ్యది యైన నిప్డు ధ
ర్మమహితుఁ డైన ధర్మజుసమక్షమునం దెఱిఁగించి, యీతఁ డే
క్రమమున నెద్ది సెప్పె నది గైకొని చేయుము నీవు; మత్ప్రియా
ర్థము చనుదెమ్ము" నావుడును దాని కొడంబడి చిత్రసేనుఁడున్.

—: చిత్రసేనుఁడు ధర్మరాజునొద్దకు వచ్చి దుర్యోధను విడిచిపెట్టి పోపుట :—

వ. వారలుం దాను ధర్మజుకడకుం జనిన, నయ్యజాతశత్రుఁడు చిత్ర
సేను నతిప్రియంబునం బూజించి "మహాత్మా! యీ సుయోధనుండు
సానుజామాత్యం డయి మీచేత వధియింపం బడకునికి మే లయ్యె;
మీకారణంబున మావంశంబునకు నొండొక్కహాని యొంద దయ్యె;
వీఁ డెట్టి యపరాధంబు సేసినను నది యంతయు సహించి మాకుం
గా వీని విడువ వలయు"నని ప్రార్థించిన నతం డట్లకాక యని
దుర్యోధనాదుల నందఱ విడిచి, పాండుపుత్రుల నామంత్రణంబు
సేసి, దివంబున కరిగి తత్ప్రీకారంబు సకలంబును నింద్రునకు నివేదించిన,
నింద్రుండును సమర నిహతులయిన గంధర్వుల నమృతవృష్టిం జేసి
బ్రదికించె; నిట యధిష్ఠిరుండును ధార్తరాష్ట్రునకు బంధమోక్షణంబు
గావించి వాని కిట్లనియె. 433

ఉ. "ఎన్నఁడు నిట్టిసాహసము లింక నొనర్పకు మయ్య; దుర్జనుం
డన్నున సాహసక్రియలయందుఁ గడంగి నశించుఁ; గావునం
గ్రన్నన తమ్ములఁ దొరలఁ గైకొని యిమ్ములఁ భోమ్ము వీటికిఁ;
బన్నుత! దీని కొండొకవిషాదముఁ బొందకుమీ మనంబునన్."

వ. అని బుద్ధి సెప్పి వీడ్కొలిపిన నతండును దీనాననుం డగుచుం జనియె;
ననుజ సహితుం డయిన ధర్మతనయు ధార్మికత్వంబు ధౌమ్యాది
భూసురులును, చదాశ్రమవాసులయిన మహామునులును బహువిధం
బులఁ బ్రస్తుతించి; రని వైశంపాయన వర్ణితంబయిన కథావిశేషంబు
సవిస్తరంబుగా. 435

క. రాజకులతిలక ! భువనవి
రాజిత సితకీర్తి ! దివిజ రాజవిభవ ! ని
ర్వ్యాజపరాక్రమ ! సకలధ
రాజనసంపూజ్య ! ధర్మరక్షణదక్షా! 436

స్రగ్విణి. సర్వలోకాశ్రయా ! సౌమ్యభావోదయా !
నిర్వికారాకృతీ ! నిత్యసత్యోన్నతీ !
గర్వితోద్యద్భుజాకల్పకల్పోల్లస
త్సర్వసర్వంసహాచక్ర చక్రాయుధా ! 437

గద్యము. ఇది సకలసుకవిజనస్తుత నన్నయభట్టప్రణీతం బైన శ్రీమహా భారతంబునం దారణ్యపర్వంబునఁ బతివ్రతాచరిత్రంబును, ధర్మవ్యాధుండు గౌశికునకుఁ బరమధర్మం బెఱింగించుటయు, నగ్నివంశాను కీర్తనంబును, గుమారోత్పత్తియు, సత్యా ద్రౌపదీసంవాదంబును, పాండవులు ద్వైతవనంబునకుం జను టయు, ధృతరాష్ట్ర వాక్యంబులును; దుర్యోధనాదుల దుర్మంత్రంబున ఘోషయాత్రయుఁ, గౌరవగంధర్వయుద్ధం బును, దుర్యోధనాదులు గంధర్వులచేతం బట్టువడుటయు, నర్జునుండు వారల విడిపించుటయు నన్నది పంచమాశ్వాసము.

శ్రీ

గణేశ శారదా గురుభ్యో నమః

శ్రీ మదాంధ్ర మహాభారతము

ఆరణ్యపర్వము - షష్ఠాశ్వాసము

శ్రీ

లలితమూర్తి! సుమహా
చ్ఛాకుక్యవరేణ్యా! పుణ్యచారిత్ర! విచి
త్రా లంకారోజ్జ్వలకవి
తాలాపకలాప సంతతానందమతీ! 1

—: దుర్యోధనుని విషాదము :—

వ. అక్కథకుండు శౌనకాదిమహాములకుం జెప్పె; నట్లతిమానుషం
బైన యర్జును పరాక్రమంబును, నత్యంతదైన్యాస్పదం బగు దుర్యో
ధను పరాభవంబును, ధర్మజు దయయు నాకర్ణించి విస్మయజుగుప్సా
కలితమానసుం డగుచు జనమేజయుండు వైశంపాయనున కిట్లనియె.

చ. "అనిశముఁ బాండుపుత్రులకు నప్రియకార్యము రోయునట్టి దు
ర్జనుఁడు సుయోధనుం డటులు శత్రులచేఁ నవమానితుండుఁ బే .
ర్చినకృప నొప్పుచున్న కురుసింహులచేత విమోక్షితుండు నై
మనమున లజ్జ లేక మునిమండన! యెమ్మెయి నేఁగె వీటికిన్? 3.

మత్తకోకిలము. మేసఁ బ్రాణము దాల్చి, భంగము ప్రొంగి, యెప్పటి
చాడ్పునఁ
మానవేంద్రుఁడ నేను దద్దయు మానినన్ దలఁ పాత్మలోఁ
బూను టాతని కెట్లు గల్గెఁగఁ బోలు? నారయ నద్భుతం
బైన తచ్చరితంబు సెప్పుమ యంతయుం బరిపాటితోన్."

వ. అని యడిగిన నమ్మహాముని యి ట్లను ''నట్లు కౌంతేయులచేత బంధ
మోక్షితుం డై దుర్యోధనుండు లజ్జాకజ్జలితహృదయుం డగుచుఁ
జెప్పరిన సేనలం గూడుకొని కొంతద వ్వరిగి, యొక్క సమతలంబునం
బటమందిరవిరచనంబు నిర్వర్తించి, యభ్యంతరమందిరమ్మున నొక్క
రుండును దల్పంబుపయిం బడి చింతాపరవశత్వంబు నొంది, రాహు
కబళనకలుషితుం డైన రోహిణీపతియునుంబోలె విషాదవివర్ణుండయి
యున్న యెడఁ గర్ణుండు వచ్చి సముచితంబుగాఁ గని యన్నరేంద్రున
కి ట్లనియె. 5

చ. "మనుజవరేణ్య, చూడ నతిమానుష; మమ్మెయిఁ గయ్య మెందుఁ గ
ల్గునె? పటువిక్రమాన్వితులఁ, బ్రగోధనిబద్ధులఁ, గామరూపులం
జెనయఁగ వచ్చునే ఖచరసింహుల నేరికి? నట్టివారి నే
పునఁ దనుపూడి గెల్చితి విభూతి యెలర్పఁగ నీవుఁ దమ్ములున్. 6

ఉ. అప్పుడు నీవు సూడఁగ ననంతము లై ఖచరేంద్రసైన్యముల్
గప్పె ననేకసాయకనికాయములన్ వడి నన్ను; నేనునుం
గుప్పులు గూల నేసి రిపుకోటి వధించితి; నంతలోన న
న్నొప్పరికించె సైన్యతతి; యొక్కఁడ నై రణభూమి నొచ్చితిన్. 7

ప. ఆలోనన విరథుండ నై వికర్ణరథం బెక్కిన నది సమరప్రదేశంబునకుఁ
దొలంగఁ బఱచె; దేవా! నీవు బలవిక్రమాతిశయంబులం బ్రతివీరుల
నోర్చి యజితుండ వై యుండుట గనుంగొని కృతార్థుండ నైతి;
నిట్టి పరాక్రమంబు సేసినవా రిజ్జగంబున నెవ్వరు గల? రిది యత్య
ద్భుతం'' బనివఁ గౌరవేశ్వరుం డాత్మగతంబున "నీతండు మత్పౌ
రాధేయుని ట్లనియె. 8

సీ. "అనఘ! తమ్ములు నేను నంబరచరకోటిఁ
దలపడి పోరంగ, బలయుగంబుఁ
జచ్చియు నొచ్చియుఁ జలమునఁ బెనఁగె; నా
సమయంబునందు విక్రమ మెలర్ప

గంధర్వపతితోడఁ గలిగెఁ గయ్యము నాకు;
నాతనిశరములచేతఁ నాజి
నేను నొచ్చితి; వేయు నేల భార్యానుజ
సుతమిత్రజనసమన్వితము గాఁగ
తే. నన్నుఁ జెఱుగొని గంధర్వనాయకుండు
నెగసె దివమున; కప్పుడు బెగడి చెదరి
పఱచి మనవారలెల్లను భాండుసుతుల
శరణు సొచ్చిరి దైన్యసంభరితు లగుచు. 9

ఉ. వారలయార్తిఁ జూచి జనవంద్యుఁడు ధర్మసుతుండు దమ్ములఁ
భూరిబలాఢ్యులం బరమపుణ్యుఁడు నన్ విడిపింపఁ బంచె; న
వ్వీరులు నుక్కునం గవిసి వీఁకున ఖేచరకోటిఁ దొల్లి నిం
పారఁ బ్రియోక్తులం దెలిఁచి; రంతటఁ దీరద కార్య మెమ్మెయిన్. 10

ఆ. అంతఁ దెగువచేసి యంతకాకారులై
భీమపార్థయములు భీమబలులు
ఖచరతతులమీఁదఁ బ్రచురబాణౌఘముల్
గురిసి రాహవమున బరుషభంగి 11

వ. తదీయబాణపాతంబున నొచ్చి గంధర్వులు మమ్ముం గొనుచు గగనంబు నం బఱచిన, నర్జునుండు వారికిం బోవ రాకుండ నతనిబిడబాణజాలం బుల నంబగ మార్గంబు నిరోధించినఁ జిత్రసేనుండు దన ప్రియసఖుం డైన శతమఖసుతుం జేర నరిగి కుశలం బడిగిన, నర్జునుండును భీతుం డై వాని ననునయించి 'యీ దుర్యోధనుండు మా తోడం బుట్టువు గావున నితని విడువ వలయు' ననిన నా గంధర్వ నాయకుండు. 12

క. మనదుర్మంత్రిత మంతయు
ఘనుఁ డప్పార్థునకుఁ జెప్పి "ఘనభుజ! యిది యిం
ద్రునిపను పగుట నవశ్యం
బును నీతని విడువ" ననియె భూరి బలుం డై. 13

క. కడు లజ్జయు దైన్యంబును
నడరి ముసుఁగువడఁగ నాకు నాత్మగతమునం
బుడమి వివరంబు లేదే
యడఁగెద నన్నట్టి దయ్యె నప్పుడు కర్ణా! 14

వ. అంతం గొంతేయులు గంధర్వులం దోడ్కొని ధర్మరాజు పాలికిం జని, మన దుర్మంత్రంబు కతంబున బంధగోచరుండ నయిన నన్ను నయ్యజాతశత్రుముందట నివేదించిన, నతండు విడిచి పుత్తెంచె; నిది మదీయవృత్తాంతంబు. 15

క. ఒవ్వనివారల యెదురున
నివ్విధమున భంగపడితి; నే నింక జనుల్
నవ్వఁగ నేటిబ్రతుకుగా
నివ్వసుమతి యేలువాఁడ? నెట్లు చరింతున్? 16

ఉ. అక్కట! యమ్మహారణమునందు వియచ్చరకోటితోడఁ బే
రుక్కునఁ బోరి యేను మృతి నొందగ నేరన; యట్టు లైన నీ
తక్కువపాటు లేక ప్రమదంబున దేవపదంబు నొందుదున్;
మిక్కిలియైన కీర్తియును మేదినియందు వెలుంగు నిత్యమై. 17

—: దుర్యోధనుండు ప్రాయోపవేశంబు సేయఁ బూనుట :—

వ. కావున నిట్టి దురవస్థపా లైతి; నేను ప్రాయోపవేశంబునఁ ప్రాణపరి
త్యాగంబుఁ జేసెదఁ మీ రిందఱు దుశ్శాసనుం బురస్కరించుకొని
పురంబున కరుగునది; మిత్రులకుఁ బ్రమోదంబును, శత్రులకు నిర్వేద
నంబునుం జేయుచు మనునట్టి యేను నేఁడు పోఁడిమి సెడి పగతుర
చేత శిరస్తాడనంబు సేయంబడి సిగ్గు వడక బంధుజనంబులలోని కే
మని యరుగుదు? నాంబికేయుం గని యే మని పలుకుదుఁ? గురు
వృద్ధు లయిన భీష్మబాహ్లీకులయు, నాచార్యు లయిన కృపద్రోణు
లయు సమ్ముఖంబున నెట్లు నిలుతుఁ? బరిజనులుం బౌరులుం బురోహి
తులు నన్నుం గనిన నే మని సంభాషింతు? నిది యాత్మదోషంబున
నైన యపాయంబు; నా కవశ్యభోక్తవ్యంబు. 18

క. వినుఁ దుర్వినయాత్మకుఁ డగు
జనుఁ డుజ్జ్వల మైన సిరియు సద్విద్యయుఁ గ
లిన నందు మెలఁగ నేరక
చెనఁటి తెఱుంగునకుఁ జొచ్చి చెడి పోవుఁ దుదిన్. 19

క. అకటకట! యిటికపము
నకు వచ్చితినయ్య యేను? నన్నఁ బ్రై రి
ప్రకరము లనిఁ బట్టినఁ గృప
నొకరుఁడు విడిపించె; దైవ మోపదె యెట్లుఁ? 20

క. మానము సెడియును నిమ్మ్రొ
మేనం ప్రాణంబు లెట్లు మేకొని తాల్తుం?
గాన యిది నిశ్చయముగాఁ
బూనితి; నా తెగువ మాన్పఁ బోల దొరులకున్." 21

వ. అని పలికి సమీపగతుం డైన దుశ్శాసను నాలోకించి యమ్మహీపాలుం
డి ట్లనియె 22

సీ. "అన్న! దుశ్శాసన! నిన్ను రాజ్యమునకుఁ
బట్టంబు గట్టెదఁ బటివి గమ్ము;
శకునికర్ణులు దీర్ప్ర బకటవసుంధరా
వలయ మంతయు మపోజ్జ్వలత నేలు;
భ్రాతృవర్గమునకుఁ బ్రీతిసేయుము; బంధు
జనులఁ బోషింపుము; సద్ద్విజులకు
నుత్తమంబుగఁ దగువృత్తులు సెల్లింపు;
గురుజనంబుల భక్తిఁ గొలువు మెపుడు;

తే. నింద్రుఁడమరగణంబుల నేలునట్లు
ధరణిపతుల నేలుము; బాహుదర్ప మెప్పఁ
బగఱ నుక్కడఁగింపుము; పరమమిత్రు
లైన శూరులఁ గొనియాడు మర్హభంగి." 23

వ. అనిన నమ్మాట దన హృదయంబునకు నిశితశూలం బయిన నతండు
నిలువనోపక యగ్రజు పాదంబులపయిం బడి "దేవా యి ట్లానతీఁ

దగదు; నాకుం బ్రసన్నుండవగు'' మని నిజనేత్రజలంబులం దదీయ
చరణయుగళం బభిషేకించుచు నిట్లనియె. 24

చ. ''అవని విదీర్ణ మైనను, హిమాద్రి చలించుట గల్గినన్, మహా
ర్ణవ జల మింకినన్, దివసనాథుఁడుఁ జంద్రుఁడు దేజ మేదినం
గువలయనాథ! నీకు నొక కుత్సితభావముఁ గల్గ నేర్చునే?
భవదుపయోగ్య మైన నృపభారము నాకు వహింప శక్యమే? 25

క. హితులై నవారిఁ బ్రోచుచు,
సతతంబును రిపుల నెల్లఁ జమరుచు, నిఖిల
క్షితితలము నీవ యేలుము
శతసంవత్సరము లధిప! జయశీలుఁడ వై.'' 26

వ. అనుచు నయ్యువరాజు దుఃఖాతిభారవిహ్వలుం డై యెలుంగెత్తి
యేడ్చిన నయ్యన్నయుం గన్నీ రొలుక నూర కుండె; నప్పుడు
కర్ణుండు వారలం జూచి ''యిట్లేల బాలిశులుంబోలె నేడ్చెదరు?
ధైర్యంబు ధరియించి శోకవ్యసనఁబులు విడువుండు; శోకశీలురం
జూచి పగతురు సంతసిల్లుదురు; శోకశీలురకుఁ బై పై శోకంబులు
వొందు'' నని దుర్యోధనుం బేర్కొని యిట్లనియె. 27

క. ''ఒక యల్పమనుజ క్రియ సో
మ కులోత్తమ! నీకు నిట్లు మహనీయసుఖ
ప్రకృతి యగు నిజశరీరం
బకట! విడువఁ దలఁప నగునే? యవిహితబుద్ధిన్, 28

తే. శోకమగ్నుండ వగు నిన్నుఁ జూచి బెగడి
యధిప! నీతమ్ములును నేను నధికదుఃఖ
వహ్ని పాల్పడపయ్య; మావలనఁ గరుణ
గలిగి తేర్పవె యింపుఁ గౌరవేంద్ర! 29

వ. పాండవులచేత విముక్తుండ నై తి నని వగచె; దంతియ కాని నీకుం
గార్యగతియందు వివేకంబు సాల; దది యెట్లనిన నేరాజు రాజ్యం
బున నిశ్చింతులయి జనులు తమ తమ జీవనంబుల వర్తింతు, రారాజు
నకు నట్టి జనులు బంట్లు; గావునఁ దారమ్మ హీపతికిం దీఱిమి గల్గినచోట్ల

నెల్లనుం దమ పౌరుషంబులు నెఱప వలయుఁ; గౌంతేయులు నీ దేశంబుననుండి నీ యాజ్ఞవలనం గృతారంభులై యున్నవారగుటం జేసి, వారు నీ కింకరులు; నీకు నైన యక్కఱ దీర్చుట వారి కర్హకృత్యంబు; దీని కింత వనర నేల? యదియునుం గాక పాండవులు జూదంబునాఁడ నీకు దాసులైరి; తదీయంబులైన మణి కనకాదివస్తువులును భవదధీనంబులై యున్నయవి; వారు నిన్నుం గొలిచి యుండుట లేకుండెనేనియు నింతటి కెలసంబు దీర్పనేనియు వలదే? యిది యంతయు నూహించి వలవని వగలం బొగలకలెమ్మ; పురంబునకు నడువుము, నామాట వినక నిర్బంధపరుండవై తేనియు నిన్నేమనవచ్చు? నిందఱము నీపోయినగతిన పోవం గలవారము; నీవు లోకంబుచేత నగుఁబాటును బొందెద; వింతియ" యని కర్ణుండు సెప్పిన విని దుర్యోధనుండు వెండియుం బ్రాయోపవేశంబునందు నిశ్చయంబు వదలకున్నం గనుంగొని శకుని యిట్లనియె.

క "కరుని చూడీనమాటలు
నిర్ణయమున కింత యొప్పనే! యిప్పలుకుల్
కర్ణంబులఁ జొనుపుము; దుఃఖార్ణవపారంబుఁ బొందు మవనీనాథా! 31

తరలము. కడఁగి బుద్ధిబలంబునంద యకంటకంబుగఁ జేసి యేఁ
బుడమిరాజ్యము సర్వముం దగఁ బుచ్చి యిచ్చిన, నిమ్ములం
గుడువ నేరక దీని నిచ్చటఁ గూలఁ దన్ని, శరీరమున్
విడుతుఁ గా కని నిశ్చయించెదు వెట్టివై తె? నరేశ్వరా. 32

ఆ. నీకు వృద్ధసేవ లే కున్కి యిప్పుడు
నాకుఁ దెల్లమయ్యెఁ బ్రాకటముగఁ;
గోపమును మనోనుతాపంబుఁ బొందుచో
ధీరుఁ డపుడు యుడుప నేరవలదె? 33

తే. పిలికితనము, నేమఱుటయు, నొఱపుతనము,
మెత్తఁబాటునఁ గార్యంబునత్తెఱంగు
నేరమియు, విషయంబులఁగూరుటయును
గలుగు పతికి నుండదు సిరి, దొలఁగిపోవు. 34

వ. కావునఁ గార్యజ్ఞుండ వగుము; కార్యజ్ఞానం బెట్టిదనిన. 35

ఉ. కౌరవనాథ ! నీకు నుపకారము సేసి పాండవేయు; ల
వ్వీరులయందు నెయ్యమును వేడ్కయు నొప్పఁగ నీ వభీష్టస
త్కారము సేత యుక్త మగుఁ గాక; ప్రియంపడ నర్హా మైనచో
గారుణశోకసహ్నాపరితాపముఁ బొందుట యిప్డు ధర్మమే? 36

చ. కృతము దలంచి, చిత్తమునఁ గిల్బిష మంతయు నుజ్జగించి, స
న్మతులఁ బృథాతనూజుల సమానుషతేజులఁ బిల్వఁ బంచి, త
త్పితృధన మైనరాజ్యను నభీష్టముగాఁ దగ నిమ్ము; నీకు నీ
క్షితివలయంబునం బరమకీర్తియుఁ బుణ్యముఁ గల్గు భూవరా. 37

క. వారలు నీ తోఁబుట్టువు
లీ రాజ్యము మీరు వారు నేకం బై పెం
పారఁగ నేలుఁడు; దీనం
గౌరవకుల నాథ! సౌఖ్యగౌరవ మొందుఁ" 38

వ. అని శకుని సెప్పు చుండ నగ్గాంధారీనందనుండు నిజచరణసమీపంబునం
బడియున్న దుశ్శాసనుం గ్రుచ్చి యెత్తి, మూర్ధాఘ్రాణంబు సేసి
కర్ణసౌబలులం జూచి "మీ రేల నన్నుఁ గారుఁచెదరు? ధరైశ్వర్య
ధనభోగంబులందు నా కభిలాషంబు లేదు; ప్రాయోపవేశంబునందుఁ
గృతనిశ్చయుండ నైతిఁ; మీరిం కొండునిష్ఠురంబులు సేయక యూరక
మీవలయునెడకుం బొండు;" డనిన వారలు "దేవా! నీవిధం బిట్టిద
యయ్యెనేని మే మెందుఁ జేరెదము? నీతోడివారమ కాక" యని;
రంతం గమలహితుండు పశ్చిమాచలసమీపగతుం డగుటయు, నన్నర
నాథుండు పురలోకగమనకుతూహలియై శుచిస్నానంబు సేసి, వల్కలం
బులు ధరియించి, సంధ్యాసమయసముచితంబు లగు కరణీయంబులు
నిర్వర్తించి. వివిక్తదేశంబునందు దర్భాస్తరణంబున నాసీనుండై
వాఙ్నియతుండై. 39

క. క్రమమున బాహ్యేంద్రియక
ర్మము లెల్లను వదల విడిచి, మహితసమాధి
క్రమదశ నుండె నివాత
స్తిమితమై వెలుఁగుచున్న దీపముపోలెన్. 40

ప్రాయోపవిష్టుఁ డైన దుర్యోధనునిఁ గృత్య పాతాళంబునకుఁ గొనిపోవుట

సీ. ఆ సమయమున మున్న మరేంద్రవిజితు లై
యహిలోకమున నున్న యసురవరులు
ధృతరాష్ట్రనందను తెగువ యెఱింగి, యా
త్మీయపక్షుయస్థితికి వగచి,
యాతనిఁ బిలిపింప నప్పుడు శుక్రాదు
లైన భూసురసమూహముల చేత
వేల్మి వెట్టించిన, వేగంబ యొకకృత్య
వెలువడి, భీషణవికృతమూర్తి,

ఆ. "యేమిపనులు గలిగె? నెఱిఁగింపుఁ" డనిన వా
"రిచటి కిపుడు కౌరవేంద్రు ననఘు
నుజ్జ్వలాంగు నాసు మోధనుఁ దెమ్మ్ల ప్రా
యోపవేశనమున నున్న వాని."

41

వ. అని పనిచినం గృత్యయు నాక్షణంబ చని ప్రాయోపవిష్టుండ్లై యున్న దుర్యోధను గ్రుచ్చి యెత్తికొని రసాతలంబునకుం దెచ్చి దైత్యులకు సమర్పించినం భీతులై వారు వానిం గొఁగిలించుకొని కుశలంబడిగి యిట్లని" రయ్యా! నీవు శూరుండవు, శూరజనరక్షితుండవు, భరత కులోద్వహుండ; విట్టి సాహసం బేల చేసితివి? మఱి యాత్మఘాతు కునకు లోకంబున నిందయు హీనతయు దుర్గతియుం ప్రాపించు; లోకవిరుద్ధంబులై మహాపాతంబులైన కార్యంబులయందు నీయట్టి బుద్ధిమంతులు ప్రవర్తిల్లుదురే? యట్లు గావున నీ వఖిలధర్మార్థ యశోభోగ నాశంబైన యీ దుర్విచారంబు విడువుము; ధైర్యం బును ప్రతాపంబును బాటింపుము; శత్రుజనభంజనంబు సేయుము; నీవు మనుష్యమాత్రుండవు గావు; నీ పూర్వజన్మప్రకారంబు నెవ్వేద మాకర్ణింపుము. 42

ఉ. ఏము తపంబు సేసి పరమేశ్వరు, నీశ్వరుఁ, బార్వతీమనఃకామునిఁ, గామవైరి, నవికారుఁ బురాంతకుఁ ప్రీతుఁ జేసినం గామితదాయి యైన శితికంఠుఁడు నిన్ను సృజించి యిచ్చె ను ద్దామదయావిధేయుఁడు ముదంబున మాకు నధీశ్వరుండు గాన్.

ఉ. నీ దగు పూర్వదేహము వినిర్మలవజ్రశిలావిశేషసం
పాదిత, మస్త్రశస్త్రపరిపాటనభేద్యము గాదు, నిత్యనిఃఖేదము, పుష్పకోమలము, ఖేచరభూచరకామినీమనో
హ్లాదన; మిట్లుగా నభవుఁ డర్థి నొనర్చె నుమాసమేతుఁడై. 44

ఉ. నీవు ధరిత్రిఁ బుట్టుటయు, నీకు సహాయము సేయఁ గోరి నా
నావిధదైత్యదానవగణంబులు రాజకులంబులందు స
ద్భావన నుద్భవించెఁ బటుబాహులు, దివ్యమహాస్త్రకోవిదుల్,
ద్రావితవైరు, లుర్వి భగవదర్తపురస్సరులైన వీరులై. 45

వ. భీష్మ ద్రోణ కృపాదులు గొందఱు దేవాంశసంభవులైనను దదీయ
భావంబులు రాఁగసావేశంబు నొందెడు; దానంజేసి వారు నిర్దయులై
విమూఢులుంబోలె ననోన్యపరుషంబులు వలుకుచు, నలుక మిగులం
బుత్ర పౌత్ర మిత్ర భ్రాతృ శిష్య గురు బాల వృద్ధ జనభేదంబులు
విచారింపక, సమరంబు సేసి దివ్యంబులు మానుషంబులు నైన
వివిధాస్త్రశస్త్రంబులఁ బాండవపక్షయంబు గావింపంగలవారు;
పాండవులు బంధుస్నేహంబు విడిచి తెగువకుం జొచ్చి నీచేత నిహతు
లగుదురు; నీమనంబున భీభత్సవలనిభయంబు గొంత గలదు; దాని
నెఱింగి నేమునుం దగు నుపాయంబు దలంచితి; మది యెట్లనినఁ
గృష్ణుచేతం జచ్చిన నరకాసురు నంశంబు గర్ణు నావేశింపంగలయది;
తత్కారణంబునం గృష్ణార్జునులతోడ బద్ధవైరుండై యవ్వీరుండు
నిజదివ్యాస్త్రంబులం గృష్ణుల నిద్దఱ నిర్దహించు; నివ్విధంబెఱింగి
యింద్రుండు పాండవ రక్షణార్థంబు వచ్చి కర్ణుకవచకుండలంబులు
గపటర్యూపంబున నపహరింపం గలవాఁడు; మఱియును. 46

క. ఖ్యాతి సంశ పకు లనఁగా
శతలక్షసహస్రసంఖ్య జనియించిరి ద
ర్పితులై దనుజులు; దద్బల
తతిచే సమరమున నింద్రతనయుఁడు సిక్కఁడ. 47

తరలము. నిహతకంటక మైన యిద్ధరణీతలం బఖిలంబు నీ
మహితశాసనగోచరం బగు; మానవేంద్ర ! ప్రసన్న తా

మహిమ నొందుము; నీప తేపవు మాకు నందఱకుం; గురూ
ద్వహా! విషాదము వొందఁ బాడియె? దైత్యపక్షభయంబుగాఁ.

మ. చను మిం కొండుదలంపు మాను"మని యాశ్వాసించి, వానిం బునఃపునరాలింగన మాచరించి, యెలమిం బూజించిఁ దైత్యోత్తముల్
జననాథోత్తమ! వీడుకొల్పిరి; తదాజ్ఞంజేసి యాకృత్యయున్
మును దాఁ దెచ్చినచోటఁ బెట్టె నధిపుఁ మోదంబు సంధిల్లఁగాన్.

ఉ. అంత సుయోధనుండు హృదయంబున విస్మయ మంది యంతవృ
త్తాంతను స్వప్నవృత్తముక్రియం దలపోసి, నిజంబ కాఁగ న
త్యంతము నిశ్చయించుచుఁ, బృథాసుతులన్ సమరంబులోన ని
ర్జింతున కాక యంచు వికసిల్లె దురాశయభగ్నబుద్ధి యై. 50

క. వినుఁ జనమేజయ! పౌరవ
జనవిభుఁ డబ్భంగి రాత్రిచరితం బగున
ద్దనుజసమాభాషణ మె
వ్వనికిని నెఱిఁగింప కుండువాఁ డయ్యె మదిన్. 51

వ. అంతఁ బ్రభాతం బగుటయు రాధేయుండు సుయోధనుపాలికిం జని
పేతుమద్వాక్యంబుల నతని కిట్లనియె. 52

ఉ. "చచ్చినపిమ్మటం గడిఁదిశత్రుల నోర్వఁగ వచ్చునే? శుభం
బిచ్చునె చావు లెందును? నరేశ్వర! యాఱడి చత్తు నంట దా
మె చ్చగు నయ్య యేరికిని? మేనికి జీవము గల్గుచోన పెం
పచ్చుగ సిద్ధిఁ బొందు విజయార్థసుఖంబులు మర్త్యకోటికిన్. 53

ఉ. కావున శోకదైన్యములకాలము గా దిది; లెమ్ము, విక్రమ
శ్రీ విలసిల్లు" మంచుఁ గురుసింహుని, సింహసమ్మానుఁ, జారుశ
య్యావివశాంగు నంగపతి యాదటఁ దా నిరుగేల గ్రుచ్చి సం
భావన నెత్తుచుం బ్రణయభాషల వెండియు వాని కిట్లనున్. 54

క. "మది నర్జునుఁ జూచి భయం
బొందవినయది నీకు; వాని నుగ్రరణమునం
బదునాలవయేఁడు జయిం
చెద; నాయుధ మంటి ప్రతిన సేసితి నధిపా." 55

—: దుర్యోధనుఁడు ప్రాయోపవేశము మాని కరిపురంబునకుఁ బోవుట :—

చ. అనవుడుఁ గత్పీతిజ్ఞయు సురారులవాక్యములుం దలంచి య
జ్జనపతి గాఢనిశ్చయవశంవదుఁడై శయనంబు డిగ్గి చ
య్యనఁ బయనంబు సేయుఁడని యప్పుడమాత్యులఁ బంచి యమ్మహీ
దినముఖకృత్యముల్ సలిసి దీపితుఁడై వెడలెం బ్రియంబుతోన్. .

వ. అయ్యవసరంబున. 57

చ. రయవిచలత్తురంగమతరంగములన్, మదనాగనక్రసం
చయములఁ, జంచలచ్ఛటుల సైనికమత్స్యములన్, మహోన్నతం
బయి కురురాజచంద్రు నుదయంబునఁ దద్దయుఁ బొంగెఁ బ్రస్ఫుర
ద్భయదమనోహరప్రకటభంగులఁ దవ్వటవార్ధి యుద్ధతిన్. 58

ఉ. చామరపుండరీకవిలసత్పత చారుపతాకలం గురు
గ్రామణియాత్ర యెంతయును గాంతి వహించె నభంబు, శారదో
ద్దామమరాళమండలసితస్ఫుటపద్మవనీపరిస్ఫుర
త్తామరసాకరంబునవిధంబున భూచరనేత్రపర్వ మై. 59

వ. ఇట్లు దుర్యోధనుండు గర్ణసౌబలప్రముఖులు సై దుశ్శాసనాద్యనుజగణం
బునుం, దక్కిన యమాత్యగణంబులుం గొలువఁ జెలువు మిగులం జని
కరిపురంబు ప్రవేశించి, సముచితవ్యాపారంబుల నుండునంత నొక్క
నాఁడు మంత్రిజనపరివేష్టితుం డై యున్న రాజునకు భీష్ముం డి
ట్లనియె. 60

మ. "హితు లై పెద్దలు బుద్ధి సెప్పఁగఁ గ్రియాహీనుండ వై త్రోచి పో
యితి దుష్టాత్ములఁ గూడి; దానికి ఫలం బెట్లయ్యెనో చూచితే?
గతవిద్వేషుఁడు ధర్మనందనుఁడు గల్గంబట్టి యప్పాట ను
ర్గతికిం దప్పితి గాక; చిక్కితి గదా గంధర్వులే నాఁటిలోనన్. 61

ఉ. నీవును దమ్ములుఁ సతులు నెయ్యురు వైరులచేఁ గృహీతు లై
పోవఁగఁ జూఁటిపోయెఁ గడుఁ బొల్లఁపనంబున సూతపుత్రుఁ; డీ
కావరుఁ, గష్టచిత్తు నధికంబుగ నమ్ముదు నీవు; వీనిభా
వావిభవంబు గయ్యమున నక్కడఁ జూచితె కన్ను లారఁగన్? 62

ఉ. ఆయతబాహు, లుగ్రబలు, లార్యులు, పార్థులు; వారిభూరిశౌ
ర్యాయుధ నైపుణ్యలయందుఁ బదాఱుపపాలుఁ బోలఁ డీ
వాయపురజ్జులాఁ; డధిప! వారలచందము వీనిచందముఁ
నీయెడ నిక్క మై తెలిసెనే? ఖచరేంద్రులపోరిలోపలఁ. 63

క. కులమును సిరియును జెఱుపక
యలఘుస్థితి నింక నైన నప్పాండవులం
గలసి మన వయ్య; నాదగు
పలుకు వినఁ గడయ్య; హితముఁ బథ్యముఁ జుమ్మీ." 64

వ. అనిన భీష్మ్మ వచనంబులదెస నగాదరంబు సేసి దుర్యోధనుండు గర్ణ
సౌబలులం జూచి నవ్వుచు, వారలుం దమ్ములుం దోడన చన నక్కడ
వాసి చనియె; భీష్మ్ముండును లజ్జితుం డై నిజగృహంబున కరిగె; నంతఁ
గౌరవేశ్వరుఁడు గ్రమ్మటి యెప్పటిచోటిఁ జనుదెంచి, మంత్రుల
తోడ మంతనం బుండి, "మన కెయ్యది కర్తవ్యం? బెయ్యది సేసినఁ
దేజోలాభంబు లగు?" నని యడిగినఁ గర్ణుండు "దేవా! నీ కింక
నేవిచారమ్ములు నేల? నిష్కంటకం బైన యీపృథివి సకలంబునుం
బాలించుచు మహేంద్రమహిమతోడ నఖిలసుఖంబులు ననుభవింతుగా"
కనినం బ్రీతుం డై యతండు వాని కిట్లనియె. 65

క. "నీయట్టి వీరవరుఁడు స
హాయుం డగు! పడయ రానియదియుం గలదే
ధీయుత! నా కెయ్యదియును?
బాయక విను మింక నొక్కపని దెల్లముగాఁ. 66

తే. ధర్మజుఁడు రాజసూయంబుఁ జేర్మిఁ జేసి
నంతనుండియు నమ్మహితాధ్వరమున
యం డభిప్రాయమైయుండు నొంద నాకు;
నమ్మఖంబు సేయింపవే యనఘ నన్ను." 67

వ. అనినం గర్ణుండు గౌరవపతి కిట్లనియె. 68

క. "అగుఁ గాక యేమి; యిప్పుడు
జగతీం గలనృపతు లెల్ల జనవర! నీ కె

మ్మృగ వశవర్తుల; కావునఁ
దగ నుద్యోగింపు మిపుడు తత్క్రతువిధిఁన్. 69

ఉ. రాజులఁ బిల్వఁ బంపుము; ధరాసురసంఘము వామతింపు; వే
రోజ నుదాత్తయజ్ఞ గృహయూపతతుల్ సమకట్టఁ బంపు; వి
భ్రాజితభక్ష్యభోజ్యవిధిభవ్యపదార్థము లానయింపు; మ
వ్యాజవిభూతి మై నమరవల్లభుచాడ్పునఁ జేయు జన్నమున్." 70

వ. అనిన సంతోసిల్లి కురుపతి యప్పుడ పురోహితునిం బిలిపించి "రాజ
సూయ యజ్ఞంబు సంపూర్ణదక్షిణంబుగాఁ జేయ వలయుఁ; దత్ప్ర
యోగ విశేషంబులకు మీరు సాలి యుండునది" యనినం బురోహి
తుండు దగిన విద్వజ్జనంబులతోడ విచారించి దుర్యోధనున కి ట్లనియెఁ.

చ. "జనవర! నీకుఁ బాండవులు శత్రులు గావున నీవు వారి నో
ర్చిన మఱి కాక మున్న యిటు సేయఁగ శక్యమె రాజసూయమున్?
వినుము దగంగ నిప్పటికి వే ఱొకయజ్ఞము సేయు మిమ్మలం;
బనుపుము తత్క్రియావివిధభంగులకుం దగువారి వేగమై. 72

తే. రాజసూయంబునట్టిద రాజవర్య!
వైష్ణవం బను యాగంబు; వాసుదేవుఁ
డిమ్మఖము సేసెఁ దొల్లి; యభీష్ట మిదియ
చేయు; నిర్విఘ్నముగ నిది సెల్లు నీకు." 73

క. అనిన నిది వోలు నని య
జ్ఞనాథుఁడు సూతతనయసౌబలులు ప్రియం
బున ననుమతింప నభిమత
వినుతాధ్వరసంప్రయోగవిహితోద్యముఁ డై. 74

క. తనయుద్యోగము జననీ
జనకులకును, ద్రోణ విదుర శాంతనవ కృపా
ది నిఖిలమాన్యజనమ్ముల
కును దగ నెఱిఁగించి భరతకుంజరుఁ డెలమిన్. 75

—: దుర్యోధనుఁడు వైష్ణవం బను యజ్ఞంబు సేయుట :—

వ. వారిచేత ననుజ్ఞాతుం డయి నగరసమీపంబున నొక్క పుణ్యస్థలంబునం
దఖిల యజ్ఞగృహంబులు నతి రమణీయంబులు గాఁ జేయించి,

యజ్ఞో పకరణంబులును సమస్తవస్తువిశేషంబులును సమకట్ట నియో
గించి,శుభదినంబునం బరమబ్రాహ్మణ సహాయుం డై నియతదీక్షాశోభ
నంబువ హించె నంత. 76

ఆ. అఖిల దేశవాసు లైన రాజులను, బ
విత్రచరితు లైన విప్రవరుల
నర్థిఁ బిలువ దూత లరిగిరి కౌరవే
శ్వరునియాజ్ఞఁ జేసి సమ్మదమున. 77

వ. అం దొక్క దూతంబిలిచి దుశ్శాసనుండు ''నీవు ద్వైతవనంబునకుం జని పాండవులను దదాశ్రమవాసు లయిన భూసురులను గౌరవేశ్వరు నధ్వరంబునకుఁ బిలువు'' మని పనిచిన వాఁడునుం జని ధర్మజుం గని యి ట్లనియె. 78

ఉ. వీరుఁడు కౌరవుండు నిజవిక్రమలబ్ధసమున్న తార్థసం
భారములఁ మహాధ్వర మపారబలుం డొనరించుచుండి, పెం
పారఁగ నిన్నుఁ దమ్ముల మహోద్భుజులం బిలువంగఁ బంచె; ధా
త్రిరమణేశ! నెమ్మిఁ జనుదెమ్మ తదధ్వరముం గనుంగొనన్." 79

వ. అనిన ధర్మజుండు వానికి ట్లనియె. 80

చ. ''అనఘుఁడు ధార్తరాష్ట్రుఁడు మహాధ్వరకర్మఘురీణుఁ డయ్యె నా
విని ప్రియ మందెఁ జిత్తము; పవిత్రిత మయ్యెఁ గులంబు; వింటె? యై
నను దగ మేము పూనిన ఘనం బగుపూనిఁ దీర్పఁ గెవ్విధం
బున నట రా నొడంబడము; భూవరుతో నిది సెప్ప మేఁ పడన్." 81

వ. అనియె నప్పుడు భీమసేనుం డాదూతం జూచి ''ఓరి వినుము; పదుమ్మూఁడగు నేఁటి కడపటఁ బాండవాగ్రజుండు దీప్తంబగు శస్త్రా
స్త్రదహనంబునందు ధార్తరాష్ట్రసుతశతకంబుఁ బఱువరించి వేల్చి రణసత్త్రింబు సేయుటకు నై పచ్చంగాని యందాఁకం జనుదెంచుట గలుగ దని యూ దుర్యోధను నెదురన వాయోడక చెప్పు'' మనిన వాఁడును మరిడి చని ధర్మనందను ప్రియవచనంబులను, వృకోదరు నిష్ఠురోక్తులను ధార్తరాష్ట్రుల కెఱిఁగించెఁ; దదనంతరంబ. 82

క. చనుదెంచిరి కౌరవుశా
సనమున ధరణిఁ గల నిఖిలజనపతులును స
న్మనులును, సమస్తజనులును
ఘనభుజు జన్నఁబుఁ జూడఁ గరిపురమునకున్. 81

వ. వారికెల్లను దగిన సత్కారంబులు సేయను, పాత్రదానంబులు గావిం పను, ధృతరాష్ట్రుండు విదురుం బనిచె; నివ్విధంబునఁ బ్రసిద్ధదక్షిణా న్వితం బై, ప్రభూతాన్నపానసంతర్పితసకలజనం బై, యభిమతాంబ రాభరణపరిపూజిత భూసురప్రకరం బై, యథాకాలవిహితకర్మలకలాపం బై, యథాశాస్త్రీయం బై వైష్ణవయాగంబు నిర్విఘ్నంబుగఁ బరి సమాప్తం బగుటయు. 84

క. అవభృథశోభితుఁ డై కా
రవముఖ్యుఁడు భూరికనకరత్న తతుల భూ
దివిజులఁ బూజించి, నృపుల
వివిధవిధుల సత్కరించి వీడ్కొలిపెఁ దగన్. 85

వ. అట్టియెడ నధ్వరోత్సవాగతు లైన జను లనేకులు ధృతరాష్ట్రనందను సమ్ముఖం బున నిట్లనిరి. 86

క. "జనపతు లెవ్వరు నివ్విధ
మున నిర్విఘ్నముగ నఖిలభూజనసమ్మో
దనముగఁ జేసిరె సత్కీర్తు?
వసఘు! భవత్పుణ్యమహిమ లాశ్చర్య మిలన్. 87

శా. సారోదారవిభూతమై మును హరిశ్చంద్రుం డొనర్చెం గ్రియా
పారీణు డయి రాజసూయ; మది నెప్పన్ వింటి; మయ్యజ్ఞముం
గౌరవోత్తముఁ డైనధర్మసుతుఁడుం గావింపఁగాఁ గంటి మే;
మా రెండున్ సరిగావు నీమఖము తో నత్యున్నతిన్ భూవరా! 88

క. ఈజన్న మొనర్చియ గా
దే జగదావర్తకీర్తిదీపితు లై య
వ్యాజసురలోకసుఖముల
భ్రాజిల్లిరి రఘు యయాతి భరతాదినృపుల్." 89

తే. అని సుతింపంగ మఱీయును నంద కొంద
అయ్యుధిష్ఠిరు రాజసూయంబుచిదుర
పాలుఁబోల దీమఖను వైభవసమృద్ధి"
నని తలంచిరి నిజహృదయంబులందు. 90

వ. అనంతరంబ నిరంతరానంద మంద మందాయమాన మానసుం డగుచు మానవేశ్వరుండు దమ్ములు దొరలు బంధుజనంబులుం బరివేష్టింపఁ, బౌరజనదత్తాశీర్వాద జయజయశబ్దశబ్దాయమానదిగ్విభాగుం డగుచుఁ, బుణ్యాంగనా కరకలితలలితాక్షతవిక్షేపంబులును, బటువందిమాగధ సంకీర్తనంబులును గైకొనుచుఁ బురప్రవేశంబు సేసి, రాజమందిర గతుం డై ధృతరాష్ట్రునికు, గాంధారిఁ గృపద్రోణభీష్ములకుం బ్రణ మిల్లి యుల్లంబు వికసిల్లఁ గనకాసనాసీనుం డయ్యె; నప్పుడు కర్ణుం డతని కిట్లనియె. 91

ఉ. "భాగ్యము గాదె కౌరవనృపాల! భవన్ముఖ మిట్టసత్క్రియా
యోగ్యత నిర్వికల్పముగ నొందె సమాప్తి; నశేషధాత్రియున్
భోగ్యమ నీకు; నింక రణభూమి, బృథాసుతులన్ జయించి స
మ్యగ్యశశాలి వై భువనమాన్య! యొనర్పుము రాజసూయమున్.

క. అది యెమ్మెయి నగునో యని
మదిలో వగవంగ వలదు; మఘవతనూజుం
గదనంబునఁ జంపక యే
పదనభధావన మొనర్పఁ బార్థివముఖ్యా!" 93

తే. అనిన గర్ణుఁ గౌఁగిట జేర్చి, యన్న రేంద్ర
నందనుఁడు "నీసహాయత నాకుఁ గలుగఁ
బాండవుల నోర్చు నెంతటిపని మహాత్మ!"
యని సహోదరసహితుఁ డై హర్ష మొందె. 94

వ. అట ధర్మతనయుండు సూతతనయు ప్రతిజ్ఞ విని, వాని బలశౌర్య విభవంబును, నభేద్య కవచప్రభావంబును దలంచి విషణ్ణహృదయుం డై రేలెల్లను గన్ను మూయుటలేక వగచుచుండె; నిట దుర్యోధనుం డును గర్ణసౌబలప్రవర్తిత కార్యశుద్ధుం డై, భీష్మద్రోణకృపాదుల

కును, మహనీయు లైన మహీసురులకు ననుదినంబును బ్రియసత్కా-
రంబులు సలుపుచు, ధనంబు దత్తభుక్తఫలంబుగా వగచి నిరంతర
త్యాగభోగంబుల ననురాగంబు నొందు చుండె'' ననిన వైశంపాయను
నకు జనమేజయుం డి ట్లనియె. 95

క. దుర్యోధనుచెఱ దలిగి య
వార్యపరాక్రములు పాండవప్రభులు మహా
శ్చర్యచరితు లవ్వనమున
నార్యులు మఱి యెట్టివార లై రి? మునీంద్రా! 96

ద్వైతవనంబునందలి మృగసమూహము ధర్మజు స్వప్నంబునందు
వచ్చి తమ దుఃఖంబు సెప్పుట

వ. అని యడిగిన నమ్మహాముని యమ్మహీపతి కి ట్లనియె. 97

సీ. ''ద్వైతవనంబున ధర్మజుం డొకనాఁడు
నిద్రింపఁగాఁ, దద్వనేచరంబు
లగునట్టి మృగజాతు లన్నియుఁ గలలోన
వచ్చి, కన్నుల నశ్రువారి దొరుఁగఁ,
ద మ్మెఱింగించి యాతనితోడ నిట్లను
''ధర్మాత్మ ! మీరు నిత్యంబుఁ గడఁగి
చంపంగఁ జంపంగ సమసి యల్పావళి
ష్టము లయ్యె నిప్పు డస్మత్కులంబు ;
తే. లేము బీజమాత్రమ దక్కి యిట్లు వనరు
చున్న వార్తము; మీరింక నొండుగడకు
నరిగి మమ్ముఁ గావరే కరుణార్ద్రబుద్ధి''
ననిన నట్లకా కని వాని కభయ మిచ్చి. 98

క. జనపతి మేల్కొని యంతయు
ననుజుల కెఱిఁగించి యిట్టు లను ''నబ్జముపై
నెనిమిదినెల లుండితి మి
వ్వనమునఁ; దగు నింక నొండువలనికిఁ బోవన్. 99

వ. ఇప్పుడు కామ్యకవనంబు బహుమృగాకీర్ణంబై. సరసఫలభరితభూరుహ
ప్రకరంబై, విమలకమలాకరాభిరామంబై యున్నయది యని
వింటిమి; గావునం గ్రమ్మఱ నందులకుం జని తృణబిందునాశ్రమంబున
వసియించుట లెస్స" యనినం దమ్ములు 'దేవా! నీ వెట్లు నిశ్చ
యించితి మాకు నదియ యిష్టం'బని పలికిరి; తదనంతరంబ. 100

క. అనుజన్ములుఁ, బాంచాలియు
ననుచరవర్గంబు బ్రాహ్మణావలియును దోఁ
జనుదేరఁగ సమ్మదమున
ఘనతేజుఁడు సనియెఁ గామ్యకవనంబునకున్. 101

వ. ఇట్లరిగి యందుఁ గృతనివాసులై యవ్వీరులు శాకఫలమూలంబులం
జేసి దేహయాత్రలు నడుపుచు, నొండురులయలజడి సూచి యత్యంత
దుఃఖపరవశు లగుచు జూచంబునాఁడు దమ పడినపాట్లు దలంచి
కలంగుచుఁ, గ్రోధశోకంబులు దమలోన నుపశమించికొనుచు వర్తిల్లం
బదునొక్కం డగునేఁడు సనిన నందఱుం గూలంబు గడగాంచినవారై
వెడవెడ వికసిల్లిన చిత్తంబులతో నుచిత వృత్తంబుల నుండునంత. 102

శా. ప్రీతుండై చనుదెంచె నాశ్రితజనాభీష్టప్రియాశీలుఁ, డు
ద్గీతామ్నాయుఁడు, నిర్విధూతదురితక్లేశుండు, యోగామృత
స్నీతస్వాంతుఁ, డనంతసంతతసమావిర్భూత కారుణ్యధా
రాతోయస్నపనై కశీలుఁడగు పారాశర్యుఁ డచ్చోటికిన్. 103

క. మునిపతి దోడవ్వులఁ గని,
జనపతి దమ్ములును దాను సంప్రీతి నెదు
ర్కొని, యర్ఘ్యాదివిశేషా
ర్చనలం బరితుష్టుఁ జేసె సంభృతభక్తిన్. 104

వ. కృష్ణద్వైపాయనుండును ననవరత వనవాసాయాస కృశదేహుల,
నధిక దుఃఖాయమానహృదయులం దన మనుమలం జూచి వగచి
ధర్మపుత్రున కిట్లనియె. 105

ఉ. "కాలవిపర్యయంబున సుఖంబును దుఃఖము వచ్చు చుండు; నె
క్కాలము నేరికిన్ ధ్రువము గాదు సుఖంబును దుఃఖమున్; మహీ

పాల ! బుధుండు దద్విషభంగు లెటింగి ప్రపంచమోహఖేదసం
కీలుఁడు గాఁడు రెంటను బ్రసిద్ధపథంబున నప్రమత్తుఁడై. 106

క. ఏను సీవును నాపదలకు
మనమున నొక్కింత యోర్చి. మహనీయముగా
నొనరింపుము తపము, దపం
బునన కదా సకలసౌఖ్యములు సిద్ధించున్ ? 107

క. శమయు, నహింసయు, సత్యము
సమతయు, నింద్రియజయంబు! శమముఁ, బరిత్యా
గమును దపోలక్షణములు;
గ్రమమున నిన్నియును నూర్ధ్వగతికారణముల్. 108

తే. ఇందుఁజేసిన పుణ్యంబ యందుఁ గుడుచు;
మీఁదిజన్మంబునకు నది మేలుఁజేయుఁ;
గాన తనశక్తితోఁ గూడ దానధర్మ
చిరపరోపకారంబులు సేయ వలయు." 109

వ. అనినం బాండవాగ్రజుండు "దానతపంబులలో దుష్కరం బెయ్యది? యెద్దాన నధిక ఫలంబగు?" నని యడిగిన వేదవ్యాసుం డిట్లనియె.

సీ. "దాన మూర్జితఫలదం; బర్థసాధ్య మై
పరఁగుటఁ గరము దుష్కరము నదియ;
నరులకు నధిప? ప్రాణంబులకంటెను
రూపింప నర్థంబు తీపు వినవె;
యుగ్రంబు లైన యాయుధముల మొనలపై
నటుకుట, యంభోధి దాటి చనుట,
కృషిపాశుపాల్యసంక్లేశంబు నొందుట,
యడవులఁ గొండల నిడుమ వడుట.

ఆ. నవసి పొవసి యనుదినముఁ బరప్రేష్యులై
యునికి డలఁప నర్థమునక చూవె;
యట్టిదుఃఖలబ్ధ మైన యయ్యర్థంబు
విడుచు టెట్లొధమునఁ గడీఁది గాదె? 111

శా. అన్యాయార్జిత మైన విత్తమునఁ జేయం బూను దానంబు మూ
ర్ఖన్యాయం బది; దానఁజేసి ఫలపాకం బేమియున్ లేదు; యు
క్తన్యాయార్జిత మించుకంత యయినం గాలంబు, దేశంబు స
మ్మాన్యంబై తగఁ బాత్రయోగమున సౌమ్యంబై ఫలించుం దుదిన్.

వ. తొల్లి ముద్గలుం డను మహాద్విజుండు సన్మార్గోపార్జితం బైన వ్రీహి
ద్రోణంబు సత్పాత్రంబునఁ బ్రతిపాదించి కాదె పరమసిద్ధిం బొందె''
ననిన విని ధర్మనందనుండు "మునీంద్రా! ముద్గలుండు వ్రీహిద్రోణం
బెబ్భంగి నుపార్జించె? నెట్టి పాత్రంబునఁ బ్రతిపాదించె? విన వలతుం
జెప్పవే" యనిన నతం డిట్లనియె. 113

—: వ్యాసుఁడు ధర్మజునకు వ్రీహిద్రోణాఖ్యానంబు సెప్పుట :—

క. ''అతిథిప్రియుఁడుఁ విశిష్ట
వ్రతుఁడు, విమత్సరుఁడు, సత్యవచనుండు, విని
ర్జితవిషయేంద్రియుఁడు, సము
న్నతపుణ్యుఁడు, ముద్గలుఁడు నాతనబుద్ధిన్. 114

వ. పుత్రదారసహితంబుగాఁ గురుక్షేత్రంబున వసియించి, యుంఛవృత్తి
పరాయణుం డై పాడ్యమిం దొడంగి పదునాలుగు దివసంబు
లొక్కొక్క గింజయ కాఁ దగామెఁడు వడ్లు సమకూర్చి, పగ్వదినం
బునఁ బాకంబు సేయించి, దేవపితృపూజనంబు లొనరించి, యతిథుల
కన్నంబు వెట్టి మిగిలిన యన్నంబునఁ దానును బుత్రికళత్రంబులును
దేహయాత్ర నడుపుచు, నివ్విధంబునఁ బక్షోపవాసవ్రతంబున వర్తిల్లు
చున్నయెడ నొక్క పర్వదినంబునందు.

మ. మతి నత్యంతజుగుప్సితం బయిన యున్మత్తస్వరూపంబుతో
గతవస్త్రుండును, ముక్తకేశుఁడు, బహుగ్రామ్యోక్తిశీలుండు నై
హితపుణ్యుండు మునీశ్వరుం డతిథి యై యేతెంచె దుర్వాసుఁ డ
ట్లతి యమ్మ్రుద్గలుపాలికిం బటుబుభుక్షాయత్తతం దూలుచున్. 116

గ. అతనిఁ గని యించుకంతయు
మతి ననుమానంబు లేక, మానుగఁ బ్రత్యు

ద్గతుఁ డై యర్ఘ్యముఁ బాద్యము
నతిభ క్తి నొనర్చి మునికులాగ్రణి నెమ్మిన్. 117

క. అన్నంబు పెట్టె; నతఁడు త
దన్నం బంతయును గుడిచి. యాత్మఁ దనిసి, శే
షాన్నంబు మేన నిండఁగ
సన్నుతుఁ డలఁది కొని మగుడి చనియెె నిజేచ్ఛన్. 118

క. మునిపతి పర్వముపర్వం
బున మటియును సరుగు దెంచు; ముద్గలుఁడును దా
ననళనుఁ డై యుండియు న
మ్మునివరునకు నొసఁగు నన్నముం బ్రియ మెసఁగన్. 119

వ. ఇవ్విధంబున నాఱు పర్వంబులు గుడిచి దుర్వాసుండు వాని చిత్తం
బున నొక్క కొఱంతయు గానక యద్భుతప్రమోదమగ్న మానసుం
డై వాని కిట్లనియె. 120

క. "నీయట్టి దానశీలుని
నీయఖిలమునందుఁ గాన నెన్నండును; స
త్త్వాయత్తమతివి, సాధువి
ధేయుండవు, నీవు పుణ్యతేజుఁడ వనఘా. 121

చ. మనమున నేవగింప కవమానము సేయక, యించుకంతయుం
గినియక, యోలమందక, యకృత్రిమభ క్తి నొనర్చి తీవు స
జ్జనసుత! యన్న దానము; ప్రసాదము, సత్యము, ధైర్యమున్, దమం
బును, నపరిగ్రహత్వమును బొల్పుగ నీధన మయ్యె నియ్యెడన్. 122

చ. చవులకుఁ బ్రేముడించు ననిశంబును నాలుక; దాల్మి పెంపు, ధ
ర్మవును, శమంబుఁ బ్రెక్కొను సముద్ధతి నాఁకలి; వీని రెంటనుం
దవులవు; జీవితస్థితికిఁ దావల మన్నము; నీవు జీవితే
చ్ఛ విడిచి తిప్పు; డే మని ప్రశంస యొనర్తు? నినుం దపోనిధీ. 123

క. మనమును, నింద్రియములవ
ర్తనమును సరిగా నొనర్చు ధర్మంబు దపం

బని చెప్పుదు; రట్టితపం
బనఘా! నీయంద కలిగె నభినవభంగిఁ. 124

ఉ. ప్రీతుఁడ నైతి నీ వలనఁ; బేర్చిన పుణ్యఫలంబు లెల్ల నీ
చేతివ యయ్యెఁ; నీ దగు ప్రసిద్ధతపోవిభవంబు నిర్జర
వ్రాతము లిప్డు సాఁచుఁ; దివ్రివంబున కీవును మేనితోడ వి
ఖ్యాతిగ దేవయానమున గ్రక్కున నేఁగెదు సంయమీశ్వరా." 125

వ. అని పలికి దుర్వాసుం డరిగెఁ; దదనంతరంబ హంససారసయుక్తం
బును, గింకిణీ మాలికామనోహరంబును, గామగమనంబును నయిన
విమానఁబు గొనుచు దేవ దూత ముద్గలుకడకుం జనుదెంచి యి
ట్లనియె. 123

క. "అనఘ! భవత్సుకృతంబున
ననిమిషలోకాభి గమ మవాప్తం బయ్యెం;
జనుదెమ్ము; విమానము చ
య్యన నెక్కుము చిత్తమునఁ బ్రహర్షం బెసఁగన్." 127

వ. అనిన దేవదూతం జూచి ముద్గలుండు "మహాత్మా! దివిజలోకం
బెట్టిది? వినవలతు; నందుల గుణదోషంబు లెఱిఁగింప వలయు; సత్పురు
షులతోడి మైత్రి సాప్తపదీనంబని చెప్పుదురు;గావున మైత్రింబురస్క-
రించి నిన్నడిగెద" ననిన నతం డమ్మునీంద్రున కిట్లనియె. 128

—: ముద్గలునకు దేవదూత పుణ్యలోకంబు తెఱంగు సెప్పుట :—

క. "ఈ లోకమునకు మీఁ దై
చాలఁగ వెలుఁగొందుచుండు స్వర్లోకము, నా
నాలంకారయుతము, ది
వ్యాలోకము, దేవయాన మది మునినాథా! 129

చ. అమలతపోనివాసులు, మహాధ్వరశీలురు, సత్యసంధు, లు
త్తములు, జితేంద్రియుల్, సములు, దానపరుల్, రణశూరు లందు హ
ర్షమున వసింతు; రచ్చరులు, సాధ్యులు, దేవమునుల్, మరుద్వసు
ప్రముఖులు వేఱువేఱ తగుపట్టుల నుండుదు రంద యిమ్ములన్. 130

వ. మఱియు మువ్వదిమూఁడువేల యోజనంబులు విస్తృతంబైన మేరు శిఖరంబునందు నందనప్రముఖంబు లైన దేవోద్యానంబులు పుణ్యపురులకుఁ గ్రీడాస్థానంబు లై పిలసిల్లు; నయ్యెడల నాఁకలియు, నీరువట్టును, శీతోష్ణభయంబులును, జరారోగ వికృతులును బుట్ట; వెయ్యేడలం జూచిన నతి మనోహరం బై సకలేంద్రియతర్పణం బైయుండు; నిట్టి పుణ్యలోకంబునకు నర్హులయిన పుణ్యపురుషులు విధినియోగ పక్వంబు లయిన మానుషశరీరంబులు విడిచి తేజోమయంబులగు దివ్యదేహంబులు ధరియించి, వివిధాంబరాభరణభూషితులును, నమ్లానకుసుమమాలికామనోహరులును నై కనకవిమానంబులందు దేవదూతలచేతం గొనిపోవంబడి, యందు శోక భ్రమ శ్రమాయాస విరహితు లై వివిధసుఖంబు లనుభవించు చుండుదురు. 131

ఆ. అనఘ! యింద్రలోకమునకంటె మీఁద నిశ్శోక మగుచు బ్రహ్మలోక మమరు;
నది యనన్యదీప్తసదన మై తన రై న
వెలుఁగునను జగంబు వెలుఁగఁ జేయు. 32

చ. మనువులు, ధాతలుఁ, మునులు మానుగ నుండుదు రందు;

లోభముం.

గినుకయుఁ, గిల్బిషంబు, నపకీర్తియు, దుఃఖము, జన్మవైకృతం
బును జనియింప; వీభువనముల్ దెగునప్పుడు నాశ మెంద ద
వ్వినుతపదంబు; దానియెడ వేడుక సేయుదు రింద్రముఖ్యులున్. 133

వ. స్వర్గంబునం గల గుణంబు లెఱింగించితిఁ, దదీయదోషంబులు నెప్పెద విన్నము. 134

తే. ఇందుఁ జేసిన పుణ్యంబు లెల్లనందుఁ
గడుచుఁగాని మర్త్యున కందుఁ గడఁగి పుణ్య
మాచరింపంగఁ గాదు; పుణ్యావసాన
మగుడు భూమిఁ బ్రోతురు మగుడ నతని.

క. కడు మరగిన సౌఖ్యంబులు
విడుచుటఁ జిత్తంబు దుఃఖవివశముగ మహిం

బడుఁ జూవె పుణ్యలోకం
బెడలిన మనుజుండు దేజ మేది యబలుఁ డై. 136

క. తన తక్కువయునికియు, న
న్యునియున్న తలీలయుం గనుంగొని చిత్తం
బున నెరియు చునికి గలుగును,
జననుత ? సురలోక వాసజనులకు నెల్ల. 137

వ. బ్రహ్మలోకంబునం దక్కఁ దక్కిన పుణ్యలోకంబులం దెల్ల నిదియ మేర యై చెల్లు; మఱియుఁ బుణ్యలోక పరిభ్రష్టుండు మర్త్యలోకంబున సుఖశీలుం డయి పుట్టు; నీలోకంబు కర్మభూమియు నాలోకంబు ఫలభూమియు నని యెఱుంగుము; నీవలని యాదరంబునం జేసి యింతయుం జెప్పితి; నీ వింకఁ దడయ నేల ? చనుదె" మ్మనిన ముద్గలుండు గొండొక విచారించి దేవదూతం జూచి యిట్లనియె.

ఆ. "ఇట్టి దివ్యసుఖము లే నొల్లఁ; బదివేలు
వచ్చె నాకు; నమరవర్గమునక
యుండ నిమ్మ వాని; నో యన్న ! విచ్చేయు
మిష్ట మైనయెడకు నిష్ట నీవు. 139

క. ఎయ్యెడకుఁ జనినఁ బురుషుం
డియ్యెడకును మగుడ కుండు నెక్కాలము, నే
నయ్యుత్తమపదవి నై
యెయ్యనువున నైన నుత్సహించెద బుద్ధిన్." 140

వ. అని దేవదూత వీడ్కొలిపి ముద్గలుండు శిలోంఛవృత్తి విడిచి, పరమ శాంతిం గైకొని నిర్వికల్పం బైన జ్ఞానయోగంబునం జేసి తుల్యనిందా స్తుతియుఁ గు. సమలోష్టాశ్మ కాంచనుండును నై పరమసిద్ధిం బొందెఁ; పాండవోత్తమా ! నీవును రాజ్యరహితుండ నైతి నని వగవక తపంబు సేయుము; తపంబునం జేసి శుభంబులు సేకుఱుఁ; బధు మూఁడవు నేఁటి కడపటఁ బితృపై తామహం బైన రాజ్యంబు నిన్నుం బ్రాపించు" నని యిట్లు సాత్యవతేయుఁడు కౌంతేయుల నాశ్వాసించి నిజాశ్రమంబునకుం జనియె నంత. 141

మ. వితతానేకమృగాకులంబును, సదావిర్భూతనానాతరు
వ్రతతీపుష్పసుగంధబంధుర శుభావాసంబు, బ్రహ్మర్షిసం
శ్రితపుణ్యాశ్రమమండలంబు నగుచుం జె ల్వొందు నక్కానలో
ధృతపుణ్యుల్ విహరించి రేవురును గుంతీపుత్రు లిచ్ఛాగతిన్. 142

వ. ఒక్కనాఁ డమ్మహారథులు తృణబిందునాశ్రమంబున ధౌమ్యసహితం
బుగాఁ బాంచాలి నునిచి యేవురు నొక్కట మృగయార్థంబు నలు
దిక్కులకుం జనిన యనంతరంబ. 143

—: సైంధవుఁడు ద్రౌపదిం జూచి మోహించుట :—

ఉ. వీరుఁడు సైంధవుండు జనవిశ్రుతశౌర్యుఁడు సాల్వకన్య నిం
పారఁగఁ బెండ్లి యాడుటకు నై నిజవైభవ ముల్లసిల్ల వి
స్ఫారచతుర్విధోరుబలసంగతుఁ డై చను చుండి, యాశ్రమ
ద్వారమునందుఁ గాంచె ద్రుపదక్షితిపాలతనూజ నచ్చటన్. 144

ఉ. నీలపయోదమండలము నిశ్చలలీల వెలుంగఁ జేయుచుం
గ్రాలెడు వాలుఁగ్రొమ్మెఱుఁగుకైవడిఁ దద్వనభూమి నెంతయున్
లాలితదేహకాంతిపటలంబునఁ జేసి వెలుంగఁ జేయు న
బ్బాలఁ వినీలకుంతలవిభాసినిఁ జూచి సవిస్మయాత్ముఁ డై. 145

తే. మగువఁ దగిలిన చూడ్కుల మగుడఁ దిగువ
నేర్పు సాలక, యతఁడు కందర్పదర్ప
గోచరాత్ముఁడై నిజసఖుఁ గోటికాస్యుఁ
డను నృపాత్మజుఁ జూచి యి ట్లనియెఁ బ్రీతి. 146

ఉ. "ఇన్నలినాక్షి యెవ్వతియొ ? యివ్విపినంబున నేకతంబ యి
ట్లున్నది నిమిత్త మేమియొ ? సురోత్తమకన్యయొ, యక్షకాంతయో,
పన్నగభామయో ! మనుజభామిని గామి నిజంబ; యిట్టిచె
ల్వున్నది యే మహీతలమునుగ్మలు లెవ్వరియందు నారయన్ ?

ఉ. లీల యెలర్పఁగా నబల లేఁజిగురాకునుబోలె నొప్పు కెం
గేలు కదంబశాఖతుదిఁ గీల్కొనఁ జేసి వసంతవిభ్రమో
న్మీలితబాలవల్లిక్రియ మే లగుచూడ్కుల మించి పావక
జ్వాలయపోలెఁ జిత్తము నిజం బెరయింపఁ దొడంగెఁ జూచితే. 148

ఉ. ఈకమలాక్షి నాకు హృదయేశ్వరి యైనఁ ద్రిలోకరాజ్యముం
జేకుఱ నేలినట్లు విలసిల్లఁ నె; దర్పకవీరు బంటుఁ గాఁ
గైకొని సర్వభోగములుఁ గాంతు; నొడంబడఁ బల్కఁ దీనికిన్.
నాకును బొం దొనర్చి కరుణం జరితార్థునిఁ జేయవే ననుఁ." 149

వ. అని పనిచినం గోటికాస్యుండు గ్రక్కునం బాంచాలిపాలికిం జని
ప్రణయ సుభగంబుగా నమ్మగువ కిట్లనియె. 150

సీ. "మృగనేత్ర ! దారుణమృగసమాకుల మైన
యివ్వనాంతరమున నేకతంబ
యిట్లు నీయున్కికి నెయ్యది మూల ? మి
వ్వనదేవతవో ! సురేశ్వరునితోడ
నలిగి ధరిత్రికి నరుగుదెంచినశచీ
లలనవో ! హరియురస్థ్సలిఁ దొరంగి
కేలిఁ గ్రుమ్మరు పద్మ గేహవో! భవదీయ
జనకత్వమున సముజ్జ్వలితుఁ డైన

తే. పుణ్యుఁ డేవంశమునవాఁడు ? పొలఁతి ! నీదు
జీవితేశ్వరుఁ డగు సుఖజీవితాత్ముఁ
డెవ్వఁ ? డబల ! నీనామమై యింపు మిగులు
శబ్ద మెయ్యది ? నాకు నిజంబు సెపుమ. 151

క. కరిరాజగమన ! మాతెఱఁ
గరయఁ దలచితేని వినవె యధికబలుఁడ నే
సురథుఁ డను రాజు పుత్రుఁడ
నరిమథనుఁడఁ గోటికాస్యుఁడు డనఁ జనువాఁడన్. 152

తే. అల్ల కాంచనరథముపై నలరువాఁడు
ఘనుఁడు, క్షేమంకరుండు త్రిగర్తవిభుఁడు;
మఱియు నిను జూచుచున్నాఁడు మగువ! వాఁడె
దీప్తభుజుఁడైన కాళింగదేశవిభుఁడు. 153

తే. ఉల్ల పద్మాకరముపొంతనుండి నిన్ను
మెచ్చి కనుఁగొనుచున్న యున్మీలితాక్షుఁ

దుర్వినిష్వాకువంశోద్భవుండు సూవె
సుబలభూపతిపుత్రుండు సుభగుఁ డతఁడు. 154

వ. అరుణాశ్వయుక్తంబు లయిన రథంబులయందు రత్నమయభూషణు
లయి సమిద్ధవహ్నులుంబోలె వెలుంగుచున్న యా సౌవీరకుమారులు
పన్నిద్దఱుం దన్నుం జేరి కొలువ, ననేక సహస్రకరితురగరథపదాతి
పరివృతుం డై మహాగజంబుపై శోభిల్లుచున్న యవ్వీరుండు సింధు
సౌవీరనాథుండైన జయద్రథుం; డమ్మనుజేశ్వరుం డిప్పుడు నీతెఱం
గెఱుంగఁ దివిరి నన్ను నిట పుత్తెంచె'' ననినఁ బాండవపత్ని మృదు
సంభ్రమంబునం గదంబశాఖ విడిచి యుత్తరీయంబు సంగతంబు
గావించుకొని కోటికాస్యున కిట్లనియె. 155

తే. "అన్న! యిచ్చట నే నొంటి నున్నదాన;
నీ విచటి కేఁగు దెంచుట నియతి యగునె?
సుతవతిని ధర్మవతి నన్ను నితరకాంతఁ
గాఁగఁ దలఁచి పెక్కులు వల్కఁగాదు నీకు. 156

వ. నీవు శిబివంశోద్భవుం డైన సురథు పుత్రుండ వగు చే నెఱుంగుదు;
నస్మత్ప్రభు కారంబు నెప్పెద వినుఁ; మేను పాంచాలపతి యైన ద్రుపదు
కూఁతురఁ; గృష్ణయనుదానం; పాండునందను లగు యుధిష్ఠిర భీమా
ర్జున నకుల సహదేవులకు ధర్మపత్ని; నవ్వీరు లిప్పుడు నన్ను నివ్వనం
బున నునిచి. 157

తే. ధర్మజుఁడు దూర్పు, భీనుఁడు దక్షిణంబు,
నర్జునుఁడు పడమర, గవ లర్థి నుత్త
రంబుగా వేఁటవోయిరి; రాజముఖ్య
లనఘు లింతకు వత్తురు వినుతబలులు. 158

వ. మీ రమ్మహాత్ములకు మాననీయులరు గావున నార్యజనమిత్రు లగు
నక్కురుకుల పవిత్రులు సేయుసత్కారంబులుం గైకొని పోవుదురుగాని
యొక్కింతతడ వియ్యాశ్రమసమీపంబున నిలువుం'' డని పలికి
యల్లన యవ్వరవర్ణిని భయంబునం బర్ణ గృహంబు సొచ్చినం గోటి
కాస్యుండును గ్రమ్మఱి చని, జయద్రథునితోడ నభ్యామిని పాంచాల

కన్యక యనియును, పాండవపత్ని యనియునుం జెప్పిన, నద్దురా
త్ముండు మదన కంపితహృదయుం డగుచు నమ్మగువ నపహరింపం
దివిరి, కతిపయ జనసమేతంబుగా నరిగి, సింహాగారంబు సొచ్చు వృకం
బునుంబోలెఁ బాండవ నివాసంబు సొత్తెంచి పాంచాలిం గని దాని కి
ట్లనియె. 159

క. "వామాక్షి! నీకుఁ గుశలమె?
నీమన సెవ్వారియందు నిత్యప్రేమం
బై మెఱయు నట్టి సొబగులు
నీమగ లేవురకు నిపుడు నెమ్మదియె? మదిన్?" 160

వ. అనిన వానికి నమ్మానవతి యి ట్లనియె 161

చ. "స్థిరమతు లైన పార్థులకు సేమమ; నీకు ననామయంబె? భూ
వర! తగ విందవైతి కురుపర్యులయింటికి; నట్లు గావునం
బరువడి నాసనక్రియయుఁ బాద్యము గైకొను మాదరంబుతో;
సరసకురంగమాంసములఁ జల్పుము భోజనకృత్య మిత్తఱిన్. 162

ఆ. వేఁట వోయినారు విభు; లిప్డు వత్తురు;
వారు వచ్చి నీకు వలయునట్టి
ప్రియము లాచరింపఁ బ్రీతుండ వై మఱి
యిష్టజనులు నీవు నేఁగు మనఘ! 163

చ. అనవుడు సైంధవుం డనియె "నంబుజలోచన! నీవు మాకుఁ జే
యు నతిథిపూజ లన్నియును నొక్కట నైనఁ గొఱంత లేక వ
చ్చినవియ, మన్మథాస్త్రముల చిక్కునఁ గాఁటియుఁ బ్రొంద్దె డెంద; మిం
క నన్నుఁ గృతార్థుఁ జేయుము; దగన్ రథ మెక్కుము; లెమ్ము
నెమ్మితోన్. 164

మ. ధరణీరాజ్యముఁ గోలుపోయి ఘనకాంతారస్థలీవాసు లై
సరివా రెల్లను నవ్వఁ గుత్సితదశాసంప్రాప్తి మై నున్న ము
ష్కరులం బార్థులఁ గొల్చినం గలదె సౌఖ్యం? బెంతయున్ బేల వై
తరవిందానన! శ్రీవిహీనులఁ గరం బర్థింతురే కామినుల్? 165

ఆ. చిగురుఁబోఁడి! నిఖలసింధుసౌవీరభూ
వలయరాజ్యగౌరవంబుతోన
నన్ను నేలికొని. మనఃప్రియభోగైక
యోగ్య వగుము; విడువు మొండుదలఁపు." 166

వ. అనినఁ బాంచాలి ప్రకంపితచిత్త యగుచుఁ గొండొక దొలంగి వాని దెస నవమానదృష్టిం జూచుచుఁ; దన పతుల రాకయ కోరుచుం, బ్రతివాక్యంబులఁ గొంత కాలక్షేపంబు సేయుటకై వాని కిట్లనియె.

తే. "తలఁపఁ బాండవధార్తరాష్ట్రులకుఁ జెలియ
లైన యా దుస్సలకుఁ బతి వనఘ! నీవు
నాకుఁ దోఁబుట్టువవు గావె? నీకుఁ జనునె
పాడి దప్పినమాటలు వలుక నిచట? 168

క. నయమును ధర్మముఁ గల య
న్వయమున జనియించినాఁడ; వక్కట! ధర్మ
క్రియ యెఱుఁగంగా వలదె? యు
భయలోకవిరుద్ధ మైన పథ మేమిటికిన్?" 169

వ. అనిన నద్దురాత్ముండు దరస్మితాననుం డగుచు నిట్లనియె. 170

క. "వనజాక్షి! రాజధర్మము
వినవే యెన్నఁడును? మనుజవిభులకుఁ బ్రమదా
జనులయెడ వావి వెదకం
జనదు; వలసినట్ల వేడ్క సలుపఁగఁ జెల్లున్. 171

క. విను పుదియుఁ గాక, జగమున
వనితారత్నంబు లెల్ల వారికి భోగం
బునయెడ సాధారణము; లో
కని ధన మని గురుతు గలదె? కరినిభగమనా." 172

వ. అనిన నయ్యంగన క్రోధకలుషితాంతరంగ యై యిప్పాపాత్ముండు ప్రియవచనంబులం బోవండు, బెట్టిదంబులంగాని చక్కంబడఁ డని తలంచి, యిట్లనియె. 173

—: ద్రౌపది సైంధవునితో నిష్ఠురోక్తులు వలుకుట :—

చ. ప్రకటిత శౌర్యసారుల, నభగ్నపరాక్రమనిర్జితాహిత
ప్రకరులఁ, బాండునందనులఁ, బాండుయశస్కుల నాత్మలో దలం
పక ననుఁ ధిక్కరించెదు; నృపాలకులాధమ! నీదుగర్వదు
ర్వికసన మింతఁ బోదు, తుది ప్రేఁ గగుఁ, దక్షుము దుష్పలాపముల్.

మ. హిమవత్పాదవనాంతకేలిరతిమై నేపారి కోపారుణ
క్రమనేత్రాంచల మై ప్రభూతమదరేఖం బైనగంధద్విపేం
ద్రము డాయం జని సిళ్లు సూపుట సుమీ ధర్మాత్ము నత్యుగ్రవి
క్రముఁ గౌంతేయవరిష్ఠు నీవు దొడరంగాఁ జూచు టూహింపఁగన్.

ఉ. శాతనఖాగ్రఖండితలసన్మదకుంజరకుంభమ క్తము
క్తాతతశైలకందరగుహాంతరసుప్తమృగేంద్ర కేసర
వ్రాతము వేడ్క నూఁచికొన వారక చేరుట గాదె, క్రోధని
ర్ఘాతమహోగ్రు భీముఁ జెనకం దలపోయుట నీకు నెమ్మెయిఁ?

మ. చలజిహ్వాగ్రవిలీఢవిస్ఫురితదంష్ట్రాభీషణం బైన బె
బ్బులిఁ గోలం గొని ప్రేసి త్రోసి తొలఁగం బోవచ్చినఁ వచ్చుఁ గా
క లసత్కాశిరళరాగ్నిదుస్సహుని నగ్గాండీవి నల్గించి యె
వ్వలనన్ మానధనాఢ్యు లై బ్రతికి పోవఁ వచ్చునే యేరికిన్?

ఉ. బోరన విస్ఫులింగములు వొడ్మఁగ, నుగ్రవిషంబు గ్రక్కుచుం
గ్రూరవిచేష్ట నాలుకలు గ్రోయు మహోరగరాజయుగ్మముం
జేరి పదాహతిం గినియఁ జేయఁ దలంచుట గా నెఱుంగు దు
ర్వారులు మాద్రిపుత్రుల కవజ్ఞ యొనర్పఁ దలంచు టేర్పడఁ.

ఉ. ఆలములోన వీఁక నమరాసురకోటికి నైన దుర్జయుల్,
వాలినవీరు లవ్విభులు; వారికి నెగ్గొనరించి పోయి పా
తాళమునిం సొచ్చి డాఁగినను దప్పదు మృత్యువు; నీకు నక్కటా
కాలము నిండె; నీవశము గాదు విధాతృని చెయ్ది త్రోవగాన్. 179

క. తేలును, గర్కటియును దెగు
కాలమునకుఁ జూలు దాల్చుగతిఁ బార్థుల యి
ల్లాల నయిన నాదెస దు
ర్వీలుఁడ వై; తిది వినాశచిహ్నము గాదే?" 180

వ. అనిన జయద్రథుండు నవ్వుచు నవ్వెలంది కిట్లనియె. 181

ఉ. "వారిజనేత్ర! పాండసుతవర్గము నేఁ డిట మాకు వింతయే?
భీరులఁబోలె నేల వెఱపించెదు మాటల మమ్ము? వించె, సౌ
వీరకులప్రసూతులము వీరుల మే; మితరక్షితీశసా
ధారణబుద్ధి సేయకు ముదాత్తచరిత్రుల మైన మాదెస. 182

వ. వలవనిమాటలఁ దేర్చినం దీరదు; వేగంబ యల్ల కనకరథం బొండె,
నల్లమహాగజంబు నొండె నెక్కుము; భీరంపు మాటలాడక ప్రియ
వచనంబుల నస్మత్ప్రీసాదభాజనంబ వగు" మనిన విని యాజ్ఞసేని
వానికిట్లనియె. 183

ఆ. వీరపత్ని నయ్య, వీరసహోదరి
నయ్య, నీకుఁ జూడ ననదవోలె
నున్నదాన; నెట్టు లున్నను నాకు నిన్
దెలుప నేల? పలుకుతియ్య మేల? 184

చ. అతులితవృష్ణి కేకయబలావళితోఁ, బటుశంఖఘోషభీ
షితభువనత్రయుం డగుచు, శీఘ్రతురంగరథాధిరూఢుఁ డై
జితదనుజాన్వయుండు యచుసింహుఁడు వెన్నుఁడు ముట్టి నిన్ బరి
భూతబలుఁ జేయ, నాకు దెస గల్గు టెటింగెదు గాక యత్తఱిన్.

సీ. గాండీవరేఖ యాఖండులుచాపంబు
కరణి గాఁ, దద్గుణక్వణము ఘోర
గర్జగా, నవిరళగంభీరవీర
సోపూర్ణ మై సంతతావలిప్త
శత్రుప్రతాపోష్ణసమయంబు శమితంబు
గా, మిత్రబర్హి కేకారవంబు
లెసఁగంగఁ దోఁతెంచి, యింద్రనందనమహా
జలధరం బాయతసాయకోరు

ఆ. వృష్టి ముంచుటయును వెరగంది నిలువంగ
నలవి గాక పఱచునప్పు డై న

నాత్మదోషవృత్తి కై మనంబున వగ
చెదవు గాక; యిపుడు సెప్ప నేల? 186

ఉ. ఘోరగదా విదారణ విఘూర్ణితశాత్రవకుంభికుంభముల్
చీరుచు మౌక్తికంపుఁదనిచే రణభూమి నలంకరించు కే
లీరసలోలుఁ డై సమదలీల బకాంతకుఁ డేఁగుదేరఁ గ
న్నారఁగఁ జూఁచి కాక యిటు లంతకు నీమది త్రుళ్లడంగునే?

క. ననుఁ బెఱవనితలచందం
బున నవమానింప నీకుఁ బోలఁదు; మఱా
వనపాతివ్రత్యమహిమ
ననిశము నేకీడు నెందు నందదు నన్నన్." 188

వ. అని పలి ద్రౌపది యద్దురాత్ముండు దన్నుఁబట్ట సమకట్టు కన్నెటిఁంగి తమ పురోహితు ధౌమ్యునిం బేర్కొని యాక్రోశించిన నతం డతి రయంబునఁ జనుదెంచు నాలోన.

—: సైంధవుఁడు ద్రౌపదిని బలాత్కారముగా నెత్తికొనిపోవుట :—

ఉ. పాపవినిశ్చయుండు నతిపయ్యెదకొంగు గడంగి పట్టినం
గోపముతో నుదల్చికొని కోమలియుఁ వెస వాని ప్రేయుడుం,
బోపడి వాఁడు చిత్రముగ భూమితలంబునఁ ద్రెళ్ళి మారుతా
తేమవిభగ్నమూల పయి చెచ్చెరఁ ద్రెళ్లు మహీరుహంబు నాన్.

వ. ఇట్లు నేలం బడి తనయక యెగసి జయద్రథుండు మగువం దిగిచి రథంబుపై నిడికొని, సపరివారుం డయి యరుగం దొడంగె; నప్పుడప్పాలఁటి పురోహితునకు మ్రొక్కిన నమ్మహాత్ముండు సైంధవుం బేర్కొని యిట్లనియె. 191

మ. "తగునే రాజకులప్రసూతులకు నత్యంతంబు నేతాదృశం
బగు దుష్కర్మము? నాదుపల్కు వినుఁ; మీ యబ్జాక్షి పుణ్యాత్మ; యి
మ్మగువన్ వేఁ విడు; పాండునందనులు నీ మానంబుఁ ప్రాణంబు నే
పగిదిం గొందురు గాని పోవిడుప; రీపాపంబు నిఁ ద్రెక్కొనుఁ."

వ. అని యాక్రోశించుచు నమ్మహాసురవరుండు వాని పిఱుందన చనియె; నిట పాండవులు నవ్వనంబున ననేక మృగంబుల వధియించి యందఱు

నొక్కయెడం గూడంబడి యాశ్రమాభిముఖు లై వచ్చునెడ
దమ్ములం జూచి ధర్మజుం డిట్లనియె. 193

సీ. "ఇనుఁడున్న దెసనుండి యెలుఁగింపఁదొడఁగెఁ బ
శులు; మృగంబులు నతిఘోరగతుల
మగిడెడు; నిప్పుడు మనకు దాపలిదెస
నతిభీషణాకృతి నఱచె వఱుడు;
పగఱచే నవమానపాటును గయ్యంబుఁ
గలుగు నీళకునప్రకార మరయఁ;
గడుకొని చెయి వెట్టి కలఁచిన ట్లయ్యెడుఁ
జిత్తంబు; తనువు నిశ్చేష్ట మయ్యె,

ఆ. నరుగుదెండు వేగ; యాశ్రమంబునఁ గృష్ణ
నునిచి సచ్చినార మొంటి; నకట!
తలఁపఁ గ్రూరమతులు ధార్తరాష్ట్రులు గడు
నెగ్గు సేయఁ జూతు రెడరు వేచి, 194

ఆ. కమలహీన మైన కమలాకరమువోలె
రాజహీన మైవ రాత్రివోలె
జూడఁ గామ్యకంబు శూన్యమై యున్నట్లు
దోఁచె; నేమికీడు దొడరుకొక్కో?" 195

వ. అనియె; నిట్లయ్యెడ నరదంబులు సత్వరంబుగాఁ దోలుకొని యాశ్రమంబునకు వచ్చునెడఁ బాంచాలిపరిచారిక ధాత్రేయిక యను నది యతికరుణంబుగా నేడ్చుచున్నం గని, ధర్మతనయసారథి యైన యింద్రసేనుండు రథంబు డిగ్గ నుఱికి చని "యిది యేల? నేలం బడి పొరలుచుఁ నేడ్చెదవు? నీ కపకారంబు సేసినవారెవ్వ?" రనిన నది వానిం జూచి "సైంధవుచేతం బాంచాలి చెఱపోయె" ననిపలు కుచుఁ బెల్లేడ్చిన నింద్రసేనుం డిట్లనియె. 196

సీ. "పాండుపుత్రులబహిఃప్రాణంబు నుత్తమ
శీలసమగ్రఁ బాంచాలతనయఁ
గొనిపోవునంతటి గుండె గల్గెనె? విమో
హాంధమానసుఁ డైన సైంధవునకు;

నేఁగుఁ గా కేమి మహీతలగతుఁ డైన
గగనంబునకు వేగ యెగసి చనినఁ
బో నిత్తురే పౌరివుత్తురు గాక యు
ద్ధురవృత్తిఁ బార్థు లాదురితచరితు ?

ఆ. వీరవరులఘోరవివిధాస్త్రకౌశలం
బెఱుఁగఁ డయ్యెఁ గాక యేమి వాఁడు;
వగవ కుండు మబల ! వైరినుగ్రతఁ దున్మి
మగువఁ దెత్తు రిపుడ మనుజవిభులు.'' 197

వ. అనిన నయ్యంగన యపాంగతరంగితంబు లగు బాష్పజలంబు లల్లన కరపల్లవ ప్రమార్జనంబుల నపనయించుచు నతనిం గనుంగొని యి ట్లనియె. 198

ఆ. ''ఇంద్రకల్పు లైన యేవురున్నపతుల
నాత్మఁ గొనక యుటక యంబుజాక్షి
నసహరించినపుడ యద్ధురాత్మునకును
జేటు మూఁడె వేఱ చెప్ప నేల ? 199

ఉ. ఇంతకు మున్న వాఁడు సనియెం; గడు దవ్వుగఁ బోవ కుండ న
త్యంతరయంబునం బటురథావళి యెప్పుఁగ నేఁగుఁ; డుగ్రు లై
సంతనకట్టుఁ డస్త్రములు, శస్త్రములుం; దొడుగుండు వర్మముల్;
సంతతదివ్యబాణముల శాత్రవుఁ దున్మ్మఁడు; డెందు నెచ్చెలిఁ. 200

సీ. బూదిలోఁ దొరఁగినపూర్ణాహుతియుఁబోలెఁ,
గుక్కతోత్తిత్తిలోఁ గూరినట్టి
రాజితకపిలగోరసధారయునుబోలె,
మసనంబులోఁ బడ్డ మహితపుష్ప
మాలికయునుబోలె, మదిరాక్షి దుర్జను
కతమున దూషిత గాక మున్న
చనరయ్య వేగంబ; చనువె సన్మంత్రవి
శ్రుతపురోడాశంబు శునకమునకుఁ ?

తే. జనునె కమలసుగంధికాసారకేళి
కలుషశఖాది యైన సృగాలమునకుఁ ?
జనునె తన్వంగిసౌందర్యచతురభావ
భంగి యాదుష్టచరితునిపాలు వడఁగ ?" 201

—: పాండవు లేవురు సైంధవుపై యుద్ధమునకుఁ బోవుట :—

వ. అని పలుకు చున్న ధాత్రేయిక పలుకులు విని దాని నాశ్వాసించి యక్కుఱు వీరులేవురు నాతురణంబ సన్నద్ధు లై, క్రోధావేశంబునంజేసి మహోరగంబులుంబోలె రోఁచు, జయద్రథు వెన్నడి దాడి వెట్టి కూడనుట్టి, తత్సైన్యంబు పిఱుంద నాక్రోశవచనవిహ్వలుం డై పోవు చున్న ధౌమ్యుం గని నమస్కరించి మీరింక విగతఖేదులరై యొయ్యన రం డని యామిషంబునకుం గవియు డేగలుంబోలె సైంధవసేనపయిం గవిసి సింహనాదంబులు నేసి; రప్పుడు పాండు పుత్రులరథంబుల యడియాలంబులు సూచి సైంధవుండు ద్రౌపది కిట్లనియె. 202

క. "ఈపచ్చురథంబులవా
రేవురు నీమగలె యంబుజేక్షణ ? వీరిన్
భావించి యెవ్వఁ డెవ్వం
డేవిధమునవాఁడు నెపము యెఱుఁగఁగ వలయున్. 203

వ. అనిన నప్పాంచాలి యనాదరక్రోధమూర్ణిత యగుచు నతని కిట్లనియె.

ఆ. "ఇంక వీరి నెఱిఁగితేనియు నెఱుఁగక
యుండితేనిఁ జేయ నొండు గలదె ?
దుర్మదమునఁ గరము దుశ్చరిత్రమునకుఁ
జొచ్చి నీకుఁ జేటుఁ దెచ్చికొంటి. 205

వ. అయినను న న్నడిగితివి గావునం జెప్పెద నింతియకాని నీవలన నాకు భయమించుకంతయుఁ గలుగదు; సోదరసహితుం డైన ధర్మనందనుం గంటి; నింకఁ గుశలంబ యని పలికి యి ట్లనియె. 206

మ. తనుపృత్తాంగుఁడు, శుద్ధకాంచనసముద్యద్వర్ణుఁ, డభ్యుల్లస
ద్వనజాతాయతచారులోచనుఁడు, దీవ్యద్భూరితేజోఘనుం,

డనఘుం డల్ల రథంబుపై వెలుఁగు పుణ్యాత్ముఁడు ధర్మాత్మఁజుం
డనిరోధప్రతిభా ప్రభావనిధి యత్యాశ్చర్యశౌర్యం డనిన్. 208

చ. కురుకులశేఖరుం డతఁడు ఘోరరణంబుల నెట్టిశత్రులున్
శర ణని సొచ్చి రేని విలసత్కరుణామతిఁ గాచు; నీవు చె
చ్చెరఁ జెడి పోక, నాపనుపు సేసి, వినీతి యెలర్ప నమ్మహా
పురుషుని నాశ్రయింపుము; విభుండును నీ దగుతప్పు లోఁగొనున్.

చ. ఘనజవసత్త్వచారుతురగంబులఁ బూనిన యల్ల విస్ఫుర
త్కనకరథంబుపై నతులకాయుఁడు, సాలమహీరుహంబుచా
డ్పునఁ దనరారుచున్, వెలయు భ్రూకుటియున్, దశనోష్ఠపీడనం
బును నయి యున్న వాఁ డనిలపుత్రుఁడు భీముఁడు, భీముఁ డాజులకా

ఉ. ఈతనిపౌరుషం బరయ నెందు నమానుషకృత్య, మప్రతీ
ఘాత, మనేక , మద్భుతము; గర్వితు లౌ ధరణీశ్వరుల్ నిజం
బీతని నాజిలోఁ జెనయ నెవ్వరు నోడుదు; రిమ్మహాభుజుం
డాతతరోషుఁ డైనఁ బ్రళయానలునట్టిఁడ; యూఱఁ డేమిటన్. 210

ఉ. ధర్మజుకూర్మితమ్ముఁడును, దత్ప్రియశిష్యుఁడు నైన వాఁడు, స
త్కర్ముఁడు వాఁడె చూడుము ప్రగాఢ నికీర్ణజితేంద్రియుండు, ధు
ష్కర్ములఁ గన్న సైఁపఁడు, నికామభయంకరవిక్రమక్రియా
నిర్మథితారి, ఫల్గునుఁడు. నిగ్మలతేజుఁ, డజేయు, డేరికిన్. 211

క. అవళగతిఁ గామరోషా
దివికారము లొందినను, మదిని ధర్మపథ
ప్రవిహతి గానీఁ డత; డా
దివిజేంద్రతనూజుఁ డద్వితీయుఁడు వేగ్మిన్. 212

చ. అయనలయసంగ్రహుండు, వినయవ్యవసాయి, భయార్తలోకసం
శ్రయుఁడు, గృతాస్త్రుఁ, డాహవవిశారదశౌర్యుఁడు, శిష్టబాంధవ
ప్రియుఁ, డసమానసుందరగభీరశుభాకృతి, యల్ల పుణ్యుఁ డా
రయ నకులుండు పాండుసుతగాత్రము, భాసురకీర్తి, యిమ్మహిన్.

ఉ. వీరుఁడు చిత్రయోధి, దృఢవేధి. గృతాస్త్రుఁడు, భూరిబుద్ధివి
స్ఫారుఁడు, వాగ్విశారదుఁడు పార్థులకూరిమితమ్ముఁ, డుజ్జ్వలా

కారుఁడు, ధర్మదకుఁ. డవికారుఁడు, ప్రౌఢపతంగతేజుఁ, డ
ద్ధీరుఁడు పాండవుండు సహదేవుఁడు దేవనిభుండు వెంపునఁ. 214

తే. కొడుకులందెల్లఁ గడుఁగూర్చుగొంతి యితని;
మ్మహాత్ముఁడు మహి చలియించెనేని,
నగ్ని చల్లన యయ్యె నే, నాత్మఁ దాను
ధర్మనిష్ఠుఁడై సత్యంబు దప్పఁ డెపుడు. 215

వ. వీరేవురు నత్యంత దుర్వారులు; వీరిబారిం బడిన వారాశినడుమ
నుగ్రమకరాహతం బై యనియు పేరోడయుంబోలె నీ సైన్యంబు
వికలం బగు; నీవునుం బ్రాణంబొండె. మానం బొండెఁ గోల్పోక
మెయిమెయిం బో నేర్చెదవే?" యనియె; నప్పుడు కౌంతేయులు
సైంధవసేనం దలపడి దిఙ్ముఖంబున నెల్లం జీఁకట్లు గవియునట్లుగా
బాణపటలంబులు వఱఁగింపం దొడంగిన. 216

క. "తొలఁగకుఁడు, పొదువుఁ. డేయుఁడు;
నిలువుఁడు, వడిఁ బొడువుఁ" డనుచు నిజయోధులఁ దాఁ
గలయఁ బురిగొల్పి సైంధవుఁ
డలఘుపరాక్రముఁడు నిలిచె నాహవభూమిన్. 217

వ. ఇట్లు త్రిగర్త శిబి సింధు సౌవీర సైన్యంబులతో ననేక నరపతిపరివృ
తుం డై నిలిచిన, జయద్రథుం జూచి భీమసేనుండు క్రోధారుణలోచ
నుండై రథంబు డిగ్గి హేమబంధబంధురంబును నయోమయంబును
నగు గదాదండంబు ద్రిప్పుచు వానిపయిం గవిసిన, నడ్డపడి కోటి
కాస్యుండు నిజసైన్యసంఘంబుతో నమ్మహావీరుం బొదువుటయు
నతండు. 218

క. మదగజముల, రథయోధులఁ
బదాతులను, దురగములను, బలువిడిఁ గలయం
జదుపుచు దుర్వారగతిన్
విదితబలుఁడు ఘనగదాప్రవీణత మెఱసెన్. 219

వ. ఇట్లు విహరించి యహితసైన్యంబు నిహతం బగుటయుఁ జెలంగి
సింహనాదంబు సేసి యతండు సారథిసముపనీతం బైన రథంబు సాద
రంబుగా నెక్కి గృహీతశరాసనుం డై విక్రమించె; మఱియును. 220

ఉ. అలిగి యుధిష్ఠిరుఁడును న
గ్గలికం బ్రతిపీరు లడఁగఁ గార్ముకవిద్యా
విలసనము మిగుల సూపి
రుల నూర్వుర రథివరుల రూ పడఁగించెన్. 221

క. నకులుఁడు నిశాతసాయక
నికరంబుల సమరధారుణీతల మెల్లం
బ్రకటపరవీరపరమ
స్తక బంధురముగ నొనర్చె ఘోరణభంగిన్. 222

క. నారాచపాతముల దు
ర్వారుఁడు సహదేవుఁ డావమఖంబున న
శ్వారోహకులం గూల్చుచు
వీరవిహారంబు సలిపె వేడ్క యెలర్పన్. 223

ఆ. సింధురాజసైన్యసింధుపూరమునందు
మహితఫల్గునాఖ్యమంథనగము
దిరిగి కలఁపఁ దొడఁగఁ బరనృపాలక మహా
జలచరవ్రజంబు సంచలింప. 224

కం. వారణకోటి దదారో
హకులతోన
వివశ మై యొఱలుచు నవనిఁ బ్రెల్లెఁ;
సూతహయధ్వజపాతపూర్వకముగ
రథములు దుమురయ్యె రథులతోన;
వెస రావృతులతోన వస మజీ హయములు
గెడసి యెల్లెడలను బుడమిఁ గప్పె;
దండడి దిరలుచు సందడి పెల్లుగాఁ
గాలుబలంబులు గూలెఁ గలయఁ; 225

ఆ. దుముల మధిక మయ్యె; సమరతలంబున
ఘోరరుధిరవారిపూర మెసఁగె;
జితవిరోధిబలుఁడు శతమఖసూనుండు
చాపనైపుణంబు సూపునపుడు.

తే. సవ్యకరమునందును నపసవ్యకరము
నందుఁ బర్యాయసంగత మగుచుఁ జూడఁ
గొఅవిర్రిపిన యొన్పున మెఅసేఁ బార్థు
గాండివము వాలుఁదూపుల గని యనంగ. 226

వ. అట్టియెడం ర్రిగర్తపతి యైన సుధన్వుండు గదాహస్తుం డై రథంబు డిగ్గి చని ధర్మ తనయు రథ్యంబులఁ గూలనేసిన, నతండు నిశితసాయ కంబున వానియురంబు ర్రచ్చి విగతజీవుం గావించి, సత్వరంబుగాఁ జని సహదేవు నరదం బెక్కి; మఱియును ర్రిగర్తులలోన మహాముఖ క్షేమంకరు లనువారు నకులుం బొదివి ఘనశరా సారంబు గురిసి జలధరంబులుం బోలె గర్జిల్లిన నమ్మాద్రీసూనుండు వారి నిద్దఱఁ బెక్కమ్ములఁ నొప్పించె; నంతఁ దదీయాగ్రజుం డగు సురథుండు. 227

చ. కరినికరంబుతోఁ దొడరి గర్వితుఁ డై తన వారణేంద్రు న
క్కురుకులవీరుమీఁద నెస కొల్పినఁ, దర్రథఘోటకంబులం
బరుషతఁ జంపె నగ్గజము; వాయక వాఁ డసిచర్మహస్తుఁ డై
ధరణికి దాఁటుచో నది మహంబున వెండియుఁ బై ఁగడంగినన్. 228

చ. తొలఁగక యమ్మహాబలుఁడు దోర్బల మెప్పఁ గృపాణపాతభం
గులఁ గరినాథు కేలు నిరుగొమ్ములతో బెరయంగఁ ర్రుంప బె
ట్టిలకు విచేష్టమై నొఅగు నేనుఁగుపై నతిమాత్రభీతివి
హ్వలుఁ డగు శత్రు నుద్ధతిఁ గృతాంతవిధేయునిఁ జేసె ర్రేల్మిడిన్.

క. వైరులు దలఁకఁగ నిమ్మై
దారుణపౌరుషవిశేషదక్షుం డై య
వ్వీరుఁడు రయమున నరిగి స
మీరతనయునరద మెక్కి మెఅసెం బోరన్. 230

చ. ఘనుఁడు వృకోదరుండు దనుఁ గట్టలుకం దలపడ్డఁ గోటికా
స్యనితురగంబులం దునిమి, సూతునికంఠముఁ ర్రుంచివై చి, తీ
వ్రనిశిత మైన ర్రాసమున వాని యురఃబు వగిల్చి చంపినం,
గనుకనిఁ జాఱె భీతి యెసఁగంగఁ దదీయచమూసమూహముల్. 231

—: అర్జునుఁడు సౌవీరకుమారులఁ బన్నిద్దఱఁ జంపుట :—

వ. అంత నంగారకుండును, గుంజరుండును, సృంజయుండును, సుహ్రత కుండును. శత్రుంజయుఁడును, సుప్రబుద్ధుండును, శుభంకరుండును, భ్రమంకరుండను, శూరుండును, రథియును, గుహాకుండును, బలాధ్యుండును ననుసౌవీరకుమారులు పన్నిరువురు నిజాశ్వాకు శిబి సైంధవ త్రిగర్తసైన్యంబులం గూడి క్రీడిమార్కొని పటుబాణ జాలంబులం గప్పిన. 232

మ. అతులక్రోధవిఘూర్ణనాననహృదయుం డై చండగాండీవని
ర్గతభల్లౌఘములం దదస్రస్రవితతుల్ ఖండించి, సౌవీరసం
తతిఁ బన్నిద్ధఅవిఁడ్లులం దునిమి, దోర్దర్పంబు మీఱంగ సు
స్మితుఁ డై యాతఁడు దచ్ఛిరఃప్రకరవిచ్ఛేదంబు సేసెఁ వెసన్. 233

క. ఆకులముగ శైబ్యుల, ని
ఖ్వాకుల, సైంధవుఁనుఁ, ద్రిగర్తులనుం బో
నీక పొదివి రయమున స
స్తోకపరాక్రముఁడు దునిమి తూఁటాడె పడిన్. 234

వ. అప్పుడు రణభూమియంతయు శవమయం బయ్యె; నంబరం బంతయుం గబంధమయం బయ్యెఁ; జారుకేయూరవీరాంకవిభూషితంబు లైన బాహుచరణచ్ఛేదంబులును, గార్ష్ణకతూణీరకాండఖండంబులు, నక్షకూబరరథాంగకేతనత్రివేణుకశకలం బులును, బుండరీకవ్యజనచామరభంగంబులుం, గలవార పరిఘ శక్తి గదా ముసల పట్టిస ప్రాసలేశంబులు నెక్కడఁ జూచిన రాసు లై యుండెఁ; గీలాలపూరంబును, మాంసపంకంబును, గేశశైవాలంబును నైన యపూర్వనదీప్రవాహం బునంగు•బహువిధక్రవ్యాదగణంబు లవగాహంబు సేయుచుఁ బ్రకట కోలాహలవ్యాకులం బగుచుండె; నవ్విధంబున. 235

క. గాండివపవనప్రేరిత
చండాంబకఘోరశిఖల శతమఖతనయో
ద్దండదహనుఁ డొకమాత్రన
ఖండితసౌవీర సైన్య కానన మేర్చెన్. 236

వ. అట్టి క్రందున జయద్రథుండు ద్రౌపదిని దిగ విడిచి రథంబు దోలు
కొని పఱచె; నంత ధర్మజుండు ధౌమ్యసమన్విత యై యున్న పాంచా
లిం గని నిజరథంబుపై నిడికొనియె; సైంధవు పలాయనం బెఱింగి
యర్జునుండు శత్రుసేనాహనన సంరంభంబున నున్న భీమసేనున కి
టనియె. 237

తే. "వీతలజ్జుఁడై పఱచె సౌవీరవిభుఁడు;
పొనుఁగు ప్రజనేల యాఅడి దునిమి వై వ?
నద్దురాత్ముని వెనుకొని యసువు లిపుడు
గొనఁగవలయు లే లెమ్మ సద్వినుతశౌర్య". 238

వ. అనిన నతండు గయ్యంబు సాలించి ధర్మతనయుం జూచి. 239

క. "జననాథ! ద్రుపదసుతఁదో
డ్కొని ధౌమ్యుఁడు నీవుఁ గవలుఁ గులికొని మగుడం
జనుఁ డాశ్రమంబునకు; నే
మును సైంధవు వెనుకఁ గూడ ముట్టెవము వెసన్. 240

క. అతలంబునఁ గ్రుంగిన, న
ద్భుతముగ దివమునకు నెగసి పోయినఁ, బగతుఁ
హతుఁ జేయక మగుడము; విని
హతుఁడుగఁ జేయుదుము దివిజు లడ్డం బైనఁ". 241

తే. అనిన ధర్మజుఁ డిట్లను "నద్దురాత్ముఁ
బొలియఁ జేయుట దగదు దుస్సలఁ దలంచి;
వాని నొకతప్పునకు సైఁపవలదె? యాంబి
కేయమహిషికి ఖేదంబు సేయఁదగునె?" 242

వ. అనినం జూంచాలి భీమార్జునులతో "నప్పాపాత్ముని దెపం గృపసేయ
వలవ; దవశ్యంబును వాని వధియించి నాకుం బ్రియంబు గావించు
నది; యట్టి ద్రోహి యెల్లభంగుల వధ్యుం"డనియెఁ; దదనంతరంబ
ధర్మనందనుండు ధౌమ్యద్రౌపదీ నకులసహదేవ సహితుండై మగిడి
యాశ్రమంబునకుం జనియె; నిట భీమవిజయులు రథంబులు రయం
బునం దోలుకొని చని క్రోశమాత్రాంతరంబున సైంధవుంగని రప్పుడు
కిరీటి దూరాపాతవిశిఖంబుల జయద్రథు రథ్యంబులం బడనేసిన. 243

క. తల్లడపడి యరదము డిగి
విల్లును నమ్ములును విడిచి; వెల్లనగుచు మే
నెల్లఁ జెమర్పఁగ; నూర్పులు
పెల్లుగ నమ్మానుజపశువు పెలుచఁ బఱచెఁ. 244

తి. వానిఁ జూచి నగుచు వార "ఓరోరి! యిం
కెందుఁ బోవ వచ్చుఁ? బంద! నిలువు;
మిట్టికడిమి నమ్మి యే ప్రల్లదంబులు
సేయఁ దొడఁగి?" తనుచు డాయుటయును. 245

వ. మరలి చూచి వాఁ డొక్క గుల్మమధ్యంబుఁ దూఱుటయుఁ గని భీమసేనుండు రోషసందష్టాధరుం డగుచు రథంబు డిగ్గ నుఱి. 246

క. ఒడిసి తల వట్టి, నేలం
బడఁ దిగిచిన, వాఁడు పెనఁగఁబడుటయుఁ జిక్కఁ,
మెడఁ ద్రొక్కి గాఢముష్టిం
బొడిచె మొగం బపియ రక్తపూరము దొరుఁగఁ. 247

క. ఒడ లెల్లఁ బిండి కూడుగఁ
బొడిచి, యెగయ నెత్తి త్రిప్పి భూస్థలిమీఁదన్
బడ వైచి. యురము మొగమును
నడిచెను పడముడి తల ప్రహారకుశలుఁ డై. 248

వ. ఇట్లు బెట్టుగా నడఁచినఁ బగతుండు వివశుం డగుటయుం జూచి యర్జునుం "డోహో! యింత సాలు; నింక నొచ్చినం ప్రాణవిముక్తుఁ డగుం; గావున నజాతశత్రువచనంబులు దలంచి వీనిఁ గరుణింపు" మనిన నతండు గవ్వడి దెసఁ గనుంగొని "ధర్మసంచనుం డెప్పుడుఁ గరుణయ కాని కార్యంబుచేటుపాటు విచారింపఁ జొరండు; నీవును. నతసిభంగిన బేల వై తిద్దురాత్ము నెట్లు సైఁపవచ్చు?" నని పలికె; ననంతరంబ.

—: భీముఁడు సైంధవుం బట్టికొని పరిభవించుట :—

ఆ. వాఁడి యైన కత్తివాతియమ్మునఁ గొని
పగతుశిరము చెక్క లెయగ గొట్టిగి

నరుల కెల్ల జూడ నవ్వగునట్లుగా
గలయ నైదు గూఁకటుల నొనర్చె. 250

వ. ఇట్లు రాజవేషంబు వికల్పితంబు సేసి యమ్మహాభుజుండు వాని కిట్లను "నోరి ! బ్రమక వలతేని నేఁడు మొదలుగా నెల్లసభలయందును పాండవదాసుండ నని పలుకునది" యనిన వాఁడును దండాభూత భయంబున "నట్ల చేయుదు" ననియె; నంత నియ్యిరువురు నతనిం బెడకేలు గట్టి రథంబుపై నిడికొని నిజాశ్రమంబునకుం జని ధర్మపుత్రు నకు నివేదించి వీఁడె పాండవదాసుం డనిన నతం డట్లేని వీని విడువుం డనియెఁ; బాంచాలియు జయద్రథుం జూచి నవ్వుచు "నిప్పాపాత్ముండు భవధీయదాసుం డయ్యెం గావున వీనిం బో విడువుం" డని విడిపించె; నా సైంధవుండును ధర్మజునకుఁ దత్సభాగతు లైన మునులకు బ్రమోదంబు నొనర్చిన నజాత శత్రుం డిట్లనియె. 251

ఆ. "ఎట్టికష్టుఁ డైన నిట్టి పాపము సేయ
నెత్తికొనునె ధరణి నీవు దక్క ?
నరుగు మింక; నేమి యందుము నిన్ను నిం
ద్రియవిలోలు నల్పు ధృతివిహీను. 252

వ. ఇంక నెవ్వారిఁ నిట్టి కొఅగాములు సేయక బుద్ధిమంతుండ వై యుండు" మనిన నతండు లజ్జావనతవదనుం డగుచు నచ్చోటు వాసి గంగాద్వారంబున కరిగి యందు. 253

శా. ఆదిత్యార్చితపాదపద్మ, జగదేకాధీశు, నీశుం, ద్రిలో
కాదిం, బ్రాణమవిభేదిఁ, బర్వతసుతాహ్లాదైకసంపాది, నీ
ఖేదుం డై శివు నాత్మలో నిలిపి యఖీణవ్రతారూఢతం
బాదాంగుష్ఠము నేల మోపి తప మొప్పం జేసె సద్భక్తియై. 254

ఉ వానికి నమ్మహేశ్వరుఁడు వత్సలుఁ డై పొడసూపి యిచ్ఛితం
బైనది వేఁడు మన్న నతఁ డానతుఁ డై "పరమేశ ! విక్రమా
హీనులఁ బాండునందనుల నేవుర సైన్యయుతంబుగా ననిం
బూని జయించునట్టివరముం గృప సేయుము నాకు" నావుడున్.

క. "ఇది వొసఁగదు; పాండవులం
గదనమున జయింప నలవి గా దిట్రాది
త్రిదశులకు; వినవె! యైనను
వదలక నీకోర్కి దీర్ప వలయున యెట్లున్. 256

చ. విజయుఁ డొకఁడు దక్క నతివీరులఁ బార్థుల నున్ననల్వురన్
నిజ మొకనాఁటికయ్యమున సీవు జయింపుము; ఫల్గునుండు స
ర్వజగదజయ్యవిక్రముఁడు; వాని నెదుర్కొని నాకు నైనఁ బో
ర జితునిఁ జేయు టెంతయు భరం బగు; నిక్కము వల్కితిం జుమీ.

వ. అస్మత్ప్రసాదవిశేషంబునంజేసి వానిట్టి ప్రభావంబు గలిగె; నది
యునుం గాక.

క. నిఖలాస్త్రశస్త్రవిద్యా
సఖుఁ డపరాజితయశోవిశాలుఁడు, విష్ణుం
డఖిలేశ్వరుఁ డతనికి ప్రియ
సఖుఁ డగు? యవ్వీరు గెల్వ శక్యమె నీకున్?" 259

వ. అని పలికి యీశ్వరుం డంతర్హితుం డయ్యె; సింధుపతియు నిజ
దేశంబునకుం జనియె;" ననిన విని జనమేజయుండు వైశంపాయనున
కిట్లనియె. 260

తే. "ధర్మపత్నీసమేతు లై ద్వైతవనము
నం దపాగదుఃఖాతురు లగుచు నున్న
రాజముఖ్యులు, సత్సైన్యకరతులు, పాండు
సుతులు మఱియేమి సేసిరి సూరివర్య?" 261

వ. అనిన నతం డిట్లనియె "నట్లు ద్రౌపదీమోషణంబు నొనరించినపిదపం
గామ్యక వననివాసుం డై భూసురనివహంబుతో నున్న ధర్మజుపాలికిఁ
మార్కండేయుం డరుగుదెంచిన, ననుజసహితంబుగాఁ బ్రత్యుద్గతుం డై
యమ్మునివరుఁ బ్రభూతసపర్యల సంతుష్టహృదయుం గావించి,
యవ్విభుండు పాంచాలియెడ జయద్రథు సేసిన దుర్వ్యవసాయంబు,
వానిం బరిభవించుటకు నై తమపడిన యాయాసంబును నమ్మహాత్మున
కెటింగించి, మహనీయశౌర్యధైర్యధర్మారంభసమగ్రుల మైన మా

కివ్విధంబున నఖిలసామ్రాజ్య భోగవియోగం బై. దు స్తరం బగు వనవాసంబు సంప్రాప్తం బయ్యె; గావున విదీ్భతం బెన్వానికి నెబ్భం గుల నలంఘ్యం బని తలంచెద" నని పలికి మఱియు ని ట్లనియె. 262

తే. "ద్రుపదనందన క్రియఁ, గడుదుఃఖపడిన
నృపవధూటియు, నాయట్ల నియతశోక
వనధినిర్మగ్నుఁ డైన భూవరసుతుండు
గలఁడె? వినఁ జూడ ననఘ! యెక్కాలమునను?" 263

వ. అనిన నతనికి నత్తపోనిధి యి ట్లనియె 264

క. "కడు దుఃఖము నొందితి నని
యుడుగక యిటు వగచె దేల? యుర్వీశ్వర! నీ
పడు చేటిది? రఘురాముఁడు
గడఁగి యిడుమ వడఁడె తొల్లి కాఱడవులలోఁ: 265

ఉ. ఆ విభుకాంత గాదె జనకాత్మజ; రావణుచే గృహీత యై
పోవదె? వానరప్రకరముల్ వెసఁ దోడుగ నేఁగి యాధరి
త్రీవిభుఁ డబ్ధిఁ గట్టఁడె? వధింపఁడె దివ్యశరంబులన్ దశ
గ్రీవునిఁ? గ్రమ్మఱం జని యకిల్బిష రాజ్యవిభూతి నొందఁడే?" 266

—: ధర్మజునకు మార్కండేయుఁడు రామాయణకథ చెప్పుట :—

వ. అనిన విని ధర్మజుఁడు "మునీంద్రా! రాముం డెవ్వని వంశంబున వాఁడు? రావణుం డెవ్వని తనయుం? డేమి నిమిత్తంబున సీతాపహరణంబు సేసెఁ? రామరావణులకు సంగ్రామం బెట్లు వర్తిల్లెం? జెప్పవే" యని రామాయణకథాశ్రవణకుతూహలి యై యడిగిన నమ్మహీపతికి నమ్మహాముని యి ట్లనియె. 267

క. "వినుమిక్ష్వాకులంబున
జనియించె నజుండు నా బ్రహ్మస్తచరితుఁ; డా
తనికొడుకు దశరథుఁడు; ముద
మున నాతఁడు పెండ్లియయ్యె ముప్పురుసతులన్. 268

వ. అందుఁ గౌసల్యకు రాముఁడును, గైకేయికి భరతుండును, సుమిత్రకు లక్ష్మణ శత్రుఘ్నులును జనియించి; రందు రామునకు విదేహరాజనందన యైన సీత ప్రియాంగన యయ్యె; నింక రావణు జన్మంబు నెప్పెద వినుము. 269

తే. అఖిలలోకకర్త యగు విరించికిఁ బుల
స్త్యుండు నాఁగ మానసుఁడు దనూజుఁ
డుద్భవించె; నతని కుదయించె వైశ్రవ
ణాభిధానుఁడైన యాత్మజుఁడు. 270

వ. ఆవైశ్రవణుండు దన తండ్రియగు పులస్త్యుని విడిచి, తాత యగు చతుర్ముఖునకుం దపంబు సేసి నలకూబరుం డను కొడుకును, లోకపాలకత్వంబును, ధనేశ్వరత్వంబును, లంక యను పురంబును, శంకరుతోడి సఖ్యంబును వరంబులు గాఁ బడసి మహావిభూతితో వర్తిల్లుచున్నం గని యలిగి పులస్త్యుఁడు నిజశరీరంబునం దర్ధంబున విశ్రవసుండనువాని సృజియించి, యా వైశ్రవణున కహితంబు సేయు మని పనిచిన నెటీంగి కిన్నరేశ్వరుండు విశ్రవసుపాలి కరుదెంచి "మహాత్మా యేను నీకుం బుత్రుండ నయ్యేద, నాకుం గరుణింపు" మని యతనిం బ్రసన్ననిం జేసి నృత్తగీతనిద్యావిశారద లయిన రాక్షసస్త్రీలం బుష్పోత్కటయు, మాలినియు, సాకయు ననువారి ముప్పుర నవ్విప్రవరునకుఁ బరిచారికలంగా నిచ్చిన. 271

క. పుడుడున నయ్యువతులు నొం
డొరులం గడవంగ విలసదుపచారసమా
చరణప్రవీణభంగులఁ
బరితోషితుఁ జేసి రాతపస్వివరేణ్యున్. 272

వ. ఇట్లు ప్రీతుం డై యతండు వారలకుఁ బుత్రదానంబు సేసిన, నందుఁ బుష్పోత్కటకు రావణ కుంభకర్ణులును, మాలినికి విభీషణుండును, సాకకు ఖరుండును, శూర్పణఖ యను కన్యకయు మిథునం బై ప్రభవించి; రక్కుమారులకు నలువురకుఁ దజ్జనకుండు జాతకర్మాది సంస్కారంబు లొనరించి సగౌరవంబుగాఁ బెనిచి యుపనీతులం జేసెనందు. 273

ఉ. ఆతతతేజుఁ, డున్నతభుజాగ్రుఁడు, లోకభయంకరుండు, వి
ఖ్యాత పరాక్రముండు దశకంధరుఁడు సంతతరోషమానసుం;
డాతనియట్ల దుర్మదమయాత్ముఁడు క్రూరుఁడు గుంభకర్ణుఁడున్;
భీతివిదూరుఁ డార్యుఁడు విభీషణుఁ డుత్తమచిత్తుఁ డారయన్. 274

క. ఖరుఁడు ఖరతేజుఁ, డవనీ
సుర పరిభవకారి, మాంసశోణితభుజుఁడు
ద్ధురచిత్తుఁడు; శూర్పణఖయు
దురితచరిత, ధర్మకర్మదూషిత యెపుడున్. 275

వ. ఆరాక్షసకుమారులు దండ్రివలన నఖిల వేదవేదాంగధనుర్వేదపార గులై గంధమాదనగిరియందు సుఖంబుండి, యొక్కనాఁ డతనికి మ్రొక్క వచ్చువాని నధిక విభవసమన్వితు వైశ్రవణుం జూచి తత్ప్రభావంబు దపోలబ్ధం బగుట విని, జాత మత్సరు లయి తారును బితామహు నుద్దేశించి తపంబు సేయం దొడంగిరి; తత్ప్రకారంబు వినుము. 276

తే. మండువేసవిఁ బంచాగ్ని మధ్యమున, ఘ
నాగమంబున బయల, సత్యంతతుహిన
సమయమున నీరియందు, నిశ్చలత నిలిచి
దశముఖుఁడు వాయుభక్షుఁ డై తప మొనర్చె. 277

మ. నియతాహారుఁడు, నిర్జితేంద్రియుఁడు నై నిష్కంపవృత్తి మహీ
శయనుం డై వ్రతముల్ చరించె నధికేచ్ఛం గుంభకర్ణుండు; ధై
ర్యయుతుం డై ఘనుఁ డవ్విభీషణుఁడు పర్ణాహారవృత్తి జపా
ధ్యయనాసక్తిఁ దపంబు సేసె మది నత్యంతంబు సంశుద్ధితోన్. 278

వ. ఖరుండును శూర్పణఖయు వారికిం దగిన పరిచర్యలు సేయుచుండి; రంత సహస్రవర్షంబులు నిండినం బంక్తివదనుండు దన మస్తకం బొక్కటి ఖండించి మండెడునగ్నియందు వేల్చి, మఱియు వేయేండ్ల కొక్కటిగాఁ దలలు దొమ్మిదియుం దఱిగి వేల్చి, ధైర్యంబు దలుగక పది యగు తలయును ద్రెంప సమకట్టినఁ బితామహుండు ప్రత్యక్షంబై వారించి వానిశిరంబు లెప్పటియట్ల కలుగ నొసంగి, 'యమరత్వంబు

దక్క నొండు నీ కభిమతం బగునది యెయ్యది యైనను నడుగు'
మనుటయు నన్ని శాచరుండు. 279

శా. ''దేవా! యేను సమస్తదేవ పితృ దైతేయాహి గంధర్వ ర
క్షో విద్యాధర యక్ష జాతులకు నక్షోభ్యుండఁగాఁ, బ్రీతితో
నీవిశ్వంబునఁ గామరూపగతి నాత్మేచ్ఛావిహారుండఁ గా
నీవే" నావుడు వాని కవ్వర మజుం డిచ్చెం గృపాలోలతన్. 280

—: బ్రహ్మ రావణకుంభకర్ణ విభీషణులకు వరంబు లిచ్చుట :—

వ. "మనుష్యజాతి యొక్కండు దక్క నీ నెప్పినయందఱవలనను నీకు
మరణభయంబు లే"దని పలికి, పరమేష్ఠి గుంభకర్ణుం జూచి వరం
మడుగు మనిన. వాఁడు దైవోపహతుం డై, తనకు నాత్యంతికం
బైన నిద్ర యడిగిన, నట్లయగు నని విభీషణున కభిముఖుం డగుటయు
నతండు కృతాంజలియై జలజాసనుఁ బ్రస్తుతించి. 281

క. ''సరమాపద యైనపుడును
దురితంబులు నామనంబు దొడరమియును, శా
సుర మగుబ్రహ్మాస్త్రంబును
గరుణింపవె" యనిన నిచ్చి కమలజుఁ డనియెన్. 282

క. "నిరతము రాతుసభవమును
బొరసియు, నీ విట్లు ధర్మబుద్ధి వగుట య
చ్చెరు విది; గావున నీకును
దిరముగ నమరత్వ మిచ్చితిం గృప వత్సా." 283

వ. అని పలికి పితామహుం డంతర్హితుం డయ్యెఁ; దదనంతరంబ 284

మ. వరగర్వోన్నతుఁడై దశాననుఁడు దుర్వారోద్ధతిన్ దాడిమై
నరిగెం గిన్నరనాథుపై; నతఁడు కార్యం బాత్మ నూహించి సం
గరసన్నద్ధుఁడు గాక యింపురుషయక్షశ్రేణితోఁ గూడఁ దా
నరిగెన్ లంకఁ బరిత్యజించి రభసోద్యత్పుష్పకారూఢుఁడై. 285

వ. ఇట్లతండు గంధమాదనంబునకుం జనునెడ వెన్నడిం దగిలి దానవుండు
వాని మానంబుతోన విమానంబు నపహరించినం గనలి యక్షేశ్వరుండు

గురుండ నగు నన్ను నవమానించితివి గావున నివ్విమానంబు నీపగతుపా
లయ్యెడు మని శపించె నంత. 288

క. రాక్షసలక్ష్మీమహిమకు
రక్షకుఁడుగఁ బంక్తిముఖుని రాక్షసమాయా
దక్షు నభిషిక్తుఁ జేసిరి
రాక్షసవేతాళవరులు రాగం బెసఁగన్. 237

వ. వాఁడును బలదర్పమోహితుం డై కడంగి యింద్రాదిదేవతల నొడిచి తత్పదంబు లాక్రమించి, యీసు మిగిలి జగద్రావణంబు సేయుటం జేసి రావణుం డను పేరం బ్రఖ్యాతి వహించి, సకలభూతభయం కరుం డయ్యె; నట్టియెడ దేవర్షులును రాజర్షులునుం గూడి చని తత్ప్రతీకారం బగ్నిదేవునకుం జెప్పిన నతండు వారిం దోడ్కొని వారిజాసనుపాలి ం జని యి ట్లనియె. 288

ఉ. "భూరిభుజుండు, విశ్రవసుపుత్రుఁడు, పంక్తిముఖుండు దర్పదు
ర్వారుఁడు, రాక్షసేంద్రుఁడు భవద్వరశక్తి నవధ్యుఁ డై మహా
ఘోరముగాఁ ద్రిలోకములకుం గడుఁ బీడ యొనర్పఁ జొచ్చె; వృ
త్రారిపురోగమత్రిదశు లందఱుఁ గింకరు లై రి వానిఁ గన్. 289

ఉ. దానవుచేతఁ గష్టపడి దైన్యము నొందుట కోర్వలేక నీ
పైనపదాంబుజంబు లభయం బని చేరితి; మింక మమ్ము నె
ప్పైనఁ గృపార్ద్రమానసుఁడ వై తగఁ జేకొన వయ్య; మాకు ది
క్కైనను కాక యున్నఁ గమలాసన! నీవ కదయ్య యెయ్యెడన్."

వ. అనినఁ బరమేష్ఠి వారలఁ జిట్లను "నిక్కార్యంబునకు నేను మున్న తగిన యుపాయంబు నిశ్చయించి, నారాయణుం బ్రార్థించితి; నద్దేవుండు మనుష్యభావంబున నవతరించి యారాక్షసుని వధియించువాఁ డయ్యె; నింద్రాదిసురలునుం దమ తమ యంశంబులం జేసి ఋక్షవానరజాతులయందు జనియింపం గలవారు; మీకు భయంబు వల"దని యగ్నిప్రముఖు లైన యమ్మహామునులఁ సమ్ముఖంబున దుందుభియను గంధర్వకామినిం బిలిచి నీవు కుబ్జరూపంబున మంథర యను పేర భూలోకంబున నుచ్ఛవించి, నీ నేర్చువిధంబున దేవకార్యం

బులు నిర్వహింపు" మని పనిచి వారి వీడ్కొలిపెఁ; బదంపడి దివిజుల
యంశావతారంబులంజేసి. 291

మ. గురుశైలోన్నతగాత్రు, లుద్ధతభుజోగ్రుల్, వజ్రపాషాణక
ర్కరు, లర్కప్రతిమానతేజులు, గుణాకల్పుల్, మహాకల్పభీ
కరకాలాంతకకల్పు, లాజినిపుణుల్, గర్వోన్నతుల్, ఋతువా
నరవీరుల్ జనియించి రెల్లయెడలఁ నాగాయుతప్రాణు లై." 292

క. అన విని యుధిష్ఠిరుం డ
మ్మునిపరుతో ననఘ! ధర్మమూర్తిని నా రా
మునిఁ నేల యరణ్యంబున
కనిచెను దశరథుఁడు సెపుమ? యక్కథ యెల్లన్" 293

వ. అని యడుగుటయు మార్కండేయుం డి ట్లనియె "దశరథుండు నిజ
సుకృతపాకంబునంజేసి రామప్రముఖు లయిన కొడుకుల నలువురం
గని, త్రైలోక్యరాజ్యంబు సంప్రాప్తం బయినయట్లు సంతసిల్లె;
నక్కుమారులు క్రమంబున నుపనీతులు, నఖిలవేదవేదాంగ వినీతులు,
యథాక్రమపరిణీతులు నై విలసిల్లి రంత. 294

సీ. అభినవపద్మదళాతు, నటీణవి
స్తృతవతు, నాజానుదీర్ఘ బాహు
మధురస్మితాననుఁ, మదగజగమను, నా
రూఢయౌవను, నభిరూపతేజు,
శ్రీకరణీయుఁ, బ్రసిద్ధయశోరమ్యు,
నిఖిలవిద్యాగమనిపుణచిత్తు,
నింద్రసమాను, జితేంద్రియు, ధర్మజ్ఞుఁ
బౌరబాంధవజనప్రార్థనీయు,
ఆ దుష్టనిగ్రహైకధుర్యు, విశిష్టసం
రక్షణాభిలోలు, రామచంద్రుఁ
గులపవిత్రుఁ బెద్దకొడుకుఁ గనుంగొని
రాజవరుఁడు గరము రాగ మెసఁగ. 295

వ. యౌవరాజ్యపదంబునకు నతని నభిషేకం బాచరింపం గోరి యాప్త
మంత్రి జనసమ్మతంబునఁ బురోహితనిరూపితం బైన శుభదినంబున

నక్కార్యంబునకు సమకట్టునెడ, భరతు దాది మంథర యనునది
యమందగతిం గైకేయిపాలికిం జని యి ట్లనియె. 296

ఉ. "అక్కట! నీ దెసం బతికి నాఅడికూరిమి యయ్యె; మాయపుం
బొక్కులు నీవు నిక్కముగఁ జూచి మనంబున మోసపోయి; తా
టక్కరి కోసలాత్మజయెడం బ్రియుఁ డై యదె త త్తనూజు నిం
పెక్కఁగ యౌవరాజ్యమున నిప్పుడు పట్టము గట్టఁ బూనెడున్. 297

ఆ. పుడమిఱేని మదికి నెడ యైతి నీ;వింక
నేమి సెప్పఁ గలదు వామనయన!
కడఁగి నిన్నుఁ గొడుకుఁ బెడవడ వైచి యా
సంఁకికొడుక యేలు నవని యింక" 293

క. అనిన నుదరిపడి కేకయ
తనూజ గడు సంభ్రమమునఁ దత్క్షణమ నరేం
ద్రునిపాలిఁ జని యేకత
మున ని ట్లనుఁ బ్రణయపూర్వముగ నాతనితోఁ. 299

క. "ధరణీశ! తొల్లి నాకుం
గరుణించినవర మొకండు గల; దది మదిలోఁ
బరికించి యిప్పు డొసఁగుము;
చిరముగ సత్యవ్రతంబు సెల్లింపు తగఁ" 300

వ. అనిన నతం డయ్యతివం గనుంగొని యవధ్యుల వధియించుటయును, వధ్యులం గాచుటయును, బ్రాహ్మణధనంబులు దక్క నన్యుల ధనం బపహరించుటయును, నభీష్టధనంబు నిచ్చుటయును మొదలుగా నతి దుష్కరంబు లైన వాని నైనను భవత్ప్రియార్థంబు సేసెద; నెయ్యది సెప్పు" మనిన ప్రీత యై భరతమాత యి ట్లనియె. 301

తే. "యౌవరాజ్యపదంబునయందు భరతు
నధిప! యభిషేక మొనరింపు; మడవిలోన
నొలసి పదునాల్గువర్షంబు లుండ నాన
తిమ్మ రాముని; నురువర మ్మిదియ నాకు." 302

క. అనవుడు వీనులు గొఱవిం
గొని చూఁడిన యట్టు లైనఁ గువలయపతి పె
ల్చన పిడు గడఁచిన క్రియఁ జే
తనరహితుం డగుచు ధరణితలమునఁ బడియెన్. 303

వ. అంతయు నెటింగి రాఘవుండు నిజజనకుండు సత్యప్రతిజ్ఞుండు గావుత
మని యాత్మణంబ సీతాసమేతుం డై వనంబునకు వెడలె; నతని
పిఱుందన లక్ష్మణుండును జనియెఁ; దదనంతరంబ. 304

—: దశరథుఁడు రామవిశ్లేషముచే సురలోకగతుం డగుట :—

క. రాముఁడు సనుట విని మహో
ద్దామం బగు శోకవహ్ని దరికొనఁగను 'హా
రామ! గుణధామ' యని యని
భూమీశ్వరుఁ డసువియోగముం బ్రాపించెన్. 305

వ. ఇట్లు దశరథుండు సురలోకగతుం డగుటయుఁ, గైకేయి దన
కొడుకు రావించి భూవల్లభుండు దేవభావంబు నొందె; రాముం
డును వనంబున కరిగె, నింక నర్హుండవు నీవ; కావున నఖిలమహీ
రాజ్యక్షణంబు సేయు" మనిన నక్కుమారుండు క్రోధశోకదంద
హ్యమానమానసుం డగుచుఁ దల్లి కిట్లనియె. 306

సీ "దురితంబు లెన్నఁడు బొరయక వెలుఁగొందు
కమలాప్తకులమునఁ గసటు గలిపి,
పరమధర్మాత్మకుఁ బురుహూతసన్నిభుఁ
బతి ద్రిమింగికొని కృపఁ బాఱ వైచి,
యాయతబాహుఁ దేజోయుక్తు మాయన్నఁ
బటు ధైర్య నడవులపాలు వఱిచి,
జీవితహంత్రి వై, త్రోవంగరాని దు
ష్కీర్తి నాయొఁదలఁ గీలుకొల్పి,

ఆ. శ్రీకి నెడలి సకలలోకంబుచేతను
దిట్టు గుడిచి కోర్కి దీర్చుకొంటి;
పాపజాతురాల! యీపాతకం బేమి
సేయ? దింక నేమి సేయువాఁడ?" 307

వ. అని దుఃఖించి భరతుండు దండ్రికి నుచితక్రియలు నిర్వర్తించి, యనంతరంబ సమస్త మంత్రిసామంతభూసురపౌరజానపదసహితుం డై కదలి, మువ్వురు దల్లులను వసిష్ఠవామదేవులను బురస్కరించుకొని, తానును శత్రుఘ్నుండును రామానయనార్థంబు చిత్రకూటశైలంబున కరిగి యందు. 308

మ. కనియెం గోమలనీలమేఘసుభగాకారున్, జటావల్కలా
జినధారున్, సితభూతి భూషితుని, రాజీవాతుఁ గల్యాణకీ
ర్తనుఁ, గాకుత్స్థకులప్రదీపకుని, సీతాలక్ష్మణోపేతు, స
న్మునిలోకార్చితు, సత్కృపాభరణు, రాముఁన్, రాజచూడామణిన్.

వ. కని యంతంత నాక్రంద పరుండగుచుం జని తదీయచరణంబులపయిం బడి, పితృ మరణప్రకారం బంతయు నెఱింగించి, "దేవా! సకల సామ్రాజ్యధురీణుండ వై మమ్మందఱ ననుశాసింపవే" యని యర్థా జనసహితంబుగా నతనిం బ్రార్థించిరి. 310

క. గురువాక్యరక్షణైకా
పరచిత్తుం డైన యయ్యుదాత్తచరితుఁ డె
ప్పరుసున నొడఁబడఁ డయ్యెను
సరసమహీరాజ్యసమనుశాసనమునకున్. 311

వ. భరతుండును రాముచేతఁ బ్రత్యాఖ్యాతుం డై, తదీయపాదుకలు గొని చని వాని నర్చించుచు, నందిగ్రామంబునందు వసియించి రాజ్యానుసంధానంబు సేయుచుండె; నిట రాఘవుం డయోధ్యాసమీపం బగుటంజేసి క్రమ్మఱ భరతాగమనంబు శంకించి, చిత్రకూటంబు వాసి శరభంగు పాలికిం జని, యతనిచేత సత్కృతుం డై దండకారణ్యంబు సొచ్చి, యందు గోదావరీతీరంబున ననుజవధూసహితంబుగాఁ గృతనివాసుం డై యున్నంత, దశగ్రీవు చెలియలు శూర్పణఖ సనుచెంచి, వారికి నపకారంబు సేయ మొనసినం గినిసి, యా రాజపుత్రులు దత్కర్ణ నాసికావైకృతం బొనరించినం బదంపడి. 312

ఉ. శూర్పణఖానిమిత్తమున శూరు లనేకులు రక్కసుల్ మహో
త్సర్పితరోషు లై బహుళసైన్యయుతంబుగ నెత్తి వచ్చుడున్,

దర్పితవైరిభంజనుఁ, డుదారుఁడు, రాఘవుఁ డస్త్రవిద్య నే
ర్పేర్పడఁ గేలిఁబోలె సమయించె రణాంగణభూమి నందఱన్. 313

వ. ఇట్లు ఖరదూషణాదులం దొట్టి పదునాలుగువేల రాక్షసులం జంపి, దండకారణ్యంబు విగతకంటకంబు గావించె; నంత శూర్పణఖయు రయంబున రావణు పాలిం జని, తచ్చరణంబులపయిం బడి యేడ్చినం జెలియలికైన వైకృతం బేర్పడం జూచి, యన్నిశాచర నాథుం డిట్లనియె. 314

సీ. "ఎటోఁగి యెటోంగి నేఁ డెవ్వఁడు నిశితవి
స్ఫారశూలాగ్రంబుపయిఁ నుటికెఁ?
దలయంపియం దగ్గి దరికొల్పి యెవ్వఁడు
నేఁడు నెమ్మది భయనింపఁ జూచె?
నుగ్రవిషానలం బుమియుచున్న యహీంద్రుఁ
గడఁగి నేఁ డెవ్వఁడు గాలదన్నె?
హుంకారఘోరమై యుఱు బెబ్బులిమీస
లుఱుక యెవ్వాఁడు నేఁడూఁచికొనియె?

ఆ. నిన్ను నెవ్వఁ డకట నేఁ డిట్లు గడు భంగ
పఱిచెఁ? జెపుమ నాకుఁ బద్మనయన?
యాయువును సిరియును నవళంబు లయ్యె 'నేఁ
డెవ్వనికొ తలంప నిజ్జగమున." 315

క. అని పలుకునప్పు డాతని
ఘనతరముఖనేత్రనాసికారంధ్రములం
దనవరతరోషపావక
జనితశిఖావితతు లక్కఁటంబుగ వెడలెన్. 316

వ. శూర్పణయు నతనిఁ రాఘవు లున్న తెఱంగును, నిజపరిభవంబు దత్కృతం బగుటయు, ఖరదూషణాదిరాక్షసవధయునుం, జెప్పిన విని ధనదానుజుం డాతుణంబ పురసంరభణంబునం దాప్తజనంబుల నియో గించి, సన్నద్ధుం డై యొక్కరుండ వెలువడి, త్రికూటకాలపర్వతం బులు గడచి సముద్రతీరంబునఁ బరమేశ్వరనివాసం బైన గోకర్ణ

స్థానంబునకుం జని, యచ్చటం దొల్లి రాముచలనం బ్రాప్తపరాభవుం డై ప్రవ్రజనంబు నొంది తపంబు సేయు చున్న వానిం, దన పూర్వా మాత్య్య, మారీచుంగనిన, నతండును బ్రియసంభ్రమంబులతోడ నతనిం బూజించి, కుశలం బడిగి భవదాగమననిమిత్తం బేమి యని యడిగిన నసురేశ్వరుం డట్లనియె. 317

ఉత్సాహము, "వినవె, రాముఁ డనఁగ నొకడు విపులదర్పహృదయుఁ డై
మనఖరుండు లోనుగా సమగ్రశౌర్య లైన య
ద్దనుజవరులఁ దునిమి, యిపుడు దండకస్థలంబునం
దొనర నిర్భయత్వ మొప్ప నున్న వాఁడు మేటి యై. 318

ఆ. వానిఁ బరిభవింప వలయు; నప్పనిఁ సా
హాయ్యకం బొనర్పు మనఘ! నాకు;"
ననిన నధికభయసమావిష్టహృదయుఁడై
యమరవై రి ట్టు లనియె నతడు. 319

చ. "ఎఱుఁగవు గాక రాఘవునుదీర్ణ భుజాబలరూఢి; నాజిలో
నుఱక తదీయబాణరయ మోర్వ వళంబె పినాకి కైన? ను
క్కఱ మటి నీకు నిత్తెఱఁగు గా దన కేఖలుఁ డొక్కొ బుద్ధిగాఁ
గఱపినవాఁడు? సేటునకుఁ గాలము సేరెనొ కాక యిమ్మెయిన్.

ఆ. రాముతోడఁ దొల్లి రణమునఁ గడు భంగ
మొంది కాదె దైన్యయుక్తి నిట్లు
దపసి నైతి నేఁడు? తగ దమ్మవోత్మ్మని
యందు వైరబుద్ధి యధిప! నీకు." 321

వ. అనినం గలఁకించి లంకేశ్వరుండు వానిం జూచి "నాపనువు సేయ వైతివేని ని న్నిప్పుడ కృతాంతగోచరుం జేయుదు" నని న వాఁడును దన మనంబున వీనిచేతం జచ్చుటకంటెను రాఘవకృతం బైన మరణంబు మే లని తలపోసి; "మహాత్మా! నీకు హితంబు గోరి చెప్పితి; నిది యిష్టంబు గా దేని భవదీయశాసనంబు గైకొని చేసెదం; బనుపు" మనినఁ బౌలస్త్యుం డిట్లను; "నీవు రత్నమయ తనూరుహాంబగు కనకమృగంబవై చని జానకిం బ్రలోభింప వలయు; సీతాచోదితుండై

రాముండు నిన్నుం బట్ట సమకట్టి నీచేత నతిదూరంబ గొనిపోవం బడు; నప్పు డేను దద్భామిని నపహరించెద; భ్రియావిరహదుర్మనస్కుం డై యతండు చెడిపోవు" ననిన నట్లకాక యని మారీచుండు.

—: మారీచుండు మాయామృగం బై చనుదెంచుట :—

క. కనకమృగరూపమునఁ జని
యినవంశ్యుఁడు, సతియు నున్న యెడ మెలఁగుటయుం
గని జానకి కౌతూహల
మునఁ బ్రియుఁ బ్రార్థించె హరిణపుంగవుఁ బట్టన్. 323

ఆ. ధరణిసుతయు విధియుఁ దన్నుఁ బ్రే రేపంగ
వినశబుద్ధి యగుచు నవనివిభుఁడు
మృగముఁ బట్టఁ దివిరె మృగనేత్రఁ గావ స
ద్వినుతబలు సుమిత్రతనయు నునిచి. 324

క. ఆఁదృశకార్ముకధరుఁ డై
మసలక యామృగము వెనుక మర్దితరిపుఁ డే
పెసఁగంగ నరుఁగఁదొడఁగెను
వెస రుద్రుఁడు యజ్ఞమృగము వెనుకొనుమాడ్కిన్. 325

వ. అట్టియవసరంబున. 326

మ. పఱచుఁ దవ్వుగఁ, జేయలంతి నిలుచుం, బట్టిక యాసాసలం
బిఱువోవుం; బొదలందు డిందుఁ; బొడమున్; బి ట్టుల్కి- వే
దాఁటుఁ; గ్రమ్మఱి చూచుం; జెవి చార్చి నిల్చు; మలయుఁ, మట్టాడుఁ; గో రాడు; నే
మఱిన ట్లుండుఁ; ధృణంబు మేయు; నెలయుఁ మాయామృగం
బిమ్మిలన్. 327

వ. ఇ ట్లతిదూరంబుగా నెలయించి యలయించిన నది రాక్షసమాయగా నూహించి, రాఘవుం డమోఘబాణంబు దొడిగి తడయక యమ్మృగం బునేసిన. 328

క. వాలమ్ము దాఁకి యొఱలుచు
నాలోనన రామునెలుఁగునట్టియెలుఁగు గా

'హా లక్ష్మణ! సీతా' యని
కూలి కపటమృగము దన్నికొనుచుం జచ్చెన్. 329

తరువోజ. ఆయెలుఁ గేర్పడ నవనీతనూజ
యాలించి, తల్లడం బడరుచిత్తమున
"నోయన్న! లక్ష్మణ! యెలసి మీయన్న
యుగ్రరాక్షసబాధ నొందంగఁ బోలు;
నాయతభుజ! వింటె యమ్మహా భాగుఁ
డత్యంతదుఃఖార్తుఁ డై నన్నుఁ జీరెఁ;
బోయి వే కావు విస్ఫురితపుణ్యైక
భూషణోదార; యప్పురుషరత్నంబు!" 330

వ. అనిన నతం డమ్మానిని కిట్లనియె. 331

ఆ "అబల! వెఱవ కుండు; మఖిలలోకములను
రాఘవేశ్వరునకు రణములోన
నెదురఁ గలఁడె శూరుఁ డెవ్వాఁడు? నతనికి
నెట్టి యెడల దురిత మేల పొందు? 332

క. ఇనవంశోత్తఁము డిప్పుడ
చనుదెంచుఁ; బ్రియంబు నొందు జలజానన!" నా
విని జానకి లక్ష్మణునెడ
జనితాశంక యయి క్రోధసంభ్రాంతమతిన్. 333

సీ. "నీతలం పెఱుఁగుదు; నీ కేల వలవని
జాలి? నీ కిట్లేల సంభవించె?
నతిఘోరశస్త్ర విషాగ్నులయం దొంట
వేగంబ ప్రాణముల్ విడుతుఁగాక;
యే నేల నిను వరియింతు? బెబ్బులికాంత
యక్కట, నక్కపొం దాసపడునె?"
యని యిట్లు సత్పురుషాగ్రణి సౌమిత్రిఁ
బడఁతి యప్రియము లు వలుకుటయును,

ఆ. జెవులు మూసికొనుచుఁ జిత్తంబు గలఁగ ల
ఘ్మణుఁడు దక్షిణంబ మహితశౌర్యుఁ
డతుల బాణచాపహస్తుఁ డై తనయన్న
సనినచొప్పునంద చనఁ దొడంగె. 334

వ. అయ్యవసరంబున దశాననుండు. 335

మ. కమనీయం బగు జన్నిదంబు, శిఖయుం, గౌపీనమున్, ధాతువ
స్త్రము, దండంబును, గుండియుం, గుశపవిత్రంబుం, గడున్ వృద్ధభా
వము సంధిల్లఁ ద్రిదండివేషధరుఁ డై వచ్చెం బథిశ్రాంతి దే
హమునం దోఁపఁగ సీతయున్నెడకు మాయాదక్షుఁ డక్షీణతన్. 336

తే. వాని నిక్కంపుమునియకా వగచి రాము
వనిత గడుభక్తిఁ బూజించి వన్యఫలము
లొసఁగుటయు, వానిఁ జేకొనకొల్ల కసుర
మదనవివశుఁడె యిటను మగువఁ జూచి. 337

మత్తకోకిలము. "ఏను దానవనాయకుండ, నహీనసత్త్వుఁడ, రావణా
ఖ్యానిరూఢుఁడ; లంక నాఁగ జగత్ప్రసిద్ధము మత్పురం;
బానతాంగి! మదీయవల్లభ వై భజింపఁగ రాదె ది
వ్యానుభోగము లిష్టచేష్టితహారియౌవనలీలలన్. 338

క. ఎక్కడి రాఘవుఁ డక్కట?
తక్కువ యగు వేదమనుజుఁ దగిలి వనమునం
బెక్కడుమలఁ బడఁ దగునే!
తక్కుము మది నింక నొండు దలఁపులు తరుణీ!" 339

వ. అనిన విని వై దేహి భయకంపితదేహ యగుచు నతని కిట్లనియె. 340

సీ. "ఇట్లాడ నర్హమే? యే నేడ? నీ వేడ?
నక్షత్రతారాగణంబుతోడ
నాకసం బంతయు నవనిపైఁ గూలిన,
వసుమతి ధ్వస్తిన, వనధు లెల్ల

నింకినఁ, జంద్రదినేశ్వరు లనోన్యవిపులతేజంబులు వీడుపడిన,
నే నేల యన్యుని నెడలోనఁ గామింతుఁ?
గరిణి యేనాఁటి సూకరముఁ గలయు?

ఆ. మహితకమలమధురమధురసాస్వాదన
పరవశాత్మ యైన భ్రమరకాంత
రిత్తబుద్ధి నకట రేఁగుపువ్వులరసం
బానునెట్లు? బేల వైతిగాక." 341

—: రావణుఁడు సీత నెత్తికొని లంకకుఁ బోవుట :—

వ. అని పలుకుచు నొయ్యనొయ్యన తొలంగం జనిన నద్దురాత్ముఁ డతి భయంకరంబుగా జంకించి యమ్మగువం బట్టికొని గగనంబున కెగసి, లంకాపురాభిముఖుం డై యరుగఁదొడంగిన, నయ్యింతి యెంతయుం దలరి యిట్లని విలాపంబు సేసె. 342

ఉ. "దేవతలారా! యోధరణిదేవతలార! జగత్త్రయోన్నతుం
డై వెలుఁగొందు రాముని కులాంగన జానకి నేను; నన్ను మో
హావిలుఁ డొక్కరక్కసుఁ డనర్గళుఁ డై కొనిపోయెడుం; గృపం
గావరె! పుణ్యమున్ యశముఁ గైకొనరే; యిదె మీకు మ్రొక్కెదన్."

క. అని యేడ్వఁగఁ దద్వచనము
లనఘుఁడు గిరిగహ్వరాంతరాలయగతుఁ డై
విని, యరుణసుతుఁడు దేజో
ఘనుఁడు జటాయు వనుపఁ గారుణ్యమునన్. 344

క. ఎఱుకలు గల కులశైలము
తెఱఁగుమెయిఁ రయము మెఱయ దివికి నెగసి, బె
ట్టుఱుము జలధరము క్రియ ను
క్కఱి భువనం బెల్ల నద్రువ నార్చుచుఁ గడిమిఁ. 345

ఉ. "ఓరి దురాత్మ! యీయబల నోడక యేటికిఁ బట్టినాఁడ? వం
భోరుహనేత్ర విడ్వు; మెట వోయినఁ బ్రాణముఁ గొందు నింక; ను

గ్రారివిభేదివిక్రము జటాయు నెఱుంగవె'' యంచు దర్పసు
ర్వారుఁడు వీఁక దాఁకె సురవర్గవిఘాతకు నద్ధశాననున్. 346

మ. ఘనపఱ్ఘాహతులం, బ్రకాండపరిఘాఘాతంబులం, దీవ్రశా
తనఖోచ్ఛేదములం, బ్రదీప్తశర వేధ క్రీడలం, గ్రూరచం
చు నిపాతంబులఁ, బ్రౌఢకుంతనుఖవిస్ఫోటంబులం, దత్తగేం
ద్రనిశాచేంద్రులపోరు సాధనసమత్వస్ఫూర్తి నొప్పెం గడున్. 347

చ. పటుతర పక్షిపక్షముఖ పాదనఖ ప్రవిఘాతఖండిత
స్ఫుటితశరీరుఁ డై బహుళశోణితధారలు మేనఁ గ్రమ్మగాఁ
దటసముపాంతనిర్గళితధాతురసారుణసాంద్రనిర్ఝరో
త్కటకులశైలలీల దశకంధరుఁడు నిల్పె నకుంఠితస్థితిన్; 348

వ. తదనంతరంబ. 349

క. తెఱపి గని దానవేశ్వరుఁ
డుఱక కృపాణమున నాఖగోత్తమునెఱకల్
నఱకినఁ, గూలె నతం డిల
నఱవఱ లై పవనహతమహాభ్రమపోలెన్. 350

వ. ఇట్లు జటాయువుం గూల్చి రావణుం డధికరయంబున నరుగునెడ, జానకి దనకు ది క్కెవరు లేమింజేసి నిరాశ యై, యొక్క శైల శృంగంబునందుఁ గొందఱు వానరులు మెలంగు చున్నం గని, తన కట్టిన పుట్టంబుకొంగు సించి భూషణంబులు ముడిచి, తత్ప్రదేశంబున వైచెం; బంక్తివదనుండును లంకాపురంబునకుం జని, యం దశోకవన మధ్యంబున నాసుమధ్య నునిచి, తదీయరక్షణార్థంబు రాక్షసీ నివహంబు నియోగించె; నిట రాఘవుండు మాయామృగంబు వధి యించి మగుడం జనుదెంచువాఁడు, దన కెదురుగా వచ్చు లక్ష్మణుం గని రాక్షస గోచరం బైన వనంబున జానకి నొంటి యునిచి వచ్చి తప్పు సేసి తని పలుకుటయు, సుమిత్రానందనుండు ధాత్రీతనయ దన్ను నవమానించి పలికిన తెఱంగు సెప్పిన. 351

మధురాక్షర. కనకమృగ మట్లు దను వవ్వుగాఁ ద్రిప్పి తెచ్చుటకు,
వనజముఖి నేకతమ శూన్యవనమునయం దునిచి

వెనుక ననుజుండు వచ్చినవిధమునకు, మదిలోన
ననఘుఁ డెంతయు వగచుచు నరిగె నాశ్రమమునకు. 352

వ. అట్లు సని చేతనారహితం బయిన శరీరంబునుంబోలె సీతావిహీనం
బై యున్న వర్ణగృహంబుం గనుంగొని, రాఘవుండు మూర్ఛితుండై
లక్ష్మణ ప్రయత్నంబునఁ గొండొకవడికిఁ దెలి వొందె; నంత నయ్య
న్నయుం దమ్ముండును దత్పరిదేశంబులయందు సుందరిం దడవుచుం
జనువారు ముందట. 353

తే. కులిశపాతభంగుర మైన కులనగంబు
కరణిఁ బడి యున్నగృధ్రంబుఁ గాంచి, బుద్ధి
నదియు రాక్షసమాయ యౌ నని తలంచి,
యేయ సమకట్టుటయు విహగేంద్రుఁ డెటిఁగి. 354

క. "ఓయయ్యలార యేను జ
టాయు వనం బరఁగుపక్షి; నరుణతనయుఁడఁ;
మీయయ్య దశరథక్షితి
నాయకునకుఁ బ్రియసఖుండ" నావుడు వారల్. 355

వ. డాయ నరుగుదెంచుటయు, నతండు వారితో రావణుండు వై దేహిం
గొనిపోవుటయుఁ, బదర్థం బై తాను నద్దనుజుం దొడరి పెనంగు
టయుం జెప్పి రావణుండరిగినదెస నెటిఁగించి, విగతజీవుం డయ్యె;
నయ్యిరువురు నప్పులుఁగుపోనికి నతి గౌరవంబున నగ్నిసంస్కారాది
కరణీయంబులు నిజజనకనిర్విశేషంబుగా నాచరించి దక్షిణాభిముఖుఁ డై
చని చని 356

చ. ఉరమునయందుఁ గన్నులుఁ బృథూదరదేశమునందు నోరుఁ, బ్ర
స్ఫురితభుజద్వయంబుఁ, గులభూమిధరోన్నతభావముం గరం
బరుదుగ నుగ్ర మైనవికృతాకృతితోడ నశేషసత్త్వఘు.
స్మరుఁ డగు చున్న వానిఁ బటుపత్త్వఁ గబంధునిఁ గాంచి రచ్చటన్.

ఆ. అక్కబంధుఁ డామిషార్థి యై లక్ష్మణుఁ
బట్టికొనియె బాహుబల మెలర్ప;
నతఁడు గడు విషణ్ణుఁ డై "యన్న! ననుఁ జూడు"
మనుచు రాముఁ జూచి యనియె మఱియు. 357

—: శ్రీరాముఁడు కబంధుఁ డను రాక్షసుం జంపుట :—

సీ. "మహనీయసామ్రాజ్యమహిమ వాయుటయును,
బితృమరణంబు, నాభీలవిపిన
భూములఁ గడుదుఃఖమునఁ జరించుటయు, వై
దేహిఁ గోల్పడి వగఁ దిగుగుటయును,
దుదిఁ బోయి యే నిట్టు దొడరి యీదానవు
వాతఁ జిక్కుటయును వగవ నీకుఁ
బై పయిఁ బెక్కులాపద లయ్యె; నక్కట
ధరణీశ! నీవు నా ధరణిసుతయుఁ

ఆ. గలసి పూజ్యరాజ్యగౌరవంబున వెలుఁ
గంగ నెలమిఁ జూడఁ గాన నైతి;
నేను దలఁప నెట్టి హీనభాగ్యుండనో"
యనుచు ననుజుఁ డార్తి నడలుటయును. 359

తే. విగతసంభ్రముఁడై రామవిభుఁడు గడఁగి
"యన్న లక్ష్మణ! యోడకుమన్న! యేను
గలుగ నీ కేల యాపద గలుగ నేర్చు?"
ననుచు గ్రక్కున నిశితమహాసి వెలికి. 360.

వ. ఆ రక్కసు డాచేయి దునియ వ్రేసిన లబ్ధమోక్షుఁ డయి లక్ష్మ
ణుండు ప్రకట సైంహికేయదంష్ట్రాయంత్రనిర్ముక్తుం డయిన తిగ్మ
భానుండునుంబోలెఁ బ్రబదీప్తుండయి, తీక్ష్ణకౌక్షేయకంబునఁ దదీయ
దక్షిణబాహుఖండనంబు సేసి, పార్శ్వద్వయంబు భేదించిన నాక్షణంబ
కబంధుండు దివ్యరూపధరుం డగుటయుంగని రాఘవుండు విస్మితుండై

క. "ఈ వనమునందు రాక్షస
భావంబున నున్న నీకుఁ బ్రకటితదివ్య
త్వావాప్తి యైన కారణ
మేవిధ?" మనుటయును నాతఁ డి ట్లని చెప్పెఁ. 362

వ. "ఏను విశ్వావసుం డను గంధర్వుండ; బ్రహ్మశాపంబునం జేసి రాక్ష
సత్వంబు నొంది మీవలన శాపమోక్షంబు వడసితి; రావణుం డను

రక్కసుండు జానకిం గొనిపోయి లంకానగరంబున నునిచినవాఁడు; మీకు హితోపదేశంబు సేసెద; నిటపోవంబోవఁ బంపాభిధానం బయిన సరోవరంబు గలదు; దానియావల ఋశ్యమూకం బను శైలంబునందు వాలిసహోదరుండు సుగ్రీవుం డను వానరుండు సచివచతుష్టయ సహితుం డై యుండు; నతనితోడ సఖ్యంబు సేయుము; దానంజేసి నీకుఁ గార్యసిద్ధి యగు'' నవి పలికి గంధర్వుండు వారి వీడ్కొని నిజేచ్ఛం జనియెఁ; దదనంతరంబ యట చని చని. 363

సీ. కమనీయకమలినీకహ్లారదళకేస
రాన్వితజలముల నర్ఘ్యవిధియుఁ,
దరళతరంగహస్తములఁ బాద్యంబు, ను
న్మదచక్రసారసమధుపహంస
రుతులఁ బ్రియోక్తులు, రుచిరవానీరని
వేశనచ్ఛాయల విశ్రమంబు.
మందసంచారితమారుతంబుల నురు
తాపనోదనమును దగిలి యెపుడు

ఆ. నాచరించుచును, సమంచితాతిథిజన
సేవనమునఁ దనదుజీవనంబు
ఫలము నొంద నొప్పు పంపాసరోవరం
బెమ్మెఁ గాంచి తన్న రేంద్రసుతులు, 364

వ. ఆసరోవరతీరంబునం గౌసల్యానందనుండు దత్తద్విషయవిశేషోల్లా సంబులవలనం గ్రొత్త యై చిత్తజానలంబు దరికొని, చేతోవృత్తంబు నెరియింపం దొడంగినఁ దాల్మి దొఱంగి, జానకిం బేర్కొని యార్తం దన వచనవిషయుం డగుటయు, నతనికి లక్ష్మణుం డిట్లనియె. 365

చ. "పురుషవరేణ్య! యిట్లు మిముబోఁటులకుం జనునయ్య యాపదల్ వొరసినచోఁ గలంగుట? ప్రభుత్వ మెలర్పఁగఁ దాల్మి యూఁది దు స్తరతరమానసవ్యథలు దల్గుము; సంభృతపౌరుషుండ వై యరయును దేవి యున్న యెడ; యారసి కార్యము దీర్పు నేర్పునన్..

ఆ. అధిప! శిష్యుఁడను, సహాయుండ, భృత్యుండ
నైన యేను గల్గ నాత్మ నీకు

నేల వగవ?" నని మహీపతి చిత్తంబు
నలఁత డిందుపడిచె నవరజుండు. 367

వ, తదనంతరంబ యయ్యిరువురుం బంపాసరోవరంబునం గృతస్నానులయి దేవపితృ తర్పణంబులు సేసి చని, ముందట నతిబహుళబలాహకవ్యూహసన్నాహ సమున్నతంబు లైన యభంగోత్తుంగశృంగసముదయంబుల నఖిలగగనక్రోడపీడనంబు సేయుచున్న దాని ఋశ్యమూకశైలంబుఁ జేరి, తదుపకంఠ ప్రదేశంబున విశ్రమించి యున్నంత. 368

సీ. ఆరాజపుత్రుల, నారూఢతేజుల,
వీరుల, నున్నతోదారభుజులఁ,
గనుఁగొని సుగ్రీవుఁ డనఘుఁ డగ్గిరిశృంగ
మునకుండి తానును దనసచివులుఁ
జింతించి, వారి వృత్తాంతము నెఱుఁగంగ
సంతతోత్సాహు, ధీమంతు, శౌర్య
వంతు నుత్తము, హిమవంతుఁడుఁబోని య
త్యంతసుస్థిరు, హనుమంతుఁ బనిచె;

ఆ. నతఁడు నరిగి నృపతిసుతుల తెఱం గెల్ల
నెఱిఁగి, వనచరేంద్రు నెఱుఁగఁ జెప్పి
యుగ్రతేజుఁ డైన సుగ్రీవుతోఁ జెల్మి
యొనర సంఘటించె మనుజపతికి. 369

వ. సుగ్రీవుండును మున్ను సీతాపరిత్యక్తం బై తమ ముందటం బడినం దారు గైకొని సంగ్రహించి యున్న భూషణనిచయంబు రామునకు నివేదించినం జూచి, యతండు సముత్సుకుం డై వానికి వానర్యంబు ప్రతి శ్రుతంబు సేసి, తదీయ శత్రుం డైన వాలిం జంపఁ బ్రతిజ్ఞ సేసెఁ; గపీశ్వరుండును జానకిం దెచ్చుటకు సహాయంబు గా నొడంబడియె; నంతట నందఱు గూడికొని వాలి నివాసం బైన కిష్కింధానగరంబునకు కరిగి; రప్పుడు భానుసూనుండును. 370

క. వాలిగృహద్వారంబున
వాలి, మదం బెసఁగ నార్చి, వారక భాహో

స్ఖాలనము సేయుటయు, విని
వాలి మహోరోషదుర్ని వారోద్ధతుఁ డై. 371

వ. సమరసన్నాహం బమర వెలువడం బోయినఁ దదీయవల్లభ యగు తార యతని వారించి యిట్లను "నేఁటిచందంబు సూడ సుగ్రీవుండు బలపత్సహాయుం డై వచ్చినవాఁ; డది యె ట్లనిన దశరథనందనుం డైన రాముండు రావణుచేత నపహృత దారుం డయి, నిజసహో ధరుం డగు లక్ష్మణుండును దానును సుగ్రీవసహాయత్వం బపేక్షించి, యతని కార్యంబు దీర్ప బూనె నని వింటి; నదియునుం గాక మహా బలు లయిన మైంద ద్వివిదులు, నతిలోకపౌరుషుం డయిన హను మయుఁ, బ్రసిద్ధబుద్ధియగు జాంబవంతుండును వానికిమంత్రులై యుండు దురు; గావున నీ విప్పుడు గయ్యంబునకుఁ బోక నా కిష్టంబు గా" దనిన నవ్వుచు నవ్వనచరవీరుండు. 372

క. ఆ వనితవచనములు సు
గ్రీవవిషయపక్షపాత కృత్రిమములు గా
భావించి, యాదరింపక
తా వెడలె ననూనబాహుదర్పం బెసఁగన్. 373

వ. ఇట్లు వెడలి కట్టెదుర నున్న సుగ్రీవుం జూచి యి ట్లనియె. 374

—: వాలి సుగ్రీవుల యుద్ధము :—

తే. "ఓరి దుష్టాత్మ! యే నిట్లు పోరఁ బెక్కు
మాఱు లెగుసంగ సిగ్గఱి పాఱుచుండు
నట్టి నీ కున్నయునికిని యిట్టలముగ
నిట్టిబీర మెక్కఁడనుండి పుట్టెఁ? జెపుమ" 375

వ. అనినఁ బ్రహసితముఖుం డగుచు నబ్బలిముఖుం డి ట్లనియె. 376

క. "ఆలిని, రాజ్యముఁ గోల్పడి
యాలంబునఁ జూల పోయి, యక్కట! బ్రదు కిం
కేలా? యని తెగువ మెయిన్
వాలి రణము సేయ నమరి వచ్చితి నీతోఁ. 377

తే. చక్కఁ గమ్మింక ముందటిచంద మొందఁ
గలదె? తొంటి సుగ్రీవుండు గాఁడు; నేఁడు
నిన్నుఁ బొరివుచ్చికాని పో నేర్చు నెట్లు"
నను చు నుగ్రుఁడై యవ్వీరు నార్చి కవిసె. 378

వ. ఇవ్విధంబున. 379

ఉ. భూవినుతప్రభావులు, ప్రభూతబలోద్ధతు, లుగ్రవైరితే
జోవిజయుల్, నిరంతరయశోజయకాంక్షులు, భూరిభూరుహ
గ్రావనఖాయుధుల్, బలిముఖప్రవరుల్, గడుఁ బొంగి వాలిసు
గ్రీవులు దాఁకి రొండొరు లకృత్రిమరోషకషాయవక్త్రు లై. 380

మ. తరుసంఘంబులు పూన్చి యొండొరులు నుద్యద్బాహులై ప్రేయ, ని
ష్ఠురవక్షస్థ్సలపాతవేగవిరళ స్తోకంబు లై పోయె న
త్తరుసంఘంబులు; వెండియుం గడఁగి మాద్యల్లీల నయ్యిద్ధఱుం
బరుషానేకశిలాప్రయోగముల నొంపం జొచ్చి రన్యోన్యమున్. 381

క. అతులితశిలావితానం
బితరేతరతనునిపాతవేలాసంచూ
ర్ణిత మగుటయు, వారలుపటు
గతిఁ గవిసిరి బాహుయుద్ధకౌతుకమతు లై 382

ఉ. ఒండొరుఁ బట్టుచుం దిగుచు, చొండొరుఁ బాయుచు ప్రేయుచున్, మహో
ద్దండత నొండొరుం దొలఁగఁ దాఁకుచు, నీఁగుచు లోఁగుచుం, జలం
బొండొరు సీఱు, చొండొరులయుద్ధతి సైపక వీఁక బోరి రా
ఖండలభానుసూను లవిఖండితచండభుజాప్రచండులన్. 383

శా. దేహోత్సాహ మెలర్ప నుద్ధతమదాంధీభూతు లై యూహవో
త్సాహవ్యగ్రులు విగ్రహంబు మిగులన్ సంరంభశుంభద్గతిన్
బాహాబాహిఁ బెనంగ నప్పు డమరెం బ్రౌఢద్విపద్వంద్వ హే
లాహస్తద్వ్యయగాఢకర్షణరణోల్లాసంబు విస్పష్ట మై.

వ. మఱియు ననోన్యదంతనఖముఖవిఖండితశరీరు లై, హరివీరులు రుధిర
ధారలందడిసి పుష్పితంబు లగు నశోకంబులుంబోలె నొప్పి, చలంబులు

మెఱయం బెనంగు నెడం దుల్యబలరూపవిక్రము లైయున్న యయ్యన్న
దమ్ముల నిరువుర నేర్పడ లక్ష్మింపనేరక, లక్ష్మణాగ్రజుండు విలక్ష
హృదయుం డై వీక్షించుచున్న, నాంజనేయుండు రాఘవునకు
నభిజ్ఞానార్థంబుగా నొక్క పల్లవదామంబు సుగ్రీవు నఱుతం బెట్టఁ,
దదనంతరంబ రాఘవుం డమోఘబాణంబు దొడిగి వాలి యరంబు
వగులనేసినం బడి యవ్వానరుండు దశరథనందను నిందించుచుఁ
బ్రాణనియోగంబు నొందె; ని త్తెఱంగున. 385

ఆ. వాలిఁ జంపి యతనివనిత సుగ్రీవుని
వశము సేసి, నిఖిలవనచరేంద్ర
పదవియందు నెమ్మిఁ బట్టంబుఁ గట్టె వి
స్ఫారయశుఁడు రామభద్రుఁ డెలమి. 386

వ. ఆ వనచరుండును రామునకుఁ గృతాంజలి యై "దేవా! యీ ఘర్మ
సమయ శేషంబును, ఘనసమయంబునుం గడపి మఱి సీతాన్వేషణంబు
నకు నుత్సహించుట లెస్స" యని యయ్యిరువురకును మాల్యవత్పా
టంబున నివాసంబుఁ గావించి, తానును గిష్కింధాపురంబున నుండె
నంత. 387

మ. ఉరుఘుర్ఘ్మఘవిఘూతసంవిహితవిశ్వోల్లాస మైఁ పంచల
త్పరసాంభోద నినాదతూర్యరవ మై, చంచద్బలాకాగరు
ద్ధరలీలానవచామరస్ఫురణ మై, పర్జన్యసామ్రాజ్య మొ
ప్పె రమామందిర మై యుదగ్రశిఖినీపించాతపత్రంబులన్. 388

వ. ఆ సమయంబున నక్కడ. 389

క. దానవనాయకు చెఱఁ బడి
జానకి యురిఁబడినహరిణశాబమపోలెన్
మానిని సంతతభర్తృ
ధ్యానవివశ యగుచు నుండెఁ దాపం బెసఁగన్. 390

వ. అమ్మగువ కాపున్న దనుజాంగనలు త్ర్యక్షియు, లలాటాక్షియుఁ,
ద్విస్తనియు, నేకపాదయు, దీర్ఘజిహ్వాయు, నజిహ్వాయుఁ,
ద్విజటయుఁ, నేకలోచనయు మొదలయినవారు పెక్కండ్రు వికృతా

కారంబులతోడ నయ్యబలం బరివేష్టించి, యహర్నిశంబును నురక
యదల్చువారును, బెలుచం దిట్టువారును, ఖరోష్ట్రనిస్వనంబులు
సెలఁగ వెఱపించువారును, త్రిభువనాధిపతి యైన మన దశగ్రీవు
నొల్లని యీ దుష్టమానుషింబట్టి చెండి కండలు దిందు మనువారును
నై యున్న, నయ్యగ్నిశిఖ గళద్బాష్పయు, గద్గదకంఠియు నగుచు
నా రాక్షస స్త్రీల కిట్లనియె 391

తే. "అమ్మలార ! మీవలసినయట్ల చేయుఁ;
డింక నేటికిఁ దడయంగ ? నేను రాముఁ
దప్ప నొండొకపురుషుఁ జిత్తమునఁ దలఁప
నింత నిజము; నాకును జీవితేచ్ఛ లేదు" 392

వ. అనిన నజ్ఞానకి తెగువ రావణున కెటింగింపఁ గొందఱు సనిరి; మఱియు
సంతతప్రియవాదినియు, ధర్మజ్ఞయు నైన త్రిజట యను రక్కసి
రామాంగనం జేరంజని యిట్లనియె. 393

—: త్రిజట దన స్వప్నవృత్తాంతము సీతతోఁ జెప్పుట :—

సీ. "అమ్మ . నీ కెంతయు హర్షంబుగా నొక
వార్త నే నెఱిఁగింతు, వనజవదన !
నామాట నిజముగా నమ్ముము; వినవె య
వింధ్యుఁడు నా నొక్క వృద్ధదైత్యుఁ
డనఘుండు రామహితాన్వేషి యై నీకు
నాశ్వాస మొనరింప నబల నన్నుఁ
బనిచెను; విను నిన్నుఁ బాసిన పిదప ల
క్ష్మణుఁడును దాను సేమమునఁ గలసి

ఆ. యఖిలవానరేంద్రుఁ డైన సుగ్రీవునితోఁ
జెలిమి సేసి, యిపుడు శీఘ్రమునన
వీరవరుఁడు నిన్ను విడిపించుపనికి నై
యొదవి యుత్సహించి యున్న వాఁడు 394

వ. రావణునకు రంభానిమిత్తం బయిన నలకూబరుశాపంబు గలదు; గావున
నీయందు బలాత్కారంబు సేయరాదు; నీకు వినివలనిభయంబు వలదు;

మఱి యిద్దురాత్మునకుం జేటు దెలుపునట్టి దుస్స్వప్నంబుఁ గలిగె;
నది యాకర్ణింపుము. 395

క. ఖరములఁ బూనిన రథమున
విరిసినవెండ్రుకలు వెంట వ్రేలఁగ, దళకం
ధరుఁడు బహుళతైలాప్లుత
శరీరుఁడై దక్షిణంబు సనఁ గలఁ గంటిఁ. 396

తే. అతని చుట్టును గుంభకర్ణాదు లెల్ల
నరుణమాల్యానులేపను లై వికీర్ణ
పలితకేశులై, నగ్నులై పరఁగఁ బ్రేత
పతిదిశకు నేఁగుగతి గానఁబడియె నాకు. 397

ఉ. చారుసితోష్ణవారణలసత్సితమాల్యసితాంగరాగుఁ డై,
ధీరగుణోత్తరుం డధికధీనిలయుండు, విభీషణుండు వి
స్ఫారసితాద్రిశృంగమున భవ్యుఁడు మంత్రి చతుష్టయాన్వితుం
డై రమణీయలక్ష్మిఁ బొలుపారఁగ నేఁ గల గంటి నుగ్మలీ. 398

చ. తనసితకీర్తి విశ్వవసుధాగగనాంతరపూరితంబు గా
ఘనభుజుఁ డున్న తద్విరద కంధరసుస్థితుఁ డై ముదంబుతో
ననుజుఁడు దాను రాఘవకులాగ్రణి సన్మధుసిక్తపాయసం
బొనర భుజింపఁ గంటి వికచోత్పలలోచన! నిక్క మింతయున్. 399

క. పులిచేత వ్రేటువడి, మ్రైఁ
గలయఁగ నెత్తురులు గ్రమ్మఁ గా నేడ్చుచు, ని
మ్ములఁ నుత్తరాభిముఖ వై
కలుషితగతి నరుగ నిన్నుఁ గనుఁగొంటిఁ గలన్. 400

క. నాకల నిక్కము లయయ్యెడు;
శోకింపకు మమ్మ యింక సుందరి! పుణ్య
శ్లోకు, జితలోకు, నతులవి
వేకుం బ్రియుం బొందఁ గలుగు వేగమ నీకుఁ."
401

ఆ. అనినఁ ద్రిజటపలుకు లవి నిక్కములు గాఁగ
వగచి, సీత గొంత పనట దక్కి,

యాసతోడ నుండె; నట దళవదనుండు
సీతఁ దలఁచి విపళచిత్తుఁ డగుచు. 402

వ. తాను దేవ దానవ గంధర్వాది భూతవర్గంబుల నెల్ల జయించియుం, గందర్పదర్పంబు వారింప నోపక, యాఁతుణంబ దివ్యమాల్యాంబరా భరణభూషితుం డై సంచారశీలం బైన కల్పపాదపంబునుంబోలె నొప్పియుఁ, దనయొప్పుఁ బితృవనంబు నందలి వటభూరుహంబు సొంపునుంబోలె నతిభీషణం బగుచుండ, నశోకవనమధ్యంబు సొ త్తెంచి, రోహిణిసమీపంబునకు వచ్చు శనైశ్చరుండునుంబోలె జానకిం జేరఁ జనుదెంచి, ప్రణయపూర్వకంబుగా ని ట్లనియె. 403

క. "ఏల మదిరాక్షి! వలవని
జాలిం బడి నవసెదవు? లసద్భూషణలీ
లాలంకృత వై ననుఁ గృప
నేలికొనం గదవె? వేయు నేటికి నింక? 404

చ. అనిమిషయాతుధానవియచ్చరోన్నరపన్నగాసురాం
గనలఁ గరంబు చిత్తమునఁ గైకొన, కే ననురాగలీలమై
నిను మది నాదరించు టిది నీ దగుభాగ్యము గాదె? యింతయున్
వనిత! యెఱుంగ వై తి; గురువంపువిచారము లేల నీయెడన్. 405

ఉ. రాముఁ డనంగఁ బేర్మియును రాజ్యముఁ గోల్పడి కానలోన దుఃఖామయమగ్నుఁ డై న యొక యల్పమనుష్యుఁడు; వానివైఁ గమం
బ్రేముడి సేయుచున్ పగపు పెల్లునఁ జిత్తము దల్లడిల్లఁగా
నీమెయి నుండు నీ యునికి యేసుఖ మంద్రు? లతాంగి చెప్పుమా. 406

వ. ఏను సకలలోకేశ్వరుండ; నాకుం గింకరు లై పదినాల్గుకోట్లు నిశా చరభటులును, నిరువదియెనిమిదికోట్లు రాక్షసులును, నెనుబదియాఱు కోట్లు యక్షులును వర్తిల్లుదురు; నిఖిలధనాధ్యక్షుండయిన యక్షేశ్వ రుండు నాయగ్రజుండు; బ్రహ్మసమానుండగువిశ్రవసుండు మదీయజన కుండు; గుబేరునకు వినోదపాత్రంబు లై న గంధర్వాప్సరోగణంబులు నన్ను సేవించుఁ; బంచమలోకపాలుం డని నన్నుఁ ద్రిభువనంబులుఁ గీర్తించు; భక్ష్యభోజ్యాదివస్తువులును సురేశ్వరగృహంబునం దెట్లట్ల

నాగృహంబున నక్షయంబు; లిట్టి నావిభవం బింతటికిని, మదీయజీవి
తంబునకు నధీశ్వరి వై సుఖంబున భోగింపు" మనిన విని వై దేహి
క్రోధశోకవ్యాకులహృదయ యగుచు వానిదెసం జూడక, యొక్క-
తృణాంకురం బుపలక్షించి యి ట్లనియె. 407

సీ. "అకట! పరాంగన, నబలఁ, బతివ్రతఁ
బరికింపఁగా మర్త్యభామ నేను;
రాక్షసుండవు నీవు; రాగంబు మది నించు
కయు లేని నాదు సంగమమునందుఁ
గలిగెడు నట్టిసౌఖ్యం బెంత? యదిచ్ఛును
గాక యాద్యుం డైన కమలగర్భు
పౌత్రుఁడ నని, లోకపాలతుల్యుఁడ నని,
హరసఖుం డైన ధనాధినాథు

ఆ. భ్రాత నని భవత్ప్రభావంబు నెప్పితి;
పిట్ట నీవు ధర్మ మెఱిఁగి, దుశ్చిత
వర్తనంబు విడుప వలదె? సిగ్గేది యి
ప్పగిదిఁ బ్రల్లదములు వలుకఁ దగునె?" 408

వ. అని పలికి జానకి యుత్తరీయసంవృతవదన యై యతికరుణంబుగా
నేడ్చిన, నద్దురాత్ముండు వెండియుఁ గొన్ని దుర్వచనంబులు పచరించి,
యనంతరంబ యంతర్ధానంబు నొందె; నప్పాలఁతియు నెప్పటియట్ల
రాక్షసీరహిత యై యుండె;" నని మార్కండేయుండు ధర్మరాజు
నకు నిర్దేశించిన తెఱంగు వైశంపాయనోక్తం బైన యాఖ్యానంబు
విఖ్యాతమాధుర్యమనోహరంబుగా. 409

క. విమలపాత్రగుణోన్నత!
విమలాదిత్యాత్మజన్మ! విలసత్కమలా
రమణీకరకమలోజ్జ్వల
విమలాంబుజరేణురాగ విలసితవక్షా. 410

వనమయూరము భూసురకదంబసుర భూరుహా! వికాసో
ద్భాసితకృపారసవిపాక! సుగుణైకో

ల్లాఁ! హర హారమృగలాంఛన మృణాళీ
హాసినవకీ ర్తివిసరాకలితలోకా! 411

గద్యము. ఇది సకలసుకవిజనవినుత నన్నయభట్టప్రణీతం బైన శ్రీమహా భారతంబునం దారణ్యపర్వబునందు దుర్యోధను ప్రాయోపవేశం బును, పాతాళగతు లయిన దానవు లతని నాశ్వాసించుటయు, వైష్ణవయాగప్రవర్తనంబునఁ బాండవులు గ్రమ్మఱఁ గామ్యకవనం బున కరుగుటయు, ప్రీహిద్రోణాఖ్యానంబును, ద్రౌపదీ హరణంబును, జయద్రథు భంగంబును, రామా యణకథాప్రవృత్తియు, నందు రామ రావణుల జననంబును, రాఘవు వనప్రస్థానంబును, సీతాపహరణం బును, సుగ్రీవమిత్రత్వంబును, వాలివధయును, ద్రిజటాస్వప్నకథనం బును, రావణు దుష్టవచనంబులు నన్నది షష్ఠాశ్వాసము.

శ్రీ

గణేశ శారదా గురుభ్యో నమః

శ్రీ మదాంధ్ర మహాభారతము

ఆరణ్యపర్వము - సప్తమాశ్వాసము

శ్రీకర సోమాన్వయర
త్నాకరహిమధామ ! ధార్మికాంచితవిన యో
త్సేక ! భువనైకవీర ! మ
హాకావ్యరసప్రయోజనారూఢమతీ !

—: రాముఁడు లక్ష్మణుని సుగ్రీవునొద్దకుఁ బంపుట :—

వ. అక్కథకుండు శౌనకాదిమహామునులకుం జెప్పె; నట్లు పరమతపో నిలయుం డయిన మార్కండేయుండు పాండవేయులతో మఱియు ని ట్లనియె "నంత మాల్యవత్కందరమందిరుం డైన దశరథాగ్ర నందనుండు నవకందళితసుందరంబులును, జనకనందినీ వియోగదుస్స హంబులు నగు ఘనసమయదివసంబుల నెట్టికేనియుం గడిపి, నిరతి శయసాంద్ర చంద్రాతపస్నపన శీతలసమీర వాహ్యమాన వినిద్ర కుముద కేదార సౌరభ్యనిర్భరంబులు, నతిదీర్ఘ యామంబులు నైన శారదయామిను లపనయింప నోపక యొక్కనాఁడు దమ్ముఁనిం జూచి యి ట్లనియె. 2

సీ. "చూచితే లక్ష్మణ ! సుగ్రీవుకొఱగామి ?
యమ్మొయిఁ దన పగ యడఁచి మనము
కపిరాజ్య మిచ్చినఁ గైకొని, యింద్రియ
సుఖముల నెంతయుఁ జొక్కి, నేఁడు

మనదిక్కు దలపఁడు; మనతోడఁ బల్కిన
సమయంబుఁ జెల్లింపఁ జనదె తనకుఁ ?
గడుఁ గృతఘ్నత సేసెఁ గపికులాధముఁడు; నీ
వనఘ కిష్కింధకు నరుగు మిపుడ;

ఆ. యద్దు రాత్మ్మఁ, గృపణు, నాత్మీయకార్యత
త్పరుని, నధికరాగపరవశాత్ముఁ
దొడరి వాలి చనినత్రోవనే యనిచి ర
మ్మేల తడయ మనకు నింక నిచట ? 3

ఆ. నీవు సనకమున్న నెటితోడ మనకార్య
మునకుఁ దగినయత్నములు ఘటించి
యుండెనేని, వాని నొండేమియుం జేయ
వలదు; తోడి తెమ్మవార్యశౌర్య" 4

చ. అనుడుఁ దదాజ్ఞఁ బూని యతఁ డాతతకార్ముకహస్తుఁ డై రయం
బునఁ జనియెం గపీశ్వరునిప్రోలికి; వాఁడును సంభ్రమంబుతో
ననుఁగులుఁ దాను రాజసుతు నర్థి నెదుర్కొని ప్రేమొక్క, యర్ఘ్యపూ
జన మొనరించుడున్ విభుని శాసన మాతఁడు నెఱ్ఱి వానికిఁ. 5

వ. చెప్పిన విని భయకంపితగాత్రుం డగుచుఁ గమలమిత్రపుత్రుండు సుమిత్రాపుత్రున కిట్లనియె "నయ్యా!. యే నేల కృతఘ్నుండ నగుదు ? జానకి నన్వేషించుటకు నై బలవంతులు బుద్ధిమంతులు నగు వానరుల ననేకుల నలుదెఁలకుం బనిచితి; వారును సకలవన శైల సాగర గ్రామ నదీసహితం బైన భూచక్రంబునం దెల్ల రోసి, యొక్క మాసంబులోనం గ్రుమ్మఱి వచ్చువా రై సమయంబు సేసి పోయి; రింక నైదుదినంబులు గొఱంత యింతియు; మీఁద వై దేహి వార్త గొనుచు దేవరం గొలువ వచ్చువాఁడ నై యున్న వాఁడ" ననినం బ్రీతుం డై లక్ష్మణుఁడు. 6

క. వానిం దోడ్కొని చని యా
భూనాథునిఁ గానిపించి, పొందుగఁ దత్కా
ర్యానుష్ఠానవిశేషము
దా నెఱిఁగించుటయు విభుఁడు దద్దయు నలరెన్. 7

వ. పదంపడి కొన్ని దినవసంబులకుఁ బూర్వపశ్చిమోత్తరదిక్కులకుం జనిన వనచరు లరుగుదెంచి రాఘవుం గని "దేవా! సకలసాగర మేఖలావలయితంబైన భూవలయంబంతయు వెదకితిమి; మీ దేవిం బొడగాన" మని చెప్పిన నతండు దుఃఖితుం డయి, దక్షిణదిశకుఁ బోయిన వానరులవలన వై దేహితెఱుం గెఱుంగుదు ననుఁ నాసం జేసి ప్రాణంబులు ధరియించి యుండె; నంత వెండియు నొక్క మాసంబు సెల్లినఁ గొందఱు వనచరులు పఱతెంచి సుగ్రీవుం గని యి ట్లనిరి. 8

సీ. "నీవును వాలియు నేఁడును నాఁడునుఁ
బ్రియమునఁ బాటించు పెద్దతోఁట
మధువనం బదె నేఁడు మన యంగదుండును
హనుమంతుఁడును మొదలైనవారు
బలువిడిఁ జూఱాడి ఫలము లానెదరు; త
ద్రక్షకు లగుమమ్ము రయము మీఱి
భంగించి;" రనవుడు భానునందనుఁ డాత్మ
నంగచప్రముఖులు యామ్యదిశకుఁ

తే. జనినవారలు గావున జనకపుత్రిఁ
గనినయు బ్బిది గాఁబోలుఁ గాక; యిట్లు
సేయ వెఱువరె? పతికార్యసిద్ధిసలుపు
జనుల కీచన పెందును జనున కాదె?" 9

వ. అని యూహించి తత్పరికారంబు రఘుపతికిం జెప్పె నంత. 10

ఉ. తేనెలు గ్రోలి క్రోలి, కడుఁ దియ్యనికమ్మనిపండు లింపు సొం
పారఁగ నాని యూని, పర పందినసీడలు మెచ్చి మెచ్చి, మం
దానిలసైన్యసౌరభసమగ్రతకుం గడుఁ జొక్కి, చొక్కి యు
ద్యానమునందు మారుతసుతప్రముఖుల్ విహరించి తృప్తి లై. 11

వ. అందఱుం గూడుకొని చని సుగ్రీవలక్ష్మణసహితుం డై యున్న జనాథుం గని దండప్రణామంబులు సేసినం, గాకుత్స్థకులప్రదీపకుండు వారల ముఖవర్ణవిశేషంబు లుపలక్షించి, సీతం గనినవార కా నిశ్చయించె; నప్పు డత్యంతమతిమంతుండయిన హనుమంతుండు రాఘవునకుఁ గృతాంజలి యై యి ట్లనియె. 12

క. "దేవిఁ బొడగంటి నేను ధ
రావల్లభ! శైల సరి దరణ్య నగర పా
రావారకలిత మగువసు
ధా పలయము వెదకి వెదకి దక్షిణపుదిశన్. 13

—: హనుమంతుఁడు రాముని తో సీతం జూచిన వృత్తాంతంబు సెప్పుట :—

తే. అవధరింపుము దేవ! నే మందఅమును
నేకముఖమునఁ దొలితొలి యిందునందు
నరయుచును బోయి, యొక్కెడ నతివిశాల
మైన భూవివరముగంటి మద్భుతముగ. 14

వ. కని దానిం బ్రవేశించి నిరంతర తిమిరసంవృతంబును, బహుకీటసంకులంబును నైన మార్గంబున ననేక యోజనంబులు సనునెడ, ముందట నర్కప్రకాశం బైన పురంబు గానంబడియె; నందొక్క తాపసాంగనయుండి మమ్ము నాదరించి, తనపేరు ప్రభావతి యనియును, నప్పురంబు మయునిపురం బనియునుం జెప్పి, మధురంబు లయిన భక్ష్యభోజ్యంబు లొసంగినం దృప్తుల మై తదుపదిష్టమార్గంబున మహావివరంబు నిర్గమించి, సహ్యదర్దుర శైలంబులు గడచి మలయశైల శిఖరం బెక్కి. 15

స్రగ్ధర. లీలం గల్లోలమాలోల్లిఖితగగన మై, లీననానాకుళీర
వ్యాళోగ్రగ్రాహమీనావళుల నెసఁగి, దుర్వారవారోఘగంభీ
రాలంఘ్యప్రౌఢవేగం బగుచు, బహుతరాయామవిస్తార మై బి
ట్టాలోకింపంగ నుగ్రం బగు జలనిధి నంతంతటం గంటి మంతన్.

క. కని యిది రత్నాకర; మి
వ్వననిధిసీమమునఁ గల్గువసుమతిలోనన్
జనకసుత వెదకి కానమ;
చన దివ్వారాళి దాఁటి చన నెవ్వరికిన్. 17

ఉ. భూమితనూజఁ గాన మని పోయి రఘూద్వహుతోడఁ జెప్పి, య
బ్భూమిపుచిత్త మాతురతఁ బొందఁగఁ జేయుటకంటెఁ జూడఁగా,
నీమెయిఁ జావు మేలు; మర కేల విచారము లింక? నంచు నం
దేము గడంగి యందఅము నేకతమం బగు నిశ్చయంబుతోన్. 18

వ. అనశనవ్రతంబు సంకల్పించి నియతచిత్తుల మై యుండి, రాఘవు కార్యార్థం బై తెగిన జటాయువు గృతార్థుం డయ్యె; మనము నట్టి పుణ్యలోకంబు వడయుద మని పలుకు చున్న యెడ. 19

క. గిరిశృంగతుంగవిగ్రహుఁ,
దురుతరసత్త్వుఁడు, విహంగమోత్తముఁ డం దొ
క్కరుఁ డొయ్యన మా యున్నెడ
కరుదుగఁ జనుదెంచి విగళితాశ్రుం డగుచున్. 20

సీ. "అయ్యలార! జటాయు వని పల్కెదరు మీర
లెవ్వరు? నెప్పరే; యేను వాని
కగ్రజుండ; ననూరునాత్మజన్ముల మేము;
సంపాతి నాపేరు; సమ్మదమున
నేనును దమ్ముండు నినమండలమునకుఁ
జనువేడ్క నొకనాఁడు చదలి కెగసి
చనఁ జనఁ దీవ్రాంశుసంతాపమునఁ జేసి
కమరె నాఱెక్కలు; గమర వయ్యె

తే. ననుజుపఱుమ్ము; లే నిమ్మహోచలమున
నాఁటఁగోలె నెచ్చటికిఁ జనంగ నేర
కున్న వాఁడ; నాతమ్ముఁడెట్లున్న వాఁడో
యెఱుఁగ; నెఱిఁగింపరే నాకు నిష్ట మెసఁగ." 21

వ. అనిన నే మతని- భవదీయవృత్తాంతంబును, రావణుండు దేవిం గొని పోవుటయుఁ, దదర్థంబు రావణునితో జటాయువు సమరంబు సేసి యీల్గుటయుఁ జెప్పిన విని దుఃఖితుం డై సంపాతి యస్మదీయ ప్రవర్తనం జేర్పఁ నడిగి మా ట్లనియె. 22

ఉ. "రావణు నే నెఱుంగుదుఁ; బరాక్రమదుస్సహు డన్నిశాచరుం;
డీవనరాశిమధ్యమున నిచ్చటికిన్ శత యోజనంబులన్
భూవిదితంబు లంక యనుప్రోలు తదీయనివాస; మచ్చటన్
భూవరుదేవిఁ గాన నగుఁ; బొం డరయుండు కృతప్రయత్న లై."

క. అని యతఁడు సనిన నందఱ
మును సాగరతరణకార్యమునకు నుపాయం
బొనరఁ దలపోయునెడ; నే
నని యుత్సాహంబు సేయఁడయ్యె నొకండున్. 24

మ. జననాథోత్తమ! యేను బూని భవదాజ్ఞాలీలచెల్వంబు, మ
జ్జనకుం డైన సమీరదేవుకృపయుఁ సత్త్వోన్నతుం జేయఁగా,
ఘనవాస్తుంగతరంగసంగత మహాగ్రాహోరగాత్యుగ్రద
ర్శన మై పేర్చు పయోధి దాఁటితి జనాశ్చర్యైకసంపాది నై. 25

ఉ. ఆలవణాబ్ధిమధ్యమునయందుఁ ద్రికూటనగంబుమీఁద ను
త్తాలవిశాల హేమమణిధామసముజ్జ్వల మైన లంక యన్
ప్రోలొగిఁ గంటి; నెంతయు నపూర్వము దద్విభవంబు; దేవ? య
చ్చోలలితాంగి నారసితిఁ జొచ్చి యనేకవిచేష్టితంబులఁ. 26

వ. అరసి యొక్కెడ రావణాంతఃపురం బయిన యశోకవనంబునందు.

సీ. కన్నీరు జడిగొని క్రమ్మఁ బ్రాఁ కెక్కిన
కమ్రకపోలభాగములు గలిగి,
యవళ మై యొఱఁగినయంగవల్లిక పొంత
నున్నభూమిరుహం బూఁత గాఁగ,
వెడలునిట్టూర్పులవేఁడిమిఁ బగిలిన
యధరపల్లవము గారాకుఁ బోలఁ,
దలఁపులసందడి దందడించినతాల్మి
గదిరి శిరఃకంపగతుల బెరయ,

ఆ. నున్నపుణ్యమూర్తి, నుత్తమసౌందర్య,
నవనతాస్య, నార్త యైనదానిఁ
గని విదేహతనయఁ గా నెఱింగితి నేను
హా రఘుప్రవీర యనుచు నడల. 23

క. వినయమునఁ దేనిఁ జేరం
జని, యభివాదనము సేసి "జానకి! రఘునం
దనదూత నేను మారుత
తనయుఁడ వానరుఁడ; నిన్నుఁ దడవ నిచటికిన్. 29

వ. అరుగుదెంచితి; రామలక్ష్మణు లత్యంత కుశలంబున నున్నవారు; వానరేశ్వరుండయిన సుగ్రీవుండు వారితో సఖ్యంబు సేసి, తత్కార్యంబు దీర్పంబూనె; నింక మసలక నీహృదయేశ్వరుండు సమదెంచునూఅడిల్లుము 30

క. రక్కసుఁడుఁ గాను జుమ్మీ!
నిక్కము వానరుఁడ నేను; నీమదిలోనం
దక్కు మనుమాన" మనవుడు
నొక్కింత దలంచికొని సముత్సుక యగుచున్. 31

వ. అద్దేని నా కిట్లనియె "నన్నా! ని న్నెఱింగితి; నది యెట్లనిన, రామహితాన్వేషి యగువాఁ డవింధ్యుం డను వృద్ధరాక్షసుండు మున్న యింతయుం ద్రిజటచేత నా కెఱింగించె; నతని పలుకులు దప్పవు; రాఘవుండు సుగ్రీవసహాయుం డయి యునికి గలిగినది గావున, నింకఁ దడయక యవ్వీరవరుం దోడ్కొనివచ్చి నాకుం బ్రియంబు సేయుము;నీకుంగార్యసిద్ధియయ్యెడు మరుగు" మనితన శిరోభూషణం బయిన యీ రత్నంబు మీకు నభిజ్ఞానార్థంబుగా నాచేతికిచ్చిమఱియుఁ చిత్రకూటచరితం బైన కృతకవాయసకథయునుం జెప్పి, వీడ్కొల్పిన నేను లంకాపురదాహంబు సేసి, యిట దేవర కింతయు విన్నవింప వచ్చితి" నని చెప్పి హనుమంతుండు జానకీహృదయంబు మూర్తిమంతం బైనపగిది నున్న యమ్మహామణి రాజచూడామణికి సమర్పించిన. 32

ఆ. అమ్మనోజ్ఞ రత్న మక్కునఁ గదియించి
పులక లెగయఁ గొంతప్రొద్దు విభుఁడు
జానకీకుచాగ్ర సంగమసుప్తుఁ డై
నట్ల యుండె ముకుళితాక్షుఁ డగుచు. 33

వ: ఇట్లు రాఘవుండు సీతావృత్తాంతంబు విని, తత్సమాగమకుతూహలవ్యగ్రుం డై సుగ్రీవుం జూచి "దండున కాయితంబు సేయు" మనినఁ బ్రసాదం బని యతండు నలుదిక్కులం గల వానరనాయకులం బిలువం దొడంగిన. 34

—: వానరవీరులు నానాదేశంబులనుండి సుగ్రీవునొద్దకు వచ్చుట :—

క. శతకోటివ్యయహారిపరి
వృతు లై చనుదెంచి యతులవీరులు, ధీరో
ద్ధతులు, గజుఁడు గవయుఁడు వి
శ్రుతముగ రఘుపతికిఁ దోడు సూపిరి గడఁకన్. 35

క. అఱువదికోటులు గపివరు
లుఱక జగత్త్రయము నొకట నువ్వెత్తుగొనం
దటిగొన్నయట్లు నడవఁగ
నెఱసి కడుముదుఁ డరుగుదెంచి నృపవరుఁ గనియెన్. 36

ఉ. కోటిసహస్రసేన తగఁ గొల్వఁగ, వానరసేన కెల్లఁ దా
మేటి, మహాబలుండు, నిరమిత్రుఁడు, మిత్రసహాయుఁ డై తగన్
వీటికి నుబ్బుగాఁ జటులవేగసముచ్ఛ్రితపుచ్ఛగుచ్ఛవి
స్ఫోటితదిగ్విభాగుఁ డగుచుం జనుదెంచె సుషేణుఁ డత్తఱిన్. 37

క. గణుతింప రాని వానర
గణములతో దధిముఖుండు కాకుత్స్థకులా
గ్రణికిఁ బ్రియంబుగ వచ్చె ధ
రణిభాగము వాహినీచరణచలితము గాన్. 38

ఆ. శతసహస్రకోటిసంఖ్యల యెలువులు
గొలువ, జలదనీలఘోరమూర్తి,
జాంబవంతుఁ డతులసత్త్వుఁ డేతెంచె నా
భూపవరుని కార్యమునకుఁ బూని. 39

వ. మరియు ననేకు లనేక సహస్రసంఖ్యబలంబులతోడం జనుదెంచి; రిట్లు గూడిన కపివీరులు వివిధాకారు, లపారబలశౌర్యసారు, లతిఘోరం బుగాఁ బేర్చి నిగుడుచు, మగుడుచుం, దాఁటుచుఁ, బాఱుచుం దిరుగుచు, సురుఁగుచు, మలయుచుఁ బొలయుచు, మత్తిల్లి గిరిగుహాలయంబులందును. దరువనంబులందును, సరిదుపాంతంబులయందును, నానందంబున విహరించుచుండిరి; తదనంతరంబ. 40

మ. ప్రభ నొప్పారి యనుంగుఁదమ్ముఁడు మహాభాగుండు సౌమిత్రి వీ
తభయుం డై కొలువం, గపీంద్రబలసంతానంబుతో నుద్ధతిఁ
శుభలగ్నంబున రాఘవుండు గదలెన్ సుగ్రీవసాహాయ్యసం
ప్రభవోత్సాహ మెలర్ప దర్పితరిపుప్రాకారేయతిగ్మాంశుఁ డై. 41

ఉ. ఆహారివీరవాహినుల కన్నిటికిన్ మొగ మై, మరుత్సుతుం
డాహవదోహళుం డమ రె; నంగద నీల నలాది వీరు లు
త్సాహము మీఱ నయ్యయిదెసం దగుకాపలి యై, సమగ్రస
న్నాహమహోగ్రతం జనిరి నాకవిరోధివధాభిలాషు లై. 42

వ. ఇట్లు నడచి యెడనెడం బ్రభూతవన్యఫలజలాశయంబు లగు ప్రదేశం
బుల విడియుచుం, గపిసైన్యంబు గతిపయదినంబులకు దక్షిణోదధి
తీరంబు సేరి, రెండగు వారాశియుంబోలె శూర్ణిల్లు చుండె; నంత
రాఘవుండు రవితనయుం జూచి యి ట్లనియె. 43

క. "మనబల మిది యతిబహుళము;
వననిధియును దుస్తరంబు; వానరవర! యి
వ్వననిధిఁ గడచునుపాయము
మన కొక్కటి నిశ్చయింపుమా తగుబుద్ధిన్." 44

తే. అని విచారించునెడఁ గొంద అధిపుఁ జూచి
జడధి బలితంపుఁ దెప్పలఁ గడత మనిరి;
ఘనకలంబులు సమకట్టి కడత మనిరి
కొంద; అంతయు విని రఘునందనుండు. 45

సీ. అల్లన నగుచు ని ట్లనియె "మీచెప్పుటల్
దగినయుపాయంబు నగున; యయిన
నగణితం బైన యీహారిసైన్యముల కెల్ల
గలుములుఁ దెప్పలు వలయునన్ని
సమకట్టు టరయ నశక్యంబు, శతయోజ
నంబుల పరపైన యంబురాశిఁ
గలములఁ దెప్పలఁ గడచుచో, రిపుకోటి
యెడరునఁ బైఁబడి పొడువ కున్నె?

ఆ. యదియుఁ గాక యల్పు లగు వణిగ్జనముల
యోజ శూరతతికిఁ దేజ మగునె?
కాన నాదుమతము గా దివ్విధంబు; నా
మనసునిశ్చయంబు వినుఁడు మీరు. 46

చ. వ్రతము ధరించి నిష్ఠ నుపవాసవిధిం గొలుతున్ సముద్రు; నా
కితఁడు ప్రియంబుతోడఁ దెరు విచ్చుట యంతన కల్గనేని మే;
లితరునిఁగా ననుం దలంచెనేని నమానుషరోషవేగదీ
పితశరవహ్ని నిజ్జలముఁ బీల్చెదఁ; బ్రేల్చెద నొక్కవ్రేల్మిడిన్." 47

—: రాముఁడు దర్భశయనుం డై సముద్రుం బ్రార్థించుట :—

వ. అని పలికి దశరథాగ్రసూనుండు చానును దమ్ముండును నుపవసించి, దర్భశయను లై జలధీంద్రు నుపాసించు చున్నంత, సముద్రుండు సకలజలచరప్రకరపరివారుం డై రాఘవునకుం బొడసూపి "యయ్యా! నీ పలనఁ బ్రీతుండనైతి; నీ కెయ్యది ప్రియంబు సేయుదుఁ? జెప్పు" మనిన నతండు "నాకు లంక పై నరుగం దెరు విచ్చునది; యీని నాఁడు సూర్యనిభంబు లయిన మదీయదివ్యాస్త్రంబుల నిన్ను శోషింపం జేయుదు" ననిన విని సరిత్పతి రఘుపతి కి ట్లనియె. 48

సీ. "జననాథ నీ కార్యమునకు నే విఘ్నంబు
గావింపనోడుదు నేవిధమున;
ఏనుము, నావాక్యంబు; జను లెల్ల నెఱుఁగ నీ
కిత్తఱి నేఁ దెరు విత్తునేని
నిల నెల్ల వాఁడును విలసితదివ్యాస్త్ర
బలమున సాధింపఁ దలఁచు నన్ను;
మీయందుఁ గపివీరుఁ, డాయతమతి, విశ్వ
కర్మసూనుఁడు శిల్పికర్మవిదుఁడు
ఆ. నలుఁడు నాఁగ నొకఁడు గలఁడు; వాఁ డొలసి నా
యందుఁ దరులు గిరులు నొందవైవ
నవి ధరింతు నేను దివిరి; నీ కది సేతు
వుగఁ గడంక నరిగి పగఱ గెలుము." 49

వ. అని యతని నొడంబఱిచి సముద్రుండు సనుటయు, నమ్మహీపతి నలు రావించి సేతుబంధసంబు సేయ నియోగించిన, ననేక వానరసహ స్రంబులు నలుదిక్కులకుం బఱచి గిరిశిఖరంబులుఁ దరునికరంబులు, విఱిచి తెచ్చి యిచ్చు చుండ, నన్నలుండు మున్నీటియందు శత యోజనాయామంబును, దశయోజనవిస్తారంబునుం గా నతిదృఢం బగు సేతుబంధనంబు నిర్మించె; నయ్యవసరంబున. 50

ఆ. అన్నతోడ నలిగి యాప్తులుఁ దాను వి
భీషణుండు వినయభూషణుండు
నెమ్మి నరుగు దెంచి నృపశిరోమణి రాము
శరణుఁ జొచ్చె భక్తిభరితుఁ డగుచు. 51

క. ఆరాతుసవృషభుని యా
కారము, నింగితముఁ జూచి కాకుత్స్థకులో
ద్ధారుఁ డతని నతిధార్మికుఁ
గా రూపించి ముద మెప్పుఁ గైకొని కరుణన్. 52

ఉ. వాని దానవేంద్రువిభవంబు సమస్తము నిచ్చువాఁడు గాఁ
బూని ప్రతిజ్ఞ సేసి, కృతపుణ్యుఁడు లక్ష్మణుతోడి చెల్మియుఁ
వానికి నిచ్చి, చెచ్చెర నవారిత వానరసైన్యయుక్తుఁ డై
వానిఁ బురస్కరించుకొని వారిధి దాఁటె మహోగ్రలీలతోన్. 53

వ. ఇట్లు సేతుమార్గంబున సాగరోత్తరణం బాచరించి, త్రికూటపర్వతం బెక్కి, లంకానగరంబుచుట్టును శిబిరంబులు సంఘటింపం బంచిన. 54

క. తాళైలాగురు సాలర
సాల తమాలామ్ర నింబ జంబూ జంబీ
రాలంకృతలంకావన
జాలంబుల విడిసె వృకచరసైన్యంబుల్. 55

వ. తదనంతరంబ రావణుచారు లయిన శుకసారణు లనువారలు వానరా కారంబులు దాల్చి శిబిరంబునఁ గ్రుమ్మరుచున్న నెఱింగి, విభీషణుం డా రాక్షసులం బట్టించి రామునకు సమర్పించిన, నతండు వారికి నిజ సైన్యం బంతయుం జూప నియోగించి విడిచి పుచ్చుటయుం, జని

యయ్యిరువురు నమరవైరిం గని కపిసైన్యంబు దుర్జయం బనియును, రామలక్ష్మణుల తేజోమూర్తివిశేషంబులును నెఱింగించిన, నతండు దాని సరకు సేయక సమరంబునకు మోహరించి. 56

సీ. బద్ధశిలాయంత్రబహుళ మై, యుత్తాళి
తాట్టాలకాభీల మై, యుదగ్ర
కేతుపతాకాప్రకీర్ణ మై, తోమర
ముద్గరాలాతక ముసల శూల
శర శతఘ్నిముఖ సాధనోపేత మై
యుగ్రవిగ్రహధీర యోధవీగ
సంకులం బై, హయస్యందన వేదండ
చండ మై, సముదితసప్తసాల

ఆ. మై, యలంఘ్యపరిఖ మై, తృణకాష్ఠజ
లాదివస్తుభరిత మైన లంక
కధికరక్షఁ జేసి యప్రమాదంబున
నుండె రిపుజిగీష నుదితబలుఁడు. 57

వ. ఇట రాఘవుండును సుగ్రీవసహితుం డై యుండి యంగదుఁ జూచి "నీవు రావణు పాలికిం జని యతనికిం దగిన తెఱంగున బుద్ధిగాఁ జెప్పి జానకిఁ విడుచుట మే లని చెప్పు" మని పనిచినం బనివూని యవ్వీరుండు. 58

శా. లంకాద్వారము దుర్నివారముగ నుల్లాసంబునం జొచ్చి, నిశ్శంకుం డై సురశత్రుసైనికసహస్రంబుల్ దనుం జూచి యాశంకం బొందఁగ లీలమైఁ జని, సుహృత్సంఘంబు గొల్వన్ నిరాతంకుం డై కొలువున్న దైత్యుఁ గని, యుద్యన్మూర్తియై యిట్లనున్:

—: అంగదు రాయబారము :—

క. "ఇనకులతిలకుఁడు, బాణా
సనవిద్యాగురుఁడు, రామచంద్రుఁడు నీతో
ననుఁ నిట్లను మని పనిచెను;
వినుము తదీయోక్తిభంగి విస్పష్టముగాన్. 60

సీ. "అనపరాదులఁ గాననాంతరమ్మున నున్న
వేదతాపసులఁ జంపితి పలుపుర;
నమరుల యిల్లాండ్ర నటిముటిఁ జెఱ వట్టి
తఖిలలోకములకు నలఁత సేసి;
తిది యెల్ల నొకతల, యేపు మీఱఁగ నన్నుఁ
జెనకుట యొకతల సెప్ప నేల?
బలిమి యొప్పఁగ మంచిబంటవై వెడలుము
కయ్యఁబునకు; నట్లు గాకయున్న

ఆ. శరణుఁజొచ్చి నాకు జానకి నొప్పింపుఁ
మొండువెంట బ్రతికి యుండఁ దీఱు;
దస్మదుగ్రశరళతాశీవిషంబుల
కెరయ నీదు ప్రాణ; మింత సిజము 61

క. మనుజుండ నైన నాఁటఁ
గనుమానము వాయఁ జూడు మాహవభూమిఁ;
విను రాఘవుఁడను నామం
బును నడఁపక యేను రిత్తవో నిచ్చెదనే?" 62

వ. అని పలుకుచున్న యంగదు పరుషభాషణంబులకు రోషించిన యసుర పతి కన్నెఱింగి; నలువురు రక్కసులు గ్రక్కున నవ్వాలినందనుం బొదువం బట్టిన, బిట్టెగసి హ్మ్యాశిఖరంబు పైకి దాఁటుటయుఁ, దదా ఱేప వేగంబున నన్ని శాచరులు ధరణీతలంబున జర్జరితశరీరులై పడిరి; హరివీరుం డచ్చటనుండి శిబిరమధ్యంబునకు లఘించి భూనాథునకుఁ దన పోయివచ్చినతెఱంగు విన్నవించెం; దదనంతరంబ రాఘవు ననుష్ణాంశున. 63

మత్తకోకిలము. తాలసాలశిలాగ్రహస్తు, లుదగ్రగోత్రమహీధరో
త్తాలదేహు, లనేకవర్ణులు, దారితాక్షులదిఙ్ముఖా
భీలవాలశిఖాగ్రు, లుగ్రగభీరసత్త్వులు, వానరుల్,
కాలకల్పులు పేర్చి సంతన కట్టి రాహవకేళిన్. 64

క. పరువడి మొత్తము లై బం
ధురఘోషం బెసఁగఁ బొంగి తోఁతెంచు హరీ

శ్వరబలమునందు ఘనసా
గరపిచివికాస రేఖ గానఁగ నయ్యెన్. 65

మత్తకోకిలము : కోటఁ బన్నిన ఘోరదానవకోటిఁ జుల్కనఁ దోలి, య
కోట నల్గడలన్ మహోగ్రతఁ గూలఁ ద్రోచి, సమున్నమ
త్కూటతోరణయంత్ర కేతనగోపురాట్టకసంహతుల్
పీటతాటము సేసి రక్కపివీరు లొక్కట మాత్రలోన్.

వ. మఱియుఁ బ్రాకారంబు పై నున్న గదా పరిఘ కుంత ప్రముఖం
బులు గైకొని లంకామధ్యంబున వైవం దొడంగిన నా శాలవృద్ధం
బగు పౌరలోకంబు హాహా కారవ్యాకులం బై కలఁగంబడియె; నంత
రావణచోదితు లైన దానవులు నానా కోటిసహస్రసంఖ్య లరిగి
యెక్క డెక్కడ యని తలపడి కపిసమువయంబులం దోలి యెప్పటి
యట్ల ప్రాకారంబుం గైకొని నిల్చి; రప్పుడు. 67

క. మును మర్కటబలములచే
ననయంబును గపిలవర్ణ మైనది మగుడన్
దనుజబలసంవృతం బై
ఘనపటలచ్ఛాయఁ గోట కర మొప్పారెన్. 68

క. వచనరసేనలు దెరలిన
నినవంశోత్తములు నృపతు లిద్దఱుఁ గయ్య
మ్మునకుఁ గడంగుటఁ గ్రమ్మఱ
గొనకొని కపిసేనయెల్లఁ గోటకు గవిసెన్. 69

వ. ఇట్లు గవిసినం ప్రాకారరక్షకు లైన రాక్షసవీరులు, వారలం జేర
నీక, శిలా శూల పరశు తోమ రాలాత శర కుంత ప్రముఖంబులు
ప్రయోగించినం గయికొనక, వనచరులు వృక్షశిలాప్రకరంబులు వఱ
గించుచుం గడంగి ప్రాకారంబుఁ ప్రాఁకుటయు, నయ్యిరుదెఱుంగుల
వారికిం గేశాకేశి యగు సమరం బయ్యెఁ; బదంపడి రావణుండు
వనుపఁ బర్వతుండును, ప్రఘసుండును, ఖరుండును, గ్రోధవశుండును,
ప్రరుజుండుననను రాక్షసు లేవు రనేక రాక్షసపిశాచసేనాపరివృతు

లయి పురంబు వెలువడి మాయ గావించి, యభ్రశ్యాకారులై కపి
సైన్యంబు నొప్పింపం దొడంగినం గని. 70

ఉ. దారుణవిక్రముండు, రిపుదర్పవిభేది, మహాస్త్రవేది, మా
యారణకోవిదుండు గడు నల్గి విభీషణుఁ డేగుదెంచి, య
వ్వీరులమాయయుం జలము వ్రేల్మిడిలోఁ గుదియించి, వీరకే
శీరసికుండు వారి నవలీలమెయిం దునుమాడె నందఱన్. 71

క. ఆతనిశరపాతంబుల
చేతం గడు నొచ్చి దైత్యసేన సగము ధా
త్రీతలపతితం బయ్యె; వి
భీతిఁ బఱచి పురము సొచ్చెఁ బెఱసగము వెసఁ. 72

క. అది యెల్ల విని దశాననుఁ
డుదిత క్రోధుఁ డయి మంత్రియుతముగ వెడలెన్
మదగజఘోటకసైనిక
పదభర భగ్నావనీవిభాగుం డగుచున్. 73

వ. ఇట్లు వెడలి యభేద్యం బగు నౌశనసవ్యూహంబు సంఘటించి వనచర బలంబుపయి నడచినం గనిఁ రాఘవుండును బార్హస్పత్యవ్యూహంబు దీర్చి పేర్చి యెదురు కొనియె; నాసేనలు రెండు నకాండక్షుభిత సాగరయుగళంబుతెఱంగు దోఁప నొండొంటిం గనిసె; నప్పుడు రాముండు రావణుతోడం దలపడియె; లక్ష్మణుం డింద్రజిత్తును, సుగ్రీవుండు విరూపాక్షునిఁ దారుండు నిఖర్వటుం దాఁకి; రిట్లుభయ పక్షంబులకును దేవాసురులకుంబోలె నాభీలసమరం బయ్యె నందు.

క. సౌమిత్రి నిశితవిశిఖ
స్తోమంబుల నసురపతిసుతుం బొదివెను; సం
గ్రామమునకుఁ దొలఁగక యతఁ
డామనుజోత్తముని ముంచె నాశుగవృష్టిన్. 75

ఉత్సాహము: అమరవైరివిభుఁడు, దశరథాగ్రసుతుఁడు నేపునఁ
సమరసత్పరితాపకోపజ్వాలచ్ఛరిరు లై
తుములబాణపటలవృష్టిఁ దొప్పఁ దోగి, యిర్వురుం
దమక మేది, తమక తమక తనిసి రాహవంబునన్. 76

వ. తదనంతరంబ. 77

క. ఆరావణుండు నిజదో
స్సారంబున రాముబాహుసారం బతిదు
ర్వారం బగు చేర్పడఁ గని
. వీరారంభంబుకడఁక విడిచి రయమునఁ. 78

క. మగిడి నగరంబు సొచ్చిన
బెగడి నిశాచరబలంబు పెల్లగిలుటయున్,
విగతభయుండు ప్రహస్తుఁడు
తగఁ గొల్తలసేసె నత్యుదగ్రస్ఫురణఁ. 79

ఉ. ఆతనిఁ గాంచి తద్బలము లన్నియుఁ గ్రమ్మఱ నాహవోత్సవ
స్ఫీతము లై కడంగుటయుఁ, బేర్చి విభీషణుఁ డుగ్రవానర
వ్రాతసమన్వితంబుగ నవారణ మార్కొనినన్ మహారణం
బాతత మయ్యె సైన్యనివహంబులు రెంటికి నద్భుతంబుగన్. 80

వ. అంత. 81

—: ప్రహస్తధూమ్రాక్షుల యుద్ధము :—

మ. కృతహస్తుండు, ప్రహస్తుఁ, డాహవకళాకేళీవిదగ్ధుండు, ద
ర్పితుఁ డై తాఁకె విభీషణుం గడఁకమైఁ; బెంపారి వారిద్దఱున్
శితశల్యాగ్రమయూరపత్రవిశిఖశ్రేణీశతచ్ఛన్న లై
ధృతి నొప్పారిరి చిత్రవారిధరపంక్తిచ్ఛన్న లైలాకృతిన్. 82

చ. కదిసి ప్రహస్తుఁ డార్చి పరిఘంబు రయంబున నెత్తి. భీకరో
న్మదకరిహస్త తాడనముమాడ్కి తలిర్పఁగ వ్రేసె నీసుమై
నదయత రావణానుజుని; నాతఁడు వ్రేటున కించుకంతయుం
గదలక హేమకూటగిరికైవడి నిల్చి యుదీర్ణకోపుఁ డై. 83

మ. శతఘంటాపరిభూషితంబును, జగత్సంహారఘోరానలో
ద్ధతకీలాసదృశంబు నై మెఱయు శక్తిం బూన్చి మంత్రించి యు
ద్ధతతేజుండు ప్రహస్తు వైచిన వెసం దత్కాలసంపాతపా
టితవక్షుండయి కూలె వాఁడు శతకోటిచ్ఛిన్నశైలాకృతిన్. 84

వ. ఇట్లు ప్రహస్తుండు వడినం దత్సైన్యంబులు విముఖంబు లగుటయు, ధూమ్రాక్షుండు రోషతామ్రాక్షుండగుచు నతనిబిడబలాహకానీక భీకరం బై కాఱుకొనుచున్న నిశాచరచక్రంబుతో నురలం బఱ తెంచినం, జలించి బలీముఖబలంబులు దుర్బలంబు లై తొలంగినం జూచి, యాంజనేయుం డజయ్యుండై నిల్చినం, బెల్చన యెప్పటియట్ల యూథపతులుం గూడుకొని; రప్పుడు. 85

సీ. అనిలతనూజ ధూమ్రాక్షరక్షితసైన్య
యుగ్మంబునకు నయ్యె నుగ్రసమర;
మందు నిష్ఠురచరణాహూతముల డొల్లు
నరదంబులును, శిలాహతులఁ దూలి
యెఱలు నేనుంగులు, నుత్తాలతరుహతిఁ
ద్రెళ్లు ఘోటకములుఁ, దీవ్రనఖర
దంతక్షతంబుల దళితాంగు లై నేలఁ
బడి తన్నికొను వీరభటులు నగుచు

ఆ. నధికశౌర్యసారు లగు కపివీరుల
చేత నొచ్చి, దైత్యసేన భీతిఁ
బఱచెఁ గొంత; బెండువడియుండెఁ గొంత; ధూ
మ్రాక్షు వెనుక కొదిఁగె నంతఁ గొంత. 86

మహాస్రగ్ధర. కని ధూమ్రాక్షుండు విశ్వ
గ్రసనరసలసత్కాలమేఘంబపోలెఁ
ఘనగర్జాఘోష మెప్పం
గడఁగి శరశతాకల్పితాసారదుర్ద
ర్శనవీరారంభుఁ డైనన్,
సకలహరిచమూసంఘమున్ విహ్వలం బై
చనెఁ, దూలెం, గూలె, లావుం
జలమును జెదరన్, సంగడిఁ బిచ్చె, నొచ్చెన్. 87

తే. అతని యుద్ధతి సైఁపక యనిలసూనుఁ
డనిలవేగుఁ డై పఱతెంచి యార్చి తాఁకెఁ;

బ్రథన మయ్యిద్దఱకు నుగ్రభంగి నమర
పతికిఁ బ్రహ్లాదునకుఁ బోలెఁ బ్రకట మయ్యె. 88

క. పరిఘంబులు గదలును బె
క్కురుదుగ రక్కసుఁడు వైచె నమ్మారుతిపై;
నురుగండశైలములు ఘన
తరువులు హరివరుఁడు గురిసె దానవుమీఁదన్. 89

వ. ఇబ్భంగిం బెనంకువ సెల్లుచుండం గొండొకసేపునకు. 90

స్రగ్ధర. లంకాలుంటాకుఁ డుద్య
ల్లఘుతరగమనోల్లాసి యై డాసి, వీఁకం
బొంకం బేపారఁ జంచ
ద్భుజరచితమహాభూరుహం బెత్తి వ్రేసెం
గింకఱ ధూమ్రాక్షు; వాఁడుం
గెడసెను వదనో ద్గీర్ణకీలాలధారా
పంకప్రాగ్భాగమగ్నా
పఘనవిఘటితప్రాణుఁ డై యాహవోర్వి. 91

వ. ఇట్లెఅంగున ధూమ్రాక్షుండు దెగినపిదపఁ గపివరసైనికు ల్వార్చి. హనుమంతుని ననేకభంగులం బ్రస్తుతించుచు;. రజనిచరులం గనుకనిం దోలినం దూలి, యందఱుం బఱచి పురంబు సొచ్చి దనుజేంద్రునకుం బ్రహస్తధూమ్రాక్షుల మరణప్రకారంబు లెఱింగించినఁ, బ్రకటశాప్ప నిశ్వాసవివర్ణవదనుం డగుచుఁ బంక్తివదనుండు. 92

క. "కలవా రెల్లను మడిసిరి;
కలిగియు లేఁ డయ్యెఁ గుంభకర్ణుఁడు; వీనిం
దెలుపుదునొ? యేనుఁ, గొడుకుం
జల మెడపక రిపులతోడ సరిఁ బెనఁగుదునో?" 93

వ. అని వితర్కించి యప్పటికిఁ గుంభకర్ణప్రబోధంబు గార్యంబుగా నిశ్చయించి, తదీయశయ్యాగృహంబునకుం జని, వానిం దెలుపం బరిజనంబులం బనిచిన. 94

సీ. భేరీమృదంగగంభీరనాదంబులుఁ,
గాహళఘంటికాకలకలములు;
దారుణసింహనాదంబులు నొనరింపఁ
గడుఁ బెద్దవడికి నంగము గదల్చి
యొదికిలి కను విచ్చి, హూ యని బిట్టావు
లించి, కొండొక దేఱి, లేచి నీల్గి,
కలయఁ జూచుటయును, గట్టెదురనయున్న
యన్న నవ్వుచుఁ దన యనుఁగుదమ్ముఁ

ఆ. జూచి యనియె "నిట్టి చోద్యంపునిద్రలుఁ
గలవె యేరికిని జగంబులోన?
నెవ్వ రేమి యైరొ యెఱుఁగవు; ధన్యుఁడ
వీవు; మనకు నైనయెడరు వినవె. 95

వ. దశరథనందనుం డైన రాముండు నాచేత నపహృతభార్యుం డై కలుషించి, యనేక వానరయూథంబులం గూర్చికొని వచ్చి, వనధి బంధించి, మనవీటిపై విడిసి, మమ్మెల్లను నేలకుం గోలకుం దెచ్చుచున్న వాఁడు; ప్రహస్తాదివీరులు వానిచేతం బెక్కండ్రు సిక్కరి; నీవ కాక వాని జయింప నన్యుండు శక్తుండు గాఁడు; గావున లెమ్ము; గ్రక్కునం బగతుపై నడచి పొడిచి గెలువుము; దూషణానుజులు వజ్రవేగప్రమాథులు నీకుం దోడ్పడియెద" రనిన నట్ల కాక యని కుంభకర్ణుండు విహితపరికరబంధుం డై సమరసన్నద్ధు లైన పరిజనం బులతోడం గూడి వెల్వడి నడతెంచిన. 96

—: కుంభకర్ణుండు యుద్ధము సేయుట :—

లయగ్రాహి. దారుణదవానలశిఖారుణశిరోరుహు, గ
భీరఘనకర్బురశరీరుఁ, బటురోష
క్రూరనయనాంతగళితోరుతరవహ్నికణ
ఘోరముఖు, దంతపలయారభసదంశో
ద్గారిరుధిరాధరు, నుదారభుజసారణవి
దూరితదిగంతుఁ, బదభారవినమద్భూ

భారుఁ డ్రిజగద్విజయభూరిబలు, నద్ధనుజ
వీరుఁ గని యచ్చెరువు గూరఁ గపివీరుల్. 97

క. రక్కసుఁడును దనమదిలో
నక్కపి వీరులను జీరికైనఁ గొనకఁ బే
రుక్కున రఘుకులవీరుల
దిక్కునకుం గవియుదెంచెఁ దీవ్రస్ఫురణన్. 98

మ. వడి నడ్డం బరికట్టె నెట్టన హరిత్రాతంబు వెఱ్ ద్రుమాఁకులం;
బిడుగుల్వోని మపోద్ధతాశ్మముల నాభీలంబుగా దైత్యు బి
ట్టడువన్ వైవఁగఁ జొచ్చెఁ; గొందఱు బలం బారంగ వే డాసి దం
దడి తత్కాయము సించి రుగ్రనఖదంతన్యాససంక్రీడలన్. 99

ఉ. కన్నుల నిద్ర దేఱఁగ నకంపితుఁ డై, యతఁ డెంత సేసినం
దన్ను నెఱుంగ, కొక్క మొగిఁ దత్కపిసైన్యచయంబుఁ బోరఁ బే
రన్నన ద్రిమ్మఁగ జొచ్చె, వీరయాగమసంభృతదర్పరోషవే
గోన్నతలీలఁ గాలుఁడు జనోత్కరమున్ గ్రసియించుచాడ్పునన్. 100

వ. ఇట్లు బల. చండబల, వజ్రదంష్ట్రులు లోనుగాఁ బెక్కండ్ర యూథపతు
లను, బహుసహస్రసంఖ్యల వానరయూథంబును ద్రుంగియు, గొద
గొని వచ్చుచున్న యన్నిశాచరుని మార్కొన నోడి తారప్రముఖు
లైన బలిముఖులు నలువంకలం బెఱరి పఱచిన. 101

మ. కని సుగ్రీవుఁడు బిట్టదల్చును, వేగం భార దైత్యేంద్రు మా
ర్కొని సాలంబున వావి యాఁదలఁ గడుఁ ఘోరంబుగాఁ బూన్చి వ్రే
సిన, నావ్రేటున నిద్రదేఱి, కడఁకం జేదోయి సారించి, య
మ్మనుజాశుండు గపీంద్రుఁ బట్టె రభసోన్మాదంబుమై నార్చుచున్. 102

క. పట్టువడిన సుగ్రీవునిఁ
గట్టెదురం గాంచి, యధిక కలుషితమతి యై
దట్టుఁడు లక్ష్మణుఁ డసుర
బిట్టేసెం బిడుగుఁబోని పృథుబాణమునన్. 103

సీ. ఉరమాడి యాళరం బుచ్చి పోవ్వటయును,
గడు నొచ్చి యాకుంభకర్ణుఁ డలిగిఁ
వెస వాలితమ్ముని విడిచి, తోరపుళిలఁ
గొనుచు నుక్కున రామమూ ర్తి తమ్ము
దెసఁ బాఱుతెంచిన, ధీరుండు సౌమిత్రి
భల్లయుగ్మమునఁ దద్బాహుయుగము
నటుక మాయాబలోన్నతుఁడు దైత్యుఁడు చతు
ర్బాహుఁడై తోఁచిన భానుకులుఁడు

ఆ. చేతు లెల్లఁ దునిమె శితభల్లముల; వాఁడు
మఱి యనేక హస్తమస్తకాంఘ్రి
భాగుఁ డైనఁ గినిసి బ్రహ్మాస్త్ర మేసినఁ
గూలె నసుర గొండ గూలునట్లు. 104

వ ఇట్లు కుంభకర్ణుడు దెగటారినం జూచి దూషణానుజులు వజ్రవేగుం డును: బ్రమాథియు రాఘవానుజుం దలపడి నిబిడ బాణౌఘనిమగ్నుం జేయుటయు, నతండును వారి నతిబహుళం బగు శరజాలంబునం బొదివినఁ, గయ్యం బొక్క ముహూ ర్తంబు చూపఱకు రోమహర్షణం బై చెల్లెఁ; దదనంతరంబ. 105

చ..అనిలసుతుండు నీలుఁడు రయం బెసఁగం బఱతెంచి, యమ్మహా
దనుజులమీఁద నేపున మదగ్రగాగ్రయుగంబుఁ బూన్చి వై
చినఁ, గడు రూపఱుం జదిసి, చెప్పుఁగఁ జూపఁగ లేక పోయి ర
ద్దనుజులు; వానరోత్కరము దద్దయు నుబ్బున నార్చె నత్తటిన్

క. ఆకులపడి నలుదెసలం
గాకుల క్రియఁ జెదరి, కడు వెగడుపడి, రక్కో
నీకములు లంక యెనిమిది
వాకిళ్ళం దూఱఁ బౌరవర్గము దలఁకన్. 107

క. అంతఁ దన కూర్మితమ్ముం
డంతకుఁ గూడుటయు, దూషణానుజమృతివృ
త్తాంతంబును విని యెంతయు
వంతఁ దలరిఁ యఱచెఁ బం క్తివదనుఁ డవళుఁ డై. 108

వ. అయ్యవసరంబునఁ నాముక్తకవచుండును, నాబద్ధతూణీరుండును, బ్రచండ
కోదండ పాణియుఁ, గృపాణబాణబాణాసనాదివివిధసాధనోపేత
సన్నిహితస్యందనుండును, బురందరహృదయసాగరమందరుండును
నైన మేఘనాదుండు దండ్రిం జేరం జనుదెంచి వినయంబున ని
ట్లనియె. 109

చ. "వగవఁగ నేల? దైత్యకులవల్లభ! యేఁ గలుగంగ నిమ్మొయిన్
జగముల నీదుశత్రులకు శౌర్యము సెల్లునె? వృత్రవైరి లో
నగు సురకోటి యే పడఁచి యప్రతిమోన్నతి నున్న నాకుఁ గ్రోఁ
తిగముల నోర్పు సెంతపని? ధీరత నన్ గృపఁ బంపు మాజిఁ. 110

ఉ. కూడినకొండమ్రుచ్చులను గ్రోఁతుల నుగ్రత ముట్టి కీక్కఁ జెం
డాడెద; నుజ్జ్వలోగ్రవివిధాంబక జృంభితదిఙ్ముఖుండ నై
యాడెద వీరనృత్యము; రయంబునఁ శార్ఙ్గివసూను లిద్ధఱం
గ్రీడయపోలెఁ గిట్టి పెడకే ళ్ళొగిఁ గాల్చెదఁ; బట్టి తెచ్చెదఁ." 111

వ. అనినం దెలివొంది మందోదరీసుందరుండు ప్రియనందనున ట్లనియె.

సీ. "నీ పరాక్రమలీల నిక్క మే నెఱుఁగనే?
పుత్ర! నీభుజబలస్ఫురణమునన
కాదె నా కిట్టివిఖ్యాతియు సిరియును
గలిగె; గీర్వాణసంఘంబుతోడఁ
గూడ నయ్యింద్రునిఁ గొని వచ్చి నాబంటుఁ
గా నొనరింపవే గర్వ మెసఁగ;
మాయావిదుండవు, మహితదివ్యాస్త్రని
ష్ణాతుండవు నీవు; సంగరమునఁ

ఆ. బగతు రెల్ల చెగడుపడఁగ దృశ్యాదృశ్య
దుర్నిరూపభంగిఁ దొడరి చిక్కు
వఱుచు నీ మహోగ్రబాణపాతంబులు
దశరథాత్మజులకుఁ దరమె యోర్వ? 113

ఆ. నిఖిలశత్రుచయము నిశ్శేషముగఁ జంపి
యనఘ! సమరనిహతు లైన యస్మ

దీయజనుల ఋణము దీర్పుము; మసలక
పోయి రమ్ము; పోర నొడిచి గెలుము." 114

వ. అని కోగిలించుకొని పీడుకొల్పిన నింద్రజిత్తు సత్వరుం డై యరదం బెక్కి, లంకాపురంబు వెలువడినం గని, వచనరానీకంబు లార్చుచు నెదురు నడచుటయు, నతండు దాని నించుకయు సరకుగొనక కర తలం జెత్తి లక్ష్మణునిం బిలిచిన. 115

—: ఇంద్రజిత్తు లక్ష్మణునితోడ యుద్ధము సేయుట :—

క. విని యాతండును మౌర్వీ
నినదంబున గగనధారుణీమధ్యం బె
ల్లను బ్రోయ మత్తగజముం
గనిన మృగేంద్రుండపోలె గడగెం బెలుచన్. 116

వ. అంత 117

ఉ. జైత్రులు, గోత్రభూమిధరసారులు, సాగధీరు, లుల్లస
చ్చిత్రధనుఃకళావిదు, లజేయులు, భూరిజయార్థు లప్డ సౌ
మిత్రియు మేఘనాదుఁడు నమిత్రవిభేదులు దాఁకి రార్చి లో
కత్రయభీకరప్రథనకౌతుకవేగితచిత్తవృత్తు లై. 118

క. మచ్చరము మీఱ నొండొరుఁ
జిచ్చుఱపిడుగులనుబోని శితవిశిఖములం
జెచ్చెర నొంపఁగ వీలునే
ర్పచ్చటఁ దుల్యంబ యయ్యె నయ్యిద్దఱకున్. 119

క. తనకంచె నపుడు రావణ
తనయుండని మీఱఁ జూచుఁ; దా నాతనికం
చెను మున్న రాఘవానుజుఁ
డనుపమశరలీల నతిశయంబుగ మెఱయున్. 120

క. అంతఁ బటుతోమరంబుల
నెంతయు వెస నృపతనూజు నింద్రజి వైవన్
సంతతశరముల నన్నిటి
నింతింతలు శకలములుగ నేసె నతండున్: 121

వ. అట్టియెడ నంగదుండు గడంగి లక్ష్మణునకుం దలకడచి, యమంద వేగంబున మందోదరీనందనుం గవిసి, ఘనమహీరుహాంబునఁ దన్మస్తకంబు ద్రేసినం జలింపక నిలింపపతివైరి నిశితప్రాసంబు వాసవపౌత్రుం జంప నెత్తుటయు, లక్ష్మణుండు దానిం దునియ నేసిన, నయ్యసురయు గదాదండంబుఁ దీర్చి యంగదు వక్షంబు ద్రేసినం, దొలంగక చెలంగి వాలిసూనుండు సాలవృక్షంబున నా రాతిసు రథంబు రథ్యసారథి సహితంబుగాఁ జదియ నడిచె; నట్లు విరథుం డయి యచ్చోటన యంతర్ధానంబు నొంది గగనగతుం డయ్యెఁ; బదంపడి. 122

క. ఎవ్వలన నుఱుకునో యతఁ!
డెవ్వరి నెటు సేయునొక్కొ! యిం దనుచుఁ గడుఁ
నివ్వెఱపడి కపిసేనలు
గ్రొవ్వు సెడం బంక్తివదనుకొడు కుద్ధతుఁ డై. 123

చ. ఉఱుముచు నంత్యకాలచరితోగ్రబలాహకలీల దోఁపఁగాఁ,
దఱచగు ఘోరపుం బిడుగుఁదండము వోని శరప్రతాన ము
క్కఱఁ దొరఁగించుచుం, గపిబలావళిఁ ద్రుంచి కలంచె నేపునఁ;
నెఱుకులు నొంచి బాణమయనీరధి ముంచె రఘుప్రవీరులఁ. 124

క. మాయాధికు, నంతర్హిత
కాయుఁ, బురందరవిరోధిఁ గాకుత్స్థులు క్రో
ధాయత్తు లగుచు నేసిరి
ధీయుక్తులు శబ్దభేదిదివ్యాస్త్రములన్. 125

వ. వానికి నలిగి సుగ్రీవాదివానరులు వృక్షశిలాప్రకరంబులు గైకొని యాకసంబున కెగసిన, నద్ధానవుండు వారినందఱ వెఱచఱవ నేయుటయుఁ, జేవ సెడి మగిడి పుడమి కెఱఁగిరి; వాఁ డంత నిలువక వాఁడితూపులు వఱపి రామలక్ష్మణులఁ గరంబు నొప్పించినం, జె య్యేది యయ్యన్నయుం దమ్ముండును గపిబలంబు లడల ధరణీతలంబునకు నొరగి, విలయకాలపతితు లయిన సూర్యేందుల చందంబున నున్నం గని, సింహనాదంబు సేసి. 126

మ. పరమోదాత్తులఁ, బార్థివోత్తముల, శుంభద్విక్రమారంభులన్,
సురసంకాశులఁ, గోసలప్రభుల, నస్తోక ప్రభోద్ధాములఁ
వరలాభోన్నతుఁ డన్నిశాచరుఁడు గర్వం బొప్ప దుర్వారని
ర్భరనాగాస్త్రములం దదాహవమహిన్ బంధించె నయ్యిద్ధజున్. 127

వ. తదవసరంబున సుగ్రీవ సుషేణ జాంబవత్ప్రముఖు లయిన కపివీరులు రామలక్ష్మణు లున్నయెడకు జనుదెంచి, యెయ్యదియునుం జేయు నది నేరక, దుఃఖితు లగుచుండ నవ్విభీషణుండు వారి నాశ్వాసించి, బ్రహ్మాస్త్రప్రయోగంబున నారాజకుమారులకు బంధమోక్షణంబు గావించె; సుగ్రీవుండు విశల్యకరణియను నౌషధంబున వారల నిశల్య దేహులం జేసె; నిట్లు ప్రబుద్ధు లై రాఘవులు గ్రమ్మఱఁ గయ్యంబునకుం గడంగి; రప్పుడు రావణానుజుండు రామునకుఁ గృతాంజలియై యి ట్లనియె. 128

సీ. "నరనాథ? కిన్నరనాథుని పనుపున
శ్వేతుండు నాఁగఁ బ్రసిద్ధుఁ డైన
గుహ్యకుఁ డిదె మీకుఁ గొని వచ్చె దివ్యతో
యంబు; లీజలముల నంబుజాక్ష!
నయనపద్మ ప్రక్షాళనము సేయుఁ డిప్పు; డ
దృశ్యభూతము లెల్లఁ దెల్లముగను
గానంగఁబడు" నన్నఁ గైకొని రాఘవుం
డనుజసహాయసమన్వితముగ

ఆ. నట్ల చేసి కనియె నంబరమధ్యసం
చారుఁ, గృతవిపక్షసంప్రహారు.
నింద్రజాలకీలు, నింద్రవిద్రావణు,
రావణాగ్రతనయు, రహితవినయు. 129

వ. ఆ రక్కసుండునుం దన చేసిన పౌరుషంబు ప్రతిహతం బగుటకు విస్మయం బంది, మగిడి హోమకార్యంబును దొడంగం బోయిన నెఱింగి, విభీషణుండు లక్ష్మణుం జూచి "యిన్నిచునకు హోమ సమాప్తి యయ్యెనేని నెవ్వరికిం గెలువ నశక్యంబు; వీని వెన్నడిం దగిలి తెగటార్పు" మనిన నతండు. 130

ఆ. ఆర్చి వెనుకఁ దగిలి యళనికల్పము లైన
శరము లేయుటయు, నిశాటవరుఁడు
గినిసి వడి నెదిర్చి, కీలించె లక్ష్మణు
నంగకముల నుజ్జ్వలాంబకముల. 131

వ. ఇట్లు దలపడి యవ్వీరు లిరువురు నిశాచరవనేచరబలంబులు రణం
బుడిగి వెఱఁగుపడి తమ పోరు సూచుచుండ, నుద్దండవేదండయుగ
శంబుపోలిక, నాభిలశార్దూల ద్వయంబుకరణి, నసహ్యసింహాయమ
శంబులై వడి నతిఘోరయుద్ధఁబు సేయం దొడంగి; రంత. 132

క. వడి నొక్కఁ బెట్ట లక్ష్మణుఁ
డడరించె నిశాతశరము లాగక్కసుపైఁ;
గడఁగి యతఁడు నాతనిపై
నెడపక నాటించెఁ గలయ నెనిమిదియమ్ములన్. 133

ఆ. వాఁడితూపు లొడల వడి నాటుటయు నొచ్చి
తోనఁ బరుషరోషధూమకేతుఁ
డతిశయిల్ల రాఘవానుజం డురుచాప
శింజినీరవంబు సెలఁగఁ గదిసి. 134

—: ఇంద్రజిత్తు లక్ష్మణునిచేతఁ జచ్చుట :—

మ. శితభల్లద్వితయంబునం గడువెసం జేదోయి ఖండించి, ఖం
డితగోత్రాచలతుంగశృంగశతకోటిస్ఫారఘోరానల
ద్యుతిసాంద్రం బగు శాతభల్ల మొకటం ద్రుంచెం గనత్కుండలా
న్వితమై యొప్పు నిశాచరేంద్రుశిరమున్ వీరక్రియాదక్షుఁ డై. 135

ఆ. భగ్నశాఖ మైన పాదపంబునుబోలె
నిట్లు సంగరమున నింద్రజిత్తు
వడినఁ జూచిఁ దైత్యబలములు భయమంది
పఱచెఁ; జెలఁగి యార్చెఁ బ్లవగబలము. 136

క. తనయునిమరణం బేర్పఁడ
విని దశకంధరుఁడు శోకవివశుం డై బో

రన బాష్పము లొలుకఁగ హా
యనుచుం బదినోళ్ళుఁదెఱచి యఱచెం బెలుచన. 137

క. శోకంబు సైఁపలేక, య
శోకవనంబునకు నరిగి. సురశత్రుఁడు రో
షాకులుఁ డై జానకిఁ బు
ణ్యాకారం జంపఁ జంద్రహాసము వెఱికెన్. 138

వ. అప్పుడు వయోవినయవృద్ధుం డైన యవింధ్యుం డతని వారించి
యి ట్లనియె. 139

చ. "ఇది దగునే? దశానన! మహేంద్రుఁడు లోనగు దేవతాతతిం
గదనములో జయించి త్రిజగంబులఁ బేర్కొని యున్న నీకు ని
మ్మనిత వధింతు నంట గడు మోసము గాదొకో? యోపుదేని నే
పొదవఁగ రాఘవుఁ గెలువు; ముగ్గులిఁ జంపినఁ బెంపు గల్గునే?"

వ. అనినం దద్వచనంబుల నుపశమితరోషుం డయి దోషాచరేశ్వరుండు
సమర సన్నాహం బమర రథం బెక్కి మిక్కిలి బీరంబు సొంపార
నఖిలసేనాసహితంబుగాఁ బురంబు వెల్వడి నడతెంచె నంత. 141

శా. సుగ్రీవాది సమస్తవానరులుఁ బ్రసూభర్జన్మహావిగ్రహ
వ్యగ్రాకారతఁ బేర్చి, భూరుహశిలాత్రాతంబులం దాల్చి, వా
లాగ్రవ్యాచలనంబుఁ లొప్ప, దశకంఠాగ్రేసరోదగ్ర దై
త్యగ్రామంబు నెదిర్చినన్ సమర మత్యంతోగ్ర మయ్యెన్ వడిన్.

వ. ఆ సమయంబున నఖిలమాయాకుశలుం డైన దశముఖుండు మాయ
గావించిన. 143

క. ఆరావణుదేహంబున
ఘోరగదాశక్తిఖడ్గకోదండధరుల్
వీరులు సహస్రసంఖ్యల
వారలు జనియించి రసురవరు లుద్ధతు లై. 144

వ. వారి నందఱఁ గౌసల్యానందనుండు సాంద్రశరజాలంబుల నవలీలం
దునిమి తూఁటాడిన, నమ్మేటిరక్కసుండు మఱియు నొక్క మాయ

ప్రయోగించి రామ లక్ష్మణప్రతిరూపంబు లనేకంబు లుత్పాదించు టయు, నయ్యన్నయుం దమ్ముండును వెఱఁగుపడియునుం జిడిముడి వడక, యమ్మాయారూపంబు లన్నియుం దునిమె; తదనంతరంబ.

చ. అభినవభానుబింబరుచిరాకృతియున్, హరి యుగ్యముఁ, మహా
రభసదురాసదంబును, విరాజితకేతనవైజయంతికా
ప్రభమును నైన తేరు సురపాలకుపంపునఁ జేసి రాఘవ
ప్రభునకుఁ దెచ్చి మాతలి సభక్తికుఁ డై ప్రియ మొప్ప నిట్లనున్.

మ. "ధరణీనాథ! సురేంద్రుతే రిది; మహాదైత్యేంద్రులం దొల్లి యీ
యరదం బెక్కి యనేకులం దునిమె బంభారాతి ఘోరాజి; నీ
యరదం బెక్కి వధింపు మీవును మదీయస్ఫారసారథ్యని
ర్భరభంగిఁ దశకంధరుం ద్రిభువనీభంగోన్నమత్కంధరున్." 147

మ. అనిన మాతలి నాదరించి, యరదం బారాఘవుం డెక్కి, యు
క్కున మీఱి రిపుకోటిమీఁద విసలత్కోదండమౌర్వీమహా
స్వనభిన్నాఖిలదిగ్విభాగుఁ డగుచున్, శాతాస్త్రధారాభిషే
చనపూతప్రతిపక్షసైన్యుఁ డగుచున్ సంరంభదుర్వారతన్. 148

ఉ. అత్తటి రావణుండు విలయానలదుస్సహమూర్తి యై నరేం
ద్రోత్తమమీఁదఁ దేరు గడు నుగ్రగతిం బఱపించి, సంతతో
ద్యత్తశరప్రవాహపరివీతదిశాముఖుఁ డైనఁ జూచి, పే
రుత్తల మంది రాతనిసముద్ధతికిన్ దివినుండి నిర్జరుల్. 149

వ. ఇట్లు దలపడి రామరావణు లతిఘోరంబుగాఁ బోరం దొడంగి; రంత బంక్తివదనుండు నిబిడజ్వాలాకరాళం బగు శూలంబు రాఘవుమీఁదం ప్రయోగించినఁ నతండును నడుమన దానిఁ దునియలు నేసిన, నీసునం బెరిఁగి స్ఫురవైరి మఱియునుం దరతరంబ శతసహస్రసంఖ్యలు గల శూలంబులు, భిండివాలంబులుఁ, దోమరంబులు. శరంబులుం బఱఁగించి యంబరం బెల్ల నస్త్రమయంబు గావించిన, నఖిలభూతంబులును హాహాకారవ్యాకులంబు లయ్యె; నసురసైన్యంబున భేరీ ప్రముఖతూర్యనినదంబులు, సింహానాదంబులు నెలంగె; నంతఁ గొండొకసేపునకు రావణప్రయుక్తం బైన శస్త్రాస్త్రదహనం

బంతయు నిరంతరవిశిఖధారాసారంబునం గబళించి, రామజలధరంబు గంభీరసంరంభంబునం బొదలుటయు, సకల ప్లవంగసముదయంబును బ్రహర్షకోలాహలం బయ్యెఁ; బదంపడి. 150

—: శ్రీరాముఁడు రావణాసురుని సంహరించుట :—

సీ. కమనీయకనకపుంఖప్రభాభాసియుఁ,
దీక్ష్ణముఖంబును, దివిజయశ
మునిసిద్ధసాధ్యసమ్మోదావహంబు నై
విలసిల్లుబాణ మప్వీరవరుఁడు
గైకొని, బ్రహ్మాస్త్రకలితమంత్రాభియు
క్తంబుగా నొనరించి, కార్ముకమున
సంధించి, జగములు జయపెట్టఁ జెచ్చెరఁ
దివిచి యేయుటయును; దీప్రభంగిఁ

ఆ. గడఁగి యాశరంబు గల్పాంతదహనంబ
పోలెఁ బంక్తికంఠుఁ బొదివి, నీటు
గా నొనర్చె సూతఘనరథరథ్యస
మన్వితముగ నొక్కమాత్రలోన. 151

వ. అప్పు డంబరంబున దివ్యతూర్యనాదంబులు సెలంగం, గలంగి యసురు లెల్లఁ దొలంగిరి; గంధర్వగానంబులు, నప్సరోనర్తనంబులుఁ బ్రవర్తిల్లె; నింద్రాదిదేవోత్తము లన్నరదేవోత్తముం బ్రస్తుతించుచుం బ్రమో దంబు నొందిరి. 152

క. ఏకోత్సవంబు లయ్యెఁ ద్రి
లోకంబులు, నఖిలలోకలుంటాకుఁడు, ఘో
రాకారుఁడు, దశవదనుఁడు
గాకుత్స్థనిశాతశరముఖంబునఁ బడినన్. 153

ఉ: అంత ననంతకీర్తి, శరణాగతరక్షణశాలి, రాఘవుం
డెంతయు వేడ్కతోడ నసురేంద్రుపదంబున నవ్విభీషణున్
సంతతపుణ్యుఁ బుణ్యజనసంతతివర్ధనుఁ గట్టెఁ బట్ట మ
త్యంతదయాంతరంగుఁడు గృతాహితభంగుఁడు దానుఁ దమ్ముఁడున్.

వ. తదనంతరంబ యవింధ్యుండు విభీషణసహితుం డై జానకి నుచిత యానంబున నునిచికొని రామదేవుపాలిఁ దెచ్చి "దేవా! దేవిం బరిగ్రహింపు" మని విన్నవించుటయు నతండు. 155

చ. అతిమలినాంగి, జీర్ణమలినాంబర ధారిణి, సంతతాశ్రుపం
కితవిలసత్కపోలఁ, బరికీర్ణ జటాయిత కేశభార, నా
యతఘనదుఃఖదూషితఁ, బ్రియాంగనఁ గన్గొని యప్రియాత్ముఁ డై,
నుతచరితుండు దద్దయు మనోవ్యథ సేయుచు నింతి కిట్లనున్.

సీ. "అధికదుష్టాచారుఁ డైన దశాననుఁ
డింతకాలముఁ దనయింటఁ బెట్టి
కొని యున్న నిన్నుఁ గైకొనిన నస్మచ్చరి
త్రమునకుఁ దొడగదే ధర్మహాని?
పరిభవంబునకు నై ప్రతికారముగ వైరిఁ
గూల్చితిఁ గాని, నీకొఱకుఁ గాదు;
మెలఁత! నీచరితంబు మే లైనఁ గీ డైనఁ
గా నిమ్ము; నిన్ను నిక్కముగ నొల్లఁ;

ఆ. బరఁగఁ గుక్కవాతఁ బడిన హవ్యముభంగి
యయ్యె నీ తెఱంగు నరయ నిపుడు;
గాన యిచటఁ దటయఁ గాదు; చెచ్చెర నీకు
నిష్ట మయినకడకు నేఁగు మతివ?" 157

ఆ. అనినఁ జెవులఁ గొఱవి గొని చూఁడిన ట్లైనఁ
దాల్మి పెల్లగిల్లఁ దరళనయన!
మొదలు నఱక నొఱగు కదళిచందంబున
నెలఁత దల్లడమున నేల వ్రాలె. 158

క. వెఱఁగుపడి హర్ష రాగము
దఱిఁగిన వెలువెల్ల నై, వదనములు వ్రాలం,
దెఱఁ గేదిఁ జీచ్చపడి ర
త్తఱిఁ దత్పరిజనము లెల్లఁ దద్దయు వంతన్. 159

తే. పడఁతి యల్లన మఱికొంతపడిఁ దెలిసి
యలసమూర్ఛితయై, దందడి నశ్రు లురులఁ,
గేలు మొగిడించి వసుమతీపాలుఁ జూచి
యెలుఁగుగుత్తుకఁ దగులంగ నిట్టులనియె. 160

క. "నినుఁ గీడు వొరయ కుండఁగ,
జనులకు నానిక్క మెక్క, జననాయక ! నే
ననలంబుఁ జొచ్చి వెడలెదఁ
గనుఁగొను; మిచ్చినవు నాకుఁ గరుణింపు దగన్. 161

ఉ. నా దగుబుద్ధి నీదుచరణస్మరణంబ యొనర్చుఁ గాని, యొం
డేదియు నెన్నఁడుం దలఁప దిట్టిద; యొం డొకచంద మైన ని
మ్మేదినియుం గృశానుఁడు, సమీరుఁడు, శీతకరుండు, నర్కుఁడుం
గా దన కీఋణంబ ననుఁ గాల్ప రె ? వేల్పులు చెట్ట నైతురే ?"

వ. అని పలుకుటయు నప్పుడు పృథివ్యాదిభూతంబు లెలుంగులు సెలంగ
నెల్ల వారును వినం దను నామంబు లెట్టింగించి యి ట్లనిరి 163

క. "విను ముత్తమురాలు సుమీ
జననాయక ! జనకతనయ; సందేహపడం
బనిలేదు; మాకుఁ దెల్ల ము;
జనులకు మము మెఱుఁగఁ రాదు సకలక్రియలన్." 164

వ. అనిన యనంతరంబ సకలసురమునిగణసహితంబుగాఁ బితామహుండు
సమదెంచి, రాఘవుచేత నమస్కృతుం డై యి ట్లనియె "నయ్యా!
నీవు సకలభూత దుస్సహుం డైన రావణుం బరిమార్చి లోకహితంబు
సేసితివి; వినుము; నలకూబరుశాపంబునం జేసి దశగ్రీవునకుఁ బరస్త్రీల
యందు బలాత్కారంబు సెల్లదు; కావున నీధర్మపత్ని యొం డొక్క
దురితంబును బొరయదు; నీవు నిర్విచారుండ వై యిప్పతివ్రతం బరి
గ్రహించి, నెమ్మదిఁ బురంబున కరుగు" మని పలికి, యతనికిఁ బ్రియం
బుగాఁ దత్సమరనిహతు లైన వానరులఁ బ్రాప్తజీవులంగాఁ జేసి,
పరమేష్ఠి సనియె; బురందరసారథియును దాశరథి వీడ్కొని
హరిసహస్రయుక్తంబయిన రథంబు గైకొని నాకలోకంబున కరిగె;
నంత. 165

మ. అవిరోధంబున జానకీసహితుఁ డైయాబద్ధరత్నప్రభా
నవపుష్పం బగు పుష్పకం బను విమానం బెక్కి, యర్కాన్వయ
ప్రవరుం డిమ్ముల నేఁగె సమ్మదభర ప్రాగ్భారవారాకర
ప్లవమానుం డగుచుం బురంబునకుఁ బ్రాప్తశ్రీవిశేషోన్నతిన్. 166

వ. ఇట్లరిగి భరతాదిబంధుజనంబులు, నఖిలపరిజనంబులు నభినందింప, వసిష్ఠవామదేవాదివిరచితం బైన యభిషేకశోభనంబు వహించి, రాముండు సుగ్రీవ విభీషణాది సుహృజ్జనంబులను, బుత్తువానరబలంబులను ప్రకట బహుమానవిశేషంబుల నాదరించి వీడ్కొలిపి, యభిమతభోగంబుల, నిరంతరత్యాగంబులఁ, బ్రభూతయాగంబులఁ, బ్రసిద్ధుండయి బహుసహస్ర వత్సరంబులు వసుమతీ సంరక్షణం బాచరించె; నిది రాఘవుచరిత్రంబు. 167

ఉ. వారక యిట్లు పూని వనవాసనిరంతరదుఃఖమున్, మహా
వైరికృతాపకారదురవస్థయు నోర్చి శుభంబు నొందఁడే
యారఘురాముఁ? డట్ల వసుధాధిప! నీవును దుఃఖ మింతయున్
సైరణ నోర్చి పొందెదవు సర్వమహీవలయాధి రాజ్యమున్." 168

వ. అని చెప్పిన విని యుధిష్ఠరుండు రాముని పరాక్రమ విశేషంబు గొనియాడి, జానకి పాతివ్రత్యమహిమయు నింత యొప్పునే యని పలికి, "మునీంద్రా; పతిభక్తితాత్పర్యంబున నఖిలదుఃఖంబుల కోర్చి, శుభంబు లొందిన పుణ్యసతిచరిత్రంబు వినవలతుం జెప్పవే" యనిన నతనికి మార్కండేయుండు "సావిత్రియను రాజపుత్రి చరిత్రంబు విను; మది నీ ప్రశ్నంబునకు నుత్తరం బగు" నని యిట్లనియె. 169

--: మార్కండేయుఁడు ధర్మజునకు సావిత్र्युపాఖ్యానంబు సెప్పుట :--

సీ "కలఁడు నుద్రేకుండు ఘనుఁ డశ్వపతి యను
ధరణీశుఁ; డతఁడు సంతానకాంక్ష
నెంతయు ధృతిఁ బదునెనిమిదియేఁడులు
సావిత్రిఁ గొల్చె; నజ్జనవిభునకు
నద్దేవి ప్రత్యక్షమై "వరమడుగుము"
నావుడు, నతఁడు వినమ్రుఁ డగుచు

"నాత్మజుఁ గోరెద;" ననవుడుఁ " గన్నియ
వుట్టు నీ" కనియె నా భువనమాత;
తే. యనుడు "దేవి! భవత్కృప నస్మదీయ
వాంఛితము సఫలంబు గావలదె?" యని నృ
పోత్తముఁడు విన్నవింప, నయోగమూర్తి
గాఢకారుణ్యవికచహృత్కమల యగుచు. 170

వ. "ఏను నీమనోరథంబు తెఱంగు మున్న చతుర్ముఖున కెఱిఁగించిన, నతండు గన్నియఁగా నిర్దేశించె; నద్దేవుని యానతి యమోఘంబు; వినుమక్కన్నియకారణంబున నీకు నొక్క విధంబునం బిదపఁ బుత్ర శతలాభంబు నగు; సంతసిల్లు" మని యనుగ్రహించి యద్దేవి యంతర్ధా నంబు నొందె; నయ్యశ్వపతియును సావిత్రీ ప్రసాదంబున నిజధర్మపత్ని యయిన మాళవియందు సావిత్రి యను కూఁతుం గని యక్కన్నియ నతిగౌరవంబునం బెనిచె; నంత. 171

క. ఆవనజాక్షి పరిస్ఫుట
యౌవ్వన యై సిద్ధసాధ్యయక్షామరక
న్యావళిఁ దనసౌందర్య
శ్రీవిలసనరేఖ నపహసించుచు నొప్పెఁ. 172

తే. కోరి జనపతి దనకూర్మికూఁతుఁ జూచి,
"గుణవయోరూపముల కనుకూలుఁడైన
భర్త నెమ్మోయి దీనిఁ బడయువాఁడ
నొక్కొ" యని యెందుఁ దడవుచునుండె నెలమి. 173

వ. అదియును సాళ్వపతి యైన ద్యుమత్సేను కొడుకు సత్యవంతుండు రూపవంతుండనియును, గుణవంతుండనియును వినీ, వానియందుఁ జిత్తంబు దగిలియున్నను. సిగ్గు పెంపున నెవ్వరికిఁ జెఱిఁగింప కుండెఁ; నంత నొక్కనాఁ డమ్మహాప్రపతికడకు నారదుం డరుగుదెంచిన, నతం డమ్మహాముని నుచితసపర్యాపరితోషితుం జేసి, సద్గోష్ఠివిశేషంబు సలుపుచున్న యెడ. 174

క. నెచ్చెలులు దన్నుఁ గొలువఁగఁ
బచ్చవిలుతుకలిమి యెల్లఁ బద్మాసన యై
యచ్చుపడినట్లు మెఱయుచు
నచ్చటి కేతెంచె భూవరాత్మజ నెమ్మిన్. 175

వ. ఇట్లు వచ్చి సభాజనంబు నంతంత నిలిపి, మెలపుతోడిపొలుపున నమ్మగ్ధ లీలామధురం బగుచుండఁ దండ్రికి మ్రొక్కిన, నతండు ప్రగాఢ స్నేహసన్నాహ దోహళం బగు చిత్తంబుతో నత్తన్వి గ్రుచ్చి యెత్తి, నిజాంకతలంబున నునిచికొని, సమంచితోపలాలనకేళీపరవశుం డయ్యె, నప్పుడు నారదుం డమ్మాద్దియం జూచి యశ్వపతితోడ "నిక్కన్నియం దగిన వరున కొసంగక యీ స్థలి యునిచినాఁడ?" వనిన నతండు గూఁతున కిట్లనియె. 176

తే. "తల్లి! నీగుణరూపవృత్తముల కెందుఁ
దగినవరుఁ గాంచనై తిని దడవి; కాన
నీ మనస్సున కెక్కిన నృపకుమారుఁ
గోరి వరియింపు; మిదియ నాకును ప్రియంబు," 177

వ. అనిన నదియుఁ గొండొక లజ్జించి, కోర్కి పెంపున సిగ్గు దొలంగం ద్రోచి, ప్రకట కౌతూహలతరళితాంతరంగ యగుచుఁ దండ్రికి నిట్లన యిట్లనియె. 178

క. "చిరకీర్తి సాళ్వభూవరు
వరతనయుం డయిన సత్యవంతుఁడు నాకున్
వరుఁడుగఁ గోరుదు మదిలో;
నరవర! యాతనికి నిమ్మ ననుఁ బ్రీతిమెయిన్. 179

వ. సాళ్వపతి యిప్పుడు దైవయోగంబునంజేసి విగతచక్షుం డయి, తన రాజ్యంబు వైరులచేతం గోల్పడి, పుత్రదారసహితంబు వనంబున నున్నవాఁ; డెట్లయినను సత్యవంతున వరియింతు" ననిన మద్రేశ్వరుండు నారదుం జూచి "మునీంద్రా! మీయెఱుంగనివారు లేరు; సావిత్రిచేత వరియింపఁబడిన కుమారుం డెట్టివాఁడు? వాని గుణరూపశీలంబు లెఱింగింపుఁ" డనిన నారదుం డిట్లనియె. 180

సీ. "సత్యంబు పలుకుట సత్యవంతుం డన
నతఁ డొప్పు; మఱియుఁ జిత్రాశ్వుఁ డనఁగ
నామాంతరంబు నన్నరనాథసుతునకుఁ
గలదు; తేజంబునఁ గమలమిత్రు
బుద్ధి నింద్రాచార్యుఁ బురుడించు; శూరత
వాసవుఁ, దాలిమి వసుధఁ బోలుఁ;
గాంతిఁ జంద్రున కెన గాఁదగు; రూపున
నాశ్వినేయుల సరి యసఁ దలిర్చుఁ; 180

ఆ. దపను, శమము, దమము, దానంబు, బ్రాహ్మణ
భక్తియును, మహానుభావతయును
నతనియంద కాని యన్యులయందు లే;
దింత నిక్కువము మహీతలేశ ! 181

వ. వానియందును గీడు నొక్కటియుఁ గలదు; నేడు మొదలుగా నొక్క సంవత్సరంబునకు మృతిం బొందు; నిది నీకుఁ జెప్ప వలయుటంజేసి చెప్పితి" ననిన నతండు గూఁతు మొగంబు సూచి "తల్లీ! యమ్మహాత్ముండు దేవరహస్యంబు లెఱుంగు; నీతని వచనం బమోఘంబు; నీకు నట్టి వరుం డేల? యొండొక్క వరుని వెదకికొ"మ్మనిన నక్కన్నియ తండ్రి కిట్లనియె. 182

క. "వినుము మనోవాక్కాయము
లన మూఁడుదెఱంగు లందు నంతఃకరణం
బనఘ! ప్రధానము; గావున
మనమునఁ గైకొన్నభర్త మానం దగునే? 183

వ. సత్యవంతుం డెట్టివాఁ డైన నగుంగాని యేఁ నింక నొరుల వరియింప నొల్ల" ననిన నశ్వపతి నారదుదెసఁ జూచుటయు నతం డిట్లనియె.

చ. "గొనములప్రోక నీయనుఁగుఁగూఁతురు; దీని తలంపు మాన్పఁగా
మనకు నశక్య; మింక ననుమానము లేల? నరేంద్ర! కూఁతుఁ జ
య్యన నృపసూతి కిమ్మ్ము; కమలానన చేసిన పుణ్యగౌరవం
బున నయినం బ్రియుండు పరిపూర్ణచిరాయురుపేతుఁ డయ్యెడున్."

వ. అనిన నమ్మహీపతి యమ్మునిపతికి మ్రొక్కి "నీవు మాకుం బరమ గురుండవు; నీ యానతిచ్చినట్లు చేసెద" ననిన నారదుండు వారి దీవించి దివంబునకుం జనియె నంత. 186

సీ. అమరఁ బుణ్యదినంబునందు బాంధవమంత్రి
వృద్ధపురోహితవితతితోడ
సావిత్రిఁ దోడ్కొని, జననాయకుండు వై
వాహికమహనీయవస్తుకోటి
గొనుచుఁ, బుణ్యారణ్యగోచరుం డై తప
స్థితుఁ డైన యాద్యుమత్సేనుకడకు
జనిన, నారాజును సంభ్రమంబున నర్ఘ్య
పాద్యాదిసంభావనంబు
ఆ. లాచరించి; సముచితాభిమతాలాప
పూర్వకముగ సుజనపూజ్యుఁ డతని
యాగమననిమిత్త మడిగిన, మ్రొదేకు
డెలమి సాల్వపతికి నిట్టు లనియె. 187

క. "ఈకన్నియ నాకూఁతురు;
మాకులమున కెల్లఁ దేప; మనుజోత్తమ! నీ
వీకన్నియఁ గోడలు గాఁ,
గైకొనుము మదీయవచనగౌరవబుద్ధిన్." 188

వ. అని పలికి సావిత్రి సతనికి నభివందనంబు సేయించి మఱియు నతండు.

క. "నీకొడుకు సత్యవంతున
కీకన్నియ దగు; నరేంద్ర! యీ కన్నియకున్
నీకొడుకు దగు; ననన్యగు
డాకరు లియ్యిరువురును సమంచితమూర్తుల్." 190

వ. అనిన నతనికి ద్యుమత్సేనుం డిట్లనియె. 191

తే. "విగతరాజ్యుల మై ఘోరవిపినములకు
వచ్చి యిమ్మెయిఁ దపమున్న వార మేము;

బాల, సుకుమారి యిది జనపాల! యడవి
నుండి మాతోడి యిడుమకు నోర్చునయ్య?" 192

వ. అనిన నశ్వపతి యతని కిట్లనియె. 193

చ. కలిమియు లేమియుఁ సతము గా; వవి సెందినచోఁ జెలంగుచుం
గలఁగుచు నున్కి ధీరులప్రకారమె? లెస్సగ నింతవట్టు నేఁ
దెలియుదుఁ; జెప్పెదఁ వసుమతీవర! పిన్న యనంగ నేల? యే
కొలఁదియుఁ గాదు; ధీరమతి గూఁతురు; పేర్కొనఁ జాలఁ బెంపునన్. 194

క. నీతోడ వియ్య మందం
జేతోగతి నాసఁ జేసి చెచ్చెర ని ట్లే
నే తెంచితి; మత్ప్రార్థన
ప్రీతిగఁ జేకొనక యునికి పాడియె నీకున్?" 195

—: సావిత్రి సత్యవంతుని వివాహం బగుట :—

వ. అనుటయు నయ్యంధనృపతి తత్సంబంధమునకు సంతసిల్లి, నిజాశ్రమ
వాసులైన మునులం గూర్చుకొని, శుభలగ్నంబున సత్యవంతునకు
సావిత్రిం బరిణయంబు సేసె; నయ్యశ్వపతియును గూఁతునకు నల్లునకు
వివిధాంబరాభరణాది వస్తువిశేషంబు లొసంగి నిజపురంబున కరిగెఁ;
బదంపడి. 196

తే. పడఁతి రమణీయభూషణాంబరవిలాస
ముజ్జగించి, వనాంతరయోగ్యలీల
వల్కలాజినవసన యై, వదల కధిక
భక్తి భర్తృశుశ్రూషణపరత నుండె. 197

క. ఆమెలఁత సేయు సవినయ
సామకథల, మృదుగభీరసంభావనలన్
మామయు నత్తయు సంతో
షామృతమునఁ దేలి రంతరంగమునఁ దగన్. 198

వ. సావిత్రియుఁ దన మగని యాయుఃప్రమాణంబు నారదముని చెప్పిన
దినంబు మొదలుగా ననుదినంబును లెక్క యిడికొనుచుండె; నిట్లు
వర్తిల్లు చుండ నాలుగు దివసంబులు గొఅంతగా నొక్క సంవత్స
రంబు గడచిన. 199

క. నాలవదినంబు పతి మృతి
కాలం బని మది నెఱింగి, కడు నిష్ఠమెయిం
జాల భరంబుగఁ బూనెను
బాల త్రిరాత్రోపవాసపరమవ్రతమున్. 200

వ. దానికి విస్మయం బంది ద్యుమత్సేనుండు గోడలిం బిలిచి "తల్లీ యిట్లేల దుస్తరంబగు వ్రతంబు గొడంగితి?" వనిన నమ్మత్ర రాజ తనయ వినయంబుతో ని ట్లనియె. 201

క. "మీరు మదీయం బగు వ్రత
భారమునకు వగవ వలదు; పరమశుభంబుల్
గోరి యొనరింపఁ బూనితిఁ;
గారణమును మీ కెఱుంగఁగా నగు మీఁదన్." 202

వ. అనిన నతం డట్లేని మేలు గాక యనియె; నంతఁ జతుర్థదివసంబున.

సీ. కడురేపకడయ మేల్కని, నిజభర్తకు
మరణదినం బని మానసమునఁ
దద్దయు శోకసంతాపంబు గదురంగ
దినముఖోచితవిధుల్ దీర్చి, భక్తిఁ
బతికిఁ మంచితపావనపరిచర్య
యప్పుడు కడువేడ్క నాచరించి,.
యత్తకు మామకు నచటివిప్రులకును
వేర్వేఱ ప్రణమిల్లి, వేడ్క వారు

తే. దనకు సౌభాగ్యభాగ్యవర్ధనము గాఁగ
నిచ్చు దీవన మడలో గ్రహించియున్నఁ
బ్రొద్దు జామెక్కుటయుఁ బూవుఁబోఁడిఁ బిలిచి
మామ యిట్లని పలికె సమ్మానమెసఁగ. 204.

క. "కడు నుగ్రం బగు వ్రత మిది
దొడఁగితి; దివసత్రయంబుతో నది సెల్లెం;
బడఁతీ! యెంతయు డస్సితి;
దడయక పారణ యొనర్పు దగదే యింకన్." 205

వ. అనిన సావిత్రి యతని కి ట్లనియె. 206

ఆ. "అధిప! ప్రొద్దు గ్రుంకనంతకు నేఁడును
గడువఁ దగదు నాకుఁ; గోరి యిట్లు
గాఁగ వ్రతముఁ బూనుకాలంబున యేను
నిశ్చయించుకొనిన నియమమిదియ." 207

వ. అనియె; నప్పుడు సత్యవంతుండు సమిత్కుశఫలాహరణార్థంబు వనం బునకుం గదలినం జూచి, సావిత్రి యతనిఁ జేరం జని, "వనంబున కేనును నీతోడఁ జనుదెంతుఁ; దోడ్కొని పోవలయు" ననిన నతండు "నీవు త్రిరాత్రోపవాసంబునంజేసి యెంతయు డస్సినదానవు; రా నోప" వనిన నది వాని కిట్లనియె. 208

మ. "ఉపవాసశ్రమ మించుకేనియును నా యుల్లంబునం దోఁప; దీ
విపినం బుజ్జ్వలపుష్పపల్లవఫలావిర్భూతి నానాలతా
గపరీతం బన విందుఁ; జూడఁగ మదిం గౌతూహలం బయ్యె; న
న్నుపరోధింపకు; మింతవట్టు చన వీ యుక్తుండ వెబ్భంగుల."

వ. అనిన నతం డట్లకాక చనుదె మ్మనుటయు సావిత్రి చయ్యనం జని, భార్యాసహితుండయి యున్న తన మామకుం బ్రణమిల్లి "మీకొడుకు వనంబునకు నగ్నిహోత్రార్థం బై సమిధలు దేర నరిగెడు; నాకును నతనితోడన చని వనంబు సూడ వేడ్క యైనది; మీరు నా కివ్వరంబు గృపసేయ వలయు" ననిన నాతం "డిమ్మగువ యెన్నండును నెయ్యది యును నడుగ; ది ట్తెఅంగు దీనిఁ బ్రియం బై యున్నది; నాకు నివారింప నేల?" యని తలంచి యనుమతించిన నయ్యిరువుర యడుగుల్లంబడి పిడ్కొని. 210

—: సత్యవంతుఁడు సావిత్రీసహితుం డై వనంబునకుం బోవుట :—

క. చిత్తంబునఁ బై కొనియెడు
నుత్తల మడఁచుచును, ముఖపయోరుహమునఁ ద
ళ్కొత్తెడు వెడనవ్వునఁ బ్రియు
చిత్తం బిగురొత్తఁ జనియెఁ జెలువ యడవిన్. 211

వ. ఇట్లాదంపతులు మందగమనంబున నరిగి పరిసరారణ్యంబు దఱియం
జొచ్చి రప్పుడు. 212

సీ. కమనీయకమలినీకల్లోలవీథులఁ
గదలు రాయంచల గతుల యొప్పు,
బహుపుష్పపల్లవప్రకరచిత్రితము లై
తనరారు తరులతాతతుల సొంపు,
మకరందరసపానమదవిలోలంబు లై
క్రాలెడి యెలదేఁటిగముల యులివుఁ,
బరిపక్వమంజులఫలరసోద్ధతము లై
పలుకు రాచిలుకల పటురవంబు, 212

ఆ. ప్రియుఁడు వేఱువేఱ ప్రీతిమైఁ జూపుచుఁ
జెప్పుచును జనంగఁ, జిగురుఁబోఁడి
గనుచు వినుచు నిర్వికారసల్లాప మిం
పార నతని తెఱఁగు నరయు చుండె. 213

వ, తదనంతరంబ యూరాజర్షినందనుండు మధురంబు లగు ఫలంబులు
గోయుచు గరిడియ నిండించి, యొక్కయెడఁ బరశుపాతబునఁజేసి
కాష్ఠదళనంబు సేయందొడంగి, శ్రమంపడి యొల్లంబోయి, గొడ్డలి
పుడమిపయి వైచి నిరంతరనిశ్వాసవేగ వివర్ణ వదనుం డగుచు
సావిత్రిం గనుంకొని. 214

చ. ''ఒడలు వశంబు గాదు; భ్రమనొందినయట్లు మనంబు దూలెడిం;
గడఁగి శిరంబు శూలవిశిఖప్రకరంబున నొంచినట్టి ద
య్యెడు; నిలువంగ నోర్వ; నొకయించుకసేపు శ్రమంబు దీఱ నీ
యెడ శయనింతు'' నావుడు సితేతరణ మెత్తనిసంభ్రమంబుతోన్. 215

క. తనయంకతలమ ప్రియుశిర
మున కుపధానముగఁ జేయ. భూవతనయుఁ డొ
య్యన వ్రాలి సోలి నిశ్చే
తనుఁ డైన ట్లుండెఁ; గొంతతడవున కెదురన్. 216

మ. కనియెం గోమలి నీలమేఘ విలసత్కాలాంజనాకారు, ఘో
రనిశాతోత్కటదంష్ట్రు. నుజ్జ్వలచలద్రక్తాక్షు, బ్రత్యగ్రకాం
చనవర్ణాంబరు, నంత్యకాలదహనజ్వాలాప్రచండున్, జగ
జ్జనసంత్రాసను, నొక్కదివ్యు బటుపాశప్రౌఢహస్తోద్ధతున్. 217

వ. అప్పురుషుండును నధికసంరంభంబున సత్యవంతుం గదిసిన, నయ్యంతి
యెంతయు భయంబునం బ్రియునిశిరం బొయ్యన దిగువం జేర్చి నిల్చి
కృతాంజలి యై "యయ్యా! మీ రెవ్వ? రియ్యెడకు నెయ్యది
సేయం దలంచి విజయంచేసిత?" రనిన నతం డిట్లనియె.

సీ. "కాలుండఁ జువ్వె యేఁ గమలాక్షి; నను నీవు
మహితపాతివ్రత్యమహిమఁ జేసి
కానంగఁ జాలితి; కాన రా దన్యుల
కిటు; నీపుభర్తకు నిపుడు కాల
మగుటయు, వీఁడు మహాపుణ్యనిధి గాన
యితరులఁ బనుపక యేన వీనిఁ
బ్రచ్ఛన్నుఁ గొనిపోవఁగాఁ జనుదెంచితి"
నని యుగ్రభంగి నయ్యంతకుండు. 218

ఆ. ధరణినాథతనయు తనువునఁ బ్రాదేశ
పరిమితాత్మఁ డగుచుఁ బ్రజ్వరిల్లు
జీవు వెడలఁ దిగిచి, నేచ్చెర సతిదీర్ఘ
భయదపాశనికరబద్ధుఁ జేసి. 219

మ. కొని వేగంబున దక్షిణాభిముఖుఁ డై ఘోరంపుమార్గంబునం
జనఁగాఁ జొచ్చె; ననంతరంబ మదిలో సావిత్రి శోకంబు పై
కొనఁ, బ్రాణేశ్వరుదేహ మొక్కయెడ సంగుప్తంబు గావించి, యా
తనిపజ్జం దగఁ దాను నేఁగెఁ బదపద్మంబుల్ వడిం దొట్రిలఁ. 220

ఆ. దానిఁ జూచి కరుణ ధర్ముండు "నీ వేల
వచ్చెదవు? లతాంగి! వలదు నిలువు;
మింక నీ కగమ్య మిటమీఁదితెరు వెల్ల"
ననిన నతని ట్టు లనియెఁ బొలఁతి. 221

క. "పతు లెందుఁ జనిన నచటికి
సతులకుఁ జన నలదె? నీప్రసాదమునను, మ
త్పతిభక్తికతమునను సం
స్తుతగుణ! నా కరుగరాని చోటులుఁ గలవే? 222

వ. సకలమార్గంబులందును ధర్మమార్గంబు ప్రధానం; బట్టిధర్మంబునకు నాధారంబు సజ్జనుల యని వినంబడు; నట్టి సజ్జనసందర్శనం బెప్పుడు వృథగాదు; గావున సజ్జన శేఖరుండ వనం జను నీదైన సందర్శనంబునం బరమశుభంబులం బొందక యేను రిత్తజనంబుల తెఱంగున నూఱక యెట్లు మగుడుదు?" ననిన దాని ప్రగల్భవచనంబులకు నద్భుతం బంది ధర్మం డి ట్లనియె. 223

ఆ. "తనులతాంగి! భవదుదార వాగ్భంగికి
మెచ్చు వచ్చె నాత్మ; నిచ్చువాఁడ
వేఁడు మొక్కవరము, విభునిజీవిత మొక్క-
టియును దప్ప; నేదియయిన నొండు." 224

—: సావిత్రి యమునివలన నభీష్టవరంబులు వడయుట :—

చ. అనవుడు మద్రరాజసుత ప్రాంజలి యై సమవర్తితోడ ని
ట్లను; "రిపుకోటిచే నపజయంబునఁ బొంది వనాంతరంబునం
దనవరత వ్రతాభిరతుఁ డైన మహాత్ముఁడు, సాళ్వభూవిభుం,
డనఘుఁడు లబ్ధచక్షుఁ డగునట్టులుగాఁ గరుణింపవే దయన్." 225

క. నావుడు "నట్టుల యయ్యెడు;
నీ విట రా వలదు; మగుడు నెమ్మి" నని వెసం
బోవఁ దొడంగెను బితృపతి;
యా వెలఁదియు నంత నిలువ కరిగెఁ బిఱుందన్. 226

వ. అట్లు సని చని మఱియు ని ట్లనియె. 227

చ. "ఎడపక వాఙ్మనఃక్రియల నేరిచి నెగ్గొనరింపఁ బూన; రె
య్యెడలను దీనులం గరుణ యేర్పడఁ బ్రోవన చూతు; రిచ్చుచోఁ
గడమ వడంగ నీ కెదిరికాంక్షితముల్ దుదిముట్టఁ దీర్తు; రె
క్కుడుమదిఁ గూర్తు రార్తులకుఁ; వినుమిన్నియు నార్యధర్మముల్.

క. నీ వెఱుఁగనియది యెయ్యది
దేవోత్తమ! ధర్మగతుల తెఱఁ గెల్ల భవ
ద్భావాధీన మగుటఁ గా
దే వెలసితి నీవు ధర్మదేవత యనఁగాన్. 229

క. సమబుద్ధితోడఁ దత్తత్స్వముచితకర్మఫల మఖిలజంతుతతులకున్
సమకూర్చుట, నీ కయ్యెను
సమవర్తి యనంగఁ బేరు జగదభినుత మై. 230

క. యముఁ డంఁడ్రు నిన్ను నార్యులు
యమిఁంతు భూతముల నెల్ల; నట్లగుటఁ దగున్;
భమనుండ వైతి కల్మష
భమనంబునఁ జేసి నీవు జలజాప్తసుతా!" 231

వ. అనినం బ్రీతపతి యాపుణ్యసతి కిట్లనియె. 232

క. "తృషితుఁ డగువానిఁ బరిలఘు
తుషారతోయములు మోదితునిఁ జేయుగతిన్
హృషితాంగుఁ జేసె ననుఁ గ
ల్మష హరణములైన నీ సమంజసఫణితుల్. 233

వ. కావున సత్యవంతు ప్రాణంబులు దక్కుం దక్కినకోర్కి యెయ్యది యైనం జెప్పుము; సఫలంబు సేసెద" ననిన సావిత్రి "దేవా! వైరుల చేత నపహృతం బైన రాజ్యం బెప్పటియట్ల ద్యుమత్సేనుండు ప్రాపించునట్లుగా ననుగ్రహింపవే" యని వేఁడుటయు వైవస్వతుం డట్ల యగునని పలికి యిట్లనియె. 234

ఆ. "పలదు నిలువు మింక; వదలక నీభక్తి
మగని కెక్కు; దుర్గమంపుఁద్రోవ
యిది; కృతంబు లయ్యె నెల్లయు; నీ విట
వచ్చు సెలవు లేదు వనజనయన!" 235

వ. అనిన నమ్మహాభాగ యతని కిట్లనియె. 236

క. "ధర్మాత్ములు దమ సలిపెడు
ధర్మక్రియ దప్ప రెట్టిదళలందును; మో
హోర్మియుఁ, దాపముఁ బుట్టవు
ధార్మికహృదయములఁ; బ్రథమధర్మాధ్యక్షా! 237

క. కావునఁ బతియనుగమనం
బేవిధమున విడువఁ దగవె; యెట్లయినను మో
హావేశముఁ బొందక ధ
ర్మావస్థితి సలుప వలదె యవహితబుద్ధిన్ ?" 238

తే. అనిన నంతకుఁ డిట్లను "నతివ ! నీవు
ప్రకటధర్మవిశేషతత్పరవు; గాన
యింక నొకవరమిత్తుఁ. బ్రాణేశుబ్రతుకు
వలదుగాని, యొండడుగుము వలయుదాని." 239

క. అనుటయు నక్కాంత గృతాంజలి యై "మాతండ్రి మద్రేశ్వరుం
డపుత్రకుం; డతనిఁ బుత్రశతలాభం బగునట్లుగాఁ బ్రసాదింపు" మని
యభ్యర్థించిన నట్ల కానిచ్చితి నని పల్క ధర్మరాజు "నేఁడు నీవు
గడుదూరంబు వచ్చి డస్సి; తింక మగుడుట లెస్స" యని పలిన
నప్పతివ్రత యి ట్లనియె. 240

తే. "నాకు డప్పి యెక్కడిది ? మనంబు భర్తృ
చరణపంకజాసక్త మై కరముభక్తి
నలరు చున్నది; సతులకు నన్య మెట్టి
దియును ధర్మమె భర్తృసంశ్రయమకాక. 241

వ. మఱియు నొక్క విన్నపంబు సేసెద. 242

ఆ. ఆత్మధర్మనిరత లైన పుణ్యాత్ములు
దుర్లభులు; సమస్తదురితములును
శాంతిఁ బొందు వారిసంసర్గమునఁ; దీర్థ
పూతమతులు వారె భూతలమున. 243

ఉ. వారలపేర్మిఁ గాదె శశివారిజమిత్రులు నిర్వికారసం
చారత నుల్లసిల్లెదరు, సర్వపయోనిధులున్ నిరాకులా

కారతఁ బ్రాలెడుం, గులసగంబులు నిశ్చలరూఢిఁ జాల నో
ప్పా రెడు; భూతధాత్రి నిఖలైకధురీణతఁ బేర్మిఁ బొందెడున్."

వ. అని పలికి మఱియు ని ట్లనియె. 245

తే. "పదుమాటలాడినయంత నెట్టివారు
నార్యజనులకుఁ జుట్టంబు లగుదు రనిన,
జిరసమాలాపసంసిద్ధిఁ జేసి నీకు
నేను జుట్టమ నని పేఱ యేల చెప్ప? 246

వ. కావున మిత్రమనోరథం బవశ్యకర్తవ్యంబుగాఁ జిత్తగింపు" మనిన నమ్మహాత్ము భావుం డబ్భామినిదెసం గనుంగొని "నీకుం బ్రసన్నుండ నైతి; నభీష్టం బైన వరం బొక్కటి యిచ్చెద వేఁడు" మనిన నమ్మానిని యిట్లనియె. 247

క. "మది సత్యవంతుజీవిత
మది యిమ్ముగఁ దొలఁగఁ బెట్టి. యన్యంబుల ని
చ్చెద నని పలుకుదు మును నీ;
వది యిప్పుడు లేద; యింక నడిగెదఁ బ్రీతిన్. 248

చ. పతివిరహంబు దుస్సహము; భర్తృవినాకృత యైనకాంత దూ
షిత యగు సర్వమంగళవిశేషములందును; గాన మత్ప్రియుం,
డతులితకీర్తిశాలి, సుగుణాఢ్యుఁడు, సాళ్వసుతుండు లబ్ధజీ
వితుఁడుగ నిమ్ము ధర్మపదవీపరిరక్షణ! పుణ్యవీక్షణా" 249

వ. అనిన నట్ల చేయుదు నని యాకృణంబ కృతాంతుండు సత్యవంతు
నపగతపాశుం జేసి యాసుందరి కి ట్లనియె. 250

చ. "కొను మిదె నీ మనఃప్రియునిఁ గోమలి! వీఁడు చతుశ్శతాబ్దముల్
మను నిటమీఁద; బుత్రులఁ గ్రమంబున నూర్వురఁ గాంచుఁ; గీర్తివ
ర్ధనుఁ డగు; సంతతాధ్వర విధానములం బరితుష్టి సేయు న
య్యనిమిషకోటి కెల్లను; నిజాన్వయమౌళివిభూషణుం డగుఁ." 251

వ. అని యాదేశించి యాతం డంతర్హితుం డయ్యె; నక్కాంతయుఁ
గ్రమ్మటి చని యెప్పటియట్ల జీవితేశ్వరుం దన తొడలపై నిడికొని

కూర్చున్న యెడం, గొండొక వడికి లబ్ధచేతనుం డై, సత్యవంతుండు
దెలిసి, నిజవల్లభం జూచి యి ట్లనియె. 252

క. "కడుఁ దడవు నిద్రవోయితిఁ
బడఁతీ! ననుఁ దెలుపవలదె? బలియుఁ డొకరుఁ డె
క్కుడుజవమునఁ బట్టి బలం
బెడలఁగ ననుఁ దిగిచె; నాతఁ డెవ్వఁడు సెపుమా? 253

చ. అది కల గాదు; నిక్కువము యైనటు లున్నది; నాకు నెంతయున్
మది వెఱ వుట్టె" నావుడును మానిని యిట్లను "నీకు నంతయున్
ముదమున రేపు సెప్పెదఁ; దమోమయమై యిడె శర్వరీముఖం
బొదవె; విలంబనం బిచట నొప్పదు; లెమ్ము నరేంద్రనందనా! 254

మ. అదె నక్తంచరు లిందు నందును మహోగ్రాకారులై క్రందుగా
మెదలం జొచ్చిరి; ఘోరఫేరవరుతుల్ మిన్నందెఁ దీవ్రంబు లై;
పదశబ్దంబులు మీఱఁ జూడు కలయం బాఱం దొడంగెం బెనుం
గదుపుల్ గట్టి మృగంబు లియ్యెడ; భయోత్కంపంబు నా కయ్యెడిన్. 255

క. విను నీవు దడయుటకు మీ
జననియు జనకుండుఁ గరము సంతాపభరం
బునఁ బొందుదు రింతకుఁ; గ్ర
న్నన వారికి సంతసం బొనర్పవె యధిపా!" 256

వ. అని పలి తదీయవిషాదచేష్టితంబు లుపలక్షించి వెండియు. 257

చ. "తమమును బెల్లుగాఁ బరఁగె; దవ్వు నిజాశ్రమభూమియున్; దను
శ్రమమును బాయ దిప్పు ననుఁ చందమ యైనఁ జనంగ నేల? యిం
పమరఁగ నింత ప్రొద్దు సుగుణాకర! యిచ్చట నిల్చి రేపు వో
దమె? తెఱఁ గెద్ది?" నావుడును దన్వికి సాళ్వతనూజఁ డి ట్లనున్. 258

క. "మానె శిరోవేదన; నా
మేనికిఁ దగు లావు వచ్చె; మెల్లన యరుగం
గా నోర్తుఁ; దల్లిదండ్రులఁ
గానక యే నెట్లు నిలుతు గానన భూమిన్?. 259

క. ఇంతకు మున్నెన్నఁడు నే
నింతతడవు వారిఁ బాసి యెందుఁ దడయ; నేఁ
డింతవడి మసలుటకు వా
రెంత వడిరో? యేమి యైరో? యెట్లున్నారో! 260

ఆ. సంధ్యఁబ్రొద్దు నన్ను జనని యెన్నఁడు నిలు
వెడల నీదు; నేఁడు విపినభూమి
మధ్యరాత్రివేళ మసలుట కాయమ
యెట్టిపాటు వడునో యే నెఱుంగ. 261

సీ. కౌఁగిట ననుఁ జిక్కఁగదియించి శిరమునూ
ల్కొంచును బాష్పముల్ గురియుచుండఁ
"బట్టి! మా యొడలును, బ్రాణంబులును, నెల్ల
యర్థముల్ నీవ; మాయన్న! నీవు
దేపగా సంసారతీరంబు సేరెద
మని తలంచెదము సు మ్మన్న; యన్న!
కన్నులు లేని మా కన్నులుఁ గాళులు
నీవ కదన్న! మానిఖిలవంశ

ఆ. మును సముద్ధరించు మోపు నీయదియ క
దన్న" యనుచు నిట్టు లగ్గలంపుఁ
బ్రేమ ననుదినంబుఁ బ్రేముడింతురు వృద్ధు
లక్కటకట! యేమి యైరో నేఁడు! 262

ఆ. అడవి కేఁగుదెంచి యడరంగ ఫలమూల
తతులు గొనుచు నేను దడయ కపుడ
పోవఁ గానీ నైతి; దైవోపహతి నింత
చిక్కువడితి; నేమి సేయువాఁడ?. 263

క. నా యున్నచో నెఱుంగక
యా యాశ్రమవాసు లైన యందఱు నతిదుఃఖాయత్తుఁ డగుచు నడుగును
మాయయ్య దలంకి మాటిమాటికి నన్నున్. 264

క. నావార్త వినక యింతకు
నావృద్ధులు భిన్నహృదయు లై ప్రాణంబుల్
వో విడుతురు గా; కచటికిఁ
బోవం బని గలదె? యేనుఁ బుచ్చెద నసువుల్.'' 265

—:సత్యవంతుఁడు సావిత్రితోడ మరలి తన యాశ్రమంబునకు వచ్చుట :—

వ. అని బహుప్రకారంబులం బలవరించి, కన్నీరు నించిన నక్కాంత దుఃఖాక్రాంత యగుచు నతని నాశ్వాసించి, నవమృణాళమృదులంబు లగు భుజంబులఁ గౌఁగిలించి, యెగయ నెత్తిన మెత్తన నిలిచి, యతండు ధూళిధూసరం బైన శరీరంబు దొడసికొని గమనంబున కుత్సహించిన. 266

క. ఫలభారము దుర్భర మని
వెలఁది యచట నొక్క వృక్షవిటపంబున ని
మ్మల గరిడియ దగిలిచి యు
జ్జ్వలపరశువుఁ గొనుచు మృదులసంభ్రమలీలన్. 267

వ. జీవితేశ్వరు వామబాహువు నిజవామభుజంబుపయి నిడికొని, దక్షిణ హస్తంబున నతని గ్రుచ్చి గౌఁగిలించి, మందగమనంబున నాశ్రమోద్దేశంబునకు మగిడె; నంతకు మున్న యక్కడ. 269

ఉ. కన్నులు వచ్చి యెల్లెడలుఁ గన్గొని, వృద్ధనరేంద్రుఁ డాత్మకుం
గన్నులుఁ బోలె నైన తన గాదిలిపుత్రుఁడు గాననంబులో
నెన్నఁడు లేనియంతతడ వేటికిఁ జిక్కెనో? యంచు నార్తితోఁ
గన్నులు లేనియట్లొకఁడుఁ గానక యేడ్చె సతీసమేతుఁడై. 269

తరలము. కొడుకు నిందును నందు రోయుచుఁ గోరి ప్రేమభరంబునం
గొడుకుసద్గుణకోటు లెల్లను గోటిభంగుల మక్కువన్
గడన సేయుచు, సత్యవంతునిఁ గానరే మునులార! యీ
యడవిలోపల నంచు, హా సుత యంచు ధైర్యము డించుచున్.

వ. ఉన్నంతఁ దదాశ్రమవాసు లైన మును లందఱు నతనిం బొదివికొని, తదీయనయస లాభంబునకు విస్మయం బందుచు, నుచిత వాక్యంబుల నతని నాశ్వాసించు చుండిరి; తదనంతరంబ యొక్క ముహూర్తంబు

నకు సావిత్రీసహితుం డై చిత్రాశ్వుండు సనుదెంచిన, నా వృద్ధదంప
తు లత్యంతహర్షంబున నతనిం గౌగిలించుకొని, మూర్ధాఘ్రాణంబు
సేసిరి; మునివరులును గరంబు సంతసిల్లి; రప్పు డారాజర్షిముఖ్యుండు
పుత్రునిం జూచి "యయ్యా! యి ట్లేల వనంబులో మసలి" తని యడి
గిన, నతండును దానుఁ జని పండ్లు గోయుటయును. గాష్ఠదళనంబు
సేయునెడం దలయేరు గదిరి నిలువ నోపక విశ్రమించుటయుఁ, ద
న్నొక్క పురుషుండు గలలోన నిగ్రహించుటయుం జెప్పునెడ, సావిత్రి
మామ కి ట్లనియె. 271

సీ. "ఈరాజసుతునకు నిద్దినంబున మర
ణం బని మును చెప్పె నారదుండు;
మునినాథువచనం బమోఘంబు గావున
నేమఱి కేను నేఁ డితనితోడ
నడవికి నేగితి; నచట నీతఁడు సుప్తుఁ
డై యున్న యెడ వచ్చె సంతకుండు;
వచ్చి యివ్విభుని జీవముఁ గొని పోవంగ
వెనుకన చని యేను వివిధభంగి

ఆ. సత్యధర్మఫణితి సంస్తుతించుటయుఁ, గృ
పార్ద్రచిత్తుఁ డగుచు నజ్జముండు
నాకు నెమ్మి నొసఁగె నాలుగువరము;
లం దొకట నితఁడు జీవయుక్తుఁ డయ్యె. 272

వ. మఱియు నొక వరంబు భవదీయనయనోన్మేషణకారణం బయ్యెఁ;
దక్కిన వరద్వయంబునను మీకు వైరిహృతరాజ్యసంప్రాప్తియు,
మదీయజనకునకుఁ బుత్రశతలబ్ధియు నగు" నని చెప్పిన నయ్యిద్దఱుఁ
బరమానంద కందళిత శీతల శిశిర హృదయు లై కోడలి కి ట్లనిరి.

క. "ఆపత్సముద్రమగ్నం
బై పోయెడు నస్మదన్వయము పెం పెసఁగం
దేప యయి కడవఁ బెట్టిన
నీపుణ్యచరిత్ర గీర్తనీయము దల్లీ." 274

వ. అని యభినందించి; రప్పు డయ్యిందువదనను మునివరు లందఱుఁ బ్రళంసా వచనంబుల నుపలాలించి, వారల దీవించి, నిజగృహంబులకుం జని; రంతం గతిపయ దినంబులకు. 275

సీ. ఆసాళ్వభూపతి యాప్తమంత్రులు, మూల
భృత్యులుఁ, బౌరులుఁ, బృథివిఁ గలుగు
పెద్దలుఁ గూడి సంప్రీతి నాతనిపాలి
కేతెంచె వినయసమేతు లగుచు,
''నవనీశ! నీశత్రుఁ డాత్మీ యభృత్య భే
దనమునఁజేసి బాంధవసహాయ
సహితుఁ డై మృతిఁ బొందె; సకలజనంబులు
నేకచిత్తంబున నిపుడు నిన్నుఁ

ఆ. ప్రకటరాజ్యపదవిఁ బట్టఁబు గట్టంగ
వచ్చినారు; నిఖిలవసుధయందు
విస్తరిల్లె నీదువిజయఘోషము; భద్ర
గజము నెక్కి వేగ కదలు మింక. 276

క. ప్రాకటతపోబలంబున
నాకలితవిలోచనుండ వై యున్న నినున్
లోకేశ! చూడఁ గంటిమి; మా
కన్నులు చల్లనయ్యె మాభాగ్యమునన్." 277

వ. అనినం బ్రహ్మాష్టహృదయుండై ద్యుమత్సేనుండుఁ దత్క్షణంబ తదాశ్ర మవాసు లయిన మునుల నామంత్రణంబు సేసి, కొడుకునుం దానును గజారూఢుఁ డై సతీసమేతుఁ డగుచు, బహుళచతురంగసేనాసంకుల గమనంబునం బురంబునకుఁ జని, సకలమహీరాజ్యంబును గైకొని, చిత్రాశ్వునకుం బురజనసమ్మతిం బ్రధితయౌవరాజ్యపట్టం బొసంగి, పరమైశ్వర్యధుర్యం డయ్యె; నిత్తెఱంగున. 278

క. తన మగని, నత్తమామల,
జననీజనకులను, దన్ను, సకలకులంబున్
ఘనముగ సముద్ధరించెను
జనవర! సావిత్రి ధర్మచరితము కంటే. 279

తే. ఆపతీవ్రతయట్లు యీ యాజ్ఞ సేని
పరమ కల్యాణి, ధర్మ సంభావనీయ;
యధిప! మిమ్మును మీయఖలాన్వయంబు
నుద్ధరించు మహాభాగ్యయుక్తఁ జేసి." 280

క. అని చెప్పి పాండుతనయుల
ననఘుల వీడ్కొ-ని, మునీంద్రుఁ డనుపమతేజో
ఘనుఁ డగు మార్క-ండేయుఁడు
దనయాశ్రమమునకు నరిగెఁ దద్దయుఁ బ్రీతిన్. 281

—: సూర్యుఁడు బ్రాహ్మణవేషమునఁ గర్ణునకు హితంబు సెప్పుట :—

వ. అని చెప్పిన విని జనమేజయుండు వైశంపాయనునితో "మునీంద్రా! యింద్రుండు గర్ణకవచకుండలంబు లెవ్విధంబున నేల యపహరించెం? జెప్పవే" యని యడిగిన నతం డి ట్లనియె. 282

సీ. "వనమున నప్పాండుతనయు లుండఁగ, నందు
వరుసఁ బండ్రెం డగు వత్సరంబు
కడపట, నింద్రుఁడు గడఁగి పాండవహిత
కారి యై కర్ణునికవచకుండ
లములు మాయాప్రయోగమున హరింపంగఁ
దలఁచిన, నాతనితలఁ పెఱింగి
జలజాప్తుఁ డొకనాఁడు వెలయ రాధేయున
కది యెల్ల నెఱిఁగింతు నని తలంచి,

ఆ. లోకనుతుఁడు బ్రాహ్మణాకార మొప్పంగ
నతని యున్నకడకు నరుఁగు దెంచి,
యేకతంబ యున్న యాకర్ణుతోడ న
భీష్టభంగి దోఁప నిట్టు లనియె. 283

క. "ఓకర్ణ! సుజనవినుత గు
ణాకల్ప! భవద్ధితార్థ మై యొకకార్యం
బేకతమ చెప్ప వచ్చితిఁ;
బ్రాకటముగ వినుము నాదుపలుకులు వరుసన్. 284

వ. పాండవపక్షపాతి యై పాకశాసనుండు భవదీయంబు లయిన కవచ కుండలంబులు హరింపం గోరి, నీవు బ్రాహ్మణప్రియుండ వనియును, బ్రాహ్మణు లడిగిన నెయ్యది యైనను వంచన సేయ వనియును నెఱుంగుం గావునఁ, గపట బ్రాహ్మణుం డై వచ్చి యడుగఁ గల వాఁడు; నీవును గవచకుండలంబు లీవలవదు; రత్న కాంచన వనితా ప్రముఖంబు లయిన పదార్థంబులు సూపియుం బ్రార్థించియు నెవ్వి ధంబున నయినం గడపి పుచ్చవలయు; నట్లు గాక వీని నతని కిచ్చి తేని మృత్యువశంబునం బొందఁ గలవాఁడవు. 285

చ. అమృతమయంబు సువ్వె సుగుణాకర ! యిమ్మహనీయవస్తుయు గ్మ; మివియ యుండునేనిఁ ద్రిజగంబులయందు నశేషశత్రులో కమునకు నీవు వధ్యుఁడవు గావు; నిరంతరసౌఖ్యసంప్రమో దమున వెలుంగు దీ; విది హితంబుగఁ జెప్పితి మోసపోకుమీ." 286

క. అనిన విని సూతతనయుఁడు
వినయంబున నిట్టు లనియె "విప్రాకారం
బున వచ్చిన వేల్పవు నీ
వనఘా యెవ్వఁడవు ? నాకు నానతి యీవే." 287

క. అనిన నతఁ "డేను సూర్యుఁడ;
మనమున నీయందుఁ గలుగుమక్కువఁ, గర్జం
బొనరఁగ నుపదేశింపం
జనుదెంచితి" ననిన నతఁడు సంభ్రమ మొప్పన్. 288

వ. అభివాదనంబు సేసి "దేవా ! దేవర నాకత్యంతహితుండ వగుటం జేసి కృతార్థుండ నైతి; నిం కొక్క విన్నపంబు సేసెద నవధరింపుము.

ఉ. భూసురకోటి వేఁడుటయుఁ బోఁడిగఁ బ్రాణము లైన నీగి నా భాస; దినేశ ! లోకమునఁ బ్రస్ఫుట మింతయు; నట్లు గావునన్ వాసవుఁ డట్టి నన్నడుగ వచ్చుఁ బ్రియంపడి; నాకు నొక్కఁ బ్రాఁ తే ? సురలోకవందిత ! మదిం గవచంబును గుండలంబులున్ ? 290

క. జగముల నెల్లను నిండిన
పొగడిత గడువెలితి సేసి, పొల్లయొడలికై

తగవే జన్మవ్రత మిటు
దిగ విడువఁగ నేఁడు నాకుఁ? ద్రిభువనదీపా! 291

మ. మఱి గుంతీసుతపక్షపాతి యగుచుఁ మాయాస్వరూపంబుతో
జితదైత్యుండు శతక్రతుండు. నను భిక్షింపంగ నేతెంచున
ట్టి తెఱం గైనఁ. దదీయ కీర్తియ చుమీ డిందుం; ద్రిలోకీసము·
న్నతమై యొప్పు మదీయకీర్తి; యిది సూ నాపుణ్య మెబ్భంగులన్.

ఆ. కీర్తి విడువఁ జాలఁ; గీర్తితో మెలఁగంగఁ
జావు వచ్చె నేనిఁ జత్తుఁ గాని;
జగములోన నెల్ల నడికంకెఁ జావు మే
లనఁగఁ బరఁగుమాట యనఘ వినవె?

ఉ. కీర్తియ యిచ్చుఁ బుణ్యగతిఁ; గీర్తియ తల్లియుఁబోలెఁ బ్రోచు; స
త్కీర్తియ యాయువున్ సిరియు; గీర్తివిహీనుఁడ చూ శవంబు; దు
ష్కీర్తను నెల్ల చేటులును గిట్టి హరించు ననండె తొల్లి భ
క్తార్తిహరుండు నాఁ బరఁగు నంబుజసూతి జగద్ధితంబుగన్. 294

సీ. విప్రులు గడు నర్థి వేఁడినఁ గడిమితోఁ
బొచ్చెంబు సేయక యిచ్చు టొకటి;
బలితంపుఁ బగతుగఁ బరిమార్చు టొక్కటి
దండియై యనిఁ జచ్చుటొండె నొకటి;
శరణాగతుని నెట్టిశత్రుని నైనను
గరుణించి చంపక గాచు టొకటి;
భామినీద్విజవృద్ధబాలాతురుల నైన
యాపదఁ బెచ్చెరఁ బాపు టొకటి;

ఆ. యనఘ! యివి వ్రతంబు లై చెల్లు నాకు; నిం
దొకటి దప్పెనేని వికలకీర్తి
నగుదుఁ; గాన యిత్తు నఖిలభావముల నా
ఖండలునకుఁ గవచకుండలములు." 295

వ. అనినఁ గర్ణునకు సూర్యుం డిట్లనియె. 296

క. ''కడునెయ్యురు హితముగఁ జె
ప్పెడుపలుకులు వినవు; గరము బేలవు; నీ వె
క్కడ? బుద్ధితెరువు లెక్కడ?
చెడక వినుము నీకుఁ దెలియఁ జెప్పెదఁ గర్ణా! 297

క. తనకుఁ, దనయులకు, సతులకు,
జననీజనకులకు, బంధుజనులకుఁ గీ డొం
దనితెరువునఁ గీర్తిగొనం
జనుఁ గా; కందఱును జెడు యశం బేమిటి? 298

ఉ. కావున నీవు ప్రాణములు గావుము; కీర్తి యటుండ నిమ్ము; నీ
జీవిత మున్నఁ గీర్తి మఱి చేరదె? కీర్తి యొకండనంగ నే
లా? వనితల్ దనూభవులు లక్ష్ములు బంధులు సార్వభౌమతే
జోవిభవంబు నిమ్ముపడఁ జొప్పడఁ ప్రాణ మొకండు గల్గినఁ. 299

క. మృతుఁడైన నరుఁడు వెస భ
స్మితుఁడై చనుఁ గాక కీర్తి మేలిమి గనునే?
మృతదేహంబునకు నలం
కృతిఁ జేసినయట్లు మృతునికీర్తియుఁ బిదపఁ. 300

వ. నీవు నాకు నత్యంతభక్తుండ వగుటంజేసి భక్తజనరక్షణంబు గర్తవ్యంబు గావున నీ కిట్లన్నియుం జెప్పవలసె; మఱియు దేవనిర్మితంబైన రహస్యంబొక్కటి గలదు; దానంజేసి నీయందు నాకు వాత్సల్యంబు మిగిలియుండు; నది యిప్పు డేను జెప్పఁ; బిదపఁ దనయంతన యొయ్యఁ గంబడియెడు; నీకు నర్జునునకుం దెగని పగ యైయుండు; మీకుఁ గయ్యంబు నయ్యెడు; నందు నీవు సహజకుండలమండితుండ వగుటం జేసి యర్జునున కజయ్యుండ వయ్యెద; వట్లుంగాక వీనిం గోలుపోయి తేని నెంతయు దెప్పరం బగు'' ననినం గర్ణుం డిట్లనియె. 301

మ. "కరుణాపూర్తివి నీవు సంతతము భక్తశ్రీసమాధానత
త్పరచిత్తుండవు; గావునం గడఁగి నాపై మక్కువం బద్మినీ
వర! మే లానతి యిచ్చి; తిం కొకటి దేవా! నిన్నుఁ బ్రార్థించెదం;
గరుణన్ సాప్రతికూలదుర్లలితవాక్యంబుల్ సహింపం దగున్. 302

క. అన్యతమున కెంత వెఱతునొ
విను మంతకునకును నంత వెఱవ; మును గ్రహిం
చినవ్రతము విడిచి దుర్గతిఁ
జనఁ జాలుదునయ్య? నన్నుఁ జనునే మాన్పన్. 303

వ. అర్జునుండు దుర్జయుం డని చూడ వలదు; నీవును మదీయంబు లగు దివ్యాస్త్రవిశేషంబు లెఱుంగుదు; జామదగ్న్యుండును, ద్రోణుం డును నాకు నొసంగిన దివ్యాస్త్రంబు లల్పంబులు గావు; గావున నవశ్యంబును సమరంబున నమరరాజనందనుం దెగటార్ప నోపుదు; నీ వింక నొండు దలంపక నాకు ననుజ్ఞ యి" మ్మనిన నొక్కింత విచారించి యీ దేవుండు రాధేయున కిట్లనియె. 304

-: సూర్యుఁడు గర్ణునితో నింద్రుచే శక్తిఁ గైకొనుమని చెప్పుట :-

తే. "ఎల్లభంగుల నిశ్చయం బిదియయేని
వత్స! వినుమింక నొక్కటి; వాసవునకుఁ
గలదు దారుణంబును సమోఘంబునైన
శక్తి; యది నీకు నడుగుము సవినయమున్ుగ. 305

క. తొలితొలి బలసూదనుచేఁ
జెలువుగ నాదివ్యశక్తి సేకుఱఁ గొని, కుం
డలములుఁ గవచంబును మఱి
యలఘుమతీ! యిమ్ము; భద్ర మగు నట్లయినన్. 306

ఉ. వైరులఁ జంపి చంపి వెస వచ్చుఁ గరంబున కాజిలోన న
ద్దారుణశక్తి; వాసవుఁడు దానన తొల్లి సహస్రసంఖ్యలం
గ్రూరసురారిసంఘములఁ గూల్చె; మహాభుజ! నీకు నెమ్మి నా
ఘోరపుసాధనంబు దొరకొన్న నవశ్యము గెల్తు పోరులన్." 307

వ. అని చెప్పి కమలహితుం డంతర్హితుం డయ్యెఁ; గర్ణుండు వాసవు రాక కెదురు చూచు చుండె" ననిన విని జనమేజయుండు వైశంపాయనున కిట్లనియె 308

మధురాక్కర. "కలదు దేవగుహ్యం బని కమలభాంధవుఁడు గర్ణు
బలికె నని చెప్పి తది యెద్ది? బలియుఁ డాసూనజుండు
లలితకవచంబు మణికుండలములు నెమ్మెయిఁ బడసి
వెలసె? నవ్విధ మింపుగ విపరింప వలయు నాకు."

వ. అనిన వైశంపాయనుం డది యంతయుం జెప్పెద వినుమనియిట్లనియెఁ
"దొల్లి కుంతిభోజు నింటికి దుర్వాసుం డతిథి యై వచ్చి. వానిచేతం
బూజితుం డై నాకు నీయింటఁ గొంతకాలము వసియింప నిష్టం
బైనది; నాయున్న యంత కాలంబును నీవును నీ యనుచరులును
నిర్వ్యాజం బగు భక్తి సేయవలయు; నిట్లోపుదే? యనుటయు
నొడంబడి యతండు దన కూఁతుం బృథ యను కన్యకం బిలిచి
యమ్మహామునిం జూపి. 310

ఉ. "దేవసమానుఁ డీధరణిదేవుఁడు వేడుక మద్గృహంబునం
దా వసియింపఁ గోరుటయు దానికి నేనును నియ్యకొంటి; నిం
దీవరనేత్ర! నీవుఁ గడు ధీరవు, ధీవినయోపచారసం
భావితవృత్త; వట్లగుట భక్తి భజింపుము బ్రాహ్మణోత్తమున్.

క. ఇతఁ డెయ్యది యెత్తటి స
మ్మతిఁ గోరిన నది ఘటించి మచ్చిక నిడి తో.
షితుఁ జేయు; మిమ్మహాత్ముని
మతి యలుగక యుండవలయు మానిని యెపుడున్.

ఆ. వినుము విప్రవరులు వెడవెడ గినిసి రే
నియును ధరణి యెల్ల నీఱు సేయఁ
జాలుదురు తపఃప్రశస్తులు; దుర్వార
తేజు, లెందు నధికధీరమతులు. 313

క. భూదేవపరాభవమునఁ
గాదే వాతాపిదండకప్రభృతులు పెం
పేది చెడిరి; భూదేవస
మాదరమునఁ గాదె బ్రతికినవి యిజ్జగముల్. 314

సీ. పసిఁడి వయ్యును బడఁతి! నీ వెంతయు
గుణవంతురాలవు; గురులయందు,
బెద్దలయందును, బృథివీసురులయందుఁ
గడు భక్తి సేయుదు కమలనయన;
బంధులుఁ, జెలులు, సంబంధిజనంబులుఁ
బురమువారును, సంతిపురమువారుఁ
బూఁబోఁడి! నిను నెమ్మిఁ బొగడనివారు లే;
రేమని వర్ణింతు నేను నిన్ను?

తే. యదుకులంబునఁ బుట్టి, యత్యంతసౌఖ్య
మమరఁ బెరిఁగితి, నాపుత్రివై: త్రిలోక
సుందరము రూపు; ప్రాయంపుసొంపు, నిట్టి
దిచ్చరిత్రంబు సతులకు నెందుఁ గలదు? 315

వ. నీ గౌరవం బంతయి నెఱింగి కాదె వహ్నిసమానుం డైన యీ మహా
ముని నారాధించుటకు నీయందు భారం బెక్కించెద; నీవును దర్పం
బును నహంకారంబును దూరంబున నిడి, యిప్పుణ్యపురుషుం
బరితుష్టుం జేసి కృతార్థతం బొందు" మనిన నక్కన్నియ దండ్రి
కిట్లనియె. 316

ఉ. "కోరుదు నేను విప్రతతిఁ గొల్వఁగ నెప్పుడు నాత్మలోన; నా
కోరినకోర్కి నేఁడు దలకూడె; నరేశ్వర! యట్లుఁ గాక నీ
కోరినయట్టియవ్విధము గోరి యొనర్చుట నాదుభాగ్యసం
భారను గాదె? యీఅడుము భారము నాపయిఁ బెట్టి నెమ్మదిఁ."

వ. అని పలికిన సంతసిల్లి కుంతిభోజుండు దుర్వాసున కక్కన్నియం జూపి
యిట్టనియె. 318

క. ఈ పిన్నది నాకూఁతురు
తాపసజనముఖ్య! మిమ్ముఁ దాఁ గొలువంగా
నోపును నని పూనెం; బసి
పాప సుఁడీ; కినుక లేక పనిగొనవలయున్. 319

—: కుంతి దుర్వాసునకుఁ బరిచర్య సేయుట :—

చ. ఎఱుఁగక తప్పుగా మెలఁగెనేనియు, దానికి సైఁచి, నేరుపుల్
గఱపి ప్రియంబుతోఁ గొలువు గైకొనఁగాఁ దగు మీకు; బాలురుం,
దెఱవలు, వృద్ధులుం, దమకుఁ దెల్లమ, దప్పులు సేసిరేనియున్
మఱతురు గాని యల్లరు సమగ్రశమాన్వితు లైనతాపసుల్." 320

వ. అని యప్పగించి యప్పార్థివేంద్రుం డప్పు డమ్మునీంద్రునకుఁ జంద్ర
కాధవళంబైన సౌధంబునందు శయనాసన ప్రముఖోపకరణంబులు,
నభిమతాహార సాధనద్రవ్యంబులు నాయితంబులు సేయించి తాను
సంతసంబున నూఱడి యుండె; నంత, 321

క. భావించి నాఁడునాఁటికి
వేవిధముల మిగుల భక్తివినయంబులతో
దైవోపచారముల భూ
దేవోత్తముఁ గొల్చెఁ గుంతిదేవి నియత యై. 322

సీ. అతఁడును దద్భావ మరయంగ మదిఁ గోరి
రూపించి యిటపోయి రేప వత్తు
నని పోయి నడికిరే యర్థితోఁ జనుదెంచు,
రేయి వచ్చెద నని రేప వచ్చు;
నేప్రొద్దు వచ్చిన నింతి యప్పుడ భక్ష్య
భోజ్యముల్ గ్రొత్తపొల్పుగ నొనర్చు;
నెయ్యది గోరిన నిచ్చకు రాఁ బెట్టు;
నలయదు మదిలైన నలుగ దెపుడు;

ఆ. ననుదినంబు భోజుఁ డాత్మజఁ బిల్చి త
ద్వ్యర్థనంబు నడుగ, వనజముఖియుఁ
దాను గొల్పు తెఱుఁగుఁ, దాపసవరునిచం
దమును జెప్పుచుండుఁ దండ్రి యలర. 323

వ. అంత నొక్క సంవత్సరంబు పరిపూర్ణంబయినఁ బ్రీతుం డై దుర్వా
సుండు గుంతిం జూచి "నీచేసిన యారాధనంబునకు మెచ్చితి! నభి
మతంబు లిచ్చెద; నడుగు" మనిన నమ్మానిని కృతాంజలి యై

"మీరు నావలనం బ్రహ్మన్నుల రయితిరి; దీనికి మా తండ్రియుం గరంబు నలరు; నింతియ చాలు; నొం డేల" యనిన నతం "డల్లేని నిది యొక్క మంత్రంబు గైకొను; దీనంజేసి యెయ్యేనివేల్పు నాహ్వా నంబు నేసెద, వప్పేల్పు సనుదెంచి నీవళంబున నుండు" ననిన నొం డన వెఱచి, కుంతియుం బ్రసాదం బనియె; నమ్మునీంద్రుండు ధ్యా నిమ్మంత్రంబు విధియుక్తంబుగా నుపదేశించి, కుంతిభోజుని దీవించి నిజేచ్ఛం జనియె; నంత గొంతకాలంబునకు. 324

మ. "మదిఁ గారుణ్యము సేసి విప్రవరుఁ డీమంత్రంబు నా కిచ్చె; నే నిది యేచందమొ చూతు" నంచు నొకనాఁ డిచ్చన్ ఋతుస్నాతయై సుదతీరత్నము పూర్వశైలతటిపై శోభిల్లు తిగ్మాంశుఁ జూ చి దళత్పద్మము మాడ్కి నుల్లసిత మై చిత్తంబు రాగిల్లఁగన్. 325

వ. సహజకుండలకవచాభిరామం బయిన తదీయమూర్తివిభవంబున కోటు వడి "దేవా! భవత్సమానసుందరుం డగు నందనుం గరుణింపవే" యని మనంబునం గోరుచు మంత్రోచ్చారణంబు సేయుచున్నఁ, బ్రభాక రుండును నిజయోగబలంబున మూర్త్యంతరంబు ధరియించి కుంతి పాలికిం జనుదెంచి మధురస్వనంబున. 326

తే. "అబల! నీమంత్రబలమున నరుగుదెంచి
నాఁడ; నీవాఁడ నైతి; మనఃప్రియంబు
నీకు నెయ్యది యొనరింతు? నిజము చెపుమ;"
యనినఁ బడఁతి యిట్లనుఁ గమలాప్తతోడ. 327

తే. "కార్య మొక్కటియునులేదు; కౌతుకమున
నేను మంత్రంబు నొడివితి; నింతమాత్రఁ
జేసి నీకు నిచ్చటికి విచ్చేయ నేల?
దివికి నరుగుము క్రమ్మటి దేవ! నీవు." 328

వ. అనిన దానికి సూర్యుం డిట్లనియె. 329

ఉ. "క్రమ్మటి పోక తప్పెడినె? కామిని! యే మని మున్ను నీవు చి త్తమ్మునఁ గోరి, తవ్విధము దప్పక యిప్పుడుఁ బల్క రాదె? తే

జమ్మున మత్సమానుఁ గవచస్ఫుటకుండలమండితాంగు స
త్సమ్మతుఁ బుత్రుఁ గోరవె, నిజమ్మగ నావలనం దలోదరీ? 330

వ. కావున నిప్పుడు మదీయసమాగమంబున కొడంబడుము; నీకోరినయట్టి తనయుండు జనియించు; నిట్లు సేయనివాఁడు నిన్నును భవజ్జనకుని భస్మంబు సేయుదు; మఱియు నీదైనశీలవృత్తంబు లెఱుంగక మంత్రంబు గర్వంబునంజేసి నీ కుపదేశించిన తాపసు నీకుణంబ నిర్ద హింతు; నిదె యంబరంబుననుండి యింద్రాదిసురవరులు నీకతమ్మునఁ జిక్కువడి యున్న నన్ను నవ్వుచున్న వారు; వీరిం జూడు;" మని దివ్యదృష్టి యిచ్చినం జూచి, కుంతిభోజ రాజనందన డెందంబున నమందలజ్జావివశ యగుచు దినేశ్వరున కిట్లనియె. 331

క. "నను నిచ్చటకుం గర్తలు
జననియు జనకుండుఁ గాక చనునే నాకున్
వనితాధర్మ్మవు విడువఁగ?
ననఘా! యిట్లయిన ధర్మ్మహానియుఁ గాదే? 332

ఆ. మంత్రబల మెఱుంగ మదిఁ గోరి తప్పు సే
సితి; మహాత్మ! దీనిఁ జెట్ట గాఁగ
నవధరింప, కెట్టులైన నాబాల్యంబుఁ
గరుణ సైఁప వలయుఁ; గమలమిత్ర! 333

వ. అని మఱియు ననేకప్రకారంబుల దివాకరు ననునయించి, యెట్లునుం గ్రమ్మఱింప నేరక, దన కారణంబునఁ గులంబునకును, గురుజనంబు లకును, నపాయం బగు ననియునుం దలపోసి, భయంబు మిగులఁ దెగువ సేసి యతనికిట్లనియె. 334

చ. "ముదము దలిర్ప బంధుజనమున్, గురువర్గముఁ గూడి రూఢి నొ
ప్పిదముగ ధర్మ్మమార్గమునఁ బెండిలి సేయఁగఁ బిమ్మటన్ సము
న్మదరసకేళి లీలకుఁ గ్రమం బగుఁ గాక; కులంబుఁ, శీలమున్
వదలి వధూజనంబులకు వచ్చునె యిమ్మెయి వేడ్క సల్పఁగన్? 335

క. బంధుమతి నైన నను ని
ర్బంధము మెయి ధర్మ్మబాహ్యపథమున నలినీ

బాంధవ! యిటు సేయుటయు న
మంథరభవదీయకీర్తి మలినము గాదే? 336

చ. జగములయందు ధర్మవును సత్యము నీయది గాదె? యెందు నే
తగవులు నీయెఱుంగని విధంబులె? యిట్టిది నీదు బుద్ధికిం
దగ వగునేని మార్పులుకుదాననె యే? నగుఁ గాక; నీకు నిం
పగుతెఱఁ గాచరింపు మిట; యీవల నయ్యెడునింద కోర్చెదన్."

సీ. అనుటయు నద్దేవుఁ డయ్యిందుముఖిఁ జూచి
తల్లిదండ్రులును, బాంధవజనంబు
గారు ని న్నీగికిఁ గర్తలు; విను నీవ
యొడయురాలవు నీకు నుజ్జ్వలాంగి;
కామంబు లెల్లను గామించి పొందుట
నయ్యేఁ గన్యాశబ్ద; మట్లుగాన
యాత్మతంత్రత్వంబునందు నీ కెగ్గు లేఁ
దే నేల నడతు ధర్మేతరంబు;

ఆ. మత్సమాగమమున మదిరాక్షి! నీదు క
న్యావ్రతంబు చెడదు; నందనుండు
నధిక తేజుఁ డుదయ మగు; నిన్ను లోకనిం
దయును బొందకుండుఁ దథ్య మబల!" 338

—: కుంతి సూర్యునివరంబున గర్భంబు దాల్చి కర్ణుం గాంచుట :—

వ. అని యెడంబటీచి సూర్యుండు దత్సమాగమంబునం బ్రీతుం డయి, దానికి గర్భాధానంబు సేసి, గగనంబున కరిగె; నంతఁ బూర్వపక్షంబు నందు జంద్రుండునుం బోలె గర్భంబును గ్రమంబునఁ బ్రవర్ధనంబు నొందుచు, నభివ్యక్తం బయ్యును, బ్రభాకరుమహిమంజేసి లోకవిదితంబు గాకుండెఁ; దత్ప్రకారంబు దాదికూఁతు రొక్కతియ యెఱుంగు; నిట్లు వర్ధిల్లుచుం బది యగు మాసంబున నొక్కనాఁటి నిశాసమయంబునం గన్యాంతఃపురంబునందు. 339

ఆ. కొడుకుఁ గనియె సహజకుండలకవచాభి
రాము, విమలకమలకోమలాక్షు;

దీర్ఘ బాహుఁ, జారుదృఢదేహుఁ, దరుణార్క-
తేజుఁ గుంతిభోజరాజపుత్రి. 340

వ. ఇట్లు జనియించిన యర్భకుం జూచి లోకాపవాదభయంబునకుం గలరి వెఱచి, యాతుణంబ యొక్క మంజూషలోన నశ్వాలకుం బదిలంబుగా నిడి, దాని నతి దృఢంబుగాఁ దెప్పం బంధించి, సఖియునుం దానును గొని చని, పురసమీపగతంబయిన యశ్వనదీప్రవాహంబున విడిచి, కుంతి యెంతయు సంతాపంబున నిట్లని విలాపంబు సేసె. 341

ఆ. "కొడుక ! నిన్నుఁ గాంచు కొఱతనోములఁ గాని
పెంచి గారవించి పేర్మినీదు
ప్రోపుఁ గుడువఁ గాంచు పుణ్యంబు దుది ముట్ట
నేల చేయ నైతి నేను గుట్టు ? 342

మ. నెఱయం బున్నమచందురుం జెనయు నీనెమ్మోమునం దియ్య మై
చిఱునవ్వొప్పఁగఁ జూడ నీక, పులకల్ సెల్వొంద నిన్ గ్రుచ్చి య
క్కఱ దీఱం బొరి నక్కునం గరము వీఁకం జేర్పనీ, కిమ్మొయిఁ
వఱదం ద్రోవఁగ జేసెనే యకట దైవం ? బెందుఁ జొత్తుఁ సుతా !

ఉ. ఏ పుణ్యసతికి నీ వింకఁ జేపడి యెదో ?
యెక్కడఁ బడి యెదో ? యే నెఱుంగ;
నేపుణ్యురాలొకో యిప్పుడు నినుఁ బుత్తుఁ
గాఁ గాంచుటకు మేలికలను గాంచు;
లలిఁ బాంసుకేళి నల్లన నడపాడుచు
నవ్యక్తమధురవాక్యామృతంబు
వీనుల్ఁ గురియుచు, వెడఁదగన్నులుఁ బిన్న
నవ్వును శుభలక్షణములు నమరఁ

ఆ. దేజరిల్లు నిన్నుఁ దెఱవ యెవ్వత యొక్కొ
యడర గ్రుచ్చి యురమునందుఁ జేర్చి,
వేడ్క మిగిలి వేనవేలభంగులఁ గొని
యాడి యాడి, ముద్దులాడుఁ గొడుక. 344

ఉ. లాలితయౌవనోజ్జ్వలవిలాసములం దులకించి, సుందరా
భీలవిచేష్టితం బమర, భీమ మనోభవసింహరేఖమై
వాలవె యింక నీ వెలమి, వామనిలోచన లంగజన్మ లీ
లాలస లై, విపక్షులు భయాలసు లై, ధృతి యేది చూడఁగన్.

ఆ. ఎచట నున్నవైన నెల్లప్పుడును నిన్నుఁ
గన్నులారఁ జూడఁ గాంచుఁ గాన,
తనయ! నిన్నుఁ గనిన తపనుండు గడు ధన్యుఁ
డయ్యె; మందభాగ్యు నైతి నేను. 346

చ. ఇనుఁ డటచేత మాటు వడు చెన్నఁడు గల్గునె? నిన్ను నెమ్మి నేఁ
గనియెదఁ గాక యింక నొకకాలమునం దయినం; దనూజ! నీ
వినుతశరీరభావమును, వీనుల సన్మణికుండలంబులున్,
ఘనతరవజ్రవర్మముఁ బ్రకాశత నొందక యుండ నేర్చునే? 347

చ. దివి, భువి, నంతరిక్షమున, దిక్కుల, గావ్పున, నగ్నియందు, న
ర్ణవములయందు, ఘోరవిపినంబులయందును నీకు నెప్పుడున్
శివ మగుఁ గాక! దిక్పతులు, సిద్ధులు, సాధ్యులు, రుద్రు, లాశ్వినుల్
పవనులుఁ బుత్ర! నిన్నుఁ గృపఁ బాయక యెప్పుడుఁ గాచు
చుండెదురు."

వ. అని యేడ్చుచుం గుంతి యచ్చటం దడయ వెఱచి గూఢప్రకారం
బునఁ గన్యాంతఃపురంబునకు వచ్చి. యెప్పటియట్ల వర్తిల్లు చుండె;
నట మంజూషయు నశ్వనదీప్రవాహవేగంబునఁ జర్మణ్వతికిం జని,
యందుండి యమునాగతం బై, యట చని భాగీరథిం బడి, సూత
విషయంబున్నం బంపానగరంబుచేరువ నరుగుచుండె; నా సమయంబున.

సీ. ధృతరాష్ట్రసఖుఁ డైన యతిరథుం డను సూతుఁ
డతివలుఁ దానును నతినిభూతి
గంగలో జలకేళిసంగతుం డై యుండి,
తుంగతరంగానుషంగవశతఁ
జనుదెంచు మంజూషఁ గని, కడు వేడుకఁ
దన పరిజనములఁ బనిచి పట్టి

తెప్పించి, ధీయుక్తి యొప్ప నేకతమున
నప్పెట్టె దెఱచి, తా నప్పు డందు

ఆ. వినుత హేమకవచుఁ, గనకకుండలధరు,
ననుపమానతేజు, ఘనుఁ గుమారుఁ
గని, మనంబులోన ననయంబు విస్మయం
బొనర గ్రుచ్చి యెత్తికొని ముదమున. 350

వ. తన జీవితేశ్వరి యైన రాధకుం జూపి యిట్లనియె. 351

క. "అనపత్యుల మైన మనకు
మన పాలిటివేలు పిక్కుమారుని నిచ్చెఁ;
వనజాక్షి! వీఁడు మానుష
జనితుఁడు గాఁ; డరయ దేవసంభవుఁడు సుమీ." 352

క. అని దానిచేతి కిచ్చినఁ
గొని యురమునఁ నదిమ్ము నదిమికొనియెఁ గొడుకు; న
వ్వనితకుఁ బాలెంత తెఱం
గునఁ జన్నులు సేఁపె నపుడు గూరిమి పేర్మిన్. 353

వ. ఇట్లా దంపతులు ప్రమోదసంపద సొంపారం గుమారుం గొని నిజ
మందిరంబున కరిగి; యాత్మీయకులోచితంబు లగు జాతకర్మాది-
సంస్కారంబు లొనరించి, సహజకుండలాలంకృతకర్ణుం డగుటంజేసి
వానిఁ గర్ణుం డని నామకరణంబు సేసి; రంత. 354

క. వసువర్మధరుఁడు గావున
వసుసేనుం డనఁగ బేరు వాని కిడిరి పెం
పెసఁగఁగ భూసురు; లాది
త్యస్తుతుం డిబ్భంగి సూతతనయుం డయ్యెన్. 355

వ. తద్వృత్తాంతం బంతయుఁ గుంతి తన యాప్తచరులవలన విని శిథిల-
కృతసంతాపయయి యుండె; నతిరథుండును సంప్రాప్తయౌవనుం
డైన కొడుకుం దోడ్కొని వచ్చి, ద్రోణాచార్యులయొద్ద నస్త్రశిక్ష
సేయం బెట్టె; నాసూతసూనుండు మఱియుఁ గృపాచార్యులవలనను,
జామదగ్న్యవలనను వివిధాస్త్రలాభంబు నొంది, క్రమంబున దుర్యో-

ధనుతోడ బద్ధసంఖ్యం డై యతనికి ప్రియంబు సేయం దివిరి, దివిజ
రాజనందనుతో మచ్చరించుచుఁ బాండవుల కప్రియంబు సేయు
చుండె. 356

ఉ. ఆతనియస్త్ర వీర్యము, సమంచితకుండల వజ్రవర్మవి
ఖ్యాతియు నాత్మలోఁ దలఁచి కౌరవనాయక! ధర్మసూనుఁడున్
భీతమనస్కుఁ డై, యతఁ డ భేద్యబలుం డని సంతతంబు ధై
ర్యాతిశయంబు డించి, హృదయవ్యథఁ బొందుచు నుండెఁ గానలోన్.

వ. అయ్యుధిష్ఠిరునకుఁ ప్రియం బాచరింపఁ గోరి, కవచకుండలంబులు
గొనుటకై పురందరుం డొక్కనాఁడు బ్రాహ్మణరూపంబునం జని;
మధ్యాహ్నసమయంబునఁ గర్ణుండు సూర్యోపాస్తి సేయు చుండి
బ్రాహ్మణులకు నభీప్సితంబు లిచ్చుతఱిం గని, భిక్షాం దేహి యను
టయుఁ గర్ణుం డతని కిట్లనియె. 358

చ. "అలసవిలాసలాలసరసాన్విత లైన నితంబినీజనుల్
వలసిన, భూరి విస్ఫురితవస్తుసమగ్రము లైన గ్రామముల్
వలసినఁ గోరు; మిచ్చెద ధ్రువంబుగ" నావుడు నాతఁ డిట్లనున్.

క. "వినుమివి యెయ్యవియును నా
కు నభీష్టము గావు; నీమ కుండలములు స
ద్వినుత! కవచంబు నిచ్చినఁ
గొనియెద నీ నోపుదేని, గుణరత్ననిధీ!" 360

చ. అనవుడు, గర్ణుఁ డిట్లనియె "నక్కట! యేను విశిష్టవస్తువుల్
గొనకొని యిత్తు నాఁగ నిటు గోరెదు నీవు దలంప కప్రయో
జన మగువాని; భూమిసురసత్తమ! యెంతయు బేలవై తి; ము
న్నెన్నయఁగ నిట్టు లెవ్వరును నెయ్యెడ వేఁడిరె యిజ్జగంబులన్?

క. కుండలములుఁ గవచము న
ట్టుండఁగ ని; మ్మనఘ! వేఁడు మొండుధనంబుల్;
నిండింతు నీమనోరథ;
మెం డేమియు ననకు మింక నూర్జితచరితా!" 362

వ. అనిన నతం డెవ్విధంబున నొడంబడక, కవచకుండలంబులయందు బద్ధాభిలాషుండయి పలికినఁ, గర్ణుండు వానిం బ్రార్థించియుఁ, బుజ్జగించియు, నవేకమణికనకాదిద్రవ్యంబులు నివేదించియు, నెట్లును నొడంబఱుప నేరక యతని కిట్లనియె. 363

తే. "సహజములు నాకు నిక్కవచంబుఁ గుండలములు; నివి లేక యున్న నే సమరభూమిఁ
గడిఁదిశత్రులచేత భంగంబు వడుదు.;
గాన యీఁ జాల నయ్యెద వీని నేను. 364

క. నానాజనపదబహుళము,
నానాధనసంయుతంబు, నారాజ్యము స
మ్మానంబున నిచ్చెదఁ; గొన
వే ననుఁ గారింప కింక విప్రవరేణ్యా!" 365

వ. అనియును నతనియందు సుముఖత్వంబు గానక, కానీనుండు దరహసితాననుం డగుచు; గృతకభూసురు నుపలక్షించి యిట్లనియె. 366

చ. "ఎఱిఁగితి నేను నిన్ను; విభుఁ డేంద్రుఁడ వీవుఁ; జగత్త్రయంబు గ్రచ్చఱ భవదీయరక్షణమునందు వెలుంగుచు నుండు; నిట్టి నిన్నఱవుగ నేను వేఁడుకొన యుక్తుఁడఁగాక, మొఱంగి నన్ను నక్కఱపడి నీవు వేఁడు టిది గర్జమె? నిర్జితదైత్య! చెప్పుమా?" 367

తే. అనిన నింద్రుఁ డిట్లనియె "మీయయ్య పద్మ
హితుఁడు మున్నింత సెప్పె నీ కిష్ట మెఱఁగఁ;
గాన యెఱిఁగితి; నీ వింకఁ గడప నేల
యనఘ! మాబోఁటులకుఁ బ్రియం బైనపనికి?" 368

వ. అనిన రాధేయుండు "దేవా! యట్లయిన నఖిలశత్రుఘాతిని యైన నీయమోఘశక్తి నాకుం గృప సేసి, కవచకుండలంబులు గొను" మని నంబాకశాసనుం డిట్లనియె. 369

ఉ. "ఇచ్చెద శక్తి నీకు; వినుమేర్పడ; నాజి మదీయశత్రులం
గ్రచ్చఱఁ జంపి చంపి యది గ్రమ్మఱి చేతికి వచ్చు చుండు; నీ

కిచ్చుట యట్లు గాదు; భువి నెందును దుర్జయుఁ డైన నీ రిపుం
జెచ్చెరఁ దున్మ నొక్కరున చేకుఱు; నన్ను భజించుఁ గ్రమ్మఱఁ.

వ. ఇట్టిది సమయంబుగాఁ బరిగ్రహింపు" మనినఁ గర్ణుండు నాకుం గల
పగతుం డొక్కరుండ; వానిఁ వధియించుటయ మదీయమనోరథం"
బనుటయుఁ బురందరుండు దరహసితవదనుం డై. 371

ఉ. "నీయభిలాష మేము మది నిక్క మెఱుంగుదు; నుగ్రశౌర్యఁ, దే
జోయుతుఁ, బార్థు నోర్తు నని చూచెదు; నీ కది యేల తీరు? రా
ధేయ! దయావిధేయుఁడు, విధేయజగత్త్రయుఁ, డవ్యయుండు, నా
రాయణుఁ డమ్మహాత్మునకు రక్షకుఁ; డేరికి వాఁడు సాధ్యుఁడే?"

వ. అనినం దపన నందనుఁ "డది యట్లుండె; నాకు సహాజం బైన కవ
చంబు నొలిచి యిచ్చిన మదీయదేహంబు గరంబు వికృతం బగు; నది
యే మని యవధరించిన" తనిన నింద్రుండు "నీశరీరంబు భవజ్జనకుం
డైన యరుణకిరణువర్ణం బెట్టిదట్టిదీప్తిం జెలువొందు"నని పలికి వానికి
నమోఘశక్తి యొసంగి, "దీని నాపత్కా లంబునం దక్కఁ బెఱయ
ప్పుడు ప్రయోగించిన నీకు నపాయం బగు" నన చెప్పెఁ; దదనంత
రంబ యవ్వీరుండు గవచకుండలంబులం బుచ్చి యతని కిచ్చి. 373

చ. అలఘుసితాతశస్త్రమున నంగము లన్నియు నిర్వికారుఁ డై
యొలుపఁ దొడంగినట్టియెడ "హో" యని కిన్నరయక్షసిద్ధసా
ధ్యులు దివినుండి యార్చుచును దూర్యరవంబు సెలంగ నద్భుతం
బెలయఁగఁ బుష్పవృష్టిఁ గురియించిరి కర్ణపయిం బ్రియంబునన్. 374

వ. ఇట్లు సూతపుత్రుని వికృతగాత్రుం జేసి వాసవుండు ప్రమదవికాస
భాసితుండగుచు నిజలోకంబున కరిగెఁ; దద్వృత్తాంతంబంతయు విని
కౌంతేయు లత్యంత సంతోషంబునం బొందలిరి; గాంధారేయులు
దుఃఖవిదారితహృదయు లై" రని యిట్లు కుండలాహరణంబు సవిస్త
రంబుగాఁ జెప్పిన విని జనమేజయుండు వైశంపాయనున కిట్లనియె.

క. "అనయము గుస్తర మగున
వ్వనవాసము నిస్తరించి, ద్వాదశవర్షం

బునకడపట నేమివిధం
బొనరించిరి ? మత్పితామహుల్ మునినాథా." 376

వ. అనిన నమ్మహీపతి కమ్మహీదేవుం డిట్లనియె "నట్లు మార్కండేయు వలనఁ బుణ్యకథలు విని పాండవు లనంతరంబ క్రమ్మఱి ద్వైతవనంబున కరిగి, యందున్న యెడ నొక్కనాఁడు సుఖాసీనుం డయి యున్న ధర్మరాజు పాలికి నొక బ్రాహ్మణుండు సంభ్రమంబున బఱతెంచి యిట్లనియె.

—: ధర్మరాజు బ్రాహ్మణుని యరణి దెచ్చుటకుఁ బోవుట :—

క. "తరుశాఖఁ దగిల్చిన నా
యరణి యొకమృగంబు వచ్చి యతిరయమున న
త్తరువున నొరసి కొనంగా
ధరణీశ్వర ! తగిలెఁ జువ్వె తచ్చృంగమునన్. 378

క. దానిఁ గొని పఱచె నమ్మృగ;
మానతనృపలోక ! నాకు నయ్యరణిఁ దగం
గా నిపుడు దేరఁ బనుపవె
భూనుత ! నిత్యవిధి లోపమునఁ జన కుండఁ." 379

చ. అనవుడు నాతఁడంబ మనుజాధిపుఁ డుద్ధతచాపహస్తుఁ డై
యనుజులుఁ దాను నెంతయు రయంబున నాహరిణేంద్రుపజ్జఁ గై
కొని చని కూడ మట్టి, మెఱుఁగుల్ నిగుడం బటుసాయకంబు లే
సిన నొకయమ్మృ నమ్మృగము సెందద చేరద యద్భుతంబుగన్.

వ. అదియును వాది నతిదూరంబుగా నెలయించికొని చని యొక్క ఘోరవిపినంబున నదృశ్యం బైన, నయ్యత్నంబు విఫలం బగుటకు విషాదంబు నొందుచు, నయ్యేవురు నతిశ్రాంతు లై శీతలచ్ఛాయం బగ్గు నొక్క వటమహీరుహంబుక్రింద విశ్రమించి; రప్పుడు నకులుండు ధర్మనందనున కిట్లనియె. 381

క. "కులశీలోన్నతియు, విని
శ్చలకరుచారతియు, ధర్మసంగ్రహమతియుం
గల మనకు నివ్విధంబున
నలజడి వచ్చుటకు మూల మది యెయ్యదియో ?" 382

వ; అనిన నమ్మహాప్రాజ్ఞుం డతని కి ట్లనియె. 383

క. "వినుము సుఖమునకు దుఃఖం
బునకుం గారణము దనదు పూర్వకృతం బై
చను కర్మమ; కారణ మిదే
యని యన్యము గలుగ నేర దం ద్రొక్కటియుఁ." 384

వ. అనుటయు భీమసేనుండు నకులున కి ట్లనియె. 385

ఆ. "ప్రాతికామి వోయి పాంచాలిఁ గొలువులో
పలికిఁ దేర, నపుడ యలుక యెసఁగ
నాంబికేయసుతుల నందఱఁ దునుమ కే
నునికి నిట్టి యొడరు మనకుఁ బుట్టె." 386

చ. అనవుడు నర్జునుం డనియె "నాసభ సూతసుతుండు పేర్చి ప
ల్కిన పటువాక్యముల్ వినియుఁ గిన్కకుఁ బూనక యేఁ దొలంగి కా
ననమున కేట్లు కాతరజనంబులచాడ్పున నేఁగు దెంచుటన్,
మనకు దురంతదుఃఖములు మానక పైకొని వచ్చేఁ దమ్ముఁడా." 387

వ. అనిన యనంతరంబ సహదేవు డి ట్లనియె. 388

ఆ. "దుష్టశీలుఁ డైన దుర్ధ్యూతపరుని గాం
ధారుఁ బట్టి యేను దడయ కపుడ
తునుమ కునికి, నిట్టిదుర్దశ పాలైతి
మనఘ! మనము కాననాంతరముల." 389

వ. అని యి ట్లండఱు నన్ని తెఱంగులఁ బలుకుచుండ నజాతశత్రుండు నకులుంజూచి, "భవదీయసోదరు లత్యంతపిపాసితు లైనవారు; నీ విమ్మహీధ్రుహం బెక్కి జలంబు లున్న యెడ యరయు" మనిన నతండును దద్వచనానురూపంబున నవ్వనస్పతిసమారోహణంబు సేసి, డెసలు గలయం బరికించి దూరంబున సలిలంబు లున్న వని యన్న కెఱింగించిన నతం "డట్లేని నీవ పోయి జలపానంబు సేసి, మాకును జలంబులు గొని ర"మ్మని పనుచుటయును, మాద్రేయుండు వృక్షావతీర్ణుం డయి రయంబునం జని, ముందట నతిమనోహారం బగు తటాకంబుఁ గని, జలంబులు ద్రావం బోయిన నొక్క యశరీరభూతం బి ట్లనియె. 390

—: నకులాదులు యక్షుని నిరాకరించి నీరు ద్రావి మూర్ఛితు లగుట :—

క. "ఓయన్న ! యీ తటాకము
నాయది; నీ వీజలము గొనఁగ వలతేనిఁ
నాయడిగిన ప్రశ్నములకు
ధీయుత ! యుత్తరము లిమ్ము తేటపడంగాన్." 391

క. అనుటయు నవ్వాక్యముదెస
ననాదరము సేసి, నకులుఁ డక్కొలనం ది
య్యనినీరు ద్రావి నిశ్చే
తనుఁ డై యక్షుణమ పడియెఁ ద త్తీరమునన్. 392

వ. అట ధర్మపుత్రుండు సహదేవుం గనుంగొని "నకులుండు జలంబులకుం జని తడసె; నీ వరిగి యతనిం దోడ్కొని జలంబులు గొనుచు ర"మ్మని పనిచిన నక్కుమారుం డతిశీఘ్రగమనంబునంబోయి, బద్మినీతీరంబునం బడియున్న యన్న తెఱంగుఁ జూచి, విస్మయశోకవ్యాకులహృదయుం డగుచు "నిది యేమినిమిత్తంబున నయ్యెనో" యని యూహిం చుచుఁ, బెల్లడరు తృష్ణాభరంబు సహింప నోపక, జలంబుల దెస నాసఁ జేసి కొలనికిఁ డిగ్గిన నెప్పటిభూతం బి ట్లనియె. 393

ఆ. "అనఘ! యీజలాశయము నాయధీనంబు;
సాహసంబుఁ జేసి చనదు చొరఁగ;
నాదు ప్రశ్నములకు నలి నుత్తరము లిచ్చి,
వారి గొనుము నీవు వలసినట్లు." 394

క. అనిన నది యాదరింపక
ఘనుఁ డాసలిలములు ద్రావి, గ్రక్కున విష మె
క్కినవిధమునఁ బరవశుఁ డై
ఘనసాలమహీరుహంబుకరణిం బడియెన్. 395

సీ. అంత నంతకసూనుఁ డంతరంగంబున
సంతాప మెసఁగ వాసవతనూజుఁ
గనుఁగొని "యన్న నీయనుఁగుఁదమ్ములు వోయి
కడుఁదడవయ్యె; నిక్కాననమున

సెయ్యది వుట్టెనో? చయ్యన నీ వేఁగి
వారినిఁ దోడ్కొనిఁ వారి గొనుచుఁ
జనుదెమ్మ" నావుడు ఘనభుజుం డధికర
యంబున నరిగి, జలాశయంబు

ఆ. తీరభూమిఁ బడినవారి, నవారిత
మహితశౌర్యధనుల, మాద్రిసుతులఁ
జూచి, విస్మయైకగోచరుఁ డై సవ్య
సాచి యుల్లమున విషాద మడర. 396

క. నాలుగుదిక్కులుఁ గనుఁగొని,
యాలో నెవ్వరిని గాన, కత్యంతపిపా
సాలసుఁ డై సలిలంబులు
గ్రోలఁగ సమఁట్టి యెయ్యఁ గొలనికిఁ డాసెన్. 397

వ. డాయుటయు నాకాశవాణి యి ట్లవి వీతెంచె. 398

మ. "ఒలిమిం జొచ్చిన నెట్టివారి కయినం బ్రాణంబుపై వచ్చు; నీ
సలిలావాసము మత్పరిగ్రహము: తృష్ణాచ్ఛేద మొందం జలం
బులు ద్రావఁ వలతేనిఁ, బ్రశ్నములకుం బొం దొందఁగా నుత్తరం
బులు నా కి" మ్మనుడుఁ మనంబునఁ బృథాపుత్రుండు సక్రోధుఁ డై.

ఉ. "ముచ్చిలి నిల్చి దుర్వచనముల్ పచరించినఁ జెల్ల నిత్తునే?
చెచ్చెర నీయెలుం గడఁగఁ జేసెద నిప్పుడు సూడు" మంచు వి
వ్వచ్చుఁడు శల్దభేదిశరవర్గముఁ దద్వచనంబు చక్కటిం
గ్రచ్చఱ నించె మౌర్వీరవకంపితసర్వదిగంతరాళుఁ డై. 400

ఆ. ఇట్టు లేయుటయును నెప్పటివాక్యంబు
మటియు వినఁగఁబడిన, మఘవసూనుఁ
డలసి కొలను సొచ్చి, యంబుపానము సేసి
యిలకు నొఱగె వివశహృదయుఁడగుచు. 401

వ. తదనంతరంబ యధ్ధిరుండు భీమసేను నాలోకించి "కవలును గవ్వడి
యును నింత వడి దడయుటకు నిమిత్తం బయ్యెదియో? నీవు నరుగు"
మనినం గిమ్మీరవైరి మారుతజవంబున నమ్మువ్వురు జనినచొప్పునం

జని పద్మాకరకూలంబునందు నిద్రా వివశులుంబోలెఁ బడి యున్న
తమ్ములం గని దుఃఖితుం డై. 402

తరలము. "ఇది మనుష్యకృతంబు గాదు; సురేంద్రకిన్నరపన్నగ
త్రిదశనిర్మిత మైన కర్మము; దీని నెంతయు నేర్చుడం.
బిదపఁ జూచెదఁ గాక" యంచు విభీతిమారుఁడు నీరువ
ట్టొదవఁ దత్సలిలాశయంబు సమీపస్థుకుం డయి చొచ్చినఁ.

వ. అంతరిక్షగోచరం బైన వచనం బిట్లని వినంబడియె "నయ్యా! నీ
వి ట్లేరి సాహసంబు సేసె? దిక్కొలను మత్పూర్వపరిగ్రహంబు; నీ
వోపుదేని నాయడిగిన యర్థంబులకు నుత్తరంబు లిచ్చి, జలంబులు
ద్రావు" మని నప్పలుకులు గైకొనక వృకోదరుండు నిపీతసలిలుం
డై యచ్చోటన మూర్ఛితుం డై పడియె; నిట పాండవాగ్రజుండు.

క. తమ్ములు నలుగురు నొక్కట
నమ్మొయి మసలుటకు నాత్మ నత్యంతవిషా
దమ్మొలయ సమీపితుఁ డై
క్రమ్మఱ నమ్మార్గ మపుడు గైకొని నడచెన్. 405

సీ. అపగతజనశబ్ద మై, యనభివ్యక్త
మార్గ మై, యవిరళదుర్గశైల
తరుగుల్మవల్లీవితాన మై, గజసింహ
శరభశార్దూలసూకరలులాయ
బహుళ మై, బహువిధపక్షికోలాహల
భయద మై కడుఁ బర పయిన యడవి
నమ్మునుల వెఱకుచు ననఘుండు సని కాంచెఁ
గమలాకరంబుతీరమునఁ బడిన

ఆ. వారిఁ, బూరువంశవరుల, భీమార్జున
యముల, నమితబలుల, విమలమతులఁ,
బ్రభయపతితలోక పాలసంకాశుల,
భూరిపుణ్యనిధుల, వీరవరుల. 406

మ. కని డెందంబునఁ దల్లడం బడర, దీర్ఘశ్వాసవైవర్ణ్యముల్
దనుకం దాల్మి చలింప, విస్మయపరీతస్వాంతుఁ డై, శోకబా
ష్పనిరుద్ధాకులలోచనుం డగుచు, మూర్ఛల్ వైకొనం గొంతసే
పు నరేంద్రోత్తముఁ డుండెఁ జిత్రమునరూపుంబోలెఁ దా నచ్చటన్.

వ. పదంపడి డెందంబు ధృతిపొందున నిడికొని, యతం డన్నలువుర
సుపలక్షించి, నలుదెసలుం బరికించి యాత్మగతంబున. 408

తే. "ఱరులు వచ్చినచొప్పు లే; దరిగినట్టి
చొప్పు లేదు; పెనంగినచొప్పు లేదు;
ఘనభుజులయంగకంబులు గనుఁగొనంగ
సకతము; తేలయొక్కొ యిట్లయిరి వీరు? 409

ఉ. క్రూరుఁడు ధార్తరాష్ట్రుఁ డతికుత్సితుఁ; డెంతయుఁ బాపబుద్ధి; గాం
ధారుఁడు పెక్కుమాయలకుఁ దావల; మక్కట! యద్దురాత్మకుల్
వారక యెద్దియేని యొకవంచన మై నిటు సేసిరొక్కొ? యె
వ్వారలు నాత్మ నమ్ముదురె వక్రవిచారులఁ బాపకారులన్? 410

క. వదనంబుల తెలివియుఁ, గర
పరుచియుం జెడదు; వీరు వడుటకుఁ గత మీ
యుదకము విష దిగ్ధం బని
మదిఁ దలంపంబోల; దేమి మాయయొ యెఱుఁగన్. 411

చ. పుడమియు సర్వసంపదలుఁ బొల్పఱి వైరులపాలు సేసి, యీ
యడవికి వచ్చి భీకరమృగావలిపొత్తున నున్న వీరి వె
న్నడిగొని యిట్లు సేసెనె యనాథులఁబోలె విధాతృఁ; డింక నె
క్కడఁ జనువాఁడ? నేది గడగాఁ దరియింతు దురంతదుఃఖముల్?

సీ. పుత్రులు దుఃఖార్తిఁ బొగులుట కనిళంబుఁ
బొక్కుచు నున్న యప్పుణ్యచరిత
మ్మాతల్లి పాండునిమహిషి, నా కెదురుగా
వచ్చి, కౌఁగిటఁ జేర్చి "వత్స నాఁడు
దమ్ముఁగుఱ్ఱలు నీవుఁ దగ విపినంబున
కరిగితి; రిప్పు డయ్యనుజు లెందుఁ

జనిరి ? నీ వొక్కండ చనుదెంచి, తిది యేమి ?"
యనిన, నాయుమతోడ నకట ! యేమి 413

ఆ. యనఁగ నేర్చువాఁడ ? నాచార్యవిదురశాం
తనవక్పులు నను ముదంబుతోడఁ
గుశల మడిగిరేనిఁ గుశల మే మనువాఁడ ?
దలుఁగ రాని యెడరు దగిలె నాకు.''

వ. అని పెళ్కుదెఱంగుల వగచి, యాధర్మజుండు దప్పి కోర్వక నీళ్లు
ద్రావుట కై సరోవరంబులోనికి దిగుటయు, నళరీరభూతం బిట్లనియె:

మ. "విను మే నొక్కబకంబ; నిక్కొలను పృథ్వీనాథ ! నా సొమ్ము; నీ
యనుజుల్ మద్వచనంబు గైకొనక తోయాస్వాదు లై యివ్విధం
బునఁ ద్రాణచ్యుతిఁ బొంది; రీవును గడున్ మోహంబునన్ సాహసం
బునకుం జొచ్చిన నట్ల యయ్యెదు సుమీ ! మున్మాట్ట వారించితిన్.

క. ఏనడిగినయర్థములకు
భూనుత యుత్తరము లిచ్చి, పొలు పొంద, బయఃపానము సేయుము" నావుఁడు
నానిర్మలచరితుఁ డంబరాభిముఖుం డై. 416

వ. "అయ్యా ! నీవు బకరూపధరుండ వై యున్న రుద్రుండవో; పావకుండవో, పవనుండవో ? యట్లు గానినాఁడు కులపర్వతప్రతిము లయిన నాతమ్ములం బడఁద్రోచునట్టి బలంబు పులుఁగులకుం గలదె ? దేవాసురగంధర్వయక్షాదులకు దుర్జయు లై న యివ్వీరుల నిట్లు సేసి, నీవు గానివాఁడవపోలెం దొలంగి యున్నాఁడవు; నాకు నద్భుత భయకౌతుకంబు లొక్కటుం బొడమెడు; నీ వెవ్వండవు ? నీతలం పెయ్యది ? చెప్పి నా హృదయవేదన నపనయింపవే''యనిన నదృశ్య భూతం బి ట్లనియె, 417

ఆ. ''కౌరవేంద్ర ! బకమఁ గాను నే; విను మొక్క
యక్షవరుఁడ; నిచట నస్మదీయ
నికృతిఁ జేసి పడిరి నీతమ్ము లందఱు''
ననుచు సొక్షణంబ యతని యెదుర. 418.

మ. నిలిచెం దాళసముచ్ఛ్రితాంగుఁడు, మహానిర్ఘోషసంతర్జి తా
ఖిలభూతప్రకరుండు, దీర్ఘ విపులగ్రీవుండు, దంష్ట్రాసము
జ్జ్వలవక్త్రుండు, విరూపలోచనుఁడు, దీప్రస్ఫార తేజోఘనుం,
డలఘుం డాసరసీతటాగ్రమున సయ్యాతుండు ఘోరాకృతిన్. 419

వ. ఇట్లు నిలిచి కౌంతేయాగ్రజున కిట్లనియె. 420

క. "నాయనుమతి లేకుండఁగ
నీయుదకము ద్రావిరేని యెవ్వారైనఁ
ధీయుత! చత్తురు; నీ వటు
సేయవు, సమ్యగ్విచారశీలుఁడ వగుటఁ. 421

వ. కావున మదీయంబు లగు ప్రశ్నంబుల కుత్తరంబు సెప్పు" మనిన నతండు "మహాత్మా! నీ చిత్తంబునకు వచ్చునట్లుగాఁ జెప్ప నాబోఁటివానికి శక్యం బగునే? యైనను నానేర్చువిధంబునఁ జెప్పెద నడుగు" మనిన నయ్యక్షుం డిట్లనియె. 422

—: ధర్మరాజు యక్షప్రశ్నముల కుత్తరంబు లిచ్చుట :—

క. "దినకరు నెయ్యది నడపును?
దినకరు నెవ్వారు గొలిచి తిరుగుదు? రద్దే
వుని యస్తమించు ఠేమిట?
ననఘ! తదాధారభూత మది యెయ్యదియో?" 423

తే. అనిన ధర్మజుఁ డిట్లను "నజ్ఞహితుని
నడపు బ్రహ్మంబు; సురకోటి నడచుఁ గొలిచి;
ధర్మ్మచే నస్తమితుఁ డగుఁ దపనుఁ; డమ్మ
హాత్మునకు సత్య మాధార మంద్రు బుధులు." 424

వ. అనిన విని యక్షుం డిట్లనియె. 425

క. "ఏమిట శ్రోత్రియుఁడనఁ జను?
నేమిటఁ గడు మహిమవడయు నిమ్మొగఁ బురుషుం?
డేమిట సహాయయుతుఁ డగు?
నేమిట నగు బుద్ధిమంతుఁ డేర్పడఁ జెపుమా?" 426

వ. అనిన నతం డిట్లనియె. 427

క. "శ్రుతమువలన శ్రోత్రియుఁడగు;
నతులతపోయుక్తిఁ గడుమహత్త్వమువడయున్;
ధృతిచే సహాయయుతుఁ డగు;
నతిశయముగ బుద్ధిమంతుఁ డగు బుధసేవన్." 428

వ. అని చెప్పిన నప్పార్థివోత్తమున కప్పురుషుండు వెండియు నిట్లనియె.

తే. "ఏమికతమున భూదేవుఁ డెసఁగు దేవ
భావమున? నాతనికి సాధుభావ మెవ్వి
ధమున నగు? నసాధుత్వ మెద్దానఁ జెందు?
మానుషుం డగు నాతఁ డేదానఁ? జెప్పుమ" 430

చ. అనవుడు ధర్మజుం డనియె "నధ్యయనంబున దేవభావముం
గను నవనీసుపర్వుఁ; డధికవ్రతశీలత సాధుభావ మా
తనికి; విశిష్టవృత్తి దిగఁ ద్రావి యసాధు వనంగ నుండు; శా
చనియతి లేక మృత్యుభయసంగతి నాతఁడు మానుషుం డగున్.

క. నా విని యతఁ డాతనితో
"జీవన్మృతుఁ డెట్టివాఁడు?" సెప్పు మనుటయున్
"దేవాతిథిపిత్రభృత్యజ
నావళులకు నిడక కుదుచునతఁ"డని చెప్పెన్. 432

చ. విని మగుడంగ వాఁడు పృథివీపతిఁ జూచి "ధరిత్రికంటె వ్రేఁ
కన యగుదాని, నాకసముకంటెఁ గడుం బొడ వైనదాని, గా
డ్పునకును నెక్కఁ డై జవము పొంపిరి వోయెడుదానిఁ, బూరికం
టెను దఱి చైనదానిని ఘటింపఁగఁ జెప్పుమ నాకు" నావుడున్.

వ. అమ్మనుజోత్తముం డయ్యధోత్తమున కిట్లనియె. 434

ఆ. "తల్లి వ్రేఁగు సువ్వె ధరణికంటెను; నాక
సంబుకంటెఁ బొడవు జనకుఁ డరయ;
గాడ్పుకంటె మనసు గడుశీఘ్రగతి; తృణో
త్కరముకంటెఁ జింత గరము తఱచు." 435

వ. అనిన నంబరచరుం డమ్మహీవరున కి ట్లనియె. 436

తే. "మొనసి నిద్రించియును గన్నమూయ దెద్ది?
పుట్టియును జేతనత్వంబుఁ బొరయ దెద్ది?
యరయ రూపు గల్గియు హృదయంబు లేని
దెద్ది? వేగంబుకతమున నెద్ది వోదలు?" 437

తే. అనినఁ "గన్ను మూయదు సుప్త మయ్యు మీను;
పుట్టియును గ్రుడ్డు చేతనం బొరయ కుండు;
హృదయరహితంబు రారూప; మేఱు రయము
కతన వర్ధిల్లు" నవి చెప్పెఁ గౌరవుండు. 438

వ. చెప్పిన నయ్యక్షుం డతనితోఁ "దెరువు నడుచువానికి, రోగార్తునకు, గృహస్థునకు, మృతిఁ బొందినవానికి నెవ్వరెవ్వరు సుట్టంబు?" అనిన నప్పుడమిఱేఁ డన్నలువురకుం గ్రమంబున సార్థంబును, వైద్యుండును, సద్భార్యయుఁ, గృతం బగు ధర్మంబును బరమమిత్రంబు లని నిర్దేశించుటయు, వాఁడు వెండియు ని ట్లనియె. 439

క. "ఎయ్యది ధర్మవునకుఁ గుదు?
రెయ్యది యాశ్రయము గీర్తి? కి మ్మగుమార్గం
బెయ్యది సురలోకమునకు?
నెయ్యది సుఖములకు నిక్క? యేర్పడఁ జెపుమా." 440

వ. అని యడుగుటయు. 441

క. "అమరఁగ దాక్షిణ్యము ధ
ర్మమునకుఁ గుదు రండ్రు; కీర్తిమహిమ నెలవు దా
నము; సత్యము సురపురిమా
ర్గము; శీలము సంశ్రయము సుఖంబుల కెల్లన్." 442

వ. అని యుధిష్ఠిరుం డెఱింగించిన నతండు. 443

చ. "నరునకు నాత్మ యెవ్వఁడు? ఘనంబుగ దైవిక మైనచుట్ట మె
వ్వ రతనికిం? దదీయ మగు వర్తన మేమిట నిర్వహించు? భూ
వర! యతఁ డేమి పూని యనవద్యతఁ బొందుఁ? నెఱింగఁ జెప్పు మీ
వరుదుగ" నన్న నక్కురుకులాగ్రణి యాతనితోడ ని ట్లనున్. 444

తే. "ఆత్మజుఁడు సువ్వె పురుషున కాత్మ యయ్యె;
నాతనికి భార్య దైవిక మైన చుట్ట;
మతని జీవిక పర్జన్యకతనఁ జెల్లు;
నతఁడు దానము గొనియాడి యతిశయిల్లు." 445

చ. అన విని "మేటిధర్మ మగునట్టిది యెయ్యది? యేది యెప్పుడు
దనియఁగఁ బండి యుండు? విదితంబుగ నెయ్యది నిగ్రహించినం
దనరుఁ బ్రమోదసిద్ధి? నియతంబుగ నెవ్వరితోడిసంధి యెం
దును వికలంబు గాదు? పరితోష మెలర్ప నుపన్యసింపుమా." 446

వ. అని దివ్యుండు వలికిన నాదివ్యబోధనుం డిట్లనియె. 447

ఆ. "విను మహింస మేటి యనఁ జను ధర్మంబు;
యాగకర్మ మెపుడు నమరఁ బండి
యుండు; మనసుక్రొవ్వు ఖండింపఁగా మోద
మెసఁగు; సుజనసంధి యెడలదెందు." 448

తే. అనిన నతఁడు "లోకమున కెయ్యదియు దిక్కు? జలము నన్నము నెద్దానసంభవించు?
విష మనంగ నెయ్యది? శ్రాద్ధవిధికి నెద్ది
సమయ?" మనిన నిట్లనిచె వ్వె జనవిభుండు: 449

తే. "సజ్జనులు దిక్కు సూవె యీ సర్వమునకు;
నభము, ధరణియు, జలము, నన్నమ్ము నుద్భ
వించు నెలవులు; విషమగు విప్రధనము;
లనఘ! శ్రాద్ధకాలము బ్రాహ్మణాగమంబు." 450

వ. అని తెలిపిన నయ్యక్షుండు ధర్మనందనుతో "మనుజుం డెయ్యది పరిత్యజించి సర్వ జన ప్రియుండును, నిశ్శోకుండును, నర్థవంతుండును, సుఖయును నగు?" ననిన నమ్మహీపతి యతని కిట్లనియె. 451

తే. "సర్వజనసమ్మతుండగు గర్వముడిగి;
క్రోధ మడఁచి శోకమునకుఁ గొలఁవుగాఁడు;

వినవె యర్థాధ్యుఁడగు లోభ మొనర విడిచి;
తృష్ణ వర్జించి సౌఖ్యంబు తెరువుఁ గాంచు.'' 452

వ అనిన యనంతరంబ యద్దివ్యం డతనితోఁ "బురుషశబ్ద వాచ్యుం
డెట్టివాఁడు? మటీయు సర్వధని యగువాఁ డెవ్వండు? నిశ్చయింపు"
మనినఁ బాండవజ్యేష్ఠుం డిట్లనియె. 453

క. "దివి మట్టి ధరణి యంతట
నివిడి మెఱయు చుండు నెవ్వని యఘోరమ, యట్టి
విశిష్టచరిత్రుఁడు యక
ధువరా! పురుషుండు నాఁ బ్రకాశత నొందున్. 454

ఆ. ప్రియము, నప్రియంబుఁ, బెల్లగు సౌఖ్యదుఃఖములు, భూతభావికార్యములును,
నెవ్వనికి సమంబు లివి, సర్వధని యనఁ
బరఁగుఁ జువ్వె యట్టిభవ్యుఁ డనఘ!'' 455

వ. అని వివరించిన యుధిష్ఠిరుదెసఁ బ్రసాదమధురం బైన యాలోకనంబు
నిగుడ నయ్యక్షవరుండు "మహాత్మా! మదీయంబు లైన ప్రశ్నంబు
లన్నిటికి సదుత్తరంబు లిచ్చితివి; నీవలనం బ్రీతుండనైతి; నీతమ్ములం
దొక్కని ప్రాణంబు లిచ్చెద; వేఁడు మనిన నతండు. 456

సీ. "శ్యామాంగు, నారక్తజలరుహనేత్రు, సా
లప్రాంశు, మున్నతలలితబాహు
నకులుని బ్రతికింపు" నావుడు యక్షుండు
"భీమఫల్గును లతిభీమబలులు;
ప్రియులు నీ కెంతయుఁ; బృథివీశ ! వీరిలో
నొకనిఁ గోరక యిట్లు నకులుఁ గోరి?"
తనుడు ధర్మాత్మజుఁ డనియెను "మాతండ్రి
యగు పాండువిభునకు మగువ లిరువు;

ఆ రందు గొంతికొడుకు లైన మువ్వురిలోన
నేను బ్రతికినాఁడ, నింక మాద్రి
తనయు లిరువుగందుఁ దగ నిప్పు డొక్కఁడు
బ్రతుకవలదె? చెపుమ పాడితెఱఁగు? 457

ఆ. ధర్మనందనుండు ధర్మాత్మఁ డని యెప్పుఁ
దగిలి జగము నన్నుఁ బొగడుచుండు;
నట్టి యేను ధర్మహానికి నోర్వఁ జు
మ్మెంత పచ్చెనేని, నింత నిజము." 458

వ. అనిన నతండు "నీ వైన ధర్మజ్ఞతకు మెచ్చితి; నీ తమ్ము లందఱు లబ్ధజీవితు లయ్యెదు" మనిన, నాహుణంబ విగతప్రాణు లై పడి యున్న యన్నలువురు నిద్రవోయి మేల్కని నట్లు సముత్థితు లైనం జూచి, విస్మితుం డై ధర్మజుం డిట్లనియె. 459

చ. "నిను నొక యతుమాత్రుఁడుగ నే మది నమ్మఁగ నేర నయ్యెదన్;
జననుత ! నీవు నిష్కముగ శక్రుఁడవో, యలకాధిపుండవో,
యనలుఁడవో, సమీరుఁడవో, యట్టులు గాక జగన్నుతుండు మ
జ్జనకుఁడు ధర్మదేవతవొ ! సత్కృపఁ జెప్పుము నాకు నేర్పడఁ." 460

వ. అనిన నమ్మహాత్ముండు మందస్మితాననుం డై. 461

మత్తకోకిలము. "ఏను, ధర్ముఁడఁ జువ్వె రాజకులేంద్ర ! సత్యము,
శౌచమున్,
దానముం, దపమున్, శమంబును, దాంతియన్,
యళముం, బరి
జ్ఞానయుక్తియు నాదుమూర్తులు; సమ్మదంబున నిప్డు మ
త్సూనుఁ నుత్తమధార్మికున్ నినుఁ జూచువేడుక వచ్చితిఁ." 462

వ. నన్ను నాశ్రయించిన జనంబులు దుర్గతిం బొరయరు; గావున నభిమత వరం బిచ్చెద వేఁడు" మనినఁ బాండవాగ్రజుండు సంభ్రమభక్తిభరితుం డగుచు, దండప్రణామంబు సేసి, యద్దేవోత్తముం బ్రస్తుతించి

"దేవా! మదీయాశ్రమవాసుండైన భూసురముఖ్యు నరణి యొక్క హరిణంబుచేత నపహృతం బయ్యె; నతనికిం గర్మలోపంబు గాకుండ నయ్యరణిం గరుణింపవే" యనినఁ బ్రీతచిత్తుం డగుచు ధర్మదేవుండు.

క. "విను మేను నీ మనోగతి
యనఘా! యెఱుఁగంగ వేఁడి రరణీహరణం
బొనరించితి; మృగ మెక్కడి?"
దని యమ్మహనీయవస్తు వతనికి నిచ్చెన్. 464

వ. ఇచ్చి మఱియు ని ట్లను "నిదె పదుమూఁడవయేఁడు సనుదెంచె; నింక మీకు నజ్ఞాతవాసంబు సలుపఁదలయు; నందు మీ రెవ్వ రెక్కడ నేరూపంబునం జరియింపం గోరిన, నయ్యెరూపంబు లలవడియెడు; నె ట్లున్నను మిమ్ము నెవ్వరు నెఱుంగకుండునట్లుగా వరం బిచ్చితి; నింక నొండెయ్యది వలసిన నడుగు"మనిన నమ్మనుజేశ్వరుఁ డిట్లనియె.

మత్తకోకిలము. "ఆదిదేవుఁడ వైన నీవు దయామతిం బొడసూపి న
న్నాదరించుటఁజేసి ధన్యుఁడ నైతి; నింతకు నెక్కుడొం
డేది గల్గెడు? నైన నామది యెల్ల నాఁడును గ్రోధమో
హాదుల్లం బెడఁబాసి, ధర్మవునంద నెక్కొనఁ జేయవే."

వ. అనిన నద్దేవుం డతనికి నవ్వరం బొసంగి యనంతరంబ యంతర్హితుం డయ్యెఁ; గొంతేయులు గ్రమ్మఱి నిజాశ్రమంబున కరిగి, ధరణీదేవునకు నరణీప్రదానంబు సేసి, తత్ప్రీయుక్తాశీర్వాదశతంబులు గైకొని, పరమానందంబునుం బొంది" రని యిట్లు పాండుతనయుల వనవాసప్రకారంబు సవిస్తరమధురంబుగా నుపన్యసించి. 467

క. అనఘుడు, గృష్ణద్వైపా
యనశిష్యుఁడు, బోధనిధి సమంచితమేధా
ఘనునకుఁ బారిక్షితునకు
ననవరతానందసుఖసమగ్రత యొసఁగెన్. 468

సీ. భవ్యచరిత్రుఁ, డాపస్తంబసూత్రుండు,
శ్రీవత్సగోత్రుండు; శివపదాబ్జ
సంతతధ్యానసంసక్తచిత్తుఁడు, సూర
నార్యనకును బోతమాంబికకును
నందనుఁ, డిలఁ బాకనాటిలో నీలకం
ఠేశ్వరస్థానమై యెసక మెసఁగు
గుడ్లూరు నెలపుగ గుణగరిష్ఠత నొప్పు
ధన్యుఁడు, ధరైకతత్పరాత్ముఁ,
తే. డెల్ల నార్యుండు సకలలోకైకవిదితుఁ
డయిన నన్నయభట్ట మహాకవీంద్రు
సరససారస్వతాంకప్రశస్తి దన్నుఁ
జెందుటయు, సాధుజనహర్షసిద్ధిఁ గోరి. 469

క. ధీరవిచారుఁడు తత్కవి
తారీతియుఁ గొంత దోఁపఁ దద్రచనయ కా
నారణ్యపర్వశేషము
పూరించెఁ గవీంద్రగర్ణపుట పేయముగాఁ. 470

క. వీరావతార! విమలా
చార! మహోదార! శుభవిచార! సుజనమం
దార! నవకీర్తిమౌక్తిక
హార! హరపదాబ్జమధుకరాత్మ వివారా! 471

తరలము—

అమితవైభవ! లోభమోహమదాదిదుర్లభ! మంజువి
భ్రమవిలాసితకామినీజనపంచబాణ! నిరంతరా
నమదశేషనృపాలమౌళిపినద్ధముగ్ధమణిప్రభా
క్రమసమర్చితవిస్ఫురత్పదకాంతినిర్జితపంకజా!

గద్యము. ఇది సకలసుకవిజనవినుత నన్నయభట్టప్రణీతం బైన శ్రీమహా భారతంబునం దారణ్యపర్వంబున సీతాన్వేషణంబును, లంకా గమనంబును, రామరావణ యుద్ధంబును, రాఘవాభ్యుదయం బును, సావిత్రిచరిత్రంబును; సూర్యుండు గర్ణునకు హితోప దేశంబు సేయుటయు, గర్ణజన్మకథనంబును, విప్రరూపంబున గర్ణుగవచ కుండలంబు లింద్రుండు హరించుటయు, నారణే యంబును, యక్షప్రశ్నంబులును, ధర్మ్ముండు ధర్మరాజునకు వరంబు లొసంగుటయు నన్నది సర్వంబును సప్తమాశ్వాసము.

శ్రీమదాంధ్రమహాభారతమునందలి యారణ్యపర్వము

సమాప్తము.

శివాజీ ప్రెస్,
1732, గంజిబజారు, సికింద్రాబాదు-3.

520

Check List

Book Number	HTAOID262	Date	6/2/2023
Front Cover	yes	Back Cover	yes
Blank Pages	CT, 72, 520, 521		
Missing Pages	NO		
Prepared By	J. Adilakshmi	Cutting By	J. Adilakshmi
Scanned By	Ch. Ramya	Pages	597